2. అనాగరిక యుగం . . . . . . . . . . . . . . 153
II. కుటుంబం . . . . . . . . . . . . . . . . 158
III. ఇరాక్వ్యా గణం . . . . . . . . . . . . . . 216
IV. గ్రీకు గణం . . . . . . . . . . . . . . . 231
V. ఎథీనియన్ రాజ్యావిర్భావం . . . . . . . . . . . 242
VI. రోములో గణం, రాజ్యం . . . . . . . . . . . 253
VII. కెల్టులలోనూ, జర్మన్లలోనూ గణం . . . . . . . . 264
VIII. జర్మన్లలో రాజ్యావిర్భావం . . . . . . . . . . 279
IX. అనాగరికత: నాగరికత . . . . . . . . . . . 291

వివరణలు . . . . . . . . . . . . . . . . . . . . 315
పేర్లసూచి . . . . . . . . . . . . . . . . . . . 345
సాహిత్య, పౌరాణిక పేర్లసూచి . . . . . . . . . . . . 373

## ఫ్రెడరిక్ ఎంగెల్స్

# వానరుడు మానవుడుగా మారే క్రమంలో శ్రమ నిర్వహించిన పాత్ర[1]

శ్రమే సంపదకంతకూ మూలమని అర్థశాస్త్రవేత్తలు వక్కాణిస్తున్నారు. ప్రకృతి తోపాటు సంపద సృష్టికి మూలాధారం శ్రమే. శ్రమ దేన్నైతే సంపదగా మారుస్తుందో ఆ పదార్థాన్ని ప్రకృతి సమకూరుస్తుంది. కాని శ్రమ పాత్ర యింతకన్న అపారమైన విలువ కలది. మానవుని మనుగడ అంతటికీ యిదే ముఖ్యమైన షరతు. అది ఎంత ముఖ్యమైన దంటే ఒక విధంగా శ్రమే మానవుని సృష్టించిందని చెప్పవలసివుంటుంది.

లక్షలాది సంవత్సరాలకు పూర్వం, యింకా నిర్దిష్టంగా నిర్ధారణకాని ఒకానొక యుగంలో, భూమి చరిత్రకు సంబంధించి భూవిజ్ఞాన శాస్త్రజ్ఞులు మూడవది అని పిలిచే భూయుగంలో, అందునా ముప్పాతిక మూడుపాళ్ళు ఆ యుగాంతంలో, ఉష్ణమండలానికి చెందిన ఏదో ఒక ప్రదేశంలో — బహుశా యిప్పుడు హిందూ మహాసముద్ర గర్భంలో కలిసిపోయిన ఒక మహా భూఖండంపైన — మిక్కిలి అభివృద్ధిచెందిన రూపంలో నరరూప వానరజాతి ఒకటి ఉండేది. మన యీ పూర్వీకులను గురించి డార్విన్ యించుమించుగా సరైన వర్ణన చేశాడు. వాటికి శరీరమంతటా రోమాలుండేవి, గడ్డాలుండేవి, మొనలుతేలిన చెవులుండేవి. అవి చెట్లపైన గుంపులుగా నివసిస్తూండేవి.[2]

చెట్లెక్కడంలో చేతులూ, పాదాలూ భిన్నమైన పనులను నిర్వహించాల్సివుంటుంది. తమ జీవిత పద్ధతిని అనుసరించి చదునైన నేలపై కదలవలసివచ్చినప్పుడు, యీ వానరాలు క్రమంగా నడకలో తమ చేతులను ఉపయోగించే అలవాటును కోల్పోయి, అంతకంతకు నిటారుగా నిలబడ్డానికి అలవాటు పడ్డాయి. వానరుడు మానవుడుగా పరివర్తనచెందే క్రమంలో యిదే నిర్ణయాత్మకమైన ముందంజ.

ఈనాటికీ ఉన్న నరరూప వానరాలన్నీ నిటారుగా నిల్చొని, కేవలం తమ కాళ్ళ మీదనే ఒక చోటునుంచి మరొక చోటుకు వెళ్ళగలవు. అయితే, అత్యవసరమైన పరిస్థితిలో మాత్రమే అవి అలా చెయ్యగలవు. ఈ నడక వికారంగా వుంటుంది. వీటికి స్వాభావికమైన

నడక సగం వంగిన భంగిమలో వెళ్లడం, దానిలో చేతులను ఉపయోగించడం కూడా యిమిడి వుంటుంది. వీటిలో ఎక్కువ భాగం పిడికిటి కణుపులను నేలపై ఆన్చి, కాళ్లను దగ్గరకు లాక్కొని, పొడుగు చేతుల సందులోంచి శరీరాన్ని ఊపుకుంటూ, కుంటివాళ్లు ఊతకర్రల ఆధారంతో నడిచినట్లు నడుస్తాయి. మొత్తంమీద చతుష్పాద దశకూ ద్విపాద దశకూ మధ్య గల పరివర్తన దశల్లో వున్న వానరాలను యీనాటికీ యింకా మనం చూస్తున్నాం. కాని, రెండు పాదాలపై నడిచే నడక వీటిలో దేనికీ కూడా ఏదో ఒక ఆగంతుక అవసరార్థమైనదే తప్ప అలవాటైనది కాదు.

మన రోమశ పూర్వీకులకు నిటారుగా నడవడం ఆదిలో అలవాటూ, ఆటుతర్వాతనే క్రమంగా అవసరమూ అయివుంటే, యీ మధ్య కాలంలో చేతులతో చేసే వివిధానేక యితర పనులు అలవాటై యుండాల్సివుంది. వానరాలకు సంబంధించినంతవరకు చేతులనూ, కాళ్లనూ ఉపయోగించే పద్ధతుల్లో ఒకరకమైన విభజన యిప్పటికే మనకు కనిపిస్తుంది. ఇంతకుముందే పేర్కొనబడినట్లు, పైకి ఎక్కడంలో చేతులయొక్క, కాళ్లయొక్క ఉపయోగాలలో భేదం వుంది. నిమ్నజాతికి చెందిన సస్తన జంతువుల ముందుపంజాల మాదిరిగానే వానరాల చేతులు కూడా ప్రధానంగా ఆహారాన్ని పోగుచెయ్యడంకోసం, పట్టుకోవడం కోసమే ఉపయోగపడేవి. కొన్ని వానరాలు చెట్లపై తమకోసం గూళ్లను కట్టుకునేందుకు, లేక చింపాంజీల మాదిరిగా ఎండవానలనుంచి రక్షణకోసం చెట్లకొమ్మల సందున గొడుగుల మాదిరి పైకప్పులను కట్టుకొనేందుకు తమ చేతులను వినియోగిస్తాయి. శత్రువుల దాడినుంచి ఆత్మరక్షణార్థం తమ చేతులతో కర్రలను పట్టుకుంటాయి, తమ శత్రువులపై పళ్లవర్షం, రాళ్లవర్షం కురిపిస్తాయి. బందీలుగా పట్టుబడ్డప్పుడు మానవులను అనుకరించి నేర్చుకున్న కొన్ని సరళ క్రియలను అవి తమ చేతులతో చేస్తాయి. మానవుని ఎక్కువగా పోలివున్న వానరాల అభివృద్ధిచెందని హస్తానికీ, లక్షల సంవత్సరాల శ్రమక్రమంలో అత్యధిక కౌశలం సంపాదించిన మానవ హస్తానికీ మధ్యవున్న విశేషమైన వార యిందులోనే మనకి కనిపిస్తుంది. ఎముకలయొక్క, కండరాలయొక్క సంఖ్యా, వాటి సామాన్య నిర్మాణమూ రెండు హస్తాల్లోనూ ఒక్కమాదిరిగానే ఉంటాయి. కాని నిమ్నతమ ఆటవిక మానవుని హస్తం సైతం ఏ వానరహస్తమూ అనుకరించజాలని వందలాది పనులను చెయ్యగలదు. మిక్కిలి మోటైన రాతి కత్తిని సైతం ఏ వానరహస్తమూ యింతవరకెన్నడూ తయారు చెయ్యలేదు.

వానరుడు మానవుడుగా పరివర్తనచెందేందుకు పట్టిన వేలాది సంవత్సరాల కాలక్రమంలో, మన పూర్వులు తమ చేతులను ఏ తొలి పనులకైతే అనుకూలంగా మలచడానికి క్రమంగా నేర్చుకున్నారో ఆ పనులు అత్యంత సరళమైనవి మాత్రమే అయివుండాలి. మరింత జంతుస్థితికి పతనమై, శారీరకంగా కూడ దిగజారారని అనుకోబడే నిమ్న తమ

ఆటవిక మానవులు సైతం పరివర్తన దశలో వున్న యీ జీవులకన్న ఎంతో ఉన్నత దశకు చెందివుంటారు. మానవ హస్తాలు రాతినుండి మొదటి కత్తిని తయారు చెయ్యగలిగేందుకు బహుశా ఎంత కాలవ్యవధి పట్టివుంటుందంటే, దానితో సరిపోల్చినప్పుడు మనకు తెలిసిన చారిత్రకదశ అతి స్వల్పమైనదిగా కనిపిస్తుంది. కాని నిర్ణాయకమైన ఆ ముందడుగు వెయ్యబడింది. మానవహస్తం స్వతంత్రమై, తదాదిగా అధికతరమైన నైపుణ్యాన్ని అలవరచుకోగలిగింది. ఆవిధంగా సముపార్జించుకోబడిన అధికతర సౌలభ్యం తర్వాతి తరాలకు వారసత్వంగా సంక్రమించి, తరంనుంచి తరానికి పెంపొందుతూవచ్చింది.

ఈవిధంగా మానవహస్తం కేవలం శ్రమజేసే అంగమే కాదు, అది శ్రమ ఫలితం కూడా. శ్రమ, ఎప్పటికప్పుడు కొత్తకొత్త పనులకు అనుకూలవర్తన, కండరాలు, స్నాయువులు, దీర్ఘకాలక్రమంలో ప్రత్యేక అభివృద్ధిని పొందిన ఎముకల వారసత్వం, వారసత్వంగా సంక్రమించిన యీ నాజూకుతనాన్ని సరికొత్తవైన, అంతకంతకు క్లిష్టతరమైన పనులలో ఎప్పటికప్పుడు మరలమరల వినియోగించడం — వీటిద్వారానే మానవహస్తానికి — రఫాయేల్ చిత్రాలనూ, థోర్‌వాల్డ్‌సెన్ శిల్పాలనూ, పగనీని సంగీతాన్నీ సృష్టించగల అత్యున్నత స్థాయి పరిపూర్ణత సిద్ధించింది.

అయితే, హస్తానికి ప్రత్యేక అస్తిత్వం లేదు. సమగ్ర, అతి సంక్లిష్ట శరీర వ్యవస్థలో అదొక అంగం మాత్రమే. దేనివల్ల హస్తం లాభపడిందో దానివల్ల, మొత్తం శరీరం లాభపడింది. ఇది రెండు విధాలుగా జరిగింది.

మొదటిది ఏమిటంటే, డార్విన్ దేనినైతే "పెరుగుదల పరస్పర సంబంధ నియమం" అని అన్నాడో, ఆ నియమంవల్ల శరీరం లాభపడింది. ఆ నియమం ప్రకారం ఒకానొక జీవి శరీరంలోని వేర్వేరు భాగాల విశిష్ట రూపాలెప్పుడూ, పైకి వాటితో సంబంధంలేనివిగా కనిపించే యితర భాగాలయొక్క కొన్ని రూపాలతో అనుబంధితమైవుంటాయి. ఈవిధంగా, జీవకణ కేంద్రకాలు లేకుండా ఎర్ర రక్తకణాలను మాత్రమే కలిగినటువంటి, తల వెనుక భాగం ద్విముఖ సంధి (కీళ్ళ)ద్వారా మొదటి వెన్నుపూసతో సంధానితమై వున్న జంతువులు ఎటువంటి మినహాయింపులూ లేకుండా, తమ పిల్లలకు పాలనివ్వడానికి క్షీరగ్రంధులను కూడా కలిగివుంటాయి. అదే విధంగా, చీలిన డెక్కలను కలిగిన సస్తన జంతువులు నెమరు వేసుకోడానికి అనువైన క్లిష్ట జీర్ణాశయ వ్యవస్థను విధిగా కలిగివుంటాయి. కొన్ని రూపాలలో మార్పులు జరిగినప్పుడు, అవి శరీరంలోని యితర భాగాల రూపాలలో కూడ మార్పులకు దారితీస్తాయి, అయితే యీ సంబంధాన్ని గురించి వివరించడం మనకు సాధ్యంకాదు. నీలికళ్ళు కలిగిన పూర్తి తెల్లని పిల్లులు ఎల్లప్పుడూ, లేక యించుమించు ఎల్లప్పుడూ చెవిటివిగా వుంటాయి. మానవహస్తం క్రమక్రమంగా అధికాధికంగా పరిపూర్ణతచెందడం, అదే అనుపాతంలో కాళ్ళు నిటారుగా నడవడానికి అనుకూలితం కావడం — ఈ రెండింటి

పరస్పర సంబంధ నియమం కారణంగా, యివి శరీరపు యితర భాగాలపై నిస్పందేహంగా ప్రభావాన్ని బరపుతాయి. అయితే, యీ చర్యను గురించి తగినంత పరిశోధన జరగని కారణంగా, యిప్పుడిక్కడ దాన్ని గురించి సాధారణంగా పేర్కొనడమే గాని ప్రత్యేకించి వివరించడం మనకు సాధ్యంకాదు.

మిగిలిన శరీరంపైన హస్తంయొక్క అభివృద్ధి బరపే ప్రత్యక్ష, దృశ్యమాన ప్రభావం యింతకన్న చాలా ముఖ్యమైనది. మేమింతకు ముందే చెప్పినట్లు, మన పూర్వీకులైన, నరరూప వానరాలు గుంపులుగా నివసించేవి. జంతుజాలమంతటిలోకీ అత్యధిక సామాజిక జంతువైన మానవుడు, గుంపులుగా నివసించని తక్షణ పూర్వీకులనుండి ఉద్భవించాడనుకోవడం ఊహాతీతమన్న విషయం స్పష్టం. ప్రకృతిపైన మానవుని ఆధిపత్యం హస్తంలో వచ్చిన అభివృద్ధితో, శ్రమతో ఆరంభమై, కొత్తగా సాధింపబడిన ప్రతిఒక ముందడుగుతోనూ అతని మానసిక దిఙ్మండలాన్ని విశాలమొనర్చింది. ప్రాకృతిక వస్తువులయొక్క యింత వరకు తెలియని కొత్తకొత్త లక్షణాలను నిరంతరాయంగా మానవుడు తెలుసుకుంటూ వచ్చాడు. మరోవంక, శ్రమయొక్క అభివృద్ధి పరస్పర తోడ్పాటు, సంయుక్త కృషి సందర్భాలను పెంచడంద్వారా, ప్రతిఒక్క వ్యక్తికీ యీ సంయుక్త కృషి ప్రయోజనాన్ని సుస్పష్టంచెయ్యడంద్వారా సమాజసభ్యులను మరింత సన్నిహితులను చెయ్యడానికి తిరుగులేని విధంగా తోడ్పడింది. సంక్షిప్తంగా చెప్పాలంటే, పరిణామం చెందుతున్న మానవులు, ఒకరితో మరొకరు ఏదో చెప్పుకోవలసిన ఆవశ్యకత వచ్చింది. ఆవశ్యకత ఒక అవయవాన్ని సృష్టించింది; వానరుని అపరిణత కంఠం మూర్ఛనలద్వారా నెమ్మదిగానే అయినా నిబ్బరంగా పరివర్తన చెందింది. ఆ మూర్ఛనలు నిరంతరాయమైన మరింత పరిణత మూర్ఛనలను సృష్టించాయి. నోటికి సంబంధించిన అవయవాలు క్రమక్రమంగా ఒక్కొక్క ధ్వనినే స్పష్టంగా ఉచ్చరించడం నేర్చుకున్నాయి.

జంతువులతో పోల్చిచూసినట్లయితే, శ్రమనుండి శ్రమక్రమంలోనే భాషోత్పత్తి జరిగిందన్న యీ వివరణ ఒక్కటే సరైనదని రుజువవుతోంది. అత్యధికంగా అభివృద్ధిచెందిన జంతువులు సైతం, పరస్పరం మాట్లాడుకోవలసిన అతిస్వల్ప ఆవశ్యకతను ఉచ్చారణతో కూడిన భాష అవసరంలేకుండానే తీర్చుకోగలవు. ప్రాకృతిక అవస్థలో, ఏ జంతువూ కూడా మాట్లాడలేకపోయినందుకూ, లేక మానవభాషను అర్థంచేసుకోలేకపోయినందుకూ అదేదో అసౌకర్యమన్నట్లు భావించదు. కాని, అదే మనిషిచేత మచ్చికచెయ్యబడినప్పుడు దాని పరిస్థితి యిందుకు పూర్తి భిన్నంగా వుంటుంది. మానవులతో సహవాస కారణంగా కుక్కలూ, గుర్రాలూ ఉచ్చారణతోకూడిన భాషను చక్కగా గుర్తింపగలిగిన శక్తిని పెంపొందించుకున్నాయి. ఈ కారణంగా, తమ భావపరిధిలోని ఏ భాషనైనా గ్రహించడాన్ని అవి తేలికగా నేర్చుకుంటాయి. అంతే కాకుండా, మనిషిపట్ల ఆప్యాయత, కృతజ్ఞత మొదలైన సంవేదనలను అను

భూతిచెందే సామర్థ్యాన్ని సైతం సంతరించుకున్నాయి. అటువంటి పెంపుడు జంతువులతో సన్నిహిత సంబంధం కలిగిన ఏ మనిషైనా, పలు సందర్భాల్లో మాట్లాడలేని తమ అసమర్థతను ఒక అసౌకర్యంగా యిప్పుడు అవి భావిస్తున్నాయని అంగీకరించక తప్పదు. దురదృష్టవశాత్తూ, వాటి స్వరాంగాలు ఒక నిర్దిష్టమైన దిశలో అతిగా అభివృద్ధిచెందిన కారణంగా యీ లోపాన్ని ఎంతమాత్రం సరిదిద్దడానికి వీలుండదు. అయితే, స్వరాంగాలు ఉన్న సందర్భాల్లో, కొన్ని పరిమితుల లోపల, యీ అసమర్థత సైతం అదృశ్యమవుతుంది. పక్షుల ముఖాంగాలు మానవుల ముఖాంగాలకు యెంతో భిన్నమైనవి, అయినా కూడా మాట్లాడటం నేర్చుకోగల జీవులు పక్షులు మాత్రమే. పక్షుల్లోకెల్ల అత్యంత వికృత స్వరం కలిగిన చిలుకయే వాటిలోకెల్ల అతి బాగా మాట్లాడగలదు. చిలుక తను చెప్పేదాన్ని అర్థంచేసుకోలేదన్న అభ్యంతరాన్ని యిక్కడెవరూ తేకూడదు. చిలుక తనకు వచ్చిన పద సముదాయాన్నంతనీ పదేపదే వల్లిస్తూ, గంటలకొద్దీ ఏకబిగిన, విరామంలేకుండా వాగుతూవుంటుంది. మాట్లాడటంద్వారానూ, మానవులతో కలసిమెలసి ఉండటంద్వారానూ కలిగే సంతోషంకోసమే అది అలా చేస్తుందన్నమాట నిజమే. కాని దాని భావసముదాయపు పరిమితులలోపల తను చెప్పేదాన్ని అర్థంచేసుకోడాన్ని కూడా అది నేర్చుకోగలదు. ఏదైనా ఒక చిలుకను చేరదీసి, దానికి తిట్లను — వాటి అర్థాన్ని అది గ్రహించగలిగే మాదిరిగా — నేర్పండి (ఉష్ణదేశాలనుంచి తిరిగివచ్చే నావికులకు యిదొక పెద్ద వినోదం); దాన్ని వేధించండి, అది తన తిట్లను బెర్లిన్ వీధుల్లో తోపుడుబళ్లలో పళ్లూ, చేపలూ వేసుకొని అమ్మే ఏ వర్తకురాలైనా ఎంత అర్థవంతంగా ప్రయోగిస్తుందో అంత అర్థవంతంగానూ ప్రయోగిస్తుందన్న సంగతిని మీరు త్వరలోనే కనిపెడతారు. చిల్లరమల్లర వాటిని అడుక్కొనే సందర్భంలో కూడా యిలాగే జరుగుతుంది.

మొదట శ్రమ, దాని తర్వాత, దానితోబాటు మాట — యివి రెండూ అత్యంత ముఖ్యమైన రెండు ప్రేరకాలు. వీటి ప్రభావంకింద వానరుని మెదడు క్రమంగా మానవుని మెదడుగా మారింది. ఈ రెండింటికీ మధ్య ఎంతగా పోలిక వున్నప్పటికీ మానవుని మెదడు వానరుని మెదడుకన్న చాలా పెద్దది, ఎంతో పరిపూర్ణమైనది. మెదడు అభివృద్ధితోబాటు, దానికి అత్యంత సన్నిహిత పరికరాలైన జ్ఞానేంద్రియాలు అభివృద్ధిచెందాయి. వాక్ శక్తి క్రమాభివృద్ధి చెందడంతోబాటు దానికి అనుగుణంగా తప్పనిసరిగా శ్రవణేంద్రియం సంస్కరింపబడినట్లే, మొత్తంగా మెదడు అభివృద్ధితోబాటు అన్ని జ్ఞానేంద్రియాలూ సంస్కరింపబడ్డాయి. రాబందు మనిషికన్న చాలా ఎక్కువ దూరం చూడగలదు, కాని చూసిన వస్తువుల్లో రాబందు కన్ను గ్రహించే దానికన్న మనిషి కన్ను ఎన్నో విషయాలను గ్రహించగలదు. కుక్కకు గల ఘ్రాణశక్తి మనిషికి గలదానికన్న ఎన్నో రెట్లెక్కువ. కాని మనిషి గుర్తుపట్టగల వాసనలలో — మనిషికి సంబంధించినంతవరకు యీ వాసనలు వేర్వేరు

వస్తువులను ద్యోతకంచేసే నిర్దిష్టమైన సంకేతాలు — శతాంశాన్ని కూడా కుక్క అనుభూతిచెందలేదు. మరి స్పర్శజ్ఞానం — అతి మొరటు ప్రాథమిక రూపంలో సైతం అది వానరునికి దాదాపుగా లేదని చెప్పవచ్చు — మానవ హస్తపు అభివృద్ధితోబాటు, కేవలం శ్రమ మాధ్యమంద్వారా మాత్రమే అభివృద్ధిచెందింది.

మెదడు, దానితోపాటు వుండే జ్ఞానేంద్రియాల అభివృద్ధి, పెరుగుతున్న చైతన్య స్పష్టత, భావనాక్రమాన్ని సాధారణీకరించే శక్తి, వివేచనాశక్తి, శ్రమపైనా, భాషపైనా అవి జరిపే ప్రతిచర్య, శ్రమ, భాష మరింతగా అభివృద్ధిచెందేందుకు నిత్యనూతనంగా ప్రేరణనిస్తూవచ్చింది. మానవుడు అంతిమంగా వానరునినుంచి భిన్నజీవిగా రూపొందేనాటికి యీ అభివృద్ధి తన ముగింపుదశను చేరుకోలేదు. విభిన్న ప్రజానీకాల్లో, విభిన్న కాలాల్లో ఈ అభివృద్ధి స్థాయీ, దిశా భిన్నభిన్నంగా ఉండియుండవచ్చు, అక్కడక్కడ స్థానిక, లేక తాత్కాలిక తిరోగమన కారణంగా యీ ప్రగతి క్రమం భంగపరుపబడి ఉండవచ్చునేమోగాని, మొత్తంమీద మాత్రం యీ అభివృద్ధి యితోధికంగా, శక్తివంతంగా ముందుకుసాగింది. పూర్ణ వికసిత మానవుని ఆవిర్భావంతోబాటు ఒక కొత్త అంశం, అంటే సమాజం రంగంలోకి రావడంతో, యీ పురోగతికి ఒకవంక ప్రబల ప్రేరణ లభించగా, మరోవంక అధికతర నిశ్చిత దిశల్లో మార్గనిర్దేశం లభించింది.

చెట్లెక్కే ఒక వానరాల గుంపునుంచి మానవ సమాజం ఆవిర్భవించేందుకు ముందు నిశ్చయంగానే లక్షల సంవత్సరాలు గడిచిపోయాయి. వీటికి భూమి చరిత్రలో మనిషి జీవితంలో ఒక్క సెకనుకు గల ప్రాముఖ్యాన్ని మించిలేదు.* అయితేనేం, అది చివరకు అవతరించింది. మరి మళ్లీ యిక్కడ వానరాల గుంపుకీ మానవ సమాజానికీ మధ్య కనిపించే మౌలికమైన అంతరం ఏమిటి? ఆ అంతరం శ్రమ. వానరాల గుంపు భౌగోళిక పరిస్థితులచేత, లేక యిరుగుపొరుగులో వున్న యితర వానరాల గుంపుల ప్రతిఘటనచేత నిర్ణయింపబడిన ఆహార క్షేత్రాల్లో లభించిన ఆహారంతోనే సంతుష్టిచెందింది. కొత్త ఆహారక్షేత్రాలను సంపాదించుకోడానికిగాను కొత్త ప్రదేశాలకు తరలివెళ్తూ, పోరాటాలు సాగించింది. తనకు తెలియకుండానే, తన మలమూత్రాలతోనే నేలను సారవంతంచెయ్యడం తప్ప, ఆ కొత్త ఆహార క్షేత్రాలలో సహజంగా లభించినవాటిని మించి యీ గుంపు మరేమీ ఉత్పన్నంచెయ్యలేకపోయేది. సాధ్యమైన అన్ని ఆహారక్షేత్రాలూ ఆక్రమింపబడగానే వానర జనాభా యిక వృద్ధి

---

*భూమిపైన మొక్కలూ, పశువులూ జీవించగలగడానికి తగినంతగా భూమి చల్లబడిననాటినుండి 10 కోట్ల సంవత్సరాలకు కొంచెంపైగా గడిచివుంటుందని, యీ రంగంలో ప్రామాణికుడైన ప్రముఖ విద్వాంసుడు సర్ విలియం థామ్సన్ అంచనావేశాడు. (ఎంగెల్స్ వివరణ.)

చెందలేకపోయింది. వానర సంఖ్య మహా అయితే యధాప్రకారంగా ఉండగలిగింది. కాని అన్ని జంతువులూ కూడా చాలా ఆహారాన్ని వృధాచేస్తాయి, దానికితోడు రాబోయే మొక్కల తరాన్ని అంకురరూపంలోనే నాశనంచేస్తాయి. వేటగాడు మరుసటి సంవత్సరం సంతానాన్ని కనే ఆడజింకను చంపడు, అందుకు భిన్నంగా తోడేలు దాన్ని చంపేస్తుంది. గ్రీసులో లేత పొదలను, అవి యింకా పెరగడానికి ముందే మేసేసే గొర్రెలు, అలా మేసిమేసి ఆ దేశంలోని పర్వతాలన్నీ బోడిచేసేశాయి. జంతువుల యీ "కొల్లగొట్టే ఆర్థికవ్యవస్థ" వాటికి మామూలుకు భిన్నమైన ఆహారానికి అలవాటుపడటం తప్ప గత్యంతరంలేని స్థితిని తెచ్చిపెట్టి, జంతుజాతి క్రమ పరివర్తనలో ఒక ప్రముఖ పాత్రను వహిస్తుంది. పైన చెప్పిన స్థితి మూలంగా వాటి రక్తం విభిన్నమైన రసాయనిక సంయోజనను సంతరించుకుంటుంది, మొత్తం శరీరతత్వం క్రమంగా మారిపోతుంది, మరోవంక యీ కొత్తపరిస్థితికి తమను తాము సర్దుబాటుచేసుకోలేని జంతుజాతులు నశించిపోతాయి. మన పూర్వులు వానరదశనుండి మానవదశకు పరివర్తన చెందడంలో యీ కొల్లగొట్టే ఆర్థికవ్యవస్థకు ముఖ్యమైన పాత్ర ఉన్నదనడంలో సందేహంలేదు. తెలివిలోనూ, సర్దుబాటు శక్తిలోనూ మిగిలిన అన్నిటికన్న బాగా అభివృద్ధిచెందిన ఒక జాతి వానరాలలో యీ కొల్లగొట్టే ఆర్థికవ్యవస్థ ఆహారార్థం వాడే మొక్కల సంఖ్యలో నిరంతరాయమైన పెరుగుదలకూ, తిండిమొక్కలలో అంతకంతకు ఎక్కువ ఖాద్యభాగాల వినిమయానికీ దారితీసివుండాలి. సంక్షిప్తంగా చెప్పాలంటే, దీని మూలంగా భోజనమూ, దానితోబాటు శరీరంలో ప్రవేశించే పదార్థాలూ అంతకంతకు ఎక్కువ వైవిధ్యపూరితమై, వానరుడు మానవుడుగా పరివర్తన చెందేందుకు అవి అవసరమైన రసాయనిక మూలాధారాలను కల్పించాయి. కాని, సరైన అర్థంలో యిదంతా యింకా శ్రమ కాదు. పనిముట్ల తయారీతో శ్రమ మొదలవుతుంది. మనకు దొరికిన అత్యంత ప్రాచీనమైన పనిముట్లు — ప్రాగైతిహాసిక మానవునికి చెందిన గృహోపకరణాలలో మనకు లభించినవాటిని బట్టి, అత్యంత ప్రాచీనమైన ప్రజాసమూహాల, ఈనాటి అత్యంత ఆటవికుల జీవిత విధానాన్నిబట్టి, అత్యంత ప్రాచీనమైనవని చెప్పదగిన పనిముట్లు — ఏమిటి? అవి వేటాడటానికీ, చేపలను పట్టడానికీ పనికొచ్చే సాధనాలే. వీటిలో వేటసాధనాలు ఆయుధాలుగా కూడా ఉపయోగపడేవి. కాని వేటాడటం, చేపలుపట్టడం సాగుతున్నాయంటే తత్పర్యవసానంగా మానవుడు శుద్ధ శాకాహార వినియోగంనుంచి, మాంసాహార వినియోగానికి మారి వుండాలి. వానరుడు మానవుడుగా పరివర్తనచెందే క్రమంలో అది మరొక ముఖ్యమైన ఘట్టం. మాంసాహారంలో శరీరపు ఉపచయాపచయ క్రియకు అవసరమైన అత్యంతావశ్యకమైన పదార్థాలన్నీ యించుమించుగా తయారైన స్థితిలో వున్నాయి. దీనిమూలంగా జీర్ణక్రియకు కావలసిన వ్యవధి తగ్గడమే కాకుండా, మొక్కల జీవితానికి అనురూపమైన యితర శారీరకాభివృద్ధి ప్రక్రియలకు అవసరమైన సమయం కూడా తగ్గింది; తద్వారా

జంతు జీవితపు — ఆ మాటకు సరైన అర్థంలో — క్రియాశీలమైన అభివ్యక్తీకరణకు, అవసరమైన అధిక సమయం, పదార్థం, వాంఛా లభించాయి. పరిణామం చెందుతున్న మానవుడు ఏ మేరకైతే వృక్ష జగత్తుకు దూరమవుతూవచ్చాడో ఆమేరకు జంతువుకన్న ఉన్నత దశకు పోసాగాడు. మాంసంతోబాటు శాకాహారానికి అలవాటుపడటంతో అడవి పిల్లులూ, కుక్కలూ మనిషికి సేవకులుగా మారినట్లే, శాకాహారంతోబాటు మాంసాహారానికి అలవాటుపడడంతో పరిణామం చెందుతున్న మానవునికి దేహదారుఢ్యమూ, స్వాతంత్ర్యమూ విశేషంగా చేకూరాయి. అయితే మాంసాహార ప్రభావం అన్నిటికన్న అధికంగా మెదడుపైన పడింది. ఇప్పుడది తన పోషణకూ, అభివృద్ధికీ అవసరమైన పదార్థాలను మరింత అధికంగా నిరంతరాయంగా పొందనారంభించింది. తత్కారణంగా అది తరాన్నుంచి తరానికి మరింత వేగంగానూ, సంపూర్ణంగానూ అభివృద్ధిచెందగలిగింది. శాకాహారులకు సముచితమైన గౌరవం యిస్తూనే, మాంసాహారం లేకుండా మానవావిర్భావం జరగలేదని చెప్పాల్సివుంటుంది. మాంసాహారమన్నది, మనకు తెలిసిన ప్రజాసమూహాలన్నింటిలోనూ ఏదోఒక కాలంలో నర భక్షణకు దారితీసిందన్నది (ఇటీవల పదో శతాబ్దంవరకూ, వెలితాబియన్లు లేక విల్జియన్లు అయిన బెర్లినర్ల పూర్వీకులు తమ తలిదండ్రులను చంపి తినేవారు) మనకీనాడు ముఖ్య మైన విషయం కాదు.

మాంసాహారం నిర్ణయాత్మక ప్రాముఖ్యం కలిగిన రెండు కొత్త ముందడుగులకు దారి తీసింది. మొదటిది, మానవుడు అగ్నిని వశీభూతం చేసుకున్నాడు, రెండవది, పశుపాలన ప్రారంభమైంది. మొదటిదాని పర్యవసానంగా ముందే సగం జీర్ణమైందని చెప్ప దగిన ఆహారాన్ని నోటికి అందించి, జీర్ణప్రక్రియను యితోధికంగా కుదించింది. రెండవది, వేటకు తోడు మాంసపు సరఫరాకు మరింత క్రమబద్ధమైన కొత్త వనరును ఆవిష్కరించడం ద్వారా మాంసాన్ని సమృద్ధిగా లభింపజేసింది. అంతేకాకుండా తన సంయోజనంలో కనీసం మాంసమంత విలువకలిగిన ఒక కొత్త ఆహారపదార్థమైన పాలను, పాల ఉత్పత్తులను సమ కూర్చింది. ఈవిధంగా యీ రెండు ముందడుగులూ, వాటంతట అవే, మానవ విమోచనానికి కొత్త సాధనాలు అయాయి. మానవునియొక్క, సమాజంయొక్క అభివృద్ధిలో యీ రెండిం టికీ విశేషమైన ప్రాముఖ్యం ఉన్నప్పటికీ, వాటి పరోక్ష పర్యవసానాలను గురించి చర్చించ డానికి యిక్కడ పూనుకుంటే, అసలు విషయంనుంచి చాలాదూరం వైదొలగినట్లవుతుంది.

మానవుడు తినదగినదల్లా తినడం నేర్చుకున్నట్లే, ఏ శీతోష్ణస్థితిలోనైనా బ్రతకడం కూడా నేర్చుకున్నాడు. తనకు తానుగానే ఆవిధంగా చెయ్యగల ఏకైక జంతువైన మానవుడు ప్రపంచంలో నివాసయోగ్యమైన ప్రాంతమంతటా విస్తరించాడు. ఇతర జంతువులు — పెంపుడు జంతువులు, క్రిమికీటకాలు — తమకు తాముగాకాక, మానవుని అనుసరించే అన్ని శీతోష్ణస్థితులకూ అలవాటుపడ్డాయి. మానవుడు సదా వేడిగా ఉండే శీతోష్ణస్థితి కలిగిన

తన తొలి నివాసస్థానంనుండి, మరింత చలిగా వుండే ప్రాంతాలకు — సంవత్సరం వేసవిగాను, శీతకాలంగాను వేర్పడివున్న ప్రాంతాలకు — తరలడంతో కొత్త అవసరాలు తలెత్తాయి. చలి నుండీ తేమనుండీ రక్షణకుగాను యిల్లూ, దుస్తులూ అవసరమయ్యాయి. ఆ కారణంగా శ్రమకు సంబంధించిన నూత్నరంగాలు ఆవిర్భవించాయి. తత్పర్యవసానంగా కొత్తరకం కార్యకలాపాలు ఆరంభమయ్యాయి, అవి జంతువునుండి మనిషిని అంతకంతకు ఎక్కువగా వేరుచేశాయి.

ప్రతిఒక వ్యక్తిలోనే కాకుండా సమాజంలో కూడా చేతులు, స్వరాంగాలు, మెదడు సంయుక్తంగా పనిచెయ్యడంద్వారా, మానవులు అంతకంతకు అధికతర సంక్లిష్ట కార్యాలను చెయ్యగలిగారు, అంతకంతకు ఉచ్చతర లక్ష్యాలను తమ ముందుంచుకొని, వాటిని సాధించగలిగారు. తరం మారి తరం వచ్చినకొద్దీ మానవ శ్రమ పూర్వపుదానికి భిన్నమూ, మరింత పరిపూర్ణమూ, మరింత వైవిధ్యపూరితమూ అయింది. వేటకూ, పశుపాలనకూ తోడు వ్యవసాయం కూడ మొదలైంది. అటుతర్వాత నూలు వడకడం, బట్టలు నేయడం, కమ్మరిపని, కుమ్మరిపని, నౌకాయానం వచ్చాయి. వర్తకం, చేతిపనులతోబాటు చివరకు కళా, విజ్ఞాన శాస్త్రమూ ఆవిర్భవించాయి. తెగలు జాతులుగా, రాజ్యాలుగా పరిణతిచెందాయి. చట్టమూ, రాజకీయాలూ ఉత్పన్నమయ్యాయి, వాటితోబాటు మానవుని మనస్సులో మానవ అస్తిత్వపు ఊహాత్మక ప్రతిబింబమైన మతం తలెత్తింది. మొదట మనోత్పాదితాలుగా కనిపించి, మానవ సమాజాలపై ప్రాబల్యం వహించినట్లు కనిపించిన యీ ప్రతిబింబాలన్నింటికీ ముందు శ్రమించే హస్తాలయొక్క మరింత సాదా అయిన ఉత్పాదితాలు పూర్వరంగంలోకి పోయాయి. సమాజాభివృద్ధి అతి ప్రారంభదశనుండీ కూడా (ఉదాహరణకు, ఆదిమ కుటుంబంలోనే) శ్రమకు సంబంధించిన పథకాన్ని మనస్సు తయారు చేసుకొని పథకం వేసుకున్న శ్రమ నిర్వహణకు తన సొంత చేతులను కాకుండా యితరుల చేతులను మానవుడు వినియోగింపజెయ్యగలిగిన నాటినుండీ మరింతగా యిలా జరిగింది. నాగరికతయొక్క శీఘ్ర పురోగమనానికి ఘనత అంతా మనస్సుకూ, మెదడు అభివృద్ధి కార్యకలాపాలకూ ఆపాదింపబడింది. అవసరాలకు (ఏవిధంగా చూసినా ఈ అవసరాలే మనస్సులో ప్రతిబింబిస్తాయి, చైతన్యంద్వారా గ్రహింపబడుతాయి) మారుగా ఆలోచనలే తమ చర్యలకు మూలమని చెప్పడానికి మనుషులు అలవాటుపడ్డారు. కాగా కాలక్రమేణా, ప్రత్యేకించి ప్రాచీన ప్రపంచం పతనమైననాటినుంచీ, మానవుల మనస్సులపై ప్రాబల్యం వహించిన ఆ భావవాద ప్రపంచ దృక్పథం ఆవిర్భవించింది. ఈ భావవాద దృక్పథం యీనాటికీ వారి మనస్సులను ఎంతగా ప్రభావితం చేస్తున్నదంటే, డార్విన్ ఆలోచనా సరళికి చెందిన అత్యంత భౌతికవాద విజ్ఞాన శాస్త్రజ్ఞులు సైతం యీనాటికీ మానవ ఆవిర్భావాన్ని గురించి స్పష్టమైన అభిప్రాయాన్ని ఏర్పరచుకోలేకపోతున్నారు; భావవాద ప్రభావ కారణంగా మానవావిర్భావంలో శ్రమ నిర్వహించిన పాత్రను గుర్తించలేకపోవడమే యిందుకు కారణం.

ఇంతకుముందే పేర్కొనబడినట్లు, జంతువులు తమ కార్యకలాపాలద్వారా, మానవుని మాదిరిగానే — మానవుడు చేసిన మేరకే కాకపోయినా — పరిసరాలను మారుస్తాయి. మనం యింతకుముందే చూసినట్లు, పరిసరాలలో అవి తెచ్చిన మార్పులు తిరిగి వాటిని ప్రభావితం చేసి, తమలో మార్పుకి కారణభూతమైన వాటిని మారుస్తాయి. ప్రకృతిలో మిగిలినవాటితో సంబంధంలేకుండా విడిగా ఏదీ జరగదు. ప్రతిఒక్క విషయమూ ప్రతి యితర విషయాన్నీ ప్రభావితం చేస్తుంది, ప్రతి యితర విషయంచేతా తను ప్రభావితం చెయ్యబడుతుంది. ఈ బహుముఖ చలనమూ, పరస్పర క్రియాప్రతిక్రియలూ చాలవరకు విస్మరింపబడిన కారణంగానే మన ప్రకృతి విజ్ఞానశాస్త్రజ్ఞులు అత్యంత సామాన్య విషయాలను సైతం సుస్పష్టంగా గ్రహించలేకపోతున్నారు. గ్రీసులో అడవుల పునర్జననాన్ని మేకలు ఏవిధంగా నిరోధించాయో మనం పైన చూశాం. సెంట్ హెలెనా ద్వీపంలో, మొదటి నివాసులు తమతో తీసుకువెళ్లిన మేకలూ, పందులూ ఆ ద్వీపంపైన గల పాత వృక్షసంతతిని దాదాపు పూర్తిగా నిర్మూలించి, తద్వారా అక్కడికొచ్చిన నావికులూ, వలసదార్లూ తమతో తెచ్చిన మొక్కల వ్యాప్తికి ప్రాతిపదికను సంసిద్ధంచేశాయి. కాని జంతువులు తమ పరిసరాలపై చిరకాల ప్రభావాన్ని బరపుతున్నాయంటే అనుద్దేశపూర్వకంగా మాత్రమే అవి అలా చేస్తున్నాయి; కాగా ఆ జంతువులకు సంబంధించినంతవరకు యిది యాదృచ్ఛికమే. అయితే మానవులు జంతువులనుండి మరింతగా దూరమయ్యేకొద్దీ ప్రకృతిపైన వారి ప్రభావం నిర్దిష్టమైన పూర్వాలోచితమైన గమ్యాభిముఖంగా పూర్వోద్దేశితమైన, నిర్దేశిత చర్య స్వభావాన్ని సంతరించుకొంటుంది. తానేమి చేస్తున్నదీ గ్రహించకుండానే జంతువు ఒక ప్రాంతంలోని మొక్కమొటికలను సర్వనాశనం చేస్తుంది. మనిషి కూడ మొక్కమొటికలను నిర్మూలిస్తాడు, కాని తద్వారా ఖాళీయైన భూమిపైన పంటలిచ్చే విత్తనాలు నాటడానికీ, లేక, నాటిన వాటికన్న ఎన్నోరెట్లు ఫలసాయాన్నిస్తాయన్న తెలివిడితో చెట్లనూ, ద్రాక్షతీగలనూ నాటడానికే అతనలా చేస్తాడు. ఉపయోగకరమైన మొక్కలనూ, పెంపుడు జంతువులనూ ఒక దేశంనుంచి మరో దేశానికి తరలించి, తద్వారా ఖండాల వృక్ష, జంతు జాతులనే అతను మారుస్తాడు. ఇంతే కాదు. కృత్రిమోత్పత్తి పద్ధతులద్వారా మానవహస్తంచేత మొక్కలూ, జంతువులూ ఎంతగా మార్చివెయ్యబడతాయంటే, వాటిని గుర్తుపట్టడం కూడా కష్టమే. నేటి మన ధాన్యపు రకాలకు మూలమైన అడవిమొక్కలేమిటో కనుక్కోడానికి యీనాటికీ యింకా వ్యర్థప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. ఏ వన్య మృగాలనుంచి యీనాటి మన రకరకాల కుక్క జాతులూ, గుర్రపు జాతులూ ఆవిర్భవించాయన్నది యీనాటికీ కొంత వివాదాస్పద విషయంగానే వుంది.

జంతువులకు ఒక పథకం ప్రకారం, పూర్వాలోచితమైన పద్ధతిలో పనిచేసే సామర్థ్యం వుందన్న విషయంలో మనకు ఎటువంటి సందేహమూ రాదని వేరే చెప్పనక్కర్లేదు. తద్వి

రుద్ధంగా, ఎక్కడెక్కడైతే సజీవమైన ఆల్బుమెన్ అయిన ప్రోటోప్లాజం అస్తిత్వంలో వుంటుందో, అది ప్రతిక్రియ జరుపుతూవుంటుందో, అంటే, నిశ్చితమైన బాహ్య ప్రేరణల కారణంగా అత్యంత సరళమైనదే అయినా నిశ్చితమైన కదలికలు సాగిస్తుందో, అక్కడల్లా ఒక పథకంతో కూడిన కార్యాచరణ పద్ధతి సూక్ష్మ రూపంలో కనిపిస్తుంది. నాడీకణం మాట అటుంచి, యింకా జీవకణమే లేనిచోట సైతం అటువంటి ప్రతిక్రియ ఉండనేవుంటుంది. కీటకాలను భక్షించే మొక్కలు తమ కీటకాహారాన్ని పట్టుకొనే పద్ధతిలో – అవి చైతన్యరహితంగానే యీ పని చేసినా – పథకబద్ధమైన కార్యాచరణ కొంత మేరకు వుంది. జంతువులలో నాడీ వ్యవస్థ ఏ స్థాయిలో అభివృద్ధిచెందిందో ఆ స్థాయిలో పథకబద్ధమైన కార్యాచరణను కొనసాగించే సామర్థ్యం వుంటుంది, సస్తన జంతువులలో యీ శక్తి బాగా వున్నత స్థాయిని చేరుకుంటుంది. ఇంగ్లండులో గుంటనక్కలను వేటాడేటప్పుడు, జనం ఒక విశేషాన్ని నిత్యం గమనించవచ్చు: తమను తరిమే వేటగాండ్ర కళ్లలో దుమ్ము కొట్టేందుకుగాను స్థానిక ప్రదేశానికి సంబంధించిన తన అద్భుత పరిజ్ఞానాన్ని గుంటనక్క వినియోగించుకుంటుంది. నేలకు సంబంధించిన అనుకూలమైన లక్షణాలన్నీ బాగా తెలుసుకున్న గుంటనక్క తన జాడను కుక్క పసిపట్టకుండా వాటన్నింటినీ ఎంతో అమోఘంగా వినియోగించుకుంటుంది. మన పెంపుడు జంతువుల్లో మానవ సహవాస ఫలితంగా బాగా అభివృద్ధిచెందినవి, మన పిల్లలు ఏ స్థాయిలో జిత్తులమారి పనులు చేస్తారో సరిగా ఆ స్థాయిలోనే జిత్తులమారి పనులు చేస్తాయి. దీనికి కారణం ఏమిటంటే, ఏవిధంగానైతే తల్లి గర్భంలో మానవ పిండపు అభివృద్ధి చరిత్ర దశలక్షలాది సంవత్సరాల క్రమంలో మన జాంతవ పూర్వీకుల – క్రిమిదశనుంచి ప్రారంభమై యీనాటివరకు – శారీరకాభివృద్ధి చరిత్రయొక్క పునరావృత్తియో, అదే విధంగా మానవ శిశువుయొక్క మానసికాభివృద్ధి అదే పూర్వీకుల, కనీసం యిటీవలి పూర్వీకుల బౌద్ధిక అభివృద్ధియొక్క బాగా సంక్షిప్తమైన పునరావృత్తి మాత్రమే. కాని, జంతువులన్నింటి పథకబద్ధమైన యావత్తు కార్యాచరణా కూడా ప్రకృతిపైన వాటి యిచ్చాముద్రను వేయలేకపోయింది. ఆ ఘనత మానవునికే దక్కింది.

సంక్షిప్తంగా చెప్పాలంటే, జంతువు బాహ్య ప్రకృతిని కేవలం వినియోగించుకుంటుంది. కేవలం తన ఉనికిద్వారా దానిలో మార్పులు తెస్తుంది. కాని మనిషి తన మార్పుల ద్వారా ప్రకృతి తన ప్రయోజనాలను నెరవేర్చేలా చేసుకొని, దానిపైన ఆధిపత్యం చలాయిస్తాడు. మనిషికీ, యితర జంతువులకూ మధ్య చిట్టచివరి, సారభూతమైన భేదం యిదే. ఈ మారు కూడా, యీ భేదాన్ని తెచ్చిపెట్టినది శ్రమే.*

అయితే, ప్రకృతిమీద మన మానవ విజయాల కారణంగా మనం అతిగా ఆత్మ

* రాతప్రతి మార్జిన్లో గమనిక: "veredlung" (మెరుగుదల). – సం.

స్తుతి పరాయణులం కారాదు, ఎందుకంటే అటువంటి ప్రతి ఒక్క విజయానికీ ప్రకృతి మనపైన తన పగ తీర్చుకొంటుంది. ప్రతి ఒక విజయమూ మొదటిసారి మనం ఆశించిన ఫలితాలను కలిగిస్తుందన్నమాట నిజమే. కాని రెండవసారీ, మూడవసారీ అది పూర్తి భిన్నమైన, అప్రత్యాశితమైన ఫలితాలను – తరచుగా మొదటిదాన్ని తుడిచిపెట్టేసేవాటిని – కలిగిస్తుంది. మెసొపొటేమియా, గ్రీస్, ఆసియా మైనర్లలోనూ, యితరచోట్లా సాగు భూములకోసం అడవులను నిర్మూలించిన జనం, అడవులతోబాటు తేమ సంగ్రహ కేంద్రాలనూ, ఆశయాలనూ నాశనంచెయ్యడంద్వారా, ఆ దేశాలలో ప్రస్తుతమున్న దౌర్భాగ్యస్థితికి తాము ప్రాతిపదిక వేస్తున్నామని కలలో కూడ అనుకొనివుండరు. ఆల్ప్సు పర్వతప్రాంతపు ఇటాలియన్లు దక్షిణ చరియలపైన గల పైన్ అడవులను (యివి ఉత్తర చరియలపైన అత్యంత సురక్షితంగా ఉంచబడ్డాయి) పూర్తిగా కొట్టివేసినప్పుడు తాము ఆవిధంగా చెయ్యడంద్వారా, తమ ఉన్నత పర్వతపు ప్రాంతంలో పశుపాలన వృత్తిని సమూలంగా నిర్మూలించివేస్తున్నామన్న సంగతి సూచనప్రాయంగా కూడా వారికి తెలియదు. ఈవిధంగా చెయ్యడంద్వారా ఏడాదిలో ఎక్కువకాలం కొండచలమలలో నీరులేకుండా చేస్తున్నామనీ, వర్షాకాలంలో మైదానాలపైకి అవి మరింత భయంకరమైన వరదలుతెచ్చే అవకాశాన్ని కల్పిస్తున్నామనీ వారికి చూచాయగా కూడా తెలియదు. యూరప్‌లో బంగాళదుంపలను వ్యాపింపచేసినవారికి, యీ పిండి దుంపలతోబాటు తాము గండమాలవ్యాధిని సైతం వ్యాపింపచేస్తున్నామన్న సంగతి తెలియదు. ఈవిధంగా, ప్రకృతిమీద మన శాసనం ఏ విదేశీ జాతిపైననో ఒక విజేత శాసనం మాదిరిగా చలామణీకాదనీ, అదేదో ప్రకృతికి వెలుపలగల వ్యక్తి అమలుజరిపే శాసనంవంటిది కాదనీ, అందుకు భిన్నంగా రక్తమాంసాలనూ, మెదడునూ కలిగిన మనం ప్రకృతికి చెందిన ప్రాణులమేననీ, మన అస్తిత్వం దాని మధ్యనేననీ, ప్రకృతి నియమాలను తెలుసుకుని వాటిని సరిగా అమలుపరచగల సామర్థ్యాన్ని కలిగి వుండటంలోనే దానిపైన మన ఆధిపత్యమంతా యిమిడివుందనీ, మిగిలిన అన్ని ప్రాణులకన్న మన ఆధిక్యత యిందులోనే వుందనీ, అడుగడుగునా మనకు గుర్తుచెయ్యబడుతోంది.

వాస్తవానికి రోజులు గడిచేకొద్దీ, మనం యీ నియమాలను మరింత బాగా అర్థం చేసుకుంటూ, ప్రకృతియొక్క సహజక్రమంలో మన జోక్యంవల్ల కలిగే తక్షణ ఫలితాలనూ, మరింత దీర్ఘకాల ఫలితాలనూ కూడా గ్రహిస్తూవచ్చాం. ప్రత్యేకించి ప్రస్తుత శతాబ్దంలో ప్రకృతి విజ్ఞానశాస్త్రాల ప్రబల పురోగమనానంతరం, ముందెప్పటికన్న యిప్పుడు మనం, కనీసం మన రోజువారీ ఉత్పత్తి కార్యకలాపాలయొక్క మరింత దీర్ఘకాలిక ఫలితాలను సైతం గ్రహించి, తత్కారణంగా వాటిని అదుపులో పెట్టగల స్థితిలో వున్నాం. కాని ఈ సామర్థ్యం ఎంత ఎక్కువగా పెరిగితే అంత ఎక్కువగా మనుషులు ప్రకృతితో తమ ఏకత్వాన్ని అనుభూతిచెందడమేకాక దానిని గ్రహిస్తారు. అప్పుడు యూరపులో ప్రామాణిక ప్రాచీన

యుగావసానం తర్వాత తలెత్తి, క్రిస్టియన్ మతంలో అత్యున్నత స్థాయిలో వివరింపబడిన మనస్సు — పదార్థం, మానవుడు — ప్రకృతి, ఆత్మ — శరీరం పరస్పరం భిన్నమైనవన్న అర్థ రహితమూ, అసహజమూ అయిన భావం అంత ఎక్కువగా అసంభవమవుతుంది.

ఉత్పత్తిరంగంలో మన కార్యకలాపాలయొక్క మరింత దీర్ఘకాల ప్రాకృతిక ఫలితాలను ఎలా అంచనావెయ్యాలో ఏ కొంచెమో నేర్చుకోడానికి మనకి వేల సంవత్సరాల శ్రమ అవసరమైంది; కాని యీ కార్యకలాపాల సుదీర్ఘకాలిక సామాజిక ఫలితాలను గురించి అంచనావేసే పని యింకా కష్టతరమైంది. బంగాళదుంపల వ్యాప్తిని గురించీ, దానితోబాటు వ్యాపించిన గండమాలవ్యాధిని గురించీ యింతకుముందే పేర్కొన్నాం. కార్మికులు కేవలం బంగాళదుంపల ఆహారానికి దిగజార్చబడిన పర్యవసానంగా మొత్తం దేశాలకు దేశాలలో జన సముదాయపు జీవన పరిస్థితులపై పడిన ప్రభావంతోనూ, లేక బంగాళదుంపల పంటకు సోకిన తెగులు కారణంగా 1847లో ఐర్లండులో వచ్చిన కరువుతోనూ పోలిస్తే యీ గండమాలవ్యాధి ఏపాటిది? ఈ కరువు అచ్చంగా, లేక దాదాపు అచ్చంగా బంగాళదుంపల ఆహారంపైననే ఆధారపడిన పది లక్షలమంది ఐరిష్‌వారిని వల్లకాటికి చేర్చింది, మరో యిరవై లక్షలమంది ఐరిష్‌వారికి సముద్రాలుదాటి వలసపోయే దుస్థితిని కల్పించింది. అరబ్బులు సారాయాలు కాచడం నేర్చుకున్నప్పుడు, అలా చెయ్యడంద్వారా అప్పటికింకా కనుగొనబడని అమెరికా ఖండపు ఆదిమవాసుల భావి నిర్మూలనానికి ప్రధానాయుధాల్లో ఒకదాన్ని తాము కనిపెట్టామన్న సంగతి చూచాయగానైనా వారి బుర్రలకు తట్టివుండదు. తర్వాత కొలంబస్ యీ అమెరికానే కనుగొన్నప్పుడు, ఆ పని చెయ్యడంద్వారా తను, యూరప్‌లో ఎన్నడో తుదముట్టింపబడిన బానిసత్వానికి పునర్జీవనం కలిగిస్తున్నాననీ, నీగ్రో బానిస వ్యాపారానికి ప్రాతిపదిక వేస్తున్నాననీ అతనికి తెలియదు. పదిహేడు, పద్దెనిమిదవ శతాబ్దాల్లో ఆవిరి ఇంజన్‌ను కనుగొనడానికి కృషిచేసినవారికి, మరే యితర సాధనంకన్న తాము సృష్టిస్తున్న యీ సాధనం, ప్రపంచ పరివ్యాపితంగా సామాజిక సంబంధాలలో విప్లవాత్మకమైన మార్పును తేబోతున్నదన్న సంగతి తెలియదు. ప్రత్యేకించి యూరపులో సంపదను కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించడంద్వారానూ, అత్యధిక సంఖ్యాకులను ఆస్తిహీనులనూ చెయ్యడం ద్వారాను, ఈ పరికరం మొట్టమొదట బూర్జువావర్గానికి సామాజిక, రాజకీయ పెత్తనాన్ని కట్టబెట్టే విధిని నిర్వర్తిస్తుంది, కాని తర్వాత, ఏ వర్గపోరాటమైతే బూర్జువావర్గాన్ని కూలదొయ్యడంతోనూ, సమస్త వర్గవైరుధ్యాలనూ రద్దుచెయ్యడంతోనూ మాత్రమే ముగియగలదో అటువంటి వర్గపోరాటాన్ని బూర్జువావర్గానికీ శ్రామికవర్గానికీ మధ్య తెచ్చిపెడుతుంది. కాని యీ రంగంలో సైతం, సుదీర్ఘమూ, తరచుగా కఠోరమూ అయిన అనుభవం ద్వారానూ, చారిత్రక విషయ సామగ్రిని పోగుచేసి, విశ్లేషించడంద్వారానూ, మన సామాజికోత్పత్తి కార్యకలాపాలయొక్క పరోక్ష, మరింత దీర్ఘకాలిక, సామాజిక ఫలితాలను స్పష్టంగా

చూడటాన్ని క్రమంగా నేర్చుకుంటున్నాం. ఈవిధంగా, యీ ఫలితాలను సైతం అదుపులో పెట్టి, నియంత్రితంచేసే అవకాశం మనకు లభిస్తోంది.

అయితే, యీ నియంత్రణకు కార్యరూపమివ్వడానికి కేవలం జ్ఞానమొక్కటే సరిపోదు. అందుకుగాను యిప్పటిదాకా అమల్లోవున్న ఉత్పత్తి విధానంలోను, దానితోబాటే మన సమకాలీన సామాజిక వ్యవస్థ అంతట్లోనూ సమూలమైన విప్లవం రావడం అవసరం.

ఈనాటివరకు అస్తిత్వంలో వున్న ఉత్పత్తి విధానాలన్నింటికీ శ్రమనుండి కేవలం అత్యంత తక్షణ, ప్రత్యక్షోపయోగకర ఫలితాన్ని పొందడం మాత్రమే లక్ష్యంగా ఉంటూ వచ్చింది. తర్వాత మాత్రమే ఉత్పన్నమై, క్రమపునరావృత్తిద్వారానూ, సంచయంద్వారానూ కార్యరూపం ధరించే తదుపరి పర్యవసానాలు పూర్తిగా నిర్లక్ష్యం చెయ్యబడ్డాయి. భూమిపైన ఆదిమ సమిష్టి స్వామ్యం, ఒకవంక, ఏ దశలోనైతే మానవుల మానసిక దిఙ్మండలం సామాన్యంగా తక్షణమే లభించేదానికి పరిమితమైవుండేదో, ఆ అభివృద్ధి స్థాయికి అనురూపంగా వుంది. మరొకవంక, యీ ఆదిమ తరహా ఆర్థిక వ్యవస్థవలన కలగగల దుష్ఫలితాలను సరిదిద్దేందుకు కొంత అవకాశమివ్వగల మేరకు భూమి అదనంగా లభించేది. ఈ అదనపు భూమి ఆక్రమించుకోబడటంతో, సమిష్టి స్వామ్యం కూడ క్షీణించింది. అయితే, ఉత్పత్తికి సంబంధించిన ఉన్నత రూపాలన్నీ వేర్వేరు వర్గాలుగా జనాభా విభజనకూ, తద్వారా పాలక వర్గాలకూ, పీడితవర్గాలకూ మధ్య వైరుధ్యాలకూ దారితీశాయి. ఈవిధంగా పీడిత ప్రజలకు కనీసాతి కనీస జీవితావసర సౌకర్యాలను సమకూర్చడానికి మాత్రమే ఉత్పత్తి యికనెంత మాత్రమూ పరిమితంకానందున పాలకవర్గపు ప్రయోజనాలే ఉత్పత్తికి చోదకశక్తి అయ్యాయి. ఈనాడు పశ్చిమ యూరప్‌లో అమలో వున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో యిది అత్యంత సంపూర్ణరూపంలో ఆచరణలో పెట్టబడింది. ఉత్పత్తిపైన, మారకంపైన పెత్తనం కలిగివున్న విడివిడి పెట్టుబడిదార్లు తమ కార్యకలాపాల మిక్కిలి తక్షణోపయోగకర ఫలితాన్ని గురించి మాత్రమే ఆలోచించగలుగుతున్నారు. నిజానికి, ప్రయోజనకరమైన యీ ఫలితం సైతం — ఉత్పత్తిచెయ్యబడిన, లేక మారకంచెయ్యబడిన వస్తువుయొక్క ఉపయోగ సమస్య మాత్రమే అయినంత మేరకు — బాగా వెనక్కుపోయి, అమ్మకంద్వారా లాభాన్ని ఆర్జించడమే ఏకైక ప్రేరణ అవుతుంది.

* * *

బూర్జువావర్గపు సామాజిక శాస్త్రమైన సాంప్రదాయిక అర్థశాస్త్రం ప్రధానంగా ఉత్పత్తికీ మారకానికీ సంబంధించిన రంగాలలో మానవ కార్యకలాపాలయొక్క నిర్దిష్టంగా ఉద్దేశింపబడిన సామాజిక పర్యవసానాలను మాత్రమే పరిశీలిస్తుంది. ఏ సామాజిక వ్యవస్థకు యిది సైద్ధాంతిక అభివ్యక్తీకరణో ఆ సామాజిక వ్యవస్థకు యిది పూర్తిగా

అనురూపమైనది. విడివిడి పెట్టుబడిదారులు తక్షణలాభం కోసం ఉత్పత్తి, మారకాలలో నిమగ్నులైయున్నారు గనుక, మొట్టమొదట వెన్వెంటనే వచ్చే అత్యంత తక్షణ లాభాలను మాత్రమే గణనలోకి తీసుకోవాలి. ఏ కార్ఖానాదారో, లేక వర్తకుడో ఉత్పాదితమైన సరుకునో, లేక కొన్న సరుకునో సామాన్య వాంఛిత లాభానికి అమ్మితే, అతను తృప్తిచెందుతాడు, ఆ సరుకుకూ, దాని కొనుగోలుదార్లకూ తర్వాత ఏమయ్యేదీ అతనికి పట్టదు. ఈ కార్య కలాపాల ప్రాకృతిక పర్యవసానాలకు సైతం యీ విషయమే వర్తిస్తుంది. క్యూబాలో స్పానిష్ తోటల యజమానులు పర్వత చరియలపైన గల అడవులను తగులబెట్టి వాటి బూడిద నుండి ఒక్క తరం అత్యధిక లాభదాయకమైన కాఫీ మొక్కలకు సరిపడేటంత ఎరువును సంపాదించినప్పుడు – తర్వాత తీవ్రమైన ఉష్ణమండల ప్రాంత వర్షాలు అరక్షితమైన పైపొర నేలను తుడిచిపెట్టి, బోడిరాతిని వదిలినప్పుడు వారేమి లెక్కచేశారు! సమాజం విషయంలో మాదిరిగానే ప్రకృతి విషయంలో కూడా, ప్రస్తుత ఉత్పత్తి విధానం ప్రధానంగా తక్షణ, మిక్కిలి ప్రత్యక్ష ఫలితాన్ని గురించి మాత్రమే పట్టించుకుంటుంది. కాగా, ఈ లక్ష్య సాధనకు ఉద్దేశింపబడిన చర్యల మరింత దీర్ఘకాలిక ఫలితాలు అందుకు భిన్నంగా తేలినప్పుడు, తరచుగా వ్యతిరేక స్వభావాన్ని కలిగి వున్నప్పుడు, సప్లయ్ డిమాండ్ల మధ్య వున్న సరితూకం సరిగా తలకిందులుగా పరివర్తన చెందినప్పుడు (ప్రతి పదేళ్ల పారిశ్రామిక చక్రావర్తమూ దీన్ని నిరూపిస్తోంది, చివరకు జర్మనీ సైతం యీ "ఘోర వినాశం"[3] విషయంలో చిన్న ప్రాథమికానుభవం పొందింది), సమస్త సంపదా అంతకంతకు కార్మికేతరుల చేతుల్లో కేంద్రీకృతమవుతూవుండగా, ఒకరి సొంత శ్రమమీద ఆధారపడిన వ్యక్తిగత స్వామ్యం, తప్పని సరిగా కార్మికుల ఆస్తిహీనతగా మారడంపట్ల ఆశ్చర్యం ప్రకటితమవుతోంది. అలాగే[...]*

ఎంగెల్స్‌చేత 1876లో
రచింపబడింది

మొట్టమొదటిసారిగా
"Die Neue Zeit" పత్రిక
సంపుటి 2, సంచిక 44,
1895–96లో ప్రచురింపబడింది

---

* ఈ ఘట్టంలో రాతప్రతి ఆగిపోయింది. – సం.

## ఫ్రెడరిక్ ఎంగెల్స్

# కార్ల్ మార్క్స్

సోషలిజానికీ, తద్వారా యావత్తు సమకాలీన కార్మికోద్యమానికీ ప్రప్రథమంగా శాస్త్రీయమైన పునాదిని కల్పించిన కార్ల్ మార్క్స్ ట్రీర్ నగరంలో 1818లో జన్మించాడు. ఆయన బోన్, బెర్లిన్ నగరాల్లో విద్యాభ్యాసం చేశాడు. మొదట న్యాయశాస్త్రాన్ని అభ్యసించాడు, కాని త్వరలోనే ప్రత్యేకించి చరిత్ర తత్వశాస్త్రాల అధ్యయనంలో పూర్తిగా నిమగ్నుడయ్యాడు. 1842లో సరిగా తత్వశాస్త్ర విభాగంలో అసిస్టెంటు ప్రొఫెసరుగా స్థిరపడబోతున్న తరుణంలో మూడవ ఫ్రెడరిక్ విల్‌హెల్మ్ మరణానంతరం పెల్లుబికిన రాజకీయోద్యమం ఆయన జీవితాన్ని మరో మార్గంలోకి మళ్లించింది. ఆయన సహకారంతో, రేనిష్ ఉదారవాద బూర్జువావర్గ నాయకులైన కాంప్‌హౌసెన్, హాన్సెమన్ మొదలైనవాళ్లు కొలోన్‌లో "Rheinische Zeitung"[4] దినపత్రికను స్థాపించారు. 1842 శరదృతువులో రేనిష్ శాసనసభ కార్యకలాపాలపై మార్క్స్ రాసిన విమర్శ పాఠకుల దృష్టిని విశేషంగా చూరగొనడంతో, ఆ పత్రికా నిర్వహణ ప్రధాన బాధ్యత ఆయనకు అప్పగింపబడింది. "Rheinische Zeitung" పత్రిక సహజంగానే సెన్సార్‌షిప్ నిర్బంధాలకింద వెలువడేది. కాని సెన్సార్‌షిప్ అధికారులు దాన్ని అదుపులో పెట్టలేకపోయారు.* "Rheinische Zeitung" పత్రిక దాదాపు ఎప్పుడూ కూడా తన ముఖ్య వ్యాసాలను సెన్సారు కత్తెరకు గురికాకుండా ప్రచురించగలిగేది. సెన్సారుకు మొట్టమొదట

---

* "Rheinische Zeitung" మొదటి సెన్సార్ అధికారి పోలీసు కౌన్సిలర్ డొలెషాల్. "Kölnische Zeitung"[5] పత్రికలో డాంటె రచించిన ''డివైన్ కామెడీ'' (''దైవవిలాసం'')కి ఫిలాలెత్స్ (దరిమిలా శాక్సనీ రాజు జాన్) చేసిన అనువాదపు అడ్వర్‌టైజ్‌మెంటును ''దైవిక విషయాలను ఎవరూ విలాసప్రాయం చెయ్యరాదు'' అన్న వ్యాఖ్యానంతో కొట్టివేసిన ప్రబుద్ధుడు యితనే. (ఎంగెల్స్ వివరణ.)

రొడ్డవంటి అప్రాముఖ్యమైన సమాచారం పంపబడేది. దాన్ని అతను కొట్టికొట్టి చివరకు విసిగిపోయైనా ఊరుకునేవాడు, లేకుంటే, యింకా కొట్టివేస్తే మరుసటిరోజు పత్రిక వెలువడదన్న బెదిరింపు మూలంగానైనా ఊరుకోక తప్పేది కాదు. "Rheinische Zeitung" పత్రిక మాదిరిగా మరో పది వార్తాపత్రికలే కనుక ధైర్యంగా వ్యవహరించి వుంటే, వాటి స్వంతదారులు టైప్ సెట్టింగుకోసం మరి కొద్ది వందల తాలర్లను అదనంగా ఖర్చుపెట్టేందుకు అనుమతించియుంటే, జర్మనీలో 1843లోనే సెన్సార్‌షిప్ దుస్సాధ్యమై వుండేది. కాని జర్మన్ వార్తాపత్రికల స్వంతదారులు అల్పబుద్ధులు, పిరికి కూపస్థమండూకాలు, కాగా, యీ పోరాటాన్ని "Rheinische Zeitung" ఒంటరిగానే సాగించింది. ఒక సెన్సారు అధికారి తర్వాత మరొక సెన్సారు అధికారిని అది అలయింపజేసింది. చివరకు దానిపైన జమిలి సెన్సారు పద్ధతి అమలుజరపబడింది. మొదటి సెన్సారుషిప్ ముగిశాక, Regierungspräsident* దాన్ని మరోమారు చివరిసారిగా సెన్సారు చెయ్యాలి. "Rheinische Zeitung" విషయంలో యీ పద్ధతి కూడా నిష్ఫలమే అయింది. 1843వ సంవత్సరం మొదట్లో యీ వార్తాపత్రికను అదుపులో పెట్టడం దుస్సాధ్యమని ప్రకటించి, యిక ఎక్కువ ఆర్భాటమేమీ లేకుండా ప్రభుత్వం దాన్ని మూసేసింది.

ఈలోగా ఫన్ వెస్ట్‌ఫాలెన్ – తర్వాత ఈయన అభివృద్ధి నిరోధక మంత్రి అయాడు – సోదరిని పెళ్లిచేసుకున్న మార్క్స్ తన నివాసాన్ని పారిస్‌కు మార్చుకున్నాడు. అక్కడ ఆయన ఎ. రూగెతో కలిసి "Deutsch-Französische Jahrbücher"[6] ప్రచురించాడు. దానిలో ఆయన "హెగెలియన్ న్యాయ తత్వశాస్త్రంపై విమర్శ" అన్నదానితో ప్రారంభించి తన సోషలిస్టు రచనలను వరుసగా ప్రచురించాడు. వీటికితోడు ఎఫ్. ఎంగెల్స్‌తో కలిసి "పవిత్ర కుటుంబం. బ్రూనో బొవర్ ప్రభృతులకు వ్యతిరేకంగా" వెలువరించాడు. అది ఆనాటి జర్మన్ తాత్విక భావవాదపు సరికొత్త తప్పుడు రూపాలలో ఒకటైన బ్రూనో బొవర్ భావాలపైన వ్యంగ్య విమర్శ.

ఫ్రెంచి మహా విప్లవ చరిత్రనూ, అర్థశాస్త్రాన్నీ అధ్యయనంచెయ్యడంలో నిమగ్నుడై యుండి కూడా మార్క్స్ మధ్యమధ్య తగినంత తీరిక చేసుకొని ప్రష్యన్ ప్రభుత్వంపైన దాడులు చేస్తూవచ్చాడు. గిజో ప్రభుత్వంచేత – మిస్టర్ అలెగ్జాండర్ ఫన్ హుంబోల్ట్ యీ వ్యవహారంలో దళారీగా వ్యవహరించినట్లు వినికిడి – 1845 వసంతంలో ఫ్రాన్సునుండి మార్క్స్‌ను బహిష్కరింపజెయ్యడం ద్వారా ప్రష్యన్ ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకుంది.[7] మార్క్స్ తన నివాసాన్ని బ్రస్సెల్స్‌కు మార్చుకొని, అక్కడ 1847లో, ఫ్రెంచి భాషలో

---

* ప్రష్యాలో కేంద్ర కార్యనిర్వాహక శాఖ ప్రాంతీయ ప్రతినిధి. – సం.

"తత్వశాస్త్ర దారిద్ర్యం" అనే పుస్తకాన్నీ (యిది ప్రూడన్ రచించిన "దారిద్ర్య తత్వశాస్త్రం" అనే పుస్తకంపై విమర్శ), 1848లో "స్వేచ్ఛాయుత వాణిజ్యంపై ప్రసంగం"నూ ప్రచురించాడు. అదే కాలంలో బ్రస్సెల్స్‌లో జర్మన్ కార్మిక సంఘాన్ని[8] స్థాపించే అవకాశాన్ని వినియోగించుకొని, తద్వారా ప్రత్యక్ష ఆందోళనా కార్యక్రమాన్ని ఆరంభించాడు. ఆయనా, ఆయన రాజకీయ మిత్రులూ 1847లో రహస్య కమ్యూనిస్టు లీగులో (యీ లీగు అంతకుముందే పలు సంవత్సరాలుగా వుంది) ప్రవేశించినప్పుడు యీ ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమానికి మరింత ప్రాధాన్యాన్ని ఇచ్చాడు. ఈ కమ్యూనిస్టు లీగు యావత్తు నిర్మాణ స్వరూపమూ యిప్పడిక విశేషంగా మారిపోయింది. అంతకు పూర్వం కొంచెం యించుమించుగా కుట్రదారీ సంస్థగా వుంటూవచ్చిన లీగు యిప్పుడు కమ్యూనిస్టు ప్రచారంచేసే మామూలు సంఘంగా రూపాంతరంచెందింది. పరిస్థితుల ఒత్తిడివలన మాత్రమే జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీయొక్క యీ తొలి సంఘం యింకా రహస్య సంఘంగా వుంది. జర్మన్ కార్మిక సంఘాలు ఉన్నచోట్లు అన్నింటిలోనూ లీగు వుంది. ఇంగ్లండు, బెల్జియం, ఫ్రాన్సు, స్విట్జర్లాండులలోని దాదాపు యీ అన్ని కార్మిక సంఘాలలోనూ, జర్మనీలోని అత్యధిక సంఖ్యాక సంఘాలలోనూ నాయకులు లీగుకి చెందినవారే. ఆవిర్భవిస్తున్న జర్మన్ కార్మికోద్యమంలో లీగు గణనీయమైన పాత్ర వహించింది. అంతే కాదు. యావత్తు కార్మికోద్యమంయొక్క అంతర్జాతీయ స్వభావాన్నీ నొక్కిచెప్పి ఆచరణలో దాన్ని రుజువు చేసిన సంస్థల్లో మా లీగు మొట్టమొదటిది. ఇంగ్లీషువారు, బెల్జియన్లు, హంగేరియన్లు, పోలిష్‌వారు మొదలైనవారు లీగులో సభ్యులుగా వున్నారు. లీగు అంతర్జాతీయ కార్మిక సమావేశాలను, ప్రత్యేకించి లండనులో నిర్వహించింది.

లీగు రూపాంతరీకరణ 1847లో జరిగిన రెండు మహాసభల్లో జరిగింది. వీటిలో రెండవ మహాసభ పార్టీ మూలసూత్రాలు ఒక ప్రణాళిక రూపంలో విశదీకరింపబడి, ప్రచురింపబడాలని తీర్మానించింది. ఈ పార్టీ మూలసూత్రాలను రాసే పని మార్క్సు ఎంగెల్సులకు అప్పగించబడింది. 1848లో మొదటిసారిగా వెలువడిన "కమ్యూనిస్టు ప్రణాళిక" యీవిధంగా ఆవిర్భవించింది.* ఫిబ్రవరి విప్లవానికి కొంచెం ముందుగా వెలువడిన యీ ప్రణాళిక దరిమిలా దాదాపు అన్ని యూరపియన్ భాషల్లోకీ అనువదింపబడింది.

"Deutsche-Brüsseler Zeitung"[9] పత్రికా నిర్వహణలో మార్క్సు పాల్గొన్నాడు. పితృదేశపు పోలీసు పాలనా దుష్ఫలితాలను ఈ పత్రిక నిర్దాక్షిణ్యంగా బహిర్గతం చెయ్యడంతో, ప్రష్యన్ ప్రభుత్వం మార్క్సును మరల బహిష్కరింపజెయ్యాలని ప్రయత్నించింది, కాని తన యీ ప్రయత్నంలో అది విఫలమైంది. అయితే, ఫిబ్రవరి విప్లవం ఫలి

---

* ఈ సంకలనపు మొదటి భాగంలో 39–81 పేజీలు చూడండి. – సం.

తంగా బ్రస్సెల్స్‌లో సైతం ప్రజాసాముహిక ఉద్యమాలు ప్రారంభమై, బెల్జియంలో విప్లవం ముంచుకురానున్నట్లు కనిపించడంతో బెల్జియం ప్రభుత్వం లాంఛనాలకోసం వేచివుండకుండా మార్క్స్‌ను అరెస్టుచేసి బహిష్కరించింది. ఈలోగా, ఫ్రెంచి తాత్కాలిక ప్రభుత్వం ఫ్లొకోన్‌ద్వారా, పారిస్‌కు తిరిగిరావలసిందిగా ఆయనకు ఒక ఆహ్వానాన్ని పంపింది. మార్క్స్ యీ ఆహ్వానాన్ని ఆమోదించాడు.

ఆరోజుల్లో పారిస్‌లోని జర్మన్లు విప్లవాన్నీ, రిపబ్లిక్కునూ జర్మనీకి ఎగుమతి చేసేందుకుగాను, ఫ్రాన్సులోని జర్మన్ కార్మికులను స్వచ్ఛంద సాయుధ దుస్సాహసిక దళాలుగా ఏర్పాటుచెయ్య ప్రయత్నిస్తూండేవారు. మార్క్స్ పారిస్‌లో, ప్రత్యేకించి యీ వంచనకు వ్యతిరేకంగా బాహాటమైన కృషి జరిపాడు. ఒక వైపున జర్మనీ తన విప్లవాన్ని తనే నిర్వహించుకోవాలి. రెండవ వైపున ఫ్రాన్సులో ఏర్పాటుచెయ్యబడిన ప్రతి ఒక్క విప్లవాత్మక విదేశీ స్వచ్ఛంద దళంయొక్క సమాచారాన్నీ తాత్కాలిక ప్రభుత్వపు లమర్టీన్లు కూలదొయ్యబడవలసిన ప్రభుత్వానికి ముందుగానే చేరవేసేవారు. బెల్జియం, బాడెన్లలో యిదే జరిగింది.

మార్చి విప్లవానంతరం, మార్క్స్ కొలోన్‌కు వెళ్లి, అక్కడ "Neue Rheinische Zeitung"[10]ను ప్రారంభించాడు. ఆనాటి ప్రజాస్వామిక ఉద్యమ పరిధిలో శ్రామికవర్గ దృక్పథానికి ప్రాతినిధ్యం వహించిన పత్రిక యిదొక్కటే. ఈ పత్రిక 1848 జూన్ 1నుంచి 1849 మే 19వరకు వెలువడింది. 1848 నాటి పారిస్ జూన్ తిరుగుబాటుదార్లకు[11] యీ పత్రిక బేషరతుగా యిచ్చిన తోడ్పాటు యీ విషయాన్ని నిరూపిస్తుంది. ఈ తోడ్పాటుకు పర్యవసానంగా దాదాపు దాని వాటాదారులందరూ దానినుంచి తప్పుకున్నారు. "Neue Rheinische Zeitung" పత్రిక[12] పవిత్రమైన ప్రతి ఒకదానిపైనా, రాజునుంచి, ఆ ప్రాంతపు వైస్ రీజెంటునుంచి సాయుధపోలీసుదాకా, అందునా అప్పట్లో 8,000 మంది దుర్గరక్షక సైనికులను కలిగిన ప్రష్యన్ కోటలో, "చింబొరాసా* ప్రమాణంలో ధూర్తత్వం"తో దాడిచేస్తున్నదని "Kreuzzeitung"[13] పత్రిక పేర్కొన్నా ఫలితం లేకపోయింది. ఆకస్మికంగా అభివృద్ధి నిరోధకులుగా మారిన రేనిష్ ఉదారవాద కూపస్థ మండూకాలు క్రోధావేశాన్ని ప్రకటించారు. అదీ నిష్ఫలమే అయింది. కొలోన్‌లో మార్షల్ లా ద్వారా 1848 శరదృతువులో పత్రిక దీర్ఘకాలంపాటు నిలిపెయ్యబడింది. దానివల్లా ప్రయోజనం లేకపోయింది. ఫ్రాంక్‌ఫుర్ట్‌లోని రైహ్ న్యాయమంత్రిత్వ శాఖ కొలోన్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎదుట వ్యాసం తర్వాత వ్యాసాన్ని ఖండించి, పత్రికపైన

---

* చింబొరాసా – దక్షిణ అమెరికాలోని ఆండీస్ పర్వతాల అత్యున్నత శిఖరాల్లో ఒకటి. – సం.

చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఒత్తిడిచేసింది. ఆ ప్రయత్నమూ నిష్ఫలమే అయింది. పోలీసుల కళ్లముందే పత్రికా సంపాదకత్వమూ, ప్రచురణా ప్రశాంతంగా సాగుతూ వచ్చాయి. ప్రభుత్వంపైనా, బూర్జువావర్గంపైనా దాని దాడుల తీక్ష్ణత పెరిగేకొద్దీ పత్రిక ప్రచారమూ, ప్రతిష్ఠ పెంపొందుతూవచ్చాయి. 1848 నవంబరులో ప్రష్యన్ రాజకీయ కుట్ర జరిగినప్పుడు,[14] "Neue Rheinische Zeitung" పత్రిక ప్రతి సంచిక ఊర్ధ్వభాగానా పన్నులు చెల్లించవద్దనీ, బలప్రయోగాన్ని బలప్రయోగంతో ఎదుర్కోమనీ ప్రజలకు పిలుపునిస్తూవచ్చింది. 1849 వసంతంలో దీనికోసమూ, మరో వ్యాసాన్ని ప్రచురించినందుకూ పత్రిక న్యాయవిచారణను ఎదుర్కోవలసివచ్చింది. కాని రెండుసార్లూ కూడా పత్రిక నిర్దోషిగా వదలివెయ్యబడింది. చివరకు డ్రెస్డెన్‌లోనూ, రైన్ రాష్ట్రంలోనూ 1849 మే తిరుగుబాట్లు[15] అణచివెయ్యబడినప్పుడూ, గణనీయమైన సంఖ్యలో సైనికుల సమీకరణ కేంద్రీకరణలద్వారా బాడెన్-పలాటినేట్ తిరుగుబాటుకు వ్యతిరేకంగా ప్రష్యన్ ఉద్యమం ఆరంభింపబడినప్పుడూ "Neue Rheinische Zeitung" పత్రికను బలప్రయోగంద్వారా అణచివేసే శక్తి తనకు తగినంతగా వున్నట్లు ప్రభుత్వం భావించింది. ఎర్ర సిరాతో అచ్చువెయ్యబడిన చిట్టచివరి సంచిక మే 19న వెలువడింది.

మార్క్స్ తిరిగి పారిస్ వెళ్లాడు. కాని, 1849 జూన్ 13వ తేదీ ప్రదర్శనకు[16] కేవలం కొద్ది వారాల తర్వాత, తన నివాసాన్ని బ్రిటానీకి మార్చుకోవడమో, లేక ఫ్రాన్సును విడిచి వెళ్లిపోవడమో తేల్చుకొమ్మన్న ఫ్రెంచి ప్రభుత్వ ప్రతిపాదనను ఎదుర్కోవలసివచ్చింది. ఆయన రెండో ప్రత్యామ్నాయాన్నే ఎంచుకొని లండనుకు తరలివెళ్లాడు. అప్పటినుండి ఆయన నిరవరోధంగా అక్కడే ఉండిపోయాడు.

సమీక్ష రూపంలో (హాంబర్గ్‌లో 1850లో) "Neue Rheinische Zeitung" పత్రిక ప్రచురణను కొనసాగించేందుకు చేసిన ప్రయత్నాన్ని, కొద్దికాలం తర్వాత, అభివృద్ధి నిరోధక శక్తుల బలప్రయోగం నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా, వదలుకోవలసివచ్చింది. ఫ్రాన్సులో 1851 డిసెంబరులో రాజకీయ కుట్ర జరిగిన వెంటనే, మార్క్స్ "లూయీ బోనపార్ట్‌యొక్క బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"*ని ప్రచురించాడు (బోస్టన్, 1852; ద్వితీయ ముద్రణ, హాంబర్గ్ 1869, యుద్ధానికి కొంచెం ముందు). 1853లో ఆయన "కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసు బండారం" రచించాడు (మొదట బాసెల్‌లోనూ, తర్వాత బోస్టన్‌లోనూ, ఆతర్వాత మరల యిటీవల లైప్జిగ్‌లోనూ యిది ప్రచురింపబడింది).

కొలోన్‌లో కమ్యూనిస్టు లీగు సభ్యులపై శిక్షలు విధింపబడిన తర్వాత,[17] మార్క్స్ రాజకీయ ఆందోళనోద్యమంనుంచి ఉపసంహరించుకొని, పదేళ్లపాటు ఒకవంక అర్థశాస్త్ర

* ఈ సంకలనపు మొదటి భాగంలో 112–236 పేజీలు చూడండి. – సం.

రంగంలో బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలో వున్న అపురూపమైన సమాచార సంపదను అధ్యయనంచెయ్యడానికీ, మరోవంక "New-York Daily Tribune"[18] పత్రికకు వ్యాసాలు రాయడానికీ తన సమయాన్ని వెచ్చించాడు. అమెరికాలో అంతర్యుద్ధారంభం[19]దాకా ఆ పత్రిక ఆయన సంతకంతో రచనలను ప్రచురించడమే కాకుండా యూరప్, ఆసియాల లోని పరిస్థితులపై ఆయన లేఖినినుండి వెలువడిన చాలా సంపాదక వ్యాసాలను కూడా ప్రచురించింది. బ్రిటిష్ అధికారిక సమాచారాన్ని కూలంకషంగా అధ్యయనంచేసి, వాటి ఆధారంపై లార్డు పామర్‌స్టన్‌పై మార్క్స్ చేసిన విమర్శలు లండన్‌లో చిన్న పుస్తక రూపంలో ప్రచురింపబడ్డాయి.

పలు సంవత్సరాలపాటు ఆయన జరిపిన అర్థశాస్త్ర అధ్యయన తొలిఫలితంగా, 1859లో "అర్థశాస్త్ర విమర్శకు చేర్పు," మొదటి భాగం వెలువడింది (బెర్లిన్, డుంకెర్). ఈ రచనలో డబ్బుకు సంబంధించిన సిద్ధాంతంతోబాటు మార్క్సిస్టు విలువ సిద్ధాంతపు సుసంగత వివరణ కూడ వుంది. ఇటాలియన్ యుద్ధకాలంలో[20] మార్క్స్, లండనులో వెలువడే "Das Volk"[21] వార్తాపత్రికలో, అప్పట్లో ఉదారమైనదిగా నటిస్తూ, పీడిత జాతుల విముక్తిదాత పాత్రను నటిస్తున్న బోనపార్టిజాన్నే కాకుండా, తాటస్థ్యం మరుగున కల్లోల పరిస్థితిని స్వలాభానికి వినియోగించుకొనజూచిన ఆనాటి ప్రష్యన్ విధానాన్ని కూడా ఖండించాడు. ఈ సందర్భంగానే అప్పట్లో ప్రిన్సు నెపోలియన్ (ప్లోన్-ప్లోన్) పనుపున, లూయీ నెపోలియన్ జీతంపైన, తాటస్థ్యంకోసం, నిజానికి జర్మనీ సానుభూతికోసం పని చేస్తున్న కార్ల్ ఫోగ్ట్‌ను కూడ విమర్శించవలసివచ్చింది. ఫోగ్ట్ తనపైన బుద్ధిపూర్వకంగా కల్పించి, హేయాతిహేయమైన అభాండాలను గుప్పించినప్పుడు, "మిస్టర్ ఫోగ్ట్" (లండన్ 1860) అనే రచనద్వారా మార్క్స్ వాటికి జవాబిచ్చాడు. అందులో ఫోగ్ట్‌నూ, సామ్రాజ్యవాద కుహనా ప్రజాస్వామ్యవాద ముఠాకు చెందిన తదితర పెద్దమనుషులనూ తూర్పారబట్టాడు. చివరకు ఫోగ్ట్, బాహ్యాభ్యంతర రుజువుల ఆధారంపైన, డిసెంబరు సామ్రాజ్యంనుండి లంచాలు తీసుకున్న నేరారోపణపై శిక్షింపబడ్డాడు. దీనికి సంబంధించిన ధృవీకరణ సరిగా పదేళ్ల తర్వాత వచ్చింది: 1870లో తుయిలెరీ రాజభవనంలో[22] కనుగొనబడి, సెప్టెంబరు ప్రభుత్వంచేత[23] ప్రచురింపబడిన బోనపార్ట్ కిరాయి మనుషుల జాబితాలో, 'ఎఫ్' అన్న అక్షరంకింద యీకింది అంశం నమోదుచెయ్యబడింది: "ఫోగ్ట్ – 1859 ఆగస్టులో ఈయనకు అందజేసిన సొమ్ము – 40,000 ఫ్రాంకులు."

చివరకు, 1867లో హాంబుర్గ్‌లో మార్క్స్ ప్రధాన రచన అయిన "పెట్టుబడి. పెట్టుబడిదారీ ఉత్పత్తి విమర్శనాత్మక విశ్లేషణ" మొదటి సంపుటం వెలువడింది. ఈ గ్రంథం ఆయన ఆర్థిక-సోషలిస్టు దృక్పథాలనూ, ప్రస్తుత సమాజంపైన, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంపైన, దాని పర్యవసానాలపైన ఆయన విమర్శనూ వివరిస్తుంది. ఈ

యుగకర్తృక రచనయొక్క ద్వితీయ ముద్రణ 1872లో వెలువడింది. ప్రస్తుతం రచయిత రెండవ సంపుటి పరిష్కరణలో నిమగ్నుడై వున్నాడు.

ఈలోగా వివిధ యూరపియన్ దేశాలలో కార్మికోద్యమం తిరిగి విశేషంగా బలాన్ని పుంజుకున్న కారణంగా మార్క్స్ తన చిరకాల వాంఛితమైన కార్మిక సంఘ సంస్థాపనను గురించి ఆలోచించగలిగాడు. ఈ సంఘం యూరప్, అమెరికాల్లోని మిక్కిలి అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యాపించాలనీ, అది ఒక విధంగా, సోషలిస్టు ఉద్యమ అంతర్జాతీయ స్వభావాన్ని ఆచరణలో యిటు కార్మికులకే కాకుండా అటు బూర్జువావర్గానికీ, ప్రభుత్వాలకూ కూడా ప్రదర్శించాలనీ, యిది శ్రామికవర్గానికి ప్రోత్సాహం కలిగించి, దానికి బలం చేకూర్చగా, దాని శత్రువుల హృదయాలను భయకంపితం చెయ్యగలుగుతుందనీ మార్క్స్ ఆశించాడు. సరిగా అప్పుడే రష్యాచేత మరోమారు అణచివెయ్యబడిన పోలండును బలపరుస్తూ లండన్‌లోని సెంట్ మార్టిన్ హాలులో 1864 సెప్టెంబరు 28న జరిగిన బహిరంగ సమావేశం యీ అంశాన్ని ముందుకుతెచ్చే అవకాశాన్ని కల్పించింది. ఈ ప్రతిపాదన హర్షామోదాలు పొందింది. ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ స్థాపింపబడింది. ఆ సమావేశంలో, లండన్ కేంద్రస్థానంగా, ఒక తాత్కాలిక జనరల్ కౌన్సిలు ఎన్నుకోబడింది. ఈ జనరల్ కౌన్సిలుకే కాకుండా, హేగ్ మహాసభవరకు,[24] దరిమిలా ఎన్నుకోబడిన జనరల్ కౌన్సిళ్లన్నింటికీ కూడా మార్క్స్ ఉత్తేజకారుడుగా వ్యవహరించాడు. 1864 నాటి "ప్రారంభోత్సవ విజ్ఞప్తి" మొదలుకొని, 1871 నాటి ఫ్రాన్సులో అంతర్యుద్ధంపై విజ్ఞప్తి* దాకా ఇంటర్నేషనల్‌యొక్క జనరల్ కౌన్సిలు విడుదలచేసిన పత్రాలలో దాదాపు ప్రతి ఒకదాన్నీ ఆయనే రచించాడు. ఇంటర్నేషనల్‌లో మార్క్స్ కృషిని వర్ణించడమంటే ఆ సంఘ చరిత్రను రాయడమే అవుతుంది. ఏమైనా అది యూరపియన్ కార్మికుల స్మృతిలో యింకా సజీవంగానే వుంది.

పారిస్ కమ్యూన్[25] పతనం ఇంటర్నేషనల్‌ను పనిచేసేందుకు అసాధ్యమైన పరిస్థితిలో పెట్టింది. విజయవంతమైన ప్రత్యక్ష కార్యాచరణావకాశాన్ని అన్నిచోట్లా కోల్పోయినప్పుడు అది యూరపియన్ చరిత్ర ముమ్మొనకు నెట్టబడింది. ఏ ఘటనలైతే దాన్ని సప్తమ అగ్రరాజ్య స్థానానికి లేవనెత్తాయో అవే ఘటనలు, అది తన పోరాట శక్తులను సమీకరించుకొని, ప్రత్యక్ష కార్యాచరణలో వినియోగించడానికి ఆటంకంగా తయారయ్యాయి. కార్యాచరణకే పూనుకొంటే, తప్పనిసరిగా అపజయంపాలై, కార్మికోద్యమాన్ని కొన్ని దశాబ్దాలపాటు వెనక్కినెట్టే ప్రమాదంలో అది పడింది. దీనికితోడు, ఆకస్మికంగా వృద్ధిచెందిన

---

* కె. మార్క్స్ "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" ఈ సంకలనపు రెండవ భాగంలో 99–186 పేజీలు చూడండి. – సం.

ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ కీర్తిని స్వాతిశయ లేక కీర్తికాంక్షా పరితృప్తి కోసం వినియోగించుకోవాలని, అనేక వైపులనుంచి కొందరు ముందుకొస్తున్నారు. వీరు ఇంటర్నేషనల్ నిజస్థానాన్ని గుర్తించినవారుగాని, దానిపట్ల గౌరవం ఉన్నవారుగాని కారు. అటువంటి పరిస్థితిలో వీరోచితమైన ఒక నిర్ణయాన్ని తీసుకోవలసివచ్చింది, ఈమారు కూడా మార్క్స్ ఆ నిర్ణయాన్ని తీసుకొని హేగ్ మహాసభలో అది ఆమోదింపబడేలా చేశాడు. అహేతుకమైన, రోసిపోయిన శక్తులకు కేంద్రకంగా వ్యవహరిస్తున్న బకూనినిస్టుల చర్యల బాధ్యతను లాంఛనప్రాయమైన ఒక తీర్మానంద్వారా ఇంటర్నేషనల్ తిరస్కరించింది. అటు పిమ్మట, తనపైన అంతకంతకు అధికతరంగా వెయ్యబడిన డిమాండ్లను సార్వత్రిక అభివృద్ధినిరోధకత్వం మూలంగా, జీవశక్తిని ఓడ్చివేసే పలు త్యాగాలను చెయ్యడంద్వారా తప్ప తన పూర్తి సార్థక్యాన్ని నిలబెట్టుకోవడం సాధ్యంకాదని ఇంటర్నేషనల్ గ్రహించింది. ఈ పరిస్థితుల దృష్ట్యా, జనరల్ కౌన్సిలును అమెరికాకు మార్చడంద్వారా, ఇంటర్నేషనల్ తాత్కాలికంగా రంగంనుంచి నిష్క్రమించింది. ఆకాలంలోనూ, దరిమిలా తరచుగానూ ఖండింపబడిన ఆ నిర్ణయం ఎంత సరైనదో తదుపరి ఘటనలు రుజువుచేశాయి. ఈ నిర్ణయం ఒకవంక, ఇంటర్నేషనల్ పేర జరిగిన ప్రయోజనరహితమైన దుందుడుకు విప్లవ ప్రయత్నాలన్నింటికీ స్వస్తిచెప్పింది. మరోవంక, వివిధ దేశాల సోషలిస్టు కార్మిక పార్టీల మధ్య కొనసాగుతున్న సన్నిహిత సాంగత్యమూ, ప్రయోజనాల సామ్యానికీ, సకల దేశాల శ్రామికవర్గ సంఘీభావానికీ సంబంధించి ఇంటర్నేషనల్‌చేత రేకెత్తించబడిన చైతన్యమూ, లాంఛనప్రాయమైన అంతర్జాతీయ సంఘ అనుబంధమూ లేకపోయినప్పటికీ – ప్రస్తుతానికి యిదొక సంకెలగా తయారైంది – తమను తాము సుస్థాపితం చేసుకోగలుగుతున్నాయి.

హేగ్ మహాసభానంతరం, తన సైద్ధాంతిక కృషిని తిరిగి ప్రారంభించేందుకు మార్క్సుకు చివరకు తీరిక లభించింది. త్వరలోనే ఆయన "పెట్టుబడి" రెండవ సంపుటాన్ని పూర్తి చెయ్యగలుగుతాడని ఆశించవచ్చు.

విజ్ఞానశాస్త్ర చరిత్రలో ముఖ్యమైన పలు ఆవిష్కరణలద్వారా మార్క్స్ తన నామధేయాన్ని విలిఖించుకున్నాడు. వాటిలో రెండింటిని మాత్రమే మేమిక్కడ ప్రస్తావించగలం.

ప్రపంచ చరిత్రకు సంబంధించిన మొత్తం అవగాహనలో ఆయన తెచ్చిన విప్లవం మొదటిది. అన్ని చారిత్రక మార్పులకూ మూలకారణాలు మానవుల మారుతున్న భావాలలో వుంటాయి, చారిత్రక మార్పులన్నింటిలోకీ అతి ముఖ్యమైనవి రాజకీయ మార్పులు, యావత్తు చరిత్రపైనా అవే ప్రాబల్యం వహిస్తాయి అన్నదే చరిత్రకు సంబంధించిన పూర్వ దృక్పథమంతటికీ ప్రాతిపదికగా వుంటూవచ్చింది. అయితే, ఆ భావాలు మనుషుల మనసుల్లోకి ఎక్కడినుంచి వచ్చాయి? ఆ రాజకీయ మార్పుల చోదక కారణాలేమిటి

అన్న ప్రశ్న వేసుకోబడేదికాదు. కేవలం యిటీవలి ఫ్రెంచి చరిత్రకారుల పరంపరలోనూ, పాక్షికంగా ఆంగ్ల చరిత్రకారులలోనూ కనీసం మధ్యయుగాలనాటినుంచి అయినా, యూర పియన్ చరిత్రలో చోదకశక్తి, పెంపొందుతున్న బూర్జువావర్గానికీ, ఫ్యూడల్ ప్రభువర్గానికీ మధ్య సామాజిక, రాజకీయ పెత్తనంకోసం జరిగిన పోరాటమేనన్న విశ్వాసం చోటుచేసుకుంది. అయితే యిప్పుడు మార్క్స్ సమస్త పూర్వ చరిత్రా వర్గపోరాటాల చరిత్రయనీ, బహు ముఖ, సంక్లిష్ట రాజకీయ పోరాటాల్లోనూ సామాజిక వర్గాల సామాజిక, రాజకీయ పాల నయే వివాదాంశమనీ, పాత వర్గాలు తమ ప్రాబల్యాన్ని నిలుపుకోడానికీ, కొత్తగా తలెత్తుతున్న వర్గాలు తమ ప్రాబల్యాన్ని నెలకొల్పుకోడానికీ మధ్య జరిగే ఘర్షణయే ప్రధానాంశమనీ నిరూ పించాడు. మరైతే, యీ వర్గాల ప్రాదుర్భావానికీ, వాటి అనుస్యూత అస్తిత్వానికీ కారణం ఏమిటి? ఒకానొక దశలో సమాజం తన జీవితావసర వస్తువులను ఏ పరిస్థితుల్లోనైతే మార్పిడి చేసుకుంటుందో, ఆ ప్రత్యేక పాదార్థిక, భౌతిక, దృగ్గోచర పరిస్థితులే వాటి అనుస్యూత అస్తిత్వానికి కారణం. మధ్యయుగాలనాటి ఫ్యూడల్ పాలన సన్నకారు రైతాంగ సమష్టి సమాజాల స్వయంపోషక ఆర్థిక వ్యవస్థపై ఆధారపడింది. ఈ రైతాంగ సమష్టి సమాజాలు తమ అవసర వస్తువులన్నింటినీ తామే తయారుజేసుకునేవి. ఆ సమాజాల్లో దాదాపు మారకమంటూ వుండేదే కాదు. ఆ సమాజాలు బయటనుండి సాయుధ ప్రభువర్గపు రక్షణనూ, జాతీయ ఘనిష్టతనూ, లేక కనీసం రాజకీయ ఘనిష్టతనూ పొందాయి. పట్ట ణాలూ, వాటితోబాటు చేతిపరిశ్రమలూ తలెత్తి, మొదట ఆంతరంగిక, తర్వాత అంతర్జా తీయ వర్తకసంబంధాలు పెంపొందినప్పుడు పట్టణవాస బూర్జువావర్గం అభివృద్ధిచెం దింది. మధ్యయుగంనాటికే యీ వర్గం ప్రభువర్గంతో పోరాటం జరిపి, ఫ్యూడల్ వ్యవస్థలో భాగస్వామ్యాన్నీ, అలాగే సమాజంలో ప్రత్యేక సౌకర్యాలు కలిగిన అంతరువునూ సంపాదించు కుంది. కాని యూరపియనేతర ప్రపంచం కనుగొనబడటంతో, పదిహేనవ శతాబ్ది మధ్యం నుండి, యీ బూర్జువావర్గం యింకా చాలా విస్తృతమైన వాణిజ్య రంగాన్నీ, దానితోబాటు తన పరిశ్రమకు కొత్త ఊపునూ సంపాదించుకుంది. అతి ముఖ్యమైన శాఖల్లో చేతివృత్తుల స్థానాన్ని యిప్పుడు ఫాక్టరీ స్థాయిలో కార్ఖానా పరిశ్రమలు ఆక్రమించాయి. గత శతాబ్దపు శాస్త్రీయావిష్కరణలు, ప్రత్యేకించి ఆవిరి ఇంజను కనుగొనబడటంతో యివి సాధ్యమయ్యాయి. భారీ పరిశ్రమలు తిరిగి తమ వంతులో, వెనుకబడిన దేశాలలో చేతిశ్రమను తొలగించడం ద్వారా వర్తకంపైన పనిజేసి, మరింత అభివృద్ధిచెందిన దేశాల్లో ఆవిరి ఇంజన్లు, రైల్వేలు, విద్యుత్ టెలిగ్రఫీ మొదలైన ఆధునిక నూతన రవాణా, వార్తాప్రసార సౌకర్యాలను సృష్టిం చాయి. బూర్జువావర్గం యీవిధంగా అంతకంతకు అధికంగా సామాజిక సంపదనూ, సామా జిక అధికారాన్నీ కూడదీసుకోనారంభించింది. అయితే అది యింకా చాలాకాలందాకా రాజ కీయాధికారంనుండి దూరంగా అట్టేపెట్టబడింది. రాజకీయాధికారం యింకా ప్రభువర్గం

చేతుల్లోనూ, ఫ్యూడల్ ప్రభువర్గపు తోడ్పాటు కలిగిన రాజరికం చేతుల్లోనే వుంటూవచ్చింది. కాని ఒకానొక దశలో – ఫ్రాన్సులో మహా విప్లవం నాటినుండి – బూర్జువావర్గం రాజకీయాధికారాన్ని సైతం ఆక్రమించుకుంది, అప్పుడది తన వంతులో శ్రామికవర్గంపైనా, సన్నకారు రైతులపైనా పాలకవర్గం అయింది. ఈ దృక్కోణంనుంచి చూసినప్పుడు సమస్త చారిత్రక ఘటనలనూ – సమాజంయొక్క ప్రత్యేక ఆర్థిక పరిస్థితికి సంబంధించి తగినంత పరిజ్ఞానం వున్నట్లయితే (మన వృత్తి చరిత్రకారులలో యీ పరిజ్ఞానం పూర్తిగా లోపించడం వాస్తవం) – అత్యంత సరళమైన పద్ధతిలో వివరించడం సంభవం. అదేవిధంగా, ప్రతిఒక చారిత్రక దశ భావాలనూ జీవితపు ఆర్థిక పరిస్థితులనుబట్టీ ఆ దశయొక్క సామాజిక, రాజకీయ సంబంధాలనుబట్టీ – యివి తిరిగి యీ ఆర్థిక పరిస్థితులను బట్టే నిర్ధారితమవుతాయి – వివరించవచ్చు. చరిత్ర మొట్టమొదటిసారిగా దాని వాస్తవ ప్రాతిపదికపైన నిలపబడింది. అందరికీ స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, మనుషులు పెత్తనంకోసం పోరాడాలన్నా, రాజకీయాలు, మతం, తత్వశాస్త్రం మొదలైన వాటిలో పాల్గొనాలన్నా, మొదట వారికి తినడానికి తిండీ, తలదాచుకోడానికి యిల్లూ, కట్టుకునేందుకు దుస్తులూ వుండాలన్న, అందుకుగాను పని చేసి తీరాలన్న సంగతి యింతకుముందు పూర్తిగా విస్మరింపబడింది. విస్పష్టమైన ఆ వాస్తవం చివరకు యిప్పుడు, తన చారిత్రక ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

కానైతే, చరిత్రకు సంబంధించిన యీ కొత్త భావనకు సోషలిస్టు దృక్పథంలో అత్యధిక ప్రాముఖ్యం వుంది. గత చరిత్ర యావత్తూ వర్గవైరుధ్యాలలోనూ, వర్గపోరాటాలలోనే గడిచిందనీ, పాలకవర్గాలూ, పాలిత వర్గాలూ, దోపిడిచేసే వర్గాలూ, దోపిడిచెయ్యబడే వర్గాలూ ఎల్లప్పుడూ ఉంటూ వచ్చాయనీ, మానవజాతిలో అత్యధిక సంఖ్యాకులు ఎల్లప్పుడూ నడుంవిరిగే శ్రమకూ, అల్ప సంతోషానికే గురిచెయ్యబడుతూ వచ్చారనీ యీ చారిత్రక దృక్పథం నిరూపించింది. ఇది ఎందుకిలా జరిగింది? మానవజాతియొక్క గత అభివృద్ధి దశలన్నింటిలోనూ ఉత్పత్తి అతి తక్కువగా అభివృద్ధిచెందడమే యిందుకు కారణం. ఆ కారణంగా చారిత్రకాభివృద్ధి యీ శత్రువైరుధ్య రూపంలో మాత్రమే ముందుకు సాగగలిగింది. మొత్తంగా చారిత్రకాభివృద్ధి ప్రత్యేక హక్కులు కలిగిన అత్యల్ప సంఖ్యాకులకు కేటాయింపబడగా, అత్యధిక సంఖ్యాకులు తమ శ్రమద్వారా తమకోసం నామమాత్రపు జీవితావసర పదార్థాలనూ, ప్రత్యేక హక్కులు కలిగినవారికోసం అంతకంతకు అధికతర జీవితావసర పదార్థాలనూ తయారుచెయ్యవలసిన దుస్థితిలో పడ్డారు. కాని, గత వర్గపాలనకు యీ విధంగా యింత సహజమూ, హేతుబద్ధమూ అయిన వివరణను సమకూర్చే యీ చారిత్రక పరిశీలన పద్ధతే (లేకపోతే, మనిషి దుష్టత్వం మాత్రమే యిందుకు కారణమని చెప్పాల్సి వుంటుంది) మరో విషయాన్ని కూడా స్పష్టంచేస్తోంది. ఆధునిక కాలంలో ఉత్పాదక

శక్తులు యింత విశేషంగా అభివృద్ధిచెందిన కారణంగా మానవజాతిని పాలకులుగానూ, పాలితులుగానూ, దోపిడి చేసేవారు, దోపిడి చెయ్యబడేవారుగానూ — కనీసం మిక్కిలి అభివృద్ధిచెందిన దేశాల్లోనైనా — విభజించేందుకు గల చిట్టచివరి సాకు సైతం అంతరించిపోయిందన్నదే ఆ విషయం. పాలక బడా బూర్జువావర్గం తన చారిత్రక కర్తవ్యాన్ని పరిపూర్తి చేసింది, సమాజానికి నాయకత్వం వహించగల సామర్థ్యం దానికి యిప్పుడిక ఎంతమాత్రం లేదు, ఉత్పత్తి అభివృద్ధికి అది ఒక సంకెలగా కూడా తయారైంది, వ్యాపార సంక్షోభాలూ, ప్రత్యేకించి యిటీవలి అంతర్జాతీయ ఆర్థిక మహాసంక్షోభమూ, అన్ని దేశాల్లోనూ పరిశ్రమల హీనస్థితీ దీన్నే నిరూపించాయన్నదే ఆ విషయం. చారిత్రక నాయకత్వం శ్రామికవర్గం చేతుల్లోకి మారింది, సమాజంలో మొత్తంగా తనకుగల స్థానం ఫలితంగా సమస్త వర్గపాలననూ, సమస్త దాస్యాన్నీ, సమస్త దోపిడినీ రద్దుచెయ్యడంద్వారా మాత్రమే యీ వర్గం తనను తాను విముక్తం చేసుకోగలదన్నదే ఆ విషయం. బూర్జువావర్గపు అదుపును మీరి పెరిగిన సామాజిక ఉత్పాదక శక్తులు జతగూడిన శ్రామికవర్గం తమ చేతుల్లోకి తమను తీసుకొనేందుకూ, తద్వారా, ఏ పరిస్థితుల్లోనైతే సమాజంలోని ప్రతిఒక్క సభ్యుడూ ఒక్క ఉత్పత్తిలోనే కాకుండా సామాజిక సంపద పంపిణీ నిర్వహణలలో కూడ పాల్గొనగలుగుతాడో, ఏ పరిస్థితుల్లోనైతే యావత్తు ఉత్పత్తీ ప్రణాళికాబద్ధంగా జరిగి సామాజిక ఉత్పాదక శక్తులనూ, వాటి ఫలసాయాన్నీ పెంచి, తద్వారా సమాజంలోని ప్రతి ఒక్క సభ్యునియొక్క సహేతుకమైన సకలావసరాల పరితృప్తికీ నానాటికీ అధికతర హామీని కల్పిస్తుందో అటువంటి పరిస్థితులను కల్పించేందుకు నిరీక్షిస్తున్నాయి — అన్నదే ఆ విషయం.

మార్క్స్ రెండవ ముఖ్య ఆవిష్కరణ ఏమిటంటే, పెట్టుబడికీ శ్రమకీ మధ్యవున్న సంబంధం. వేరేమాటల్లో చెప్పాలంటే, ఆధునిక సమాజంలో, ప్రస్తుత పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో కార్మికుడు పెట్టుబడిదారుచేత ఏవిధంగా దోచుకోబడుతున్నాడో స్పష్టంగా వివరించడమే ఆ ఆవిష్కరణ. సమస్త సంపదకూ, సమస్త విలువకూ శ్రమయే మూలం అన్న సూత్రాన్ని అర్థశాస్త్రం ప్రతిపాదించిననాటినుండీ యీకింది ప్రశ్న ముందుకు రాకతప్పలేదు: వేతన కార్మికుడు తన శ్రమద్వారా సృష్టింపబడిన విలువ మొత్తమంతటినీ పొందడం లేదు, దానిలో కొంత భాగాన్ని అతను పెట్టుబడిదారుకు అప్పగించవలసి వస్తోందన్న వాస్తవంతో దీనికి ఎలా పొత్తు కుదురుతుంది? బూర్జువా ఆర్థికశాస్త్రవేత్తలూ, సోషలిస్టులూ కూడా యీ ప్రశ్నకు శాస్త్రీయంగా ఆధారసహితమైన జవాబునిచ్చేందుకు బుర్రలు బద్దలుకొట్టుకున్నారు. చిట్టచివరకు మార్క్స్ దీనికి పరిష్కారమార్గాన్ని చూపాడు. ఆ పరిష్కారం యిదీ: ఆధునిక పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో రెండు సామాజిక వర్గాలు ఉండితీరుతాయి — ఒకవంక ఉత్పత్తి సాధనాలనూ, జీవితావసర వస్తువులనూ కలిగివున్న పెట్టుబడిదారీ వర్గం వుంటుంది. మరోవంక శ్రామికుల వర్గం వుంటుంది. ఉత్పత్తి

సాధనాలకూ, జీవితావసర వస్తువులకూ దూరంచెయ్యబడిన శ్రామికులు అమ్ముకొనేందుకు తమ శ్రమశక్తి అనే ఒకే ఒక్క సరుకును మాత్రమే కలిగివుంటారు. అందుచేత జీవితావసర సాధనాలను సంపాదించుకోవాలంటే వీరు తమ శ్రమశక్తిని అమ్ముకొనితీరాల్సివుంటుంది. కాని, ఒకానొక సరుకు విలువ, ఆ సరుకు ఉత్పత్తిలోనూ, కాగా దాని పునరుత్పత్తిలో కూడా మూర్తీభవించిన సామాజికంగా అవసరమైన శ్రమపరిమాణంచేత నిర్ణయింపబడుతుంది. అందుచేత ఒకరోజులో, ఒక నెలలో లేక ఒక సంవత్సరంలో సగటు మానవుని శ్రమ శక్తి విలువ, ఒక రోజులో, ఒక నెలలో లేక ఒక సంవత్సరంలో యీ శ్రమశక్తి పోషణకు అవసరమైన జీవితావసర వస్తువుల పరిమాణంలో మూర్తీభవించిన శ్రమ పరి మాణంచేత నిర్ణయింపబడుతుంది. ఒక రోజుకు ఒకానొక కార్మికునికి అవసరమైన జీవితా వసర వస్తువుల ఉత్పత్తికి ఆరుగంటల శ్రమ అవసరమవుతుందని, లేకుంటే వేరేమాటల్లో, ఆ జీవితావసర వస్తువులలో యిమిడివున్న శ్రమ ఆరుగంటల శ్రమ పరిమాణానికి ప్రాతి నిధ్యం వహిస్తుందని అనుకుందాం. అప్పుడు ఒక రోజు శ్రమశక్తి విలువ ఆరుగంటల శ్రమలో మూర్తీభవించిన డబ్బుమొత్తంలో కూడా వ్యక్తంచెయ్యబడుతుంది. మనం యింకొంచెం ముందుకు వెళ్లి చూద్దాం. మన యీ కార్మికుడిని పనిలో పెట్టుకున్న పెట్టుబడిదారు అతని శ్రమకు యీ మొత్తాన్ని ప్రతిఫలంగా యిచ్చినప్పుడు, అతని శ్రమశక్తి పూర్తి విలువను చెల్లించాడని అనుకుందాం. మరి యిప్పుడు కార్మికుడు రోజులో ఆరుగంటలు పెట్టుబడిదారుకోసం పనిచేస్తే, పెట్టుబడిదారు పెట్టిన ఖర్చుకు పూర్తి విలువను కార్మికుడు పూర్తిగా తీర్చివేసినట్లే, అంటే ఆరుగంటల శ్రమకు ఆరుగంటల శ్రమ తీర్చాడన్నమాట. కానైతే అప్పుడు దానిలో పెట్టుబడిదారుకు ఏమీ వుండదు. కాగా పెట్టుబడిదారు యీ వ్యవహారం వంక పూర్తి భిన్నమైన పద్ధతిలో చూస్తాడు. అతనిలా అంటాడు: నేనీ కార్మికుని శ్రమశక్తిని ఆరుగంటలకు కాక మొత్తం రోజంతకీ కొన్నాను. తదనుగుణంగా అతను, పరిస్థితులనుబట్టి, కార్మికునిచేత 8, 10, 12, 14 లేక అంతకన్న ఎక్కువ గంటలు పనిచేయిస్తాడు. ఈ కారణంగా ఏడవ, ఎనిమిదవ గంటలయొక్క, తదుపరి గంటలయొక్క ఉత్పాదితం చెల్లింపబడని శ్రమోత్పాదితం అవుతుంది. దానితో అది పెట్టుబడిదారు జేబు లోకి పోనారంభిస్తుంది. ఈవిధంగా పెట్టుబడిదారు కొలువులో వున్న కార్మికుడు, ఏ శ్రమశక్తి విలువకైతే తనకు మూల్యం చెల్లింపబడుతుందో ఆ శ్రమశక్తి విలువను పునరుత్పత్తి చెయ్యడమే కాకుండా, అంతకుమించి అదనపు విలువను కూడా అతను ఉత్పత్తి చేస్తాడు. మొదట పెట్టుబడిదారుచేత స్వాయత్తం చేసుకోబడే యీ అదనపు విలువ, దాని తర్వాతి క్రమంలో కచ్చితమైన ఆర్థిక నియమాల ప్రకారం మొత్తం పెట్టుబడిదారీ వర్గం మధ్య పంపిణీచెయ్యబడి, ఏ మూలనిధినుంచి అయితే భూమికౌలు, లాభం, పెట్టుబడి సంచయనం, క్లుప్తంగా చెప్పాలంటే, శ్రమ జెయ్యని వర్గాలచేత వినియోగింపబడే, సంచితం

చెయ్యబడే సంపద యావత్తూ ఉత్పన్నమవుతుందో ఆ మూలనిధిగా రూపొందుతుంది. కాని దీనివల్ల బానిస యజమాని లేక ఫ్యూడల్ ప్రభువుల ధనసంపద ఏవిధంగానైతే భూదాసులయొక్క మూల్యం చెల్లింపబడని శ్రమహరణ ఫలితమో అదేవిధంగా యీనాటి పెట్టుబడిదారుల ధనసంపద కూడా యితరుల మూల్యం చెల్లింపబడని శ్రమఫలితమే అన్న విషయం నిరూపితమవుతోంది. ఈ దోపిడి రూపాలన్నింటి మధ్యా గల భేదమల్లా మూల్యం చెల్లింపబడని శ్రమ ఏవిధంగా ఏ పద్ధతిలో స్వాయత్తం చేసుకోబడుతోందన్నది మాత్రమే. అయితే యిది ఆస్తిపరవర్గాల వంచనాత్మక పదజాలపు – ప్రస్తుత సామాజిక వ్యవస్థలో హక్కులు, న్యాయం, హక్కులూ విధుల సమానత్వం, ప్రయోజనాల సార్వత్రిక సామరస్యం వున్నాయనే మాటల – చిట్టచివరి ఔచిత్యాన్ని సైతం తొలగించివేసింది. ప్రస్తుత బూర్జువా సమాజం, తనకంటె ముందరి సమాజాల మాదిరిగానే, అంతకంటె ఏమాత్రమూ తక్కువ కాకుండా అల్పసంఖ్యాకులచేత – వీరి సంఖ్య నానాటికీ యింకా తగ్గుతోంది – అత్యధిక సంఖ్యాకుల దోపిడిని సాధ్యంచేసే ఆడంబరపూర్వకమైన ఒక వ్యవస్థ మాత్రమే అన్న విషయాన్ని బహిర్గతం చేసింది.

ఆధునిక శాస్త్రీయ సోషలిజం యీ రెండు ముఖ్యమైన వాస్తవాలపై ఆధారపడివుంది. "పెట్టుబడి" రెండవ సంపుటంలో పెట్టుబడిదారీ వ్యవస్థకి సంబంధించిన యీ అంశాలూ, యింతకంటె బహుశా ఏ కొంచెమో మాత్రమే తక్కువ ముఖ్యమైన యితర శాస్త్రీయ పరిశోధితాంశాలూ మరింత సవిస్తరంగా వివరింపబడుతాయి. ఈవిధంగా అర్థశాస్త్రంయొక్క ఏ పార్శ్వాలైతే మొదటి సంపుటంలో చర్చింపబడలేదో అవి రెండవ సంపుటంలో విప్లవాత్మకమైన మార్పులు పొందుతాయి. మార్క్స్ యీ రెండవ సంపుటాన్ని త్వరలో ముద్రణకు సంసిద్ధం చెయ్యగలగాలన్నదే మన హృదయపూర్వకమైన ఆకాంక్ష.

ఎంగెల్స్ చేత 1878 జూన్‌మధ్యలో రచింపబడింది

1878లో బ్రౌన్‌ష్వీగ్‌లో వెలువడిన
"Volks-Kalender" అనే వార్షిక
సంచికలో ప్రచురింపబడింది

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

# సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం[26]

## 1892 నాటి ఇంగ్లీషు కూర్పుకు ఉపోద్ఘాతం

మొదట్లో యీ చిన్నపుస్తకం మరో పెద్దగ్రంథంలో ఒక భాగం. బెర్లిన్ విశ్వ విద్యాలయంలో ప్రైవేట్ డోసెంట్*గా ఉన్న డాక్టర్ ఇ. డ్యూరింగ్ అకస్మాత్తుగా 1875 ప్రాంతంలో తాను సోషలిస్టు నయానని పెద్ద ఆర్భాటంతో ప్రకటించుకొన్నాడు. జర్మన్ ప్రజలకు సవిస్తరమైన ఒక సోషలిస్టు సిద్ధాంతాన్నీ మొత్తం సమాజాన్ని పునర్నిర్మించేం దుకు ఒక సమగ్ర పథకాన్నీ కూడా అతడు కానుకగా సమర్పించాడు. సహజ క్రమంలో డ్యూరింగ్ తన ముందువారిమీద విరుచుకుపడ్డాడు; అందరి పైన కన్న ఎక్కువగా తన అక్కసునంతా గుమ్మరించడంద్వారా అతను మార్క్సును గౌరవించాడు.

జర్మన్ సోషలిస్టు పార్టీలోని ఐసెనాఖపక్షం, లాసాలియన్ పక్షం కొత్తగా సంలీన మైన రోజులవి.[27] ఆవిధంగా అది తన బలాన్ని అపారంగా వృద్ధిచేసుకోవడమేకాక, ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా తన బలాన్నంతనూ ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా సంతరించుకుంది. జర్మనీలో సోషలిస్టు పార్టీ వేగంగా ఒక బలమైన శక్తిగా అభివృద్ధి చెందుతోంది. కాని ఒక శక్తిగా దాన్ని అలా అభివృద్ధి చేయాలంటే, కొత్తగా ఏర్పడ్డ యీ ఐక్యతకు ప్రమాదం రాకుండా చూడటం ప్రథమావసరం. మరి డాక్టరు డ్యూరింగ్ బాహాటంగా తన చుట్టూ ఒక ముఠాను – భవిష్యత్తులో మరొక పార్టీ స్థాపనకు బీజాన్ని – సమీకరించుకోసాగాడు. కాబట్టి, మేం అతని సవాలును అంగీకరించక తప్పలేదు: మా కిష్టం ఉన్నా, లేకపోయినా అతనితో మేము పోరాడక తప్పలేదు.

ఇది మరీ కష్టమైనది కాకపోయినా, సుదీర్ఘకాలం జరిగే పని. మా జర్మన్లం వ్యగ్ర చింతనాపరమైన "Gründlichkeit", అంటే లోతైన భావాలు కలిగిన

---

* ప్రైవేట్ డోసెంట్ జర్మన్ విశ్వవిద్యాలయాల్లో జీతంపై పనిచేసే అధ్యాపక సిబ్బంది సభ్యుడుగా కాకుండా పనిచేసే అధ్యాపకుడు. – సం.

లేదా భావాల లోతు కలిగిన జాతి అని అందరికీ తెలిసిన విషయమే. మాలో యెవరైనా తను కొత్తదనుకొన్న ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించదలచుకొంటే, దాన్ని అతను సర్వసమగ్రమైనదిగా చూపెట్టాలి. తర్కశాస్త్రానికి సంబంధించిన ప్రధాన సూత్రాలూ, విశ్వానికి సంబంధించిన మౌలిక నియమాలూ శాశ్వతమైనవనీ, ఘనమైన తన ఆ కొత్త సిద్ధాంతాన్ని రుజువు చేయడానికే అవి పుట్టినవనీ నిరూపించాలి. ఈ విషయంలో డాక్టర్ డ్యూరింగ్ తన జాతి లక్షణాన్ని పూర్తిగా రుజువుచేసుకొన్నాడు. మానసిక, నైతిక, ప్రాకృతిక, చారిత్రక, సర్వసమగ్ర "తాత్విక విధానం" ఒకటీ, సంపూర్ణమైన "అర్థశాస్త్రం, సోషలిజం" ఒకటీ, "అర్థశాస్త్రంయొక్క సవిమర్శక చరిత్ర" ఒకటీ – మూడు ఉద్గ్రంథాలు రచించాడు. ఈ మూడూ మూడు చాటభారతాలు. బరువు విషయంలోను, సారం విషయంలోను అవి పాషాణ సదృశమైన గ్రంథాలు. అదివరకటి అర్థశాస్త్రజ్ఞులు, తత్వవేత్తలందరి సిద్ధాంతాలకూ వ్యతిరేకంగా, ముఖ్యంగా మార్క్సు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా మోహరింపబడిన సేనావాహినుల వంటి వాదనలవి. ఒక్కమాటలో చెప్పాలంటే, డ్యూరింగ్ "విజ్ఞానశాస్త్రంలో పూర్తి విప్లవం" తీసుకురావడానికి ప్రయత్నించాడు. ఇలాంటి వాటితో నేను వ్యవహరించవలసివచ్చింది. కాలం, స్థలం వీటిని గురించిన భావనలు మొదలుకొని ద్విలోహ ప్రమాణం[28] వరకూ, పదార్థం, చలనం శాశ్వతమనే సూత్రం మొదలుకొని నైతికభావాలయొక్క నశించే స్వభావంవరకూ, డార్విన్ ప్రతిపాదించిన "ప్రాకృతిక వరణం"[29] అనే సిద్ధాంతం మొదలుకొని భవిష్యత్సమాజంలో యువకుల విద్యాబోధనవరకూ ప్రపంచంలో ఉండే సమస్త విషయాలనూ నేను తరచవలసివచ్చింది. ఏది ఏమైనప్పటికీ, నా ప్రత్యర్థి సమస్త విషయాలనూ క్రమబద్ధంగా చర్చించడంవల్ల నేనతని సిద్ధాంతాలను ఖండించేందుకు నాయొక్క, మార్క్సుయొక్క అభిప్రాయాలను ఒకే పుస్తకంలో, యిదివరకటికన్న మరింత క్రమబద్ధంగా విపులీకరించడానికి అవకాశం కలిగింది. ప్రధానంగా యీ కారణంవల్లనే నేనీ బండచాకిరీని నెత్తిన వేసుకోవలసివచ్చింది.

నా జవాబు మొట్టమొదటి సారిగా లైప్జిగ్‌నుంచి వెలువడే సోషలిస్టు పార్టీ కేంద్ర పత్రిక "Vorwärts"లో[30] వ్యాసపరంపరగా ప్రచురింపబడింది. తర్వాత అది పుస్తకరూపంలో వెలువడింది. ఆ పుస్తకం పేరు "Herrn Eugen Dühring's Umwälzung der Wissenschaft" ("విజ్ఞానశాస్త్రంలో మిస్టర్ ఇ. డ్యూరింగ్ తెచ్చిన విప్లవం"). దీని రెండవ కూర్పు జూరిహ్‌నుంచి 1886లో వెలువడింది.

ప్రస్తుతం ఫ్రెంచి శాసనసభలో లీల్ పట్టణానికి ప్రతినిధిగా వున్న నా స్నేహితుడు పాల్ లాఫార్గ్ కోర్కెపై యీ పుస్తకంలోని మూడు అధ్యాయాలను కలిపి చిన్న పుస్తకంగా కూర్చాను. దాన్ని అతడు అనువదించి 1880లో ప్రచురించాడు. దాని శీర్షిక "ఊహాజనిత సోషలిజం, శాస్త్రీయ సోషలిజం." ఆ ఫ్రెంచి మాతృకనుండి పోలిష్, స్పానిష్

కూర్పులు వెలువడ్డాయి. 1883లో మన జర్మను మిత్రులు యీ పుస్తకాన్ని జర్మను భాషలో ప్రచురించారు. దాన్ననుసరించి ఇటాలియన్, రష్యన్, డేనిష్, డచ్చి, రుమేనియన్ భాషల్లో దరిమిలా ఇది ప్రచురింపబడింది. ఈవిధంగా, ఇంగ్లీషు కూర్పుతో కలుపుకొని యీ చిన్న పుస్తకం ఇప్పటికి 10 భాషల్లో ప్రచురింపబడింది. నాకు తెలిసినంతవరకు ఏ ఇతర సోషలిస్టు గ్రంథమూ, చివరకు 1848లో మేము ప్రచురించిన "కమ్యూనిస్టు ప్రణాళిక" గాని, మార్క్స్ "పెట్టుబడి" గాని ఇన్నిసార్లు అనువదింపబడలేదు. జర్మనీలో యిది సుమారు 20,000 ప్రతులలో నాలుగు సార్లు ముద్రింపబడింది.

ఈ పుస్తకానికి చివర "మార్క్"[31] అనే శీర్షికతో ఒక అనుబంధం చేర్చబడింది. దాని ఉద్దేశం జర్మనీలో భూమి ఆస్తి చరిత్రను గురించీ, దాని పరిణామాన్ని గురించీ జర్మన్ సోషలిస్టు పార్టీలో కొంత ప్రాథమిక పరిజ్ఞానం కలిగించడం. ముఖ్యంగా ఆ పార్టీ పట్టణ కార్మికులను తనలో ఇముడ్చుకొనే కార్యక్రమం దాదాపు పూర్తి అవుతున్న సమయంలో, వ్యవసాయ కార్మికుల్నీ, రైతుల్నీ కూడ తనలో ఇముడ్చుకోవలసిన సమయంలో ఇది మరింత అవసరంగా కనిపించింది. ట్యూటానిక్ తెగలన్నిటిలోనూ వున్న తొట్టతొలి భూసంబంధాలను గురించీ, వాటి పతనాన్ని గురించీ జర్మనీలోకంటె ఇంగ్లండులో ఇంకా తక్కువమందికి తెలుసు. అందుచేత ఇంగ్లీషు అనువాదం చివర యీ అనుబంధాన్ని చేర్చడం మరింతగా అవసరమైంది. మాతృకలోని అసలు పాఠాన్ని మాత్రం యథాతథంగానే వుంచాను. ఈమధ్య మక్సీమ్ కొవలేవ్స్కీ ప్రతిపాదించిన సూత్రాన్ని యిందులో ప్రస్తావించలేదు. గ్రామసమాజ సభ్యులు సాగుభూముల్నీ, పచ్చికబయళ్లనూ తమలో తాము పంచుకోడానికి ముందు అనేక తరాలకు చెందినవారు సభ్యులుగా వుండే పెద్దపెద్ద పితృస్వామిక సమిష్టి కుటుంబాలు ఆ భూముల్ని ఉమ్మడిగా సాగుచేస్తూ ఉండేవనీ, ఇట్టి పద్ధతి దక్షిణ స్లావ్ జాతులు నివసించే జాద్రుగా (సమాజం)లో ఇప్పటికీ అమల్లో వుందనీ ఆ తర్వాత జనసంఖ్య పెరగడంతో సమిష్టి నిర్వహణ కష్టసాధ్యమైందనీ, ఆవిధంగా భూములను పంచుకోవడం జరిగిందనీ కొవలేవ్స్కీ సూత్రీకరించాడు.[32] బహుశా ఆయన చెప్పినది నిజమే కావచ్చు. కాని, ప్రస్తుతం యిది ఇదమిద్ధంగా తేలని సమస్య.

ఈ పుస్తకంలో అర్థశాస్త్రానికి సంబంధించిన కొత్త పదాలు కొన్ని ఉన్నాయి. అవి మార్క్స్ "పెట్టుబడి"యొక్క ఇంగ్లీషు కూర్పులో ఉన్నవే. "వర్తకపు సరుకుల ఉత్పత్తి" అంటే అర్థం సొంత ఉపయోగానికేగాక, మార్కెట్లో మారకానికి వస్తువులను తయారు చేసే ఆర్థిక అభివృద్ధి దశ. అంటే, ఉపయోగపు విలువలుగాకాక వర్తకపు సరకులుగా తయారుచేసే దశ అన్నమాట. మారకానికి వస్తువులను తయారుచేయడం ప్రారంభమైనప్పటినుంచి నేటివరకూ యీ దశ కొనసాగుతూనేవుంది, ఈ పద్ధతి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోనే సమగ్రరూపం ధరిస్తుంది: అంటే, ఉత్పత్తి సాధనాలపై స్వామ్యం కలిగివున్న

పెట్టుబడిదార్లు శ్రమశక్తి తప్ప ఏ ఉత్పత్తి సాధనాలూ లేని కార్మికుల్ని వేతనానికి కుదుర్చుకొని, వారు మొత్తం అమ్మకపు ధరలో ఉత్పత్తి ఖర్చులుపోను మిగిలిన సొమ్మును తమ జేబుల్లో వేసుకొనే పద్ధతి అమల్లో ఉన్నప్పుడే, "వర్తకపు సరకుల ఉత్పత్తి" సమగ్రరూపం ధరిస్తుంది. మధ్య యుగాలనుండి నేటివరకు పారిశ్రామికోత్పత్తియొక్క చరిత్రను మూడు దశలుగా విభజించవచ్చు: (1) చేతిపరిశ్రమల దశ: చిన్నచిన్న వృత్తి యజమానులు కొద్దిమంది వృత్తిసంఘ కార్మికుల్నీ, అభ్యాసకుల్నీ పెట్టుకొని, వస్తువులను తయారుచేసే దశ. ఈ దశలో ప్రతి కార్మికుడూ స్వయంగా పూర్తి సరుకును తయారుచేస్తాడు. (2) కార్ఖానా ఉత్పత్తి దశ: అనేకమంది కార్మికులు ఒక పెద్ద కార్ఖానాలో సమీకరింపబడి, శ్రమవిభజన సూత్రం ప్రకారం పూర్తి వస్తువును తయారుచేస్తారు. ఈ పద్ధతిలో ప్రతి కార్మికుడూ వస్తువులో కొంతభాగమే తయారుచేస్తాడు, ప్రతి వస్తువూ ఒక కార్మికునినుంచి మరొక కార్మికునికి మారుతూ, చివరి కార్మికుని చేతినుంచి పూర్తి వస్తువు బయటపడుతుంది. (3) ఆధునిక పారిశ్రామిక దశ: ఈ దశలో యంత్రాలు మానవ శ్రమతోకాక శక్తి (ఆవిరిశక్తి లేదా విద్యుచ్ఛక్తి)తో నడుపబడతాయి. కార్మికుని పని అల్లా తనిఖీ చేయడం, యంత్రం చేసే పనులను సరిదిద్దడం మాత్రమే.

బ్రిటిష్ పాఠకలోకంలో చాలమంది ఈ పుస్తకంలోని విషయాలను వ్యతిరేకిస్తారని నాకు బాగా తెలుసు. కాని బ్రిటిష్ "మర్యాదస్తుల" మూఢ విశ్వాసాలను గురించి యూరపు ఖండ వాసులమైన మనం ఏమాత్రం పట్టించుకున్నా కూడా మన పరిస్థితి యిప్పటికన్న అధ్వాన్నమవుతుంది. ఈ పుస్తకం "చారిత్రక భౌతికవాదం" అనే సిద్ధాంతాన్ని సమర్థిస్తుంది. భౌతికవాదం అనే శబ్దం బ్రిటిష్ పాఠకుల్లో అత్యధిక సంఖ్యాకులకు కర్ణకఠోరంగా ఉంటుంది. "అజ్ఞేయతావాదాన్ని"[33] వారు సహించగలరు; కాని భౌతికవాదం మాత్రం వారి దృష్టిలో కొంచెం కూడా సహించరానిది.

ఐనా కూడా, 17వ శతాబ్దినుంచి నేటివరకు ఆధునిక భౌతికవాదంయొక్క జన్మస్థానం ఇంగ్లండే.

"భౌతికవాదం గ్రేట్ బ్రిటన్‌యొక్క ఔరస పుత్రుడు. డున్స్ స్కోటస్ అనే బ్రిటిష్ స్కూల్‌మన్[34] 'పదార్థం ఆలోచించడం అసాధ్యమా?' అని యిదివరకే ప్రశ్నించాడు.

"ఈ అద్భుత కార్యాన్ని సాధించేందుకు అతడు భగవంతుని సర్వశక్తి సంపన్నతను ఆశ్రయించాడు. అంటే, మతసిద్ధాంతం భౌతికవాదాన్ని బోధించేటట్లు చేశాడు. అంతేకాదు. అతడు నామినలిస్టు.[35] నామినలిజం భౌతికవాదానికి తొట్టతొలి రూపం. ఇది ప్రధానంగా ఇంగ్లీషు తత్వవేత్తల్లో కనిపిస్తుంది.

"ఇంగ్లీషు భౌతికవాదానికి అసలు పితామహుడు బేకన్. ప్రకృతి తత్వశాస్త్రమే నిజమైన విజ్ఞానశాస్త్రమని ఆయన అభిప్రాయం. దాని ప్రకారం ఇంద్రియ జ్ఞానం

మీద ఆధారపడ్డ భౌతికశాస్త్రం ప్రకృతి తత్వశాస్త్రంలో అత్యంత ప్రధానమైన భాగం. అనక్సగోరస్, ఆయన హోమియోమెరీలూ,[36] డెమొక్రిటస్, ఆయన కనిపెట్టిన పరమాణువులూ తనకు ప్రమాణాలని బేకన్ తరచు చెబుతూ ఉండేవాడు. ఆయన అభిప్రాయం ప్రకారం ఇంద్రియాలు పొరపాట్లకు అతీతాలు; అవే జ్ఞానానికంతకూ మూలం. విజ్ఞానశాస్త్రానికి ఆధారం అనుభవం; ఇంద్రియావబోధలను హేతుబద్ధంగా పరిశీలించడమే విజ్ఞానశాస్త్రం. ప్రస్తావన, విశ్లేషణ, పోల్చిచూడడం, పరిశీలన, ప్రయోగం — యివి హేతుబద్ధ పద్ధతికి ప్రధాన రూపాలు. పదార్థంయొక్క సహజ ధర్మాల్లో మొదటిదీ, ప్రధానమైనదీ చలనం, ఇది యాంత్రిక చలనమే కాదు; గణాంక చలనమే కాదు; ప్రధానంగా యిది పదార్థంయొక్క ప్రేరణ రూపంలో, జీవాత్మ రూపంలో, ఉద్రిక్తత రూపంలో ఉంటుంది. లేదా జాకొబ్ బోమె మాటల్లో చెప్పాలంటే 'క్వాల్'* రూపంలో ఉంటుంది.

"భౌతికవాదానికి సృష్టికర్త అయిన బేకన్ అభిప్రాయం ప్రకారం, బహుముఖాభివృద్ధికి బీజాలు భౌతికవాదంలో వున్నాయి. ఒకవైపు పదార్థం చుట్టూ ఇంద్రియ జన్యమయిన, కవితావేశితమైన తేజోపుంజం ప్రకాశిస్తూ వుంటుంది; మధురమయిన చిరునవ్వులతో అది మానవుణ్ణి తనవైపు ఆకర్షించుకొంటుంది. కాని రెండోవైపు సూక్తుల రూపంలో యీ చింతన మతసిద్ధాంతంనుంచి దిగుమతి అయిన పరస్పర విరుద్ధ విషయాలతో నిండివుంటుంది.

"భౌతికవాదం దాని తరువాతి పరిణామక్రమంలో పాక్షిక రూపం ధరించింది. బేకన్ రూపొందించిన భౌతికవాదాన్ని హాబ్స్ క్రమబద్ధమొనర్చాడు. ఆయన అభిప్రాయంలో ఇంద్రియజన్యమయిన జ్ఞానం కవితావేశాన్ని కోల్పోయి, గణిత శాస్త్రజ్ఞుని అనిర్దిష్ట అనుభవంగా పరివర్తన చెందుతుంది. రేఖాగణితశాస్త్రం విజ్ఞానశాస్త్రాలన్నింటికీ మహారాణిగా చాటబడింది. భౌతికవాదం మానవ ద్వేషాన్ని అవలంబిస్తుంది. అది తన ప్రత్యర్థిని — అంటే మానవుణ్ణి ద్వేషించే నిస్సారమైన ఆధ్యాత్మికవాదాన్ని — ఓడించేందుకు తన్నుతాను పరిశుద్ధం చేసుకోవాలి; నిష్ఠాగరిష్ఠం కావాలి. ఈవిధంగా భౌతికవాదం ఇంద్రియపరమైన ధోరణినుంచి మేధోపరమైన ధోరణిగా పరివర్తన చెందింది. అయితే, మేధోపర ధర్మమైన సకల సంబద్ధతనూ — దాని ఫలితాలెలా ఉన్నప్పటికీ — అది పరివర్తనకు లోనుచేసింది.

---

* 'క్వాల్': తాత్విక సంబంధమైన శబ్ద క్రీడ 'క్వాల్' అంటే అసలు అర్థం చిత్రహింస; ఆ బాధ ఏదో ఒక చర్యను ప్రేరేపిస్తుంది. అదే సమయంలో జర్మన్ మాయావాది బోమె యీ జర్మన్ మాటలోకి 'క్వాలిటాస్' [గుణం] అనే లాటిన్ శబ్దం యొక్క అర్థాన్ని చొప్పించాడు. అతని అభిప్రాయం ప్రకారం, 'క్వాల్' అనేది ఒక ప్రేరణ శక్తి; అది ఒక వస్తువుయొక్క, సంబంధంయొక్క, వ్యక్తియొక్క స్వీయాభివృద్ధినుంచి జనిస్తుంది; ఆ స్వీయాభివృద్ధిని అది ప్రోత్సహిస్తుంది, బయటినుంచి చొప్పించబడిన బాధ లాంటిది కాదు యిది. (ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.)

"బేకన్ అభిప్రాయాలను మరింత ముందుకు తీసుకువెళ్ళిన హాబ్స్ యిలా వాదించాడు: మానవుని జ్ఞానమంతా ఇంద్రియాలద్వారా లభిస్తున్నప్పుడు మన భావనలూ, భావాలూ వాస్తవ ప్రపంచంయొక్క ఐహిక రూపాలను కోల్పోయిన భ్రాంతులే. తత్వశాస్త్రం యీ భ్రాంతులకు నామకరణం మాత్రమే చేయగల్గుతుంది. భ్రాంతులలో ఒకదానికన్న ఎక్కువ వాటిని ఒకే పేరుతో కూడా పిలవవచ్చు. పేర్లకు కూడా పేర్లు ఉండవచ్చు. ఒకవైపు భావాలన్నిటికీ మూలం ఇంద్రియజగత్తనీ, మరోవైపు ఒకమాట ఆ మాటకంటే అధిక మైనదనీ వాదిస్తే, పరస్పర విరుద్ధమైన భావ సంఘర్షణలో మనం పడతాం. అలాగే, ఇంద్రియాలద్వారా మనకు తెలిసినవే కాక, అనగా విడి విషయాలే గాక, విడి విషయాలు కానివే, సాధారణ స్వభావం గలవే కూడా ఉన్నాయని వాదిస్తే గందరగోళంలో పడితీరుతాం. అశరీర శరీరం ఎంత అర్థరహితమో, అశరీర పదార్థం కూడా అంతే అర్థరహితమైనది. శరీరం, అస్తిత్వం, పదార్థం ఇవన్నీ ఒకే వాస్తవంయొక్క మారుపేర్లు. ఆలోచించే పదార్థంనుంచి ఆలోచనను వేరుచేయడం అసాధ్యం. ఈ పదార్థం అనేదే ప్రపంచంలో జరిగే మార్పులన్నిటికీ మూలం. మనస్సు అనేక విషయాలను ఒకదాని తర్వాత ఒకటి అనంతంగా చేర్చుకొంటూ పోగలదని పేర్కొన్నప్పుడు తప్ప అనంతం అనే మాటకు అర్థంలేదు. భౌతిక వస్తువులే మనకు గ్రాహ్యమవుతాయి కనుక భగవంతుని అస్తిత్వాన్ని గురించి మనమేమీ తెలుసుకోలేము. నా అస్తిత్వమే వాస్తవమైనది. మానవుని ప్రతి ఆవేశం ఒక యాంత్రిక చలనం; దానికి మొదలూ, చివరా వుంటాయి. మనం మంచివని చెప్పేవన్నీ మన ఆకాంక్షలకు సంబంధించిన విషయాలు. ప్రకృతి లోబడే నియమాలకే మానవుడు కూడా లోబడుతాడు. మహా శక్తి, స్వేచ్ఛ అనేవి ఒకటే.

"బేకన్ అభిప్రాయాలను హాబ్స్ క్రమబద్ధమొనర్చాడు, కాని బేకన్ ప్రతిపాదించిన మూలసూత్రాన్ని – జ్ఞానానికంతకూ మూలం ఇంద్రియజగత్తేననే సూత్రాన్ని – అతడు రుజువుచేయలేదు. అలా రుజువుచేసింది లోక్. 'మానవ అవగాహనకు సంబంధించిన ఒక వ్యాసం' అనే దానిలో అతడిందుకు పూనుకొన్నాడు.[37]

"బేకన్ రూపొందించిన భౌతికవాదంలోని మతసిద్ధాంత భ్రాంతులను హాబ్స్ ఖండించాడు.[38] లోక్ ప్రతిపాదించిన ఇంద్రియానుభూతివాదాన్ని[39] ఆవరించివున్న మతసిద్ధాంత ధోరణులను కోలిన్స్, డోడ్వెల్, కావర్డ్, హార్ట్లీ, ప్రీస్ట్లీలు ఖండించారు. ఏది ఎలావున్నా, ఆచరణాత్మక భౌతికవాదులకు మతాన్ని వొదిలించుకొనేందుకు డేయిజం[40] ఒక సులభ మార్గం మాత్రమే."*

---

* మార్క్స్, ఎంగెల్సు "పవిత్ర కుటుంబం," ఫ్రాంక్‌ఫుర్ట్-అమ్-మెయిన్, 1845, పేజీలు 201–4 [Marx and Engels, *The Holy Family*, Chapter VI, 3. Absolute Criticism's Third Campaign, (d), Moscow, 1956. – సం.].

బ్రిటన్‌లో ఆధునిక భౌతికవాదం పుట్టుక గురించి మార్క్స్ ఈవిధంగా రాశాడు. తమ పూర్వీకుల్ని ఆయన కొనియాడినందుకు ఇంగ్లీషువారు యీరోజున హర్షించకపోతే అది మరింత విచారించవలసిన విషయం. బేకన్, హాబ్స్, లోక్‌లు ఫ్రెంచి భౌతికవాదుల మహోన్నత సాంప్రదాయానికి పితామహులనడం మాత్రం నిర్వివాదం. 18వ శతాబ్దంలో జర్మన్లూ, ఇంగ్లీషువారూ నేలమీద, సముద్రంమీద ఎన్నో యుద్ధాలు జరిపి ఫ్రెంచివారిని ఓడించినప్పటికీ, ఫ్రెంచి భౌతికవాదులు మహత్తరమైన ఫ్రెంచి విప్లవానికి ముందే, 18వ శతాబ్దాన్ని ప్రధానంగా "ఫ్రెంచి శతాబ్దం"గా ప్రసిద్ధికెక్కేటట్లు చేశారు. ఆ విప్లవం యొక్క ఫలితాలను బయట ఇంగ్లండ్‌లోను, జర్మనీలోను ఉన్న మనం యింకా అన్వయించుకొనేందుకు ప్రయత్నిస్తున్నాం.

దీన్నెవరూ కాదనలేరు. 18వ శతాబ్దం మధ్యభాగంలో సంస్కారవంతుడైన విదేశీయుడు ఇంగ్లండ్‌లో నివాసమేర్పర్చుకొన్నప్పుడు, ఇంగ్లండులోని మర్యాదస్తులైన మధ్యతరగతియొక్క మతమౌఢ్య, బుద్ధిమాంద్యాలను చూసి దిగ్భ్రాంతిచెంది ఉండేవాడు. ఆ రోజుల్లో మేమందరం భౌతికవాదులం, లేదా ప్రగతిశీలురమైన స్వతంత్ర ఆలోచనాపరులం. ఇంగ్లండులో ఇంచుమించు విద్యాధికులంతా అర్థంలేని లోకాతీత శక్తుల్ని ఎందువల్ల అంతగాఢంగా నమ్మేవారో అప్పుడు మేం తెలుసుకోలేకపోయాం. బక్‌లాండ్, మాంటెల్ వంటి భూగర్భ శాస్త్రజ్ఞులు సైతం బైబిలులోని పురాణ గాథలతో మరీ ఎక్కువగా భేదించని విధంగా శాస్త్రీయ వాస్తవాలను యెందుకు వక్రంగా చిత్రించేవారో మాకు తెలిసేదికాదు. మత విషయాల్లో సొంత బుద్ధిని ఉపయోగించి ఆలోచించగల ధైర్యశాలురకోసం మేము విద్యావిహీనులైన "అలగాజనం" అనబడేవారి వద్దకు, కార్మికులవద్దకు, ముఖ్యంగా ఓవెన్ అనుచరులైన సోషలిస్టుల వద్దకు వెళ్లవలసి వచ్చేదంటే, ఆశ్చర్యకరమైన విషయమే.

కాని, ఆ తర్వాత ఇంగ్లండ్ "నాగరిక" దేశంగా అభివృద్ధి చెందింది. 1851 నాటి ప్రదర్శనం[41] ఇంగ్లండ్ దేశపు ఏకాకిత్వానికి స్వస్తి చెప్పింది. క్రమంగా ఆ దేశం ఆహార విహారాల్లో, ఆచార వ్యవహారాల్లో, భావనారీతుల్లో అంతర్జాతీయతను అలవరచుకొంది. ఇందులో అది ఎంత విజయవంతమైందంటే యూరపులోని కొన్ని ఆచారాలు ఇంగ్లండులో ఎలా వ్యాప్తిచెందుతున్నాయో, ఇంగ్లండులోని కొన్ని ఆచారాలు కూడా యూరపులో అలా వ్యాప్తి చెందితే బాగుండునని నేను కోరుకోనారంభించాను. ఏది ఎలావున్నా ఇంగ్లండ్‌కి సలాద్‌లో వేసే ఆలివ్‌నూనె వచ్చి వ్యాప్తిచెందాక (1851కి ముందు ఈ నూనె ప్రభువర్గానికే తెలుసు) మత విషయాల్లో యూరపులోని అజ్ఞేయతావాదం (scepticism) కూడా ఇంగ్లండులో ప్రవేశించింది. ప్రస్తుత పరిస్థితి ఏమంటే, ఇంగ్లండులో అజ్ఞేయతావాదం చర్చి ఆఫ్ ఇంగ్లండ్‌గా పరిగణింపబడక పోయినా బాప్టిజంతో[42] యించుమించు సమాన గౌరవం పొందుతూంది. సాల్వేషన్ ఆర్మీ[43] కంటె ఖచ్చితంగా ఎక్కువ గౌరవం దానికుంది.

ఇట్టి పరిస్థితుల్లో మతవ్యతిరేకత పురోగమిస్తున్నందుకు విచారించే అనేకమంది, ఖండించే అనేకమంది యీ "నూతన భావాలు" విదేశాలనుంచి దిగుమతి అయినవి కావనీ, జీవితావసర వస్తువులవలె Made in Germany* కావనీ, ఇవి నిస్సందేహంగా పాత ఇంగ్లండ్‌కి చెందిన భావాలేననీ, రెండు వందల సంవత్సరాల క్రిందట వీటిని రూపొందించిన బ్రిటిష్ తాత్వికులే తమ వారసులకంటే ఎంతో ముందుకు పోయారనీ సంతృప్తి చెందవచ్చు.

నిజానికి అజ్ఞేయతావాదమంటే అర్థం, లాంకష్టైర్ పరిభాషలో "ప్రచ్ఛన్న" భౌతిక వాదంతప్ప మరొకటి కాదు. ప్రకృతిని గురించిన అజ్ఞేయతావాద భావన మొదటినుంచి చివరవరకూ భౌతికవాదపరమైనట్టిదే. ప్రకృతి అంతా నియమబద్ధమనీ, బయటిశక్తియొక్క జోక్యం ప్రకృతిలో లేనేలేదనీ అజ్ఞేయతావాది నమ్ముతాడు. అయితే, మనకు తెలిసిన యీ ప్రపంచానికి అవల ఒక పరబ్రహ్మ ఉన్నాడని నిర్ధారణ చేసేందుకుగాని, లేదని నిరూపించేందుకుగాని ఆధారమేమీ లేదంటాడు. ఇది లాప్లాస్ కాలంలో నిజమే కావచ్చు. గొప్ప ఖగోళ శాస్త్రజ్ఞుడైన లాప్లాస్‌ను నెపోలియన్ యిలా ప్రశ్నించాడు: "మీరు రాసిన 'ఖగోళ యంత్ర గతిశాస్త్రం'లో సృష్టికర్తను గురించి ప్రస్తావన అయినా ఎందుకు లేదు?" దీనికి లాప్లాస్ యిలా జవాబిచ్చాడు: "Je n'avais pas besoin de cette hypothèse".** కాని యీ రోజుల్లో, విశ్వమంతా పరిణామయుతమనే భావంలో సృష్టికర్తకుగాని, పాలకునికిగాని అసలే స్థానంలేదు; పరబ్రహ్మ ప్రపంచానికంతకూ అవల దూరం అయిపోయి వున్నాడనడం విరుద్ధమైన భావం. మరి, నా అభిప్రాయంలో, యిది మతావలంబకుల భావాలను అనుచితంగా అవమానపరచడమే.

మన అజ్ఞేయతావాది, మళ్లీ జ్ఞానానికంతకూ మూలం ఇంద్రియాలందజేసే సమాచారమని అంగీకరిస్తాడు. కాని ఏ వస్తువుల్ని అయితే మనం ఇంద్రియాలద్వారా గ్రహిస్తామో, ఆ వస్తువుల్ని గురించి అవి సరియైన సమాచారాన్నే అందజేస్తాయని మన కెలా తెలుసు? అని అజ్ఞేయతావాది అడుగుతాడు. అక్కడినుంచి ఒక అడుగు ముందుకువేసి, తాను వస్తువుల్ని గురించి గాని, వాటి గుణాలను గురించిగాని మాట్లాడేటప్పుడు నిజంగా ఆ వస్తువులూ, వాటి గుణాలూ తన దృష్టిలో లేవంటాడు. ఎందుచేతనంటే, వాటిని గురించి తనకు యిదమిద్ధంగా ఏమీ తెలియదనీ, అవి తన ఇంద్రియాలమీద వేసే ముద్రలని మాత్రమే తెలుసుననీ అంటాడు. ఈవిధమైన వాదనను కేవలం వాదప్రతివాదాలతో ఎదుర్కోవడం కష్టమని వేరే చెప్పనక్కర్లేదు. కాని వాదప్రతివాదాలకు ముందు ఆచరణ

---

* జర్మనీలో తయారైన సరకులు. — సం.

** "ఈ పరికల్పన నా కవసరం లేకపోయింది." — సం.

అనేది ఉంది. "In Anfang war die Tat."* మానవ ఆలోచన ఈ చిక్కును సృష్టించడానికి చాలకాలం ముందే ఆచరణ దాన్ని పరిష్కరించింది. కూర రుచి ఆ కూరను తినేటప్పుడు తెలుస్తుందంటారు. అలాగే యిదీను. వివిధ వస్తువుల్లో మనం చూచే గుణాలను బట్టి వాటి నుపయోగించుకోడం ఎప్పుడైతే మనం ప్రారంభిస్తామో, అప్పటినుంచీ ఇంద్రియానుభూతులు సరియైనవో కావో తిరుగులేని పరీక్షకు పెడతాం. అవి సరియైనవి కాకపోతే, ఆ వస్తువుల ఉపయోగాన్ని గురించి మనం వేసుకున్న అంచనా కూడ తప్పై తీరాలి. అప్పుడు వాటిని ఉపయోగించుకోడానికి మనం చేసిన ప్రయత్నం కూడ విఫలమవాలి. కాని మనం మన లక్ష్యాన్ని సాధించడంలో కృతకృత్యులమైతే, అంటే ఒక వస్తువును గురించిన మన అనుభూతీ, ఆ వస్తువూ ఒకటయితే, దాన్నెందుకోసం ఉద్దేశించామో ఆ ప్రయోజనం యీడేరితే, అప్పుడు దాన్ని గురించిన, దాని గుణాలను గురించిన మన అనుభూతులు మనకు బాహ్యంగావున్న వాస్తవికతతో ఆ మేరకు ఏకత్వం పొందుతాయని రుజువవుతుంది. అలాకాక, మనకు వైఫల్యం ఎదురైతే, అందుకుగల కారణాలను మనం సాధారణంగా త్వరలోనే తెల్సుకోగల్గుతాం. ఏ అనుభూతులపై ఆధారపడి మనం ఆచరణకు ఉపక్రమించామో ఆ అనుభూతులు అసమగ్రమైనవనీ, లేదా ఆషామాషీ స్వభావం గలవనీ తెలుసుకుంటాం. లేక యితర అనుభూతుల ఫలితాలతో వాటిని అపసవ్యంగా జతచేయడం వల్ల — అంటే లోపభూయిష్టమైన ఆలోచనా క్రమం అని మనం అనేదానివల్ల — అది జరిగిందని గ్రహిస్తాం. మన ఇంద్రియాలను సరిగా తరిఫీదుచేసి, సరిగా ఉపయోగించినంత కాలం, ఆచరణ మన అనుభూతుల (సరిగా గ్రహించినవీ, సరిగా వినియోగించినవీ) పరిధికి లోబడి వుండేటట్లు శ్రద్ధ వహించినంత కాలం ఆ మేరకు ఆచరణయొక్క ఫలితం, మన అనుభూతులూ, వాటికి సంబంధించిన వస్తువులూ ఒకటిగా ఉన్నాయని రుజువుచేసినట్లు తెలుసుకొంటాం. శాస్త్రీయంగా పరిశీలింపబడిన మన ఇంద్రియానుభూతులు, బాహ్య ప్రపంచాన్ని గురించి మన మనస్సులో అవాస్తవిక భావాలను కలిగిస్తాయనేందుకు గాని, బాహ్య ప్రపంచానికీ మన ఇంద్రియానుభూతులకూ మధ్య సహజసిద్ధంగా వైరుధ్యం ఉంటుందనేందుకు గాని ఒక్క ఉదాహరణ కూడా యింతవరకు లేదు.

కాని, నయా కాంటియన్ అజ్ఞేయతావాదులిలా వాదిస్తున్నారు: మనమొక వస్తువు యొక్క గుణాలను సరిగానే గ్రహింపవచ్చు; కాని యే ఇంద్రియావబోధిత క్రియద్వారానూ, యే మానసిక క్రియద్వారాసూ వస్తుతత్వాన్ని గ్రహించలేముకదా. ఈ "అజ్ఞేయవస్తువు" మన జ్ఞానానికి అతీతం. దీనికి హేగెల్ చాలాకాలంక్రిందటే ఇలా జవాబు చెప్పాడు: మీరొక

---

* "మొట్టమొదట ఉన్నది ఆచరణ." గ్యోతె రాసిన "ఫౌస్ట్" నాటకంనుండి ఉదహరింపబడిన మాటలు. — సం.

వస్తువుయొక్క గుణాలన్నిటినీ తెలుసుకుంటే ఆ వస్తువు మీకు తెలిసిందన్నమాటే; ఒకానొక వస్తువు మనకు బాహ్యంలో వుందనే వాస్తవం తప్ప మరేదీ మిగలదు; మీ ఇంద్రియాలు ఆ వాస్తవాన్ని తెలియజేసినప్పుడు మనం తెలుసుకోలేనిదని కాంట్ అన్న అజ్ఞేయవస్తువు సమగ్రంగా మీకు తెలిసినట్లే. ఈ సందర్భంలో మరో విషయం కూడా చెప్పవలసి వుంది. కాంట్ రోజుల్లో ప్రకృతి సంబంధమైన విషయాలను గురించిన మన జ్ఞానం బహు స్వల్పం. అందువల్ల ప్రతి వస్తువును గురించీ మనకున్న స్వల్ప పరిజ్ఞానం వెనుక యేదో అద్భుతమయిన "అజ్ఞేయవస్తువు" దాగివుందని అతడు అనుమానించి వుండవచ్చు. కాని మానవుడు తెలుసుకోలేని అనేక వస్తువుల్ని అద్భుతమైన శాస్త్రీయ పురోగతి మూలంగా ఒకదాని తర్వాత ఒకటి తెలుసుకున్నాడు, విశ్లేషించాడు, అంతే కాకుండా వాటిని పునఃసృష్టించాడు. అందుచేత, స్వయంగా మానవుడు తయారుచేయగలిగిన వాటిని అజ్ఞేయమైనవిగా మనం భావించలేం. ఈ శతాబ్దం పూర్వార్ధ భాగంలో కర్బన పదార్థాలు రసాయనిక శాస్త్రజ్ఞులకు రహస్య వస్తువులుగా కనిపించాయి. కాని, యీ రోజున జీవప్రక్రియల సహాయం లేకుండానే, రసాయనిక మూలకాలనుబట్టి జీవ పదార్థాలను వరుసక్రమంలో నిర్మించడం నేర్చుకున్నాం. ఒక పదార్థంయొక్క రసాయనిక కూర్పు ఏదో తెలుసుకొన్న వెంటనే, అందులో వున్న మూలకాలనుబట్టి దాన్ని నిర్మించవచ్చునని ఆధునిక రసాయనిక శాస్త్రజ్ఞులు ఉద్ఘోషిస్తున్నారు. మనమింకా అత్యున్నతమైన జీవ పదార్థాల, అంటే ఆల్బుమెన్ ఉన్న పదార్థాల, రసాయనిక కూర్పును గురించి తెలుసుకోలేకపోతున్నాం; ఈ విషయంలో మనం చాలా వెనుకబడివున్నాం. అయినప్పటికీ, కొన్ని శతాబ్దాల తర్వాతయినా ఆల్బుమెన్‌ని గురించి మనం తెలుసుకొన్నట్లయితే, ఆ జ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని కృతకమైన ఆల్బుమెన్‌ని తయారుచెయ్యగలమని ఎందుకు భావించకూడదు? మనం అట్టి జ్ఞానమే సంపాదిస్తే, జీవపదార్థాన్ని తయారుచేయగల్గుతాం. కారణమేమంటే, ప్రాణం అనేది అతి ప్రాథమికమైన దశనుంచి అత్యున్నత దశవరకూ ఆల్బుమెన్ పదార్థాల సహజ అస్తిత్వ రూపమే.

కాని మన అజ్ఞేయతావాది లాంఛనప్రాయమైన మానసిక సంశయాలను వ్యక్తంచేసిన తర్వాత, ఖచ్చితమైన భౌతికవాదిగానే మాట్లాడుతాడు, వ్యవహరిస్తాడు. ఎందుచేతనంటే, వస్తుతః అతడు భౌతికవాదే. మనకు తెలిసినంతవరకు పదార్థం, చలనం — నేటి పరిభాషలో శక్తి — ఎవరిచేతా సృష్టింపబడనూ లేదు, ఎవరూ దాన్ని నిర్మూలించనూ లేరనీ, కాని, ఎప్పుడో ఒకప్పుడవి సృష్టింపబడలేదనేందుకు తార్కాణం లేదనీ అతను చెప్పవచ్చు. అయితే, యీ విషయాన్ని మనం అతని వాదనను ఖండించడానికి ఏ ప్రత్యేక సందర్భంలోనైనా ఉపయోగిస్తే మాత్రం మనల్ని అతను తక్షణమే చిత్తుచేస్తాడు. In abstracto*

*అనిర్దిష్ట రూపంలో. — సం.

అతడు ఆధ్యాత్మికవాదానికి[44] స్థానం ఉందని అంగీకరిస్తూనే in concreto* దాన్ని నిరాకరిస్తాడు. మనకు తెలిసినంతవరకు, మనం తెలుసుకోగల్గినంతవరకు ప్రపంచానికి సృష్టికర్తగాని, పాలకుడుగాని లేడు; మనకు సంబంధించినంతవరకు పదార్థాన్నీ, శక్తినీ ఎవరూ సృష్టించనూ లేరు; నిర్మూలించనూ లేరు. మన విషయంలో ఆలోచన అనేది శక్తియొక్క ఒక రూపం, మెదడుయొక్క ఒక క్రియ, మనకు తెలిసిందల్లా భౌతిక ప్రపంచం కొన్ని రూఢమైన నియమాలకు లోబడివుంటుందని మాత్రమే. ఇలాగే యింకా యింకా చెప్తాడతను. కాబట్టి, అజ్ఞేయతావాది ఒక శాస్త్రవేత్తగా ఆలోచించే మేరకు, దేన్నైనా తెలుసుకొనే మేరకు భౌతికవాదే. కాని, శాస్త్రానికి బయట, తనకేమీ తెలియని రంగాల్లో అతడు తన అజ్ఞానాన్ని గ్రీకుభాషలోకి మార్చి దాన్నే అజ్ఞేయతావాదమని పిలుస్తాడు.

ఏది ఎలావున్నా, ఒకటి మాత్రం స్పష్టం: నేను అజ్ఞేయతావాదిగా ఉన్నప్పటికీ, యీ చిన్న పుస్తకంలో నేను వివరించిన చారిత్రక దృక్పథాన్ని "చారిత్రక అజ్ఞేయతావాదం"గా వర్ణించగలిగేవాణ్ణి కాదు. మతావలంబకులు నన్ను హేళనచేస్తారు, అజ్ఞేయతావాదులు కోపంతో తమ్మి అపహాస్యం చేస్తున్నానని ఆరోపిస్తారు. అందుకని, నేను ఇంగ్లీషులోనూ, యితర భాషల్లోనూ కూడా "చారిత్రక భౌతికవాదం" అనే మాటనే ఉపయోగిస్తాను. ఇందుకు ఇంగ్లీషు మర్యాదస్తులు సైతం మరీ హడలెత్తిపోరనుకుంటాను. చారిత్రక పరిణామానికంతకూ మూలకారణం, ముఖ్యమైన చారిత్రక ఘటనలన్నిటికీ చోదక శక్తీ సమాజపు ఆర్థిక పురోగతి అనీ, ఉత్పత్తి పద్ధతుల్లో, మారకపు పద్ధతుల్లో వచ్చే మార్పులేననీ, తత్ఫలితంగా సమాజం విభిన్న వర్గాలుగా విభజింపబడటమేననీ, ఆ వర్గాల మధ్య జరిగే పోరాటాలేననీ తెలియజేసే సిద్ధాంతమే చారిత్రక భౌతికవాదం.

బ్రిటిష్ మర్యాదస్తులకు సైతం చారిత్రక భౌతికవాదం లాభకరం కావచ్చునని నేను నిరూపించినట్లయితే బహుశా నాపట్ల మరింత త్వరగా ఈ ఔదార్యం ప్రదర్శింపబడవచ్చు. నలభై, ఏభై ఏండ్లక్రితం, ఇంగ్లండు దేశంలో స్థిరపడిన సంస్కారవంతుడైన విదేశీయుడు ఇంగ్లండులోని మర్యాదస్తులైన మధ్యతరగతియొక్క మతమౌఢ్య, బుద్ధిమాంద్యాలను చూసి దిగ్భ్రాంతిచెంది ఉండేవాడనే అంశాన్ని నేను పేర్కొన్నాను, ఆ కాలపు మర్యాదస్తులైన మధ్యతరగతివారు, సంస్కారవంతుడైన విదేశీయుడికి కనపడినంత మూఢులు కారని నేనిపుడు రుజువుచేయదలుచుకున్నాను. ఆ వర్గంయొక్క మత ధోరణులకు కారణాలను వివరించడం సాధ్యమే.

యూరపు ఖండం మధ్యయుగాలనుంచి అభివృద్ధి చెందినప్పుడు పట్టణాల్లో తలెత్తుతూన్న మధ్యతరగతి ఒక విప్లవశక్తిగా ఉండేది. అది మధ్యయుగాల ఫ్యూడల్ వ్యవస్థలో

* నిర్దిష్ట రూపంలో. – సం.

గణనీయమైన స్థానం సంపాదించించి. కాని ఆ స్థానం కూడా చాలా సంకుచితమైనట్టిదే: దాని విస్తరణశక్తికి అనుగుణంగా అది పెరగలేదు. మధ్యతరగతియొక్క — బూర్జువావర్గం యొక్క — అభివృద్ధి ఫ్యూడల్ వ్యవస్థ నిలబడ్డానికి ఆస్కారమీయలేదు. అందుచేత ఫ్యూడల్ వ్యవస్థ పతనంకాక గత్యంతరం లేకపోయింది.

కాని ఫ్యూడల్ వ్యవస్థకు రోమన్ కేథలిక్ చర్చి గొప్ప అంతర్జాతీయ కేంద్రంగా ఉండేది. ఫ్యూడల్ వ్యవస్థకిందవున్న పశ్చిమ యూరపు ఎన్ని అంతర్యుద్ధాల్లో యిరుక్కున్నా దాన్నంతనీ బ్రహ్మాండమైన రాజకీయ వ్యవస్థగా కేథలిక్ చర్చి ఐక్యమొనర్చింది. క్రైస్తవ మతంనుంచి స్కిస్మాటిక్[45] గ్రీకులకూ, మహమ్మదీయ దేశాలకూ కూడా అది వ్యతిరేకం. ఫ్యూడల్ సంస్థకు పవిత్రతా ముద్రవేసి, దాని చుట్టూ దివ్యమైన కాంతిపరివేషాన్ని కల్పించింది. కేథలిక్ చర్చి ఫ్యూడల్ వ్యవస్థ నమూనాపై తన అంతస్తులన్నిటినీ నిర్మించుకొంది. చివరి విషయ మేమంటే, ఫ్యూడల్ ప్రభువులందరి కంటె అదే ఎక్కువ బలమైనది — కేథలిక్ ప్రపంచం లోని మొత్తం భూమిలో మూడవవంతు దాని అధీనంకింద వుండేది. లౌకిక ఫ్యూడల్ వ్యవస్థను ప్రతి దేశంలోనూ సర్వసమగ్రంగా, విజయవంతంగా ఎదుర్కోవాలంటే, దాని యీ పవిత్ర కేంద్ర మతసంస్థను కూలదోయవలసివుంది.

అంతేకాదు. మధ్యతరగతి అభివృద్ధిచెందడంతోపాటు, దాని సరసన విజ్ఞానశాస్త్రం కూడా పునర్వికాసం పొందింది. ఖగోళశాస్త్రం, యంత్రగతి శాస్త్రం, భౌతికశాస్త్రం, శరీరశాస్త్రం, శరీర ధర్మశాస్త్రం తిరిగి అధ్యయనం చేయబడ్డాయి. బూర్జువావర్గానికి పారిశ్రామికోత్పత్తిని పెంపొందించుకొనేందుకు ప్రకృతికి సంబంధించిన వస్తువుల ధర్మాలను గురించీ, ప్రకృతి శక్తులు పనిచేసే పద్ధతులను గురించీ తెలియజేసే విజ్ఞానశాస్త్రం కావలసివచ్చింది. అప్పటివరకూ విజ్ఞానశాస్త్రం కేథలిక్ చర్చి చెప్పుచేతల్లో వుండేది; మత పరిధుల్ని అది దాటివెళ్ళడానికి పీఠాధిపతులు అంగీకరించేవారు కారు; అందువల్ల అదొక విజ్ఞానశాస్త్రంగానే మనలేదు. విజ్ఞానశాస్త్రం కేథలిక్ చర్చిపై తిరుగుబాటు చేసింది. విజ్ఞాన శాస్త్రాభివృద్ధి లేనిదే బూర్జువావర్గం అభివృద్ధి చెందడం అసాధ్యం, అందుచేత అది యీ తిరుగుబాటులో చేరవలసివచ్చింది.

తలెత్తుతున్న మధ్యతరగతి సాంప్రదాయిక మతాన్నెదుర్కోవడం తప్పనిసరి అయిందనే పైరెండు విషయాలను మాత్రమే నేను ప్రస్తావించాను. కాని యీ రెండూ చాలు. ఒకటి, కేథలిక్ చర్చియొక్క కృత్రిమ బోధనలను ప్రత్యక్షంగా ఎదుర్కోడంలో మిక్కిలి ప్రత్యక్షసక్తిగలదైన బూర్జువావర్గం. రెండు, ఫ్యూడల్ వ్యవస్థపై జరిగే ప్రతి పోరాటమూ ఆ రోజుల్లో మత రూపం ధరించవలసివచ్చింది, మొట్టమొదట అది కేథలిక్ చర్చినెదుర్కోవలసివచ్చింది. కాని పెద్ద పెద్ద పట్టణాల్లోని విశ్వవిద్యాలయాలు, వ్యాపారస్తులు ఎప్పుడైతే పిలుపు ఇచ్చారో, అప్పుడు గ్రామసీమల్లోని ప్రజానీకంలో కూడా ఆ పిలుపు ప్రతిధ్వనించి

తీరుతుంది. ఎందుచేతనంటే, రైతాంగం తమ అస్తిత్వంకొరకు ఫ్యూడల్ ప్రభువులకు వ్యతిరేకంగా – అంటే భూస్వాములకు, పీఠాధిపతులకు వ్యతిరేకంగా – అన్నిచోట్లా పోరాడవలసి వచ్చింది.

బూర్జువావర్గం ఫ్యూడల్ వ్యవస్థపై జరిపిన దీర్ఘ సమరం మూడు బ్రహ్మాండమైన, నిర్ణయాత్మకమైన పోరాటాలతో సమాప్తమైంది.

ఒకటి, జర్మనీలో వ్యాప్తిచెందిన ప్రొటెస్టెంట్ సంస్కరణోద్యమం. కేథలిక్ చర్చిపై లూతర్ మోగించిన రణదుందుభికి రెండు తిరుగుబాట్లు జతకలిశాయి. అవి రెండూ రాజకీయ స్వభావంగల ఉద్యమాలు. ఒకటి, ఫ్రాంట్స్ ఫన్ సికింగెన్ నాయకత్వాన కింది శ్రేణికి చెందిన ప్రభువులు జరిపిన తిరుగుబాటు (1523). రెండు, రైతుల మహా యుద్ధం (1525). ఇవి రెండూ ఓడిపోయాయి. దానికి ప్రధాన కారణం, యీ పోరాటాల్లో అత్యధిక ప్రయోజనంగల పక్షం – పట్టణ పౌరులు – ఊగిసలాడ్డం. ఇందుకు కారణాలను పరిశీలించడం యిక్కడ సాధ్యంకాదు. ఆ క్షణంనుంచీ పోరాటం స్థానిక రాజులకూ, కేంద్ర ప్రభుత్వానికీ మధ్య ఘర్షణగా దిగజారింది. యూరపియన్ రాజకీయాల్లో ప్రత్యక్ష పాత్ర వహించే జాతుల జాబితానుంచి జర్మనీ రెండువందల సంవత్సరాలవరకు తుడిచిపెట్టుకు పోయింది. అలా అంతమయింది ఆ పోరాటం. లూతర్ సంస్కరణోద్యమం ఒక కొత్త మతాన్ని స్థాపించింది. అది నిరంకుశ రాచరికాని కనుగుణమైనట్టిది. ఈశాన్య జర్మనీలో రైతాంగం లూతర్ మతాన్ని స్వీకరించిన వెంటనే తమ స్వేచ్ఛను కోల్పోయి భూదాసులయారు.

కాని లూతర్ సాధించలేని విజయాన్ని కాల్విన్ సాధించాడు. కాల్విన్ మతం ఆనాటి బూర్జువావర్గంలో అత్యంత సాహసికులైనవారి ప్రయోజనాల కనుగుణమైనట్టిది. అతడు ప్రతిపాదించిన సూత్రాల్లో విధివ్రాత ఒకటి. వ్యాపారపోటీలో జయాపజయాలు మానవుని కార్యకలాపాలమీదగాని, బుద్ధికుశలతమీదగాని ఆధారపడవనీ, మానవాతీత శక్తులపై అవి ఆధారపడతాయనే విషయాన్ని మతసంబంధంగా యిది వ్యక్తంచేసింది. ఎంచుకోవలసింది మానవుడు కాదు; నిర్ణయించేది మానవుడు కాదు; మనకెవరికీ తెలియని అతీత ఆర్థిక శక్తులు నడిపించినట్లల్లా మనం నడవాలి; వాటి దయాధర్మాలమీద ఆధారపడాలి. పాత వ్యాపారమార్గాలన్నీ, పాత వ్యాపారకేంద్రాలన్నీ తుడిచిపెట్టుకుపోయి, వాటి స్థానే కొత్తవి అవతరించి, ప్రపంచ వ్యాపారానికి ఇండియా, అమెరికాల తలుపులు తెరువబడి, అతి పవిత్ర మైన ఆర్థిక నియమాలు సైతం – ఉదా: వెండి బంగారాల విలువ – తల్లక్రిందులై ఛిన్నాభిన్నమైన ఆర్థిక విప్లవ తరుణంలో యిది మరింత సరియైనది. కాల్విన్ రూపొందించిన మత నిబంధనలు పూర్తిగా ప్రజాతంత్రయుతమైనవి, రిపబ్లికన్ సూత్రాలపై అవి ఆధారపడ్డాయి. భగవంతుని రాజ్యమే ఒక రిపబ్లికుగా ఉన్నప్పుడు, భూతలంమీది రాజ్యాలు చక్రవర్తుల, బిషప్‌ల, ప్రభువుల ఆజ్ఞలను పాటించడ మెలా సాధ్యం? జర్మనీలో లూతర్

మతం రాజులకు పాదసేవ చేయగా, హాలెండ్‌లో కాల్విన్‌మతం రిపబ్లికును స్థాపించింది. ఇంగ్లండులో, ముఖ్యంగా స్కాట్లెండులో అది చురుకైన రిపబ్లికన్ పార్టీల స్థాపనకు దోహదమిచ్చింది.

బూర్జువావర్గం చేసిన రెండవ పెద్ద తిరుగుబాటు కాల్విన్‌మతంలో స్పష్టమైన సిద్ధాంత రూపం ధరించింది. ఈ తిరుగుబాటు ఇంగ్లండ్‌లో జరిగింది. దాన్ని నడిపింది పట్టణాల్లోని మధ్యతరగతి, గ్రామసీమల్లో సొంత భూములుగల రైతులు యీ పోరాటాన్ని తుదికంటా తీసుకెళ్లారు. విచిత్రమేమంటే, బూర్జువావర్గం జరిపిన మూడు పెద్ద తిరుగుబాట్లలోనూ ప్రత్యక్షంగా పోరాడింది రైతులు. ఏ పోరాటంలోనైనా విజయం లభించిన వెంటనే, ఆ విజయంవల్ల కలిగే ఆర్థిక ఫలితాలవల్ల ఖచ్చితంగా నాశనమయేది రైతులే. క్రామ్‌వెల్ తర్వాత నూరు సంవత్సరాల్లో సొంతభూములుగల రైతులు ఇంగ్లండ్‌లో యించుమించు అదృశ్యమయారు. ఏది ఏమైనప్పటికీ, గ్రామసీమల్లో సొంతభూములుగల రైతులూ, పట్టణాల్లో సామాన్య ప్రజానీకం పోరాడివుండకపోతే, బూర్జువావర్గం ఒంటరిగా విజయం సాధించగలిగేది కాదు; మొదటి చార్లెస్ రాజును అది ఉరికంబంవద్దకు తేగలిగేది కాదు. అప్పట్లో పక్వమై వున్న విజయఫలితాలను బూర్జువావర్గం చేజిక్కించుకునేందుకుగాను విప్లవాన్ని గణనీయంగా ముందుకు తీసుకుపోవలసి వుంది – సరిగా 1793లో ఫ్రాన్సులో, 1848లో జర్మనీలోలాగే ఇది జరగలేదు. నిజానికి బూర్జువా సమాజంయొక్క పరిణామసూత్రాల్లో యిదొకటిగా కనిపిస్తుంది.

సరే, తీవ్రమైన యీ విప్లవ పోరాటాల అనంతరం తప్పనిసరిగా వచ్చే విప్లవ వ్యతిరేక చర్యలు కొనసాగాయి. అవి మరీ విపరీత స్థాయికి వెళ్లాయి. అనేక ఊగిసలాటల తర్వాత చివరకు పరిస్థితుల్లో కొత్త సమతూకం ఏర్పడింది. అది మళ్లీ కొత్త ప్రారంభదశగా పరిణమించింది. ఇంగ్లండ్ దేశ చరిత్రలో ఒక అద్భుత దశ – దీన్నే మర్యాదస్తులు "గొప్ప తిరుగుబాటు" అని పిలుస్తూ వుంటారు – ఆతర్వాత జరిగిన పోరాటాలు ఒక చిన్న సంఘటనతో సమాప్తమయాయి. దీన్నే బూర్జువా చరిత్రకారులు "మహత్తర విప్లవం"[46] అని పిలుస్తూ వుంటారు.

అభివృద్ధి చెందుతూన్న మధ్యతరగతికీ, అదివరకటి ఫ్యూడల్ భూస్వాములకీ మధ్య జరిగిన రాజీయే యీ కొత్త ప్రారంభదశ. అదివరకటి ఫ్యూడల్ భూస్వాములు యిప్పటిలాగే ప్రభువర్గమని పిలువబడేవారు. అయినప్పటికీ, చాలకాలం తర్వాత ఫ్రెంచి రాజు లూయీ ఫిలిప్ "రాజ్యంలో మొట్టమొదటి బూర్జువా" అయిన మార్గంలో, వారు ఏనాడో ప్రవేశించారు. ఇంగ్లండు అదృష్టవశాత్తు పాత ఫ్యూడల్ ప్రభువులు గులాబీల యుద్ధంలో[47] ఒకరినొకరు చంపుకున్నారు. వారి వారసుల్లో అధిక భాగం పాతవంశాలకు చెందినవారే అయినప్పటికీ, వారు సరాసరి వారసులు కారు. దూరబంధువులు మాత్రమే. అందు

చేత వారు పూర్తిగా ఒక కొత్త తరగతి అని చెప్పవచ్చు. వారి ఆచారాలు, ధోరణులు ఫ్యూడల్ వర్గంకన్న బూర్జువావర్గానికి దగ్గరగా ఉండేవి. డబ్బు విలువను వారు పూర్తిగా అర్థంచేసుకున్నారు. వెంటనే వేలసంఖ్యలో చిన్న రైతుల్ని గెంటివేసి, వారి స్థానంలో గొర్రెల్ని ప్రవేశపెట్టారు. తద్వారా తమ శిస్తు మొత్తాలను పెంచుకోసాగారు. ఎనిమిదవ హెన్రీ చర్చి భూములను చెల్లాచెదరౌనర్చడంతోబాటు పెద్దఎత్తున బూర్జువావర్గంనుంచి కొత్తరకపు భూస్వాముల్ని సృష్టించాడు; అదివరలో వున్న లేక కొత్తగా తలయెత్తిన ప్రభువర్గీయులకు భూములు విస్తారంగా పంచిపెట్టబడ్డాయి. ఈ కార్యక్రమం 17వ శతాబ్దం అంతా కొనసాగింది. దీనివల్ల కూడా బూర్జువా భూస్వాములు తలయెత్తారు. ఫలితమేమంటే ఏడవ హెన్రీ పాలననాటినుంచీ ఇంగ్లీషు "ప్రభువర్గీయులు" పారిశ్రామికోత్పత్తిని నిరోధించలేదు సరికదా దానివల్ల పరోక్షంగా లాభపడేందుకు ప్రయత్నించారు. ఆర్థిక రాజకీయ కారణాలవల్ల ప్రముఖ ఆర్థిక, పారిశ్రామిక బూర్జువావర్గంతో సహకరించదలచుకొన్న పెద్దపెద్ద భూస్వాములు ఇంగ్లండ్‌లో యెల్లప్పుడూ వుండేవారు. అందువల్ల 1689లో ఫ్యూడల్, బూర్జువావర్గాల మధ్య రాజీ సులభంగానే జరిగింది. ఆర్థిక, పారిశ్రామిక, వ్యాపార మధ్యతరగతి వర్గాల వాళ్ల ప్రయోజనాలను తగు విధంగా కాపాడే షరతులమీద "అధికారంవల్ల, పదవులవల్ల" లభించే రాజకీయ ప్రయోజనాలు పెద్దపెద్ద భూస్వామ్య కుటుంబాలకు వదలివేయబడ్డాయి. ఆర్థిక ప్రయోజనాలు ఆ రోజుల్లో ఎంత బలమైనవిగా వుండేవంటే మొత్తం జాతియొక్క రాజకీయాలను అవి నిర్ణయించగలిగేవి. వివరాల్లో చిన్నచిన్న తగాదాలుండవచ్చు కాని మొత్తంమీద పారిశ్రామిక, వ్యాపార మధ్యతరగతివాళ్లతో తమ ఆర్థిక ఔన్నత్యం ముడివడివుందని ప్రభువర్గీయులు చాలా బాగా అర్థం చేసుకున్నారు.

అప్పటినుంచీ బూర్జువావర్గం ఇంగ్లీషు పాలకవర్గాల్లో అణకువ గలిగిన, ఐతే గుర్తింపబడిన భాగంగా వుంది. కార్మిక జనసామాన్యాన్ని అణచి వుంచడంలో అందరిలాగే దానిక్కూడా ఉమ్మడి ప్రయోజనం ఉంది. వర్తకుడు, లేదా పారిశ్రామికవేత్త స్వయంగా తన గుమాస్తాలపట్ల, కార్మికులపట్ల, నౌకర్లపట్ల యజమాని స్థానంలో నిలబడ్డాడు మొన్నమొన్నటివరకు పిలువబడేటట్లు వారిపట్ల "సహజ అధిపతి"గా వున్నాడు. అతనికి కావలసిందల్లా ఒక్కటే: వారినుంచి సాధ్యమైనంత ఎక్కువ పనిని, చక్కని పనిని రాబట్టడం. ఇందుకోసం వారికి వినయవిధేయతల్లో తరిఫీదు యివ్వాలి. స్వయంగా అతడు భక్తిపరుడు. మతం అనే పతాకంకింద రాజుల్నీ, ప్రభువుల్నీ అతడు ఓడించాడు. ఇప్పుడు కూడా, తన కిందివారి మనస్సుల్ని స్వాధీనపరచుకొనేందుకూ, వారికి భగవంతుడు ప్రసాదించిన యజమానుల ఆజ్ఞలను పాలించేటట్లు చేయడానికీ మతం గొప్ప అవకాశం యిస్తోందని గ్రహించాడు. క్లుప్తంగా చెప్పాలంటే, యిప్పుడు ఇంగ్లీషు బూర్జువావర్గం "కిందితరగతులవారిని," అంటే దేశసంప

దను ఉత్పత్తిచేసే ప్రజానీకాన్ని, అణచి వుంచడంలో ప్రత్యక్షపాత్ర నిర్వహించవలసివచ్చింది. అందుకు వినియోగింపబడిన సాధనాల్లో మతప్రభావం ఒకటి.

బూర్జువావర్గంలో మతధోరణి బలపడ్డానికి ఇంకొక కారణం వుంది. ఇది ఇంగ్లండ్‌లో భౌతికవాదం తలయెత్తడం. ఈ కొత్త సిద్ధాంతం మధ్యతరగతి మతభావాలకు ఆఘాతం కలిగించడమే కాదు, విద్వాంసులకూ సంస్కారంగలవారికీ మాత్రమే ఉపయోగపడే తత్వశాస్త్రంగా అది తన్ను గురించి తాను చెప్పుకొంది: మతం అలా కాక, విద్యావిహీనులకు — బూర్జువాలతో సహా — ఉపయోగపడుతుంది. హాబ్స్ ఉపదేశాల్లో అది రాజుల నిరంకుశత్వాన్నీ, సర్వాధిపత్యాన్నీ సమర్థించే సిద్ధాంతంగా రంగంమీదికి ప్రవేశించింది; puer robustus sed malitiosus* అంటే ప్రజలను అదుపులో వుంచమని అది నిరంకుశ రాజులకు ఉపదేశించింది. అదేవిధంగా హాబ్స్ అనుయాయులైన బోలింగ్ బ్రోక్, షెఫ్ట్స్‌బరీ మొదలైనవారు బోధించిన డేయిస్టు భౌతికవాదం ప్రభువర్గీయుల సిద్ధాంతంగా, దీక్షపొందినవారికి మాత్రమే పరిమితమైన సిద్ధాంతంగా ఉండిపోయింది. మత విషయాల్లో అది అసహనాన్ని బోధించింది; బూర్జువావర్గానికి వ్యతిరేకమైన రాజకీయ ధోరణులు దానికుండేవి. ఈ కారణాలవల్ల మధ్యతరగతికి చెందినవారు డేయిస్టు భౌతికవాదాన్ని ద్వేషించేవారు. అందుచేతనే ప్రభువర్గీయుల భౌతికవాదానికీ, డేయిజానికీ ప్రతిగా స్టూవర్టు రాజులకు వ్యతిరేకంగా పోరాట పతాకాన్నెగురవేసిన ప్రొటెస్టెంట్ శాఖలే అభ్యుదయకర భావాలుగల మధ్యతరగతికి బలం చేకూర్చాయి; ఇప్పటికీ అవి "లిబరల్ మహా పార్టీకి" మూలస్తంభంగానే వున్నాయి.

ఈలోగా, భౌతికవాదం ఇంగ్లండునుంచి ఫ్రాన్సుకు విస్తరించింది. అక్కడ అది మరొక భౌతికవాద తత్వవేత్తల శాఖతో — కార్టీజియనిజం[48]లోని ఒక శాఖతో — సంబంధ మేర్పరచుకొని, అందులో కలిసిపోయింది. ఫ్రాన్సులో కూడా అది మొదట్లో ప్రభువర్గీయుల సిద్ధాంతంగానే ఉండేది. కాని అందులోని విప్లవాంశ త్వరలోనే ముందుకు చొచ్చుకువచ్చింది. ఫ్రెంచి భౌతికవాదులు మత విశ్వాసాలను విమర్శించడానికి మాత్రమే పరిమితం కాలేదు; తమ కాలపు శాస్త్రీయ సాంప్రదాయాలను, రాజకీయ ధోరణులను కూడా వారు విమర్శించారు. తమ సిద్ధాంతం ప్రపంచంలోని సమస్త విషయాలకూ వర్తిస్తుందని రుజువుచేసేందుకు వారు చాలా దగ్గరమార్గం చేబట్టారు; విజ్ఞానసర్వస్వం అనే ఉద్గ్రంథంలో వారు జ్ఞానానికి సంబంధించిన సమస్త శాఖలనూ భౌతికవాద దృక్పథంతో పరిశీలించారు. అందుచేతనే వారు విజ్ఞానసర్వస్వవాదులని పిలువబడేవారు. ఈవిధంగా, ఏదో ఒక రూపంలో అది సంస్కారంగల ఫ్రెంచి యువజనులందరి సిద్ధాంతంగా (సిసలైన భౌతికవాదంగానో, డేయిజంగానో)

---

*దారుఢ్యం గలిగిన ఆ దుష్టబాలుణ్ణి. — సం.

పరిణతిచెందింది. చివరకు, మహావిప్లవం జరిగేనాటికి, ఇంగ్లీషు రాచరికవాదులు పెంచి పోషించిన సిద్ధాంతం ఫ్రెంచి రిపబ్లికన్లకూ, టెర్రరిస్టులకూ గొప్ప సిద్ధాంతాయుధంగా ఉపయోగపడింది: "మానవ హక్కుల ప్రకటన"[49] అదే మాతృకను సమకూర్చిపెట్టింది.

ఫ్రెంచి మహావిప్లవం బూర్జువావర్గంయొక్క మూడవ తిరుగుబాటు; కాని మతం అనే ముసుగును పూర్తిగా విసర్జించిన, బాహాటమైన రాజకీయ పునాదిపై జరిగిన మొట్ట మొదటి తిరుగుబాటు అది. అంతేకాదు. పోరాటంలో పాల్గొన్న ఒక పక్షం — ప్రభువర్గీయులు — పూర్తిగా నిర్మూలింపబడి రెండవ పక్షం — బూర్జువావర్గం — పూర్తిగా విజయం సాధించిన మొదటి తిరుగుబాటు అది. ఇంగ్లండులో అలా జరగలేదు. అక్కడ విప్లవానికి పూర్వం వున్న సంస్థలూ, విప్లవానంతర సంస్థలూ తర్వాత కూడా కొనసాగాయి: భూస్వాములకు, పెట్టుబడిదార్లకు మధ్య రాజీ కుదిరింది. ఈ పరిణామం, న్యాయశాస్త్ర సంప్రదాయాలన్నీ అలాగే కొనసాగడంలో ద్యోతకమయింది, ఫ్యూడల్ న్యాయశాస్త్ర రూపాలు మత పరంగా పరిరక్షించబడ్డాయి. కాని ఫ్రాన్స్‌లో విప్లవం గత సాంప్రదాయాలను సమూలంగా తుడిచిపెట్టింది: ఫ్యూడల్ వ్యవస్థలోని చిట్టచివరి అవశేషాలను అది నిర్మూలించింది; Code civil[50] ప్రాచీన రోమన్ న్యాయశాస్త్రాన్ని ఆధునిక పెట్టుబడిదారీ పరిస్థితులకు అత్యద్భుతంగా సమన్వయించింది (రోమన్ న్యాయశాస్త్రం మార్క్స్ చెప్పిన వర్తకపు సరకుల ఉత్పత్తి అనే ఆర్థిక దశకు అనుగుణమైన న్యాయశాస్త్ర సంబంధాలను ఎంతో సమగ్రంగా వ్యక్తంచేసింది). ఎంత అద్భుతంగా సమన్వయించిందంటే, ఫ్రెంచి సివిల్‌కోడ్ యితర దేశాలన్నిటిలోనూ — ఇంగ్లండ్‌తోసహా — ఆస్తికి సంబంధించిన న్యాయశాస్త్ర సంస్కరణలన్నిటికీ నమూనాగా ఉపయోగపడుతోంది. అయితే, మన మొక విషయం మరచిపోకూడదు. అదేమిటంటే, ఇంగ్లీషు న్యాయశాస్త్రం పెట్టుబడిదారీ సమాజంలోని ఆర్థిక సంబంధాలను యిదివరకటి అనాగరిక ఫ్యూడల్ పరిభాషలోనే యింకా వ్యక్తంచేస్తూంది; ఆ పరిభాష తను వ్యక్తంచేసే విషయాలకు ఎంత అనుగుణమైనట్టిదంటే, ఇంగ్లీషు భాషలో ఉచ్చారణకు ఎంత అనుగుణంగా అక్షరక్రమం — ఒక ఫ్రెంచివాడు అన్నట్టు vous écrives Londres et vous prononcez Constantinople* మాదిరిగా — ఉంటుందో, అలాగే వుంటుంది. అదే సమయంలో ఇంగ్లీషు న్యాయశాస్త్రం ఒక్కటే ప్రాచీన జర్మన్ స్వేచ్ఛలలో అత్యుత్తమమైనదాన్నీ, — వ్యక్తి స్వేచ్ఛనూ, స్థానిక స్వపరిపాలననూ, న్యాయస్థానాలు తప్ప మరెవరూ వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించరాదనే సూత్రాన్నీ — అనేక శతాబ్దాలవరకు కాపాడింది; అమెరికాకూ, వలసదేశాలకూ వాటిని అందజేసింది. యూరపులో నిరంకుశ రాజుల పరి

---

*లండన్ అని రాసి — కాన్‌స్టాంటినోపిల్ అని చదివే. — సం.

పాలనకింద యీ సూత్రాలు పటాపంచలు చేయబడ్డాయి; అవి యింతవరకు ఏ దేశంలోనూ పూర్తిగా పునరుద్ధరింపబడలేదు.

బ్రిటిష్ బూర్జువావర్గంవైపు మళ్లీ మన దృష్టిని సారిద్దాం. ఫ్రెంచి విప్లవం ఫలితంగా యూరపులోని రాచరిక ప్రభుత్వాల సహాయంతో ఫ్రెంచివారి సముద్ర వ్యాపారాన్ని నాశనంచేసేందుకూ, ఫ్రెంచి వలసలను స్వాధీనం చేసుకునేందుకూ, సముద్ర వ్యాపారంలో ఫ్రెంచివారి పోటీ ఏ మాత్రం మిగలకుండా చేసుకోడానికీ బ్రిటిష్ బూర్జువావర్గానికి గొప్ప అవకాశం లభించింది. ఇంగ్లీషు బూర్జువావర్గం ఫ్రెంచి విప్లవాన్ని ప్రతిఘటించేందుకు యిదొక కారణం. మరొక కారణం ఏమంటే, ఫ్రెంచి విప్లవ పద్ధతులు ఇంగ్లీషు బూర్జువా వర్గానికి బొత్తిగా నచ్చవు: "జుగుప్స" కలిగించే దౌర్జన్యకాండ ఒక్కటే కాదు; అసలు బూర్జువా వర్గ పాలనను తెగేదాకా లాగే ప్రయత్నమే వారికి కంటగింపయింది. బ్రిటిష్ బూర్జువా లకు యీనాడున్న ఆచారాలూ, అలవాట్లూ నేర్పింది ప్రభువర్గీయులు; ఫ్యాషన్లు కనుగొన్నది ప్రభువర్గీయులు; దేశంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సైనిక ఆఫీసర్లను సమకూర్చింది ప్రభువర్గీయులు; వలసదేశాలను స్వాధీనం చేసుకొనేందుకూ, విదేశాలలో కొత్త మార్కెట్లను సంపాదించటానికీ నౌకా ఆఫీసర్లను సమకూర్చింది ప్రభువర్గీయులు. అట్టి ప్రభువర్గీయులు లేకుండా బ్రిటిష్ బూర్జువావర్గం ఏమి చెయ్యాలి? బ్రిటిష్ బూర్జువా వర్గంలో అభ్యుదయ భావాలుగల కొందరు అల్పసంఖ్యాకులు లేకపోలేదు. రాజీవల్ల వారి ప్రయోజనాలు సరిగా కాపాడబడలేదు. వీరు ప్రధానంగా అర్థబలం తక్కువయిన మధ్య తరగతికి చెందినవారు. వీరు ఫ్రెంచి విప్లవాన్ని అభిమానించినమాట నిజమే కాని, పార్లమెంటులో వీరికి బలంలేదు.

ఈవిధంగా, భౌతికవాదం ఫ్రెంచి విప్లవంయొక్క సిద్ధాంతం కాగా, దైవభీతిగల బ్రిటిష్ బూర్జువావర్గం మతాన్ని మరింత గాఢంగా ఆలింగనం చేసుకుంది. ప్రజల్లో మత ప్రవృత్తి నశిస్తే ఏమి జరుగుతుందో పారిస్‌లో జరిగిన భయానక పాలన[51] రుజువు చేయలేదా? భౌతికవాదం ఫ్రాన్సునుంచి పొరుగు దేశాలకు వ్యాపించినకొద్దీ, అలాంటి యితర సిద్ధాంత ధోరణులద్వారా — ముఖ్యంగా జర్మన్ తత్వశాస్త్రంద్వారా — అది కొత్త బలాన్ని సంపాదించుకున్నకొద్దీ, యూరపులో భౌతికవాదం, స్వతంత్రసమాలోచనా సంస్కారవంతులకు సహజలక్షణాలయేకొద్దీ బ్రిటిష్ మధ్యతరగతి మరింత గాఢంగా అనేక రకాలైన మత ధోరణులతో పెనవేసుకుపోయింది. ఈ మత ధోరణులు ఒక దాని కొకటి భిన్నంకావచ్చు. అయినా, అవన్నీ స్పష్టమైన మత ధోరణులే, క్రైస్తవమత ధోరణులే.

ఫ్రాన్స్‌లో విప్లవం బూర్జువావర్గానికి రాజకీయాధికారం సంపాదించిపెట్టినట్లే, ఇంగ్లండ్‌లో వాట్, ఆర్క్‌రైట్, కార్ట్‌రైట్, మొదలైనవారు పారిశ్రామిక విప్లవాన్ని కొనితెచ్చారు — అది ఆర్థికాధికారాన్ని ఒక వర్గం చేతుల్లోనుంచి లాక్కొని మరొక వర్గం

చేతుల్లో పెట్టింది. బూర్జువావర్గపు సంపద భూస్వామ్యప్రభువుల సంపదకంటె చాల వేగంగా పెరిగింది. బూర్జువావర్గంలో సైతం ధనిక ప్రభువర్గం, బ్యాంకర్లు, మొదలైన వారు కార్ఖానా యజమానులచే అంతకంతకు వెనక్కు నెట్టివేయబడ్డారు. 1689లో జరిగిన రాజీ క్రమక్రమంగా బూర్జువావర్గాని కనుకూలంగా మారినప్పటికీ, ఆయా వర్గాల బలాబలాలకు అది అనుగుణంగా లేదు. ఆ వర్గాల స్వభావం కూడా మార్పుచెందింది. 1830 నాటి బూర్జువావర్గానికీ, అంతకుముందు శతాబ్దపు బూర్జువావర్గానికీ చాలా వ్యత్యాసం వుంది. ప్రభువర్గీయులు తమ చేతుల్లోవున్న రాజకీయాధికారాన్ని కొత్తగా తలయెత్తిన పారిశ్రామిక బూర్జువావర్గానికి వ్యతిరేకంగా ఉపయోగించారు; ఈ రాజకీయాధికారం నూతన ఆర్థిక ప్రయోజనాల కనుగుణమైనట్టిది కాదు. ప్రభువర్గీయులతో మరొక పోరాటం అవసరమైంది. ఆ పోరాటంలో నూతన ఆర్థికాధికారమే విజయాన్ని సాధించ గలిగింది. దానికి చాలా ప్రతిఘటన వచ్చినప్పటికీ 1830నాటి ఫ్రెంచి విప్లవ ప్రభావంతో సంస్కరణ చట్టమొకటి[52] చేయబడింది. ఆ సంస్కరణ చట్టంవల్ల బూర్జువావర్గం పార్లమెంటులో గణనీయమైన, బలమైన స్థానం సంపాదించింది. ఆ తర్వాత ధాన్యపు చట్టాలు[53] రద్దుచేయబడ్డాయి. దానితో భూస్వాములపై బూర్జువావర్గం ఆధిక్యత, ముఖ్యంగా పారిశ్రామిక యజమానుల ఆధిక్యత, స్థిరపడిపోయింది. ఇది బూర్జువావర్గం సాధించిన విజయా లన్నిటికంటె పెద్దది. అయితే, కేవలం దాని ప్రయోజనాలే లక్ష్యంగా గల చిట్టచివరి విజయం కూడా యిదే. ఆతర్వాత బూర్జువావర్గం అనేక విజయాలు సాధించినప్పటికీ, మరొక నూతన సామాజిక శక్తికీ, మరొక నూతన వర్గానికీ అందులో వాటా యివ్వవలసివచ్చింది. అది మొదట మిత్రవర్గంగా ఉండేది, కాని త్వరలోనే శత్రు వర్గంగా మారింది.

పారిశ్రామిక విప్లవం పెద్ద పారిశ్రామిక పెట్టుబడిదారుల్నే కాక, అంతకంటె చాల పెద్ద సంఖ్యలో మరొక వర్గాన్ని కూడా సృష్టించింది. అదే పారిశ్రామిక కార్మికవర్గం. పారిశ్రామిక విప్లవం ఒక్కొక్క ఉత్పత్తి శాఖను స్వాధీన మొనర్చుకొనే కొద్దీ, పారిశ్రామిక కార్మికుల సంఖ్య పెరుగుతూ వచ్చింది, వారి బలం కూడా ఆ నిష్పత్తిలోనే పెరిగింది. కార్మికులు సంఘాల్లో చేరకూడదనే చట్టాలను[54] పార్లమెంటుచేత – దానికి యిష్టంలేకపోయినా – రద్దుచేయించి, కార్మికులు తమ ఆ బలాన్ని 1824లోనే రుజువుచేసుకున్నారు. పై సంస్కరణకోసం ఆందోళన జరిగే రోజుల్లో కార్మికులు సంస్కరణ పార్టీలో అతివాద పక్షంగా వుండేవారు. 1832 చట్టం ప్రకారం ఓటింగు హక్కు లేకుండా వారిని మిన హాయించినప్పుడు తమ కోర్కెలను వారు ప్రజా కోర్కెల పత్రంలో[55] రూపొందించారు: ధాన్యపు చట్టాలకు వ్యతిరేకమైన పెద్ద బూర్జువా పార్టీ[56]కి ప్రతిగా వారొక స్వతంత్ర పార్టీని

స్థాపించుకొన్నారు. అదే చార్టిస్టు పార్టీ.[57] ఆధునిక యుగంలో మొట్టమొదటి కార్మిక వర్గ పార్టీ అదే.

ఆ తర్వాత, 1848 ఫిబ్రవరిలోను, మార్చిలోను యూరపులో విప్లవాలు జరిగాయి. వాటిలో కార్మికులు, ముఖ్యంగా పారిస్ కార్మికులు, ఎంత ప్రధానమైన పాత్ర నిర్వహించారంటే, వారు ప్రకటించిన కోర్కెలు పెట్టుబడిదారీ సమాజందృష్ట్యా ఏమాత్రం అంగీకరించజాలనివి. ఆ తర్వాత అభివృద్ధినిరోధక శక్తులు సర్వత్రా తాండవించాయి. మొదట చార్టిస్టులు 1848 ఏప్రిల్ 10న ఓడింపబడ్డారు.[58] తర్వాత 1848 జూన్‌లో పారిస్ కార్మికుల తిరుగుబాటు అణచివేయబడింది. ఆ తర్వాత 1849లో ఇటలీ, హంగరీ, దక్షిణ జర్మనీలలో పరాజయాలు సంభవించాయి. చివరకు 1851 డిసెంబరు 2వ తేదీన లూయీ బోనపార్ట్ పారిస్‌లో విజయ పతాకాన్నెగురవేశాడు.[59] కొంతకాలం కార్మికుల కోర్కెల "పీడ" వదిలింది. కాని అందుకు ఎంత మూల్యం చెల్లించుకోవలసివచ్చింది! సామాన్య ప్రజల్ని మత మౌఢ్యంలో అట్టేపెట్టివుంచడం అవసరమని ఇదివరకే బ్రిటిష్ బూర్జువాలు గ్రహించినట్లైతే ఈ అనుభవాలన్నిటి తర్వాత ఆ అవసరాన్ని వారింకా ఎంత ఎక్కువగా గ్రహించి వుంటారు! యూరపులో తమ వర్గసోదరులు యెంత వెక్కిరించినా లెక్కచేయక, బ్రిటిషు బూర్జువాలు కింది తరగతుల్లో క్రైస్తవ ప్రచారం జరపటానికి ఏటా వేలూ, లక్షలూ ఖర్చుచేయసాగారు. తమ దేశంలోని మత ప్రచారక యంత్రంతోనే సంతృప్తిచెందక బ్రదర్ జొనాథన్[60] సహాయాన్ని కూడా వారు కోరారు. మతాన్నొక వ్యాపారంగా ఆర్గనైజు చేసినవారిలో బ్రదర్ జొనాథన్ అధికుడు. ఆవిధంగా బ్రిటిషు బూర్జువావర్గం అమెరికా నుంచి రివైవలిజం మూడి, సంకే లాంటివాటిని[61] దిగుమతి చేసుకొంది; సాల్వేషన్ ఆర్మీ యొక్క ప్రమాదకరమైన సహాయాన్ని కూడా వారు స్వీకరించారు. ఈసంస్థ ప్రాచీన క్రైస్తవ మతాన్ని తిరిగి వ్యాప్తిలోకి తెచ్చింది. పేదల్ని అది దేవదూతలుగా పరిగణించి, వారికి ఉపదేశాలు చేస్తుంది; పెట్టుబడిదారీ విధానాన్ని మతరీత్యా ఖండిస్తుంది. ఆవిధంగా ప్రాచీన క్రైస్తవమతంలో ఒక అంశంగావున్న వర్గవైషమ్యాన్ని అది ప్రోత్సహిస్తుంది. కాబట్టి సాల్వేషన్ ఆర్మీకోసం డబ్బు ఖర్చుపెట్టే ఐశ్వర్యవంతులకు అది ముందు ముందు కష్టాలు తెచ్చిపెట్టవచ్చు.

మధ్యయుగాల్లో ఫ్యూడల్ ప్రభువర్గీయులు రాజ్యాధికారాన్ని పూర్తిగా తమ చేతుల్లో ఉంచుకొన్నట్లు, బూర్జువావర్గం యూరపులోని ఏ దేశంలోనూ దాన్ని కొంతకాలమైనా పూర్తిగా తమ చేతుల్లో ఉంచుకోలేకపోవడం చారిత్రక పరిణామంలో ఒక నియమమా అన్నట్లు కనిపిస్తుంది. ఫ్యూడలిజం పూర్తిగా రద్దుచేయబడిన ఫ్రాన్సులో సైతం బూర్జువావర్గం మొత్తంగా ప్రభుత్వాన్ని తన పూర్తి కంట్రోలులో ఉంచుకొన్నది బహు కొద్ది వ్యవధుల్లోనే. లూయీ ఫిలిప్ పాలనలో (1830–48), బూర్జువావర్గంలో

ఒక భాగం మాత్రమే రాజ్యాన్ని పరిపాలించింది; అధికభాగం చాలా కఠినమైన ఓటింగు నిబంధనలవల్ల ఓటింగుహక్కు పొందలేదు. రెండవ రిపబ్లిక్‌లో (1848–51) బూర్జువా వర్గమంతా అధికారంలో వున్నప్పటికీ, అది మూడేండ్లే; దాని అశక్తతవల్ల రెండవ సామ్రాజ్యం అవతరించింది. ఈనాడు మూడవ రిపబ్లిక్‌లో మాత్రమే బూర్జువావర్గమంతా 20 సంవత్సరాలకంటె ఎక్కువగా అధికారంలో వుంది; కాని అప్పుడే దాని పతనావస్థయొక్క చిహ్నాలు కనిపిస్తున్నాయి. అమెరికావంటి దేశాల్లో మాత్రమే బూర్జువావర్గం స్థిరంగా చాలకాలం అధికారంలో వుండగల్గింది. అయితే ఆ దేశాల్లో ఫ్యూడలిజం యెప్పుడూ లేదు; బూర్జువా సంబంధాల ప్రాతిపదికపైననే అక్కడ సమాజం ప్రారంభమయింది. అట్టి అమెరికా, ఫ్రాన్సు దేశాల్లో సైతం బూర్జువావర్గానికి వారసులైన వారు, అంటే కార్మికులు, అప్పుడే తలుపు తట్టుతున్నారు.

ఇంగ్లండ్‌లో బూర్జువావర్గం యెప్పుడూ ఏకైక పాలకవర్గంగా లేదు. 1832లో లభించిన విజయం తర్వాత కూడా, ఫ్యూడల్ ప్రభువర్గీయులు ప్రభుత్వంలో కీలక స్థానాలన్నిటినీ తమ చేతుల్లోనే ఉంచుకొన్నారు. ధనవంతులైన మధ్యతరగతివారు ఎందువల్ల యీ పరిస్థితిని సహించి ఊరుకొన్నారో లిబరల్ పార్టీకి చెందిన గొప్ప పారిశ్రామికవేత్త డబ్ల్యు. ఫోర్‌స్టర్ చెప్పిన మాటలవల్లగాని నాకు అర్థంకాలేదు. అతడొక బహిరంగసభలో ఉపన్యసిస్తూ, బ్రాడ్‌ఫర్డ్ యువకులకు ఫ్రెంచి భాష నేర్చుకోవలసిందని సూచించాడు; ప్రపంచంలో వృద్ధిలోకి రావడానికది మార్గమని అతడు చెప్పాడు. మంత్రివర్గంలో సభ్యుడుగా వుంటూ తాను సంపాదించిన అనుభవాన్ని వారి దృష్టికి తెచ్చాడు. తానెవరెవరి మధ్య తిరగవలసివచ్చేదో ఆ సంఘంలో ఫ్రెంచిభాష దాదాపు ఇంగ్లీషుతో సమానంగా అవసరమయేదనీ, కాని అది రాకపోవడంచేత బిడియంగా బెదురుబెదురుగా కనపడేవాణ్ణనీ అతడు చెప్పాడు. అసలు విషయమేమంటే, ఆ రోజుల్లో ఇంగ్లీషు మధ్యతరగతివాళ్లందరూ బొత్తిగా విద్యాహీనులైన నడమంత్రపు శ్రీమంతులు; ప్రభుత్వంలోని ఉన్నత పదవులన్నిటినీ వారు ప్రభువర్గీయులకు విడిచిపెట్టడం తప్ప వేరుమార్గం లేకపోయింది. ఆ పదవుల్లో ఉండే వారికి సంకుచిత జాతీయాభిమానం, స్వాతిశయం, వ్యాపార నైపుణ్యం మాత్రమే సరిపోవు; యితర అర్హతలు కూడా ఉండాలి.* ఇప్పటికీ మధ్యతరగతుల విద్యను గురించి వార్తాపత్రికల్లో

---

*వ్యాపార విషయాలలో సైతం జాతీయ దురహంకారం మంచి సలహాదారు కాదు. నిన్న మొన్నటివరకు ఇంగ్లీషు పౌరుడు తన భాష తప్ప మరొకటి మాటాడ్డం అవమానకరంగా సాధారణ ఇంగ్లీషు పారిశ్రామికవేత్త భావించేవాడు. ఇంగ్లండ్‌లో నివాసమేర్పరచుకొన్న విదేశీ "దౌర్భాగ్యులు" తన సరకులను విదేశాలలో అమ్మే బండచాకిరీ తమమీద వేసుకొన్నందుకు అతడు గర్వపడేవాడు. ఆ విదేశస్థులే, ముఖ్యంగా జర్మన్లు బ్రిటిష్ విదేశీ వ్యాపారంలో

అనవరతంగా ప్రచురింపబడే వాద – ప్రతివాదాలను చూస్తే, యిప్పటికీ ఇంగ్లీషు మధ్యతరగతి అత్యుత్తమమైన విద్య నభ్యసించడానికి తానింకా అర్హత సంపాదించలేదనీ, సంసారపక్షమైన విద్య తనకు సరిపోతుందనీ భావిస్తున్నట్లు స్పష్టమవుతుంది. ఈవిధంగా ధాన్యపు చట్టాలు రద్దుచేయబడిన తర్వాత కూడా, అఖండ విజయాలు సాధించిన కాబ్డెన్‌లు, బ్రైట్‌లు, ఫోర్‌స్టర్‌లు తదితరులు ప్రభుత్వాధికారంనుంచి దూరంగా ఉంచబడ్డం మామూలు విషయంగా కనబడింది. 20 సంవత్సరాల తర్వాత మరో కొత్త సంస్కరణ చట్టం[62] చెయ్యబడ్డాకనే వారికి మంత్రివర్గంలో స్థానం దొరికింది. ఇంగ్లీషు బూర్జువాలలో సాంఘికంగా తాము అల్పులమనే భావం ఎంత లోతుగా జీర్ణించిపోయి ఉందంటే, వారు సొంత ఖర్చులతోను, దేశం ఖర్చులతోను అలంకారప్రాయమైన సోంబేర్ల కులాన్నొకదాన్ని పోషిస్తున్నారు. ప్రభుత్వ శుభకార్యా లన్నిటిలోనూ యీ సోంబేర్లే బహుసొంపుగా జాతికి ప్రాతినిధ్యం వహిస్తూ ఉంటారు. తమలో ఎవరైనా ప్రత్యేక విశేషాధికారయుతమైన సంస్థలోకి (ఇది కూడా వారు తయారుచేసిందే) ప్రవేశించే అర్హత ఉన్నట్లు గుర్తింపబడితే, తమ కెంతో గౌరవం లభించినట్లు వారు ఉబ్బితబ్బిబ్బవుతారు.

అందుచేత, మరొక పోటీదారైన కార్మికవర్గం రంగంమీద ప్రవేశించేటప్పటికి పారి

---

చాలా భాగాన్ని – ఎగుమతీ, దిగుమతీ కూడా – హస్తగతం చేసుకుంటున్నారని అతడు గమనించలేదు. ఇంగ్లీషువారి ప్రత్యక్ష విదేశ వ్యాపారం యించుమించు పూర్తిగా చైనా, అమెరికా, దక్షిణ అమెరికాలవంటి వలస దేశాలకే పరిమితమయిందని కూడా అతడు గ్రహించలేదు. ఈ జర్మనులే విదేశాలలోని జర్మన్లతో వ్యాపారంచేస్తూ క్రమంగా మొత్తం ప్రపంచంలో వ్యాపార వలసల పూర్తి వలయాన్నొకదాన్ని నిర్మించుకొంటున్నారని కూడా అతడు గమనించలేదు. కాని 40 సంవత్సరాలక్రిందట ఆ జర్మనీయే ఎగుమతుల కోసం సరుకులు తయారుచేయడానికి తీవ్ర ప్రయత్నం ప్రారంభించినప్పుడు యీ వ్యాపార వలయం ఆ దేశానికెంతో ఉపకరించింది. అతి శీఘ్రకాలంలో జర్మనీ ఆహారధాన్యాలను ఎగుమతిచేసే స్థితినుంచి అగ్రశ్రేణికి చెందిన పారిశ్రామిక దేశంగా పరివర్తనచెందింది. ఆ తర్వాత 10 సంవత్సరాలక్రిందట, బ్రిటిష్ పారిశ్రామికవేత్తలు హడలెత్తి తమ కొనుగోలుదార్ల నందరినీ ఎందువల్ల నిలుపుకోలేకపోతున్నామని తమ రాయబారుల్నీ, వాణిజ్య ప్రతినిధుల్నీ ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు ఏకగ్రీవంగా వచ్చిన సమాధానం యిది. (1) మీరు మీ కొనుగోలుదార్ల భాష నేర్చుకోలేదు; మీ భాషలో అతడు మాట్లాడాలని కోరుతున్నారు; (2) మీ కొనుగోలుదార్ల కోర్కెలు, అలవాట్లు, అభిరుచులు ఏమిటో తెలుసుకొని వాటి కనుగుణంగా నడచుకోవడానికి మీరు ప్రయత్నించనైనా ప్రయత్నించరు: పైగా మీ ఇంగ్లీషు అలవాట్లు, అభిరుచులకు అనుగుణంగా వారు నడచుకోవాలని ఆశిస్తారు. (ఎంగెల్స్ వివరణ.)

శ్రామిక, వాణిజ్య మధ్యతరగతులు ఫ్యూడల్ ప్రభువర్గీయుల్ని యింకా పూర్తిగా రాజకీయాధికారంనుంచి గెంటివేయలేదు. చార్టిస్టు ఉద్యమం తర్వాత, యూరపియన్ విప్లవాల తర్వాత, 1848–66 మధ్య ఇంగ్లీషు వాణిజ్యం అపారంగా విస్తరించిన తర్వాత (ఇది కేవలం స్వేచ్ఛావ్యాపారం వల్లనే జరిగిందని వక్రంగా చిత్రిస్తూవుంటారు, కాని అంతకంటె ముఖ్యమైన కారణం రైల్వేలు, సముద్రాంతర స్టీమర్లు, మొత్తం రవాణా మార్గాలు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందడం) అభివృద్ధినిరోధక శక్తులు విజృంభించడంవల్ల చార్టిస్టు ఉద్యమానికి పూర్వం మాదిరిగా లిబరల్ పార్టీలో అతివాద విభాగమైన కార్మికవర్గం, మళ్లీ లిబరల్ పార్టీ ప్రాబల్యంక్రిందికి నెట్టబడింది. కాని ఓటింగ్ హక్కుకై బ్రిటిష్ కార్మికుల ఆందోళన క్రమంగా అప్రతిహతమయింది. లిబరల్ పార్టీయొక్క విగ్[63] నాయకులు "దిగజారగా," డిజ్రాయెలీ ఆ అనుకుల క్షణాన్ని వినియోగించుకుని, టోరీలు[64] అనుకూలమైన సమయం చూచి పట్టణాలలో కుటుంబ ప్రాతిపదికపై ఓటింగు హక్కు యిచ్చేటట్లు, నియోజకవర్గాలను పునర్విభజించేటట్లూ చెయ్యడంద్వారా తన ఆధిక్యతను ప్రదర్శించుకొన్నాడు. తర్వాత ఆ ఓటింగు హక్కు వచ్చింది. ఆ తర్వాత 1884లో కుటుంబ ప్రాతిపదికపై ఆ ఓటింగు హక్కు కౌంటీలకు కూడా విస్తరింపబడింది; నియోజకవర్గాలు మళ్లీ విభజింపబడ్డాయి; తత్ఫలితంగా అవి కొంతవరకు సమానం చేయబడ్డాయి. వీటన్నిటివల్లా కార్మికుల ఓటింగు శక్తి గణనీయంగా పెరిగింది. దానివల్ల కనీసం 150నుంచి 200 నియోజకవర్గాల్లో నేడు కార్మిక ఓటర్లే మెజారిటీలో ఉన్నారు. కాని, సంప్రదాయం పట్ల గౌరవాన్ని బోధించే విషయంలో పార్లమెంటరీ వ్యవస్థ ఒక అద్భుతమైన శిక్షణాలయం. లార్డు జాన్ మేనెర్స్ సరదాగా "మన పాత ప్రభువర్గీయులు" అని పిలిచిన ఫ్యూడల్ ప్రభువర్గంపట్ల మధ్యతరగతిపట్ల ఎంతో గౌరవమర్యాదలతో మెలుగుతూవుండగా, కార్మికజన సామాన్యంలో అత్యధిక సంఖ్యాకులు, "తమకన్న అధికులు"గా పిలువబడుతూవుండిన మధ్యతరగతివారిని మర్యాదామన్ననలతో చూసేవారు. నిజం చెప్పాలంటే, దాదాపు 15 సంవత్సరాలనాటి బ్రిటిష్ కార్మికుడు ఆదర్శ కార్మికుడుగా ఉండేవాడు. అతడు తన యజమానియొక్క హోదాను ఎంతో గౌరవించేవాడు; తనకు కొన్ని హక్కులు కావాలని కోరడంలో నమ్రత ప్రదర్శించేవాడు. జర్మన్ కార్మికుల ముదిరిపోయిన విప్లవధోరణినీ, కమ్యూనిస్టు పోకడలనూ చూసి కథీడర్ సోషలిస్టు[65] సంప్రదాయానికి చెందిన జర్మన్ ఆర్థికవేత్తలు చికాకు చెందేవారు. వారు బ్రిటిష్ కార్మికుల నమ్రతకు సంతృప్తి చెందేవారు.

కాని, ఇంగ్లీషు మధ్యతరగతివారు, చక్కటి వ్యాపారస్తులు గనుక, జర్మన్ ప్రొఫెసర్లకంటె ఎక్కువ దూరదృష్టిని ప్రదర్శించారు. అయిష్టంగానే అయినా వారు కార్మికవర్గంతో కలిసి అధికారాన్ని పంచుకొన్నారు. దారుఢ్యం గలిగిన ఆ దుష్టబాలుడు – అంటే ప్రజలు –

ఎంత శక్తివంతులో చార్టిస్టుల కాలంలో వారు తెలుసుకున్నారు. ఆనాటినుంచీ పరిస్థితుల ఒత్తిడివల్ల వారు ప్రజా కోర్కెల పత్రంలోని ఉత్తమ భాగాలన్నిటినీ బ్రిటిష్ చట్టాల్లో చేర్చవలసివచ్చింది. మరి వారు నైతికసాధనాలద్వారా ప్రజల్ని అదుపులో పెట్టాలంటే ఇప్పుడూ, యికముందూ కూడ అత్యంత ప్రధానమైన సాధనం మతమే. కనుకనే, స్కూళ్ల కమిటీలలో మతగురువుల మెజారిటీ వుంది; కనుకనే బూర్జువావర్గం మత కర్మకాండ[66] లగాయతు సాల్వేషన్ ఆర్మీవరకు సకలవిధాలైన రివైవలిజాన్ని పునరుద్ధరించేందుకూ తమపై తాము అంత కంతకు అధికంగా పన్నులు విధించుకొంటున్నారు.

ఈరోజున బ్రిటిష్ మర్యాదస్తులు యూరపియన్ బూర్జువాల స్వతంత్ర ఆలోచనపైన, మత పరమైన సడలుబాటుపైన విజయం సాధించారు. ఫ్రెంచి కార్మికులు, జర్మన్ కార్మికులు తిరుగుబాటుతత్వం అలవరచుకొన్నారు. సోషలిజం వారిని అంటుజాడ్యంలా పట్టుకొంది; సకారణంగానే, తమ ఆధిక్యతను స్థాపించుకొనేందుకు చట్టబద్ధపద్ధతులే అవలంబించాలన్న పట్టింపు వారికేమీ లేదు. దారుఢ్యంగల బాలుడు నానాటికీ దుష్టుడైపోతున్నాడు. ఫ్రెంచి, జర్మన్ బూర్జువాలు గత్యంతరంలేక స్వతంత్ర సమాలోచనను చల్లగా విడిచిపెట్టవలసి వచ్చింది. చుట్ట నోట్లో పెట్టుకొని గర్వంతో విర్రవీగుతూ ఓడయెక్కిన ఒక యువకుడు వాంతులూ, వికారం ఆవహించగానే నిశ్శబ్దంగా ఆ చుట్టను పారవేస్తాడు. ఆ స్థితిలో వున్నారు ఫ్రెంచి, జర్మన్ బూర్జువాలు. దూషకులంతా ఒక్కొక్కరే పై చూపులకు మతావలంబకులయారు; క్రైస్తవ పీఠాన్ని గురించీ, దాని సిద్ధాంతాలను గురించీ, మతకర్మకాండ గురించీ భక్తితో మాట్లాడసాగారు; తప్పనిసరి అయినప్పుడు వాటిని ఆచరించారు కూడా. ఫ్రెంచి బూర్జువాలు శుక్రవారంనాడు మాంసం వర్జించి లఘు భోజనం ప్రారంభించారు. జర్మన్ బూర్జువాలు ఆదివారంనాడు చర్చిలో చాలసేపు బెంచీలమీద కూర్చొని ప్రొటెస్టెంట్ బోధలు వినసాగారు. భౌతికవాదం వారి దుంప తెంచింది. "Die Religion muss dem Volk erhalten werden" ("ప్రజలకోసం మతాన్ని కాపాడాలి") – సమాజాన్ని వినాశంనుంచి కాపాడేందుకు అదొక్కటే వారికి అంతిమ శరణ్యమైంది. కాని వారి దురదృష్టం ఏమంటే, మతాన్ని శాశ్వతంగా కూలదోసేందుకు తమ శక్తియుక్తులన్నిటినీ ఉపయోగించిన తర్వాతగాని ఈ విషయం వారు కనిపెట్టలేకపోయారు. ఇప్పుడు వారిని వెక్కిరించడం బ్రిటిష్ బూర్జువాల వంతు అయింది. వారిలా అంటున్నారు: "ఓ మూర్ఖుల్లారా, మేమీ విషయం రెండువందల సంవత్సరాలకిందటే మీకు చెప్పి వుండేవారం!"

అయితే, బ్రిటిష్వారి మతగాంభీర్యంగాని, యూరపియన్ బూర్జువాల post festum*

---

*ఆలస్యంగా. – సం.

మత భావాలుగాని నానాటికీ విజృంభిస్తున్న కార్మికోద్యమ వెల్లువను అడ్డుకోలేవని నా అభిప్రాయం. సంప్రదాయం పెద్ద అడ్డుకట్ట లాంటిదనే విషయం నిజమే; చారిత్రకగతిని అది మందగింపజేస్తుంది. కాని అది జడ స్వభావం గలది; అందుచేత అది భంగం చేయబడక తప్పదు అందుకని మతం పెట్టుబడిదారీ సమాజాన్ని శాశ్వతంగా నిలబెట్టి వుంచలేదు. న్యాయ సూత్రాలు, తాత్విక భావాలు, మత విశ్వాసాలు ఒకానొక సమాజంలోని ఆర్థిక సంబంధాలనుంచి తరతమ స్థాయిల్లో పరోక్షంగా ఉత్పన్నమయేవే. అటువంటప్పుడు, యీ భావాలు ఆర్థిక సంబంధాల్లో పూర్తి మార్పువల్ల కలిగే ఫలితాలను ఉత్తరోత్తరా అడ్డుకోలేవు. లోకాతీతశక్తుల్లో మనకు నమ్మకం ఉంటేతప్ప పతనమవుతూన్న ఒక సమాజాన్ని ఏ మత సూత్రాలూ నిలబెట్టి వుంచలేవని అంగీకరించాల్సివుంటుంది.

వాస్తవానికి ఇంగ్లండ్‌లో కూడా కార్మిక ప్రజలు మళ్లీ కదలనారంభించారు. వారు అనేకరకాలైన సంప్రదాయాల్లో బంధింపబడి వున్న మాట నిజమే. ముఖ్యంగా బూర్జువా సంప్రదాయాలు: ఉదాహరణకు కన్సర్వేటివ్ పార్టీ, లిబరల్ పార్టీ అనే పేర్లతో రెండు పార్టీలే ఉండాలనీ, కార్మికవర్గం తన మోక్షాన్ని ఘనమైన లిబరల్ పార్టీద్వారానే సాధించుకోవాలనే అభిప్రాయం ఇంగ్లండ్‌లో విస్తృతంగా వ్యాపించి వుంది. ఇలాగే కార్మిక సంప్రదాయాలు కూడా వున్నాయి. కార్మికుల తొలి స్వతంత్ర కార్యాచరణనుంచి, తాత్కాలిక ప్రయత్నాలనుంచి అవి వారసత్వంగా వచ్చాయి. ఉదాహరణకు అనేక పాత ట్రేడ్‌యూనియన్లు క్రమబద్ధమైన తరిఫీదు లేనివారు పెట్టుకున్న దరఖాస్తులన్నింటినీ నిరాకరిస్తూ ఉంటాయి. దీని అర్థమేమంటే అలాంటి ప్రతి ట్రేడ్‌యూనియనూ పోటీకార్మికుల్ని పెంచి పోషిస్తోంది. అయినప్పటికీ, ప్రొఫెసర్ బ్రెంటనో తన సోదర కెథీడర్ సోషలిస్టులతో విలపిస్తూ చెప్పినట్లు నేడు ఇంగ్లీషు కార్మికవర్గం ముందుకు కదులుతోంది. ఇంగ్లండ్‌లోని అన్నిటిలాగే యిది కూడా నెమ్మదిగా, అడుగులో అడుగు వేసుకొంటూ కదులుతోంది; ఒకప్పుడు సందేహిస్తూ కదులుతుంది, మరొకప్పుడు యించుమించు నిరర్థకమైన, తాత్కాలికమైన ప్రయత్నాలు చేస్తుంది. అప్పుడప్పుడు సోషలిజంను మరీ ఎక్కువగా అనుమానిస్తూ నడుస్తోంది; కాని దాని మూలతత్వాన్ని క్రమంగా యిముడ్చుకొంటూంది. ఈ ఉద్యమం కార్మికుల్లో ఒక పొర తర్వాత మరొక పొరను ఆకట్టుకొంటూ విస్తరిస్తోంది. ప్రస్తుతం లండన్‌లోని ఈస్టు ఎండ్[67] ప్రాంతంలో నివసించే అనిపుణ కార్మికుల్లో అది జడత్వాన్ని నిర్మూలిస్తోంది. రెండోవైపు, యీ కొత్తశక్తులు కార్మికోద్యమాన్నెంత అద్భుతంగా ఉత్తేజపరుస్తున్నాయో మనందరికీ తెలుసు. కొందరు ఉత్సాహవంతులు ఆశిస్తున్నంత వేగంతో ఈ ఉద్యమం పురోగమించడంలేదు — నిజమే. కాని, బ్రిటిష్ సంప్రదాయాల్లో అత్యుత్తమమైన వాటిని పెంచిపోషిస్తున్నది కార్మికవర్గమేననీ, ఇంగ్లండ్‌లో గనుక ఒక అడుగు ముందుకు పడితే తర్వాత అది సాధారణంగా క్రిందికి జారదనీ యీ ఉత్సాహవంతులు జ్ఞాపకముంచుకోవాలి.

పైన చెప్పిన కారణాలవల్ల, చార్టిస్టుల పుత్రులు మనం ఆశించినట్లు ఉండకపోయినా, వారి మనుమలు మాత్రం తమ పితామహుల ప్రతిష్ఠను నిలబెట్టగలరు.

కాని, యూరపులో కార్మికుల విజయం కేవలం ఇంగ్లండ్‌మీదనే ఆధారపడి లేదు. కనీసం ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీల మధ్య సహకారం ఉన్నప్పుడే ఆ విజయం లభిస్తుంది.[68] ఫ్రాన్స్ జర్మనీలలో కార్మికోద్యమం ఇంగ్లండ్‌లోకంటె బాగా ముందుంది. జర్మనీలో అది విజయానికి కొంత దగ్గరలో కూడా వుంది. గత 25 సంవత్సరాల్లోనూ అది సాధించిన పురోగతి అనన్యసామాన్యమైనట్టిది. అంతకంతకు ఎక్కువ వేగంతో అది పురోగమిస్తోంది. జర్మన్ మధ్యతరగతి రాజకీయ శక్తియుక్తుల్లోను, క్రమశిక్షణలోను, ధైర్యంలోను, పటిష్టతలోను, పట్టుదలలోను దారుణమైన నిర్వీర్యతను ప్రదర్శించుకొంటూంటే, జర్మన్ కార్మికవర్గంలో యీ లక్షణాలు కొల్లలుగా ఉన్నాయని రుజువయింది. నాలుగు వందల సంవత్సరాల క్రిందట జర్మనీ యూరపియన్ మధ్యతరగతి తొలి విజృంభణకు నాందీవాచకం పలికింది; ప్రస్తుత పరిస్థితుల్నిబట్టి చూస్తే, ఆ దేశం యూరపియన్ కార్మికవర్గం యొక్క తొలి విజయానికి రంగస్థలంగా వుండడం కూడా సాధ్యాతీతమైన విషయమా?

ఎఫ్. ఎంగెల్స్

1892, ఏప్రిల్ 20

Frederick Engels
"Sozialism Utopian and Scientific"
London 1892, పుస్తకంలో
ప్రచురింపబడింది
రచయిత సంగ్రహ జర్మన్ అనువాదం
"Die Neue Zeit" పత్రిక, 1, 2 సంచికలలో
1892–93లో ప్రచురింపబడింది

# సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం

I

ఆధునిక సోషలిజం, దాని సారాంశంలో, నేటి సమాజంలో ఒకవైపు ఆస్తిపరులకూ, ఆస్తిహీనులకూ మధ్య, పెట్టుబడిదార్లకూ వేతన కార్మికులకూ మధ్య వున్న వర్గవైరుధ్యాలనూ, మరోవైపు ఉత్పత్తిలో వున్న అరాజకాన్నీ గుర్తించినదాని ప్రత్యక్ష పర్యవసానమే. కాని సిద్ధాంత రూపంలో, ఆధునిక సోషలిజం 18వ శతాబ్దపు ఫ్రెంచి మహా తాత్వికుల మూల సూత్రాలను మరింత తార్కికంగా విస్తరించడంవల్ల మొదట్లో ఉత్పన్నమైంది. అన్ని నూతన సిద్ధాంతాల్లాగే ఆధునిక సోషలిజం కూడా, దాని వేళ్ళు ఎంత లోతుగా పాదార్థిక ఆర్థిక పరిస్థితుల్లో పాతుకుపోయి వున్నప్పటికీ, తన ముందున్న, అదివరకే సిద్ధించి వున్న జ్ఞానసంపుటిమీద ఆధారపడవలసివచ్చింది.

రానున్న విప్లవంకోసం ఫ్రెంచి ప్రజల మనస్సుల్ని సన్నద్ధంచేసిన మహాపురుషులు స్వయంగా తీవ్ర విప్లవకారులు. ఏవిధమైన బాహ్య ప్రమాణాలనూ వారు గుర్తించ లేదు. మతాన్నీ, ప్రకృతిశాస్త్రాన్నీ, సమాజాన్నీ, రాజకీయ సంస్థల్నీ వారు నిర్దాక్షిణ్యంగా ఖండించారు; ప్రతిదీ హేతువాదం అనే న్యాయస్థానంముందు తన అస్తిత్వాన్ని రుజువుచేసు కోవాలి. లేదా తన అస్తిత్వాన్ని ఒదులుకోవాలి. హేతువాదమొక్కటే అన్నింటికీ కొలబద్ద. హేగెల్ చెప్పినట్లు ప్రపంచమంతా శిరస్సుమీద నిలబడి వున్న రోజులవి.* దీనికి రెండ

---

*ఫ్రెంచి విప్లవాన్ని గురించి హేగెల్ యిలా రాశాడు: "న్యాయాన్ని గురించిన ఆలో చన, దీన్ని గురించిన భావన, ఒక్కసారిగా రొమ్ము విరుచుకొని నిలబడింది. దీనికి వ్యతి రేకంగా పాతకాలపు అన్యాయం నిలబడలేకపోయింది. కాబట్టి న్యాయాన్ని గురించిన యీ భావన నేడొక రాజ్యాంగచట్టానికి మూలంగా ఉండాలి. ఇకమీదట ప్రతిదీ దీనిమీదనే ఆధార పడాలి. సూర్యుడు ఆకాశంలో వుంటూ గ్రహాలు సూర్యుని చుట్టూ తిరగడం ప్రారం భమయాక, మానవుడు తన శిరస్సుపై — అంటే భావంపై — నిలబడ్డ దృశ్యం, మాన

ర్థాలు: ఒక అర్థం ఏమంటే, మానవుని శిరస్సూ, దాని ఆలోచనసుంచి ఉత్పన్నమయ్యే సూత్రాలూ, మానవ ఆచరణకంతకూ, మానవ సంబంధాలన్నిటికీ మూలంగా గుర్తించాల న్నది. కాని తర్వాత దీనికొక విశేషార్థం కూడా వుంది: అది యేమిటంటే, యీ సూత్రాలకు విరుద్ధంగా వుండే వాస్తవికతను నిజంగా తలకిందులు చేయవలసి వుంటుంది. ఆనాటి ప్రతి సామాజిక రూపం, ప్రతి రాజ్య వ్యవస్థ, ప్రతి పాత సాంప్రదాయిక భావం హేతువిరుద్ధ మైనదిగా చెత్తబుట్టలో విసిరెయ్యబడింది. అంతకుపూర్వం యావత్ ప్రపంచం భ్రాంతులచేతనే నడుపబడుతూ వచ్చిందనీ, గతానికి సంబంధించిన ప్రతీదీ జాలిపడవల సినదిగా, అసహ్యించుకోదగినదిగా పరిగణించబడింది. కాని, ఇప్పుడు మొట్టమొదటి సారిగా జ్ఞానభాస్కరుడు ఉదయించాడు; హేతువాద రాజ్యం అవతరించింది. ఇకమీదట **మూఢ** నమ్మకాలు, అన్యాయం, విశేషాధికారాలు, పీడనల స్థానే శాశ్వత సత్యం, శాశ్వత న్యాయం, స్వతస్సిద్ధమైన సమానత్వం, అనుల్లంఘనీయమైన మానవ హక్కులు – ఇవి అవతరించాలి.

కాని యీ హేతువాద రాజ్యం పెట్టుబడిదారీ వర్గంయొక్క ఆదర్శీకృత రాజ్యం తప్ప మరొకటి కాదు; ఈ శాశ్వత న్యాయం బూర్జువా న్యాయశాస్త్రంలో ద్యోతకమయింది; ఈ సమానత్వం చట్టరీత్యా బూర్జువా సమానత్వమే; బూర్జువా ఆస్తి ప్రధాన మానవ హక్కులలో ఒకటిగా ప్రకటించబడింది. హేతుబద్ధమయిన పరిపాలన, అంటే రూసో ప్రతిపాదించిన సామాజిక ఒప్పందం[70] ప్రజాతంత్ర బూర్జువా రిపబ్లిక్ అవతరించింది, అలా అది మాత్రమే అవతరించగలదు. 18వ శతాబ్దపు మహా చింతనాపరులు తమకు ముందు తరాలవారి వలెనే, తమ యుగపరిధుల్ని దాటి వెళ్లలేకపోయారు.

---

సిక ప్రతిబింబాని కనుగుణంగా వాస్తవికత రూపొందించడం ఎన్నడూ దృగ్గోచరం కాలేదు. ప్రపంచాన్ని శాసించేది హేతుజ్ఞానమని మొట్టమొదట చెప్పింది అనక్సగోరస్. కాని యిప్పుడు, మొట్టమొదటిసారిగా, భావం మనోవాస్తవికతను శాసించవలసివుందని మానవుడు తెలుసు కొన్నాడు. ఇది నిజంగా ఒక అద్భుతమైన అరుణోదయం. ఆలోచనాపరులందరూ దీన్ని పర్వదినంగా పరిగణించి ఉత్సవం చేసుకున్నారు. ఆరోజుల్లో ఒక మహోన్నతమైన భావోద్రేకం ప్రజల్ని ఆకట్టుకొంది; హేతువాదంపట్ల ఉత్సాహం ప్రపంచాన్ని పరివేష్టించింది. ఈశ్వర భావం యిప్పుడు ప్రపంచంతో రాజీచేసుకుందా అనిపించింది." (హెగెల్ "చరిత్రను గురించిన తత్వశాస్త్రం," 1840, పేజి 535) కీర్తిశేషుడైన ప్రొఫెసర్ హెగెల్‌యొక్క యిట్టి ఉపదేశాలను అణచేందుకు ప్రభుత్వం సోషలిస్టు వ్యతిరేక చట్టాన్ని[69] అమలుజరప వలసిన సమయం కాదా యిది? ఎందుచేతనంటే, ఆ ఉపదేశాలు విచ్ఛిన్నాన్నీ, ప్రమాదాన్నీ తెచ్చిపెట్టేవి [ఎంగెల్స్ వివరణ].

అయితే, ఫ్యూడల్ ప్రభువర్గీయులకూ బూర్జువాలకూ (ఈ బూర్జువాలు సమాజాని కంతకూ తామే ప్రతినిధులమని చెప్పుకొన్నారు) మధ్యవున్న వైరుధ్యంతోబాటు, పీడకులకూ పీడితులకూ మధ్య, ధనికులైన సోమరులకూ, పేదలైన కార్మికులకూ మధ్య సార్వత్రిక వైరుధ్యం కూడా ఉంది. సరిగా యీ పరిస్థితివల్లనే బూర్జువావర్గ ప్రతినిధులు తామొక ప్రత్యేక వర్గానికే కాక, పీడిత ప్రజానీకాని కంతకూ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పుకోగలి గారు. అంతేకాదు బూర్జువావర్గం పుట్టుకనుంచి తన విరుద్ధశక్తి నెదుర్కోవలసివచ్చింది. అది యేమంటే వేతన కార్మికులు లేనిదే పెట్టుబడిదార్లు మనజాలరు; మధ్యయుగాల వృత్తిసంఘాలలోని మేస్త్రీలు ఆధునిక పెట్టుబడిదార్లుగా అభివృద్ధిచెందిన మేరకు ఆ వృత్తిసంఘాలలోని వృత్తిపనివారూ, బయటి రోజుకూలీలూ ఆధునిక పారిశ్రామిక కార్మి కులుగా పరిణతి చెందారు. మొత్తంమీద ఫ్యూడల్ ప్రభువర్గీయులతో బూర్జువావర్గం జరిపిన పోరాటంలో అనాటి పలు శ్రామిక బృందాల ప్రయోజనాలకు కూడా వారు ప్రాతి నిధ్యం వహిస్తామని చెప్పగలిగినప్పటికీ, ప్రతి పెద్ద బూర్జువా ఉద్యమంలోనూ కార్మికులు స్వతంత్రంగా పోరాడుతూనే వచ్చారు. వారు ఆధునిక పారిశ్రామిక కార్మికులకు పూర్వ సంతతివారు కొద్దో గొప్పో అభివృద్ధి చెందినవారు. ఉదాహరణకు, జర్మన్ సంస్కరణోద్య మంలోనూ, రైతాంగ సమరంలోనూ అనబాప్టిస్టులు[71] థామస్ మూంత్సెర్, ఇంగ్లీషు మహా విప్లవంలో లెవెలర్లు,[72] ఫ్రెంచి విప్లవంలో బబేఫ్.

ఇంకా అభివృద్ధి చెందని యీ వర్గంయొక్క విప్లవ తిరుగుబాట్ల కనుగుణంగా కొన్ని సిద్ధాంత ప్రతిపాదనలు కూడ వ్యాప్తి చెందాయి. 16, 17 శతాబ్దాలలో ఆదర్శ సమాజాన్ని గురించిన ఊహాజనిత సిద్ధాంతాలు యిలాంటివే.[73] 18వ శతాబ్దంలో మోరెల్లీ, మాబ్లీలు అసలు కమ్యూనిస్టు సిద్ధాంతాలు బోధించారు. సమానత్వంకోసం డిమాండన్నది రాజకీయ హక్కులకే పరిమితం కాకుండా, వ్యక్తులయొక్క సామాజిక పరిస్థితులకు కూడా విస్తరించింది. వర్గ విశేషాధికారాల్నే కాక, వర్గ వ్యత్యాసాల్ని సైతం రద్దుచేయాలని బోధింపబడింది. ఈ ఉపదేశాలకు ప్రప్రథమ రూపం సర్వసంగ పరిత్యాగాన్నీ, దారిద్ర్య జీవితాన్నీ బోధించే కమ్యూనిజం. ఆ తర్వాత, ముగ్గురు గొప్ప ఊహాజనిత సోషలిస్టులు ముందుకు వచ్చారు: సెంట్-సైమన్, ఈయన దృష్టిలో మధ్యతరగతి ఉద్యమానికి, కార్మిక వర్గోద్యమంతోబాటు యింకా కొంత ప్రాధాన్యం వుంది. ఫోరియర్; ఓవెన్ — పెట్టు బడిదారీ ఉత్పత్తి అత్యంతాభివృద్ధిని సాధించిన దేశంలో, దీన్నుండి ఉత్పన్నమైన వైరుధ్యాల ప్రభావంక్రింద వర్గవ్యత్యాసాన్ని తొలగించేందుకు క్రమబద్ధమైన ఫ్రెంచి భౌతికవాదం సూచించిన మాదిరి ప్రతిపాదనలను రూపొందించాడు.

పై ముగ్గురిలోనూ వున్న సమాన లక్షణం ఏమంటే, చారిత్రక గతిలో కొత్తగా ఉద్భవించిన కార్మికవర్గ ప్రయోజనాలకు వీరెవరూ ప్రాతినిధ్యం వహించలేదు. ఫ్రెంచి తత్వవేత్తలవలె

వీరు మొదట ఒక ప్రత్యేక వర్గాన్ని కాక ఒకేసారి మానవజాతి నంతనూ విముక్తి చేయ గోరారు. వారి మాదిరిగానే వీరు కూడ హేతువాదమనే రాజ్యాన్నీ, శాశ్వత న్యాయమనే రాజ్యాన్నీ నెలకొల్పదలచారు. కాని, ఫ్రెంచి తత్వవేత్తల రాజ్యానికీ వీరి రాజ్యానికీ ఆకాశానికీ పాతాళానికీ వున్నంత అంతరం వుంది.

ఎందుచేతంటే, ఫ్రెంచి తత్వవేత్తల సిద్ధాంతాలపై ఆధారపడ్డ బూర్జువా ప్రపంచం, పై ముగ్గురు సంఘ సంస్కర్తల దృష్టిలోనూ, ఫ్యూడల్ వ్యవస్థలాంటి, అంతకుముందు వ్యవస్థల లాంటి హేతు విరుద్ధ వ్యవస్థే అధర్మ వ్యవస్థే: వాటివలె దీన్ని కూడా మురికి కూపంలో పారవేయవలసిందే. విశుద్ధ హేతువాదం, న్యాయం యింతవరకు ప్రపంచాన్ని శాసించలేదంటే కారణం మనుష్యులు వాటిని సరిగ్గా అర్థం చేసుకోకపోవడం. కావలసిందల్లా మహాప్రతిభగల వ్యక్తి. అట్టి వ్యక్తి యిప్పుడు అవతరించాడు. సత్యాన్ని అతడు అర్థం చేసుకోగలడు. అతడు అవతరించడం, సత్యాన్ని అతడు అర్థం చేసుకోడం అనివార్య సంఘటన కాదు; చారిత్రక క్రమంలో ఒక అవశ్య ఘటన కాదు; అదొక చక్కని యాదృచ్ఛిక ఘటన మాత్రమే. అట్టి వ్యక్తి 500 సంవత్సరాలకు ముందు కూడా అవతరించివుండవచ్చు; ఆవిధంగా మానవజాతిని 500 సంవత్సరాల తప్పులనుంచీ ఘర్షణలనుంచీ, బాధలనుంచీ రక్షించి వుండవచ్చు.

ఫ్రెంచి విప్లవానికి సూత్రధారులైన 18వ శతాబ్దపు ఫ్రెంచి తత్వవేత్తలు ప్రతిదాన్నీ శాసించే ఏకైక శక్తి హేతువాద మన్నారు, హేతుబద్ధమైన పరిపాలనను, హేతుబద్ధమైన సమాజాన్ని స్థాపించాలని కోరారు; శాశ్వత హేతువాదానికి విరుద్ధమైన ప్రతిదాన్నీ నిర్దాక్షిణ్యంగా తుదముట్టించాలని కోరారు. నిజానికి యీ శాశ్వత హేతువాదం 18వ శతాబ్దపు బుర్గర్‌ని గురించిన ఆదర్శీకృత అవగాహన తప్ప మరేమీ కాదనీ, ఈ 18వ శతాబ్దపు బుర్గర్ అప్పుడప్పుడే పెట్టుబడిదారుగా పరివర్తన చెందుతున్నాడనీ పైన చూశాం. ఫ్రెంచి విప్లవం యీ హేతుబద్ధమైన సమాజాన్నీ, పరిపాలననూ సాధించగలిగింది.

కాని యీ నూతన వ్యవస్థ అంతకు పూర్వమున్న వాటితో పోలిస్తే సాపేక్షంగా హేతుబద్ధమైనదైనప్పటికీ, పరమ రూఢంగా మాత్రం హేతుబద్ధమైనది కాదు. హేతువాదంపై ఆధారపడ్డ రాజ్యం పూర్తిగా కూలిపోయింది. రూసో ప్రతిపాదించిన సామాజిక ఒప్పందం భయానక పాలనగా[51] సాక్షాత్కరించింది. తమ రాజకీయ శక్తియుక్తుల్లో నమ్మకం కోల్పోయిన బూర్జువావర్గం ఆ "భయానక పాలన"నుంచి రక్షించుకోడానికి మొదట డైరెక్టరేట్[74] యొక్క అవినీతిలోను, తర్వాత నెపోలియన్ నిరంకుశ పాలనలోను తలదాచుకొంది. వాగ్దానంచెయ్యబడిన శాశ్వత శాంతి నిర్విరామమైన దురాక్రమణ యుద్ధంగా పరిణమించింది. హేతువాదంపై ఆధారపడ్డ సమాజానికి కూడా యీ గతే పట్టింది. ధనికులకూ, పేదలకూ మధ్య వైరుధ్యం సర్వమానవ సౌభాగ్యంలో కరిగిపోవడానికి బదులు మరింత తీవ్ర

రూపం దాల్చింది. ఎందుచేతంటే యీ వైరుధ్యాన్ని కొంతవరకు అధిగమించిన వృత్తి సంఘాలూ, యితర విశేషాధికారాలూ రద్దుచేయబడ్డాయి. మత పీఠాలు నడుపుతున్న ధర్మ సంస్థలు కూడ రద్దుచేయబడ్డాయి. ఫ్యూడల్ సంకెళ్లనుండి "సొంత ఆస్తి విముక్తి చేయబడింది." కాని పెద్ద పెద్ద పెట్టుబడిదార్లతోను, భూస్వాములతోను తీవ్రాతితీవ్రమైన పోటీలో నిలబడలేక కృంగికృశించే చిన్న పెట్టుబడిదార్లూ, రైతులూ తమకున్న కొద్దిపాటి ఆస్తుల్నీ ఆ పెద్ద భూస్వాములకే తెగనమ్ముకొనేందుకు మాత్రం స్వేచ్ఛ లభించింది. ఆవిధంగా చిన్న పెట్టుబడిదార్లూ, కమతందారులూ వారి వారి "ఆస్తులనుంచి విముక్తి చెందారు." పెట్టుబడిదారీ ప్రాతిపదికపై పరిశ్రమల అభివృద్ధి కార్మికజన సామాన్యానికి దారిద్ర్యం, నికృష్టస్థితీ తెచ్చిపెట్టాయి. అవే సమాజంయొక్క ఉనికికి ఆధారమయాయి. కార్లైల్ మాటల్లో చెప్పాలంటే, మానవునికీ, మానవునికీ మధ్య ద్రవ్యసంబంధమే అంతకంతకు ఏకైక సంబంధమైంది. నేరాలు ఏడాదికేడాదికీ పెరుగుతున్నాయి. ఇదివరలో ఫ్యూడల్ అవినీతి బాహాటంగా, పట్టపగలే తాండవించేది. ఇప్పుడది చాటుమాటుగా సాగుతోంది. దాని స్థానంలో ఇదివరకు రహస్యంగా సాగే బూర్జువా అవినీతి నేడు బహిరంగంగా విజృంభించింది. వ్యాపారం అంతకంతకు మోసంగా పరిణమించింది. విప్లవ నినాదమైన "సౌభ్రాతృత్వం"[75] వ్యాపార పోటీ అనే సంకుల సమరంలో వంచనగా, వైరంగా పరివర్తనచెందింది. బలప్రయోగంద్వారా జరిగే పీడన స్థానే లంచగొండితనం ప్రవేశించింది; ఖడ్గం స్థానాన్ని ధనం ఆక్రమించింది. పెండ్లయిన పడుచుతో మొదటి రాత్రి గడిపే హక్కు యిదివరలో ఫ్యూడల్ ప్రభువులకుండేది. అది యిప్పుడు పెట్టుబడిదార్లకు సంక్రమించింది. వ్యభిచారం కనీవినీ యెరుగనంతగా పెరిగింది. వివాహం యిదివరకులాగే చట్టబద్ధమైన వ్యభిచారంగా, ప్రభుత్వ గుర్తింపుగల వ్యభిచారంగా నిలిచివుంది. పైగా వివాహితులలో సైతం అక్రమ ప్రవర్తన వ్యాపించింది.

ఒక్క మాటలో చెప్పాలంటే, తత్వవేత్తల గొప్ప గొప్ప వాగ్దానాలతో పోలిస్తే, "హేతువాదంయొక్క దిగ్విజయం"నుంచి ఉద్భవించిన సామాజిక, రాజకీయ సంస్థలన్నీ పూర్తిగా ఆశాభంగం కలిగించే వ్యంగ్యచిత్రాలుగా అవి తయారయాయి. కరువైందల్లా, యీ ఆశాభంగాన్ని పైకి వ్యక్తంచేసే మనుష్యులే. వారు 19వ శతాబ్దం ప్రారంభంలో ప్రత్యక్షమయారు. 1802లో సెంట్-సైమన్ రచించిన "జెనీవా లేఖలు" ప్రచురింపబడ్డాయి. ఫోరియర్ మొట్టమొదటి గ్రంథం — ఆయన సిద్ధాంతానికి 1799లోనే ప్రాతిపదిక పడినా — 1808లో వెలువడింది. రాబర్టు ఓవెన్ 1800 జనవరి 1న "న్యూలనార్క్"[76]ను నడప నారంభించాడు.

కాని ఆ రోజుల్లో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, దానితోబాటు బూర్జువావర్గానికీ, కార్మికవర్గానికీ మధ్య వైరుధ్యం చాలా అసమగ్రంగానే అభివృద్ధి చెందాయి. ఇంగ్లండ్‌లో

అప్పుడే తలయెత్తిన ఆధునిక పరిశ్రమలు ఫ్రాన్సులో యింకా రాలేదు. ఈ ఆధునిక పరిశ్రమలు ఒకవైపు ఉత్పత్తి విధానంలో తప్పనిసరిగా విప్లవాన్ని తీసుకువచ్చే ఘర్షణలను పెంచుతాయి. ఆ ఉత్పత్తియొక్క పెట్టుబడిదారీ స్వభావాన్ని రద్దుచేసే ఘర్షణలు – అంటే అందులో ఉద్భవించే వర్గాలమధ్య ఘర్షణలను కాక అవి సృష్టించే ఉత్పాదక శక్తులకూ మారకపు సంబంధాలకూ మధ్య ఘర్షణలను అభివృద్ధిచేస్తాయి. రెండోవైపు, యీ ఘర్షణలను రూపుమాపే సాధనాలను కూడా బ్రహ్మాండమైన యీ ఉత్పాదక శక్తుల లోనే, ఆధునిక పరిశ్రమలే అభివృద్ధిచేస్తాయి. అందుచేత, 1800 ప్రాంతంలో నూతన సామాజిక వ్యవస్థనుంచి ఉద్భవించిన సంఘర్షణలు అప్పుడే రూపొందుతున్నాయనడం ఎలా సత్యమో, ఆ సంఘర్షణలను అంతమొనర్చే సాధనాలు కూడా అప్పుడే తయారవుతున్నాయనడం మరింత సత్యం. భయానక పాలనలో పారిస్‌లోని "దరిద్రనారాయణులు" కొద్ది క్షణాలు మాత్రమే అయినా పైచెయ్యి సంపాదించి, బూర్జువావర్గం వ్యతిరేకించినా కూడా, విజయవంతంగా బూర్జువా విప్లవాన్ని ముగింపుకు తేగలిగారు. కాని, అలా చేయడంలో, ఆనాటి పరిస్థితుల్నిబట్టి ఆ పెత్తనం కొనసాగడం ఎంత దుస్సాధ్యమో రుజువు మాత్రమే చేశారు. ఆనాడు కార్మికవర్గం అప్పుడప్పుడే "దరిద్రనారాయణుల"నుంచి ఉద్భవించి, అంకుర రూపంలో అదొక కొత్త వర్గంగా పరిణతి చెందుతూంది. స్వతంత్ర రాజకీయ చర్యలకు పూనుకొనే శక్తి దాని కింకా రాలేదు. కేవలం పీడితవర్గంగానే, బాధపడే వర్గంగానే అది వుంది. తనకు తాను సహాయం చేసుకునే శక్తి దాని కింకా లేదు. అట్టి పరిస్థితుల్లో, ఆనాటి కార్మికవర్గానికి సహాయం బయటనుంచైనా రావాలి పైనుంచైనా రావాలి.

ఈ చారిత్రక పరిస్థితులు కూడా సోషలిజం స్థాపకులను ప్రభావితం చేశాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తిలోని అపరిణత పరిస్థితుల కనుగుణంగానే, వర్గాలమధ్య వుండే అపరిణత సంబంధాల కనుగుణంగానే, అపరిణత సిద్ధాంతాలు కూడా వెలువడ్డాయి. సామాజిక సమస్యలకు పరిష్కారమార్గం అప్పటికింకా అపరిణత ఆర్థిక సంబంధాలలో మరుగుపడి వుంది. దాన్ని ఊహాజనిత సోషలిస్టులు తమ మేధస్సునుంచి రూపొందించ యత్నించారు. సమాజమంతా ఒక తప్పుల తడక; వాటిని నిర్మూలించ వలసింది హేతువాదం. అందుచేత ఒక నూతన సామాజిక వ్యవస్థను, యిదివరకటికన్న ఉత్కృష్టమైన దానిని కనిపెట్ట వలసివచ్చింది, దాన్ని బయటినుంచి ప్రచారంద్వారాను, అవకాశ మున్నచోట్ల ఆదర్శ ప్రయోగాలద్వారాను సమాజంలో చొప్పించవలసి వచ్చింది. ఈ నూతన సామాజిక వ్యవస్థలు ఊహాజగత్తులోనే ఉండిపోవలసివచ్చింది. వాటి ప్రణాళికలు ఎంత సమగ్రంగాను, వివరంగాను తయారుచేయబడితే అంత మానసిక భ్రాంతులుగా అవి దిగజారక తప్పని పరిస్థితికి పోయాయి.

ఇవన్నీ వాస్తవ విషయాలు, వీటిని మన మంగీకరిస్తే యీ సమస్యను గురించి యిక

మనం చర్చించ నక్కర్లేదు. ఎందుచేతంటే, యివి గతానికి సంబంధించినవి. ఈ మానసిక భ్రాంతుల్ని గురించి తర్కవితర్కాలు చేసే పనిని అల్పవిద్వాంసులకు వదలివేద్దాం. ఈరోజున అవి చిరునవ్వు తెప్పిస్తాయి. అటువంటి "బుద్ధిమాంద్యం"తో పోలిస్తే తమ తర్కం మహోన్నతమైనదని వారు పొలికేకలు వేయవచ్చు. కాని మనం మాత్రం వారి మానసిక భ్రాంతులనుంచి ఉత్పన్నమయిన అద్భుత భావాలకు, అంకుర రూపంలో వున్న అద్భుత భావాలకు సంతసిద్దాం. వాటిని అల్పబుద్ధులు చూడలేకపోయారు.

సెంట్-సైమన్ ఫ్రెంచి మహా విప్లవానికి పుత్రుడు. ఆ విప్లవం జరిగేటప్పటికి అతనికి 30 సంవత్సరాలు కూడా లేవు. ఫ్రాన్సులో మూడవ ఎస్టేటుకు[77] చెందిన ప్రజానీకం అనగా ఉత్పత్తి రంగంలోనూ, వ్యాపారంలోనూ పనిచేసేవారు, ప్రత్యేక సౌకర్యాలుగల సోమరుల వర్గంపై, అనగా ప్రభువర్గీయులపైనా, మతాధిపతులపైనా, సాధించిన విజయమే ఫ్రెంచి విప్లవం. కాని మూడవ ఎస్టేటు సాధించిన యీ విజయం త్వరలోనే ఆ ఎస్టేటుకు చెందిన కొద్దిమంది విజయంగా పరిణమించింది; అందులో ప్రత్యేక సౌకర్యాలుగల ఆస్తిపరుల బూర్జువావర్గ రాజ్యాధికారంగా అది పరిణమించింది. ఈ బూర్జువావర్గం విప్లవకాలంలో వేగంగా అభివృద్ధి చెందింది; ప్రభువర్గీయుల, మతాధిపతుల భూములను స్వాధీన పరచుకొని, ఆ తర్వాత వాటిని అమ్మివేయడంద్వారా — ఈ చట్టా వ్యాపారంద్వారా — ధనం సంపాదించింది. అంతే కాక, మిలిటరీ కంట్రాక్టులద్వారా మొత్తం జాతినే మోసగించి, ఐశ్వర్యవంతమైంది. డైరెక్టరేట్[74] కింద యీ వంచకులు చెలాయించిన పెత్తనమే ఫ్రాన్సును సర్వనాశనానికి తెచ్చింది. నెపోలియన్ రాజకీయ కుట్రద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకొనేందు కదొక సాకు అయింది.

అందుచేత, సెంట్-సైమన్ దృష్టిలో మూడవ ఎస్టేటుకూ, ప్రత్యేక సౌకర్యాలు గల వర్గానికీ మధ్య వైరుధ్యం, "కార్మికులకూ," "సోమరులకూ" మధ్య వైరుధ్యంగా కనబడింది. సోమరులంటే పాతవ్యవస్థకు చెందిన ప్రత్యేక సౌకర్యాలు గలవారే కాదు; ఉత్పత్తిలో గాని, పంపకంలోగాని ఏవిధంగానూ పాల్గొనకుండా, తమ ఆదాయాలమీద జీవించేవారందరూ సోమరులే. ఇక కార్మికులు అతని దృష్టిలో వేతన కార్మికులే కాదు; ఉత్పత్తిదార్లూ, వర్తకులూ, బ్యాంకర్లు కూడ కార్మికులే. సోమరులు బుద్ధి కుశలతలోగాని, రాజకీయ విజ్ఞతలోగాని నాయకులు కాజాలరని రుజువయింది; విప్లవం యీ విషయాన్ని చివరకు ధృవపరచింది. ఆస్తిలేని వర్గాలకు యీ శక్తి లేదని భయానక పాలన అనుభవమే రుజువుచేసినట్లు సెంట్-సైమన్‌కి కనబడింది. అటువంటప్పుడు నాయకత్వం వహించవలసిందెవరు? విజ్ఞానశాస్త్రం, పరిశ్రమలూ అని సెంట్-సైమన్ అభిప్రాయం. ఈ రెండూ ఒక సరికొత్త మతసంబంధంచే ఐక్యమొనర్చబడతాయి. సంస్కరణోద్యమం తర్వాత నశించిపోయిన మత ఐక్యతను యివి పునరుద్ధరిస్తాయి. ఈ మత ఐక్యత నిగూఢమైన,

అంతస్తులమీద అంతస్తులుగల "నవీన క్రైస్తవమతం." విజ్ఞానశాస్త్రం అంటే అతని దృష్టిలో మహావిద్వాంసులు. పరిశ్రమ అంటే, ప్రధానంగా కష్టించే బూర్జువాలూ, ఫ్యాక్టరీ యజమానులూ, వర్తకులూ, బ్యాంకర్లూను. ఈ వర్గానికి చెందినవారు ఒక విధమైన సమాజ సేవకులుగా మారుతారని, సమాజానికి ధర్మకర్తలుగా మారుతారని సెంట్-సైమన్ అభిప్రాయం. అయితే కార్మికులకన్న వారు ఉన్నత హోదాలో వుంటారు; ఆర్థికంగా వారికి ప్రత్యేక సౌకర్యాలుంటాయి. రుణాలను నియంత్రితం చెయ్యడంద్వారా మొత్తం సామాజికోత్పత్తిని నడిపే బాధ్యతను బ్యాంకర్లకు అప్పగించాల్సివుంటుంది. ఫ్రాన్సులో అధునిక పరిశ్రమలూ, వాటితోబాటు పెట్టుబడిదార్లకూ, కార్మికులకూ మధ్య అప్పుడే వైరుధ్యం తలెత్తుతూంది. ఆ కాలాని కనుగుణమైన భావమే యిది. కాని, సెంట్-సైమన్ అందరికంటే అధిక సంఖ్యలోవున్న, అందరికంటే బీదలుగావున్న వర్గాన్ని ("la classe la plus nombreuse et la plus pauvre") గురించే ఎక్కువ శ్రద్ధ చూపెట్టాడు; దాన్ని గురించే అతడు నొక్కిచెప్పాడు.

సెంట్-సైమన్ యిదివరకే "జెనీవా లేఖల్లో" "మనుష్యులందరూ పనిచేయాలి" అనే ప్రతిపాదన చేశాడు.

ఆ పుస్తకంలోనే, "భయానక పాలన"ని ఆస్తిలేని ప్రజానీకంయొక్క పాలనగా అతడు గుర్తించాడు. వారిని సంబోధిస్తూ అతడిలా అన్నాడు:

> "మీ కామ్రేడ్స్ అధికారంలో ఉన్నప్పుడు ఫ్రాన్సుకు ఏమి జరిగిందో చూడండి: వారు కరువును తీసుకొచ్చారు."

కాని అతడు ఫ్రెంచి విప్లవం వర్గ సమరమనీ, అది ప్రభువర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్యనే జరగలేదనీ, ప్రభువర్గానికీ, బూర్జువావర్గానికీ, ఆస్తిలేనివారికీ మధ్య అది జరిగిందనీ 1802లో గమనించడం చాలా భావగర్భితమైన ఆవిష్కరణ. ఉత్పత్తికి సంబంధించిన శాస్త్రమే రాజకీయాలని అతడు 1816లో ప్రకటించాడు; రాజకీయాలను అర్థశాస్త్రం పూర్తిగా యిముడ్చుకొంటుందని అతడు జోస్యం చెప్పాడు. ఆర్థిక పరిస్థితులు రాజకీయ సంస్థలన్నిటికీ పునాది అనే గుర్తింపు మన కిక్కడ అంకుర రూపంలో మాత్రమే కనిపిస్తుంది, ఎంతో స్పష్టంగా అతడు వ్యక్తంచేసిన అభిప్రాయమేమంటే యిక మీదట ప్రజలపై రాజకీయ పరిపాలన వ్యవహారాల నిర్వహణగా మార్పుచెందుతుంది; ఉత్పత్తి క్రమాన్ని నిర్వహించేదిగా అది మార్పుచెందుతుంది. అంటే "రాజ్యయంత్రం రద్దవుతుంది" అనే భావన. ఈ మధ్య యీ సమస్యపైనే ఎంతో రభస చెలరేగిందన్న విషయం గమనార్హం.

సెంట్-సైమన్ 1814లోనూ, అంటే మిత్రరాజ్య సేనలు పారిస్‌లో ప్రవేశించిన వెన్వెంటనే,* ఆ తర్వాత 1815లో జరిగిన నూరు రోజుల[78] యుద్ధంలోనూ ఫ్రాన్సు ఇంగ్లండుతో చేతులు కలపాలని ప్రకటించాడు; ఈ రెండు దేశాలూ జర్మనీతో స్నేహంగా వుండాలన్నాడు. అలా జరిగితేనే యూరపు సౌభాగ్యాభివృద్ధులతో, శాంతితో వర్ధిల్లుతుంద న్నాడు. 1815లో వాటర్లూ[79] విజేతలతో, చేతులు కలపాలని ఫ్రెంచివారికి ఉప దేశించేందు కెంతైనా మనోధైర్యం, చారిత్రక దూరదృష్టి ఉండాలి. సెంట్-సైమన్ యీ విషయంలో కూడ తన సమకాలీనుల కంటె మిన్న అనిపించుకొన్నాడు.

సర్వగ్రాహకమైన దృష్టివైశాల్యంగల సెంట్-సైమన్‌లో తదనంతర సోషలిస్టులలో ఖచ్చిత మైన ఆర్థికదృష్టి లోపించిన అభిప్రాయాలన్నీ అంకుర రూపంలో కనిపించగా, ఫోరియర్‌లో ప్రస్తుత సామాజిక పరిస్థితుల్ని ఖండించడం కనిపిస్తుంది. ఈ విషయంలో అతడు సిసలైన ఫ్రెంచి సంప్రదాయాన్ని అనుసరించాడు; వ్యంగ్యాన్ని అతడు విస్తారంగా ఉపయోగించాడు. అంతమాత్రంచేత అందులో సమగ్రత సన్నగిలలేదు. ఫోరియర్ బూర్జువావర్గాన్నీ విప్ల వానికి పూర్వం ఆ వర్గానికి సిద్ధాంతవేత్తలుగా ఉన్నవారినీ, విప్లవానంతరం రంగంమీదికి వచ్చిన బూర్జువా వందిమాగధుల్నీ వారి మాటల్లోనే ఎత్తిపొడుస్తూ అపహాస్యంచేశాడు. బూర్జువా సమాజంలోని ఆర్థిక, నైతిక పతనాన్ని అతడు నిర్దాక్షిణ్యంగా బయటపెట్టాడు. అంతకుముందు తత్వవేత్తలు హేతువాదమే శాసనకర్తగా వుండే సమాజాన్ని గురించీ, అంద రికీ సమస్త సౌఖ్యాలూ లభింపచేసే నాగరికతను గురించీ, మానవుని శక్తిసామర్థ్యాలను అనం తంగా అభివృద్ధిచేసే వ్యవస్థను గురించీ చేసిన వాగ్దానాలనూ, మిరుమిట్లుగొల్పే వాగ్దానా లనూ అతడు బూర్జువా సమాజంలోని బీభత్సాల కెదురుగా నిలిపి చూపెట్టాడు; అంతే కాక తన కాలంలో బూర్జువా సిద్ధాంతవేత్తలు చేసిన వన్నెచిన్నెల వర్ణనలన్నీ వాస్తవ పరి స్థితుల కెంత భిన్నంగా వున్నాయో చూపెట్టాడు. ప్రతిచోటా దారుణమైన బీభత్సం వికటాట్టహాసం చేస్తూంటే, ఢమఢమ శబ్దాలతో దాన్ని గురించిన స్తోత్రపాఠా లెలా వర్షిస్తున్నాయో అతడు చిత్రించాడు; నిశితమైన ఎత్తిపొడుపులతో వాటిని చీల్చిచెండాడాడు.

ఫోరియర్ విమర్శకుడు మాత్రమే కాదు. చలించని అతని ప్రశాంత స్వభావం అతన్నొక వ్యంగ్య రచయితగా చేసింది. ప్రపంచ చరిత్రలోనే అత్యుత్తమ వ్యంగ్య రచయితల్లో అతడు అగ్రశ్రేణికి చెందినవాడు. విప్లవం పతనమయాక విజృంభించిన చట్టావ్యాపారంలోని మోసాలను అతడు శక్తివంతంగాను, రమ్యంగాను చిత్రించాడు; లాభాల వేటతో పెనవేసుకు పోయిన అనాటి ఫ్రెంచి వ్యాపారాన్ని తూర్పారబట్టాడు. అంతకంటె కూడ అద్భుతంగా అతడు బూర్జువా సమాజంలోని స్త్రీ పురుష సంబంధాలనూ, స్త్రీల అధోగతినీ బహిర్గ

* 1814 మార్చి 31న. – సం.

తంచేశాడు. ఏ సమాజంలోనైనా సాధారణ స్వాతంత్ర్యానికి కొలబద్ద స్త్రీ స్వాతంత్ర్యమని మొట్టమొదట ప్రకటించింది ఫోరియరే.

కాని, ఫోరియర్ ప్రతిభను తారాస్థాయికి చేర్చిన విషయం, సమాజ చరిత్రను గురించిన అతని దృక్పథం. ఈనాటివరకు సమాజ చరిత్రనంతనూ అతడు నాలుగు దశలుగా విభజించాడు: ఆటవిక దశ, పితృస్వామిక దశ, అనాగరిక దశ, నాగరిక దశ. చివరిదశ ప్రస్తుత పౌర నామక, లేక బూర్జువా దశ; 16వ శతాబ్దంతో అది ప్రారంభమవుతుంది.

> "అనాగరిక దశలో సరళమైన పద్ధతిలో ఆచరింపబడిన ప్రతి అవినీతి కరమైన పనికీ నాగరికత జటిలమైన, అస్పష్టమైన, సందిగ్ధమైన, కపటమైన ఉన్నత రూపాన్ని కల్పిస్తుంద''నీ,

అది "విషచక్రం''లో తిరిగినట్లు తిరుగుతుందనీ, నిరంతర వైరుధ్యాలతో తిరుగుతుందనీ, ఒక వైరుధ్యం తర్వాత మరొక వైరుధ్యాన్ని సృష్టించుకొంటూ, వాటినుంచి బయటపడ లేకుండా ఉక్కిరిబిక్కిరౌతూ ఉంటుందనీ అతడు రుజువుచేశాడు. దేన్నైతే అది కోరు కొంటుందో, లేదా కోరుకొంటున్నట్లు నటిస్తుందో, దానికి విరుద్ధమైనదాన్ని అది పొందుతుంది. ఉదాహరణకు

> "నాగరిక యుగంలో దారిద్ర్యం మహదైశ్వర్యంనుంచి జనిస్తుంది."

ఈవిధంగా ఫోరియర్ తన సమకాలికుడైన హేగెల్ వలెనే గతితార్కిక పద్ధతిని అద్భు తంగా ఉపయోగించాడు. దాని సహాయంతోనే సంపూర్ణతా సాధనలో మానవుని అనంతప్రజ్ఞను గురించిన మాటలను ఖండించాడు. ప్రతి చారిత్రక దశలోనూ ఉచ్చస్థితీ పతనం ఉండి తీరుతాయనీ, ఇదే మానవజాతి భవిష్యత్తుకంతకూ వర్తిస్తుందనీ అతడు వాదించాడు. భూమి ఉత్తరోత్తరా ధ్వంసమవుతుందనే భావాన్ని కాంట్ ప్రకృతిశాస్త్రంలో ప్రవేశపెట్టినట్లే ఫోరియర్ మానవజాతి ఉత్తరోత్తరా నశిస్తుందనే భావాన్ని చారిత్రక విజ్ఞానశాస్త్రంలో ప్రవేశపెట్టాడు.

ఫ్రాన్సులో ఒకవైపు విప్లవతుపాను అన్నిదిశలా విస్తరిస్తోంటే, ఇంగ్లండులో అది ప్రశాంతంగా వ్యాపిస్తోంది; అయితే అది ఫ్రెంచి విప్లవం కన్న తక్కువ మహత్తరమైన దేమీ కాదు. ఇంగ్లండులో ఆవిరిశక్తీ, సరికొత్త పనిముట్లను తయారుచేసే యంత్రాలు కార్ఖానాలను ఆధునిక పరిశ్రమలుగా మార్చివేస్తున్నాయి; ఆవిధంగా మొత్తం బూర్జువా సమాజంయొక్క పునాదుల్నే అవి మార్చివేస్తున్నాయి. మందగమనంతో కూడిన కార్ఖానా అభివృద్ధి దశ పెనుతుపానును పోలిన ఒత్తిళ్లతో కూడిన ఉత్పత్తి దశగా పరివర్తన చెందుతోంది. నిరంతరం వృద్ధిచెందే వేగంతో సమాజం రెండు వర్గాలుగా — పెద్ద పెట్టు

బడిదార్లు, ఆస్తిలేని కార్మికులుగా — చీలిపోతూంది. ఈ రెండు వర్గాల మధ్యా యిదివరలో వుంటూ వచ్చిన ఒక స్థిరమైన మధ్య తరగతికి బదులు అస్థిరమైన వృత్తిపనివారు, దుకాణదార్లు ఎంతో కష్టంతో పొట్టపోసుకొంటూ బ్రతుకుతున్నారు; జనాభాలో వీరి నిష్పత్తి నిరంతరం మారుతోంది.

అయితే, యీ నూతన ఉత్పత్తి విధానం యింకా తన ఉచ్చదశ ప్రారంభ స్థితిలోనే వుంది. అది అప్పటికింకా మామూలు ఉత్పత్తి విధానంగా, క్రమబద్ధ ఉత్పత్తి విధానంగా వుంది. ఆనాటి పరిస్థితుల్లో అది అంతకంటె అభివృద్ధి చెందడం సాధ్యం కాదు. అయినప్పటికీ అది దారుణమైన సామాజిక రుగ్మతలన్నిటినీ అప్పటికే సృష్టిస్తోంది. ఉదాహరణకు తలదాచుకోడానికి యిండ్లులేని జనసమూహాలు పెద్ద పెద్ద పట్టణాల్లోని మురికి కూపాల్లో నివసించవలసి వస్తోంది; సాంప్రదాయికమైన నైతిక సంబంధాలన్నీ, పైతృక పెద్దరికాలన్నీ, కుటుంబ సంబంధాలన్నీ పటాపంచలవుతున్నాయి; శ్రామికులు ముఖ్యంగా స్త్రీలూ, పిల్లలూ మితిమీరిన పనివల్ల దుర్భరబాధలు అనుభవిస్తున్నారు; అకస్మాత్తుగా కొత్త పరిస్థితుల్లోకి, గ్రామాలనుంచి పట్టణాల్లోకి, వ్యవసాయంనుంచి ఆధునిక పరిశ్రమల్లోకి, సుస్థిర జీవితం నుంచి రోజురోజుకూ మారే భద్రత లేని జీవితంలోకి విసిరివేయబడ్డ కార్మికులు పూర్తిగా ధృతి కోల్పోయి ఉన్నారు.

ఇట్టి క్లిష్టపరిస్థితులలో 29 సంవత్సరాల వయస్సుగల ఒక పారిశ్రామికవేత్త, యించు మించు ఒక దివ్యమూర్తి, బాలల అమాయకత్వంగల అకళంకశీలుడు, బహుకొద్ది స్వతస్సిద్ధనాయకుల్లో ఒకడు ప్రత్యక్షమయాడు. అతడే రాబర్ట్ ఓవెన్. ఇతడు భౌతికవాద సిద్ధాంతాన్ని చేబట్టాడు. మానవుని స్వభావం వంశపారంపర్యతవల్లా, అతని జీవితకాలంలో — ముఖ్యంగా అభివృద్ధిచెందే దశలో — అతని చుట్టూ ఉండే పరిసరాలవల్లా నిర్ణయింపబడుతుందని అతడు నమ్మాడు. పారిశ్రామిక విప్లవంలో అతని వర్గంలో అధిక సంఖ్యాకులు, తమ చుట్టూ వున్న అస్తవ్యస్తతను, గందరగోళాన్ని మాత్రమే చూశారు; యీ గందర గోళంలో చేతికి చిక్కినదంతా రాబట్టుకొనేందుకు, అతివేగంగా ఐశ్వర్యవంతు లయేందుకు ఎన్నో అవకాశాలున్నాయని వారు గమనించారు. కాని ఓవెన్ తన అభిమాన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టేందుకూ, ఆవిధంగా అస్తవ్యస్తతనుంచి క్రమబద్ధతను తీసుకువచ్చేందుకూ అవకాశమున్నదని గ్రహించాడు. ఒక మాంచెస్టరు ఫ్యాక్టరీలో సుమారు 500 మంది కార్మికులకు సూపరింటెండెంటుగా వుంటూ ఇదివరకే తన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టేందుకు అతడు ప్రయత్నించాడు; ఆ ప్రయత్నంలో సఫలీకృతుడయాడు. 1800 నుంచి 1829 వరకు అతడు స్కాట్లండ్‌లోని న్యూలనార్క్‌లో ఒక నూలు మిల్లును నిర్వహించాడు. ఇందులో అతడు మేనేజింగ్ భాగస్వామి. ఇక్కడ కూడా అతడు పై పద్ధతుల్లోనే పనిచేశాడు. అంతకంటే ఎక్కువ స్వేచ్ఛ యిక్కడ అతనికి లభించింది. అంతేకాక, అతని ప్రయత్నం మరింత

విజయవంతమయింది. దానితో, అతనికి యూరపు అంతటా బ్రహ్మాండమైన ఖ్యాతి లభించింది. అత్యంత విభిన్నమైన తరగతులకు చెందిన అత్యంత పతనావస్థలోవున్న జనాన్ని (వారి సంఖ్య 2500కి పెరిగింది) అతడు ఒక ఆదర్శ సంఘంగా తయారుచేశాడు. త్రాగుడు, పోలీసులు, మేజిస్ట్రేట్లు, దావాలు, దారిద్ర్యనిర్మూలన చట్టాలు, ధర్మసంస్థలు అదృశ్యమయాయి. ఇదంతా ఎలా సాధ్యమైంది? కార్మికుల్ని మానవయోగ్యమైన పరిసరాల్లో ఉంచడంద్వారా, ముఖ్యంగా కొత్త తరాన్ని జాగ్రత్తగా తరిఫీదు చేయడంద్వారా సాధ్యమయింది. శిశు విద్యాలయాలను అతడు స్థాపించాడు. మొదట న్యూలనార్క్‌లో వాటిని ప్రారంభించాడు. బాలబాలికలు, తమ రెండవ యేట పాఠశాలకు వచ్చేవారు. అక్కడ వారెంత హాయిగా కాలం గడిపేవారంటే, తిరిగి ఎవరి ఇండ్లకు వారిని పంపడం కష్టమయేది. అతని పోటీదార్లు కార్మికులని రోజుకు 13, 14 గంటల చొప్పున పనిచేసేటట్టు నిర్బంధిస్తూంటే, న్యూలనార్క్ కార్మికులు పదిన్నర గంటలకంటె ఎక్కువ పనిచేయనక్కర్లేదు. ఒకసారి పత్తి సప్లయికాక సంక్షోభ మేర్పడ్డందువల్ల అతని ఫ్యాక్టరీ 4 నెలలు మూతపడింది. ఆ నాలుగు నెలలూ కార్మికులకు పూర్తి జీతాలు యివ్వబడ్డాయి. ఇన్ని సౌకర్యాలు కార్మికుల కీయబడినా ఆ ఫ్యాక్టరీ వ్యాపారం రెట్టింపుకు పైగా పెరిగింది. చివరివరకూ దాని యజమానులకు పెద్ద పెద్ద లాభాలు వచ్చాయి.

అయినప్పటికీ ఓవెన్ సంతృప్తి చెందలేదు. అతని అభిప్రాయంలో తన కార్మికులింకా మనుష్యమాత్రులుగా – జీవించడంలేదు.

"ఈ మనుషులు నా దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్న బానిసలు"

అన్నాడాయన. ఇతర ఫ్యాక్టరీలలో కంటె తన ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు మెరుగైన పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, వారు తమ స్వభావాన్ని హేతుబద్ధంగా చక్కదిద్దుకోడానికీ, తమ బుద్ధిని సర్వతోముఖంగా వికసింపచేసుకోడానికీ, తమ శక్తియుక్తుల్ని స్వేచ్ఛగా ఉపయోగించుకోడానికీ అవకాశమింకా ఏర్పడలేదు.

> "అయినప్పటికీ, ఈ 2500 మంది ప్రజల్లోనూ, కార్మికులుగా ఉన్నవారు అర్ధశతాబ్దం క్రిందట 6,00,000 మందిలో కార్మికులుగా ఉన్నవారు ఉత్పత్తి చేయగలిగినంత సంపదను సమాజానికి ఉత్పత్తి చేసిపెడుతున్నారు. నన్ను నేనిలా ప్రశ్నించుకొన్నాను: ఈ 2500 మందీ అనుభవిస్తున్న సంపదకూ ఆ 6,00,000 మందీ అనుభవించివుండవలసిన దానికీ మధ్య వ్యత్యాసం ఏమయింది?"*

---

* "మనస్సులోను, ఆచరణలోను విప్లవం" పేజీ 21. "యూరప్‌లోని రెడ్ రిపబ్లిక

దీనికి జవాబు స్పష్టమే. ఆ ఫ్యాక్టరీ యజమానులకు 3,00,000 పౌనుల ధనాన్ని ఖచ్చితమైన లాభంతోబాటు, వారి పెట్టుబడిమీద 5 శాతం చొప్పున వడ్డీ కూడా చెల్లించడానికి అది వినియోగమైంది. ఇది న్యూలనార్క్ ఫ్యాక్టరీకేకాక, ఇంగ్లండులోని అన్ని ఫ్యాక్టరీలకూ మరింతగా వర్తిస్తుంది.

> "యంత్రశక్తి సహాయంతో (అది యింకా అసమగ్రంగానే ఉపయోగింపబడుతోంది) యీ నూతన సంపద అంతా సృష్టించబడి వుండకపోతే, యూరపులో నెపోలియన్‌కు వ్యతిరేకంగా, ప్రభువర్గీయుల సిద్ధాంతాలను బలపరచేందుకై జరిగిన యుద్ధాలన్నిటినీ పోషించడం అసాధ్యమయేది. అయినా, యీ నూతన శక్తిని సృష్టించింది కార్మికవర్గమే."*

అందువల్ల దాని ఫలితం కార్మికవర్గానికే చెందాలి. కొత్తగా సృష్టించబడిన ఉత్పాదక శక్తులు యిదివరలో వ్యక్తుల సంపదను వృద్ధిచేయడానికీ, ప్రజల్ని బానిసత్వంలో బంధించి వుంచడానికీ ఉపయోగపడేవి. కాని ఓవెన్‌కి అవి సమాజ పునర్నిర్మాణానికి పునాదు లయాయి. ప్రజలందరి సమిష్టి ఆస్తిగా, ప్రజలందరి శ్రేయస్సుకై ఉపయోగపడేవిగా అవి సాక్షాత్కారమయాయి.

ఈవిధంగా ఓవెన్ ప్రతిపాదించిన కమ్యూనిజం కేవల వ్యాపారం అనే పునాదిపై ఆధారపడింది; వ్యాపార అంచనాల పర్యవసానం అది. చివరవరకూ అది ఆచరణాత్మక స్వభావాన్నే కలిగి వుంది. ఉదాహరణకు ఓవెన్ 1823లో ఐర్లండులో పేదల సహాయార్థం కొన్ని కమ్యూనిస్టు కాలనీలను నిర్మించాలని సూచించాడు. వాటిని స్థాపించేందుకెంత ఖర్చు అవుతుందో లెక్కలతోసహా అంచనావేశాడు. వాటికోసం యేటా ఎంత ధనం ఖర్చుపెట్టాలో, సుమారుగా ఎంత ఆదాయం వస్తుందో లెక్కవేశాడు. అతడు తయారుచేసిన ప్రణాళికలో సాంకేతిక వివరాలన్నీ — స్థల నిర్దేశం, ముందుభాగం, పక్కభాగం, స్థూల చిత్రంతోసహా — ఎంత సమగ్రమైనవంటే, ఓవెన్ పథకాన్నే మనం అంగీకరిస్తే, వివరాలకు సంబంధించిన అంశాల్లో వేలెత్తి చూపడానికి ఒక్క దోషం కూడా మనకు కనబడదు.

---

న్లకూ, కమ్యూనిస్టులకూ, సోషలిస్టులకూ" అందజేసిన మెమొరాండం (పేజి 21). ఇది 1848లో ఫ్రెంచి తాత్కాలిక ప్రభుత్వానికీ, "విక్టోరియా రాణికీ, బాధ్యతగల ఆమె సలహాదార్లకూ" పంపబడింది. (ఎంగెల్స్ వివరణ.)

* అదే మెమొరాండం పేజి 22. (ఎంగెల్స్ వివరణ.)

ఓవెన్ జీవితంలో కమ్యూనిజంవైపు పురోగమించడం ఒక మూల మలుపు. అతడు కేవలం జీవకారుణ్యవాదిగా ఉన్నరోజుల్లో అతనికి ఐశ్వర్యం, స్తోత్రపాఠాలు, గౌరవం, కీర్తి తప్ప మరేమీ లభించలేదు. యూరపులో అతనంత ప్రఖ్యాత పురుషుడు మరి లేడు. అతని వర్గానికి చెందినవారే కాక, రాజనీతిజ్ఞులు, రాజులు కూడ అతడు చెప్పింది ఆమోదిస్తూ శ్రద్ధగా వినేవారు. కాని, ఎప్పుడైతే ఓవెన్ కమ్యూనిస్టు సిద్ధాంతాలతో ముందుకు వచ్చాడో, అప్పుడు అవన్నీ తల్లకిందులయాయి. అతని దృష్టిలో సమాజాన్ని సంస్కరించేందుకు మూడు పెద్ద ఆటంకాలున్నాయి: ఒకటి సొంత ఆస్తి విధానం, రెండు మతం, మూడు ఆనాటి వివాహవ్యవస్థ. ఈ మూడింటినీ ఎదుర్కొంటే ఏమి జరుగుతుందో అతనికి బాగా తెలుసు. సామాజిక ఆంక్షలు; బహిష్కరణ; సామాజిక హోదాకు స్వస్తి. కాని ఓవెన్ వీటిని లెక్క చేయలేదు. నిర్భయంగా ఫలితాలను లెక్కచేయకుండా అతడు వీటి నెదుర్కొన్నాడు. సరిగ్గా అతడేమి జరుగుతుంది అనుకున్నాడో అదే జరిగింది. ఉన్నత సమాజం అతన్ని బహిష్కరించింది, ఆంక్షలు విధించింది; పత్రికలు మూగనోము పట్టాయి; అమెరికాలో అతడు చేసిన కమ్యూనిస్టు ప్రయోగాలు విఫలమవడంవల్ల తన యావత్తు సంపదనూ కోల్పోయి అతడు పూర్తిగా చితికిపోయాడు. అప్పుడతడు సరాసరి కార్మికవర్గంలో ప్రవేశించాడు. 30 సంవత్సరాలు వారి మధ్య పనిచేశాడు. ఇంగ్లండులో ప్రతి సాంఘికోద్యమమూ, కార్మికులకు అనుకూలంగా సాధింపబడిన వాస్తవమైన విజయమూ రాబర్ట్ ఓవెన్ పేరుతో ముడివడివున్నాయి. ఐదేండ్ల పోరాటం ఫలితంగా 1819లో, అతడు ఫ్యాక్టరీలలో పనిచేసే స్త్రీ కార్మికుల, బాలబాలికల పని గంటలను పరిమితం చేసే మొట్టమొదటి చట్టం ప్యాసయేటట్లు చేశాడు. ఇంగ్లండులోని కార్మిక సంఘాలన్నిటినీ ఒకే ట్రేడ్‌యూనియన్ సంస్థలో ఐక్యమొనర్చేందుకు జరిగిన మొట్టమొదటి మహాసభకు ఓవెన్ అధ్యక్షుడు.[80] మొత్తం సమాజాన్ని కమ్యూనిస్టు పద్ధతులపై నిర్మించేముందు, పరివర్తన చర్యగా చిల్లర వర్తకంలోను, వినిమయదార్ల, ఉత్పత్తిదార్ల సహకార సంఘాలను అతడు స్థాపించాడు. సమాజానికి వర్తకుడూ, ఫ్యాక్టరీ యజమానీ శుద్ధ అనవసరమని అవి రుజువుచేశాయి. రెండోవైపు అతడు శ్రమ దుకాణాలను స్థాపించాడు. వాటిలో, కార్మికులు ఉత్పత్తిచేసిన సరకులను శ్రమనోట్లతో యిచ్చి పుచ్చుకోవడం జరుగుతుంది (వస్తుమార్పిడి పద్ధతి). ఒక్కొక్క శ్రమనోటు ఒక గంట పనితో సమానం.[81] ఈ సంస్థలు అనివార్యంగా విఫలంకావలసివచ్చింది. కాని, ఆ తర్వాత చాలాకాలానికి ప్రూడన్ స్థాపించిన ఎక్స్‌చేంజి బ్యాంకులకు[82] యివి బీజరూపాలు. దానికీ ఓవెన్ స్థాపించిన సంస్థలకూ భేదం ఏమంటే అది సామాజిక రుగ్మతలన్నిటినీ నిర్మూలిస్తుందని ప్రూడన్ చెప్పుకోగా, సమాజాన్ని విప్లవ మార్గంలో మార్చేటందుకు తన శ్రమ దుకాణాలు తొలి మెట్టు అని మాత్రమే — ఓవెన్ చెప్పాడు.

ఇట్టి ఊహాజనిత ధోరణులు చాలకాలం వరకు 19వ శతాబ్దపు సోషలిస్టు భావాలపై

అధికారం చలాయించాయి; ఇప్పటికీ వాటి ప్రభావం ఉంది. నిన్న మొన్నటి వరకు ఫ్రెంచి, ఇంగ్లీషు సోషలిస్టులందరూ వాటికి ప్రణమిల్లారు. జర్మనీలో ప్రారంభ కమ్యూనిజం, వైట్లింగ్ ప్రతిపాదించిన దానితోసహా యీ ధోరణికి చెందినదే. వీరందరి దృష్టిలోనూ సోషలిజం ఒక పరమ సత్యం, పరమ హేతుజ్ఞానం, పరమ ధర్మం. అది తన సొంత శక్తి వల్ల యావత్ప్రపంచాన్నీ జయిస్తుంది. మనం చేయవలసిందల్లా దాన్ని కనుగొనడమే. పరమ సత్యం కాలానికీ, స్థలానికీ, మానవాళి చారిత్రకాభివృద్ధికీ అతీతమైనట్లే, దాన్నెప్పుడు ఎక్కడ కనుగొనడం అనేది కూడా ఒక యాదృచ్ఛిక విషయమే. అయితే, పరమసత్యం, పరమ హేతుజ్ఞానం, పరమ ధర్మం వేర్వేరు సిద్ధాంత స్థాపకులకు వేర్వేరు అర్థాల్లో సాక్షాత్కరించాయి. ఒక్కొక్కరి పరమ సత్యం, పరమ హేతుజ్ఞానం, పరమ ధర్మం వారి వారి సొంత ఆలోచనలకే, వారివారి జీవిత పరిసరాలకే, వారి వారి జ్ఞానపరిధికే, మనోవ్యాపారాలకే పరిమితమవడంవల్ల, అవన్నీ ఒకదానితో ఒకటి ఎల్లప్పుడూ భేదిస్తూ ఉంటాయి. వాటి మధ్య జరిగే సంఘర్షణ మరోవిధంగా సమాప్తమవదు. అందుచేత, వాటినుంచి ఒక విధమైన సంకీర్ణ, సగటు సోషలిజం మాత్రమే ఉత్పన్నమవుతుంది. ఆవిధమైన సోషలిజమే ఇంగ్లండు, ఫ్రాన్సు దేశాల్లోని సోషలిస్టుల కార్మికుల మనస్సులపై యింతవరకు పెత్తనంచేస్తూ వచ్చింది. కాబట్టి నానావిధాలైన అభిప్రాయాల కలగూరగంపగా అది తయారయింది. ఉదాసీనమైన విమర్శకుల, ఆర్థిక సూత్రాల, భవిష్యత్ సామాజిక చిత్రాల కలగూరగంపగా మాత్రమే అది వుంది. సెలయేటిలో బొమ్మరాళ్లు ఒకదానితో ఒకటి రాపాడగా కొనలు అరిగి గుండ్రమైనట్లు చర్చావాహినిలో ఒక్కొక్క అభిప్రాయంయొక్క కొనలను ఎంత గట్టిగా రాపాడిస్తే అంత సులభంగా యీ కలగూరగంప తయారవుతుంది.

సోషలిజాన్ని ఒక శాస్త్రంగా రూపొందించాలంటే, మొదట వాస్తవమైన పునాదిమీద దాన్ని ప్రతిష్ఠించాలి.

## II

ఈలోగా, 18వ శతాబ్దపు ఫ్రెంచి తత్వశాస్త్రంతోబాటూ, దాని తర్వాతా, నూతన జర్మన్ తత్వశాస్త్రం ఒకటి ఆవిర్భవించింది; అది హేగెల్ తత్వశాస్త్రంలో పరిపూర్ణత పొందింది. దాని మహత్తర ప్రాముఖ్యం ఏమిటంటే, గతితర్కాన్ని అది అత్యున్నతమైన ఆలోచనా రీతిగా తిరిగి స్వీకరించింది. ప్రాచీన గ్రీక్ తత్వవేత్తలు జన్మతఃస్వతస్సిద్ధ గతి తార్కికులు. వారిలో అరిస్టాటిల్ విజ్ఞాన నిష్ణాతుడనదగిన మహా బుద్ధిశాలి. ఆయన యిదివరకే గతితార్కిక ఆలోచనలో అతి ప్రధానమైన రూపాలను విశ్లేషించాడు. కాని యీ నూతన తత్వశాస్త్రంలో గతితర్కానికి ఎంతో ప్రతిభావంతమైన ప్రతినిధులున్నప్పటికీ (ఉదా:

డెకార్ట్, స్పినోజా) అది ఇంగ్లీషు తత్వశాస్త్రం ప్రభావంవల్ల అధిభౌతిక ఆలోచనా విధానంలో పడి అంతకంతకు జడాత్మకదృష్టి నవలంబించింది. ఈ అధిభౌతిక దృక్పథం 18వ శతాబ్దపు ఫ్రెంచి సిద్ధాంతవేత్తల్నికూడ, ముఖ్యంగా వారి ప్రత్యేక తాత్విక కృషిలో యించుమించు పూర్తిగా ఆకట్టుకొంది. అయితే ఫ్రెంచి సిద్ధాంతవేత్తలు ఖచ్చితంగా తత్వశాస్త్రానికి సంబంధించని కృషిలో మాత్రం గతితర్కాన్ని గురించి ప్రతిభావంతమయిన గ్రంథాలే రాశారు. ఉదా: డిడ్రో రచించిన "రామో మేనల్లుడు," రూసో రచించిన "మానవుల్లో అసమానతకు మూలకారణం గురించి చర్చలు"), ఈ రెండు విధాలైన ఆలోచనా ధోరణినీ ఇక్కడ క్లుప్తంగా వివరిస్తాను.

మనం స్థూలంగా ప్రకృతిని గురించిగాని, మానవజాతి చరిత్రను గురించిగాని, బౌద్ధిక కృషిని గురించిగాని పర్యాలోచించేటప్పుడు మొదట అనంతమైన సంబంధాలూ, ప్రతిచర్యలూ, సంయోగ వియోగాలూ గోచరిస్తాయి. ఏదీ ఉన్నచోట వుండదు, ఉన్నవిధంగా ఉండదు; ప్రతీదీ చలనం కలిగి వుంటుంది, మారుతూ వుంటుంది, ఆవిర్భవిస్తూ నశిస్తూ వుంటుంది. ఈవిధంగా మనం పూర్తి చిత్రాన్ని చూస్తాం; దాని భాగాలు మాత్రం యెంతో కొంతమేరకు యింకా నిగూఢంగా వుంటాయి. మనకు చలనాలూ, పరివర్తనలూ, సంబంధాలూ గోచరిస్తాయేగాని చలించేవీ, పరివర్తన చెందేవీ, సంబంధం కలిగివుండేవీ మాత్రం గోచరించవు. ప్రపంచాన్ని గురించిన ఈ ప్రాచీన దృక్పథం, అమాయక దృక్పథం (అయితే ఇది సక్రమ దృక్పథమే) ప్రాచీన గ్రీక్ తత్వవేత్తలది. దీన్ని మొట్టమొదట స్పష్టంగా రూపొందించినది హెరాక్లిటస్. అతడిలా చెప్పాడు: ప్రతీదీ ఉంది, లేదు; ప్రతీదీ అస్థిరంగా ఉండటం, ప్రతీదీ నిరంతరం మారుతూ వుండటం; నిరంతరం ఆవిర్భవిస్తూ నశిస్తూ ఉండటమే యిందుకు కారణం.

ఈ భావం పైకికనిపించే మొత్తం చిత్రంయొక్క సాధారణ స్వభావాన్ని సరిగానే ప్రతిబింబించినప్పటికీ మొత్తం చిత్రంలోని వివరాలను స్పష్టం చేసేందుకు మాత్రం సరిపోదు. ఆ వివరాలను మనం అవగాహన చేసుకోనంతకాలం మొత్తం చిత్రాన్ని గురించి సమగ్రమైన, స్పష్టమైన అభిప్రాయం ఏర్పడదు. వాటిని అర్థంచేసుకోవాలంటే వాటి స్వాభావిక సంబంధాలనుంచి, లేక చారిత్రక సంబంధాలనుంచి వాటిని విడదీసి చూడాలి; ఒక్కొక్క వివరాన్నే, దాని లక్షణాల్నిబట్టీ ప్రత్యేక కారణాల్నిబట్టీ ఫలితాలు మొదలైనవాటినిబట్టీ వేర్వేరుగా విశ్లేషించాలి. ఇది ప్రధానంగా ప్రకృతిశాస్త్రం, చారిత్రక పరిశోధకులూ చేయవలసిన పని. ఈ విజ్ఞానశాస్త్ర విభాగాల్ని ప్రాచీన గ్రీకులు నిర్లక్ష్యం చేశారు. ఇందుకు కారణం లేకపోలేదు. మొట్టమొదట వారు యీ విజ్ఞానశాస్త్ర విభాగాల కవసరమైన సమాచారాన్ని సేకరించవలసివచ్చింది. ఏదైనా ఒకదాన్ని విశ్లేషణ చేయాలన్నా, పోల్చిచూడాలన్నా, వర్గీకరణ చేయాలన్నా ప్రకృతినుంచీ, చరిత్రనుంచీ కొంత సమాచారం సేకరించాలి.

కాగా అలెగ్జాండ్రియన్ దశలో[83] గ్రీకులు ప్రకృతిశాస్త్రాల పునాదుల్ని పరిశోధించారు. ఆ తర్వాత మధ్యయుగాల్లో అరబ్బులు ఇందుకు పూనుకున్నారు. నిజమైన ప్రకృతిశాస్త్రం 15వ శతాబ్దపు ఉత్తరార్ధంలో ప్రారంభమయింది. ఆతర్వాత అది అంతకంతకు వేగంగా పురోగమించింది. గత 400 సంవత్సరాల్లోనూ ప్రకృతికి సంబంధించిన మన జ్ఞానం అపారంగా అభివృద్ధిచెందడానికి దారితీసిన కీలక పరిశోధనలేవంటే: శాస్త్రవేత్తలు ప్రకృతిని వేర్వేరు భాగాలుగా విశ్లేషించడం; వేర్వేరు ప్రకృతి పరిణామాలనూ, వస్తువులనూ వేర్వేరు వర్గాలుగా విభజించడం; జీవరాసుల శరీరాల్లోని భాగాలను అనేక రూపాల్లో పరిశీలించడం. అయితే, యీ పరిశోధనాపద్ధతి యిదివరకులాగే, ప్రకృతిలోని వస్తువులనూ, పరిణామాలనూ విడివిడిగా, మొత్తంతో వాటికి గల సంబంధాలనుంచి వేరుపరచి చూచే సంప్రదాయాన్నే పెంచి పోషించింది; వాటి గతిలో కాక స్థితిలో, మార్పులో కాక అస్తిత్వంలో, సజీవ స్థితిలో కాక నిర్జీవస్థితిలో వీక్షించే సంప్రదాయాన్నే అది వారసత్వంగా యిచ్చింది. ఇట్టి దృక్పథం బేకన్, లోక్‌ల చేత ప్రకృతిశాస్త్రంనుంచి తత్వశాస్త్రానికి ఎప్పుడైతే సంక్రమింపజెయ్యబడిందో, అప్పుడది సంకుచితమైన అధిభౌతిక ఆలోచనాపద్ధతికి దారితీసింది. ఇది గత శతాబ్దంయొక్క ప్రత్యేక లక్షణం.

అధిభౌతికవాది దృష్టిలో వస్తువులూ, వాటి మానసిక ప్రతిబింబాలూ, భావాలూ విడివిడిగా ఉంటాయి. ఒకదాని తర్వాత ఒకటి, ఒకదానితో సంబంధం లేకుండా ఒకటి ఉంటాయి. వాటిని స్థిర రూపంలో, స్థాణు రూపంలో, శాశ్వత రూపంలో పరిశీలించవలసి వుంటుంది. వాటిని అతడు పరస్పరం పొసగని భిన్న రూపాల్లో వీక్షిస్తాడు. "ఇది ఔను, ఇది కాదు అనే విధంగా ప్రతిదాన్నీ చూస్తాడు; వాటికతీతమైనవన్నీ దుష్టత్వంనుంచే ఉత్పన్నమవుతాయి."* అతని దృష్టిలో ప్రతీ వస్తువూ ఉండడమో లేక పోవడమో మాత్రమే జరుగుతుంది; ఒక సమయంలో ఒక వస్తువు మరో వస్తువుగా ఉండదు. ధనాత్మక లక్షణం, ఋణాత్మక లక్షణం బొత్తిగా పొసగవు. కారణం, ఫలితం (effect) ఒక దానితో ఒకటి పోటీగా ఉంటాయి.

పైకి యీ విధమైన ఆలోచనా పద్ధతి చాలా స్పష్టాతిస్పష్టంగా కనిపిస్తుంది. ఎందుచేతంటే యిది ఎంతో చక్కని లోకజ్ఞానం అంటారే అది. కాని బహు హుందాగా కనిపించే యీ లోకజ్ఞానం, తన నాలుగు గోడలనూ దాటి విశాలమైన పరిశోధనా ప్రపంచంలో ప్రవేశిస్తే మాత్రం ఎంత తమాషా అయిన సాహసకృత్యాలను ప్రదర్శిస్తుందో చూడవలసిందే. అధిభౌతిక ఆలోచనా పద్ధతి అనేకరంగాల్లో సమర్థనీయం, అవసరమూను; ఆ రంగాల విస్తృతి ఒక్కొక్క వస్తువుయొక్క పరిణామంయొక్క స్వభావాన్నిబట్టి మారుతూ

---

* బైబిలు, మాథ్యూ, 5వ ప్రకరణం, 37వ గీతికి. – సం.

వుంటుంది. చివరకు అధిభౌతిక దృక్పథం ఒక పరిధిని చేరుకొంటుంది; దాన్ని దాటితే అది పాక్షిక స్వభావంగలదిగాను, సంకుచితమైనదిగాను, అనిర్దిష్టమైనదిగాను తయారవుతుంది. పరిష్కరించలేని వైరుధ్యాలలో అది చిక్కుకొని దారితప్పుతుంది. వేర్వేరు వస్తువులను గురించి ఆలోచించేటప్పుడది వాటి మధ్య సంబంధాల్ని విస్మరిస్తుంది. వాటి అస్తిత్వాన్ని గురించి ఆలోచించేటప్పుడు దాని మొదలు ఏమిటో, తుది ఏమిటో మరచిపోతుంది; వాటి నిశ్చలస్థితిని గురించి ఆలోచించేటప్పుడు చలనాన్ని మరచిపోతుంది. అరణ్యంలో అల్లిబిల్లిగా వున్న చెట్లను అది చూడగలదు, కాని మొత్తంగా అరణ్యాన్ని మాత్రం చూడలేదు.

రోజువారీ జీవితానుభవంలో మనకి కొన్ని విషయాలు తెలుసు. ఉదాహరణకు ఒక జంతువు బ్రతికివుందో, చనిపోయిందో మనం చెప్పగలం. కాని యింకా లోతుగా పరిశీలిస్తే, అనేక సందర్భాల్లో యిది చాలా క్లిష్టసమస్యగా తోస్తుంది. న్యాయశాస్త్రవేత్తలకిది అనుభవైకవేద్యమే. తల్లి గర్భంలో వున్న ఒక శిశువును చంపడం హేతువాదదృష్ట్యా ఏ హద్దుల్లో సమర్థనీయం? ఏ హద్దుల్ని దాటితే అది హత్య అవుతుంది? అనే ప్రశ్నకు సమాధానం చెప్పడానికీ, హద్దుల్ని నిర్ణయించడానికీ న్యాయశాస్త్రవేత్తలు బుర్రలు పగలగొట్టుకున్నారు. అదేవిధంగా, ఒక ప్రాణి ఏ క్షణంలో చనిపోయిందో నిర్దిష్టంగా చెప్పడం అసాధ్యం, ఎందుచేతంటే, మరణమనేది ఒక్క క్షణంలో జరగదనీ, సుదీర్ఘ కాలక్రమంలో అది జరుగుతూ వుంటుందనీ శరీరశాస్త్రజ్ఞులు నిరూపించారు:

ఇలాగే ప్రతి సేంద్రియజీవీ ప్రతిక్షణమూ తనకు తానుగా వుంటూనే, మరొకటిగా కూడా వుంటుంది; ప్రతి క్షణమూ అది బయటినుంచి తీసుకొనే కొంత పదార్థాన్ని జీర్ణించుకొంటూ, యితర పదార్థాల్ని బయటికి విసర్జిస్తూ ఉంటుంది; ప్రతి క్షణమూ దాని శరీరంలో కొన్ని జీవకణాలు నశిస్తూ, మరికొన్ని కొత్తగా పుడుతూవుంటాయి; దాని శరీరంలోని పదార్థం తక్కువో ఎక్కువో కాలంలో నూతన పదార్థంగా మారి యితర పదార్థ అణువులు దాని స్థానంలో ప్రవేశిస్తాయి. ఈవిధంగా ప్రతి సేంద్రియజీవీ నిరంతరం తనకు తానుగా వుంటూ, మరొకటిగా కూడా ఉంటుంది.

అంతేకాదు, ఇంకా లోతుగా పరిశీలనలు జరిపితే, ఒక వస్తువులోగాని విషయంలోగాని ధనాత్మక రుణాత్మక లక్షణాలు ఒకదాని కొకటి భిన్నమైనట్టివేకాక, అవినాభావమైనవనీ, అవెంతగా వ్యతిరేకమైనప్పటికీ పరస్పరం ఒకదానిలో ఒకటి చొచ్చుకుంటాయనీ తెలుసుకోవచ్చు. అలాగే కారణం – ఫలితం అనేవాటిని వాటంతటికి అవిగా ప్రత్యేక విడి సందర్భానికీ వర్తింపజేయవచ్చు. కాని, మొత్తం ప్రపంచంతో వాటికిగల సంబంధాలను పరిశీలిస్తే మాత్రం ఒకదానిలో ఒకటి చొచ్చుకుపోతాయి. సర్వవ్యాప్తమయిన చర్య – ప్రతిచర్యల్లో కారణఫలితాలు నిరంతరం ఒకదాని స్థానాన్నొకటి ఆక్రమిస్తూ వుంటాయి; ఈవేళ యిక్కడ

కారణంగా వున్నది రేపు అక్కడ ఫలితంగానూ, ఈవేళ యిక్కడ ఫలితంగా వున్నది రేపు అక్కడ కారణంగానూ మారుతూ వుంటాయి.

ఈ గతిక్రమాల్లోనూ, ఆలోచనా రీతుల్లోనూ ఏ ఒక్కటీ అధిభౌతిక పరిధుల్లో ఇమడవు. కాని గతితర్కం అలా కాదు. అది వస్తువుల్నీ, వాటి మానసిక ప్రతిబింబాలైన భావాల్నీ పరస్పర సంబంధాల్లో, సంయోగ వియోగాల్లో, చలనంలో, ఆవిర్భావంలో, నాశనంలో విలోకిస్తుంది. అందువల్ల పైన పేర్కొన్న పరిణామక్రమాలన్నీ గతితార్కిక పద్ధతికి నిదర్శనలు.

కాబట్టి, ప్రకృతి గతితర్కానికి చక్కని నిదర్శనం. ఆధునిక ప్రకృతిశాస్త్రం ఎంతో సమాచారంతో దీన్ని రుజువుచేసింది. రోజురోజుకూ యీ సమాచారం అధికమవుతోంది. అంత్య పరిశీలనలో, ప్రకృతి అధిభౌతిక పద్ధతిలో కాక గతితార్కిక పద్ధతిలో పరివర్తనచెందు తోందనీ, నిరంతరం చక్రక్రమంలో పునరావృత్తమవడం కాక, నిజమైన చారిత్రక పరిణామక్రమంలో పురోగమిస్తోందనీ ఆధునిక ప్రకృతిశాస్త్రం నిరూపించింది. ఈ సందర్భంలో మనం డార్విన్‌ని అందరికంటె ముందుగా పేర్కొనాలి. సమస్త సేంద్రియజీవులూ — చెట్లు, జంతువులు, చివరకు మానవుడు — లక్షలాది సంవత్సరాల పరిణామక్రమంలో రూపొందినట్లు అతడు నిరూపించాడు. ఆవిధంగా ప్రకృతిని గురించిన అధిభౌతిక దృక్పథాన్ని అత్యంత శక్తివంతంగా దెబ్బతీశాడు. కాని, గతితార్కిక దృక్పథం అలవరచుకున్న ప్రకృతి శాస్త్రజ్ఞులు మాత్రం బహు అరుదుగానే వున్నారు. శాస్త్రపరిశోధనల ఫలితాలకూ, ముందే ఏర్పరచుకున్న ఆలోచనాధోరణులకూ మధ్య యీ విధమైన వైరుధ్యమే, యీనాడు ప్రకృతి శాస్త్ర సిద్ధాంతాల్లో వ్యాపించివున్న అపారమైన గందరగోళానికీ; గురువులూ, శిష్యులూ కూడా నిస్పృహలో మునగడానికీ, రచయితలు, పాఠకులు కూడా దిక్కుతోచని స్థితిలో పడడానికీ కారణం.

అందువల్ల, గతితార్కిక పద్ధతిద్వారానే మనం విశ్వాన్ని గురించీ, దాని పరిణామాన్ని గురించీ, మానవజాతి పురోగతిని గురించీ, ప్రజల మనస్సుల్లో ప్రతిబింబించే యీ పరిణామాన్ని గురించీ ఖచ్చితమైన పరిజ్ఞానం సంపాదించగల్గుతాం. గతితర్కం జీవితానికి సంబంధించిన, మరణానికి సంబంధించిన, అభివృద్ధికర మార్పులకు సంబంధించిన, అభివృద్ధినిరోధక మార్పులకు సంబంధించిన అనంతమైన చర్యలను — ప్రతిచర్యలను ఎల్లప్పుడూ దృష్టిలో వుంచుకొంటుంది. నూతన జర్మన్ తత్వశాస్త్రం ఈ ధోరణిలో కృషిచేసింది. సూర్యమండలం స్థిరంగాను, శాశ్వతంగాను ఉంటుందన్న న్యూటన్ సిద్ధాంతాన్ని ఖండించడంతో కాంట్ తన పరిశోధనలు ప్రారంభించాడు. సూర్యమండలం చారిత్రక పరిణామం ఫలితంగా రూపొందిందని అతడు నిరూపించాడు. అనంత విశ్వంలో పరిభ్రమించే ఒక నీహారికా ద్రవ్యరాశినుంచి సూర్యుడూ, యితర గ్రహాలూ ఏర్పడ్డాయని అతడు నిర్ధారణచేశాడు. దీనినుంచి, అలా ఏర్పడ్డ సూర్యమండలం అవశ్యంగా అంతరిస్తుందని నిరూ

పించాడు; ఈ సిద్ధాంతాన్ని అర్ధశతాబ్దం తర్వాత లాప్లాస్ గణితశాస్త్ర ఆధారాలతో ధృవపరిచాడు. మరో అర్ధశతాబ్దం తర్వాత ఖగోళశాస్త్రజ్ఞులు స్పెక్ట్రోస్కోప్ సహాయంతో, వివిధ సంఘనన స్థాయిల్లో వున్న అలాంటి తాపదీప్త వాయుమేఘాలున్నట్లు కనుగొన్నారు.

ఈ నూతన జర్మన్ తత్వశాస్త్రం హేగెల్ సిద్ధాంతంలో సంపూర్ణత్వం పొందింది. దాని గొప్పతనం ఏమంటే, మొట్టమొదటిసారిగా అది యావత్ప్రపంచాన్నీ – ప్రకృతికి సంబంధించిన, చరిత్రకు సంబంధించిన, మనస్సుకు సంబంధించిన ప్రపంచం – ఒక పరిణామక్రమంగా, అంటే నిరంతరం చలనంతో కూడుకొన్నదిగా, మార్పుచెందేదిగా, పరివర్తనచెందేదిగా, అభివృద్ధిచెందేదిగా నిరూపించింది. ఈ చలనానికీ, అభివృద్ధికీ మధ్య క్రమానుగతమైన ఆంతరంగిక సంబంధాలెలాంటివో కనుగోడానికి ప్రయత్నించాడు. ఈ దృక్పథంతో చూచినప్పుడు మానవజాతి చరిత్ర కేవలం అర్థరహితమైన హింసాకృత్యాల సుడిగుండంగా కాక, పరిణత తాత్విక హేతుజ్ఞాన న్యాయపీఠం ముందు అన్నీ సమానంగా ఖండనార్హాలైనవిగా, ఎంత త్వరగా విస్మరింపబడితే అంత మంచివిగా కాక మానవుని పరిణామక్రమంగా సాక్షాత్కరిస్తుంది. బుద్ధిశాలురు నిర్వర్తించవలసిన కర్తవ్యం, యీ పరిణామక్రమంయొక్క క్రమానుగత పురోగతినీ, దాని వంకరటింకర మార్గాలనూ ఆకళింపు చేసుకొనడం; పైకి యాదృచ్ఛిక విషయాలుగా కనబడే వాటి అంతస్సత్యాల్నీ, మూల సూత్రాన్నీ కనుగొనడం.

హేగెల్ సిద్ధాంతం ప్రతిపాదించిన సమస్యను ఆ సిద్ధాంతం పరిష్కరించలేదు – నిజమే. అయితే యిది మనకు అప్రస్తుతం. ఆ సమస్యను అది ప్రతిపాదించడమే చారిత్రక ప్రాధాన్యంగల విషయం. ఏ ఒక్క వ్యక్తీ పరిష్కరించగల సమస్య కాదు అది. సెంట్-సైమన్ వలె హేగెల్ కూడ తన కాలపు సర్వ విజ్ఞాన నిష్ణాతుడు అయినప్పటికీ, కొన్ని పరిమితులకతడు లోనుకావలసి వచ్చింది. మొదటి విషయం, అతని జ్ఞానం పరిమితమైనది; రెండవ విషయం, అతని కాలంలోని జ్ఞాన విస్తృతికీ, జ్ఞాన ఔన్నత్యానికీ కొన్ని పరిమితులున్నాయి; మూడవ విషయం, హేగెల్ భావవాది. అతని దృష్టిలో, మానవుని ఆలోచనలు ఎంతోకొంత మేరకు నిజమైన వస్తువుల, పరిణామక్రమాల అనిర్దిష్ట ప్రతిబింబాలు కావు; తద్భిన్నంగా వస్తువులూ, వాటి పరిణామం "భావం"యొక్క ప్రతిబింబాలు, ఈ "భావం" శాశ్వతంగా, ప్రపంచం పుట్టక ముందునుంచీ ఉంటోంది. ఈవిధమైన ఆలోచనా పద్ధతి ప్రతిదాన్నీ తల్లకిందులుగా చూస్తుంది; ప్రపంచంలో వివిధ వస్తువులమధ్య అసలు సంబంధాన్ని పూర్తిగా తల్లకిందులుచేసి చూస్తుంది. హేగెల్ ఎంతో చక్కగా, ఎంతో ప్రతిభావంతంగా అనేక ప్రత్యేక ఘటనల సముదాయాలను ఆకళింపు చేసుకున్నప్పటికీ, పైకారణాలవల్ల అతని ఆలోచనా ధోరణి కలగాపులగమైనది, కల్పితమైనది, కృతకమైనది, – ఒక్కమాటలో చెప్పాలంటే, వివరాల్లో అపసవ్యమైనది. అసలు హేగెల్ సిద్ధాంతమే ఓ పెద్ద గర్భవిచ్ఛిత్తి.

అయితే, అలాంటి సిద్ధాంతాల్లో అదే ఆఖరుది కూడా. నిజానికి అదొక ఆంతరంగిక వైరుధ్యంలో, పరిష్కార సాధ్యం కాని వైరుధ్యంలో చిక్కుకొంది. ఒకవైపు, అతని ప్రధాన ప్రతిపాదన, మానవ చరిత్ర అంతా ఒక పరిణామక్రమం అనే భావం; ఆ పరిణామక్రమంయొక్క అంతిమ మానసిక రూపం ఏ పరమ సత్యమనబడేదాన్ని కనిపెట్టడంద్వారానూ సాక్షాత్కారం కాదంటాడు. కాని రెండోవైపు, అది యీ పరమ సత్యంయొక్క సారాంశమే నంటాడు. ప్రకృతిలోను, చరిత్రలోను సకల విషయాలను గురించిన జ్ఞానం, సకల కాలాలకూ వర్తించే జ్ఞానం అసలు ఉండదు. అలా ఉంటుందనడం గతితర్కంయొక్క మూలసూత్రానికే విరుద్ధం. బాహ్య ప్రపంచాన్ని గురించిన జ్ఞానం ఒక యుగం తర్వాత మరొక యుగంలో పెద్దపెద్ద అడుగులు వేసుకొంటూ పురోగమిస్తుంది. దీన్ని గతితర్కంయొక్క మూల సూత్రం తిరస్కరించదు; పైగా అంగీకరిస్తుంది.

జర్మన్ భావవాదంలోని యీ ప్రధాన వైరుధ్యాన్ని గ్రహించడంవల్ల ఆధునిక భౌతిక వాదం ముందుకు వచ్చింది; అంతేగాని 18వ శతాబ్దపు అధిభౌతిక, యాంత్రిక భౌతిక వాదమే మళ్లీ ప్రత్యక్షం కాలేదు. ఇది గమనించవలసిన విషయం. పాత భౌతికవాదం గత చరిత్రనంతటినీ హేతురహితమైన, దౌర్జన్యయుతమైన సంఘటనల గజిబిజి గుట్టగా భావించింది; కాని ఆధునిక భౌతికవాదం చరిత్రనంతటినీ మానవజాతియొక్క పరిణామక్రమంగా భావించింది; దాని నియమాలను కనిపెట్టడం తన లక్ష్యంగా స్వీకరించింది. ప్రకృతి అంతా చిన్నచిన్న వలయాల్లో పరిభ్రమిస్తోందనీ, ఖగోళాలన్నిటితోబాటు యీ పరిభ్రమణ కూడా శాశ్వతంగా, ఎట్టి మార్పూ లేకుండా జరుగుతోందనీ న్యూటన్ సిద్ధాంతీకరించాడు. ఇలాగే లిన్నేయను సేంద్రియజీవులేవీ మార్పుచెందవని ప్రతిపాదించాడు. ఈ అభిప్రాయాల్నే 18వ శతాబ్దపు ఫ్రెంచి తత్వవేత్తలూ, హేగెల్ సైతం నమ్మారు. కాని, ప్రకృతిశాస్త్రంలో ఇటీవల పరిశోధనలమీద ఆధునిక భౌతికవాదం ఆధారపడుతుంది. ప్రాణికోటివలెనే ప్రకృతికి కూడా, ఒక చరిత్ర ఉందనీ ఖగోళాల్లో జీవారాసులు అనుకూల పరిస్థితుల్లో జీవిస్తున్నట్లే, ఖగోళాలు కూడా పుడుతూ నశిస్తూ ఉంటాయనీ ఇటీవలి శాస్త్రపరిశోధనలు రుజువుచేశాయి. ఆధునిక భౌతికవాదం యీ సిద్ధాంతాలను తనలో యిముడ్చుకొంది. ఒకవేళ ప్రకృతి పునరావృత్తమయే వలయాల్లోనే యింకా పరిభ్రమిస్తోందనుకొన్నప్పటికీ, యీ వలయాలు యింకా అనంతమైన ప్రమాణాల్ని పొందుతున్నాయి. ఈ రెండు విధాలా కూడా ఆధునిక భౌతికవాదం ప్రధానంగా గతితార్కిక స్వభావాన్నే కలిగి వుంది. మిగతా విజ్ఞానశాస్త్రాల మందమీద, రాణి మాదిరిగా పెత్తనం చేస్తున్నట్లు నటించే తత్వశాస్త్రంయొక్క తోడ్పాటు, దానికిక ఎంతమాత్రం అవసరంలేదు. ఒక్కొక్క విజ్ఞానశాస్త్రం వేర్వేరుగా మొత్తం వస్తుసముదాయంలోను, వాటిని గురించిన జ్ఞాన సంపుటిలోను తన స్థానాన్ని నిరూపించుకొని తీరవలసివచ్చినప్పుడు ఆ మొత్తం వస్తుసముదాయాన్ని గురించీ, వాటిని గురించిన

జ్ఞానసంపుటిని గురించీ పరిశోధనలు చేసేందుకొక ప్రత్యేక విజ్ఞానశాస్త్రం అనవసరం. అప్పుడిక పూర్వతత్వశాస్త్ర మంతటిలోనూ యింకా మిగిలివున్నవి ఆలోచనయొక్కా, దాని నియమాలయొక్కా శాస్త్రం మాత్రమే – అంటే, లాంఛనప్రాయమైన తర్కశాస్త్రం, గతితర్కమూను. మిగతావన్నీ ప్రకృతి శాస్త్ర, చరిత్ర విభాగాలక్రింద వస్తాయి.

ప్రకృతికి సంబంధించిన దృక్పథంలో యీ విధమైన విప్లవం రావడానికి విజ్ఞాన శాస్త్ర పరిశోధనలూ, వాటివల్ల లభించే ఖచ్చితమైన సమాచారమూ అవసరమయాయి; చరిత్రకు సంబంధించిన దృక్పథంలో నిర్ణాయకమైన మార్పు రావడానికి అంతకు చాలా ముందే కొన్ని చారిత్రక పరిణామాలు దోహదం చేశాయి. ఉదాహరణకు 1831లో లియోన్‌లో మొట్టమొదటి కార్మిక తిరుగుబాటు జరిగింది. 1838–1842 మధ్య మొట్టమొదటి జాతీయ కార్మికవర్గ ఉద్యమం, ఇంగ్లీషు చార్టిస్టు ఉద్యమం, ఉచ్చ స్థాయి నందుకొంది. యూరపులో బాగా అభివృద్ధిచెందిన దేశాల చరిత్రలో ఒకవైపు ఆధునిక పరిశ్రమలు అభివృద్ధిచెందిన మేరకు, మరోవైపు ఇటీవలే అధికారాన్ని హస్తగతం చేసుకున్న బూర్జువావర్గ పెత్తనం అభివృద్ధిచెందే మేరకు శ్రామికవర్గానికీ, పెట్టుబడిదార్లకూ మధ్య వర్గపోరాటం ముందుకు వచ్చింది. పెట్టుబడిదార్ల ప్రయోజనాలు, కార్మికుల ప్రయోజనాలు ఒకటేననీ, నిరాటంకమైన స్వేచ్ఛా వ్యాపారంవల్ల సర్వమానవ సామరస్యం, సర్వమానవ సౌభాగ్యం లభిస్తాయనీ బూర్జువా ఆర్థికవేత్తలు చేసే ఉపదేశాల్లోని బూటకాన్ని వాస్తవ పరిస్థితులు అంతకంతకు పటాపంచలొనర్చాయి. ఫ్రెంచి, ఇంగ్లీషు సోషలిజంతోబాటు ఇవన్నీ ఎవరూ యిక విస్మరించలేని విషయాలు, నిజానికి ఫ్రెంచి సోషలిజం, ఇంగ్లీషు సోషలిజం ఆ ఘటనలయొక్క సైద్ధాంతిక వ్యక్తీకరణ మాత్రమే. అయితే చాల అసమగ్రమైన సిద్ధాంత వ్యక్తీకరణ. కాని చరిత్రను గురించిన పాత భావవాద దృక్పథ మింకా ప్రబలంగానే వుంది; అది యింకా తిరస్కరింపబడలేదు. ఆర్థిక ప్రయోజనాలపై ఆధారపడే వర్గపోరాటాలను గురించి దాని కింకా తెలియదు. అసలు ఆర్థిక ప్రయోజనాలంటేనే దానికి తెలియదు. ఉత్పత్తీ, ఆ ఉత్పత్తికి సంబంధించిన అన్ని ఆర్థిక సంబంధాలూ "నాగరికత చరిత్ర"లో నిమిత్తమాత్రమైన విషయాలుగా, అప్రధానమైన విషయాలుగా దానికి గోచరించాయి.

ఈ నూతన పరిణామాలవల్ల, గత చరిత్రనంతా తప్పనిసరిగా ఒక నూతన దృక్పథంతో పరిశీలించవలసివచ్చింది. ఆదిమ దశలు తప్ప, గత చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్ర అనీ, సమాజంలో యీ పోరాడే వర్గాలు ఎల్లప్పుడూ ఉత్పత్తి పద్ధతులనుంచీ, మారకపు విధానంనుంచీ, క్లుప్తంగా చెప్పాలంటే ఆయా కాలాల ఆర్థిక పరిస్థితులనుంచీ ఉత్పన్నమయాయని కనుగొన్నారు. ఆర్థిక వ్యవస్థే సమాజానికి నిజమైన పునాదిని సమకూరుస్తుంది. దాన్నుంచే అంత్య పరిశీలనలో మొత్తం ఉపరి నిర్మాణమంతా – అంటే,

ఆయా చారిత్రక దశల్లో న్యాయశాస్త్రం, రాజకీయ వ్యవస్థ, మత ధోరణులూ, తాత్విక భావాలూ – ఎలా రూపొందాయో తెలుసుకోబడింది. హేగెల్ చరిత్రను అధిభౌతికవాదంనుంచి విముక్తి చేశాడు; గతితార్కిక దృష్టితో దాన్ని వీక్షించాడు. కాని, చరిత్రను గురించిన అతని దృక్పథం మాత్రం ప్రధానంగా భావవాద దృక్పథం. ఇప్పుడు ఆ భావవాదం దాని చివరి ఆశ్రయంనుంచి, అంటే చరిత్రను గురించిన తత్వశాస్త్రంనుంచి, వెడలగొట్టబడింది; యిప్పుడు భౌతికవాద దృష్టితో చరిత్రను పరిశీలించే పద్ధతి కనిపెట్టబడింది. ఇదివరలో మానవుని "జ్ఞానాన్ని" బట్టి అతని "ఉనికి" ఎలాంటిదో తెలియజేసేవారు; యిప్పుడు అతని "ఉనికి"ని బట్టి "జ్ఞానం" ఎలా ఎలా వుంటుందో తెలియజేసే పద్ధతి కనిపెట్టబడింది.

నాటినుంచీ సోషలిజం ఒకానొక అపూర్వమేధావి యాదృచ్ఛికంగా కనిపెట్టిన సిద్ధాంతంగా కాక, చారిత్రక గతిలో ఉద్భవించిన రెండు వర్గాల మధ్య – పెట్టుబడిదార్లు, కార్మికులు – జరిగే పోరాటంయొక్క అనివార్య ఫలితంగా పరిణతమైంది. దాని కర్తవ్యం యిదివరలో మాదిరిగా, సాధ్యమైనంత ఉత్కృష్టమైన సమాజాన్ని తయారుచేయడం కాదు. ఈ వర్గాలూ, వాటిమధ్య వైరుధ్యాలూ ఏ చారిత్రక ఆర్థిక పరిణామాల క్రమం నుంచి అవశ్యంగా ఉత్పన్నమయాయో, ఆ క్రమాన్ని పరిశీలించడం, ఆ వైరుధ్యాలను నిర్మూలించే సాధనాలను ఆ ఆర్థిక పరిస్థితుల్లోనే కనుగొనడమూను. ఇదే నేడు సోషలిజం నిర్వర్తించవలసిన కర్తవ్యం. ఒకవైపు ప్రకృతిని గురించిన ఫ్రెంచి భౌతికవాదుల దృక్పథానికీ, మరోవైపు గతితర్కం – ఆధునిక ప్రకృతిశాస్త్రాలకూ ఎంత భేదం వుందో, యిదివరకటి సోషలిజానికీ, ఆధునిక భౌతికవాద దృక్పథానికీ అంత భేదం వుంది. ఇదివరకటి సోషలిజం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, దాని పర్యవసానాలనూ ఖచ్చితంగా ఖండించింది. కాని వాటికి గల కారణాలను అది వివరించలేకపోయింది; అందువల్ల వాటిని అధిగమించలేక పోయింది. అది ఎందుకూ పనికిమాలినదని చెప్పి, దానిని తిరస్కరించడం మాత్రమే అది చేయగలిగింది. పెట్టుబడిదారీ విధానంలో అనివార్యంగా వుండే దోపిడీని సోషలిస్టులు ఎంత తీవ్రంగా ఖండించినా దాని సారాంశమేమిటో అదెలా ఉద్భవించిందో స్పష్టంగా చూడ లేకపోయారు. ఇందుకు చేయవలసింది: (1) పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని చారిత్రక దృష్టితో చిత్రించాలి. ఒకానొక చారిత్రక దశలో అది ఎందువల్ల అనివార్యమో చూపెట్టాలి. దానితోబాటు అది ఎందువల్ల అనివార్యంగా పతనమవుతుందో వివరించాలి. (2) దాని ప్రధాన లక్షణాన్ని (ఇది యిప్పటికింకా నిగూఢంగానే వుంది) బయటపెట్టాలి. అదనపు విలువను కనిపెట్టడంద్వారా అది సిద్ధించింది. కార్మికుల శ్రమ ఫలితంలో కొంత భాగాన్ని పెట్టుబడిదార్లు కాజేస్తూవుంటారు. దానికి ప్రతిఫలం ఏమీ ముట్టజెప్పరు. ఇదే పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతికీ, ఆ పద్ధతిలో కార్మికుల దోపిడీకీ మూలం; ఒకవేళ పెట్టుబడిదారు తన కార్మికుని శ్రమశక్తికి పూర్తియైన విలువ చెల్లించినప్పటికీ (అన్ని

వర్తకపు సరుకుల్లాగే అది కూడా మార్కెట్లో లభించే వర్తకపు సరుకు గనుక) దాని కతడు చెల్లించిన దానికంటె ఎక్కువ విలువనే గుంజుకుంటాడు. అంత్య పరిశీలనలో, ఆస్తిపర వర్గాల చేతుల్లో నిరంతరం అంతకంతకు అధికంగా పోగుబడే పెట్టుబడుల విలువలన్నీ కలిస్తే యీ అదనపు విలువ ఏర్పడుతుంది. ఈవిధంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క పుట్టుక, పెట్టుబడియొక్క పుట్టుక వివరించబడ్డాయి.

ఈ రెండిటినీ — అంటే చరిత్రను గురించిన భౌతికవాద దృక్పథాన్నీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి కంతకూ మూలం అదనపు విలువ అనే విషయాన్నీ — కనిపెట్టింది మార్క్స్. ఈ ఆవిష్కరణల ఫలితంగానే సోషలిజం ఒక శాస్త్రంగా రూపొందింది. ఇకముందు చెయ్య వలసినది దాని వివరాలనూ, దానిలోని పరస్పర సంబంధాలనూ విపులీకరించడమే.

## III

మానవుని జీవితాన్ని పెంచి పోషించే వస్తువుల ఉత్పత్తీ, తర్వాత వాటి మారకం — యిదే మొత్తం సామాజిక వ్యవస్థకంతకూ పునాది అని చరిత్రను గురించిన భౌతికవాద దృక్పథం చెబుతుంది. చరిత్రలో అవతరించిన ప్రతి సమాజంలోనూ సంపద ఏవిధంగా విభజింపబడుతుందో, ఏయే వర్గాలుగా లేక తరగతులుగా సమాజం విభజింపబడుతుందో, ఏవేవి ఉత్పత్తి చేయబడుతున్నాయో, అవెలా ఉత్పత్తి చేయబడుతున్నాయో, ఎలా మార్పిడి జరుగుతున్నాయో అనే దానిమీద సామాజిక వ్యవస్థ ఆధారపడి వుంటుంది. ఈ దృష్టితో ఆలోచించినప్పుడు సమాజంలో జరిగే మార్పులన్నిటికీ, రాజకీయ విప్లవాలన్నిటికీ అంతిమ కారణాలు మనుష్యుల మెదడుల్లోకాక, శాశ్వత సత్యం — శాశ్వత ధర్మం అనే భావాలకు సంబంధించిన వారి గాఢ అవగాహనలో కాక, ఉత్పత్తి పద్ధతుల్లోను, మారకపు పద్ధతుల్లోను వచ్చే మార్పుల్లో గోచరిస్తాయి. ఒకానొక చారిత్రక దశకు సంబంధించిన తత్వశాస్త్రంలో కాక, అర్థశాస్త్రంలో అవి గోచరిస్తాయి. నేటి సామాజిక సంస్థలు హేతు బద్ధమైనవి కావనీ, ధర్మబద్ధమైనవి కావనీ ఖండింపబడుతున్నాయంటే, హేతుబద్ధత హేతు రాహిత్యంగాను, సవ్యమైనదంతా అపసవ్యమైనదిగాను పరిగణింపబడుతున్నాయంటే,* ఉత్పత్తి పద్ధతుల్లోనూ, మారకపు పద్ధతుల్లోనూ నెమ్మది నెమ్మదిగా మార్పులు సంభవించాయనీ, అంతకు ముందరి ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సరిపుచ్చుకున్న సామాజిక వ్యవస్థ, వాటికి యికనెంతమాత్రమూ అనుగుణంగా లేదనీ రుజువవుతోంది. దీన్నుంచి మరొకటి

---

* గ్యోతె రచించిన "ఫౌస్ట్" అనే నాటకంలో మెఫిస్టోఫిలెస్ అనే పాత్ర యిలా చెబు తుంది. — సం.

కూడా స్పష్టమవుతోంది; ప్రస్ఫుటం చెయ్యబడిన అసంబద్ధతలనుంచి బయటపడే మార్గాలు కూడా, ఎక్కువో లేక తక్కువో పరిపక్వ రూపంలో, నూతన ఉత్పత్తి విధానాల్లోనే దాగివుండాలన్న మాట. ఈ మార్గాలను ఏవో కొన్ని మూలసూత్రాలనుంచి నిర్ధారణలు చేయడంద్వారాకాక, నేటి ఉత్పత్తి విధానానికి సంబంధించిన కఠోర వాస్తవాలను ఆకళింపు చేసుకొనడంద్వారా కనుగొనవలసి వుంటుంది.

మరైతే, యీ విషయంలో ఆధునిక సోషలిజంయొక్క స్థానం ఏమిటి?

నేటి సామాజిక వ్యవస్థ ప్రస్తుత పాలకవర్గంయొక్క అంటే బూర్జువావర్గంయొక్క సృష్టి. ఈ విషయాన్ని నేడందరూ స్థూలంగా అంగీకరిస్తున్నారు. బూర్జువావర్గం ప్రవేశపెట్టిన ఉత్పత్తి విధానం మార్క్స్ అనంతరం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమని వ్యవహరింపబడుతోంది. దీనికీ, ఫ్యూడల్ వ్యవస్థకూ సంబద్ధత లేదు. ఫ్యూడల్ వ్యవస్థ వ్యక్తులకూ, సామాజిక హోదాలున్నవారికీ, స్థానిక కార్పొరేషన్లకూ ప్రత్యేకాధికారా లిచ్చింది; వంశపారంపర్య పరాధీనతా సంబంధాలను కల్పించింది. వాటి పరిధుల్లోనే మొత్తం సమాజ మంతా నిర్మింపబడింది. బూర్జువావర్గం యీ ఫ్యూడల్ వ్యవస్థను నిర్మూలించింది; దాని శిథిలాలపై పెట్టుబడిదారీ సమాజాన్ని నిర్మించింది. అంటే స్వేచ్ఛా వ్యాపారాన్నీ, వ్యక్తి స్వాతంత్ర్యాన్నీ, న్యాయశాస్త్ర రీత్యా ఆస్తిపరులందరి సమానత్వాన్నీ ప్రతిష్ఠించింది. ఇలాగే యితర అన్ని పెట్టుబడిదారీ హక్కులు కూడా యిచ్చింది. ఆ తర్వాత పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం స్వేచ్ఛగా అభివృద్ధి కాగలిగింది. ఆవిరిశక్తీ, యంత్రాలూ, యంత్రనిర్మాణ పరిశ్రమ — యివన్నీ కార్ఖానాలను ఆధునిక పరిశ్రమలుగా మార్చివేశాయి. అందువల్ల బూర్జువావర్గం పెంచి పోషించిన ఉత్పాదక శక్తులన్నీ అత్యంత వేగంగా, ముందెన్నడూ ఎరుగనంత ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందాయి. అయితే, యిదివరకటి కార్ఖానాలూ, వాటి ప్రాబల్యం క్రిందవున్న చేతివృత్తులూ ఆనాటి వృత్తి సంఘాల ఫ్యూడల్ శృంఖలాలతో ఘర్షణ పడినట్లే, ఇప్పుడు మరింత సమగ్రంగా అభివృద్ధి చెందిన ఆధునిక పరిశ్రమలు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంయొక్క చట్రంతో ఘర్షణలు పడ్డాయి. నూతన ఉత్పాదక శక్తులు, వాటిని వినియోగిస్తూ వచ్చిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని ఇదివరకే అధిగమించాయి. ఉత్పాదక శక్తులకూ, ఉత్పత్తి పద్ధతులకూ మధ్య ఏర్పడ్డ యీ సంఘర్షణ — మానవుని తొలి పాపకార్యానికీ, దైవ నిర్దేశిత ధర్మానికీ మధ్య సంఘర్షణలాగ — మానవుని మనస్సులో పుట్టింది కాదు. ఇది వాస్తవ రూపంలో మనకు బాహ్యంలో వుంది; దీన్ని ప్రవేశపెట్టిన మనుష్యుల అభీష్టాలతోగాని, వారి కార్యకలాపాలతో గాని సంబంధం లేకుండా స్వతంత్రంగా యిది వుంది. వాస్తవరూపంలో వున్న ఈ సంఘర్షణే మానవుని ఆలోచనల్లో ప్రతిబింబించింది. ఈ ప్రతిబింబమే ఆధునిక సోషలిజం. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంకింద ప్రత్యక్షంగా బాధలుపడే కార్మికవర్గం మనస్సుల్లో ఇది ఒక ఆదర్శంగా ప్రతిబింబించింది.

ఈ సంఘర్షణ యెలాంటిదో పరిశీలిద్దాం.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఏర్పడక ముందు, అంటే మధ్యయుగాల్లో, చిన్నచిన్న పరిశ్రమలద్వారా వస్తువులను ఉత్పత్తి చేసే పద్ధతి వ్యాప్తిలో ఉండేది. కార్మికుల సొంత ఆస్తిగా వుండే ఉత్పత్తి సాధనాలమీద అది ఆధారపడి వుండేది. గ్రామసీమల్లో చిన్న రైతులు – స్వేచ్ఛగల రైతులు, లేదా భూదాసులు – వ్యవసాయం చేసేవారు; పట్టణాల్లో చేతివృత్తులన్నీ వృత్తిసంఘాల్లో సంఘటితమై వుండేవి. శ్రమ సాధనాలు – భూమి, వ్యవసాయ పరికరాలు, వర్కుషాపులు, పనిముట్లు – యివన్నీ విడి వ్యక్తులవి ఒక్కొక్క వ్యక్తి ఉపయోగించడానికి మాత్రమే అవి వీలుగా ఉండేవి, అందువల్ల బహుచిన్నవిగా, అల్పంగా కుంచింపబడి వుండేవి. అయితే, సరిగా యీ కారణంగానే అవి, మామూలుగా ఉత్పత్తిదారుకే చెంది వుండేవి. ఈవిధంగా చెల్లాచెదురుగా వున్న కుంచింపబడివున్న ఉత్పత్తి సాధనాలన్నిటినీ కేంద్రీకరించ వలసివచ్చింది, విస్తృత మొనర్చవలసివచ్చింది, బలమైన ఉత్పత్తి సాధనాలుగా మార్చవలసి వచ్చింది. ఇది పెట్టుబడిదారీ విధానంయొక్క చారిత్రక కర్తవ్యం, దాన్ని బలపరిచే బూర్జువా వర్గంయొక్క కర్తవ్యం. ఈ కర్తవ్యం 15వ శతాబ్దం తర్వాత మూడు దశల్లో – సామాన్య సహకారం, కార్ఖానాలు, ఆధునిక పరిశ్రమలు – ఏవిధంగా చారిత్రకంగా నిర్వర్తింపబడిందో మార్క్స్ "పెట్టుబడి" నాల్గవ భాగంలో వివరంగా తెలియజేశాడు. కాని పెట్టుబడిదారీ వర్గం యీ చిన్నచిన్న ఉత్పత్తి సాధనాలను బ్రహ్మాండమైన ఉత్పాదక శక్తులుగా మార్చా లంటే, వ్యక్తులు మాత్రమే ఉపయోగించగల ఉత్పత్తి సాధనాలను సామాజిక ఉత్పత్తి సాధనాలుగా మార్చవలసివచ్చింది; అంటే సమిష్టిగా ఉపయోగించగల సాధనాలుగా మార్చవలసివచ్చింది. రాట్నం స్థానే వడుకుయంత్రం, మగ్గం స్థానే మరమగ్గం, సుత్తి స్థానే ఆవిరిసుత్తి ప్రవేశించాయి. విడి వర్క్‌షాప్ స్థానే ఫ్యాక్టరీ ప్రవేశించింది; ఆ ఫ్యాక్టరీలో వందల, వేల సంఖ్యలో కార్మికులు కలిసి పనిచేస్తారు. ఇలాగే మొత్తం ఉత్పత్తి అంతా వ్యక్తులు చేసే అనేక పనులుగా ఉండక, సామూహిక కార్యాల పరంపరగా మారింది; ఉత్పా దిత వస్తువులు వ్యక్తులచే తయారుచేయబడినవిగా కాక సామాజిక ఉత్పాదిత వస్తువులుగా మారాయి. ఇప్పుడు ఒక్కొక్క ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే నూలు, బట్ట, లోహపు వస్తువులు అనేకమంది కార్మికుల సమిష్టికృషి ఫలితాలు. అవి పూర్తి సరకులుగా తయారై రావా లంటే, వరుసగా అనేకమంది కార్మికుల చేతులు మారవలసి వుంది "దీన్ని తయారు చేసింది నేను; యిది నేను తయారుచేసిన వస్తువు" అని యిప్పుడెవరూ చెప్పలేరు.

అయితే, ఒకానొక సమాజంలో శ్రమ విభజన అనేది ముందే ఊహించుకొన్న ఒక పథకాన్ననుసరించి కాక దానంతట అది క్రమక్రమంగా ప్రవేశించినప్పుడు, అదే ప్రధాన ఉత్పత్తిమార్గం అయినప్పుడు – అట్టి సమాజంలో ఉత్పత్తి అయ్యే సరకులు, వర్తకపు సరకులు అవుతాయి. వాటిమధ్య జరిగే మారకంద్వారానే, అంటే క్రయవిక్రయాలద్వారానే

వ్యక్తిగత ఉత్పత్తిదార్లు తమ బహుముఖావసరాలను యీడేర్చుకోగల్గుతారు. మధ్యయుగాల్లో యిలాగే జరిగేది. ఉదాహరణకు, రైతులు తమ వ్యవసాయ దినుసుల్ని చేతివృత్తులవారి కమ్మి, వారివద్ద చేతితయారీ వస్తువులు కొనుక్కొనేవారు. అట్టి వ్యక్తిగత ఉత్పత్తిదార్ల సమాజంలో, అంటే వర్తకపు సరకులు తయారుచేసేవారి సమాజంలో, నూతన ఉత్పత్తి విధానం చొచ్చుకువచ్చింది. ఒక నిర్దిష్ట పథకాన్ననుసరించి కాక, దానంతట అది అమల్లోకి వచ్చిన యిదివరకటి శ్రమ విభజననుంచి (యిదే మొత్తం సమాజాన్ని శాసిస్తూం డేది) ప్రతి ఫ్యాక్టరీలోనూ ఏర్పాటుచెయ్యబడిన పద్ధతిలో ఒక నిర్దిష్ట పథకాన్ననుసరించే శ్రమ విభజన ఉత్పన్నమయింది. విడి వ్యక్తుల ఉత్పత్తి సరసన సామాజిక ఉత్పత్తి ప్రత్యక్ష మయింది. ఈ రెండు పద్ధతులద్వారా తయారయే వస్తువులు ఒకే మార్కెట్లో విడుదల అయేవి. అందువల్ల యించుమించు సమానమైన ధరకే విక్రయింపబడేవి. కాని దానంతట అది వృద్ధిచెందే శ్రమ విభజనకన్న ఒక నిర్దిష్ట పథకాన్ననుసరించి రూపొందిన ఫ్యాక్టరీ నిర్మాణం ఎక్కువ శక్తివంతమైనట్టిది. చిన్నచిన్న ఉత్పత్తిదార్లు వ్యక్తిగతంగా తయారుచేసే వస్తువులకన్న అనేకమంది వ్యక్తులను నియమించి వారిచే సమిష్టిగా పనిచేయించే ఫ్యాక్టరీలు అంతకంటె ఎక్కువ చౌకగా వస్తువులను ఉత్పత్తిచేసేవి. అందువల్ల ఒక శాఖ తర్వాత మరొక శాఖలో వ్యక్తిగత ఉత్పత్తి కృంగిపోయింది. సామాజిక స్వభావంగల ఉత్పత్తి యిదివరకటి ఉత్పత్తి పద్ధతుల్లో విప్లవకరమైన మార్పు తీసుకొచ్చింది. కాని, దాని విప్లవ స్వభావం అంతగా గుర్తింపబడలేదు. ఎంత తక్కువగా గుర్తింపబడిందంటే, వర్తకపు సరకుల ఉత్పత్తిని పెంచేందుకు మాత్రమే అభివృద్ధి చేసేందుకు మాత్రమే అది ఒక సాధనంగా ప్రవేశపెట్టబడింది. అది రంగంమీద ప్రత్యక్షమయే నాటికి వర్తకపు సరకుల ఉత్పత్తికీ, మారకానికీ కావలసిన సాధన సామగ్రి – అంటే వర్తకపు పెట్టుబడి, చేతివృత్తులు, వేతనశ్రమ – కొంతమేరకు సిద్ధంగానే వున్నాయి. వాటినది విస్తారంగా ఉపయోగంలోకి తెచ్చింది. ఈవిధంగా, సామాజిక స్వభావంగల ఉత్పత్తి విధానం కేవలం వర్తకపు సరకులను తయారుచేసేందు కొక కొత్త సాధనంగా ప్రత్యక్షమవడంతో, వ్యక్తులు ఉత్పత్తిని స్వాయత్తం చేసుకునే పాత పద్ధతులే యథాప్రకారంగా, సమగ్రరూపంలో అమలు జరుగుతున్నాయి. యివే దాని సహజలక్షణమయింది. అది ఉత్పత్తి చేసే వస్తువులకు కూడ యీ పద్ధతులే వర్తింపబడ్డాయి.

మధ్యయుగంనాటి సరకుల ఉత్పత్తి పరిణామ దశలో శ్రమోత్పాదిత వస్తువుల సొంతదారు ఎవరన్న ప్రశ్న ఉదయించడం అసంభవం. ఆ రోజుల్లో వస్తువులను ఉత్పత్తిచేసే ప్రతి వ్యక్తీ సొంత ముడిపదార్థాలను విధిగా కలిగివుండేవాడు; సొంత పనిముట్లను కలిగివుండేవాడు; సొంత శ్రమతో లేదా కుటుంబ మంతటి శ్రమతో ఆ వస్తువులు తయారుచేసేవాడు. అలా తయారైన వస్తువుల్ని అతడు వేరే స్వాయత్తం చేసుకోవలసిన అవసరం

లేదు. ఎందుచేతంటే, అవి పూర్తిగా, సహజసిద్ధంగా అతనివే. అందుచేత ఆ వస్తువులపై అతని స్వామ్యం అతని సొంత శ్రమమీద ఆధారపడివుండేది. ఒకవేళ అతడు బయటివారి సహాయాన్ని కూడా ఉపయోగించుకొన్నప్పటికీ, దాని కసలు ప్రాధాన్యతే వుండేది కాదు. సాధారణంగా దాన్నతడు జీతాలతో కాక యితరవాటితో చెల్లుపెట్టేవాడు. వృత్తిసంఘాల్లో పనిచేసే అభ్యాసకులూ, వృత్తి నిపుణులూ తిండికోసం కంటే, జీతంకోసం కంటే శిక్షణ కోసమే పనిచేసేవారు: ఎందుచేతంటే, వారు ముందు ముందు వృత్తి యజమానులుగా తయారుకావాలని కోరుకొనేవారు.

ఆ తర్వాత ఉత్పత్తి సాధనాలూ, ఉత్పత్తిదార్లూ పెద్దపెద్ద వర్క్‌షాపుల్లో, కర్మాగారాల్లో కేంద్రీకరింపబడ్డం జరిగింది. ఉత్పత్తి సాధనాలు సామాజిక ఉత్పత్తి సాధనాలుగాను, ఉత్పత్తిదార్లు సామాజిక ఉత్పత్తిదార్లుగాను పరివర్తన చెందారు. అయితే యీ మార్పు జరిగిన తర్వాత కూడా, సామాజిక ఉత్పత్తి సాధనాలూ, వాటివల్ల తయారయిన వస్తువులూ యిదివరకులాగే వ్యక్తుల సొంత ఆస్తిగానే పరిగణింపబడ్డాయి. ఇదివరలో, ఉత్పత్తి సాధనాలను కలిగియున్న వ్యక్తి తానే ఉత్పత్తి అయిన వస్తువుల్ని స్వాయత్తం చేసుకొనేవాడు. ఎందుచేతంటే ఆ వస్తువుల్ని అతడే సొంతంగా తయారు చేసుకొనేవాడు, యితరుల సహాయం బహు అరుదుగానే ఉండేది. కాని, యిప్పుడు ఉత్పత్తి సాధనాలను కలిగి వున్న వ్యక్తి పూర్తిగా యితరుల శ్రమవల్ల తయారైన వస్తువుల్ని, అవి యిక తనవి ఎంతమాత్రం కాకపోయినా స్వాయత్తం చేసుకొంటున్నాడు. ఈవిధంగా, సామాజికంగా ఉత్పత్తి అయే వస్తువులను యిప్పుడు ఆ వస్తువులను నిజంగా ఉత్పత్తిచేసేవారుగాని, నిజంగా ఉత్పత్తి సాధనాలను నడిపించేవారుగాని కాక పెట్టుబడిదార్లు స్వాయత్తం చేసుకొంటున్నారు. ఉత్పత్తి సాధనాలూ, ఉత్పత్తీ సారభూతంగా సామాజికమయ్యాయి. కాని అవి విడి ఉత్పత్తిదారులకింద అమలులో వున్న స్వాయత్త పద్ధతికి, అంటే ప్రతి వ్యక్తీ తన వస్తువులకు తాను సొంతదారుగా వుంటూ వాటిని మార్కెట్లో అమ్ముకొనే పద్ధతి లోబడి వుండేవి. ఏ పరిస్థితులమీద, యీ స్వాయత్తత ఆధారపడి వుండేదో ఆ పరిస్థితుల్ని నూతన ఉత్పత్తి విధానం రూపుమాపినప్పటికీ, నూతన ఉత్పత్తి విధానం ఆ స్వాయత్త పద్ధతికే యింకా లోబడవలసివచ్చింది.*

---

* స్వాయత్తత పద్ధతి యథాప్రకారంగానే వున్నప్పటికీ పైన వర్ణించిన మార్పులవల్ల ఉత్పత్తి విధానంలో వచ్చినంత విప్లవకరమైన మార్పు స్వాయత్తతయొక్క స్వభావంలో కూడ వచ్చింది. ఇది వేరే చెప్పనవసరం లేదు. అయితే, నా శ్రమఫలితాన్ని స్వాయత్తంచేసుకోడానికీ, యితరుల శ్రమఫలితాన్ని స్వాయత్తంచేసుకోడానికీ చాలా తేడా వుంది. వేతనశ్రమ పద్ధతి చాలా ప్రాచీనమైనదనీ అందులో మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి

నూతన ఉత్పత్తి విధానానికి పెట్టుబడిదారీ స్వభావాన్ని యిచ్చిన ఈ వైరుధ్యం నేటి సామాజిక శతృత్వాలన్నిటికీ మూలం. ఈ నూతన ఉత్పత్తి విధానం ప్రధానమైన ఉత్పత్తి రంగాలన్నిటిమీదా సంపాదించిన ఆధిపత్యం – పారిశ్రామిక దేశాలన్నిటిలోను సంపాదించిన ఆధిపత్యం – అధికమయినకొద్దీ, దానిద్వారా వ్యక్తిగత ఉత్పత్తి నామమాత్రావశిష్టమవుతూ, సామాజిక స్వభావంగల ఉత్పత్తికీ పెట్టుబడిదారీ స్వభావంగల స్వాయత్తతకూ గల అసంబద్ధత స్పష్టంగా ముందుకొచ్చింది.

పైనచెప్పిన విధంగా, తొట్టతొలి పెట్టుబడిదార్లకు ఇతర పని పద్ధతులతోబాటు, వేతనశ్రమ పద్ధతి కూడ మార్కెట్లో సిద్ధంగా ఉంది. కాని, వేతనశ్రమ అరుదుగా మాత్రమే, సహాయశక్తిగా మాత్రమే, ఉపాంగంగా మాత్రమే, తాత్కాలికంగా మాత్రమే ఉంది. వ్యవసాయ కార్మికుడు భూకామందువద్ద అప్పుడప్పుడూ రోజు కూలీగా పనిచేసేవాడు; కాని అతనికి కొద్ది యకరాల సొంత భూమి కూడా వుండేది; దానిమీద అతడు అర్ధాకలితో అయినా బ్రతకగలిగేవాడు. ఇక వృత్తి సంఘాల నిర్మాణం ఎలా ఉండేదంటే, ఈనాటి కార్మికుడు మరునాడు మేస్త్రీగా మారేవాడు. కాని ఎప్పుడైతే ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిదార్ల చేతుల్లో కేంద్రీకరింపబడి సామాజిక స్వభావాన్ని పొందాయో అప్పుడు ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. విడి ఉత్పత్తిదార్లు తయారుచేసే సరుకులూ, వారి ఉత్పత్తి సాధనాలూ అంతకంతకు విలువను కోల్పోయాయి, పెట్టుబడిదారుక్రింద వారు వేతన శ్రామికులుగా చేరడం తప్ప వేరుమార్గం లేకపోయింది. అప్పటివరకూ అరుదుగా మాత్రమే, ఉపాంగంగా మాత్రమే వున్న వేతనశ్రమ యిప్పుడు సర్వవ్యాప్తమయింది; మొత్తం ఉత్పత్తి అంతా దానిమీదనే ఆధారపడింది. అప్పటివరకూ సహాయక పనిగా మాత్రమే వున్న వేతనశ్రమ కార్మికునికి నిరంతర వ్యావృత్తిగా మారింది. అప్పుడప్పుడు మాత్రమే వేతనానికి పనిచేసే కార్మికుడు జీవిత పర్యంతం వేతనానికి పనిచేయవలసివచ్చింది. ఆ రోజుల్లోనే, ఫ్యూడల్ వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఫ్యూడల్ ప్రభువులు తమ సాయుధ సిబ్బందుల్ని రద్దు చేసుకోవడంవల్లా, రైతుల్ని తమ భూములనుంచి తొలగించడంవల్లా, యింకా కొన్ని కారణాలవల్లా వేతన కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. పెట్టుబడిదార్ల చేతుల్లో పోగుపడ్డ ఉత్పత్తి సాధనాలకూ, శ్రమశక్తి తప్ప మరేమీలేని ఉత్పత్తిదార్లకూ మధ్య పూర్తి ఎడబాటు ఏర్పడింది. సామాజిక స్వభావంగల ఉత్పత్తికీ, పెట్టుబడిదారీ స్వభావంగల స్వాయ

---

విధానమంతా బీజరూపంలో వుందనీ, అనేక శతాబ్దాలపాటు అది బానిస విధానం సరసనే, ఎదురుబదురుగా, దానంతట అది పెల్లుబుకుతూ వచ్చిందనీ మనం గమనించాలి. అయితే, ఆ బీజం, తగిన చారిత్రక పూర్వావసరాలు సమకూడినప్పుడు మాత్రమే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంగా సరిగా పరిణతిచెందగలిగింది. (ఎంగెల్స్ వివరణ.)

త్తతకూ మధ్య ఏర్పడ్డ వైరుధ్యం శ్రామికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య వైరుధ్యంగా ముందుకొచ్చింది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం సరకులను ఉత్పత్తి చేసే వారందరి మధ్య, విడి ఉత్పత్తిదార్లందరి మధ్య చొరబడింది. వారిమధ్య వుండే సామాజిక సంబంధమల్లా, ఒకరి సరకులను మరొకరి సరకులతో మారకం చేసుకోవడమే. కాని సరకుల ఉత్పత్తిపై ఆధారపడే ప్రతి సమాజం ఒక ప్రత్యేక లక్షణాన్ని కలిగి వుంటుంది: ఉత్పత్తిదార్లు తమ సామాజిక సంబంధాలపై ఆధిపత్యాన్ని కోల్పోతారు. ప్రతి వ్యక్తీ తనకోసం తాను ఉత్పత్తి చేస్తాడు. అప్పటికి తనవద్దనున్న ఉత్పత్తి సాధనాలతోనే ఉత్పత్తి చేస్తాడు, తన సొంత అవసరాలను తీర్చుకొనేందుకు, అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేస్తాడు. తను ఉత్పత్తి చేసే సరకు మార్కెట్టుకెంత వస్తుందో ఎవరికీ తెలియదు; అందులో కొనుగోలుదార్లకెంత అవసరమో కూడ తెలియదు. అసలు తన సరకుకు గిరాకీ వుందో లేదో, ఉత్పత్తి ఖర్చులైనా తనకు వస్తాయో రావో, అసలు ఆ సరకు అమ్ముడవుతుందో కాదో ఎవరూ చెప్పలేరు. అంటే, సామాజిక ఉత్పత్తిలో అరాజకం తాండవిస్తుంది.

కాని యితర ఉత్పత్తి రూపాలన్నిటికివలెనే, సరకుల ఉత్పత్తికి కూడా కొన్ని ప్రత్యేకమైన, స్వతస్సిద్ధమైన నియమాలుంటాయి. వాటినుంచి దాన్ని విడదీయలేం. ఉత్పత్తిలో ఎంత అరాజకం ఉన్నప్పటికీ, ఆ అరాజకంలోనే, అరాజకంద్వారానే యీ నియమాలు పని చేస్తాయి. ఈ నియమాలు సామాజిక సంబంధాల్లో మిగిలివున్న ఒక్క రూపంలో మాత్రమే, అంటే మారక రూపంలోనే వెల్లడవుతాయి. అనివార్యమైన పోటీ నియమాలుగా యివి విడి ఉత్పత్తిదార్లందరిమీదా తమ ప్రభావం కలుగజేస్తాయి. మొదట్లో యివి ఉత్పత్తిదార్లకు తెలియవు. క్రమక్రమంగానే స్వీయానుభవంద్వారానే వాటిని వారు కనుక్కుంటారు. అందుచేత, యీ నియమాలు ఉత్పత్తిదార్లతో సంబంధం లేకుండా, స్వతంత్రంగా అమలు జరుగుతాయి; వారికి వ్యతిరేకంగా, ఆయా ఉత్పత్తి విధానాల కఠోరనియమాలుగా, స్వతస్సిద్ధ నియమాలుగా అమలుజరుగుతాయి. అంటే, ఉత్పత్తిచేయబడే సరకులు ఉత్పత్తిదార్లను శాసిస్తాయన్నమాట.

మధ్యయుగ సమాజంలో, ముఖ్యంగా మధ్యయుగాల తొలి శతాబ్దాల్లో, ఉత్పత్తి ప్రధానంగా సొంత అవసరాలను తీర్చేటందుకే ఉన్ముఖం చెయ్యబడేది. ప్రధానంగా అది ఉత్పత్తిదార్ల అవసరాలను, వారి కుటుంబ అవసరాలను మాత్రమే తీర్చేది. గ్రామసీమల్లోలా పరాధీన సంబంధాలున్న చోట్ల ఉత్పత్తి ఫ్యూడల్ ప్రభువుల అవసరాలకు కూడా తోడ్పడేది. అందువల్ల ఆ రోజుల్లో మారకం అనేది లేదు. కాబట్టి ఉత్పాదిత వస్తువులు వర్తకపు సరకుల స్వభావం కలిగి వుండేవి కావు. రైతు కుటుంబాలు యించుమించు తమకు కావలసినవన్నీ: బట్టలు, ఫర్నిచరు, జీవితావసర వస్తువులు తయారుచేసుకొనేవి. తమ అవ

రాలూ, ఫ్యూడల్ ప్రభువుకు వస్తురూపంలో చెల్లించవలసిన శిస్తులూ పోను అదనంగా వస్తువులను ఉత్పత్తిచేయడం ప్రారంభించినప్పుడే వారు వర్తకపు సరకులను కూడా తయారుచేసేవారు. ఈ అదనపు వస్తువులు సామాజిక మారకంలో ప్రవేశించి, అమ్మకానికి వచ్చినప్పుడే సరకులయేవి.

పట్టణాల్లో వృత్తిపనివారు మొదటినుంచీ వస్తువుల్ని మారకంకోసమే తయారుచేసే వారన్న విషయం నిజమే. కాని వారు కూడా, తమ సొంత అవసరాల్లో అత్యధిక భాగాన్ని స్వయంగా తయారుచేసుకొనేవారు. వారికి తోటలూ, వ్యవసాయ కమతాలూకూడ ఉండేవి. తమ పశువుల్ని ఉమ్మడి అడవుల్లో మేపేవారు. ఆ అడవులనుంచి కలప, వంటచెరకు తెచ్చుకొనేవారు. స్త్రీలు నార, ఉన్ని మొదలైన వాటితో నూలు వడికేవారు. మారకం కోసమే ఉత్పత్తిచేయడం, అంటే సరకుల్ని ఉత్పత్తిచేయడం యింకా ప్రాథమిక దశలోనే ఉండేది. అందువల్ల మారకం పరిమితంగా జరిగేది; మార్కెట్టు సంకుచితంగా ఉండేది; ఉత్పత్తి పద్ధతులు స్థిరంగా ఉండేవి. బాహ్యంగా స్థానిక వేర్పాటుతనం, ఆంతరంగికంగా స్థానిక సమైక్యత ఉండేవి. గ్రామసీమల్లో "మార్కు,"* పట్టణాల్లో వృత్తిసంఘం ఉండేవి.

కాని సరకుల ఉత్పత్తి విస్తరించడంతో, ముఖ్యంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రవేశపెట్టబడటంతో, అదివరకు నిద్రాణంగా వున్న సరకుల ఉత్పత్తి నియమాలు మరింత బాహాటంగా, బలీయంగా అమల్లోకి వచ్చాయి. పాత సంబంధాలు సడలాయి; పాత పరిమితులు బద్దలయాయి, ఉత్పత్తిదార్లు అంతకంతకు అధికంగా స్వతంత్ర, విడి ఉత్పత్తిదార్లుగా మారారు. మొత్తంమీద సామాజికోత్పత్తి ఏ ప్లానూ లేకుండా యాదృచ్ఛికంగా, అరాజకంగా శాసింపబడుతూవున్నట్లు స్పష్టమయింది. ఈ అరాజకం అంతకంతకూ నూతన శిఖరాలందు కొంటూంది. కాని, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఏ ప్రధాన సాధనాల సాయంతో యీ అరాజకాన్ని అధికం చేస్తూందో, ఆ మార్గాలు అరాజకానికి పూర్తిగా వ్యతిరేక స్వభావం గలవి. అంటే, ప్రతి విడి ఉత్పత్తి సంస్థలోనూ ఉత్పత్తి అంతకంతకు అధికంగా సామాజిక ప్రాతిపదికపై సంఘటిత మొనర్చబడింది. దీనివల్ల, పాతకాలపు ప్రశాంత పరిస్థితులు, స్థిరపరిస్థితులు అంతం చేయబడ్డాయి. ఇట్టి సంఘటిత ఉత్పత్తి ఏయే పారిశ్రామిక శాఖల్లో ప్రవేశపెట్టబడిందో అక్కడల్లా దాని సరసన మరో ఉత్పత్తి పద్ధతి ప్రవేశించడానికి ఆస్కారం లేకపోయింది. కార్మిక రంగం ఒక యుద్ధ రంగంగా తయారైంది. బ్రహ్మాండమైన భౌగోళిక ఆవిష్కరణలవల్లా,[84] వాటి ఫలితంగా అనేక దేశాలను వలసలుగా చేసుకోవడంవల్లా మార్కెట్లు విస్తారంగా వ్యాప్తిచెందాయి. చేతి పరిశ్రమలు కార్ఖానాలుగా మారేక్రమం

---

* ఎంగెల్స్ రాసిన "మార్కు" అనే రచన గురించిన ప్రస్తావన యిది. – సం.

మరింత వేగంగా కొనసాగింది. ప్రత్యేక ప్రాంతాల్లో నివసించే స్థానిక ఉత్పత్తిదార్ల మధ్యనే కాదు పోరాటం కొనసాగింది. స్థానిక పోరాటాలు జాతుల మధ్య పోరాటాలుగా పరివర్తన చెందాయి 17వ శతాబ్దంలోను, 18వ శతాబ్దంలోను పెద్దపెద్ద వర్తక యుద్ధాలకు అవి దారితీశాయి.[85]

చివరి విషయమేమంటే యీ పోరాటం ఆధునిక పరిశ్రమలవల్లా, ప్రపంచ మార్కెటు వల్లా సర్వవ్యాపితమయింది. అదే సమయంలో అది కనీ వినీ యెరుగనంతటి ఉధృత రూపం ధరించింది. నేడు విడి పెట్టుబడిదార్ల అస్తిత్వాన్ని, మొత్తం పరిశ్రమల అస్తిత్వాన్ని, దేశదేశాల అస్తిత్వాన్ని నిర్ణయించేది ఉత్పత్తికి సంబంధించిన సహజమైన లేక కృతక పరిస్థితులే. ఈ పోరాటంలో ఓడిపోయినవాడు నిర్దాక్షిణ్యంగా పక్కకు తోసి వేయబడతాడు. ప్రతి జీవీ అస్తిత్వంకొరకు పెనుగులాడుతుందనే డార్విన్ సిద్ధాంతం మరింత తీవ్ర క్రూర రూపంలో మానవ సమాజానికి విస్తరింపబడటమే యిది. జంతువు యొక్క అస్తిత్వాని కవసరమైన సహజ పరిస్థితులు మానవ అభివృద్ధియొక్క శిఖరదశగా కనిపిస్తున్నాయి. సామాజికోత్పత్తికీ, పెట్టుబడిదార్ల స్వాయత్తతకూ మధ్య వైరుధ్యం నేడు ఒక్కొక్క ఫ్యాక్టరీలో అమలుజరిగే సంఘటిత ఉత్పత్తికీ మొత్తం సమాజంలో అమలుజరిగే అరాజకపు ఉత్పత్తికీ మధ్య వైరుధ్యంగా బయటపడుతోంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యీ రెండు వైరుధ్యాల్లో రూపొంది, కొనసాగుతోంది; అది పుట్టినప్పటినుంచీ అందులో యీ వైరుధ్యాలున్నాయి. ఫోరియర్ యిదివరకే కనిపెట్టిన యీ "విషచక్రం"నుంచి అది ఎన్నటికీ బయటపడలేకపోయింది. అయితే, ఈ చక్రం క్రమక్రమంగా సంకుచితమవుతోందనీ, అంతకంతకు అది శంఖావృత్తంలో తిరుగుతోందనీ, గ్రహాల పరిభ్రమణంవలె కేంద్రంతో ఢీకొనడంద్వారా అది ముగింపుకు వచ్చి తీరుతుందనీ అతను తన రోజుల్లో గ్రహించలేకపోయాడు. సామాజికోత్పత్తిలో అరాజకంవల్లనే ప్రజల్లో అంతకంతకు అధిక సంఖ్యాకులు కార్మికులుగా మారుతున్నారు; రెండోవైపు యీ కార్మిక జనసామాన్యమే చివరకు ఉత్పత్తిలో అరాజకాన్ని తుదముట్టిస్తారు. సామాజికోత్పత్తిలో వున్న యీ అరాజకం వల్లనే ఆధునిక పరిశ్రమల్లో యంత్రాలను అనంతంగా అభివృద్ధి చేయగల అవకాశం ఒక కఠోర నియమంగా పనిచేస్తూంది. ఆ నియమానికి లోబడి ప్రతి పారిశ్రామిక పెట్టుబడిదారూ తన యంత్రాలను అంతకంతకు అధికంగా అభివృద్ధిచేసుకోవాలి; లేకపోతే అతడు సర్వనాశన మవుతాడు.

కాని యంత్రాలను అభివృద్ధిచేయడంవల్ల మానవశ్రమ అంతకంతకు అనవసరమవుతోంది. యంత్రాలను ప్రవేశపెట్టడంవల్లా, వాటిని అధికంచేయడంవల్లా చేతిపనులు చేసే లక్షలాది కార్మికుల స్థానంలో యంత్రాలవద్ద పనిచేసే కొద్దిమంది కార్మికులు ప్రవేశిస్తున్నప్పుడు, యిక ఆ యంత్రాలను అభివృద్ధిచేయడమంటే వాటివద్ద పనిచేసే కార్మికులే

అంతకంతకు అధిక సంఖ్యలో బర్తరఫుకావడమన్నమాట. చివరకు జరిగేది ఏమంటే, పెట్టుబడిదార్ల సగటు అవసరాలకన్న హెచ్చు సంఖ్యలో కార్మికు లుంటారు. 1845లో నేను దానికి నామకరణం చేసినట్లు అసలైన పారిశ్రామిక రిజర్వు సైన్య మొకటి తయారవుతుంది.* పరిశ్రమలు జోరుగా పనిచేసే రోజుల్లో వారంతా ఉపయోగపడతారు. అనివార్యమైన సంక్షోభం బద్దలైనప్పుడు వీధుల్లోకి గెంటబడతారు. కార్మికవర్గం తన అస్తిత్వంకొరకు పెట్టుబడిదార్లతో చేసే పోరాటంలో యీ రిజర్వు సైన్యం ఎల్లప్పుడూ వారి మెడకు గుదిబండగానే తయారవుతుంది. పెట్టుబడిదార్లు కోరే విధంగా కార్మికుల జీతాలను తక్కువ స్థాయిలో ఉంచేందుకు వారొక రెగ్యులేటర్‌గా ఉపయోగపడతారు. కాబట్టి, మార్క్స్ చెప్పినట్లు, కార్మికవర్గంపై పెట్టుబడిదార్లు జరిపే పోరాటంలో యంత్రాలు అత్యంత బలీయమైన ఆయుధాలు; శ్రమ సాధనాలు నిరంతరం కార్మికుని జీవితావసరాలను అతని చేతుల్లోనుంచి లాగివేసుకొంటూ వుంటాయి. కార్మికుడు స్వయంగా తయారుచేసే వస్తువే అతన్ని దాస్యంలో బంధించే సాధనంగా తయారైంది.** కాబట్టి, ఉత్పత్తి సాధనాలను పొదుపుగా ఉపయోగించే విధానం మొదటినుంచీ శ్రమశక్తిని దారుణంగా వృధాచేసే విధానంగా తయారైంది; కార్మికుని మామూలు పని పరిస్థితులమీద కొనసాగే దోపిడీగా తయారైంది.*** యంత్రం శ్రమకాలాన్ని తగ్గించేందుకు అత్యంత శక్తివంతమైన సాధనమైనప్పటికీ, కార్మికునియొక్క, అతని కుటుంబంయొక్క శ్రమ కాలంలో ప్రతి క్షణాన్నీ పెట్టుబడియొక్క విలువను హెచ్చించేందుకై పెట్టుబడిదారు చేతుల్లో అత్యంత ఖచ్చితమైన సాధనంగా అది తయారైంది. ఈవిధంగా కొందరు మితిమీరి చేసే పని యితరుల నిరుద్యోగానికి మూలమవుతోంది; ఆధునిక పరిశ్రమలు యావత్ప్రపంచంలోనూ కొత్త వినిమయదార్లకోసం వేటాడుతూ, స్వదేశంలో ప్రజల వినిమయాన్ని కనీస స్థాయికి, ఉపవాసాలు చేసే స్థాయికి దిగజారుస్తున్నాయి; అలా చేయడంలో దేశీయ మార్కెట్లను నాశన మొనరుస్తున్నాయి. మార్క్స్ యిలా రాశాడు: "సాపేక్షమైన అదనపు జనాభాను, అంటే పారిశ్రామిక రిజర్వు సైన్యాన్ని, ఎల్లప్పుడూ పెట్టుబడియొక్క సంచయన పరిమితితో, శక్తితో సమానంగా తూగేటట్లు చేసే యీ నియమం, కార్మికుణ్ణి పెట్టుబడిదారీ వర్గంతో గట్టిగా బంధించి వుంచుతోంది. ప్రొమెథెయస్‌ను కొండకు బంధించి వుంచేం

---

* "ఇంగ్లండులో కార్మికవర్గం స్థితి," పేజి 109. (ఎంగెల్స్ వివరణ.) Marx and Engels, *On Britain*, Moscow, 1962, పేజి 119. – సం.

** Karl Marx, *Capital*, Vol. I, Moscow, 1965, పేజీలు 435–87. – సం.

*** అదే గ్రంథం, పేజి 462. – సం.

దుకు వుల్కన్ ఉపయోగించిన మేకులకన్న దృఢమైన మేకులతో కార్మికుణ్ణి పెట్టుబడి దారులకు బంధిస్తోంది. ఈ నియమం పెట్టుబడి సంచయనంతో సమానంగా కార్మికుల బాధలను ఎక్కువ చేస్తుంది. అందువల్ల, ఒకవైపు సంపద పోగుపడటమంటే, మరోవైపు పెట్టుబడి రూపంలో తన సరుకును తానే ఉత్పత్తి చేస్తున్న కార్మికుల్లో దారిద్ర్యం, నడుంవిరిగే శ్రమ, దాస్యం, అజ్ఞానం, కర్కశత్వం, మానసిక పతనం పోగుపడటమన్నమాట." (మార్క్స్ "పెట్టుబడి," పేజి 671.)* పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో యింతకన్న సరకుల పంపకం మరొక విధంగా జరుగుతుందని ఆశించడమంటే అర్థం, బ్యాటరీతో ఎలక్ట్రోడ్‌లకు సంబంధం వుండగా నీటిని విచ్ఛేదనంచేసి, ఆమ్లజనిని ధనధృవందగ్గరా, ఉదజనిని రుణధృవందగ్గరా ఎలక్ట్రోడ్లు అపఘటనం చెయ్యవనుకోవడం వంటిదే.

ఆధునిక యంత్రాలను అంతకంతకు అధికంగా అభివృద్ధిచేయడానికి గల అవకాశం సామాజికోత్పత్తిలో గల అరాజకత్వం మూలంగా, ప్రతి పారిశ్రామిక పెట్టుబడిదారూ ఎప్పటి కప్పుడు తన యంత్రాలను అభివృద్ధిచేసుకోడానికే, వాటి ఉత్పాదక శక్తిని పెంపొందించడానికే ప్రయత్నించి తీరవలసిన పరిస్థితిని కల్పిస్తుంది. ఇది ఒక కఠిన నియమంగా తయారైందని పైన చూశాం. అదే విధంగా, ఉత్పత్తి రంగాన్ని విస్తృతమొనర్చేందుకు గల వాస్తవ అవకాశం కూడా అతని విషయంలో ఒక కఠిన నియమంగా మారుతుంది. ఆధునిక పరిశ్రమలు అపారంగా విస్తరించడానికి శక్తిని కలిగి వున్నాయి. ఆ శక్తితో వాయు పదార్థాల విస్తరణ శక్తిని పోలిస్తే, పిల్లల ఆటలా ఉంటుంది. పరిశ్రమలయొక్క అపారంగా విస్తరించే యీ శక్తి నాణ్యం రీత్యాను, పరిమాణాత్మకంగాను కూడా ఒక అవసరంగా అనివార్యమైనదిగా తయారైంది. ఆధునిక పారిశ్రామిక సరకుల వినిమయం, అమ్మకం, మార్కెట్టు దాన్ని ప్రతిఘటిస్తున్నాయి. అయితే, మార్కెట్ల విస్తరణ శక్తి (విస్తృతంగాను, ముమ్మరంగాను) మరో విధమైన నియమాలచే శాసించబడుతోంది; అవి అంత బలంగా పనిచేయవు. మార్కెట్ల విస్తరణ ఉత్పత్తి విస్తరణతో సమానంగా జరగదు. రెండింటి మధ్య ఘర్షణ అనివార్యమవుతుంది. కాని, ఆ ఘర్షణ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని ముక్కలు ముక్కలుగా బద్దలుచేయలేదు. అందువల్ల అది సమస్యను పరిష్కరించ లేదు. ఈ కారణంవల్ల ఆ ఘర్షణలు ధప ధపాలుగా వచ్చి తీరుతాయి. ఈవిధంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం మరో "విషచక్రాన్ని" సృష్టిస్తోంది.

నిజానికి 1825నుంచి అంటే మొట్టమొదటి సార్వత్రిక సంక్షోభం వాటిల్లిన దరిమిలా నాగరిక జాతులన్నిటిలోనూ, వాటిమీద ఆధారపడే అనాగరిక జాతులన్నిటిలోనూ యావత్తు పారిశ్రామిక, వాణిజ్య జీవితమూ, ఉత్పత్తీ, మారకమూ దాదాపు పదేండ్ల కొక

---

* అదే గ్రంథం, పేజి 645. – సం.

సారి తలక్రిందులవుతున్నాయి. వర్తకం స్తంభిస్తోంది. మార్కెట్లన్నీ సరకులతో నిండి పోతున్నాయి. వాటి నిలవలు అమ్మరానంతగా పెరుగుతున్నాయి. ద్రవ్యం మాయమవుతోంది. పరపతి మృగ్యమవుతోంది. ఫ్యాక్టరీలు మూలపడుతున్నాయి. కార్మికులకు జీవితావసరాలు కరువవుతున్నాయి. ఎందుచేతంటే కార్మికులు వాటిని మితిమీరి ఉత్పత్తిచేశారు. దివాళాల సంఖ్య హెచ్చుతోంది; వేలాలమీద వేలాలు జరుగుతున్నాయి. ఈ ప్రతిష్టంభన ఏళ్లతరబడిగా కొనసాగుతోంది. ఉత్పాదక శక్తులు వ్యర్థం చేయబడుతున్నాయి. తయారైన సరకులు పెద్దమొత్తాల్లో నాశనం చేయబడుతున్నాయి. ఇలా కొంతకాల మయేసరికి నెమ్మది నెమ్మదిగా నిల్వసరకులు తక్కువ ధరలకు మార్కెట్లో ప్రవేశిస్తున్నాయి. ఉత్పత్తీ, మారకం క్రమక్రమంగా తిరిగి నడుస్తున్నాయి. వాటి అడుగు చురుగ్గా పడుతోంది. దాని వేగం పెరుగుతోంది. పరిశ్రమలు ఒక్కొక్కటే పుంజుకొని, పరుగు ప్రారంభిస్తున్నాయి. ఆ పరుగు దౌడుగా మారుతోంది. క్రమేణా ఉత్పత్తి పెరుగుతోంది. రుణాలు లభిస్తున్నాయి. చట్టా వ్యాపారం ఉధృతమవుతోంది. ఈవిధంగా వెర్రిగంతుల తర్వాత, మళ్లీ పరిస్థితి మొదటుకు వచ్చి, సంక్షోభ సుడిగుండంలో అంతమవుతోంది. ఈవిధంగా చక్రం తిరుగుతోంది. 1825 నుండి మనం యిలాంటి సంక్షోభాలు అయిదింటిని చవిచూశాం. నేడు (1877) మనం ఆరవ సంక్షోభంలో ఉన్నాం. ఈ సంక్షోభాల స్వభావాన్ని ఫోరియర్ ఎంతో స్పష్టంగా నిర్వచించాడు. మొదటి సంక్షోభాన్ని అతడు crise pléthorique అంటే, "సుభిక్షంలో దుర్భిక్షం" అని పిలిచాడు.

ఈ సంక్షోభాల్లో, సామాజికోత్పత్తికీ పెట్టుబడిదారీ స్వాయత్తతకూ మధ్య వైరుధ్యం మహోగ్రమైన ప్రేలుడులో అంతమవుతుంది. సరకుల క్రయవిక్రయాలు కొంతకాలం ఆగిపోయాయి. చలామణీ సాధనమైన ద్రవ్యం చలామణీకి ఆటంకంగా తయారైంది. ఉత్పత్తికి సంబంధించిన, సరకుల చలామణీకి సంబంధించిన నియమాలన్నీ తలకిందులయాయి. ఆర్థిక రంగంలో సంఘర్షణ శిఖర స్థాయికి చేరుకొంది. ఉత్పత్తి విధానం మారకపు విధానంమీద తిరుగబడింది.

ఒక్కొక్క ఫ్యాక్టరీలో ఉత్పత్తిని సామాజిక మొనర్చే పద్ధతి నేడు ఎంతగా అభివృద్ధి చెందిందంటే, పెట్టుబడిదార్లు సైతం మొత్తం సమాజంలో అరాజకంగా జరిగే ఉత్పత్తికిది పొసగదనీ అరాజకమే దీని సరసన వుంటూ దీన్ని శాసిస్తోందనీ గుర్తించవలసివస్తోంది. కనుకనే వారు సంక్షోభాల్లో అనేకమంది పెద్ద పెట్టుబడిదార్లనూ, యింకా పెద్ద సంఖ్యలో చిన్న పెట్టుబడిదార్లనూ నాశనం చేయడంద్వారా, తమ పెట్టుబడులను విపరీతంగా కేంద్రీకరించుకొంటున్నారు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమనే యంత్రాంగం ఉత్పాదక శక్తుల ధాటికి నిలబడలేక కూలిపోతూంది. ఈ ఉత్పాదక శక్తుల్ని సృష్టించింది కూడా అదే. ఉత్పత్తి సాధనాలన్నిటినీ అది యిక పెట్టుబడిగా మార్చలేదు. అవి నిరుపయోగ

మవుతున్నాయి; అందువల్లనే పారిశ్రామిక రిజర్వు సైన్యం కూడా నిరుపయోగంగా ఉండి పోవలసివస్తోంది. ఈ రోజున మొత్తం ఉత్పత్తి కవసరమైన, మొత్తం సంపద కవసరమైన ఉత్పత్తి సాధనాలూ, జీవితావసర వస్తువులూ, కార్మిక బలగాలూ పుష్కలంగా వున్నాయి. కాని, ఫోరియర్ చెప్పినట్లు "అమిత సంపదే దారిద్ర్యానికీ బాధలకూ మూలం అవుతోంది." ఎందుచేతనంటే, ఉత్పత్తి సాధనాలూ, జీవితావసర వస్తువులూ పెట్టుబడిగా మారేందుకు సరిగా అదే ఆటంకంగా తయారైంది. పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిగా మారినప్పుడే, అనగా మానవుని శ్రమశక్తిని దోచుకొనేందుకు సాధనాలుగా మారినప్పుడే, అవి పనిచేయగల్గుతాయి. ఈవిధంగా, ఉత్పత్తి సాధనాలూ, జీవితావసర వస్తువులూ, పెట్టుబడిగా మారవలసిన అవసరం ఆ ఉత్పత్తి సాధనాలకూ కార్మికులకూ మధ్య ఒక పెనుభూతంగా నిలిచివుంది. ఉత్పత్తి కవసరమైన భౌతిక శక్తుల్నీ, మానవ బలగాన్నీ సమీకరించేందు కదే అడ్డంకిగా వుంది: ఉత్పత్తి సాధనాలను ఉపయోగించేందుకూ, కార్మికులు పనిచేస్తూ జీవించేందుకూ అడ్డంకిగా వుంది. అందువల్ల పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఒకవైపు ఉత్పాదక శక్తుల్ని మరింత ముందుకు నడపలేక పోతూ వుంది: ఆవిధంగా, మహాపరాధం చేస్తూంది. మరోవైపు, యీ ఉత్పాదక శక్తులే అంతకంతకు శక్తివంతంగా ముందుకుపోతూ, యిప్పుడున్న వైరుధ్యాన్ని తొలగించేందుకు పూనుకొన్నాయి: వాటికున్న పెట్టుబడిదారీ లక్షణాన్ని నిర్మూలించ పూనుకొన్నాయి; వాటి సామాజిక లక్షణాన్ని ఆచరణలో గుర్తిస్తున్నాయి.

పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పాదక శక్తులు — పెట్టుబడిగా తమ గుణానికి వ్యతిరేకంగా అంతకంతకు బలం చేకూర్చుకొనేకొద్దీ, తమ పెట్టుబడిదారీ స్వభావంమీద వాటి వ్యతిరేకత ప్రాబల్యం వహించేకొద్దీ — అంతకంతకు ప్రబలమయ్యే, వాటి సామాజిక స్వభావం గుర్తింపబడేకొద్దీ పెట్టుబడిదారీ వర్గమే అంతకంతకు అధికంగా (ప్రస్తుత పెట్టుబడిదారీ పరిస్థితుల్లో ఎంతవరకు సాధ్యమో అంతమేరకు) వాటిని సామాజిక ఉత్పాదక శక్తులుగా పరిగణించవలసివస్తుంది. అపరిమితంగా పెరిగే రుణ ద్రవ్యోల్బణం — యిది సంక్షోభానికేమీ తీసిపోదు — బ్రహ్మాండమైన పెట్టుబడిదారీ సంస్థల విచ్ఛిత్తి, వీటన్నింటి మూలంగా పారిశ్రామిక సంస్థలు కూలిపోయే దశ జాయింట్ స్టాక్ కంపెనీలలో మనం చూసేమాదిరి ఉత్పత్తి సాధనాల భారీ ఎత్తు సమాజీకరణను తీసుకువస్తుంది. అనేక ఉత్పత్తి సాధనాలూ, రవాణా సాధనాలూ ఎంత పెద్దవిగా ఉన్నాయంటే, రైల్వేల మాదిరిగా, అవి యితర పెట్టుబడిదారీ దోపిడీ రూపాలను మినహాయిస్తున్నాయి. తర్వాతి దశలో యీ రూపం కూడా సరిపోకుండా వుంది. ఒక్కొక్క దేశంలోని ఒక్కొక్క పారిశ్రామిక శాఖలో అనేకమంది యజమానులు కలిసి ఉత్పత్తిని నియంత్రితం చేసేందుకు ఒక "ట్రస్టు" (గుత్తవ్యాపార సంస్థ)గా ఏర్పడుతున్నారు. వారు, మొత్తం ఎంత సరుకు తయారు

కావాలో, తమలో తాము దాన్నెలా విభజించుకోవాలో నిర్ణయించుకొని, దాన్నెంత ధరకు విక్రయించాలో ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకొంటారు. కాని, వ్యాపారంలో మాంద్యం ఏర్పడిన వెంటనే యీ మాదిరి ట్రస్టులు సాధారణంగా చీలిపోతాయి. సరిగా ఆ కారణం వల్లనే, మరింత కేంద్రీకరణ జరగక తప్పనిసరి పరిస్థితి ఏర్పడుతుంది. ఒక్కొక్క పరిశ్రమ ఒక్కొక్క బ్రహ్మాండమైన జాయింట్ స్టాక్ కంపెనీగా మార్పుచెందుతుంది. అంతరంగిక పోటీకి బదులు ఆ ఒక్క కంపెనీ గుత్తాధిపత్యం ప్రవేశిస్తుంది. 1890లో ఇంగ్లీషు ఆల్కాలీ పరిశ్రమలో యిదే జరిగింది. 48 పెద్ద ఆల్కాలీ ఫ్యాక్టరీలు యీ రోజున ఒకేఒక కంపెనీ చేతుల్లో వున్నాయి. ఒకే ప్లాను ప్రకారం అవి నడుస్తున్నాయి. ఆ కంపెనీ పెట్టుబడి 60,00,000 పౌన్లు.

ట్రస్టులలో స్వేచ్ఛాయుత పోటీ అనేది దానికి సరిగ్గా విరుద్ధమైన గుత్తాధిపత్యంగా మారుతుంది. పెట్టుబడిదారీ సమాజంలో ఎట్టి ప్లానూ లేకుండా జరిగే ఉత్పత్తి రానున్న సోషలిస్టు సమాజంలో ప్లాను ప్రకారం జరిగే ఉత్పత్తి ముందు నిలబడలేకపోతుంది. అయితే, ప్రస్తుతానికి యిది పెట్టుబడిదార్లకే ఉపయోగకరంగా వుందనడం స్పష్టం. కాని, యీ గుత్త సంస్థల్లో దోపిడీ ఎంత నగ్నంగా అమలు జరుగుతూందంటే, కొత్తగా బయల్దేరిన గుత్తపెట్టుబడిదారీ విధానం సైతం కూలిపోక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. బహుకొద్ది మంది గుత్తాధిపతులు మొత్తం ప్రజానీకాన్ని అతి నగ్నంగా దోచుకొనేందుకు అవకాశమిచ్చే ట్రస్టులనుగాని, ఆ ట్రస్టులు నిర్వహించే ఉత్పత్తినిగాని ఏ జాతీ సహించి ఊరుకోదు.

ట్రస్టులు ఉన్నా లేకపోయినా, పెట్టుబడిదారీ సమాజానికి ప్రాతినిధ్యం వహించే అధికార సంస్థ — అంటే రాజ్యయంత్రమే — ఉత్తరోత్తరా ఉత్పత్తినంతనూ నడపవలసి వుంటుంది.* ప్రైవేట్ సంస్థల యాజమాన్యం ప్రభుత్వ యాజమాన్యంగా

---

* "వలసి వుంటుంది" అనే అంటున్నాను, ఎందుచేతనంటే ఉత్పత్తి సాధనాలూ, రవాణా సాధనాలూ నిజంగా జాయింట్ స్టాక్ కంపెనీల నిర్వహణను మించి అభివృద్ధి చెందినప్పుడే; తత్ఫలితంగా వాటిని రాజ్యం స్వాధీనం చేసుకోవడం ఆర్థికంగా అనివార్యమయినప్పుడే — దీన్ని అమల్లోకి తెచ్చేది ప్రస్తుతమున్న రాజ్యమైనా సరే — ఆర్థిక పురోగతి సాధ్యమవుతుంది. మొత్తం సమాజం ఉత్పాదక శక్తులన్నిటినీ స్వాధీనం చేసుకొనేందు కవసరమైన మరో అడుగువేయడం అప్పుడే సాధ్యపడుతుంది. కాని, బిస్మార్కు పారిశ్రామిక సంస్థలను ప్రభుత్వ యాజమాన్యంక్రిందికి తేవడంతో, యీమధ్య ఒక విధమైన బూటకపు సోషలిజం తలెత్తి ఒకో సందర్భంతో ఐచ్ఛిక నీచదాస్యంగా పతనమవుతోంది; సకల విధాలైన ప్రభుత్వ యాజమాన్యం — బిస్మార్కు ప్రవేశపెట్టిన దానితో సహా — సోషలిజమే నని అది బీరాలు పలుకుతోంది. పొగాకు పరిశ్రమను జాతీయం చేయడమే

మారవలసిన ఆవశ్యకత మొదట రవాణా, సమాచార శాఖలకు సంబంధించిన పెద్ద సంస్థల్లో – అంటే పోస్టాఫీసులు, టెలిగ్రాఫ్, రైల్వేలలో – పొడసూపింది.

బూర్జువా వర్గం ఆధునిక ఉత్పాదక శక్తులను ఇక ఏ మాత్రం నిర్వహించలేదని ఆర్థిక సంక్షోభాలు రుజువుచేశాయి; అలాగే బ్రహ్మాండమైన ఉత్పత్తి సంస్థలూ, రవాణా సంస్థలూ జాయింట్ స్టాక్ కంపెనీలుగా, ట్రస్టులుగా, ప్రభుత్వ ఆస్తిగా మారడంతో, వాటిని నిర్వహించేందుకు బూర్జువావర్గం అనవసరమని రుజువవుతోంది. పెట్టుబడిదారు నిర్వర్తించే సామాజిక విధులన్నింటినీ యిప్పుడు జీతానికి పనిచేసే ఉద్యోగస్తులు నిర్వర్తిస్తున్నారు. పెట్టుబడిదారు యీరోజున లాభాలు జేబులో వేసుకోవడం, చెక్కులు చింపు కోడం, స్టాక్ ఎక్స్‌ఛేంజిలో (పెట్టుబడిదారులు ఒకరి పెట్టుబడుల నొకరు కాజేసే చోటు) జూదమాడ్డం తప్ప, మరో సామాజిక విధి నిర్వర్తించడం లేదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం మొదట్లో కార్మికుల్ని దూరంగా నెట్టివేసింది. యిప్పుడు పెట్టుబడిదారుల్నే నెట్టివేస్తూంది. మొదట అది కార్మికుల్ని ఏవిధంగా పారిశ్రామిక రిజర్వు సైన్యంలోకి దిగజార్చివేసిందో, యిప్పుడు అదేవిధంగా పెట్టుబడిదారుల్నే, పారిశ్రామిక రిజర్వు సైన్యం లోకి కాకపోయినా అదనపు జనాభాగా దిగజార్చివేస్తూంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం జాయింట్ స్టాక్ కంపెనీలుగా మారినా, ట్రస్టులుగా మారినా, ప్రభుత్వ యాజమాన్యంగా మారినా ఉత్పాదక శక్తులు మాత్రం పెట్టుబడిదారీ

---

సోషలిజం అయితే నెపోలియన్‌నూ, మెటర్నిఖ్‌నీ కూడా సోషలిజం స్థాపకులుగానే పరిగణించవలసి వుంటుంది. బెల్జియన్ ప్రభుత్వం అతి సామాన్యమైన రాజకీయ, ఆర్థిక కారణాలవల్ల ప్రధాన రైలు మార్గాలను సొంతంగా నిర్మించుకొన్నంత మాత్రాన, బిస్మార్కు ఏ ఆర్థిక ఒత్తిడీ లేకుండా తన ప్రభుత్వంకోసం ప్రష్యాలోని ప్రధాన రైలు మార్గాలను స్వాధీనం చేసుకున్నంత మాత్రాన సోషలిజం ఏర్పడినట్లు కాదు. ఎందుచేతంటే, యుద్ధం వస్తే రైల్వే లైన్లని తన గుప్పెట్లో పెట్టుకోవచ్చు, రైల్వే ఉద్యోగస్తులని పశువుల మందను తెచ్చినట్లు తెచ్చి, ప్రభుత్వాని కనుకూలంగా ఓటు చేయించుకోవచ్చు. ముఖ్యంగా, పార్లమెంటు సభ్యుల ఓట్లతో నిమిత్తం లేకుండానే స్వతంత్ర ఆదాయం చేకూర్చుకోవచ్చు. అందువల్ల యీ చర్య ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని, ఉద్దేశపూర్వకంగాగాని, ఏ ఉద్దేశమూ లేకుండాగాని సోషలిస్టు చర్య కాజాలదు. లేకపోతే, రాయల్ మారిటైమ్ కంపెనీ,[86] రాయల్ పింగాణీ పరిశ్రమ, సైనిక దుస్తుల పరిశ్రమ: యివన్నీ సోషలిస్టు పరిశ్రమల క్రిందికే వస్తాయి. లేదా మూడవ ఫ్రెడెరిక్ విల్‌హెల్మ్ పరిపాలనలో ఓ యుక్తిపరుడు సూచించినట్లు ప్రభుత్వం వేశ్యాగృహాలను స్వాధీనం చేసుకోవడాన్ని కూడా సోషలిస్టు సంస్కరణగానే పరిగణించ వచ్చు. (ఎంగెల్స్ వివరణ.)

స్వభావాన్నే కలిగివుంటాయి. జాయింట్ స్టాక్ కంపెనీల్లోను, ట్రస్టులలోను యిది మనకు స్పష్టంగానే కనిపిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంపై కార్మికులూ, విడి పెట్టుబడి దార్లూ చేసే దాడుల్ని ఎదుర్కొనేందుకై ఆ విధానంయొక్క బాహ్య లక్షణాలను పటిష్ఠ మొనర్చవలసి వస్తుంది. అలా పటిష్ఠమొనర్చేందుకు పెట్టుబడిదారీ సమాజం సృష్టించిన నిర్మాణమే ఆధునిక రాజ్యం. ఆధునిక రాజ్యం — దాని స్వరూపం ఎలాంటిదైనా — ప్రధానంగా పెట్టుబడిదారీ రాజ్యమే; మొత్తం జాతియొక్క పెట్టుబడి ప్రయోజనాలు అందులో మూర్తీభవిస్తున్నాయి. ఉత్పాదక శక్తుల్ని హస్తగతం చేసుకొనేందు కది ఎంతగా చొరవ తీసుకొంటుందో, అంతగా అది నిజమైన జాతీయ పెట్టుబడిదారీ వర్గస్వభావాన్ని కలిగి వుంటుంది; అంత ఎక్కువగా పౌరుల్ని దోచుకొంటుంది. కార్మికులు మాత్రం వేతన కార్మికులుగానే — శ్రామికులుగానే వుంటారు. పెట్టుబడిదారీ సంబంధాలు యథాప్రకారం గానే వుంటాయి. నిజం చెప్పవలసి వస్తే ఆ సంబంధాలు శిఖరాగ్రం చేరుకొంటాయి. అలా చేరుకొని, ఒక్కసారి కూలిపోతాయి. ఉత్పాదక శక్తులపై ప్రభుత్వ యాజమాన్యం సంఘర్షణకి పరిష్కారం కాదు, కాని దాన్ని పరిష్కరించడాని కవసరమైన లాక్షణికమైన పరిస్థితులు దాగి నిద్రాణంగా వున్నాయి.

ఈ సంఘర్షణను పరిష్కరించడానికి ఏం జరగాలి? ఆధునిక ఉత్పాదక శక్తుల సామాజిక స్వభావాన్ని ఆచరణలో గుర్తించాలి. అంటే, ఉత్పత్తి పద్ధతీ, స్వాయత్త పద్ధతీ, మారకపు పద్ధతీ కూడ ఉత్పత్తి సాధనాల సామాజిక స్వభావాని కనుగుణంగా మార్చబడాలి. మొత్తం సమాజం ఉత్పాదక శక్తుల్ని బహిరంగంగా, ప్రత్యక్షంగా స్వాధీనమొనర్చుకొంటేనే యిది సాధ్యపడుతుంది. ఎందుచేతనంటే, నేడు యీ ఉత్పాదక శక్తులు మొత్తం సమాజం విధించే అదుపును తప్ప, మిగతా అదుపులన్నిటినీ అధిగమించిపోయాయి. ఉత్పత్తి సాధనాల సామాజిక స్వభావం ఉత్పత్తిదార్లకే ఎదురు తిరుగుతోంది; మొత్తం ఉత్పత్తినీ, మారకాన్నీ మధ్యమధ్య ఛిన్నాభిన్నం చేస్తోంది; ప్రకృతి నియమాల్లాగనే అది గుడ్డిగా బలీయంగా, వినాశకరంగా పనిచేస్తోంది. కాని ఎప్పుడైతే సమాజం యీ ఉత్పాదక శక్తుల్ని స్వాధీన మొనర్చుకొంటుందో, అప్పుడు ఉత్పత్తిదార్లే ఉత్పత్తి సాధనాల, సరకుల సామాజిక స్వభా వాన్ని సమగ్రంగా అవగాహన చేసుకొని, దాన్ని వినియోగించుకుంటారు. అప్పడిక ఈ సామాజిక స్వభావం మధ్యమధ్య వచ్చే సంక్షోభాలకు, కల్లోలాలకు మూలకారణంగా వుండేం దుకుబదులు ఉత్పత్తి పెరుగుదలకు అత్యంత బలీయమైన సాధనమవుతుంది.

మనం క్రియాశీలమైన సామాజిక శక్తుల్ని అర్థంచేసుకోనంత కాలం సరిగా అంచనా వేసుకోనంత కాలం అవి, ప్రకృతి శక్తుల్లాగే గుడ్డిగా, బలీయంగా, వినాశకరంగా పనిచేస్తాయి. కాని, ఎప్పుడైతే మనం వాటిని అర్థంచేసుకొంటామో, వాటి పనినీ, గమనాన్నీ, ఫలితాల్నీ ఎప్పుడైతే అవగాహన చేసుకొంటామో, అప్పుడు అంతకంతకు అధికంగా మన

యిష్టంవచ్చిన మార్గంలో వాటిని నడపగల్గుతాం: వాటిద్వారా మన గమ్యాల్ని చేరుకో గల్గుతాం. నేటి బ్రహ్మాండమైన ఉత్పాదక శక్తుల విషయంలో యిది మరింత యదార్థం. ఈ సామాజిక శక్తుల స్వభావాన్ని అర్థంచేసుకొనేందుకు మొండిగా నిరాకరించినంత కాలం – అలా అర్థంచేసుకోవడాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, దాన్ని సమర్థించేవారూ ప్రతి ఘటిస్తున్నారు – ఆ శక్తులు మనతో నిమిత్తం లేకుండా, మనకు వ్యతిరేకంగా వాటంతట అవి పనిచేస్తూవుంటాయి; పైన చెప్పినట్లు, మనమీద అవి పెత్తనం చలాయిస్తాయి.

కాని వాటి స్వభావాన్ని ఎప్పుడైతే అర్థం చేసుకుంటామో అప్పుడు సమిష్టిగా కలిసి పనిచేసే ఉత్పత్తిదార్ల చేతుల్లో అవి పెత్తనంచేసే బ్రహ్మ రాక్షసులుగా కాక, యిష్ట పూర్వకంగా సేవచేసే సేవకుల్లాగ ఉంటాయి. మన అదుపులో లేని ఉత్పాదక శక్తులకూ, అదుపులో వున్న ఉత్పాదక శక్తులకూ తేడా ఎలాంటిదంటే, మెరుపుల రూపంలో ఉత్ప న్నమయే వినాశకర విద్యుచ్ఛక్తికీ టెలిగ్రాఫ్‌లోనూ, ఎలెక్ట్రిక్ బల్బులలోనూ అదుపులో వున్న విద్యుచ్ఛక్తికీ మధ్య వున్న వ్యత్యాసం వంటిది. అగ్ని ప్రమాదానికీ, మానవునికి సేవజేసే అగ్నికీ మధ్య వున్న తేడా వంటిది. ఈవిధంగా మనం ఆధునిక ఉత్పాదక శక్తుల స్వభావాన్ని అర్థంచేసుకున్ననాడు, సామాజికోత్పత్తిలో యిప్పుడున్న అరాజకం స్థానే మొత్తం సమాజం యొక్క అవసరాలకూ, ఆ సమాజంలోని వ్యక్తుల అవసరాలకూ అనుగుణంగా ఒక నిర్ది ష్టమైన ప్లాను ప్రకారం వుత్పత్తినంతనూ క్రమబద్ధ మొనర్చవచ్చు. అప్పుడు మొత్తం ఉత్పత్తిని పెట్టుబడిదార్లు స్వాయత్తమొనర్చుకొనే పద్ధతి పోతుంది. అంటే ఉత్పాదిత వస్తువు మొదట ఉత్పత్తిదారుల్నీ, తర్వాత స్వాయత్తం చేసుకొనే పెట్టుబడిదారుల్నీ తనకు బానిసలుగా చేసుకొనే పద్ధతి పోతుంది. దాని స్థానంలో ఉత్పాదిత వస్తువులపై ఆధు నిక ఉత్పత్తి సాధనాల స్వభావాని కనుగుణమైన స్వాయత్త పద్ధతి ప్రవేశిస్తుంది. అది ఒకవైపు సమాజమంతా ప్రత్యక్షంగా స్వాయత్తం చేసుకొనే ఉత్పత్తి సాధనాలమీదా (అవి ఉత్పత్తిని పోషించేందుకూ, పెంచేందుకూ ఉపయోగపడతాయి), మరోవైపు వ్యక్తులు ప్రత్య క్షంగా స్వాయత్తం చేసుకొనే జీవితావసరాలమీదా (ఇవి వ్యక్తుల్ని పోషించేందుకూ, ఆనంద పరిచేందుకూ ఉపయోగపడతాయి) ఆధారపడి వుంటుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రజల్లో అధిక సంఖ్యాకుల్ని అంతకంతకు కార్మికు లుగా మార్చివేస్తూందంటే, అది విధిగా యిట్టి విప్లవాన్ని కొనిరావలసిన ఒక శక్తిని, అలా కొనిరాకపోతే తన్ను తాను ధ్వంస మొనర్చుకొనే ఒక శక్తిని, అంటే శ్రామికవర్గాన్ని సృష్టి స్తోందన్నమాటే. పెట్టుబడిదారీ విధానం ఒకవైపు యిదివరకే సామాజిక స్వభావంగల ఉత్పా దక శక్తుల్ని అంతకంతకు అధికంగా ప్రభుత్వ ఆస్తిగా మారుస్తోంది, మరోవైపు యిట్టి విప్లవాన్ని కొనిరావలసిన మార్గాన్ని కూడా అది తనంత తానే చూపిస్తోంది. శ్రామికవర్గం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకుని, ఉత్పత్తి సాధనాలను ప్రభుత్వ ఆస్తిగా మార్చివేస్తుంది.

కాని, యిలా చేయడంలో శ్రామికవర్గంగా తన అస్తిత్వాన్ని అది నిర్మూలించుకొంటుంది; వర్గ భేదాలన్నిటినీ అది నిర్మూలిస్తుంది; వర్గ వైరుధ్యాలను నిర్మూలిస్తుంది; వాటితోబాటు రాజ్యాన్ని రాజ్యంగా వుండకుండా చేస్తుంది. ఇంతవరకు వర్గ వైరుధ్యాల మీద ఆధారపడుతున్న సమాజంలో ఒక ప్రత్యేక వర్గానికి, అంటే దోపిడీచేసే ఒక వర్గాని కది వ్యవస్థగా తాత్కాలికంగా అవసరమయింది. ప్రస్తుతమున్న ఉత్పత్తి పద్ధతుల్ని బయటిశక్తి ఏదీ తారుమారు చేయకుండా నిరోధించేందుకది అవసరమైంది. కాబట్టి దోపిడీ చేయబడే వర్గాలను ఆయా ఉత్పత్తి వ్యవస్థల కనుగుణమైన (బానిస వ్యవస్థ భూదాస్య వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థ) పద్ధతుల్లో బలవంతంగా అణచి వుంచేందు కది అవసరమైంది. రాజ్యం మొత్తం సమాజాని కంతకూ సాధికారంగా ప్రాతినిధ్యం వహించింది; దాని దృశ్య ప్రతిరూపం, కాని యీ శక్తి (అంటే రాజ్యయంత్రం) మొత్తం సమాజానికి తాత్కాలికంగా ప్రాతినిధ్యం వహించే వర్గానిది మాత్రమే. ప్రాచీన కాలంలో అది బానిస యజమానులది; మధ్యయుగాల్లో ఫ్యూడల్ ప్రభువులది; ఆధునిక యుగంలో పెట్టుబడిదారీ వర్గానిది. కాని, అది ఎప్పుడైతే నిజంగా సమాజాని కంతకూ ప్రాతినిధ్యం వహిస్తుందో అప్పుడు దాని అవసరం తీరిపోతుంది. అణచి వుంచబడే వర్గం ఎప్పుడైతే లేకుండా పోతుందో, వర్గపాలన ఎపుడైతే సమసిపోతుందో, ప్రస్తుతం ఉత్పత్తిలోవున్న అరాజకంవల్ల ప్రతివ్యక్తీ తన అస్తిత్వంకోసం పోరు జరపవలసిన అవసరం ఎప్పుడైతే పోతుందో, వీటన్నిటి ఫలితంగా ఉప్పతిల్లే సంఘర్షణలు, అత్యాచారాలు ఎప్పుడైతే తొలగింపబడుతాయో — అప్పుడు అణచి వుంచాల్సినది మరేదీ మిగలదు. ఒక ప్రత్యేకమైన అణచి వుంచే శక్తి — రాజ్యం — అప్పుడిక ఎంతమాత్రం అవసరముండదు. రాజ్యం ఏ తొలి చర్యద్వారా మొత్తం సమాజానికంతకూ నిజంగా ప్రాతినిధ్యం వహిస్తుందో — అంటే సమాజం పేరిట ఉత్పత్తి సాధనాలను హస్తగతంచేసుకోవడం — ఆ తొట్టతొలి చర్య రాజ్యంగా అది తీసుకొనే చిట్టచివరి స్వతంత్ర చర్య కూడా అవుతుంది. సామాజిక సంబంధాల్లో రాజ్యం ఒక రంగం తర్వాత ఒక రంగంలో జోక్యం కలిగించుకోవటం అప్పుడు అనవసరమవుతుంది. అప్పుడది దానంతట అదే నశిస్తుంది; వ్యక్తుల్ని పాలించే ప్రభుత్వం స్థానే వస్తువులను సమకూర్చే సంస్థ ఏర్పడుతుంది. ఉత్పత్తి ప్రక్రియలను నిర్వహించే సంస్థ ఏర్పడుతుంది. రాజ్యం "రద్దుచేయబడదు," దానంతట అది డుల్లిపోతుంది. దీన్నిబట్టి ఆందోళనకారులు అప్పుడప్పుడిచ్చే "స్వేచ్ఛా రాజ్య"* నినాదం ఎంత సముచితమైనదో, ఎంత విలువైనదో, అదే సమయంలో శాస్త్రీయ దృష్టిలో అది ఎంత అసమగ్రమైనదో బోధపడుతుంది. అరాజకవాదులనబడేవాళ్లు ర్యాజాన్ని యిప్పటికిప్పడే రద్దుచేయాలంటూ చెప్పేమాటను ఈ దృష్టిలో కూడా అంచనావెయ్యాలి.

---

* రెండవ భాగంలో 209–215, 220–222 పేజీలు చూడండి. — సం.

చరిత్రలో పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించిన తర్వాత కొంతమంది వ్యక్తులు, కొన్ని గ్రూపులు ఉత్పత్తి సాధనాలన్నింటినీ సమాజమే స్వాయత్తం చేసుకోవాలని కలలు గన్నారు. అదే భవిష్యత్తుకు గమ్యమని అస్పష్టమైన ఆలోచనలు చేశారు. కాని, సాధించేందుకు వాస్తవ అనుకూల పరిస్థితులున్నప్పుడే అది సాధ్యపడుతుంది; అప్పుడే దానికి చారిత్రక ఆవశ్యకత ఏర్పడుతుంది. ఇతర విధాలైన సామాజిక పురోగమనం లాగే యిది కూడా ఆచరణ సాధ్యం కావాలంటే, వర్గాల అస్తిత్వం న్యాయానికీ, ధర్మానికీ విరుద్ధమనీ, సమానత్వం మొదలైన వాటికి వ్యతిరేకమనీ ఎవరో కొందరు వ్యక్తులు అర్థంచేసుకున్నంత మాత్రాన సరిపోదు, యీ వర్గాలను రద్దుచేయడానికి ఆ వ్యక్తులు సమ్మతించిన మాత్రాన సరిపోదు. కొన్ని నూతనమైన ఆర్థిక పరిస్థితు లేర్పడినప్పుడే యిది సాధ్యం. ఇదివరలో ఉత్పత్తి సంకుచితంగాను, పరిమితంగాను అభివృద్ధి చెందుతూండడంవల్ల సమాజం రెండు వర్గాలుగా — దోపిడీ వర్గంగాను, దోచుకోబడే వర్గంగాను — విడిపోయింది. పాలకవర్గ మొకటీ, పాలితవర్గ మొకటీ ఏర్పడ్డాయి. ఈ విభజన ఆరోజుల్లో అవసరమయింది, ప్రజలంతా బ్రతకడాని కవసరమైన కనీస ప్రమాణం కంటే కొద్దిగానే సంపదను ఉత్పత్తి చేస్తున్నంతకాలం, తత్ఫలితంగా సమాజంలోని అత్యధిక సంఖ్యాకులు తమ కాలాన్ని పూర్తిగానో, యించుమించు పూర్తిగానో శ్రమచేయడంలోనే వినియోగిస్తున్నంతకాలం సమాజం వర్గాలుగా విభజింపబడ్డం తప్పనిసరి అయింది, అవసర మయింది. సమాజంలోని యీ అధిక సంఖ్యాకుల, శ్రమయొక్క యీ కట్టుబానిసల సరసన ప్రత్యక్షంగా ఉత్పత్తిలో పాల్గొనని వర్గమొకటి ఉత్పన్నమైంది. ఈ వర్గం మొత్తం సమాజంయొక్క వ్యవహారాలు చూచేది. అంటే, కార్మికులచేత పనిచేయించడం, రాజ్యాన్ని నడపడం, న్యాయశాస్త్రాన్ని అమలుజరపడం, శాస్త్ర పరిశోధనలు, కళలు, సాహిత్యం మొదలైన కార్యకలాపాలు నిర్వహించేది. అందుచేత, సమాజం వర్గాలుగా విభజింపబడ్డానికి శ్రమవిభజన నియమమే మూలం. కాని, వర్గాలుగా యీ విభజనను దౌర్జన్యం, దోపిడీ కుయుక్తులు, మోసంద్వారా జరక్కుండా యిది ఆటంకపరచదు. ఒకసారి అధికారంలోకి వచ్చిన పాలకవర్గం కార్మికుల్ని దోచుకోవడంద్వారా తన అధికారాన్ని పటిష్ఠం చేసుకోకుండానూ, సమాజంపై తన నాయకత్వాన్ని ప్రజాపీడనకు ఉపయోగించుకోకుండానూ యిది నివారించదు.

అయితే, యీ కారణంగా వర్గవిభజన చారిత్రకంగా సమర్థనీయమైనదనుకుంటే ఒకానొక దశలో మాత్రమే, కొన్ని సామాజిక పరిస్థితుల్లో మాత్రమే అది సమర్థనీయం దానికి ఆధారం ఉత్పత్తిలో యేర్పడ్డ కొరత. కాని, ఆధునిక ఉత్పాదక శక్తులు సంపూర్ణంగా అభివృద్ధి చెందిననాడు వర్గవిభజన తుడిచివేయబడుతుంది. అందువల్ల, సమాజంలో వర్గాలు రద్దుకావాలంటే, చారిత్రక పరిణామం ఒక స్థాయికి చేరుకోవాలి; ఏదో ఒక పాలక వర్గమే కాక అన్ని పాలకవర్గాలూ కాలం చెల్లిన పురావశేషాలైన పరిస్థితులేర్పడాలి; అంటే

వర్గవిభజనే అనవసరమయే స్థితి ఏర్పడాలి. దీని అర్థమేమంటే, సమాజంలో ఒక వర్గం ఉత్పత్తి సాధనాలనూ, ఉత్పత్తి అయిన సంపదనూ తానే స్వాయత్తం చేసుకోడం, తానే రాజ్యాధికారం చలాయించడం, తానే సంస్కృతినంతనూ గుత్తకు తీసుకోవడం నిరుపయోగమేకాక ఆర్థికంగాను, రాజకీయంగాను, సాంస్కృతికంగాను అది సమాజ పురోగతికి ఆటంకంగా కూడ తయారయేంత స్థాయికి మొత్తం ఉత్పత్తి అభివృద్ధిచెందాలి.

అట్టి స్థాయికి మనం యిప్పుడు వచ్చాం. ఈ రోజున బూర్జువావర్గంయొక్క రాజకీయ, బౌద్ధిక దివాళాకోరుతనం అందరికీ తెలిసిపోయింది; వారిలో వారు కూడా దాచుకోలేని రహస్యంగా అది తయారయింది. ఇక వారి ఆర్థిక దివాళాకోరుతనం ప్రతి పదేండ్లకొకసారి విడువకుండా ప్రత్యక్షమవుతూనే వుంది. ప్రతి సంక్షోభంలోను సమాజం తన సొంత ఉత్పాదక శక్తుల, ఉత్పాదిత సరకుల భారం మోయలేక ఉక్కిరిబిక్కిరవుతోంది. సమాజం వాటిని ఉపయోగించుకోలేకుండా వుంది: నిస్సహాయంగా కళ్లు తేలవేసి చూస్తోంది. ఒకవంక, ఉత్పత్తిదారుల దగ్గర అనుభవించేందుకేమీ లేదు, మరోవంక వినిమయదార్లకు కొరత వుంది. ఉత్పత్తి సాధనాల విస్తరణశక్తి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం తమపై విధించిన శృంఖలాలను విచ్ఛిన్నం చేస్తుంది. ఆ శృంఖలాలను పూర్తిగా బద్దలుచేసి ఉత్పత్తి సాధనాలు విముక్తి చెందిననాడు అవి నిరాటంకంగా, అనవరతం అంతకంతకు వేగంగా అభివృద్ధిచెందుతాయి. దానితో మొత్తం ఉత్పత్తి దాదాపు అనంతంగా పెరుగుతుంది. అంతేకాదు. ఉత్పత్తి సాధనాలన్నిటినీ సమాజం స్వాయత్తమొనర్చుకొన్ననాడు, ప్రస్తుతం ఉత్పత్తి పెరగకుండా ఆటంకపరిచే కృత్రిమ అవరోధాలు నిర్మూలింపబడ్డమేకాక, ఉత్పాదక శక్తులూ, ఉత్పత్తి అయిన సరకులూ వృధాగా పడివుండేస్థితి, నాశనం చేయబడేస్థితి యిక వుండదు. ప్రస్తుతం యీ స్థితి ఉత్పత్తి విధానంలో అనివార్యమయింది; ఆర్థిక సంక్షోభాల్లో యిది శిఖర స్థాయికి చేరుతోంది. మరొక విషయమేమంటే, ప్రస్తుతం పాలకవర్గాలూ, వారి రాజకీయ ప్రతినిధులూ బోలెడు సంపదను అర్థంలేకుండా, విపరీతంగా దుబారాచేస్తున్నారు. అదంతా సమాజపరమైననాడు, ప్రజలందరికీ కొల్లలుగా ఉత్పత్తి సాధనాలూ, ఉత్పాదితం అయిన సరకులూ వినియోగంలోకి వస్తాయి. ఉత్పత్తి సమాజపరమైతే, సమాజంలోని ప్రతి వ్యక్తికీ జీవితావసర వస్తువులు పుష్కలంగా లభించడమే కాక, రోజు రోజుకూ వాటి ప్రమాణం పెరిగి, సమస్త ప్రజలూ తమ మానసిక, శారీరక శక్తుల్ని స్వేచ్ఛగా అభివృద్ధి చేసుకొనేందుకు, ఉపయోగించుకొనేందుకు గ్యారంటీ లభిస్తుంది. ఈ అవకాశం మొట్టమొదటిసారిగానే అయినా, అది యిప్పుడిక్కడ కచ్చితంగా వుంది.*

---

* ఆధునిక ఉత్పత్తి సాధనాలు, పెట్టుబడిదారీ పరిధుల్లో కూడా అభివృద్ధిచెందేందుకెంత బ్రహ్మాండమైన శక్తిని కలిగి వున్నాయో తెలుసుకోడానికి కొన్ని అంకెలు పరిశీలిస్తే

మొత్తం సమాజమే ఉత్పత్తి సాధనాలను హస్తగతం చేసుకొన్ననాడు సరకుల ఉత్పత్తి రద్దవుతుంది. అదే సమయంలో ఉత్పాదిత వస్తువులు ఉత్పత్తిదార్లపై పెత్తనం చేయడం ఉండదు. సామాజిక ఉత్పత్తిలో అరాజకం పోయి, దాని స్థానే క్రమబద్ధమైన, నిర్దిష్టమైన ఒక ప్లాను ప్రకారం ఉత్పత్తిచేసే పద్ధతి ఆవిర్భవిస్తుంది. ప్రతి వ్యక్తీ తన అస్తిత్వంకోసం పెనగులాడ్డం అదృశ్యమవుతుంది. మానవుడు మొట్టమొదటిసారిగా యితర జంతు ప్రపంచంనుండి ఒకవిధంగా విడివడతాడు. జంతువుల్లా బ్రతికే స్థితినుంచి నిజమైన మానవులుగా బ్రతికే స్థితికి అభివృద్ధిచెందుతాడు. మానవునిచుట్టూ వున్న జీవితపరిసరాలన్నీ యింతవరకు మానవుణ్ణి శాసిస్తూ వచ్చాయి. ఆ పరిస్థితి పోయి, మానవుడే తన జీవిత పరిసరాలను శాసిస్తాడు. అదుపు చేస్తాడు. మొట్టమొదటిసారిగా అతడు ప్రకృతికి నిజమైన, చైతన్యయుతమైన అధినాధుడవుతాడు. ఎందుచేతంటే అతడు తన సామాజిక వ్యవస్థకు అధినాధుడవుతాడు. అతని సామాజిక కార్యాల నియమాలన్నీ యింతవరకు ప్రకృతి నియమాలవలె, అతనికెదురుగా, అతనికి భిన్నంగా, అతనిపై పెత్తనం చెలాయిస్తూ నిలబడివున్నాయి. ఇక మీదట ఆ పరిస్థితి వుండదు. మానవుడు ఆ నియమాలను పూర్తిగా అవగాహన చేసుకొని, తద్వారా వాటిమీద ఆధిపత్యం చెలాయిస్తాడు. ఇంతవరకు మానవునిచే నిర్మింపబడిన సామాజిక వ్యవస్థ ఒక ఆవశ్యకతగా, ప్రకృతీ, చరిత్రా అతనిపై రుద్దిన ఆవశ్యకతగా, అతని కెదురు బొదురుగా నిలబడివుంది; కాని యిక మీదట అది మానవుడు నిర్వర్తించే స్వతంత్ర కార్యాల పర్యవసాన మవుతుంది. ఇంతవరకు చరిత్రను శాసిస్తూ వచ్చిన బాహ్య వస్తుపరమైవ శక్తులు యిక మీదట మానవుని అదుపుక్రిందికి వస్తాయి. ఆ నాటినుంచీ మానవుడు తనంతట తాను అంతకంతకు చైతన్యయుతంగా తన చరిత్రను తాను నిర్మించుకొంటాడు. ఆ నాటినుంచి మానవుడు ప్రవేశపెట్టిన సామాజిక గమ్యాలు ప్రధా

---

చాలు. జిఫెన్ యిచ్చిన వివరాలనుబట్టి గ్రేట్ బ్రిటన్–ఐర్లాండ్‌ల మొత్తం సంపద స్థూలమైన అంకెల్లో యీక్రింది విధంగా వుంది:

1814 లో: 220,00,00,000 పౌన్లు
1865 లో: 610,00,00,000 పౌన్లు
1875 లో: 850,00,00,000 పౌన్లు

సంక్షోభ కాలంలో ఉత్పత్తి సాధనాలూ, ఉత్పత్తి అయిన సరుకులూ ఎంత విపరీతంగా దుబారా చేయబడతాయో తెలుసుకోడానికి ఒక ఉదాహరణ ఏమంటే, 1873–78 మధ్య సంక్షోభంలో జర్మన్ యినుప పరిశ్రమ ఒకటే. 2,27,50,000 పౌనులు నష్టపడినట్లు రెండవ జర్మన్ పారిశ్రామిక మహాసభలో (బెర్లిన్: 1878, ఫిబ్రవరి 21) వెల్లడిచేయబడింది. (ఎంగెల్స్ వివరణ.)

నంగాను, అంతకంతకు హెచ్చుప్రమాణాల్లోను అతని అభీష్టాల కనుగుణమైన ఫలితాలను చేకూరుస్తాయి. అంటే, మానవుడు ఆవశ్యకత అనే రాజ్యంనుండి స్వాతంత్ర్యం అనే రాజ్యంలోకి ఆరోహిస్తాడన్నమాట.

పైన యిచ్చిన చారిత్రక పరిణామ పరిశీలనయొక్క సారాంశం యిదీ:

1. మధ్యయుగాల సమాజం: ఈ దశలో ఉత్పత్తి వ్యక్తులచే తక్కువ స్థాయిలో కొనసాగేది. ఉత్పత్తి సాధనాలు వ్యక్తుల ఉపయోగానికే తగినట్లుండేవి. అందువల్ల అవి ఆదిమ లక్షణాలను కలిగి వుండేవి. వికారంగా, అల్పమైనవిగా, క్రియాశక్తిలో మిక్కిలి పరిమితంగా వుండేవి. ఉత్పత్తిదారు సొంత ఉపయోగానికో, తన ఫ్యూడల్ ప్రభువుకోసమో అప్పటికప్పుడు ఉపయోగపడే వస్తువుల్నే తయారుచేసేవాడు. ఆ వినిమయాన్ని మించి ఉత్పత్తి అయే వస్తువులు మాత్రమే విక్రయానికి లభించేవి. మారకంలో ప్రవేశించేవి. అందువల్ల సరకుల ఉత్పత్తి ప్రాథమిక దశలో వుండేది. కాని మొత్తం సమాజంయొక్క ఉత్పత్తిలోని అరాజకత్వం దానిలో అప్పటికే బీజరూపంలో గర్భితమై వుంది.

2. పెట్టుబడిదారీ విప్లవం: పరిశ్రమల రూపాంతరీకరణ, మొదట సామాన్య సహకారం, తర్వాత కార్ఖానా ఉత్పత్తిద్వారా. ఇదివరలో చెల్లాచెదురుగా వున్న ఉత్పత్తి సాధనాలు ఒకే చోట కార్ఖానాలలో కేంద్రీకరింపబడే పద్ధతి ప్రవేశించింది. తత్ఫలితంగా వ్యక్తిగత ఉత్పత్తి సాధనాలు సామాజిక ఉత్పత్తి సాధనాలుగా మార్పు చెందాయి. అయితే ఈ మార్పు మొత్తంమీద మారకపు పద్ధతిని మాత్రం మార్చలేదు. పాత స్వాయత్త పద్ధతులే అమల్లో వున్నాయి. పెట్టుబడిదారు రంగంమీద ప్రవేశించాడు. అతడే ఉత్పత్తి సాధనాలకు యజమాని. అందువల్ల అతడే తయారైన వస్తువులను స్వాయత్తం చేసుకొంటున్నాడు, వాటిని సరకులుగా మారుస్తున్నాడు. ఉత్పత్తి సామాజిక క్రియ అయింది. కాని మారకం, స్వాయత్తత మాత్రం వ్యక్తిగత స్వభావాన్ని కలిగి వున్నాయి; అంటే, అది వ్యక్తుల క్రియ అన్నమాట. సామాజిక ఉత్పాదిత వస్తువు విడి పెట్టుబడిదారుచేత స్వాయత్తం చేసుకోబడుతోంది. ఇదే మౌలిక వైరుధ్యం, దీన్నుంచే యితర వైరుధ్యాలన్నీ ఉత్పన్నమయాయి. ఆ వైరుధ్యాల్లో ఆధునిక సమాజం నడకసాగిస్తోంది; వాటిని ఆధునిక పరిశ్రమలు వెలుగులోకి తెచ్చాయి. ఆ వైరుధ్యాలివి:

(అ) ఉత్పత్తి సాధనాలనుంచి ఉత్పత్తిదారు వేర్పాటు. కార్మికుడు ఆజన్మాంతం వేతన శ్రమకు గురికావడం. కార్మికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య వైరుధ్యం.

(ఆ) సరకుల ఉత్పత్తిని శాసించే నియమాలు అంతకంతకు పైచేయి సంపాదించడం; అంతకంతకు అవి ప్రాబల్యం వహించడం. విశృంఖలమైన వ్యాపార పోటీ. విడి ఫ్యాక్టరీలో ఉత్పత్తియొక్క సామాజిక వ్యవస్థీకరణ, మొత్తంగా ఉత్పత్తిలో సామాజిక అరాజకత్వం.

(ఇ) ఒకవైపు ఫ్యాక్టరీ యజమానుల మధ్య ఉండే పోటీవల్ల ఒక్కొక్క యజమాని

యంత్రాలను అంతకంతకు అభివృద్ధిచేయడం; దానితోబాటు కార్మికుల్ని నిరంతరం పనుల్లో నుంచి తొలగించడం. తత్ఫలితంగా పారిశ్రామిక రిజర్వుసైన్య మొకటి ఏర్పడడం. రెండో వైపు, వ్యాపారపోటీ మూలాన అనివార్యంగా ప్రతి పెట్టుబడిదారూ ఉత్పత్తిని అపరిమితంగా పెంచవలసిరావడం. రెండువైపులనుంచీ ఉత్పాదక శక్తులు కనీవినీయెరుగనంతగా అభివృద్ధి చెందడం, డిమాండు కన్న సప్లయి అధికమవడం; మితిమీరిన ఉత్పత్తి పోగుపడడం; మార్కెట్లు సరకులతో నిండిపోవడం; ప్రతి పదేండ్లకూ సంక్షోభాలు దాపురించడం. ఈవిధంగా ఒక విషచక్రం ప్రత్యక్షమవుతుంది; ఒకవైపు ఉత్పత్తి సాధనాలు, ఉత్పాదిత వస్తువులు మితిమీరి నిల్వ ఉండిపోతాయి; మరోవైపు కార్మికులు మితిమీరి నిరుద్యోగులై, జీవితావసర వస్తువులు పొందలేక పోతారు. కాని, ఉత్పత్తికీ, సామాజిక శ్రేయస్సుకూ అత్యంత కీలకమైన యీ రెండూ (ఉత్పత్తి సాధనాలు, కార్మికులు) కలిసి పనిచేయడం అసాధ్యం. ఎందుచేతనంటే, ఉత్పాదక శక్తులు మొదట పెట్టుబడిగా మారనిదే పనిచేయలేవు; ఉత్పత్తి అయిన సరకులు కూడ పెట్టుబడిగా మారనిదే మారకం కావు. కాని, నేడు అవి మితిమీరి వృద్ధిచెందుతూండడంవల్ల పెట్టుబడిగా వినియోగంలోకి రావు. అంటే, ఉత్పత్తి సాధనాలు పనిచేయడానికీ, సరకులు విడుదల కావడానికీ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అడ్డు వస్తోందన్నమాట. ఈ వైరుధ్యం నేడొక అసంబద్ధ విషయంగా తయారైంది. ఈవిధంగా ఉత్పత్తి విధానం మారకపు విధానంపై తిరుగుబాటు చేస్తుంది. బూర్జువావర్గం తన సొంత సామాజిక ఉత్పాదక శక్తుల్నే నడుపుకోలేదని రుజువయింది.

(ఈ) ఉత్పాదక శక్తుల సామాజిక స్వభావాన్ని పెట్టుబడిదార్లు పాక్షికంగా అయినప్పటికీ గుర్తించక తప్పని పరిస్థితి ఏర్పడడం. మొదట జాయింట్ స్టాక్ కంపెనీలు, తద్వారా ట్రస్టులు, ఆ తర్వాత రాజ్యం బ్రహ్మాండమైన ఉత్పత్తి సంస్థలనూ, రవాణా సాధనాలనూ స్వాధీనం చేసుకొంటున్నాయి. ఈవిధంగా బూర్జువావర్గమే యిక అనవసరమైన వర్గంగా రుజువయింది. ఆ వర్గం నిర్వర్తించే సామాజిక విధులన్నిటినీ నేడు జీతాలకు పనిచేసే ఉద్యోగులు నిర్వర్తిస్తున్నారు.

3. శ్రామికవర్గ విప్లవం: శ్రామికవర్గ విప్లవ మొక్కటే యీ వైరుధ్యాలను పరిష్కరించగల్గుతుంది. శ్రామికవర్గం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకొని, తద్వారా పెట్టుబడిదార్ల చేతులోనుంచి జారిపోతున్న సామాజిక ఉత్పత్తి సాధనాలను యావత్తు సమాజపు ఆస్తిగా మార్చివేస్తుంది. ఈ చర్యద్వారా, శ్రామికవర్గం ఉత్పత్తి సాధనాలన్నిటినీ వాటి పెట్టుబడిదారీ స్వభావంనుంచి విముక్తిచేసి, వాటి సామాజిక స్వభావం సంపూర్ణంగా వికసించేందుకు స్వేచ్ఛను కల్పిస్తుంది. ఇకమీదట సామాజికోత్పత్తి ఒక నిర్దిష్టమైన ప్లాను ప్రకారం కొనసాగగలదు. ఉత్పత్తి నిరాటంకంగా అభివృద్ధిచెందితే, సమాజంలో యిక వర్గాలుండవలసిన అవసరానికి కాలదోషం పడుతుంది. సామాజికోత్పత్తిలో అరాజకత్వం ఏ

మేరకు సమసిపోతుందో ఆమేరకు రాజ్యంయొక్క రాజకీయ అధికారం నశించిపోతుంది. చివరకు మానవుడు, తాను నిర్మించిన సామాజిక వ్యవస్థకు తానే అధినాథుడుగా వుంటూ, తనపై ఆధిపత్యం వహిస్తున్న ప్రకృతిపైనా, స్వయంగా తనపైన తానూ అధినాథుడవుతాడు; అంటే, సంపూర్ణ స్వేచ్ఛగల మానవుడవుతాడు.

ఈవిధంగా సమస్త మానవకోటినీ విముక్తిచేసే యీ కార్యం ఆధునిక శ్రామికవర్గం యొక్క చారిత్రక కర్తవ్యం. చారిత్రక పరిస్థితుల్ని సమగ్రంగా తెలుసుకోవడం, ఆవిధంగా యీ మహత్కార్యంయొక్క స్వభావాన్ని అర్థంచేసుకోవడం, ప్రస్తుతం అణగద్రొక్కబడి వున్న శ్రామికవర్గానికి అది సాధించవలసివున్న యీ మహత్కార్యంయొక్క ఆంతర్యాన్ని గురించీ, స్థితిగతుల్ని గురించీ సమగ్రమైన పరిజ్ఞానం కలిగించడం — యిది శాస్త్రీయ సోషలిజంయొక్క, అంటే కార్మికోద్యమ సిద్ధాంతంయొక్క కర్తవ్యం.

1880, జనవరి, మార్చి నెల మొదటి
అర్ధభాగం మధ్య ఎంగెల్స్‌చే రచించబడినది

"La Revue socialiste" పత్రిక 3, 4, 5
సంచికలలో, 1880 మార్చి 20,
ఏప్రిల్ 20, మే 5 తేదీలలో ప్రచురితమైనది.
ఫ్రెంచిభాషలో 1880లో పారిస్‌లో
ఒక విడి పుస్తకంగా F. Engels, "Socialisme utopique et socialisme scientifique"
శీర్షికతో ప్రచురితమైంది

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

# కార్ల్ మార్క్స్ సమాధివద్ద ప్రసంగం

మార్చి 14వ తేదీన, మధ్యాహ్నం పావు తక్కువ మూడు గంటలకు, ప్రపంచంలోకెల్లా మహత్తర ఆలోచనాపరుని ఆలోచనాప్రక్రియ ఆగిపోయింది. ఆయన్ని మహా అయితే రెండేరెండు నిమిషాలు విడిచి బయటకు వెళ్లివుంటామేమో, కాని మేము తిరిగివచ్చేసరికి ఆయన పడకకుర్చీలో శాంతంగా నిద్రపోతున్నాడు – అయితే అది శాశ్వత నిద్ర.

ఈ మనిషి మృతిమూలంగా యూరప్, అమెరికాలలోని సమరశీల శ్రామికవర్గానికీ, చారిత్రక విజ్ఞానశాస్త్రానికీ అపారమైన నష్టం వాటిల్లింది. ఈ మహాత్ముని మహాప్రస్థాన కారణంగా ఏర్పడిన లోటు జనానికి త్వరలోనే అనుభూతమవుతుంది.

డార్విన్ ఏవిధంగానైతే జీవప్రకృతియొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడో, సరిగా అదేవిధంగా మార్క్స్ మానవచరిత్రయొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడు. భావ జాలంయొక్క అమిత వృద్ధి కారణంగా యింతదాకా మరుగునపడిపోయిన ఒక సరళ సత్యాన్ని: రాజకీయాలు, విజ్ఞానశాస్త్రం, కళలు, మతం మొదలైనవాటిలో నిమగ్నులవగలిగేందుకు ముందు మానవజాతికి అన్నపానాలూ, వాస వస్త్రాలూ అవసరమన్న విషయాన్ని ఆయన కనుగొన్నాడు. కాగా, అత్యవసర జీవనాధార వస్తువుల ఉత్పత్తి, తత్పర్యవసానంగా ఒకానొక యుగంలో లేక ఒకానొక జాతి ప్రజలచేత సాధింపబడిన ఆర్థికాభివృద్ధి స్థాయే ఆ ప్రజల యొక్క రాజ్య సంస్థలకు, న్యాయశాస్త్రానికి సంబంధించిన భావనలు, కళలు, చివరకు మతానికి సంబంధించిన భావాలు సైతం క్రమాభివృద్ధి చెందడానికి పునాది. అందుకని, వీటన్నిం టినీ యీ పునాది దృష్ట్యానే – యింతవరదాకా జరుగుతున్నట్లు, యిందుకు తలకిందు లుగా కాకుండా – వివరించాల్సివుంటుంది.

అయితే అంతమాత్రమే కాదు. సమకాలీన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, యీ ఉత్పత్తి విధానం సృష్టించిన బూర్జువా సమాజాన్నీ శాసించే ప్రత్యేక గతినియమాన్ని కూడా మార్క్స్ కనుగొన్నాడు. అదనపు విలువ ఆవిష్కారంతో, ఏ సమస్యను పరిష్కరించే

ప్రయత్నంలోనైతే అంతకు పూర్వపు — అటు బూర్జువా అర్థశాస్త్రజ్ఞులయొక్క, యిటు సోషలిస్టు విమర్శకులయొక్క — అన్వేషణలన్నీ అంధాన్వేషణలుగానే మిగిలిపోయాయో, ఆ సమస్యపైన కాంతి ప్రసరింపబడింది.

ఒక జీవితానికి అటువంటి ఆవిష్కరణలు రెండు చాలు. అటువంటి ఒక్క ఆవిష్కరణను చేసే అదృష్టం లభించిన వ్యక్తి సైతం భాగ్యశాలి అనే చెప్పాలి. కాని మార్క్స్, తను పరిశోధన జరిపిన ప్రతి రంగంలోనూ కూడా — మరి ఆయన చాలా రంగాల్లోనే పరిశోధన జరిపాడు, అలా పరిశోధన జరిపిన ఏ ఒక్క రంగంలోనూ అషామాషీగా పైపైన తడిమి విడిచిపెట్టలేదు — గణితశాస్త్రంతోబాటు ప్రతి ఒక్క రంగంలోనూ కూడా ఆయన స్వతంత్రమైన ఆవిష్కరణలు చేశాడు.

అటువంటి విజ్ఞానశాస్త్రవేత్త ఆయన. అయితే విజ్ఞానశాస్త్రవేత్తగా ఆయన యీ రూపం ఆయన సమగ్ర వ్యక్తిత్వంలో అర్ధాంశం కూడా కాదు. మార్క్స్‌కు సంబంధించినంత వరకు విజ్ఞానశాస్త్రం చారిత్రకంగా క్రియాత్మకమైన, విప్లవాత్మకమైన ఒక శక్తి. ఏ విజ్ఞానశాస్త్ర సిద్ధాంతంలోనైనా ఒక కొత్త ఆవిష్కరణ జరిగితే — ఆచరణలో దాని అన్వయాన్ని గురించి ఆలోచించడం సైతం యింకా అసంభవమే అయినా కూడా — దానికి ఆయన మహా సంతోషంగా స్వాగతం పలికేవాడు. కాని అదే ఆవిష్కరణ పరిశ్రమల్లోనూ, మొత్తంగా చారిత్రకాభివృద్ధిలోనూ తక్షణ విప్లవాత్మక మార్పులకు దారితీసినట్లయితే ఆయన మరో రకమైన ఆనందానుభూతి పొందుతూండేవాడు. ఉదాహరణకు, విద్యుచ్ఛక్తిరంగంలో జరిగిన ఆవిష్కరణల అభివృద్ధిక్రమాన్ని, మర్సేల్ ద్రె పే యిటీవలి ఆవిష్కరణలతోబాటు మార్క్స్ అత్యంత శ్రద్ధాసక్తులతో గమనించేవాడు.

మార్క్స్ అన్నిటికంటె ముఖ్యంగా విప్లవవాది కావడమే యిందుకు కారణం. ఏదో ఒక రకంగా పెట్టుబడిదారీ సమాజాన్నీ, అది సృష్టించిన రాజ్యసంస్థలనూ కూల్చివెయ్య డానికి తోడ్పడటం, ఆధునిక శ్రామికవర్గ విముక్తికి తోడ్పడటమే ఆయన జీవిత పరమోద్దేశం. దానికి తన స్థితినీ, అవసరాలనూ గురించిన చైతన్యాన్ని కలిగించి, ఏ పరిస్థితుల్లో దాని విముక్తి సంభవమో తెలియజెప్పిన మొట్టమొదటివాడు ఆయనే. పోరాటం జరపడమే ఆయన సహజగుణం. మరి ఆయన అతి కొద్దిమందికి మాత్రమే సాధ్యమైన ఆవేశంతో, పట్టుదలతో, సాఫల్యంతో ఆ పోరాటాన్ని సాగించాడు. మొదటి "Rheinische Zeitung" (1842)[4]లో, పారిస్ "Vorwärts"[87] (1844)లో, "Deutsche-Brüsseler Zeitung"[9] (1847)లో, "Neue Rheinische Zeitung"[10] (1848–49)లో, "New York Tribune"[18] (1852–61)లో ఆయన చేసిన పని, దీనికితోడు, సమరశీలమైన అనేక చిన్న పుస్తకాల రచన, పారిస్, బ్రస్సెల్స్, లండన్లలోని సంఘాల్లో చేసిన పని, చిట్టచివర ఆయన సేవల్లోకెల్ల శిఖరప్రాయమైనదైన ఇంటర్నేషనల్ వర్కింగ్

మెన్స్ అసోసియేషన్[88] సంస్థాపన – ఇదెంతటి గొప్ప పని అంటే, యీ సంఘ సంస్థాపకుడు, తను మరేదీ చెయ్యకపోయినా కూడా, యీ ఒక్క పనికే సముచితంగా గర్వించవచ్చు.

మరి వీటన్నింటి పర్యవసానంగానే, మార్క్స్ తన కాలంలో అందరికన్న ఎక్కువగా ద్వేషింపబడ్డాడు, అభాండాలకు గురయ్యాడు. రాజరిక, రిపబ్లికన్ ప్రభుత్వాలు రెండూ కూడా ఆయన్ని తమ తమ దేశాలనుండి బహిష్కరించాయి. బూర్జువాలు, వారు మితవాదులైనా, లేక పరమ ప్రజాస్వామ్యవాదులైనా కూడా, మార్క్స్‌పై అభాండాలు కురిపించడంలో ఒకరితో మరొకరు పోటీపడ్డారు. ఇవన్నీ ఏదో ఒక సాలెగూడన్నట్లు ఆయన వీటన్నింటినీ తోసిపారేశాడు, వీటిని మనస్సుకు పట్టించుకోలేదు, మరీ తప్పనిసరి అవసరం ఏర్పడినప్పుడు మాత్రమే వీటికి సమాధానమిచ్చాడు. మరి యిప్పుడాయన మన మధ్య లేడు. సైబీరియా గనులు మొదలుకొని కాలిఫోర్నియాదాకా, యూరప్ అమెరికాలలో అన్ని ప్రాంతాల్లోనూ గల లక్షలాది మంది ఆయన విప్లవవాద కార్మిక సహచరులు ఆయన్ని ప్రేమిస్తున్నారు, ఆయన్ని గౌరవిస్తున్నారు, ఈనాడు ఆయన మృతిపట్ల అశ్రుధారలు కురిపిస్తున్నారు. నేనొక విషయం ధైర్యంగా చెప్పగలను. ఆయనకు పలువురు వ్యతిరేకులు ఉండి వుండవచ్చునేమోగాని ఆయనకు వ్యక్తిగత శత్రువు మాత్రం ఒక్కడూ లేడు.

ఆయన పేరు యుగయుగాలదాకా అమరంగా వుంటుంది, అలాగే ఆయన కృషి కూడా చిరస్థాయిగా వుంటుంది!

లండన్‌లోని హైగేట్ శ్మశాన
వాటికలో 1883, మార్చి 17న
ఎంగెల్స్ ఇంగ్లీషు భాషలో చేసిన ప్రసంగం

జర్మన్ భాషలో, 1883,
మార్చి 22న, "Der Sozialdemokrat"
13వ సంచికలో ప్రచురింపబడింది

## ఫ్రెడరిక్ ఎంగెల్స్

# కమ్యూనిస్టు లీగు చరిత్రను గురించి[89]

1852లో కొలోన్ కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా తీర్పుచెప్పబడటంతో[17] స్వతంత్ర జర్మన్ కార్మికోద్యమ ప్రథమ దశ ముగింపుకి వచ్చింది. ఈనాడు యీ దశ దాదాపుగా విస్మరింపబడింది. కాని యీ దశ 1836 నుండి 1852దాకా సాగింది, జర్మన్ కార్మికులు విదేశాలలో విస్తరించడంతోబాటే కార్మికోద్యమం దాదాపు సకల నాగరిక దేశాల్లోనూ వ్యాప్తిచెందుతూవచ్చింది. ఇంతేకాదు. ఈనాటి అంతర్జాతీయ కార్మికోద్యమం సారభూతంగా ఆనాటి జర్మన్ కార్మికోద్యమంయొక్క ప్రత్యక్ష కొనసాగింపే. ఈ జర్మన్ కార్మికోద్యమమే ప్రపంచ చరిత్రలో ప్రథమ అంతర్జాతీయ కార్మికోద్యమం, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌లో నాయకత్వ పాత్ర వహించిన వారిలో పలువురిని తయారు చేసిన ఉద్యమం కూడ. దీనికితోడు కమ్యూనిస్టు లీగు 1847లో "కమ్యూనిస్టు ప్రణాళిక"* రూపంలో ఏ సైద్ధాంతిక సూత్రాలనైతే తన పతాకంపైన లిఖించుకుందో, ఆ సూత్రాలు యూరప్ అమెరికాలు రెండింటియొక్క యావత్తు కార్మికోద్యమానికీ యీనాడు సుదృఢమైన అంతర్జాతీయ బంధనమయ్యాయి.

ఆ ఉద్యమంయొక్క సుసంబద్ధ చరిత్రకు యిప్పటిదాకా ఒకేఒక్క మూలాధారం ఉంటూవచ్చింది. వేర్ముత్, ష్టీబెర్‌లచేత రచింపబడి, రెండు భాగాలుగా, బెర్లిన్‌నుండి 1853, 1854 సంవత్సరాల్లో ప్రచురింపబడిన "19వ శతాబ్దపు కమ్యూనిస్టు కుట్రలు" అన్న పుస్తకమే అది, దాన్నే "నల్ల పుస్తకం" అని పిలిచేవారు. మన శతాబ్దపు మిక్కిలి రోసిపోయిన యిద్దరు పోలీసు పోకిరులచేత అల్లబడి, పచ్చి అబద్ధాలతో నిండి వున్న యీ పులగం ఆ కాలానికి సంబంధించి, కమ్యూనిస్టేతర రచనలన్నింటికీ అంతిమ మూలాధారంగా యీనాటికీ చలామణీ అవుతోంది.

---

* ఈ సంకలనపు మొదటి భాగంలో 39–81 పేజీలు చూడండి. – సం.

నేనిక్కడ యివ్వగలిగినది కేవలం ఒక రేఖాచిత్రం మాత్రమే, అది కూడా ఎంతవరకంటే, లీగుకు ప్రత్యక్ష సంబంధం ఉన్నంతవరకు, "కుట్రకేసు బండారం" అర్థంచేసుకోడానికి తప్పనిసరి అవసరమైనంతవరకు మాత్రమే. మార్క్స్, నేనూ అంతర్జాతీయ కార్మికోద్యమపు ఆ మహోజ్వల తరుణ దశకు సంబంధించిన చరిత్ర గురించి పోగుచేసిన సుసంపన్నమైన సమాచారాన్ని విశదీకరించే అవకాశం ఏదో ఒకరోజున నాకు లభిస్తుందని ఆశిస్తున్నాను.

* * *

పారిస్‌లో 1834లో జర్మన్ శరణార్థులచేత స్థాపింపబడిన రహస్య ప్రజాతంత్ర రిపబ్లికన్ "బహిష్కృతుల లీగు"కి చెందిన అత్యుగ్రమైన, ప్రధానంగా శ్రామికవర్గ శక్తులు విడిపోయి, కొత్త రహస్య "న్యాయవంతుల లీగు"ను స్థాపించారు. జాకొబ్ వెనెదే వంటి సుషుప్త మస్తిష్కులు మాత్రమే మిగిలిన అసలు లీగు, త్వరలోనే పూర్తిగా సుషుప్తావస్థలోకి కూరుకుపోయింది. 1840లో, దానికి చెందిన కొన్ని విభాగాల ఆచూకీని జర్మనీలో పోలీసులు తెలుసుకునేప్పటికి లీగుకి తన పూర్వ రూపపు ఛాయ కూడా మిగల్లేదు. అందుకు భిన్నంగా, కొత్త లీగు సాపేక్షంగా వేగంగా అభివృద్ధిచెందింది. ఆదిలో యిది ఫ్రెంచి కార్మిక కమ్యూనిజంయొక్క జర్మన్ సంతానంగా ఉండేది. బబూవిజం[90] ధోరణికి చెందిన ఈ కార్మిక కమ్యూనిజం దాదాపు అదే సమయంలో పారిస్‌లో రూపొందింది. దీనిలో "సమానత్వానికి" ఆవశ్యక పర్యవసానంగా వస్తువులపై సాముదాయిక స్వామ్యం ఉండాలని ఉద్ఘాటింపబడింది. ఈ లక్ష్యాలూ ఆనాటి పారిస్ రహస్య సంఘాల లక్ష్యాలూ ఒక్కటే. అది సగం ప్రచారక సంఘం, సగం కుట్రదారీ సంఘం. పారిసే సదా విప్లవ కార్యాచరణకు కేంద్ర స్థానంగా పరిగణింపబడుతూండేది, అయితే జర్మనీలో అడపాదడపా ఆకస్మిక తిరుగుబాట్లకు సన్నాహాలుచేసే అవకాశాన్ని తోసిపుచ్చేందుకు ఎంతమాత్రమూ వీల్లేదు. కాని పారిసే నిర్ణాయక పోరాటరంగం కనుక, లీగు వాస్తవానికి అప్పట్లో ఫ్రెంచి రహస్య సంఘాలయొక్క, ప్రత్యేకించి బ్లాంకీ, బర్బేస్‌ల నాయకత్వాన గల Société des Saisons యొక్క — దీనితో లీగుకి సన్నిహిత సంబంధముండేది జర్మన్ శాఖగా మాత్రమే తప్ప మరోటిగా వుండేదికాదు. 1839 మే 12న ఫ్రెంచివారు కార్యాచరణకు పూనుకున్నారు. లీగుయొక్క శాఖలు కూడ వారిని అనుసరించాయి. పరాజయం సంభవించినప్పుడు దాని ఫలితాన్ని అవి కూడా అనుభవించాల్సివచ్చింది.[91]

అరెస్టుచెయ్యబడిన జర్మన్లలో కార్ల్ షాప్పెర్, హైన్రిఖ్ బౌవర్‌లు వున్నారు. లూయీ ఫిలిప్ ప్రభుత్వం, వారిని దీర్ఘకాలంపాటు జైల్లో వుంచిన తర్వాత, దేశబహిష్కృతులను చెయ్యడంతోనే సంతుష్టిచెందింది. ఇద్దరూ లండన్ వెళ్లిపోయారు. షాప్పెర్ నస్సా

ప్రాంతంలోని వేయ్‌ల్‌బుర్గ్‌కి చెందినవాడు. 1832లో గీసెన్‌లో అటవీ శాస్త్రాన్ని అభ్యసించేటప్పుడు గెయోర్గ్ బ్యూహ్నర్ సంఘటితం చేసిన కుట్రదారీ సంఘంలో అతను సభ్యుడుగా చేరాడు. 1833 ఏప్రిల్ 3న ఫ్రాంక్‌ఫుర్ట్ పోలీసు స్టేషనుపై జరిగిన దాడిలో[92] పాల్గొన్నాడు, మళ్లీ విదేశాలకు పారిపోయాడు, 1834 ఫిబ్రవరిలో సవోయ్‌పై మజ్జీని చేసిన దండయాత్రలో[93] పాల్గొన్నాడు. భీమకాయుడు, వజ్రసంకల్పుడు, ఉత్సాహవంతుడు, జీవిత సౌకర్యాలనూ, ప్రాణాన్నీ త్యాగం చేసేందుకూ సదాసంసిద్ధుడుగావుండే యీ వ్యక్తి, 1930 దశకంలో విశిష్ట పాత్రను వహించిన వృత్తి విప్లవకారులకు ఆదర్శప్రాయుడుగా ఉండేవాడు. ఆలోచనలో కొంచెం మందకొడిగా ఉన్నప్పటికీ, పరిపూర్ణమైన సైద్ధాంతిక అవగాహనా సామర్థ్యంలో అతనికి లోటుండేదికాదు. "డెమగోగ్"[94] దశనుండి కమ్యూనిస్టుగా అతను అభివృద్ధిచెందడం యీ విషయాన్నే రుజావుచేస్తుంది. అతను దేన్నైతే ఒకమారు గుర్తిస్తాడో దాన్ని మరింత గట్టిగా పట్టుకువేలాడుతాడు. సరిగా ఆ కారణంగానే ఒక్కొక్కప్పుడు అతని విప్లవాత్మక ఆవేశం అతని మనస్సుమీద పైచెయ్యి కలిగివుండేది. కాని తర్వాత ఎప్పుడూ అతను తన పొరపాటును గుర్తించి, బహిరంగంగా ఆమోదించేవాడు. అతనొక సమగ్రమైన మనిషి, జర్మన్ కార్మికోద్యమ సంస్థాపనకు అతను చేసిన కృషి ఎన్నటికీ విస్మరింపబడదు.

ఫ్రాంకోనియా నివాసియైన హైన్రిఖ్ బౌవర్ చెప్పులు కుట్టేవాడు. చలాకీగా, చురుకుగా ఉండేవాడు. చతుర భాషి. అతను లఘుకాయుడైనా కౌశల్యం, మనోనిబ్బరం దండిగా వుండేవి.

అతను లండన్ చేరుకుని, పారిస్‌లో కంపోజిటరుగా వుంటూవుండి, యిప్పుడు లండన్‌లో భాషల అధ్యాపకుడుగా జీవనోపాధిని సంపాదించుకొన ప్రయత్నిస్తున్న షాప్పెర్‌తో కలిశాడు. వారిద్దరూ తెగిపోయిన సూత్రాలను కలిపే ప్రయత్నం ప్రారంభించి లీగుకు లండన్‌ని కేంద్రం చేశారు. కొలోన్‌కి చెందిన గడియారాల పనివాడు యోసెఫ్ మోల్, వెనక పారిస్‌లో కాకపోయినా యిప్పుడక్కడ వారితో కలిశాడు. అంత మరీ పొడగరి కాని మోల్ భీమబలుడు. షాప్పెర్‌తో కలిసి తరచుగా అతను ఏ హాలు ప్రవేశద్వారం దగ్గరో నిలబడి, నెట్టుకువచ్చే వందలాది ప్రత్యర్థులనుండి విజయవంతంగా హాలును కాపాడేవాడు. శరీరదార్ఢ్యంలోనూ, సంకల్పబలంలోనూ తన క్రామేడ్లిద్దరికీ కనీసం సమానుడుగానూ, బుద్ధిబలంలో మాత్రం వారిద్దరికీ అధికుడుగానూ వుండేవాడు. అతను జన్మతః దౌత్యనీతిజ్ఞుడు. వేర్వేరు పనులపై అతన్ని దూతగా పంపిన పలుసందర్భాల్లో అతను పొందిన సాఫల్యాన్నిబట్టి యీ విషయం రుజువైంది. దీనికితోడు అతనిలో సైద్ధాంతిక సూక్ష్మ దృష్టి సామర్థ్యం కూడ అధికతరంగా వుంది. ఈ ముగ్గురితోనూ మొదటిసారిగా నాకు లండన్‌లో 1843లో పరిచయమైంది. నేను నా జీవితంలో కలుసుకున్న

తొలి విప్లవకర శ్రామికులు వీరే. వివరాల విషయంలో అప్పట్లో మా అభిప్రాయాల్లో ఎంత ఎడం వున్నప్పటికీ (వారి సంకుచిత సమానతావాద కమ్యూనిజానికి* ప్రతిగా, నాలో కూడ అప్పట్లో అంతే సంకుచితమైన తాత్విక అతిశయం గూడుకట్టుకొని వుండేది), అప్పటికింకా నిజమైన మనిషిని కావాలని కోరుకుంటూ మాత్రమే వున్న నావంటి వ్యక్తిపైన యీ ముగ్గురు పరిణత వ్యక్తులూ బరపిన ప్రగాఢమైన ప్రభావాన్ని నేనెన్నడూ మరచిపోలేను.

స్విట్జర్లాండ్‌లో మాదిరిగానే, కాని అక్కడికన్న అధికతర స్థాయిలో, లండన్‌లో సంఘ, సభా స్వాతంత్ర్య సౌకర్యం వారికి లభ్యమైంది. 1840 ఫిబ్రవరి 7నవే చట్టబద్ధంగా పనిచేసే జర్మన్ కార్మిక ఎడ్యుకేషనల్ సొసైటీ[95] స్థాపింపబడింది. అది యీనాటికీ వుంది. ఈ సొసైటీ లీగుకి కొత్త సభ్యులను సమకూర్చే స్థావరంగా ఉపయోగపడేది. ఎప్పటి మాదిరిగానే, ఈ సొసైటీలో కమ్యూనిస్టులే అత్యంత కార్యశీలురూ, చతురులూ అయిన సభ్యులు కనుక, దాని నాయకత్వం సహజంగానే పూర్తిగా లీగు చేతుల్లో వుండేది. లీగుకు త్వరలోనే లండనులో పలు శాఖలు లేక అప్పటికింకా అవి పిలువబడుతూండినట్లు "లాడ్జీలు," ఏర్పడ్డాయి. స్విట్జర్లాండులోనూ, తదితరత్రానూ ఈ ప్రత్యక్ష ఎత్తుగడలే అనుసరింపబడ్డాయి. కార్మిక సంఘాలను ఏర్పాటుచెయ్యడానికి వీలున్నచోట్ల, అవి కూడ అదే మాదిరిగా ఉపయోగించుకోబడ్డాయి. వీటి ఏర్పాటుపై చట్టపరమైన నిషేధాలున్న చోట జనం సంగీత సమాజాల్లోను, వ్యాయామశాలల్లోను, అటువంటివే యితర సంఘాల్లోనూ చేరుతూండేవారు. వారిలో నిరంతరాయంగా అటూ యిటూ ప్రయాణాలు చేస్తూవుండే లీగు సభ్యులద్వారా ఎక్కువభాగం సంబంధాలు కొనసాగింపబడుతూండేవి. వారే అవసరమైనప్పుడు రహస్య దూతలుగా కూడా పంపబడుతూండేవారు. ఈ రెండు సందర్భాల్లోనూ కూడా ఆయా ప్రభుత్వాల వివేకం మూలంగా లీగుకు సజీవమైన తోడ్పాటు లభించేది. ఎందుకంటే, అవి దేశబహిష్కృతులను చెయ్యడంద్వారా ఏ అభ్యంతరకర కార్మికునినైనా (పదింట తొమ్మిది సందర్భాల్లో అతను లీగు సభ్యుడయ్యే వుండేవాడు) రహస్య దూతగా మార్చివేసేవి.

పునరుజ్జీవితమైన లీగు గణనీయమైన స్థాయిలో విస్తరించింది. ప్రత్యేకించి స్విట్జర్లాండులో వైట్లింగ్, ఔగుస్ట్ బెక్కర్ (బెక్కర్ అత్యంత ప్రతిభాశాలి, కాని చాలామంది యితర జర్మన్ల మాదిరిగానే స్వభావంలో గల ఆంతరిక చపలత్వం కారణంగా అతని కథ ముగిసిపోయింది), తదితరులూ – కొద్ది గొప్పల్లో వైట్లింగ్‌యొక్క కమ్యూనిస్టు పద్ధతికి

---

* నేనింతకుముందే పేర్కొన్నట్లు, సమానతావాద కమ్యూనిజమంటే, ఏదైతే సంపూర్ణంగా, లేక ప్రధానంగా సమానత్వాన్ని కోరడంపై ఆధారపడుతుందో ఆ కమ్యూనిజమని నా ఉద్దేశం. (ఎంగెల్స్ వివరణ.)

అంకితమైన ఒక పటిష్ఠమైన శాఖను రూపొందించారు. వైట్లింగ్‌యొక్క కమ్యూనిజాన్ని విమర్శించడానికి యిది చోటు కాదు. కాని జర్మన్ శ్రామికవర్గపు తొలి స్వతంత్ర సైద్ధాంతిక స్ఫురణ రూపంలో దాని ప్రాధాన్యతకు సంబంధించినంతవరకు పారిస్ "Vorwärts"[87] పత్రికలో 1844లో మార్క్స్ రాసిన యీ క్రింది మాటలతో నేను యీనాటికీ ఏకీభవిస్తున్నాను: "వైట్లింగ్ రచించిన 'సామరస్య స్వాతంత్ర్యాలకు హామీలు'కు సరిపోల్చదగిన మరో గ్రంథాన్ని, (జర్మన్) బూర్జువావర్గమూ, దాని తత్వవేత్తలూ, విద్వద్వతంసులైన లేఖకులూ బూర్జువావర్గ ఉద్ధరణ – రాజకీయ ఉద్ధరణ–కు చెందిన ఏ రచనైనా చూపగలరా? జర్మన్ రాజకీయ సాహిత్యపు అనాసక్తికరమైన, నంగినంగి, నాసితనాన్ని జర్మన్ కార్మికుల అపరిమిత ప్రతిభాసంపన్నమైన యీ తొలి యత్నంతో సరిపోల్చినట్లయితే, మనం శ్రామిక వర్గపు బ్రహ్మాండమైన యీ బాల పాదరక్షలను బూర్జువావర్గపు అరిగిపోయిన రాజకీయ పాదరక్షల మరుగుజ్జు ప్రమాణాలతో సరిపోల్చినట్లయితే, యీ 'సిండరెల్లా' వస్తాదు అవుతుందని చెప్పాల్సివుంటుంది."* ఈ వస్తాదు రూపం యిప్పటికింకా పూర్తిగా వికసించకపోయినా యీనాడు మన ఎదుట నిలిచివుంది.

జర్మనీలో కూడా లీగుకు పలు శాఖలు ఉన్నాయి. పరిస్థితుల మూలంగా అవి అస్థిర స్వభావం కలిగినవి. కాని కొత్తగా తలెత్తేవాటి సంఖ్య విచ్ఛిన్నమైపోయినవాటి సంఖ్యకు మించి వుండేది. ఏడేళ్ల తర్వాత, 1846 చివర మాత్రమే పోలీసులు బెర్లిన్‌లోను (మెంటెల్), మాగ్డెబుర్గ్‌లోను (బెక్) లీగుకి సంబంధించిన జాడలను కనుగొనగలిగారు, కాని ఆ జాడల ఆధారంగా వారు మరింత కూపీ తియ్యలేకపోయారు.

పారిస్‌లో వైట్లింగ్ – 1840లో అతనింకా అక్కడే వున్నాడు – స్విట్జర్లాండుకు వెళ్లిపోయేందుకుముందు చెల్లాచెదరుగా వున్న వ్యక్తులను అదే మాదిరిగా కూడగట్టాడు.

దర్జీలు లీగుకి కేంద్రశక్తిగా వున్నారు. జర్మన్ దర్జీలు అన్ని చోట్లా – స్విట్జర్లాండులో, లండన్‌లో, పారిస్‌లో – వున్నారు. పారిస్‌లో యీ వృత్తిదారులమధ్య జర్మన్ భాష విశేష ప్రాచుర్యంలో వుంది. ఇందుకొక ఉదాహరణ చెప్తాను: 1846లో పారిస్‌లో నాకొక నార్వీజియన్ దర్జీతో పరిచయమైంది. అతను సముద్ర మార్గాన ట్రోండెహ్యామ్‌నుండి నేరుగా ఫ్రాన్సుకు వచ్చాడు. అతనక్కడవున్న 18 మాసాల కాలంలోనూ పట్టుమని ఒక్క

---

* Karl Marx, "Kritische Randglossen zu dem Artikel 'Der König von Preussen und die Sozialreform. Von einem Preussen'" ["'ప్రష్యన్' అనే వ్యాసానికి విమర్శనాత్మక వ్యాఖ్యలు." "ప్రష్యా రాజూ, సాంఘిక సంస్కరణా"] (Marx/Engels, *Werke*, Bd. 1, Dietz Verlag, Berlin, 1958, S. 392–409). – సం.

ఫ్రెంచి మాట కూడా నేర్చుకోలేకపోయాడు, కాని జర్మన్ భాషలో మాత్రం చక్కని పరిజ్ఞానం సంపాదించుకున్నాడు. 1847లో పారిస్‌లోని రెండు శాఖలు ప్రధానంగా దర్జీలతో కూడివున్నాయి. ఒకటి ఫర్నిచరు తయారుచేసే వడ్రంగులతో కూడివుంది.

ముఖ్య కేంద్రం పారిస్‌నుండి లండన్‌కు మారిన తర్వాత ఓ కొత్త విశేషం ప్రస్ఫుటమైంది. లీగు జర్మన్ స్వభావాన్ని కోల్పోయి, క్రమంగా అంతర్జాతీయ స్వభావాన్ని సంతరించుకుంది. కార్మిక సంఘంలో జర్మన్లు, స్విస్సులే కాకుండా విదేశీయులతో సంబంధాలకు జర్మన్ భాష ప్రధాన మాధ్యమంగా కలిగిన యితర అన్ని జాతులకు చెందిన సభ్యులూ — అంటే ప్రధానంగా, స్కాండినేవియన్లు, డచ్చివారు, హంగేరియన్లు, జెక్‌లు, దక్షిణాది స్లావ్‌లు, మరి వీరేకాకుండా రష్యన్లు, ఆల్సేషియన్లు కూడా — ఉండేవారు. 1847లో క్రమవిరామాల్లో అక్కడికి వస్తూపోతూండేవారిలో బ్రిటిష్ గార్డులకు చెందిన ఒక బ్రిగేడియర్ కూడా ఉండేవాడు. అతను యూనిఫారమ్ కూడా ధరించేవాడు. ఈ సంఘం త్వరలోనే తన పేరును కమ్యూనిస్ట్ కార్మిక ఎడ్యుకేషనల్ సొసైటీగా మార్చుకుంది. దాని సభ్యత్వ కార్డులపైన "మానవులందరూ సోదరులు" అన్న మాటలు కనీసం యిరవై భాషల్లో — అక్కడక్కడ తప్పులున్నప్పటికీ — ముద్రింపబడ్డాయి. ఈ బహిరంగ సొసైటీ మాదిరిగానే రహస్య లీగు కూడా త్వరలోనే అధికతర అంతర్జాతీయ స్వభావాన్ని సంతరించుకుంది. ఆదిలో పరిమితమైన అర్థంలో మాత్రమే ఆవిధంగా జరిగింది. దాని సభ్యులు విభిన్న జాతులకు చెందినవారైయుండటం ద్వారా ఆచరణలోనూ, ఏ విప్లవమైనా విజయవంతం కావాలంటే అది యూరప్‌కంతటికీ చెంది వుండాలన్న అవగాహనద్వారా సైద్ధాంతికంగానూ యీ అంతర్జాతీయ స్వభావం వర్ధిల్లింది. అప్పటికింకా ఇంతకన్న ముందుకు వారు వెళ్లలేదు, కాని పునాది మాత్రం వెయ్యబడింది.

లండన్ శరణార్థులద్వారా ఫ్రెంచి విప్లవవాదులతో లీగు సన్నిహిత సంబంధాలు పెట్టుకుంది. ఈ శరణార్థులు 1839 మే 12నాటి సంఘర్షణలో చేయీచేయీ కలిపి పోరాడినవారు. అదేవిధంగా మరింత ఉగ్రవాదులైన పోలులతో సంబంధాలు పెట్టుకోబడ్డాయి. పోలిష్ ఆధికారిక ప్రవాసులు మజ్జీని లాగే లీగుకి మిత్రులు కారు సరికదా శత్రువులనే చెప్పాలి. ఇంగ్లీషు చార్టిస్టులు,[57] తమ ఉద్యమానికిగల ప్రత్యేకమైన ఆంగ్లేయ స్వభావం కారణంగా, విప్లవవాదులుగా పరిగణింపబడక, ఉపేక్షింపబడ్డారు. లండన్‌లో వున్న లీగు నాయకులకు వారితో తర్వాత, నాద్వారా మాత్రమే సంబంధాలు ఏర్పడ్డాయి.

ఇతర విధాలకూడా, ఘటనాక్రమంతోబాటు లీగు స్వభావం మార్పుచెందింది. పారిసే అప్పటికింకా — ఆ సమయంలో యిది పూర్తిగా సమంజసమే — విప్లవానికి పురిటిగడ్డగా పరిగణింపబడుతూ వున్నప్పటికీ, పారిస్‌కి చెందిన కుట్రదారులపై ఆధారపడే స్థితినుంచి విప్లవవాదులు బైటపడ్డారు. లీగుయొక్క విస్తరణ దాని ఆత్మచైతన్యాన్ని పెంచింది.

జర్మన్ కార్మికవర్గంలో దాని వేళ్లు అంతకంతకు అధికతరంగా నాటుకుంటున్నట్లూ, యీ జర్మన్ కార్మికులు తూర్పు, ఉత్తర యూరప్ కార్మికుల పతాకధారులు కావాలని చరిత్ర అపేక్షిస్తున్నట్లూ వుంది. సమకాలీన ఫ్రెంచి ప్రత్యర్థుల సరసన ధైర్యంగా నిలవదగిన వైట్లింగ్ వారికి కమ్యూనిస్టు సిద్ధాంతకారునిగా పనిచేశాడు. చిట్టచివరి విషయమేమిటంటే, ప్రస్తుతానికి ఆకస్మిక కుట్రదారీ తిరుగుబాటు ప్రయత్నాలద్వారా ఒనగూడే లాభమేమీ లేదని మే 12 నాటి అనుభవం మాకు గుణపాఠం నేర్పింది. మరి యిప్పటికీ కొందరు ప్రతి సంఘటననూ రాబోయే తుపానుకు ఒక సూచనగా అభివర్ణిస్తున్నారంటే, యిప్పటికీ కొందరు పాత, అర్ధ కుట్రదారీ నియమాలను గట్టిగా పట్టుకు వేలాడుతున్నారంటే అది ముఖ్యంగా పాత విప్లవవాదుల మొండిపట్టుదల దోషమే. ఇది నానాటికీ పురోగమిస్తున్న అధికతర సుస్పష్టభావాలతో యిప్పటికే ఘర్షణపడుతోంది.

కాని లీగుయొక్క సామాజిక సిద్ధాంతం అస్పష్టమైనదే కాక, దానిలో చాలా పెద్ద లోపం కూడా ఒకటుంది. అయితే ఆ లోపానికి మూలం ఆ సామాజిక పరిస్థితులలోనే యిమిడి వుంది. లీగు సభ్యుల్లో కార్మికులెవరైతే వున్నారో, దాదాపుగా వారందరూ కూడా ప్రత్యేకించి చేతివృత్తులవారు. పెద్దపెద్ద నగరాల్లో సైతం వారిని దోపిడీచేసేవారు సాధారణంగా చిన్నచిన్న యజమానులు మాత్రమే. చేతివృత్తి రూపంలో దర్జీపనిని బడా పెట్టుబడిదారుకోసం పనిచేసే గృహపరిశ్రమగా మార్చడంద్వారా భారీ ఎత్తున దర్జీపనిని దోచుకోవడం అన్నది – దాన్నే యిప్పుడు రెడీమేడ్ దుస్తుల ఉత్పత్తి అంటున్నారు – ఆకాలంలో లండన్ వంటి నగరాల్లో సైతం అంకుర దశలో మాత్రమే వుంది. ఒకవంక, యీ వృత్తి కార్మికుల దోపిడిదారు చిన్న యజమాని. మరోవంక, వారందరూ చివరకు ఏదో ఒకరోజున తాము స్వయంగా చిన్న యజమానులు కావాలని కలలుగంటూ వుంటారు. దీనికితోడు వృత్తిసంఘాలకు అనూచానంగా వస్తున్న పలు అభిప్రాయాలు ఆనాటి జర్మన్ వృత్తికార్మికుని అంటిపెట్టుకొని వున్నాయి. ఈ వృత్తికార్మికులు అత్యంత గౌరవపాత్రులు, ఎందుకంటే తామింకా పూర్తిగా శ్రామికవర్గానికి చెందినవారు కాకపోయినప్పటికీ, కేవలం పెటీ బూర్జువా వర్గపు అనుబంధిత విభాగం మాత్రమే అయినప్పటికీ, ఆధునిక శ్రామికవర్గంలోకి పరిణతమవుతున్న విభాగమే అయినప్పటికీ, బూర్జువావర్గానికి, అంటే, బడా పెట్టుబడికి యింకా ప్రత్యక్ష శత్రుత్వంలోకి రాని విభాగమైన ఆ వృత్తికార్మికులు సహజేంగిత జ్ఞానంతో తమ భవిష్యదభివృద్ధిని దర్శించడంలోను, యింకా పూర్తి చైతన్యంతో కాకపోయినప్పటికీ, శ్రామికవర్గ పార్టీగా ఏర్పడటంలోను సఫలురుకాగలిగారు. కాని, ప్రస్తుతమున్న సమాజాన్ని సవివరంగా విమర్శించాల్సివచ్చినప్పుడు, అనుక్షణంలోనూ, అంటే ఆర్థిక యదార్థాలను పరిశోధించాల్సిన సమస్య ఎదురైనప్పుడల్లా పాత చేతివృత్తులకు సంబంధించి వారికి గల పూర్వాభిప్రాయాలు వారి మార్గంలో అవరోధాలుగా నిలవడం కూడ అనివార్య

విషయమే. మొత్తం లీగులో అప్పటికి అర్థశాస్త్రంపైన ఒక్క గ్రంథమైనా చదివినవాడు ఒక్కడైనా వున్నాడని నేననుకోను. కాని దానివల్ల పెద్దగా మునిగిపోయిందేమీ లేదు. ఆనాటికి సైద్ధాంతిక అవరోధాలన్నింటినీ అధిగమించడానికి వారికి ''సమానత్వం,'' ''సౌభ్రాతృత్వం,'' ''న్యాయం'' అన్నవి తోడ్పడ్డాయి.

ఈలోగా లీగుయొక్క, వైట్లింగ్‌యొక్క కమ్యూనిజంతోబాటు, సారభూతంగా భిన్నమైన మరొక కమ్యూనిజం అభివృద్ధిచెందుతోంది. నేను మాంచెస్టరులో వుండగా నాకు కొన్ని విషయాలు స్పష్టంగా అవగతమయ్యాయి: చరిత్ర రచనలో ఏ ఆర్థిక వాస్తవాలైతే యింతకాలమూ ఎటువంటి పాత్రా వహించలేదో, లేక కేవలం అత్యంత స్వల్ప పాత్రను మాత్రమే వహించాయో ఆ ఆర్థిక వాస్తవాలు కనీసం ఆధునిక ప్రపంచంలో నిర్ణయాత్మకమైన చారిత్రక శక్తులు; అవే యీనాటి వర్గవైరుధ్యాల ఆవిర్భావానికి మూలాధారం. ఈ వర్గవైరుధ్యాలు భారీ పరిశ్రమల కారణంగా అవి ఏయే దేశాల్లో పూర్తిగా అభివృద్ధిచెందాయో ఆ దేశాల్లో — కాగా ప్రత్యేకించి ఇంగ్లండులో — తిరిగి తమ వంతులో రాజకీయ పార్టీల ఏర్పాటుకూ, పార్టీ పోరాటాలకూ, ఆవిధంగా యావత్తు రాజకీయ చరిత్రకూ మూలాధారంగా వున్నాయి. మార్క్స్ కూడ ఇలాగే అభిప్రాయపడ్డాడు. అంతేగాకుండా అప్పటికే "Deutsch-Französische Jahrbücher" (1844),[6] సాధారణంగా చెప్పాలంటే, నాగరిక సమాజపు దశను నియమితంచేసేదీ, నియంత్రితం చేసేదీ రాజ్యం కాదనీ, తద్విరుద్ధంగా నాగరిక సమాజమే రాజ్యాన్ని నియమితం, నియంత్రితం చేస్తుందనీ, ఆ కారణంగా రాజ్య విధానమూ, దాని చరిత్రా ఆర్థిక సంబంధాలనుండీ, వాటి అభివృద్ధినుండీ వివరింపబడాలేగాని, అందుకు తల్లకిందులుగా కాదనీ సామాన్యీకరించాడు. 1844 వేసవిలో నేను మార్క్స్‌ను పారిస్‌లో కలుసుకున్నప్పుడు, సకల సైద్ధాంతిక రంగాల్లోనూ మా యిద్దరిమధ్యా సంపూర్ణాంగీకారం వున్నట్లు స్పష్టపడింది, సరిగా అప్పటినుంచే మా సంయుక్త కృషి ఆరంభమైంది. 1845 వసంతంలో మేము తిరిగి బ్రస్సెల్స్‌లో కలుసుకున్నప్పుడు, మార్క్స్, పైన పేర్కొనబడిన అంశాల పునాదిపై తన చారిత్రక భౌతికవాద సిద్ధాంతంయొక్క ప్రధానాంశాలను పూర్తిగా అభివృద్ధిచేశాడు. మేము అప్పుడిక, కొత్తగా లభించిన చారిత్రక దృక్పథాన్ని అత్యంత వైవిధ్యపూరిత దిశలలో వివరించపూనుకున్నాం.

చరిత్రకు సంబంధించిన విజ్ఞానశాస్త్రంలో విప్లవాన్ని తెచ్చిన, మనం పైన చూసినట్లు, ప్రధానంగా మార్క్స్‌దే అయిన యీ ఆవిష్కరణకు — యీ ఆవిష్కరణలో నాదని నేను చెప్పకోగల వాటా అతి స్వల్పం మాత్రమే — సమకాలీన కార్మికోద్యమంలో ప్రత్యక్ష ప్రాముఖ్యముంది. ఫ్రెంచివారిలోనూ, జర్మన్లలోనూ కమ్యూనిజమూ, ఇంగ్లీషువారిలో చార్టిజమూ యిప్పుడిక ఎంతమాత్రమూ ఏవో యాదృచ్ఛికంగా ఆవిర్భవించినవిగా, ఆవిర్భవించి

వుండకపోవడం కూడ సాధ్యమేనన్నట్లుగా, కనిపించడం మానివేశాయి. ఈ ఉద్యమాలు యిప్పుడు, ఆధునిక పీడితవర్గమైన శ్రామికవర్గంయొక్క ఉద్యమంగా, పాలకవర్గమైన బూర్జువావర్గానికి వ్యతిరేకంగా శ్రామికవర్గం జరిపే చారిత్రకంగా అవసరమైన పోరాటం యొక్క తరతమాలుగా అభివృద్ధిచెందిన రూపాలుగా కనిపించనారంభించాయి; అవి పూర్వపు వర్గపోరాటాలన్నింటికీ ఒక అంశంలో భిన్నమైన వర్గపోరాటరూపాలు, వర్గాలుగా విభజింపబడటంనుండీ, తత్కారణంగా వర్గపోరాటాలనుండీ మొత్తం సమాజాన్ని విముక్తంచేసినప్పుడుగాని ఈనాటి పీడితవర్గమైన శ్రామికవర్గం తనను తాను విముక్తమొనర్చుకో లేదన్నదే ఆ అంశం. కమ్యూనిజమంటే అర్థం యిప్పుడిక ఊహను సారించడంద్వారా సాధ్యమైనంత పరిణతమైన ఆదర్శ సమాజాన్ని కల్పించడం కాదు, శ్రామికవర్గం జరిపే పోరాటంయొక్క స్వరూపానికి, దాని పరిస్థితులకు, ఆ కారణంగా దాని సాధారణ లక్ష్యాలకు సంబంధించిన అవగాహనే కమ్యూనిజం.

ఈ నూతన విజ్ఞాన శాస్త్రీయ నిర్ధారణలను పెద్దపెద్ద సంపుటాల్లో "పండిత" సమాజానికి మాత్రమే తెలియజెయ్యాలని మేమెంతమాత్రమూ అనుకోలేదు. పైగా మేమందుకు పూర్తి విరుద్ధంగా అభిప్రాయపడ్డాం. మేమిద్దరం అప్పటికే రాజకీయోద్యమంలో లోతుగా మునిగివున్నాం. విద్యావంతులలో, ప్రత్యేకించి పశ్చిమ జర్మనీకి చెందినవారిలో మాకు కొంత అనుచరవర్గముంది, సంఘటిత శ్రామికవర్గంతో మాకు విస్తారమైన సంబంధముంది. మా దృక్పథానికి శాస్త్రీయమైన పునాదిని వెయ్యాల్సిన బాధ్యత మాపై వుంది. దానితోబాటు మా దృక్పథానికి యూరపియన్ శ్రామికవర్గంయొక్క, అందునా ప్రప్రథమంగా జర్మన్ శ్రామికవర్గంయొక్క తోడ్పాటును చేకూర్చుకోవలసిన బాధ్యత మాపై వుంది. ఈ విషయాన్ని బాగా అవగాహన చేసుకొని మేము మా కర్తవ్యపాలనకు పూనుకున్నాం. మేము బ్రస్సెల్స్‌లో జర్మన్ కార్మిక సంఘాన్ని[8] స్థాపించి, "Deutsche-Brüsseler Zeitung"[9]ను మా చేతుల్లోకి తీసుకున్నాం. అది ఫిబ్రవరి విప్లవం[96] దాకా మా కేంద్ర పత్రికగా ఉంది. చార్టిస్టు ఉద్యమంయొక్క కేంద్ర పత్రిక "The Northern Star"[97] (ఈ పత్రికలో నేను నా రచనలు ప్రచురిస్తూండేవాడిని) సంపాదకుడైన జూలియన్ హార్నీద్వారా ఇంగ్లీషు చార్టిస్టులలోని విప్లవకర విభాగంతో మేము సంబంధాలు పెట్టుకున్నాం. అదేవిధంగా మేము బ్రస్సెల్స్‌లోని ప్రజాతంత్రవాదులతోను (మార్క్స్ ప్రజాతంత్ర సంఘానికి[98] ఉపాధ్యక్షుడు), "Réforme" పత్రికకు (దీనికి నేను ఇంగ్లండు, జర్మనీల ఉద్యమాలను గురించి వార్తలు పంపుతూండేవాడిని) చెందిన ఫ్రెంచి సోషల్-డెమోక్రటలతోను ఒక రకమైన ముడిపెట్టుకున్నాం. క్లుప్తంగా చెప్పాలంటే, తీవ్రవాద, శ్రామికవర్గ సంఘాలతోను, కేంద్ర పత్రికలతోను మా సంబంధాలు కోరుకోదగినంత చక్కగా వున్నాయి.

న్యాయవంతుల లీగుతో మా సంబంధాలు యీ క్రింది విధంగా వుండేవి: లీగు అస్తిత్వాన్ని గురించి సహజంగానే మాకు తెలుసు; 1843లో షాప్పెర్, నేనందులో సభ్యుడిగా చేరాలని నాకు సూచించాడు, కాని సహజంగానే అప్పట్లో నేను అందుకు తిరస్కరించాను. కాని లండన్‌కి చెందిన వాళ్లతో మేము నిరంతరాయంగా ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూ వుండటమే కాకుండా, అప్పట్లో పారిస్ శాఖల నాయకుడైన డాక్టర్ ఎవెర్‌బెక్‌తో మరింత సన్నిహిత సంబంధాలు కలిగివున్నాం. లీగుయొక్క ఆంతరిక వ్యవహారాల్లో తల దూర్చకుండానే, ప్రతి ముఖ్య సంఘటన గురించీ మేము తెలుసుకుంటూండేవాళ్లం. మరోవంక సంభాషణలద్వారా, ఉత్తరప్రత్యుత్తరాలద్వారా, పత్రికలద్వారా లీగుయొక్క అతి ముఖ్య సభ్యులయొక్క సైద్ధాంతిక అభిప్రాయాలను ప్రభావితం చేశాం. ఇందుకుగాను మేము లిథోగ్రాఫ్ చెయ్యబడిన సర్క్యులర్లను కూడా ఉపయోగించేవాళ్లం. సంస్థాపనక్రమంలో వున్న కమ్యూనిస్టు పార్టీయొక్క ఆంతరిక వ్యవహారాలకు సంబంధించిన సమస్య ఎదురైన ప్రత్యేక సందర్భాల్లో మేము వాటిని ప్రపంచమంతటాగల మా మిత్రులకూ, విలేకరులకూ పంపుతూండేవాళ్లం. ఈ సర్క్యులర్ లేఖల్లో మేము అప్పుడప్పుడు నేరుగా లీగు విషయం కూడ చర్చించేవాళ్లం. ఉదాహరణకు అమెరికాకు వెళ్లిన హెర్మన్ క్రీగె అనే ఒక వెస్ట్‌ఫాలియన్ విద్యార్థి, అక్కడ లీగుకి దూతగా తిష్ఠవేసి, దక్షిణ అమెరికాలో అల్లకల్లోలం సృష్టించేందుకు లీగును ఉపయోగించే ప్రయత్నంలో, ఉన్మత్తుడైన హారో హారింగ్‌తో చేతులు కలిపాడు. అతనొక పత్రికను* ప్రారంభించాడు. అందులో అతను, లీగు పేరిట "ప్రేమ"పై ఆధారపడిన, ప్రేమతో తలమునకలయ్యే, మితిమీరిన ప్రేమ కమ్యూనిజాన్ని బోధించనారంభించాడు. దీనికి వ్యతిరేకంగా మేము హుటాహుటిన పంపిన ఒక సర్క్యులర్ లేఖ ప్రభావం వెంటనే కనబడింది.** దానితో క్రీగె లీగురంగంనుంచి ఐపూ పత్తా లేకుండా పోయాడు.

తర్వాత వైట్లింగ్ బ్రస్సెల్స్‌కి వచ్చాడు. కాని అతను తన స్వీయ ప్రతిభకు తానే చకితుడై తన మస్తిష్కంలో కమ్యూనిస్టు సమాజం ఎలా వుంటుందో చిత్రించుకొన ప్రయత్నిస్తున్న, వేతనానికి పనిచేసే అమాయకుడైన యువ దర్జీ మాదిరిగా లేడిప్పుడు. ఇప్పుడతను తన అధిక్యత కారణంగా ఈర్ష్యాళువులచేత వేధింపబడుతున్న, ఎటుచూచినా ప్రత్యర్థులను, గుప్తశత్రువులను, బోనులనే చూస్తున్న ఒక మహా పురుషుడు. ఇప్పుడతను భువిపైన దివిని సాధించడానికి తయారై సిద్ధంగావున్న చిట్కా జేబులోవున్న, దేశంనుండి

---

* "Der Volks-Tribun."[99] – సం.

** Karl Marx/Friedrich Engels, "Zirkular gegen Kriege" (Marx/Engels, *Werke*, Bd. 4, Dietz Verlag, Berlin, 1959, S. 3–17). – సం.

దేశానికి తరుమబడుతున్న ఒక ప్రవక్త. తననుండి ఆ చిట్కాను ప్రతివాడూ కాజెయ్యడానికే చూస్తున్నాడన్న భావంతో అతనిప్పుడు సతమతమవుతున్నాడు. లండన్‌లోని లీగు సభ్యులతో అతను అంతకు ముందే కలహించాడు. అలాగే, బ్రస్సెల్స్‌లో కూడా, మార్క్స్, ఆయన భార్యా దాదాపు మానవాతీతమైన ఓర్పుతో అతనికి స్వాగతం చెప్పినా, అతనికి ఎవరితోనూ పొసగలేదు. అందుకని త్వరలోనే అతను, తన ప్రవక్తపాత్రను ప్రదర్శించే ప్రయత్నంలో అమెరికాకు తరలివెళ్లాడు.

ఈ పరిస్థితులన్నీ లీగులోనూ, ప్రత్యేకించి లండన్‌లోని దాని నాయకుల్లోనూ నెమ్మది నెమ్మదిగా సంభవిస్తున్న తీవ్రమైన మార్పుకి దోహదంచేశాయి. కమ్యూనిజానికి – సరళమైన ఫ్రెంచి సమానత్వవాద కమ్యూనిజానికీ, వైట్లింగ్ కమ్యూనిజానికీ – సంబంధించిన పూర్వాభిప్రాయంలోని అసమగ్రత్వం అంతకంతకు అధికంగా వారికి విదితమైంది. కమ్యూనిజంయొక్క మూలాన్ని ఆదిమ క్రీస్తుమతంలో వెదికే వైట్లింగ్ పరిశోధన ఫలితంగా – అతని "పేద పాపులకు బైబిల్" అనే రచనలోని కొన్ని భాగాలు ఎంత ప్రతిభావంతమైనవైనప్పటికీ – స్విట్జర్లాండులోని ఉద్యమంలో ఎక్కువభాగం మొదట ఆల్‌బ్రెహ్ట్‌వంటి మూర్ఖుల చేతుల్లోకీ, అటు తర్వాత కూల్మన్‌వంటి స్వార్థపర కుహనా ప్రవక్తల చేతుల్లోకీ పోయింది. కొందరు సాహిత్యకారులచేత ప్రచారంచెయ్యబడిన "అసలు సోషలిజం" – ఫ్రెంచి సోషలిస్టు పదజాలంయొక్క భ్రష్టు హేగెలియన్ జర్మన్ భాషాంతరీకరణ, ఆవేశపూరితమైన ప్రేమ స్వప్నాలు ("కమ్యూనిస్టు ప్రణాళిక"*లో జర్మన్, లేక "అసలు" సోషలిజంపైన గల భాగాన్ని చూడండి) క్రీగెచేత, తత్సంబంధిత సాహిత్యంయొక్క అధ్యయనంద్వారా లీగులోకి ప్రవేశపెట్టబడిన అసలు సోషలిజం – ఉద్రేకమనే దాని బలహీనత కారణంగా – పాత విప్లవ వాదులకు త్వరలోనే విరక్తి కలిగించింది. పూర్వ సైద్ధాంతికాభిప్రాయాల పొసగనితనానికి, ఆ అభిప్రాయాల పర్యవసానంగా ఆచరణలో అవలంబింపబడే తప్పుడు మార్గాలకు బదులుగా మార్క్స్, నేనూ ప్రతిపాదించిన కొత్త సిద్ధాంతం సరైనదన్న సంగతి లండనులో అంతకంతకు అధికంగా గుర్తింపబడింది. ఈ అవగాహన పెంపొందడానికి నిస్సందేహమైన కారణమొకటుంది: లండన్ శాఖ నాయకుల్లో యిప్పుడు, సైద్ధాంతిక జ్ఞానార్జనా సామర్థ్యంలో యింతకుముందరి నాయకులకన్న బాగా మిన్నలైన వ్యక్తులు యిద్దరున్నారు: వీరిలో ఒకడు హైల్‌బ్రొన్‌కి చెందిన సూక్ష్మ చిత్రాలు గీసే కార్ల్ ఫేండెర్, రెండవవాడు తూరింగియాకు చెందిన గెయోర్గ్ ఎక్కారియస్.**

---

* ఈ సంకలనపు మొదటి భాగంలో 39–81 పేజీలు చూడండి. – సం.

** ఫేండెర్ లండనులో మరణించి సుమారు ఎనిమిదేళ్లైంది. అతను అసాధారణ సూక్ష్మబుద్ధిశాలి, చతురభాషి, వ్యంగ్య, తార్కిక ధోరణి కలిగినవాడు. ఎక్కారియస్ తర్వాత

క్లుప్తంగా చెప్పాలంటే, 1847లో మోల్ బ్రస్సెల్స్‌లో మార్క్సునూ, అటుతర్వాత వెంటనే పారిస్‌లో నన్నూ కలుసుకొని, తన క్రామేడ్సు తరఫున మమ్మల్ని లీగులో చేరవలసిందిగా పదేపదే ఆహ్వానించాడు. మా దృక్పథం మొత్తంమీద సరైనదన్న విషయంలో తమకెంత నమ్మకముందో, లీగును పాత కుట్రదారీ సంప్రదాయాలనుండీ, రూపాలనుండీ విముక్తంచెయ్యడం అవసరమన్న విషయంలో కూడ అంతే నమ్మకముందని అతను మాకు చెప్పాడు. మేము లీగులో చేరినట్లయితే, లీగు కాంగ్రెస్ ముందు మా సవిమర్శక కమ్యూనిజాన్ని ఒక ప్రణాళిక రూపంలో వివరించే అవకాశం మాకు కల్పిస్తుంది, అటుతర్వాత అది లీగు ప్రణాళికగా ప్రచురింపబడుతుంది; అదే విధంగా, కాలంచెల్లిన లీగు స్థానంలో కొత్త కాలానికీ, కొత్త లక్ష్యాలకూ అనుగుణమైన సంఘాన్ని ప్రవేశపెట్టడంలో మేము మా వంతు సేవ చెయ్యగలుగుతామని అతను చెప్పాడు.

జర్మన్ కార్మికవర్గంలో, కనీసం ప్రచారంకోసమైనా, ఒక సంఘం వుండాలనడంలో మాకు ఎటువంటి సందేహమూలేదు. ఈ సంఘం, కేవలం స్థానిక స్వభావం కలిగివుండనంత మేరకు, జర్మనీకి వెలుపల సైతం అది రహస్య సంఘంగా మాత్రమే ఉండగలుగుతుందనడంలో కూడా మాకు ఎటువంటి సందేహమూ లేదు. మరి, లీగు రూపంలో సరిగా అటువంటి సంఘం వుంది. ఈ లీగులో వేటిని మేము లోపాలుగా భావించామో, అవి లోపాలేనని లీగు ప్రతినిధులే యిప్పుడు స్వయంగా ఆమోదించి, వాటిని పరిత్యజించారు; లీగు పునర్వ్యవస్థీకరణ కృషిలో సహకరించాల్సిందిగా కూడ వారు మమ్మల్ని ఆహ్వానించారు. అటువంటప్పుడు మరి మేము కాదని చెప్పగలమా? ఎంతమాత్రం చెప్పలేం. అందుకని, మేము లీగులో చేరాం; మార్క్సు మా సన్నిహిత మిత్రులతో బ్రస్సెల్స్‌లో ఒక లీగు శాఖను నెలకొల్పాడు, మరి నేను దానికి చెందిన మూడు పారిస్ శాఖలతో కలిసి పనిచెయ్యసాగాను.

1847 వేసవిలో లీగుయొక్క మొదటి మహాసభ లండనులో జరిగింది. దానిలో డబ్లియు. వోల్ఫ్, బ్రస్సెల్స్ శాఖకూ, నేను పారిస్ శాఖలకూ ప్రాతినిధ్యం వహించాం. ఈ మహాసభలో అన్నిటికన్న ముందు లీగుయొక్క పునర్వ్యవస్థీకరణ జరిగింది. కుట్రదారీ దశకు సంబంధించిన గుప్త సమావశేషాలన్నింటికీ యిప్పుడు స్వస్తిచెప్పబడింది; లీగు నిర్మాణం యిప్పుడు శాఖలు, మండలులు; నాయక మండలులు, కేంద్ర కమిటీ, మహాసభతో కూడి

---

ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిల్ కార్యదర్శిగా పలు సంవత్సరాలు పనిచేసిన సంగతి మనకు తెలిసినదే. ఈ జనరల్ కౌన్సిల్లో, మిగిలిన వారితోబాటు, యీక్రింది పాత లీగు సభ్యులున్నారు: ఎక్కారియస్, ఫేండెర్, లెస్నెర్, లోహ్నెర్, మార్క్సు, నేను. ఎక్కారియస్ దరిమిలా ప్రత్యేకించి ఇంగ్లండులో ట్రేడ్‌యూనియన్ ఉద్యమానికే తనను తాను అంకితంచేసుకున్నాడు. (ఎంగెల్స్ వివరణ.)

వుంది. అప్పటినుంచి దాని పేరు "కమ్యూనిస్టు లీగు"గా మారింది. "బూర్జువావర్గాన్ని కూలదొయ్యడం, శ్రామికవర్గ పాలనను నెలకొల్పడం, వర్గవైరుధ్యాలపై ఆధారపడిన పాత, బూర్జువా సమాజాన్ని రద్దుచెయ్యడం, వర్గాలు లేని, సొంత ఆస్తిలేని ఒక నూతన సమాజాన్ని నెలకొల్పడం లీగు లక్ష్యం" – మొదటి నిబంధన యిలా వుంది.* "ఈ సంఘం ఆద్యంతం ప్రజాస్వామికమైనది. దాని కమిటీలు ఎన్నుకోబడుతాయి, అవసరమైనప్పుడు రద్దుచెయ్యబడతాయి. ఈ ఒక్క అంశం కుట్రపట్ల వ్యామోహంపై అంకుశంగా పనిచేస్తూవచ్చింది, ఎందుకంటే కుట్రకు నియంతృత్వం అవసరమవుతుంది, మరి లీగు – కనీసం సాధారణ శాంతికాలంలో – శుద్ధ ప్రచార సంఘంగా మార్చబడింది. ఈ కొత్త నిబంధనావళి చర్చ నిమిత్తం శాఖలకు సమర్పించబడింది – మరి యిప్పుడు అనుసరించబడే కార్యక్రమ పద్ధతి అంతగా ప్రజాస్వామికమైనది – రెండవ మహాసభలో అది చర్చింపబడి, చివరకు ఆ మహాసభచేత 1847 డిసెంబరు 8న ఆమోదింపబడింది. వేర్ముత్, ష్టీబెర్‌ల పుస్తకం, మొదటి సంపుటం, 239వ పేజీ, అనుబంధం Xలో యీ నిబంధనావళి ముద్రితమై లభిస్తోంది.

రెండవ మహాసభ అదే సంవత్సరం నవంబరు చివర, డిసెంబరు మొదట్లో జరిగింది. ఈ మారు మార్క్స్ కూడా హాజరై, సుదీర్ఘమైన చర్చక్రమంలో కొత్త సిద్ధాంతాన్ని వివరించాడు. యీ మహాసభ కనీసం పది రోజులు సాగింది. చివరకు అన్ని అభిప్రాయభేదాలూ, సందేహాలూ తొలగింపబడ్డాయి, నూతన మూలసూత్రాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి, ప్రణాళికా** రచనకు మార్క్సూ, నేనూ నియమింపబడ్డాం. ఈ పని మహాసభ తరువాత స్వల్ప కాలంలో పూర్తిచెయ్యబడింది. ఫిబ్రవరి విప్లవానికి కొద్ది వారాలకు ముందు అది ప్రచురణార్థం లండనుకు పంపబడింది. ఆనాటినుండి అది ప్రపంచమంతటా వ్యాపించి దాదాపు అన్ని భాషలలోకీ అనువదింపబడింది. ఈనాటికీ అది పలుదేశాల్లో శ్రామిక వర్గోద్యమానికి ఒక మార్గదర్శిగా పనిచేస్తోంది. "మానవులందరూ సోదరులు" అన్న లీగుయొక్క పాత నినాదం స్థానంలో "సకల దేశాల కార్మికులారా ఏకంకండి!" అన్న సమర నినాదం ముందుకొచ్చింది, అది పోరాటపు అంతర్జాతీయ స్వభావాన్ని బాహాటంగా చాటి చెప్పింది. పదిహేడేళ్ళ తర్వాత యీ సమరనినాదం ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ నినాదంగా ప్రపంచమంతటా మార్మోగింది, మరి యీనాడు సకల దేశాల సమరశీల శ్రామికవర్గమూ యీ నినాదాన్ని తన పతాకంపైన లిఖించుకుంది.

---

* Marx/Engels, *Werke*, Bd. 4, Dietz Verlag, Berlin, 1959, S. 596–601. – సం.

** ఈ సంకలనపు మొదటి భాగంలో 39–81 పేజీలు చూడండి. – సం.

ఫిబ్రవరి విప్లవం ప్రజ్వరిల్లింది. ఇంతకాలం కార్యకలాపాలను నిర్వహిస్తున్న లండన్ కేంద్ర కమిటీ వెంటనే తన అధికారాన్ని బ్రస్సెల్స్ నాయక మండలికి అప్పగించింది. కాని యీ నిర్ణయం బ్రస్సెల్స్ చేరేసరికి, అక్కడ ముట్టడిస్థితి ఏర్పడివుంది, అప్పుడిక, ప్రత్యేకించి జర్మన్లు తమ సమావేశాన్ని ఎక్కడా జరుపుకొనే స్థితి లేకుండాపోయింది. మాలో అందరం అప్పుడు సరిగా పారిస్‌కి వెళ్లిపోయే సన్నాహంలో వున్నాం. అందుకని కొత్త కేంద్ర కమిటీ కూడ అదేవిధంగా తనసుతాను రద్దుచేసుకొని తన అధికారాలన్నింటినీ మార్క్సుకి అప్పగించి, పారిస్‌లో వెంటనే ఒక కొత్త కేంద్ర కమిటీని ఏర్పాటుచేసేందుకు ఆయనకు అధికారాన్ని దత్తంచెయ్యాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని ఆమోదించిన అయిదుగురు వ్యక్తులూ (1848, మార్చి 3) తమతమ దోవలు పట్టారోలేదో అంత లోనే పోలీసులు మార్క్సు యింటిపై దాడిచేసి, ఆయన్ను అరెస్టుచేసి, ఆ మరుసటి రోజుననే ఫ్రాన్సుకు వెళ్లిపోవాలని నిర్బంధించారు. ఆయన వెళ్లాలనుకుంటున్నదికూడ సరిగా అక్కడికే.

పారిస్‌లో మేమందరం త్వరలోనే తిరిగి కలుసుకున్నాం. అక్కడ యీ క్రింది పత్రం తయారుచెయ్యబడింది, దానిపైన కొత్త కేంద్ర కమిటీ సభ్యులందరూ సంతకాలుచేశారు. అది జర్మనీ అంతటా పంచబడింది, చాలమంది యీనాటికీ దాన్నుంచి ఎంతోకొంత నేర్చు కోగలరు:

## జర్మనీలో కమ్యూనిస్టు పార్టీ డిమాండ్లు[100]

1. యావత్తు జర్మనీ ఒకేఒక అఖండ రిపబ్లిక్‌గా ప్రకటింపబడాలి.

3. జర్మన్ ప్రజల పార్లమెంటులో కార్మికులు సైతం సమావేశాలలో పాల్గొనేందుకు వీలుగా ప్రజా ప్రతినిధులకు వేతనాలు చెల్లింపబడాలి.

4. యావన్మంది ప్రజలనూ సాయుధులను చెయ్యాలి.

7. రాజాల ఎస్టేట్లు, తదితర ఫ్యూడల్ ఎస్టేట్లు, అన్ని గనులూ, గనికుంటలూ వగైరాలు ప్రభుత్వ ఆస్తిగా మార్చబడాలి. ఈ ఎస్టేట్లలో, యావత్తు సమాజ ప్రయో జనార్థం, అత్యంత అధునాతన శాస్త్రీయ సాధనాలతో భారీ ఎత్తున వ్యవసాయం నిర్వహింపబడాలి.

8. రైతుల కమతాలపైన గల తనఖాలు ప్రభుత్వ ఆస్తిగా ప్రకటింపబడాలి; అటు వంటి తనఖాలపైన రైతులు ప్రభుత్వానికి వడ్డీ చెల్లించాలి.

9. కౌలుదారీ సాగుపద్ధతి అమలులోవున్న ప్రాంతాలలో భూమికౌలు, లేక వ్యవసాయ బకాయిలు ప్రభుత్వానికి పన్నురూపంలో చెల్లింపబడాలి.

11. అన్ని రవాణా సాధనాలూ: రైల్వేలు, కాల్వలు, ఓడలు, రోడ్లు, పోస్టాఫీసులు

కార్యాలయాలు మొదలైనవాటన్నింటినీ ప్రభుత్వం వశంచేసుకోవాలి. అవి ప్రభుత్వ ఆస్తిగా మార్చబడి, ఆస్తి లేనివర్గపు వినియోగంలో ఉంచబడాలి.

14. వారసత్వ హక్కు పరిమితం చెయ్యబడాలి.

15. వృద్ధిక్రమానుగతమైన పన్నుల పద్ధతిని ప్రవేశపెట్టాలి, వినిమయ వస్తువులపై పన్నులను రద్దుచెయ్యాలి.

16. జాతీయ వర్క్‌షాపులను నెలకొల్పాలి. ప్రభుత్వం కార్మికులందరి జీవనోపాధికీ హామీ కల్పించాలి, అంగవికలురను సంరక్షించాలి.

17. సార్వత్రిక ఉచిత ప్రాథమిక విద్య.

పైన పేర్కొనబడిన అంశాలను అమలు జరిపించుకొనేందుకుగాను తమ యావచ్ఛక్తియుక్తులనూ వినియోగించి పనిచెయ్యడంలోనే జర్మన్ శ్రామికవర్గంయొక్క, పెటీ బూర్జువా వర్గంయొక్క, రైతాంగంయొక్క ప్రయోజనం యిమిడివుంది. వాటిని అమలు జరిపించుకోవడంద్వారా మాత్రమే, ఎవరైతే కొద్దిమందిచేత యింతకాలమూ దోచుకోబడ్డారో, ఎవరిని దాస్యబంధనంలో ఉంచడానికైతే యికముందు కూడా ప్రయత్నం కొనసాగుతుందో, జర్మనీలోని ఆ కోట్లాది జనం సకల సంపదయొక్క ఉత్పత్తిదారులుగా తాము పొందవలసిన తమ హక్కులనూ, అధికారాన్నీ పొందగలుగుతారు.

కమిటీ:

కార్ల్ మార్క్స్, కార్ల్ షాప్పెర్,
హెచ్. బౌవర్, ఎఫ్. ఎంగెల్స్,
ఎఫ్. మోల్, డబ్ల్యు. వోల్ఫ్

ఆ రోజుల్లో పారిస్‌లో విప్లవవాద సైనిక దళాలను ఏర్పాటు చెయ్యాలనే ఒక వెర్రి వ్యామోహం వ్యాప్తిలో వుండేది. స్పానిష్‌వారు, ఇటాలియన్లు, బెల్జియన్లు, డచ్చివారు, పోలిష్‌వారు, జర్మన్లు తమతమ మాతృదేశాలను విముక్తంచేసేందుకుగాను దళాలుగా ఏర్పడుతున్నారు. జర్మన్ సైనిక దళానికి హెర్వెగ్, బోర్న్‌ష్టెడ్, బోర్న్‌స్టైన్‌లు నాయకులు. విప్లవానంతరం వెన్వెంటనే విదేశీ కార్మికులందరూ తమ పనులను కోల్పోవడమేకాకుండా, జనం వారిని వేధిస్తూ కూడా వుండేవారేమో యీ సైనిక దళాల్లో చేరేవారి సంఖ్య చాలా అధికంగా వుండేది. కొత్త ప్రభుత్వానికి వీటిలో విదేశీ కార్మికులను వదిలించుకునేందుకు ఒక అవకాశం కానవచ్చింది. అందుకని అది వారికి l'étape du soldat మంజూరుచేసింది, అంటే, అవి మార్చిచేసే తోవలో డేరాలలో విడిదిచేసే అవకాశం కల్పించింది, సరిహద్దుదాకా రోజుకు 50 సెంటైముల అలవెన్సు యిచ్చింది. అటుతర్వాత మాటమాటకీ కన్నీళ్లు పెట్టుకొనే వాక్పటుత్వంగల విదేశాంగమంత్రి లమర్టీన్‌కి,

యీ సైనికులను వారి వారి ప్రభుత్వాలకు అప్పగించే అవకాశం అతి త్వరలోనే చిక్కింది.

విప్లవంతో యిలా చెలగాటమాడటాన్ని మేము చాలా గట్టిగా వ్యతిరేకించాం. జర్మనీలో అప్పట్లో సాగుతున్న అల్లకల్లోలం మధ్యకి దండయాత్రను సాగించడం – బయటి నుండి విప్లవాన్ని బలవంతంగా రుద్దడం – అంటే, జర్మనీలోని విప్లవానికే ఎసరుపెట్టడం, ప్రభుత్వాలను బలపరచడం, ఆ సైనికుల కాళ్లూ చేతులూ కట్టి జర్మన్ సైన్యం చేతులకు అప్పగించడమే తప్ప వేరేమీకాదు. దీనికి లమర్టీన్ గ్యారంటీ కల్పించనే కల్పించాడు. దరిమిలా వియన్నా, బెర్లిన్లలో విప్లవం విజయవంతమైనప్పుడు, యీ సైనిక దళం మరింత నిష్ప్రయోజనకరమైంది; కాని ఆట ఒకమారు ఆరంభమయ్యాక, అది కొనసాగుతూపోయింది.

మేమొక జర్మన్ కమ్యూనిస్టు క్లబ్బును[101] స్థాపించాం. దానిలో, సైనిక దళానికి దూరంగా ఉండాల్సిందిగాను, దానికి బదులు విడివిడిగా యిళ్లకు తిరిగివెళ్లి, అక్కడ పని చెయ్యాల్సిందిగాను మేము కార్మికులకు సలహా యిచ్చాం. తాత్కాలిక ప్రభుత్వంలో స్థానం లభించిన మా పాత మిత్రుడు ఫ్లాకోన్, మేము పంపే కార్మికులకు కూడ, వలంటీరు సైనిక దళాలకు లభించిన మాదిరి సౌకర్యాలనే సంపాదించాడు. ఈవిధంగా మేము మూడు నాలుగు వందలమందిని – వారిలో లీగు సభ్యులు అత్యధిక సంఖ్యాకులు – జర్మనీకి తిప్పిపంపాం.

అంతపెద్ద ప్రజా ఉద్యమం చెలరేగినప్పుడు లీగు దానికి చాలా బలహీనమైన చోదక శక్తి అన్న సంగతిని ముందే తేలికగా గ్రహించవచ్చు. ఇంతకుముందు విదేశాల్లో నివసించిన లీగు సభ్యుల్లో నాలుగింట మూడువంతులమంది తమతమ స్వదేశాలకు తిరిగిపోవడంద్వారా తమ నివాసస్థానాలను మార్చివేసుకున్నారు, ఆవిధంగా వారి పూర్వపు శాఖలు చాలవరకు మూతపడ్డాయి, వారు లీగుతో పూర్తిగా సంబంధాన్ని కోల్పోయారు. వారిలో ఒక భాగం – వారిలో అధిక కాంక్షాపరులు – యీ సంబంధాన్ని పునరుద్ధరించుకునే ప్రయత్నంసైతం చెయ్యక, వారిలో ఒక్కొక్కరు తనకుతానుగా తన స్వస్థానంలో ఒక చిన్న ప్రత్యేక ఉద్యమాన్ని ప్రారంభించాడు. చివరకు ఎలాంటి పరిస్థితి ఏర్పడిందంటే, ప్రతి చిన్న రాజ్యంలోనూ, ప్రతి రాష్ట్రంలోనూ, ప్రతి పట్టణంలోనూ పరిస్థితులు భిన్నభిన్నంగా తయారై, లీగు అత్యంత సాధారణమైన ఆదేశాలను యివ్వడంతప్ప మరేమీ చెయ్యలేని పరిస్థితిలో పడింది. అయితే అప్పట్లో అటువంటి ఆదేశాలను పత్రికలద్వారా ప్రచారంచెయ్యడమే చాలా మెరుగ్గా వుంది. క్లుప్తంగా చెప్పాలంటే, రహస్య లీగును అవసరమొనర్చిన కారణాలు అదృశ్యమైన క్షణంనుంచి, రహస్య లీగు ప్రాముఖ్యాన్ని కోల్పోయింది. కాని, ఎవరైతే యీ రహస్య లీగుయొక్క కుట్రదారీ స్వభావపు తుది అవశేషాలను అంతకుముందే తుదముట్టించారో వారికి యిది ఎంతమాత్రం ఆశ్చర్యజనకమైన విషయం కాదు.

కాని, విప్లవ కార్యకలాపాలకు లీగు ప్రశస్తమైన ఒక శిక్షణాలయంగా ఉన్నదన్న సంగతి యిప్పుడు నిరూపితమైంది. "Neue Rheinische Zeitung" ఎక్కడైతే దృఢమైన

కేంద్రాన్ని సమకూర్చిందో ఆ రైన్ ప్రాంతంలో, నాస్సౌలో, రైనిష్ హెస్సెన్ మొదలైన చోట్లలో, ప్రతిచోటా కూడా లీగు సభ్యులు అతివాద ప్రజాస్వామికోద్యమపు అగ్రభాగాన నిలిచారు. హాంబుర్గ్‌లో కూడ అదే జరిగింది. దక్షిణ జర్మనీలో పెటీబూర్జువా ప్రజాస్వామ్యపు ప్రాబల్యం ఒక మార్గావరోధంగా నిలిచింది. బ్రెస్లౌలో విల్‌హెల్మ్ వోల్ఫ్ 1848 వేసవిదాకా అత్యంత విజయోపేతంగా పనిచేశాడు; దీనికితోడు ఆయన ఫ్రాంక్‌ఫుర్ట్ పార్లమెంటుకు సైలీషియానుండి ప్రత్యామ్నాయ సభ్యుడుగా కూడ ఎన్నుకోబడ్డాడు. చివర, బ్రస్సెల్స్, పారిస్‌లలో చురుకైన లీగు కార్యకర్తగా పనిచేసిన కంపోజిటరు స్టెఫాన్ బోర్న్ బెర్లిన్‌లో "కార్మిక సౌభ్రాతృత్వ సమితి"ని స్థాపించాడు. విస్తృతంగా వ్యాపించిన ఆ సమితి 1850దాకా పనిచేసింది. యువకుడైన బోర్న్ జన్మతః అత్యంత ప్రతిభా సంపన్నుడే గాని, రాజకీయరంగంలో తానొక విశిష్ట వ్యక్తి కావాలన్న అతి ఆతృతకొద్దీ, తన చుట్టూ గుంపును చేర్చుకునేందుకోసం అడ్డమైన అమాంబాపతు గాలిమూక అంతటితోనూ "సౌహార్ద" సంబంధాలు పెట్టుకున్నాడు. విరుద్ధ ధోరణులమధ్య ఐకమత్యం సాధించడం గాని, అవ్యవస్థ అనే అంధకారం మధ్యకు వెలుగును ప్రసరించడంగాని చేతనైన మనిషి ఎంతమాత్రం కాదతను. తత్పర్యవసానంగా, ఈ సమితియొక్క అధికార ప్రచురణల్లో "కమ్యూనిస్టు ప్రణాళిక"లో వ్యక్తంచెయ్యబడిన అభిప్రాయాలను వృత్తిసంఘ స్మృతులతోను, వృత్తిసంఘ ఆకాంక్షలతోను, లూయీ బ్లాంక్, ప్రూడన్‌లకు గల కొన్ని అభిప్రాయాలను, సంరక్షణవాదం మొదలైనవాటికి సంబంధించిన అంశాలను చేర్చి ఒక కలగాపులగం తయారుచెయ్యబడింది. క్లుప్తంగా చెప్పాలంటే వాళ్ళ అందర్నీ మెప్పించాలనుకున్నారు. ప్రత్యేకించి, సమ్మెలు, ట్రేడ్‌యూనియన్లు, ఉత్పత్తిదార్ల సహకార సంఘాలు ప్రారంభింపబడ్డాయి. ఏ పునాదిపైన మాత్రమే అటువంటివి సాధ్యం కాగలవో ఆ పునాదిని రాజకీయ రంగంలో విజయాలద్వారా మొట్టమొదట జయించడమే అన్నిటికన్న మిన్నయైన సమస్య అన్న విషయం విస్మరింపబడింది. అయితే, తర్వాత, ప్రగతినిరోధక శక్తుల విజయాల కారణంగా "సౌభ్రాతృత్వ సమితి" నాయకులు విప్లవ పోరాటంలో ప్రత్యక్ష పాత్ర వహించాల్సిన అవసరాన్ని వారు గ్రహించేసరికి సహజంగానే తమచుట్టూ వారు చేర్చుకున్న కలగాపులగపు మూక వారిని విడిచి చెల్లాచెదరైంది. బోర్న్ 1849 మేలో జరిగిన డ్రెస్డెన్ తిరుగుబాటులో పాల్గొన్నాడు. అదృష్టం కలిసివచ్చి అతను ప్రాణాలు కాపాడుకున్నాడు. కాని, శ్రామికవర్గపు మహత్తర రాజకీయ ఉద్యమంతో సరిపోల్చినప్పుడు "కార్మిక సౌభ్రాతృత్వ సమితి" శుద్ధ Sonderbund (వేరే లీగు)గా నిరూపితమైంది; దాని అస్తిత్వం చాల వరకు కేవలం కాగితంపైన మాత్రమే ఉంది, పైగా దాని పాత్ర ఎంత నాసిగా వుందంటే, ప్రగతినిరోధక శక్తులకు దాన్ని 1850 దాకాను, యింకా మిగిలివున్న దాని శాఖలను అటుపిమ్మట చాల సంవత్సరాలదాకాను అణచివెయ్యాల్సిన అవసరం కనిపించలేదు. బోర్న్ – యితని

అసలుపేరు బట్లర్‌మిల్ష్ – రాజకీయరంగంలో సుప్రసిద్ధ నాయకుడయ్యేందుకు బదులు స్విట్జర్లాండులో ఒక సాదా ప్రొఫెసర్ అయి వూరుకున్నాడు. ఈ ప్రొఫెసరు వృత్తిసంఘ భాషలోకి మార్క్స్ రచనలను తర్జుమాచెయ్యడం మాని, విసుగెత్తించే తన సొంత జర్మన్ భాషలోకి సాధువైన రెనాన్ రచనలను తర్జుమాచేస్తున్నాడు.

పారిస్‌లో 1849 జూన్ 13, శాంతియుత ప్రదర్శనం,[16] జర్మనీలో మే తిరుగుబాట్ల ఓటమి, రష్యన్ల చేతుల్లో హంగేరియన్ విప్లవ పరాజయం – వీటితో 1848 విప్లవ దశ ముగిసింది. కాని ప్రగతినిరోధక శక్తుల విజయం మాత్రం ఏవిధంగానూ యింకా పూర్తి కాలేదు. చెల్లాచెదరైన విప్లవ శక్తుల పునర్వ్యవస్థీకరణ అవసరమైంది, ఆ కారణంగానే లీగు పునర్వ్యవస్థీకరణ కూడా అవసరమైంది. 1848లో మాదిరిగానే, శ్రామికవర్గం యొక్క ఏ రకమైన బహిరంగ నిర్మాణమూ సాధ్యంకాని పరిస్థితి ఏర్పడింది, అందుచేత రహస్య నిర్మాణావసరం మళ్లీ ఏర్పడింది.

1849 ఆకురాలుకాలంలో పూర్వపు కేంద్ర కమిటీల, మహాసభల సభ్యుల్లో అత్యధికులు మరల లండనులో సమావేశమయ్యారు. రానివాళ్లలో కేవలం షాప్పెర్, మోల్‌లు మాత్రమే వున్నారు. షాప్పెర్ వీస్‌బాడెన్‌లో జైల్లో నిర్బంధింపబడి, విడుదల అనంతరం 1850 వసంతంలో వచ్చాడు. మోల్, అత్యంత ప్రమాదకరమైన ముఖ్యమైన అనేక పనులు నిర్వర్తించి ఆందోళనోద్యమ సంబంధమైన యాత్రలు ముగించి – ఈమధ్య అతను రైన్ రాష్ట్రంలో ప్రష్యన్ సైన్యంలోనుంచే పలాటినేట్ ఫిరంగిదళానికి* ఆశ్విక ఫిరంగి సైనికులను రిక్రూట్ చేశాడు – విల్లిహ్‌యొక్క సైనికదళానికి చెందిన బెసన్‌సోన్ కార్మిక కంపెనీలో చేరాడు, మూర్గ్ నదికి రోటెన్‌ఫెల్స్ వద్దగల వంతెన ఎదుట జరిగిన పోరాటంలో తలకు గుండుదెబ్బ తగిలి చనిపోయాడు. మరోవంక, యిప్పుడిక విల్లిహ్ రంగప్రవేశం చేశాడు. విల్లిహ్ 1845 దరిమిలా పశ్చిమ జర్మనీలో తరచుగా కనిపించే భావోద్విగ్న కమ్యూనిస్టుల్లో ఒకడు. సరిగా ఆ కారణంగానే సహజాతంగానూ, ప్రచ్ఛన్నంగానూ మా సవిమర్శక ధోరణికి అతను వ్యతిరేకి. అంతేకాదు, అతను పూర్తిగా ఒక ప్రవక్తమాదిరిగా – తను జర్మన్ శ్రామికవర్గాన్ని విముక్తం చేసేందుకు అవతారమెత్తినవాడినన్న పూర్ణ విశ్వాసంతో, తద్రీత్యా రాజకీయాధికారానికీ, అలాగే సైనిక నియంతృత్వానికి కూడా తనే ప్రత్యక్ష ఉత్తరాధికారి అన్నట్లు వ్యవహరించాడు. ఈవిధంగా, యింతకుముందు వైట్లింగ్ బోధించిన ఆదిమ క్రిస్టియన్ కమ్యూనిజానికి ఒక రకమైన కమ్యూనిస్టు ఇస్లాం జోడింపబడింది. అయితే, యీ కొత్త మతప్రచారం అప్పటికి విల్లిహ్ ఆధిపత్యంలో గల శరణార్థుల బ్యారక్సుకు మాత్రమే పరిమితమైంది.

---

*1849 మే – జూన్‌లలో బాడెన్ – పలాటినేట్ తిరుగుబాటులో ప్రష్యన్ ప్రభుత్వ సేనలకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవసైన్యపు ఫిరంగి దళానికి యిది ప్రస్తావన. – సం.

ఈకారణంగా, లీగు సరికొత్తగా వ్యవస్థీకరించబడింది. 1850 మార్చినాటి "విజ్ఞప్తి"* ఒక అనుబంధంగా (IX, №1)[102] ప్రచురింపబడింది. హైన్రిఖ్ బౌవర్ జర్మనీకి దూతగా పంపబడ్డాడు. మార్క్స్, నేనూ తయారుచేసిన యీ "విజ్ఞప్తి" యీనాటికీ ఆసక్తికరంగా వుంది, అలా వుండటానికి ఒక కారణముంది — త్వరలోనే రాబోతున్న యూరపియన్ ఉత్పాతం (యూరపియన్ విప్లవాలు — 1815, 1830, 1848–52, 1870 — మన శతాబ్దంలో 15నుండి 18 ఏళ్ల విరామాల్లో సంభవించాయి) సందర్భంగా జర్మనీలోని కమ్యూనిస్టు కార్మికుల బారినుండి సమాజాన్ని కాపాడే రక్షకురాలిగా, జర్మనీలో మొట్టమొదట అధికారంలోకి రావలసిన పార్టీ యీనాటికీ పెటీబూర్జువా ప్రజాస్వామ్యమే. కాగా, ఆ విజ్ఞప్తిలో చెప్పబడిన విషయాల్లో అధికాంశం యీనాటికీ వర్తిస్తుంది. హైన్రిఖ్ బౌవర్‌కు అతని కృషిలో పూర్తి సాఫల్యం చేకూరింది. విశ్వాసపాత్రుడైన బూట్లుకుట్టే యీ పొట్టివాడు జన్మతః దౌత్యనిపుణుడు. పాక్షికంగా మందకొడులుగా మారి, పాక్షికంగా తమకు తాముగా పనిచేస్తున్న లీగుయొక్క పూర్వ సభ్యులను, ప్రత్యేకించి "కార్మిక సౌభ్రాతృత్వ సమితి"యొక్క ఆనాటి నాయకులను క్రియాశీల నిర్మాణకృషిలోకి అతను తిరిగి తీసుకొచ్చాడు. లీగు, 1848కి పూర్వంకన్న చాలా ఎక్కువ మేరకు, కార్మిక, రైతు, వ్యాయామ సంఘాల్లో నాయకత్వ పాత్ర వహిస్తోంది. కాగా, 1850 జూన్‌లో వెలువడిన తదుపరి త్రైమాసిక విజ్ఞప్తిలో,** పెటీబూర్జువా ప్రజాస్వామ్య ప్రయోజనార్థం బోన్‌నుండి వచ్చిన షూర్జ్ అనే విద్యార్థి జర్మనీలో పర్యటించిన (తర్వాత అమెరికన్ మాజీమంత్రి) సమయంలో "యోగ్యమైన శక్తులన్నీ లీగు హస్తగతమైనట్లు కనుగొన్నాడు" అని పేర్కొనబడింది. నిస్సందేహంగా, లీగే, జర్మనీలో ఏ కొంచెమైనా ప్రాముఖ్యం కలిగిన ఏకైక విప్లవ సంఘం.

అయితే, యీ సంఘం ఏ ప్రయోజనాన్ని నెరవేరుస్తుందన్న అంశం, విప్లవంయొక్క నూతన వెల్లువ సఫలమవుతుందా కాదా అన్నదానిపైనే ఎక్కువగా ఆధారపడుతుంది. మరి 1850 సంవత్సర క్రమంలో యీ విప్లవ వెల్లువ అంతకంతకు దుర్ఘటమైపోయి చివరకు అసాధ్యమే అయిపోయింది. 1848 విప్లవానికి మార్గాన్ని సుగమంచేసిన 1847 నాటి పారిశ్రామిక సంక్షోభం అధిగమింపబడింది; అనిదంపూర్వమైన ఒక నూతన పారిశ్రామిక

---

* K. Marx and F. Engels, "Address of the Central Committee to the Communist League," March 1850 (Marx and Engels, *Selected Works*, Vol. I, Moscow, 1962, pp. 106–17). — సం.

** Karl Marx/Friedrich Engels, ("Ansprache der Zentralbehörde an den Bund vom Juni 1850" (Marx/Engels, *Werke*, Bd. 7, Dietz Verlag, Berlin, 1960, S. 306–12). — సం.

వికాసదశ ఆరంభమైంది. కళ్లున్నవారికెవరికైనా — వాటిని వారు మూసుకోకపోయినట్లయితే — 1848 నాటి విప్లవ తుపాను క్రమక్రమంగా సన్నగిలిపోతోందన్న సంగతి విస్పష్టంగా అవగతమై వుంటుంది.

"ఈ సార్వత్రిక వికాసం కారణంగా -- యీ దశలో బూర్జువా సమాజపు ఉత్పాదక శక్తులు బూర్జువా సంబంధాలకింద ఎంతగా సాధ్యమో అంత విస్తారంగానూ వికసిస్తాయి — నిజమైన విప్లవ ప్రసక్తే ఉండజాలదు. ఈ రెండు అంశాలూ — ఆధునిక ఉత్పాదక శక్తులూ, బూర్జువా ఉత్పత్తి రూపాలూ — పరస్పరం ఘర్షణలోకి వచ్చినప్పుడు మాత్రమే అటువంటి విప్లవం సంభవం. వేటిలోనైతే యూరప్ ఖండపు పార్టీ ఆఫ్ ఆర్డర్‌యొక్క విడివిడి ముఠాల ప్రతినిధులు యీనాడు నిమగ్నులైయున్నారో ఆ రకరకాల కలహాలు — వీటిద్వారా వారిలో ఒకరిని మరొకరు అపఖ్యాతిపాలుచేసుకుంటున్నారు — కొత్త విప్లవాలకు అవకాశాన్ని కల్పించవు. సరి కదా అందుకు భిన్నంగా, సామాజిక సంబంధాల పునాది యీనాడు అత్యంత సుస్థిరంగా ఉన్నకారణంగా, యింత బూర్జువాగా ఉన్నకారణంగానే — ప్రగతినిరోధక శక్తులకు యీ సంగతి తెలియదు — యీ కలహాలు సంభవమయ్యాయి. బూర్జువా అభివృద్ధిని నిరోధించేం దుకు ప్రగతినిరోధక శక్తులు చేసే ప్రయత్నాలన్నీ, యీ మూలాధారానికి తాకి, సకల నైతిక రోషమూ, ప్రజాస్వామికవాదుల సమస్త ఉత్సాహపూర్వక ప్రకటనలూ ఏవిధంగా వెనుకంజవేస్తాయో, సరిగా అదేమాదిరి నిశ్చితంగా భగ్నమవుతాయి." ఈ మాటలను మార్క్స్, నేనూ "1850 మే — అక్టోబరు సమీక్ష"లో రాశాం ("Neue Rheinische Zeitung. Politisch-ökonomische Revue," 5, 6 సంచికలు, హాంబుర్గ్ 1850, 153వ పేజీ.)*

కాని లెద్ర్యూ-రోలిన్, లూయీ బ్లాంక్, మజ్జీని, కోషుత్‌లూ, జర్మన్ నాయకులలో తక్కువ ప్రసిద్ధులైనవారిలో రూగె, కింకెల్, గ్యోగ్ ప్రభృతులూ లండన్‌లో భవిష్యత్ తాత్కాలిక ప్రభుత్వాలను — తమతమ మాతృదేశాలకే కాకుండా యావత్తు యూరప్‌కూ — ఏర్పాటు చేసేందుకు తృటికాలంలో యూరపియన్ విప్లవాన్ని సాధించేందుకోసం యీ విప్లవపు సహజ పరిణామంగా వివిధ దేశాల్లో రిపబ్లిక్‌లను ఏర్పరచేందుకోసం అవసరమైన సొమ్మును రుణరూపంలో అమెరికానుండి పొందడమొక్కటే యిక తరువాయి అనుకునేటప్పుడు, పరిస్థితికి సంబంధించిన యధార్థమైన యిటువంటి అంచనాను పలువురు వ్యక్తులు రెటమతం గానే పరిగణించారు. విల్లిహ్‌వంటి వ్యక్తి యీ భ్రమలో పడ్డాడన్నా, షాప్పెర్ సైతం తన పాత విప్లవవాద ప్రేరణకులోనై తనకు తానుగా యీ జాలంలో ఇరుక్కున్నాడన్నా, లండన్

* Karl Marx/Friedrich Engels, *Werke*, Bd. 7, Dietz Verlag, Berlin, 1960, S. 440. — సం.

కార్మికుల్లో అధికతర భాగం — వీరిలో చాలవరకు శరణార్థులే — వారివెంట వెళ్లి బూర్జువా ప్రజాతంత్ర విప్లవ తంత్రజ్ఞుల శిబిరంలోకి చేరుకున్నారన్నా, అందులో ఎవరైనా ఆశ్చర్య పడేందుకేమైనా వుందా? సంక్షిప్తంగా చెప్పాలంటే, మా సంయమనం వీరి మనస్సులకు రుచించలేదు. విప్లవ నిర్వహణ క్రీడకు వెనువెంటనే పూనుకోవాలని వారి భావం. మేమలా చేసేందుకు అతి కచ్చితంగా నిరాకరించాం. దానితో చీలిక ఏర్పడింది. "బండారం"*లో యీ అంశంపై మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. దాని తర్వాత హాంబుర్గ్‌లో నోత్యుంగ్, దరిమిలా హౌప్ట్ అరెస్టుచెయ్యబడ్డారు. హౌప్ట్ ద్రోహంచేశాడు, అతను కొలోన్ కేంద్ర కమిటీ సభ్యుల పేర్లను బయటపెట్టి, ఆ కేసులో ప్రధాన సాక్షిగా తయారయ్యాడు. కాని అతని బంధువులు అపకీర్తిని మూటకట్టుకోవడం యిష్టంలేక, అతన్ని రీయోడిజనేరోకి తరలించేశారు. తర్వాత అతనక్కడ వర్తకుడుగా స్థిరపడ్డాడు. తన సేవలకు బహుమాన పురస్సరంగా మొదట ప్రష్యాకు, అటుతర్వాత జర్మనీకి అతను కాన్సల్ జనరల్‌గా నియమింపబడ్డాడు. ఇప్పుడతను తిరిగి యూరప్‌లో వున్నాడు.**

"కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసు బండారం"ను మరింత బాగా అర్థంచేసుకోగలిగేందుకుగాను, కొలోన్ ముద్దాయిల జాబితాను యీకింద యిస్తున్నాను: 1) పి.జి.ర్యోజర్, సిగార్లు తయారుచేసే కార్మికుడు; 2) హైన్రిహ్ బ్యూర్గెర్స్, తర్వాత శాసనసభలో ప్రోగ్రెసిస్టు[103] వుండగా మరణించాడు; 3) పెతెర్ న్యోత్యుంగ్, దర్జీపనివాడు, బ్రెస్లౌలో ఫొటోగ్రాఫరుగా పనిచేస్తూ కొద్ది సంవత్సరాలక్రితం మరణించాడు; 4) డబ్లియు.జె.రేయిఫ్; 5) డాక్టర్ హేర్మన్ బెక్కెర్, ప్రస్తుతం కొలోన్ మేయరు, ఎగువ శాసన సభ సభ్యుడు; 6) డాక్టర్ రోలన్డ్ డానియెల్స్, వైద్యుడు, జైల్లో ఇతనికి క్షయవ్యాధి సోకింది, కొలోన్ కేసు విచారణానంతరం కొద్ది సంవత్సరాలకు యితను మరణించాడు; 7) కార్ల్ ఓట్టొ, కెమిస్టు; 8) డాక్టర్ అబ్రహాం యాకోబి, ప్రస్తుతం న్యూయార్కులో వైద్యుడు; 9) డాక్టర్ ఐ. జె. క్లేయిన్, ప్రస్తుతం కొలోన్‌లో వైద్యుడు, నగర కౌన్సిలరు; 10)

---

* కార్ల్ మార్క్స్, "కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసు విచారణ బండారం." — సం.

** షాప్పెర్ లండనులో 1860 దశకం చివర చనిపోయాడు. విల్లిహ్ అమెరికన్ అంతర్యుద్ధంలో పాల్గొని విశేషమైన పేరుప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. అతను బ్రిగేడియర్ జనరల్ అయాడు. ముర్ఫీస్‌బొరో (టెనెస్సీ) యుద్ధంలో రొమ్ముకు గుండు దెబ్బ తగిలింది, కాని కోలుకున్నాడు. సుమారు పదేళ్లక్రితం అమెరికాలో మరణించాడు. పైన పేర్కొనబడిన వ్యక్తులను గురించి నేను చెప్పేదల్లా ఏమిటంటే, హైన్రిఖ్ బావర్ ఆస్ట్రేలియా వెళ్లిపోయాడు. తర్వాత అతని జాడ దొరకలేదు. వైట్లింగ్, ఎవెర్‌బెక్‌లు అమెరికాలో మరణించారు. (ఎంగెల్స్ వివరణ.)

ఫెర్డినాండ్ ఫ్రెయిలిగ్రాత్, ఇతను అప్పటికే లండన్‌లో వున్నాడు; 11) ఐ. ఎల్. ఎర్‌హార్డ్ట్, గుమాస్తా; 12) ఫ్రీడ్రిఖ్ లెస్నెర్, దర్జీ పనివాడు, ప్రస్తుతం లండన్‌లో వున్నాడు. జూరీముందు జరిగిన బహిరంగ విచారణానంతరం — ఈ విచారణ 1852 అక్టోబరు 4నుండి నవంబరు 12వరకు సాగింది — రాజద్రోహ ప్రయత్న నేరారోపణపై యీ కిందివారికి శిక్షలు విధింపబడ్డాయి. ర్యోజర్, బ్యూర్గెర్స్, నోత్యుంగ్‌లకు ఆరేళ్లు; రేయిఫ్, ఓట్టో, బెక్కెర్‌లకు అయిదేళ్లు, లెస్నెర్‌కి మూడేళ్లు సైనిక దుర్గంలో ఖైదుశిక్ష విధింపబడింది. డానియెల్స్, క్లేయిన్, యాకోబి, ఎర్‌హార్డ్ట్‌లు విడుదలచెయ్యబడ్డారు.

కొలోన్ విచారణతో జర్మన్ కమ్యూనిస్టు కార్మికోద్యమపు ప్రథమ దశ ముగిసింది. శిక్షలు విధింపబడిన వెంటనే మేము లీగును రద్దుచేసేశాం; మరికొద్ది నెలల తర్వాత విల్లిహ్—షాప్పెర్‌ల ప్రత్యేక లీగు[104] కూడా శాశ్వతంగా మూతపడింది.

* * *

అప్పటికీ యిప్పటికీ మధ్య ఒక పూర్తి తరం అంతరముంది. అప్పట్లో జర్మనీ చేతి వృత్తులు, చేతి శ్రమపై ఆధారపడిన గృహపరిశ్రమల దేశం. ఈనాడు అదొక బడా పారిశ్రామిక దేశం. అది నిరంతరంగా పారిశ్రామిక రూపాంతరీకరణ చెందుతూ వుంది. అప్పట్లో కార్మికులుగా తమ స్థితికీ, పెట్టుబడితో తమకుగల చారిత్రక-ఆర్థిక వైరుధ్యానికీ సంబంధించిన అవగాహన కలిగిన కార్మికులు ఒక్కొక్కరికోసమే కంచుకాగడా పుచ్చుకొని వెతకాల్సివచ్చేది. ఎందుచేతంటే యీ వైరుధ్యం అప్పుడప్పుడే అభివృద్ధిచెందనారంభించింది. కాని యీనాడు యావత్తు శ్రామికవర్గాన్నీ — అదొక పీడిత వర్గంగా తన పరిస్థితిని గురించిన పూర్తి చైతన్యాన్ని పొందే అభివృద్ధిక్రమాన్ని కేవలం ఏ కొంచెమైనా మందగింపచెయ్యడానికి అసాధారణ చట్టాలతో[69] అదుపులో పెట్టాల్సివస్తోంది. ఆరోజుల్లో శ్రామికవర్గపు చారిత్రక పాత్రను గ్రహించే స్థాయికి చేరుకోగలపాటి మేధాశక్తి కలిగిన కొద్దిమంది వ్యక్తులు రహస్యంగా సమావేశం కావలసివచ్చేది. ముగ్గురినుంచి యిరవైమందిదాకా వ్యక్తులతో కూడిన చిన్నచిన్న శాఖలలో రహస్య సమావేశాలు జరుపుకోవలసివచ్చేది. ఈనాడు జర్మన్ శ్రామికవర్గానికి ఏ అధికారిక సంఘాన్నీ — బహిరంగ, లేక రహస్య — కలిగివుండాల్సిన అవసరం లేదు.* ఒకే రకమైన ఆలోచన కలిగిన వర్గ సహచరుల మధ్య సరళ, స్వయంవ్యక్త పరస్పర సంబంధమే — ఏ నిబంధనావళీ, కమిటీలూ, తీర్మానాలూ, తదితర ప్రత్యక్ష రూపాలూ లేకుం

---

* ఎంగెల్స్‌యొక్క యీ మాటలు, శ్రామికవర్గ పార్టీని నిషేధించేందుకూ, కార్మికోద్యమపు గొంతు నులిమేందుకూగాను బిస్మార్కు అనుసరించిన విధానానికి వ్యంగ్యాత్మకమైన సవాలు. — సం.

డానే — యావత్తు జర్మన్ సామ్రాజ్యాన్నీ దాని మూలానికంటా కదిపి కుదిపెయ్యడానికి చాలు. బిస్మార్కు జర్మనీ సరిహద్దుల వెలుపల, యూరప్ తీర్పరి, కాని వాటి లోపల జర్మన్ శ్రామికవర్గపు భీమకాయం నానాటికీ విరాట్ స్వరూపం దాలుస్తూ వచ్చింది. దీన్ని గురించి మార్క్స్ ఎన్నడో 1844లోనే జోస్యం చెప్పాడు. కూపస్థమండూకాలకోసం తయారుచెయ్యబడిన రాజరిక కట్టడం యిప్పటికే యిరుకుగా తయారవుతోంది. దాని విరాట్ స్వరూపమూ, దాని విశాల భుజస్కంధాలూ ఎంతగా పెరిగిపోతున్నాయంటే, అది తన స్థానంనుంచి కేవలం లేచినిలబడినంతమాత్రాన రాజరిక రాజ్యాంగవ్యవస్థయొక్క మొత్తం కట్టడం తునాతునకలైపోతుంది. అంతేకాదు. యూరపియన్, అమెరికన్ శ్రామికవర్గపు అంతర్జాతీయోద్యమం ఎంతగా బలపడిందంటే, కేవలం దాని మొదటి సంకుచిత రూపమైన — రహస్య లీగే — కాకుండా, దాని రెండవ, అపారంగా విస్తృతరూపమైన — బహిరంగ ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ సైతం, దానికొక శృంఖలంగా తయారైంది. వర్గస్థితి సారూప్యతకు సంబంధించిన అవగాహనపై ఆధారపడిన సరళమైన సంఘీభావానుభూతి సకలదేశాలకూ, భాషలకూ చెందిన కార్మికులలో ఏకైక శ్రామికవర్గ మహాపార్టీని స్థాపించేందుకూ, సంఘటితంగా వుంచేందుకూ సరిపోతుంది. ఏ సిద్ధాంతానికైతే 1847నుండి 1852వరకు లీగు ప్రాతినిధ్యం వహించిందో, దేన్నైతే అప్పట్లో తెలివిమంతులైన అల్పబుద్ధులు భుజాలెగురవేసి, శుద్ధ మతిమాలినవాళ్ల చిత్తభ్రమలుగా, చెదురుబదురుగా వున్న కొద్ది మంది ఒంటెత్తువాదుల రహస్య సిద్ధాంతంగా పరిగణించారో ఆ సిద్ధాంతానికి, యీనాడు ప్రపంచంలోని సకల నాగరిక దేశాలలోనూ సైబీరియన్ గనుల్లోని ప్రవాసితులు మొదలుకొని కాలిఫోర్నియా బంగారు గనుల్లో పనిచేసేవారివరకు — అసంఖ్యాక అనుయాయులున్నారు. మరి యీ సిద్ధాంతకర్త కార్ల్ మార్క్స్ — తన కాలంలో అత్యధికంగా ద్వేషింపబడిన, దూషింపబడిన — తన మరణసమయానికి — పాతప్రపంచంలోనూ, కొత్త ప్రపంచంలోనూ కూడా — శ్రామికవర్గంయొక్క నిరంతర సలహాదారుడుగా వున్నాడు; ఆయన సలహా అనునిత్యం అర్థించబడుతూండేది, దాన్ని అందజేసేందుకు ఆయన ఎల్లప్పుడూ తత్పరుడై వుండేవాడు.

ఫ్రెడరిక్ ఎంగెల్స్

Karl Marx. “Enthüllungen über den Kommunisten-Prozeß zu Köln.” Hottingen-Zürich, 1885 అనే పుస్తకంలోను, “Der Sozialdemokrat” పత్రిక, 46–48 సంచికల్లో, 1885 నవంబరు 12, 19, 26 తేదీల్లోనూ ప్రచురింపబడింది

## ఫ్రెడరిక్ ఎంగెల్స్

# కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం[105]

## 1884 నాటి మొదటి ముద్రణకు ఉపోద్ఘాతం

ఒక విధంగా చెప్పాలంటే, కార్ల్ మార్క్స్ మరణశాసనం ప్రకారం ఈ పుస్తకం రాశాను. కార్ల్ మార్క్స్ స్వయంగా చరిత్రయొక్క తన — కొంతవరకు మా అని కూడా చెప్పవచ్చు — భౌతికవాద పరిశోధనా ఫలితాల దృష్ట్యా మోర్గన్ పరిశోధనా ఫలితాలను వివరించాలనీ, తద్వారా వాటి పూర్తి ప్రాముఖ్యాన్ని స్పష్టంగా చూపించాలనీ కార్ల్ మార్క్స్ స్వయంగా పథకం వేసుకున్నాడు. చరిత్రను భౌతికవాద దృక్పథంనుంచి పరిశీలించే పద్ధతిని అప్పటికి నలభయ్యేళ్ళక్రితమే మార్క్స్ కనుగొన్నాడు. దానినే అమెరికాలో మోర్గన్ తన సొంత పద్ధతిలో మళ్ళీ కనుగొన్నాడు. ఈ దృష్ట్యా అనాగరిక స్థితినీ నాగరికదశనూ పోల్చి చూపడంలో, ప్రధాన అంశాల్లో మార్క్స్ వచ్చిన నిర్ణయాలకే ఆయనా వచ్చాడు. మార్క్స్ రాసిన "పెట్టుబడి"నుంచి అనేక భావాలను జర్మనీలోని ప్రామాణిక అర్థికశాస్త్రజ్ఞులు చాల ఏళ్లపాటు చురుకుగా ఒక మూల దొంగిలిస్తూనే రెండో మూల పుస్తకం వున్నదనే విషయం కూడా పట్టుదలగా ఎరగనట్లు నటించారు. అలాగే ఇంగ్లండులోని ఆదిమ "చరిత్ర పూర్వ" విజ్ఞాన వ్యాఖ్యాతలు మోర్గన్ రాసిన "ప్రాచీన సమాజం"* విషయంలో వ్యవహ

---

* "Ancient Society, or Researches in the Lines of Human Progress from Savagery Through Barbarism to Civilisation" by Lewis H. Morgan ("ప్రాచీన సమాజం, లేక ఆటవిక యుగంనుంచి అనాగరిక యుగంగుండా నాగరికతకు మానవుడు పొందిన వికాసక్రమం గురించిన పరిశోధనలు" — రచయిత: ల్యుయిస్ హెచ్. మోర్గన్), London, MacMillan and Co., 1877. ఈ పుస్తకం అమెరికాలో ముద్రించబడింది. విశేషించి లండన్‌లో దొరకడం కష్టసాధ్యంగా వుంది. రచయిత ఇప్పటికి కొద్ది సంవత్సరాల క్రితం మరణించాడు. (ఎంగెల్స్ వివరణ.)

రించారు. కీర్తిశేషుడయిన నా మిత్రుడు మార్క్స్ రాయదలచుకొని పూర్తిచేయలేకపోయిన రచన స్థానాన్ని నా పుస్తకం భర్తీచెయ్యలేదు, ఆ లోపాన్నిది స్వల్పంగా మాత్రమే తీరుస్తుంది. అయినా ఆయన మోర్గన్ పుస్తకంలోంచి రాసిపెట్టుకొన్నవీ,* వాటిమీద రాసిపెట్టుకొన్న సవిమర్శక వ్యాఖ్యలూ నావద్ద వున్నాయి. సాధ్యమైన అన్ని చోట్లా వాటిని యథామాత్రుకగా రాస్తాను.

భౌతికవాద దృక్పథం ప్రకారం చెప్పాలంటే, మిగిలినదాని మాట ఎలావున్నా, తక్షణ జీవితంయొక్క ఉత్పత్తి, పునరుత్పత్తిక్రమమే చరిత్రయొక్క నిర్ణాయకాంశం. ఈ ఉత్పత్తిక్రమం ద్వివిధం. ఒకటి, జీవితావసరాలైన ఆహారం, బట్టలు, ఇల్లు, అందుకు అవసరములైన పనిముట్ల ఉత్పత్తి; రెండోది, మనుషుల ఉత్పత్తి, మానవ జాతియొక్క కొనసాగింపు. ఒక నిర్దిష్ట చారిత్రక దశలో, ఒక నిర్దిష్ట దేశంలో వున్న సామాజిక వ్యవస్థలను ఈ ద్వివిధ ఉత్పత్తిక్రమం నిర్ణయిస్తుంది. ఒకవంక శ్రమలోనూ, మరోవంక కుటుంబంలోనూ సాధింపబడిన అభివృద్ధి స్థాయిచేత యివి నిర్ణయింపబడతాయి. శ్రమ ఎక్కువగా అభివృద్ధి పొందనప్పుడు, మొత్తం ఉత్పత్తి మరింత తక్కువగా వుండి, తత్కారణంగా సమాజంలోని సంపద పరిమితమై వున్నప్పుడు, ఆ సామాజిక వ్యవస్థలో లైంగిక సంబంధాల ప్రాబల్యం మరింత అధికంగా వున్నట్లు కనబడుతుంది. లైంగిక సంబంధాల ప్రాబల్యం అధికంగావున్న ఈ సామాజిక వ్యవస్థలోపలనే శ్రమ ఉత్పాదకత అంతకంతకు అధికంగా పెరుగుతుంది. దానితోపాటు సొంత ఆస్తీ, మారకమూ, సంపదలో హెచ్చుతగ్గులూ, ఇతరుల శ్రమశక్తిని ఉపయోగించుకోగల అవకాశాలూ ఎక్కువవుతాయి. క్రమంగా తద్వారా వర్గవైరుధ్యాలకు పునాది ఏర్పడుతుంది. సమాజంలో తల ఎత్తిన నూతన శక్తులు తరాల తరబడి పాతసమాజ వ్యవస్థను నూతన పరిస్థితులకు అనుగుణంగా చక్కదిద్దేటందుకు ప్రయత్నం చేస్తాయి. కాని చివరకు ఆ రెంటికీ మధ్యగల అననుగుణ్యాత సంపూర్ణ విప్లవానికి దారితీస్తుంది. నూతనంగా సమాజంలో వృద్ధిపొందిన వర్గాల ఘర్షణలో లైంగిక సంబంధాల ఆధారంగా ఏర్పడ్డ సామాజిక సమూహాల ప్రాతిపదికపై నిర్మింపబడిన సమాజం ఛిన్నాభిన్నమైపోతుంది. దాని స్థానంలో రాజ్యంగా ఏర్పడిన నూతన సమాజం ఆవిర్భవిస్తుంది. ఈ నూతన సమాజంలోని దిగువ తెగలు ప్రాంతీయ జనసమూహాలేగాని, లైంగిక సంబంధాలమీద ఏర్పడిన జనసమూహాలు కాదు. ఈ సమాజంలో కుటుంబ వ్యవస్థపైన

---

* "మోర్గన్ రాసిన 'ప్రాచీన సమాజం'యొక్క క్రోడీకరణ" – అంటూ మార్క్స్ రాసినదానికిది ఎంగెల్స్ ప్రస్తావన. (మార్క్స్–ఎంగెల్స్, పురావస్తు భాండారం, 9వ సంపుటం, మాస్కో 1941, పేజీలు 1–192). – సం.

ఆస్తిపద్ధతుల పూర్తి ప్రాబల్యం వుంటుంది. ఈనాటివరకూ మనకు లభిస్తున్న లిఖితచరిత్ర వర్గవైరుధ్యాల, వర్గ పోరాటాల చరిత్ర. ఆ వర్గవైరుధ్యాలూ, వర్గ పోరాటాలూ ఈ నూతన సమాజంలో యథేచ్ఛగా పరిణతి పొందుతాయి.

లిఖితచరిత్రకు వెనుకనున్న ఆదిమచరిత్రలోని ప్రధానాంశాలను కనిపెట్టి, వాటిని క్రమరూపంలో పెట్టడంద్వారా మోర్గన్ గొప్ప సేవ చేశాడు. ప్రాచీన గ్రీకు, రోమను, జర్మను చరిత్రల్లో అపరిష్కృతంగా మిగిలిపోయిన అతి ముఖ్యమైన సమస్యలకు సమాధానాన్ని ఆయన ఉత్తర ఆమెరికన్ ఇండియన్ ప్రజాసమూహాలలో లైంగిక సంబంధాల ప్రాతి పదికపై ఏర్పడిన జీవితపద్ధతులలో కనుక్కున్నాడు. అదే ఆయన గొప్పతనంలోని విశేషం. ఆయన ఒక్కరోజుపాటు కూర్చుని రాసేసిన పుస్తకం కాదది. దాదాపు నలభయ్యేళ్ళపాటు కుస్తీపట్టి, విషయాలన్నీ కరతలామలకం చేసుకొని రాసిన పుస్తకం అది. మన రోజుల్లో వెలువడిన యుగ పరివర్తక ప్రభావంకలిగిన పుస్తకాలలో అదొకటి అనడానికి కారణం ఇదే.

పుస్తకంలోని వివరణాత్మక విషయాలను చదివినప్పుడు దానిలో మోర్గన్ పుస్తకం లోంచి వుదహరించినవేమిటో, నేను రాసినవేమిటో పాఠకుడు సులభంగానే తెలుసుకో గలుగుతాడు. గ్రీసు, రోముల చరిత్రకు సంబంధించిన ప్రకరణాలలో నేను మోర్గన్ రాసిన సంగతులతో సరిపుచ్చుకోకుండా నావద్ద నున్న ఇతర వృత్తాంతాన్ని కూడా వుపయోగించు కొన్నాను. కెల్టులు, జర్మన్ల గురించి రాసిన ప్రకరణాలు చాలవరకు నావే: దీని విషయంలో మోర్గన్ ఇతరులు చెప్పిన వృత్తాంతాలమీద పూర్తిగా ఆధారపడవలసి వచ్చింది. జర్మనీ పరిస్థితుల విషయంలో ఆయన ఒక్క టాసిటస్ మినహా మిగిలిన దానినంతనూ ఫ్రీమన్ యొక్క విశృంఖల చౌకబారు వక్రీకరణలనుంచీ, రాతలనుంచీ తీసుకొన్నాడు. మోర్గన్‌యొక్క ఆర్థికవాదనలు ఆయన ప్రయోజనానికి సరిపోతాయి గాని, నా ప్రయోజనానికి బొత్తిగా సరి పోవు, అందుకని నేను వాటినన్నింటినీ కొత్తగా విపులీకరించాను. ఇక చివరి విషయం, మోర్గన్ విగా ప్రత్యేకించి ఉదహరింపబడని సందర్భాలలో చెయ్యబడిన నిర్ణయాలన్నింటికీ సహజంగా నేనే బాధ్యుణ్ణి.

1884 మే 26 ప్రాంతంలో రచింప బడింది

F. Engels "Der Ursprung der Familie, des Privateigenthums und des Staats," Hottingen-Zürich, 1884, అనే పుస్తకంలో ప్రచురింపబడింది

# 1891 నాటి నాలుగో ముద్రణకు ఉపోద్ఘాతం

ఈ పుస్తకం ఇంతవరకు పెద్దసంఖ్యలో ముద్రించబడినా, దాదాపు ఆరు నెలలనుంచి ప్రతులు దొరకడంలేదు. కొత్త ముద్రణకు దానిని సిద్ధంచేయమని కొంతకాలంగా ప్రచురణ కర్త* నన్ను కోరుతున్నాడు. కాని, ఇతర తొందర పనులుండడం మూలంగా ఆ విషయం చూడలేకపోయాను. ఈ పుస్తకం మొదట ముద్రించబడి అప్పడే ఏడేళ్ళయింది. ఈ మధ్య కాలంలో కుటుంబాల ఆదిమరూపాల్ని గురించి పరిశీలన ఎంతో పురోగమించింది. అందుచేత, శ్రద్ధతీసుకొని కొన్ని సవరణలు, దిద్దుబాట్లు చెయ్యడం అవసరం. ప్రత్యేకించి ప్రస్తుత పాఠం స్టీరియోటైపు ముద్రణ జరగబోయే దృష్ట్యా, కొంతకాలంవరకు దీనిలో మార్పులు చేయడానికి నాకు సాధ్యం కాదు.

అందుచేత, పుస్తకాన్నంతనూ జాగ్రత్తగా సంస్కరించాను. దీనికి సంబంధించిన విజ్ఞాన శాస్త్రంలో ఈనాడు వచ్చిన అభివృద్ధులను గమనికలో పెట్టుకొని, చాలచోట్ల కొత్త విషయాలు చేర్చాను. తరువాత, ఈ ఉపోద్ఘాతంలో బాహోఫెన్‌నుంచి మోర్గన్‌వరకూ కుటుంబ చరిత్రకు సంబంధించిన అభిప్రాయాల ప్రగతిని సమీక్షిస్తున్నాను. దీనికి కారణం: ఆదిమ సమాజ చరిత్రలో ప్రత్యేకాధ్యయనం చేసిన బ్రిటిష్ చరిత్రకారులు జాతిదురహంకారపు పోకడలతో మోర్గన్ పరిశోధనల విషయమై మూకీభావం వహించి వానిని తొక్కియ్యాలని చూస్తున్నారు. అలాగని ఆయన పరిశోధనల ఫలితాలను కాజెయ్యడానికి ఎంతమాత్రం సంకోచించడంలేదు. ఇతర దేశాలలో కూడా ఇంగ్లీషువాళ్ళు తొక్కిన పంథానే తరచుగా అనుసరిస్తున్నారు.

నా పుస్తకాన్ని చాల భాషలలోకి అనువదించేరు. మొదట వచ్చింది ఇటాలియన్ భాషలో: "కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం" రచయిత పాస్కువలె మార్టిన్యేట్టిచేత సంస్కరింపబడి అనువదింపబడినది, బెనెవేన్‌టొ, 1885; తర్వాత 1885 సెప్టెంబరు నుంచి 1886 మే వరకు రుమేనియన్ Contemporanul[106] అనే యాస్సి మాసపత్రికలో ప్రచురింపబడింది, అనువాదం జోన్ నదెజ్డె. తరువాత 1888లో కోపెన్‌హాగన్‌లో డేనిష్ భాషలో వచ్చింది. ఈ కూర్పు గెర్సాన్ ట్రీర్‌చే తయారుచేయబడింది. ఇప్పుడు తయారవుతున్న జర్మన్ ముద్రణ ననుసరించి అ. రీ రవే చేసిన ఫ్రెంచి అనువాదం ప్రస్తుతం అచ్చు అవుతూంది.

* * *

---

* జె. డిట్స్. — సం.

అరవైయవ దశకందాకా కుటుంబ చరిత్ర అంటూ ఏమీ లేదు. అప్పటికింకా కుటుంబ చరిత్రకు సంబంధించిన విజ్ఞానం మోసెస్ అయిదు పుస్తకాల[107] ప్రభావంకింద వుండింది. మోసెస్ పుస్తకాలలో వర్ణించినంతగా, పితృస్వామిక కుటుంబ వ్యవస్థను గురించిన వివరాలు మరి దేంట్లోనూ లేవు. ఆ కుటుంబపద్ధతే చిరకాలంగా వున్నదని గుడ్డిగా నమ్మారు. చరిత్రగతిలో కుటుంబపద్ధతులలో మార్పేమీ రానేలేదన్నట్లు, ఒక్క బహుభార్యాత్వం తప్ప, మిగిలిన విషయాలన్నింటా ఈనాటి బూర్జువా కుటుంబపద్ధతి పైదానికి ప్రతిబింబమే ననుకున్నారు. మహా అయితే, మరీ ఆదిమదశలో విశృంఖలంగా స్త్రీ పురుషులు కలుస్తూ వుండి వుండవచ్చుననీ, అటువంటి దశ వుండి వుండవచ్చుననీ వొప్పుకొనేవారు. యూరపులో దంపతీ పద్ధతి (monogamy) వుండగా, తూర్పు దేశాలలో బహుభార్యాత్వం, ఇండియాలో కొన్నిచోట్లా, టిబెట్లో కొన్నిచోట్లా బహుభర్తృత్వం ఆచారంలో వున్నాయని యెరుగుదురు. చరిత్రక్రమంలో ఈ మూడింటి స్థానం ఏమిటో తెలియదు. ఈ మూడూ ఏకసమయంలో ఒకదాని ప్రక్క నొకటి వుంటున్నాయనీ, వానికేమీ సంబంధంలేదనీ అనుకొన్నారు. ప్రాచీన కాలంలో కొన్ని గణాలలోనూ, ఇప్పటికీ ఆటవికులలోనూ కుటుంబంలో పరంపరను తల్లి వేపు నుంచేగాని తండ్రివేపునుంచి లెక్కించరు, ఇప్పటికీ అనేక జాతులలో, కొంతవరకు పెద్ద జనసమూహాల మధ్య వివాహాలు నిషిద్ధం. ఈ విషయం గురించి ఆనాడు సూక్ష్మంగా పరిశీలన జరగలేదు. పైగా ఈ ఆచారం ప్రపంచంలో అన్నిమూలల్లోనూ కని పిస్తూంది. ఈ సంగతులు తెలిసినవే. రోజు రోజూ యిందుకు ఇంకా కొత్త దృష్టాంతాలు దృష్టికి వస్తున్నాయి. కాని వాటిని ఎలా అర్థంచేసుకోవాలో ఎవ్వరూ ఎరగరు. ఇ. బి. టైలర్ "మానవజాతి ఆదిమ చరిత్రపై పరిశోధనలు, వగైరా" (1865)లో సైతం, కొందరు ఆటవిక ప్రజల్లో కాలుతున్న కట్టెను ఇనుప పనిముట్లతో ముట్టుకోరాదన్న నిషేధం, అటువంటివే అర్థరహితమైన మూర్ఖపు మతనమ్మకాలతోబాటు "విచిత్రమైన ఆచారాలు"గా మాత్రమే యివి పేర్కొనబడ్డాయి.

1861లో బాహోఫెన్ "తల్లిహక్కు" ప్రచురించబడింది. కుటుంబంయొక్క చరిత్రను గురించిన అధ్యయనం అప్పటినుంచే ప్రారంభమయింది. బాహోఫెన్ తన యీ పుస్తకంలో ఈ విషయాలు వివరించాడు: 1) ప్రారంభదశలో మానవసమాజంలో స్త్రీ పురుషులు వావివరసలు లేకుండా లైంగిక సంబంధాలు కలిగివుండేవారు. దాని కాయన "హెటెరిజం" ("hetaerism") అని తప్పుడు పేరు పెట్టాడు. 2) వావివరసలు లేకుండా యధేచ్ఛాసంబంధాలు పెట్టుకోవడంవలన పిల్లల తండ్రి ఎవరో తెలియదు. కనక కుటుంబపరంపర తల్లి వేపునుంచే గుర్తుపట్టడం సాధ్యం. ఈ పద్ధతి ప్రాచీనకాలంలో అన్ని ప్రజాసమూహాల్లోనూ వుండేది. 3) చిన్నకారు అందరూ తల్లిదండ్రులలో తల్లి నొక్కర్తెనే గుర్తుపట్టగలరు. ఆ కారణంచేత స్త్రీలకు చాల మర్యాద, గౌరవభావం

చూపించేవారు. దానిని ఆడవాళ్ళ సంపూర్ణ పెత్తనం (gynaecocracy)గా బాహోఫెన్ భావించాడు. 4) దంపతీ వివాహపద్ధతిలోకి, అంటే ఒక ఆడది ఒకే మగవానికి భార్యగా వుండే పద్ధతిలోకి మార్పురావడం అంటే ఆదిమకాలపు మతనియమాలను ఉల్లం ఘించడమే (ఆ స్త్రీతో సంబంధం పెట్టుకొనేటందుకు యితర మగవాళ్ళందరికీ అనూ చానంగా వుంటూ వస్తున్న హక్కు నిరాకరించబడింది). అల్లాగ ఉల్లంఘించినందుకు తప్పు యిచ్చుకోవలసి వుందన్నాడు. అంటే హక్కు కోల్పోయినవాళ్ళు అల్లరిచేయకుండా ఊరుకునేటట్లు చేయాలి, లేక నియమిత కాలంపాటు ఆ స్త్రీని మిగిలిన మగవాళ్ళకు అప్పగించాలి.

బాహోఫెన్ అసాధారణమైన ఓపికతో ప్రాచీన ప్రామాణిక గ్రంథాలనుంచి పైవానికి యెన్నో ఉదాహరణలను పోగుచేశాడు. మతసంబంధమైన కొత్తకొత్త భావాలు పరిణతిపొంది పాత దృక్పథాన్ని ప్రతిబింబించే పాత దేవతల మందిరంలోకి నూతన దృక్పథాల్ని ప్రతిబిం బించే కొత్త దేవతల్ని ప్రవేశపెట్టినాక క్రమంగా పాతవాళ్ళు మూలబడ్డారు. ముఖ్యంగా గ్రీకుల్లో యిది జరిగింది. దీని ఫలితంగానే హెటెరిజంనుంచి "దంపతీ" పద్ధతి పరిణతి పొందిందని బాహోఫెన్ అభిప్రాయం. అంటే తల్లిహక్కు పోయి తండ్రిహక్కు వచ్చింద న్నమాట అన్నాడు. స్త్రీ పురుషుల సాంఘిక స్థాయిలో వచ్చిన చారిత్రకమైన మార్పులకు మనుష్యుల నిజపరిస్థితులలో వచ్చిన మార్పులు కారణం అనిగాక, ఆ నిజ పరిస్థితులను ప్రతి బింబించే మతసంబంధమైన భావనలే వానికి కారణమని ఆయన అభిప్రాయం. క్షీణించి పోతున్న తల్లిహక్కుకూ, విజయవంతంగా పైకివస్తున్న తండ్రిహక్కుకూ మహావీర యుగంలో జరిగిన పోరాటాన్ని ఎస్కిలస్ తన "ఒరెస్టెయా"లో అద్భుతంగా చూపించాడని బాహోఫెన్ పేర్కొన్నాడు. తన ప్రియుడైన ఏగిస్టస్‌కోసం క్లిటెమ్నెస్ట్రా అప్పుడే ట్రోజన్ యుద్ధం నుంచి ఇంటికి తిరిగివచ్చిన తన మగడు అగమేమ్నన్‌ను చంపేసింది. కాని, అగమేమ్నన్‌వలన క్లిటెమ్నెస్ట్రాకు పుట్టిన కొడుకు ఒరెస్టెస్ తల్లిని చంపేసి తన తండ్రిని హత్యజేసినం దుకు పగతీర్చుకున్నాడు. ఆ పని చేసినందుకు ఎరినీలు అతనిని తరమడం ప్రారంభించాయి. తల్లిహక్కును కాపాడుతున్న భయంకర దేవతలవి. వాటి అభిప్రాయం ప్రకారం మాతృహత్య మహాఘోరమైన అపరాధం. దానికి ప్రాయశ్చిత్తం కూడా లేదు. కాని అపోలో, ఎతీనాలు అతనిని కాపాడారు. అపోలో ఆకాశవాణిద్వారా ఒరెస్టెసును రెచ్చగొట్టి, అతనిచేత ఈ హత్య చేయిం చాడు. ఈ తగాదాలో మధ్యవర్తిత్వానికి ఏథెన్‌ను పెట్టారు. అపోలో, ఎతీనాలు కొత్త దేవ తలు. తండ్రిహక్కుమీద ఆధారపడిన నూతన వ్యవస్థకు వారు ప్రతినిధులు. ఏథెన్ ఉభయ పక్షాలవారి వాదనలనూ వింటుంది. ఆ సమయంలో ఒరెస్టెస్‌కూ, ఎరినీలకూ మధ్య జరిగిన వాదోపవాదాలను వింటే, అసలు తగాయిదా క్లుప్తంగా అర్థం అవుతుంది. క్లిటెమ్నెస్ట్రా రెండు అపరాధాలు చేసిందని ఒరెస్టెస్ అంటాడు: ఆమె <u>తన</u> భర్తను చంపడంద్వారా <u>నా</u>

తం(డిని చంపింది. తనకంటె ఎక్కువ నేరస్తురాలైన క్లిటెమ్నే(స్ట్రాను వదిలి ఎరినీలు తన వెంట బడ్డారెందుకు?

దాని కిచ్చిన సమాధానం ఆశ్చర్యకరంగా వుంది.

''ఆమెకూ, ఆమె చంపిన మగడికీ రక్తసంబంధం లేదు.''

దీని అర్థం ఏమిటి? హంతకురాలికి హతుడు మగడే అయినా సరే, రక్తసంబంధీకుడు కాని వానిని చంపడం క్షమార్హం. ఆ విషయాన్ని ఎరినీలు పట్టించుకోరు. రక్తసంబంధీకుల మధ్య జరిగిన హత్యలకు (పతీకారం చేయడమే వాళ్ళ పని. తల్లిపరంపర (పకారం మాతృ హత్య మహా ఘోరమైన నేరం. ఆ సమయంలో ఓరెస్టెస్ తరపున అపోలో కలుగచేసుకొం టాడు. అథీనియన్ జూరీలయిన అరియో పాజిటెస్‌లను ఈ సమస్యపై తమ అభి(పాయం ఇవ్వవలసిందిగా ఏథెనా ఆహ్వానిస్తుంది. జూరీలలో విడిచిపెట్టాలనేవాళ్ళూ, శిక్షించాలనేవాళ్ళూ సమాన సంఖ్య అయ్యారు. న్యాయాధికారిణిగా ఏథెనా తన ఓటును ఓరెస్టెసుకు అనుకూ లంగా ఇచ్చి, అతన్ని విడుదల చేసింది. ఆవిధంగా తల్లిహక్కును తం(డిహక్కు దిగ తొక్కేసింది. స్వయంగా ఎరీనిసే వర్ణించినట్లు ''తరువాతి తరం దేవతలు'' వారిని ఓడించారు. తర్వాత కొత్త వ్యవస్థలో ఎరీనిస్ దేవతలు మరో ఉద్యోగం స్వీకరించేటట్లు నచ్చచెప్పబడ్డారు.

''ఓరెస్టియా''కు బాహోఫెన్ చేసిన ఈ సరికొత్త వ్యాఖ్య పూర్తిగా సరియైనదే. ఆయన పుస్తకంలో చాలా అందమైన, (శేష్ఠమైన ఘట్టాల్లో యిదొకటి. కాని బాహో ఫెన్ కూడా ఎస్కిలస్ లాగే ఎరీనిస్, అపోలో, ఎతీనాల అస్తిత్వాన్ని విశ్వసించాడు. మహా వీర యుగంలో (గీసుదేశంలో వారు తల్లిహక్కును రద్దుపరచి తం(డిహక్కును స్థాపించా రని భావించాడు. (పపంచ చరి(తను నడుపుతున్నది మతమేననే అభి(పాయం చివరికి మార్మికవాదంగా (mysticism) పరిణమించడంలో ఆశ్చర్యంలేదు. అందుచేత బాహోఫెన్ రాసిన ఆ బృహత్ (గంథాన్ని చదవడానికి ఎంతో కష్టపడ్డా ఫలితం అట్టే వుండదు. కానీ, అంతమా(తంచేత కొత్త విషయాలను (పథమంగా వెలుగులోకి తెచ్చిన గొప్పతనం కొర వడదు. వావివరసలు లేకుండా లైంగిక సంబంధాలు అమలుజరిగిన రోజులుండేవంటూ అంతవరకూ చెప్పుకొనేవారు, అంతే. (గీకులలోనూ, ఆసియా వాసులలోనూ ఒకప్పుడు అమల్లో వున్న ఆచారానికి ఎటువంటి భంగమూ లేకుండానే బహుభార్యాత్వమే కాకుండా, బహుభర్తృత్వం కూడా ఆచరణలో వుండేదనీ, దంపతీ వ్యవస్థ తర్వాతతర్వాత వచ్చింది మా(తమేననీ, ఆ (పాచీనకాలపు పరిస్థితిని గురించిన వుదాహరణలు (పాచీన (పామాణిక వాఙ్మయంలో బోలెడున్నాయనీ ఆయన సోదాహరణంగా చూపించాడు. ఆ (పాచీనాచారం పోయి దంపతీ వ్యవస్థ వచ్చినప్పుడు (స్త్రీలు ఈ హక్కును కొనుక్కోడానికి పరిమితరూపంలో లొంగుబాటు చూపవలసి వచ్చిందనీ, ఈ ఆచారం వెనుకటి పరిస్థితులకు చిహ్నం మా(తంగా మిగిలిందనీ, ఆయన చూపించాడు; అందుచేతనే వంశవృక్షాన్ని మొదట

తల్లిపరంపరలోనే గుణించవలసివచ్చింది అన్నాడు, దంపతీ వ్యవస్థలో పిల్లల తండ్రి ఎవరో ఖచ్చితంగా తెలుస్తుంది, కనీసం ఫలానావాడు తండ్రి అని గుర్తించబడతాడు. అయినా, ఆ వ్యవస్థ ఏర్పడ్డాక కూడ చాలకాలంవరకూ తల్లిపరంపరే గణనలో వుండేది అన్నాడు; పిల్లల తల్లిదండ్రులలో తల్లి ఒక్కర్తె మాత్రమే గుర్తుతెలిసే అవకాశం వుండడంచేత స్త్రీలకు సమాజంలో అటు తర్వాతకాలంలో ఎన్నడూ లేని ఉన్నత స్థానం వుండేదన్నాడు. అయితే, బాహోఫెన్ ఈ సూత్రీకరణలను ఇంత స్పష్టంగా వ్యక్తీకరించలేదు. ఆయనకు మార్మిక దృక్పథమే లేకుండా వుంటే చెప్పగలిగేవాడు. అయితేనేం, అవి నిజమేనని నిరూపించాడు. మరి, 1861లో అదొక విప్లవమే.

బాహోఫెన్ తన మాతృభాషయైన జర్మనులో ఆ బృహత్ గ్రంథం రాశాడు. ఆ రోజులలో జర్మనులకు ఈనాటి కుటుంబవ్యవస్థయొక్క పూర్వచరిత్రను తెలుసుకోవాలనే ఆసక్తి ఇతరులకున్నంతగా వుండేది కాదు. అందుచేతనే ఆయనను గురించి మిగిలినవాళ్లకు తెలియనే తెలియదు. ఈ విషయంమీదనే 1865లో మరో పుస్తకం వచ్చింది. కాని, దానిని రాసిన ఆయనకు బాహోఫెన్ అనే ఆయన వున్నాడనే సంగతి కూడా తెలియదు.

1865లో పుస్తకం రాసిన ఆయన పేరు జె. ఎఫ్. మాక్లెన్నాన్. ఆయన పుస్తకం బాహోఫెన్ రచనకు పూర్తిగా విరుద్ధం. బాహోఫెన్‌ది మార్మిక దృక్పథమేగాని మనిషి ప్రతిభావంతుడు. మాక్లెన్నాన్ శుష్కవాదియైన లాయరు. కవిసహజమైన అతిశయ ఊహాప్రసరణంకన్న ఒక వకీలు తన కేసును వాదిస్తున్న విధంగా రాశాడు మాక్లెన్నాన్. వధువును ఆమె బంధువులనుంచి ఒంటరిగాగాని, తన స్నేహితుల సహాయంతోగాని వరుడు ఎత్తుకుపోతున్నట్లు నటించి పెళ్లిచేసుకొనే పద్ధతి* అనేక ఆటవిక, అనాగరిక ప్రజాసమూహాలలోనేగాక నాగరిక జాతులలో కూడ కనిపిస్తుందని మాక్లెన్నాన్ రాశాడు. వెనుకటి ఆచారాన్నిబట్టి వచ్చిన అవశేషం యిది. ఆ రోజులలో ఒక తెగవాళ్ళు మరో తెగలోని పడుచుల్ని బలవంతంగా యెత్తుకొనిపోయి పెళ్లిచేసుకొనేవారు. అయితే ఈ "రాక్షస వివాహ" పద్ధతి ఎలా వచ్చింది? మగవాళ్లకి కావలసినంతమంది భార్యలు వాళ్ల తెగలలోనే లభ్యమైనంతవరకు ఇటువంటి అలవాటు రావలసిన అగత్యం ఎంతమాత్రం లేదు. కొన్ని తెగలలో జనం వేర్వేరు గుంపులుగా విభజింపబడి వుంటున్నారు (1865 వరకూ పొరపాటున యీ గుంపుల్నే తెగలుగా భ్రమపడేవారు). ఆ గుంపులలోవాళ్లు తమతమ గుంపులోనివాళ్లనే పెళ్లిచేసుకోకూడదు. ఒక గుంపులోని స్త్రీలు మరో గుంపుల్లోంచి భర్తల్ని తెచ్చుకోవాలి, అలాగే మగవాళ్లూను. ఇంక కొన్ని తెగలలో మరో ఆచారం వుండేది. గుంపులలోని ఆడవాళ్లూ, మగవాళ్లూ తమతమ గుంపుల్లోనివాళ్లనే పెళ్లిచేసుకోవాలి. ఈ రెండు తరహాల ఆచారాలలోనూ

---

* దీనిని భారతీయులు "రాక్షస వివాహం" పేరుతో పిలుస్తారు. — సం.

మొదటి పద్ధతికి బహిర్వివాహపద్ధతి (exogamy) అనీ, రెండో దానికి అంతర్వివాహపద్ధతి (endogamy) అనీ మాక్‌లెన్నాన్ పేరు పెట్టాడు. ఇంక బాదరబందీ ఏమీ లేకుండా, బహిర్వివాహపద్ధతిని అనుసరించే "తెగలకూ", అంతర్వివాహ పద్ధతి ననుసరించే "తెగలకూ" మధ్య పరిష్కార సాధ్యంకాని వైరుధ్యం వున్నదనేశాడు. బహిర్వివాహపద్ధతిని గురించి తాను చేసిన పరిశోధనలే అత్యధికమైన, లేక అన్ని సందర్భాల్లోనూ కాకపోయినా పలుసందర్భాల్లో ఈ వైరుధ్యం తన కల్పనతప్ప వేరుకాదని నిరూపిస్తూన్నా, దానిమీదనే తన వాదనలన్నీ నడిపాడు. బహిర్వివాహపద్ధతి ననుసరించే తెగలు తమ భార్యల్ని పై తెగలనుంచే తెచ్చుకోవాలి. ఆటవికదశలో తెగకీ తెగకీ మధ్య ఎప్పుడూ యుద్ధస్థితేగాని శాంతిస్థితి వుండదు. అందుచేత పై తెగలనుంచి భార్యల్ని తెచ్చుకోవాలంటే రాక్షస వివాహపద్ధతిద్వారా మాత్రమే సాధ్యం – ఇదీ ఆయన సిద్ధాంతం.

మాక్‌లెన్నాన్ ఇంకా ఇలా వాదించాడు: ఈ బహిర్వివాహ పద్ధతి యెప్పుడొచ్చింది? రక్తబంధుత్వమూ, వావితప్పిన వారితో లైంగిక సంబంధం అనేవి అటుతర్వాత ఎప్పుడో వచ్చాయి కనక, ఈ ఆచారం వాటి మూలంగా వచ్చి వుండదు. ఆటవికులలో ఆడపిల్లల్ని పుట్టగానే చంపేసే అలవాటు ఒకటి వుండేది. బహుశా ఆ అలవాటు మూలంగానే ఈ పద్ధతి వచ్చి వుంటుంది. ఆడపిల్లల్ని చంపే అలవాటు మూలంగా ప్రతి తెగలో మగవాళ్ళు ఎక్కువుంటారు. ఆడవాళ్లు తక్కువ. దాని అవసర తక్షణ పర్యవసానంగానే చాలమంది మగవాళ్లు కలిసి ఒక ఆడదానిని పెట్టుకొంటారు. ఆవిధంగా బహుభర్తృత్వం వచ్చింది. దీనికి ఫలితంగా, పిల్లల తల్లి ఎవరో మాత్రమే తెలుస్తుంది. తండ్రి ఎవరో తెలియదు. అందుచేత వంశవృక్షం మగవానివేపునుంచిగాక ఆడదాని వేపునుంచి లెక్కిస్తారు. ఆవిధంగా తల్లిహక్కు వచ్చింది. తెగలో ఆడవాళ్లు తక్కువగా వుండడంవలన మరో ఫలితం కలిగింది. బహుభర్తృత్వంవలన ఆ లోపం ఉపశమించిందేగాని అధిగమింపబడలేదు. కనక, ఇతర తెగలనుంచి క్రమబద్ధంగా, బలవంతంగా స్త్రీలను ఎత్తుకు పోయే అలవాటు వచ్చింది – ఇదీ ఆయన వాదం.

> "తెగలో స్త్రీలు తక్కువగా వుండడం కారణంగానే బహిర్వివాహ పద్ధతీ, బహుభర్తృత్వమూ వచ్చాయి. కనక, బహిర్వివాహపద్ధతి ఆచారంగా వున్న తెగలన్నీ ఒకప్పుడు బహుభర్తృత్వాన్ని ఆచరించినవే అయివుంటాయి – అనుకోవాలి.... అందుచేత బహిర్వివాహపద్ధతి ఆచారంగా గల జాతులలోని తల్లులద్వారా మాత్రమే రక్తసంబంధం కలిగినదే బంధుత్వ వ్యవస్థలో ప్రప్రథమమైనది. ఈ విషయంలో సందేహం అనవసరం." (మాక్‌లెన్నాన్, "ప్రాచీన చరిత్ర పరిశీలన" 1886, "ఆదిమ వివాహపద్ధతి," పేజి 124).

బహిర్వివాహపద్ధతి అంటూ ఆయన పేరుపెట్టిన ఆచారం సర్వత్రా వుండేదనీ, దానికి చాల ప్రాముఖ్యం వుందనీ చూపించడంద్వారా మాక్‌లెన్నాన్ గొప్ప సేవ చేశాడు. ఐతే, బహిర్వివాహపద్ధతిని ఆచరించే గ్రూపులున్నాయనే విషయాన్ని కనిపెట్టినది ఆయన కాదు. అదీగాక, ఆ వివాహపద్ధతి ఆయనకు అర్థం కానూలేదు. పరిశీలకులు చాలమంది దీనిని గురించి అంతకుముందే విషయ సంగ్రహణం చేశారు. వాటిని మాక్‌లెన్నాన్ తన గ్రంథంలో ఉపయోగించుకొన్నాడు కూడా. లాథామ్ అనే ఆయన "మానవజాతుల వర్ణన" (1859) అనే పుస్తకంలో ఈ పద్ధతి ఇండియన్ మాగార్లలో* వున్నదని చెప్పి, దాని వర్ణనను సరిగ్గా ఇచ్చాడు. ఆ పద్ధతి ప్రపంచం మొత్తంమీద అన్ని చోట్లా వుండేదన్నాడు. ఆ వాక్యాలను మాక్‌లెన్నానే తన పుస్తకంలో వుదహరించాడు. 1847లో మన మోర్గన్ కూడా "అమెరికన్ రివ్యూ" అనే పత్రికలో ఇరాక్వా తెగలను గురించి కొన్ని లేఖల రూపంలోను, 1851లో "ఇరాక్వాల సమితి"లోనూ ఈ బహిర్వివాహ పద్ధతి యీ తెగల్లో వున్నదని నిరూపించాడు. దాని స్వరూపాన్ని యథాతథంగా వర్ణించాడు. కాని మాక్‌లెన్నాన్ వకీలు ధోరణి బాహోఫెన్ మార్మికవాద కల్పన తల్లి హక్కును గందరగోళపరచినదానికన్న యీ అంశాన్ని ఎక్కువ గందరగోళపరచింది. తల్లి పరంపరలో వంశక్రమాన్ని లెక్కగట్టడం పద్ధతి ప్రప్రథమంలో వుండేదని గుర్తించడం మాక్‌లెన్నాన్ గొప్పదనమేననాలి, అయితే ఈ విషయాన్ని బాహోఫెన్ తనకన్నా ముందే కనుగొన్నాడని తర్వాత ఆయనే రాశాడు. అయితే ఈ విషయంలో కూడా మాక్‌లెన్నాన్ ఆలోచనలు విస్పష్టంగా లేవు. "స్త్రీలద్వారానే బంధుత్వం పరిగణించబడేది" (kinship through females only) అని ఆయన పొడుగునా రాశాడు. ఈ సూత్రీకరణ ప్రాథమిక దశకు సంబంధించినంతవరకు సరైనదే. తర్వాత వంశక్రమాన్నీ, వారసత్వాన్నీ స్త్రీ వైపునుంచే పరిగణించుతూన్నా, బంధుత్వాన్ని మగవానివైపునుంచి కూడా లెక్కపెట్టేవారు. ఈ దశను గురించి చెప్పేటప్పుడు కూడా మాక్‌లెన్నాన్ "స్త్రీలద్వారానే బంధుత్వం పరిగణించబడేద"ని రాస్తూవచ్చాడు. న్యాయవాదుల ఆలోచనాపద్ధతులలోని పరిమితులను మనం ఇక్కడ చూడగలం. వారు ఒక న్యాయసూత్రాన్ని గట్టిగా పట్టుకొంటారు. పరిస్థితులలో వచ్చిన మార్పుల ఫలితంగా ఆ సూత్రంలో మార్పులు తీసుకురాక తప్పక పోయినా వారు దానికి పూనుకోరు. ఆ సూత్రాన్ని యథాతథంగానే వర్తింపచేయడానికి పూనుకుంటారు. అదే ఇక్కడా కనబడుతుంది.

---

* మాగార్లు – 19వ శతాబ్దానికి పూర్వమున్న ఒక తెగ, ఇప్పుడు నేపాల్ పశ్చిమ ప్రాంతంలో నివసిస్తున్న ఒక ఉపజాతి. – సం.

మాక్‌లెన్నాన్ సిద్ధాంతం యుక్తియుక్తమైనదే అయినా దానికి తగిన రుజువు లేదని ఆయనకే అనిపించింది.

> "అపహరణ (కుహనా)ద్వారా భార్యల్ని తెచ్చుకొనే పద్ధతి ఇప్పుడు మగవాని ద్వారా బాంధవ్యాన్ని గుర్తించే అలవాటు ఏర్పడిన తెగలలో విస్పష్టంగా కొట్ట వచ్చినట్లు కనబడుతూంది" (పేజీ 140).

అంటూ ఆయనే విభ్రాంతి ప్రకటించాడు. మరో చోట మళ్ళీ ఇలా రాశాడు:

> "మనకు తెలిసినంతవరకు, బహిర్వివాహపద్ధతీ, ఆదిమ బంధుత్వ రూపమూ కలిసివున్న చోట ఎక్కడా కూడా శిశుహత్య ఒక క్రమపద్ధతిగా లేకపోవడమన్నది ఒక చిత్రమైన వాస్తవం" (పేజి 146).

ఈ రెండు వాస్తవాలూ ఆయన భాష్యానికి విరుద్ధమైనవి. అందుచేత సరికొత్త చిక్కు కల్పనలు, ఊహలతో తన వాదనను బలపరచుకొనేటందుకు పూనుకొన్నాడు.

అయినా, ఆయన సిద్ధాంతాన్ని ఇంగ్లండులో చాల హర్షించారు. దానిమీద ఎంతో ఆసక్తి కనబరిచారు. కుటుంబ చరిత్రయొక్క ప్రథమ నిర్మాతగా ఆయనను గౌరవించారు. ఈ రంగంలో ఆయన అభిప్రాయాలను అత్యంత ప్రామాణికంగా తీసుకున్నారు. బహిర్వివాహపద్ధతి, అంతర్వివాహపద్ధతి అమల్లోవున్న "తెగలు" కొన్నింటిని మరికొన్నింటికి పోటీ పెట్టడ మన్న ఆయన సిద్ధాంతానికి కొన్ని మినహాయింపులనూ, మార్పులనూ అంగీకరించినా, ఆ అభిప్రాయాన్ని మాత్రం వదలకుండా పట్టుకుని కూర్చున్నారు. చివరకు స్వతంత్రంగా స్వేచ్ఛగా పరిశీలించడానికి వీలులేకుండా గంతకట్టినట్లు ఆటంకంగా అది తయారయింది. గణనీయమైన పురోగతి అసాధ్యమయింది. మాక్‌లెన్నాన్ సిద్ధాంతాన్ని ఇంగ్లండులో స్వీకరించడం, దానిని ఎక్కువ అంచనా వేయడం, దానితోపాటు ఇతర దేశాలు కూడా ప్రామాణికంగా తీసుకోవడం జరిగింది. బహిర్వివాహపద్ధతిని అనుసరించే "తెగలకూ," అంతర్వివాహపద్ధతిని అనుసరించే "తెగలకూ" మధ్య, ఒకదాన్ని మరోదానికి పోటీ పెట్టడమే ఆయన చేసిన సిద్ధాంతంలోని పొరపాటు అనీ, అది ఆయన చేసిన పరిశోధనలలోని మంచిని కూడా నిష్ప్రయోజనం చేసి, ఎంతో అపకారాన్ని తెచ్చిపెట్టిందనీ ఇక్కడ చెప్పడం అవసరం.

ఈలోపున ఎన్నో కొత్త సంగతులు బయటపడ్డాయి. అవేవీ మాక్‌లెన్నాన్ సిద్ధాంత పథకంలో ఇమడలేదు. ఆయనకు తెలిసిన వివాహపద్ధతులు మూడు మాత్రమే: బహుభార్యాత్వం, బహుభర్తృత్వం, దంపతీపద్ధతి. అయితే ఈ వివాహాల విషయంలో పరిశోధన జరిగినకొద్దీ వెనకబడిన ప్రజలలో మరో వివాహపద్ధతి కూడా అమలులో వున్నట్లు ఎన్నో నిదర్శనలు కనిపించాయి. కొంతమంది మగవాళ్లు కలసి, కొంతమంది ఆడవాళ్లను సామూహికంగా పెళ్లిచేసుకోవడం అనేది కనబడింది. ఈ గుంపుపెళ్లి (communal marriage)ని చారిత్రకమైన వాస్తవంగా లుబ్బొక్ గుర్తించాడు ("నాగరికత ఆవిర్భావం," 1870).

ఆ వెంటనే, 1871లో మోర్గన్ ఎన్నో కొత్త సంగతులను, రుజువులతో కూడిన సమాచారాన్ని దృష్టిలోకి తెచ్చాడు. ఇరాక్వ్యాలలో అమలులోవున్న బంధుత్వపద్ధతే అమెరికాలోని ఆదిమజాతుల వారందరిలోనూ వున్నదనే నిర్ణయానికి వచ్చాడాయన. అదే ఆ ఖండం అంతటా వ్యాప్తిలో వుందన్నాడు. ఆ చిత్రమైన బంధుత్వపద్ధతికీ అక్కడ అమల్లోవున్న వైవాహిక బంధుత్వపద్ధతికీ వైరుధ్యం వున్నదని గ్రహించాడు. అప్పుడు ఒక ప్రశ్నావళినీ, పట్టికనూ తయారుచేసి, దాని ప్రకారం ఇతర ఆదిమప్రజలలో అమలులోవున్న బంధుత్వపద్ధతుల సమాచారాన్ని సేకరించవలసిందని ఆయన అమెరికా ప్రభుత్వాన్ని కోరాడు. వారిచేత ఆ పని చేయించాడు. ఆ సమాచారాన్ని పరిశీలించాక ఆయన తేల్చినవివి: 1) అమెరికన్ ఇండియను తెగలలో అమలులోవున్న బంధుత్వపరిగణన పద్ధతే ఆసియాలోని అనేక తెగలవారిలో వుంది. ఆఫ్రికా, ఆస్ట్రేలియాలలోని తెగలవారిలో అదే కొద్ది మార్పులతో వుంది. 2) ఈనాడు హవాయ్ దీవులలోనూ, ఇతర ఆస్ట్రేలియన్ దీవులలోనూ వున్న తెగలవారిలో ఒక విధమైన గుంపుపెళ్లి అమలులో వుంది. ఆ పద్ధతి యిప్పుడు అంతరించిపోతూవుంది. ఆ వివాహపద్ధతినుంచి అమెరికన్ ఇండియన్ తెగలలోని బంధుత్వపరిగణన పద్ధతికి గల మూలాన్ని అర్థంచేసుకోవచ్చును. 3) హవాయ్ మొదలయిన దీవులలోని వివాహపద్ధతికి భిన్నమైన బంధుత్వపరిగణన పద్ధతి అక్కడ అమలులో వుంది. దానినిబట్టి ఒక రోజున ఆ దీవులలో సామూహిక వివాహపద్ధతి అమలులో వుండేదనీ, అదిప్పుడు అంతరించిపోయిందనీ తెలుస్తూంది. ఈవిధంగా పోగుచేసిన విషయాలనూ, వాటినిబట్టి తేలుతున్న ఫలితాలనూ కలిపి ఆయన 1871లో "బంధుత్వాల వ్యవస్థలు" అనే పుస్తకాన్ని ప్రచురించాడు. దానితో ఈ విషయంపై చర్చలు పలుముఖాలుగా వ్యాపించడానికి తోడ్పడ్డాడు. ఆయన బంధుత్వ పరిగణనపద్ధతులతో ప్రారంభించి దానికి అనుగుణంగా వుండే కుటుంబరూపాలను నిర్ధారణ చేశాడు. ఆవిధంగా, మానవజాతి ఆదిమ చరిత్రను గురించి పరిశోధించేవారికి నూతన మార్గాలను చూపాడు. పరిశోధనలు చాల వెనుకటికాలంలోకంటా సాగించడానికి వీలుకలిగించాడు. ఈ

పద్ధతిని సరియైనదిగా భావించేటట్లయితే మాక్‌లెన్నాన్ కాల్పనిక భవనమంతా గాలిలో కలిసిపోతుంది.

"ఆదిమ వివాహ పద్ధతి" ("ప్రాచీన చరిత్ర పరిశీలన," 1876)ను సంస్కరించి కొత్తగా తెచ్చిన ముద్రణలో మాక్‌లెన్నాన్ తన సిద్ధాంతాన్ని సమర్థించుకొనేటందుకు పూనుకున్నాడు. తాను తయారుచేసిన కుటుంబవ్యవస్థ చరిత్రనంతనూ తను వట్టి వూహలమీద ఆధారపడి తయారుచేసినా, లుబ్బాక్‌నూ, మోర్గన్‌నూ మాత్రం ప్రతి వాక్యానికీ సాక్ష్యాధారాలేమిటో చెప్పమని కూర్చున్నాడు. స్కాట్లండు కోర్టుల్లో అడిగే మాదిరిగా ఎదురుమాట కవకాశం లేని గట్టి సాక్ష్యం కావాలన్నాడు. జర్మనులలోనూ, బ్రిటనులలోనూ, ఇతరత్రానూ బహుభర్తృత్వం అమలులో వుండేదని ఆయన చేసిన సిద్ధాంతానికి సాక్ష్యం ఏమిటి? జర్మనులలో మేనమామకూ, మేనల్లునికీ చాల దగ్గర బంధుత్వం పరిగణించబడు తుండేదని టాసిటస్ రాశాడు ("జర్మనియా," ప్రకరణం 20). పది, పన్నెండు మంది బ్రిటన్ వాసులు కలిసి సమిష్టిగా భార్యల్ని కలిగివుండేవారని సీజరు రాశాడు. అనాగరిక ప్రజలలో స్త్రీలను సామూహికంగా భార్యలనుగా అనుభవించే ఆచారం వున్నదని వెనుకటి రచయితలు చాలమంది రాసిపెట్టారు. ఇవన్నీ చూపిస్తూ మాక్‌లెన్నాన్ వెనక, ముందు చూడడం లేకుండా తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఫిర్యాదీ తరపు వకీలు తన యిష్టం వచ్చినట్లల్లా ఆరోపణలు చేయడానికి అవకాశం ఇచ్చి, నిందితుని తరఫున ఆడే ప్రతి మాటకూ సాక్ష్యం కావాలని అడిగినట్లే వుంది మాక్‌లెన్నాన్ ధోరణి.

గుంపుపెళ్లి అనేది వట్టి ఊహాకల్పన మాత్రమే నన్నాడు. ఆవిధంగా, మాక్‌లెన్నాన్ బాహోఫెన్‌కన్న చాలా వెనక్కిపోయాడు. ఇండియన్లు కూడా పరాయివాళ్లను, చివరకు తెల్ల వాళ్లని సహా "అన్న," "అయ్య" అనడం మామూలనీ, అందుచేత మోర్గన్ నిర్ధరించిన బంధుత్వ వ్యవస్థ, సాంఘిక మర్యాదలు మాత్రమేననీ ఆయన అన్నాడు. కాథలిక్ మతబోధ కుల్ని "అయ్య" అనీ, మతబోధకురాండ్రని "అమ్మ" అనీ అంటారు. సన్యాసులూ, సన్యా సినులూ, ఫ్రీమాసన్‌లూ ఇంగ్లండులోని వృత్తిసంఘాల సభ్యులూ తమ సమావేశాలలో "అన్నా," "చెల్లెమ్మా" అని పిలుచుకుంటారు. కనుక, ఈ అమ్మ, అయ్య, అన్న, చెల్లి వగైరా మాటలు మర్యాదవాచకాలు తప్ప వాటికి మరో ప్రత్యేకత లేదన్నట్లే వుంది ఈ వాదన, మాక్‌లెన్నాన్ వాదనలో నిజానికి పస ఏమీలేదు.

అయితే ఒక్క విషయంలో మాత్రం ఆయన వాదనల కెవరూ ఎదురుచెప్పలేదు. బహిర్వివాహపద్ధతి అమలులోవున్న తెగలకూ, అంతర్వివాహపద్ధతిని అనుసరించే తెగలకూ చుక్కెదురు అంటూ ఆయన చేసిన సిద్ధాంతాన్ని కాదన్నవారు లేరు. అంతేగాక కుటుంబం యొక్క చరిత్రగతి కంతకూ అదే మూలాధారం అనే ఆయన అభిప్రాయం చెక్కుచెదరకుండా వుండిపోయింది. ఈ వైరుధ్యాన్ని చూపి అసలు విషయాన్ని సమర్థించాలంటే కుదరడం

లేదనీ, ఆయన సేకరించిన సమాచారానికీ, దానికీ పొసగడం లేదనీ వొప్పుకుంటారు. అయినా, రెండు పరస్పర విరుద్ధాలయిన ఆచారాల్ని అనుసరించే — వీటిలో ఒకటి తెగలోని స్త్రీలనే భార్యలుగా స్వీకరించగా, రెండోదానికి యీ పద్ధతి పూర్తిగా నిషిద్ధం — తెగలున్నాయని చెప్పేమాటను వేదవాక్యంలా శిరసావహించారు. ఉదాహరణకు జిరో-త్యూలోన్ రాసిన "కుటుంబ ఆవిర్భావం" 1874ని, లుబ్బాక్ రాసిన "నాగరికత ఆవిర్భావం" (నాలుగో ముద్రణ 1882)నూ సైతం పోల్చిచూడండి.

మోర్గన్ ప్రధాన రచన "ప్రాచీన సమాజం" (1877) ముఖ్యంగా ఈ విషయాన్ని ఖండిస్తుంది. దానిని ఆధారం చేసుకొనే నేనీ పుస్తకం రాశాను. మోర్గన్ 1871లో చూచాయగా మాత్రమే ఊహించిన విషయాన్ని దీనిలో సమగ్రంగా ఆకళింపుచేసుకొని విస్తరించాను. బహిర్వివాహపద్ధతికీ, అంతర్వివాహపద్ధతికీ వైరుధ్యం ఏమీలేదు. ఈ క్షణంవరకు బహిర్వివాహపద్ధతిని అనుసరించే "తెగలు" ఉన్నట్లు రుజువు ఏమీ లేదు. గుంపుపెళ్లి ప్రబలంగా వున్నప్పుడు, ఏదో ఒకప్పుడు ప్రతిచోటా ఆ పద్ధతి అమలులో వుండేది — తెగ అనేక గుంపులుగా విభజింపబడివుండేది. ప్రతి గుంపులోనివాళ్లూ తల్లి వేపునుంచి రక్త సంబంధంకలిగి వుండేవారు. ఈవిధమైన గుంపులు లేక గణాలలోని సభ్యులు ఆ గణంలోని వారినే పెళ్లిచేసుకోవడం పూర్తిగా నిషిద్ధం, అంటే ఒక్కొక్క గణంలోని మగవాళ్లు తమ తెగలోంచే భార్యల్ని తెచ్చుకోగలిగినా, విధిగా తెచ్చుకున్నా, వారి భార్యలు మాత్రం పై గణాలనుంచి వచ్చినవాళ్లవుతారు. అంటే ప్రతి గణంలోనూ బహిర్వివాహం కచ్చితంగా అమలులో వుండేది. కాని, ఈ గణాలన్నీ చేరి ఏర్పడిన తెగలో అంతర్వివాహమే కచ్చితంగా అమలులో వుండేది. దీనితో మాక్‌లెన్నాన్ నిర్మించిన కృత్రిమ ఊహాసౌధంయొక్క చివరి అవశేషాలు నిశ్చయంగా కూలిపోయాయి.

మోర్గన్ ఇంతటితో ఆగలేదు. అమెరికన్ ఇండియన్ తెగలలో కనబడిన గణాల్ని ఆధారం చేసుకొని ఆయన తన పరిశోధనలలో మరో ముందడుగు వేశాడు. తల్లిహక్కు ననుసరించి గణాలు ప్రప్రథమంలో ఏర్పడ్డాయనీ, వానిలోంచి తండ్రి హక్కు ప్రకారం ఏర్పడిన గణాలు పరిణతి పొందాయనీ ఆయన కనిపెట్టాడు. ప్రాచీనకాలపు నాగరిక ప్రజలలో మనం చూస్తున్న తండ్రి పరంపర ననుసరించేగణాలు ఆ విధంగా ఏర్పడినవే అన్నాడు. గతంలో చరిత్రకారు లందరికీ గ్రీకు, రోమను గణాలు అంతుపట్టేవి కావు. అమెరికన్ ఇండియను గణాలను చూడడంతో యిప్పుడు వాని విషయమూ అర్థమైంది. ఆదిమ సమాజ చరిత్రకంతకూ మూలం ఏమిటో అర్థమైంది.

జీవశాస్త్రానికి డార్విన్ పరిణామ సిద్ధాంతం ఎంత ముఖ్యమో, అర్థికశాస్త్రానికి మార్క్సు అదనపు విలువ సిద్ధాంతం యెంత ముఖ్యమో, నాగరిక ప్రజలలో కనిపించే తండ్రిహక్కు గణాలకు పూర్వం తల్లిహక్కు గణాలు వుండేవని మోర్గన్ కనిపెట్టిన అంశం అంతే

ముఖ్యం. దీనిని ఆధారంచేసుకొని ఆయన కుటుంబవ్యవస్థయొక్క చరిత్రను మొట్టమొదటి మారు రేఖామాత్రంగా చిత్రించాడు. కుటుంబవ్యవస్థయొక్క పరిణామంలో వచ్చిన ప్రధాన దశలను దొరికిన సమాచారం సాధ్యం చేసిన మేరకు ఆయన దానిలో చూపాడు. ఆదిమచరిత్ర రచనలో ఒక నూతనయుగం దీనితో ప్రారంభమయిందనవచ్చును. ఈ విజ్ఞానశాస్త్ర శాఖకు తల్లిహక్కు గణం కీలకం అయింది; దానిని కనిపెట్టినప్పటినుంచీ మనం మన పరిశోధనల ఫలితాలను ఏవిధంగా వర్గీకరించాలో మనకు అర్థమైంది. అందుచేత ఇతఃపూర్వంకన్న మోర్గన్ పుస్తకం వచ్చాక ఈ రంగంలో యిప్పుడు పురోగతి మరింత వేగంగా సాగుతోంది.

మోర్గన్ కనిపెట్టిన విషయాలను ఇప్పుడంతా అంగీకరిస్తున్నారు. అంతకంటే, ఇంగ్లండులోని ఆదిమచరిత్ర పండితులు అవి తమవయినట్లే వుపయోగం చేసుకుంటున్నారంటే సరిగా వుంటుంది. మన దృక్పథాలలో వచ్చిన ఈ విప్లవానికి కారణం మోర్గనేయని వారిలో ఒక్కరు కూడ బహిరంగంగా చెప్పరు. ఇంగ్లండులో ఆయన పుస్తకం గురించి సాధ్యమైనంత వరకు మూకీభావం వహిస్తున్నారు. ఆయన రాసిన వెనుకటి పుస్తకాలేవో పేర్కొని వాటి రచయితగా అభినందిస్తున్నారు. ఆయన కనిపెట్టిన నిజంగా మహత్తర విషయాలను గురించి పెదవి విప్పరు. వాటిని సమర్థిస్తూ చేసిన వివరణలను పట్టుకొని విమర్శను సాగిస్తారు. "ప్రాచీన సమాజం" మొదటి ముద్రణ అయిపోయింది. ఈ మాదిరి పుస్తకాలకు అమెరికాలో లాభసాటి మార్కెట్టు లేదు. ఇంగ్లండులో చూస్తే ఈ పుస్తకాన్ని పనిగట్టుకుని కనబడకుండా చేసినట్లు కనబడుతూంది. నూతన యుగాన్ని నిర్మించిన ఈ ఉద్గ్రంథం ఇప్పుడు మార్కెట్టులో జర్మన్ భాషలో మాత్రమే దొరుకుతూంది.

దీనికి కారణం ఏమిటి? ప్రాచీన చరిత్ర పండితులు తమ రచనలలో మర్యాదకోసం ఆయన పుస్తకాలనుంచి చాలా భాగాలను ఉదహరిస్తూన్నారు, ఇతర విధంగా మర్యాదలు చూపుతున్నారు. అయినా, ఆయన పుస్తకం మార్కెట్టులో దొరకదు, దీనిని చూస్తే, బుద్ధిపూర్వకంగానే మూకీభావం వహించి, దానిని వ్యాప్తిలోకి రాకుండా చెయ్యాలనే తలపెట్టారనిపిస్తుంది. దీనికి కారణం, మోర్గన్ అమెరికను కావడం కాదుగదా? తమకు కావలసిన విషయాలను సేకరించుకోవడంలో బ్రిటిష్ ప్రాచీనచరిత్ర పండితులు చూపే శ్రద్ధా, జాగ్రత్తా ప్రశంసనీయాలు. ఆ విషయాలనూ, తమ భావాలను ఒక క్రమపద్ధతిలో పెట్టుకొనేటందుకు కావలసిన దృక్పథాన్నీ ఇద్దరు విదేశీయులనుంచి – బాహోఫెన్, మోర్గన్లనుంచి – తీసుకోవలసి రావడం వారికి బాధ అనిపిస్తూందో, యేమో. జర్మనీవాడంటే, పోనీ అనుకోవచ్చు కానీ, అమెరికనును సహించడమెలా? అమెరికా దేశీయునిముందు బ్రిటిష్ వాళ్లల్లో దేశభక్త్యావేశం పొంగిపొరలుతుంది. నేను అమెరికాలో వున్నప్పుడు చాల తమాషాయైన

సంఘటనలను చూశాను.[108] దీనికి తోడు, ఇంగ్లండులోని ప్రాచీనచరిత్ర పండితులందరికీ మాక్‌లెన్నాన్ నాయకుడూ, ఆదిపురుషుడూను. శిశుహత్యలు, బహుభర్తృత్వం, రాక్షస వివాహపద్ధతులు, చివరకు తల్లి హక్కు కుటుంబాలను గురించి ఆయన తయారుచేసిన ఊహాజనిత సిద్ధాంతాలను ఎంతో భక్తి విశ్వాసాలతో పునరుచ్చరిస్తుంటారు. బహిర్వివాహ పద్ధతినీ, అంతర్వివాహ పద్ధతినీ అనుసరించే పరస్పర విరుద్ధమైన "తెగలు" వున్నాయంటూ ఆయన చేసిన సిద్ధాంతాన్ని ఎవరన్నా కాదంటే మీదపడిపోతారు. పరమ రెటమతంగా భావిస్తారు. ఆ పవిత్రమైన పిడివాదాలను ఎగరకొట్టేసిన మోర్గన్ వారి దృష్టిలో మహా ఘోరం చేసినట్టే. పైగా, ఆయన తన అభిప్రాయాల్ని బహుసున్నితంగా పెట్టాడు. వాటిని విన్నవాళ్లెవరూ కాదనలేరు; అంతవరకూ బహిర్వివాహ పద్ధతికీ, అంతర్వివాహ పద్ధతికీ వున్న వైరుధ్యంలో కొట్టుమిట్టాడుతున్న మాక్‌లెన్నాన్ భక్తులు ఆ వాదాన్ని వినగానే, ఆశ్చర్యంతో జుట్టు పీక్కోవలసి వచ్చింది. "ఇంత స్వల్పవిషయం ఇంతకాలంగా మన కెందుకు తోచలేదా"యని వాళ్ల ఆశ్చర్యం.

ఈ నేరం చాలదన్నట్లు మోర్గన్ ఫోరియర్ ధోరణిలో నాగరికతను విమర్శించాడు. పెట్టుబడిదారీ సమాజాన్ని విమర్శించాడు. అంతేకాకుండా, యీనాటి సామాజిక వ్యవస్థకు పునాదిగావున్న వర్తకపు సరకుల ఉత్పత్తి పద్ధతిని విమర్శించాడు. కార్ల్ మార్క్స్ వుపయోగించి వుండే మాటలలో భావిసమాజ పరివర్తనను గురించి మాట్లాడాడు. దానితో ఆయన పాప భాండం నిండింది. తగిన శిక్ష లభించింది. మాక్‌లెన్నాన్‌కు ఆయనమీద కోపంవచ్చి "చారిత్రక దృక్పథం" ఆయనలో లేదన్నాడు. జెనీవా నివాసి ప్రొఫెసర్ జిరో-త్యూలోన్ కూడా తర్వాత ఎప్పుడో 1884లో మోర్గన్ గురించి అదే మాట అన్నాడు. నిజానికి మాక్‌లెన్నాన్ తెచ్చిన బహిరంతర్వివాహాల మధ్య చిక్కుపడి యీ జిరో-త్యూలోన్ గిలగిలలాడిపోతూంటే 1874లో ("కుటుంబ ఆవిర్భావం") మోర్గనే ఆయనను బయటకు లాగాడు!

ప్రాచీనచరిత్రలో మోర్గన్ తీసుకొచ్చిన ఇతర మార్పుల్ని గురించి నేను ఇక్కడ రాయడం అనవసరం. అవసరమైనంతవరకు పుస్తకంలోనే ఎక్కడి కక్కడ ప్రస్తావించాను. ఆయన రాసిన ఈ ప్రధాన గ్రంథం వెలువడి అప్పుడే పద్నాలుగేళ్లయింది. ఈ మధ్యకాలంలో ప్రాచీనకాలపు మానవ సమాజ వ్యవస్థను గురించి మన కెన్నో కొత్త సంగతులు తెలిశాయి. మానుష శాస్త్రజ్ఞులు, దేశసంచారులు, ప్రాచీనచరిత్ర పండితులేగాక, వేర్వేరు కాలాలలోని న్యాయశాస్త్రాల్ని ఒకదానితో ఒకటిపోల్చి అధ్యయనం చేస్తున్నవారు కూడా రంగంలోకి దిగారు. అనేక కొత్త సంగతులనూ, ఆలోచనలనూ మనముందు పెట్టారు. దీనిఫలితంగా, కొన్ని విషయాలలో మోర్గన్ ఆలోచనలు తప్పు అని తేలింది. కాని ఆ కొత్త విషయాలేవీ ఆయన చెప్పిన ప్రధానాంశాలను తోసివేయలేదు. ప్రాచీనకాలపు చరిత్రను ఆయన అమర్చిన

క్రమం మొత్తంమీద ఈ నాటికీ చెల్లుబడి అవుతూంది. ఈ మహా ప్రగతికి ఆయన కర్తృత్వాన్ని దాచిన కొద్దీ, అది అధికాధికంగా జనాదరణ పొందుతూందని కూడా మనం చెప్పవచ్చు.*

ఫ్రెడరిక్ ఎంగెల్స్

లండన్, 1891 జూన్ 16

"Die Neue Zeit" పత్రిక, సంపుటి 2, సంచిక 41, 1890–91లోనూ, Friedrich Engels, "Der Ursprung der Familie, des Privateigenthums und des Staats," Stuttgart, 1891 అనే పుస్తకంలోనూ ప్రచురింపబడింది

---

* 1888 సెప్టెంబరులో నేను న్యూయార్కునుంచి తిరిగివచ్చేటప్పుడు ఒక మాజీ కాంగ్రెసు సభ్యుణ్ణి (రోచెస్టరునుంచి ఎన్నుకోబడ్డాడు) కలుసుకున్నాను. ఆయన ల్యూయిస్ మోర్గన్‌ను ఎరుగును. కాని ఆయనను గురించిన విశేషాలేవీ ఎక్కువ చెప్పలేకపోయాడు. రోచెస్టరులో మోర్గను ఒక సాధారణ పౌరుడుగా మాత్రమే, తన చదువేదో తానేదోగా నివసించాడన్నాడు. మోర్గన్ సోదరుడు ఒక సైన్యోద్యోగి, కర్నలు. వాషింగ్టన్‌లోని యుద్ధ శాఖలో పనిచేస్తుండేవాడు. తన సోదరుని సహాయంతో ఆయన తాను చేస్తున్న పరిశోధనల గురించి ప్రభుత్వాధికారులలో ఆసక్తి కలిగేటట్లు చేశాడు. తన రచనలు చాలవాటిని ప్రభుత్వం ఖర్చుమీద ప్రచురించాడు. తాను కాంగ్రెసులో ఉన్నప్పుడు ఈ విషయంలో తాను కూడా సహాయపడ్డానని ఆ మాజీ కాంగ్రెసు సభ్యుడు అన్నాడు. (ఎంగెల్స్ వివరణ.)

# కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం

## ల్యుయిస్ హెచ్. మోర్గన్ పరిశోధనల దృష్ట్యా

## I

## సంస్కృతియొక్క చరిత్రపూర్వ దశలు

మానవజాతి చరిత్రపూర్వ దశను నిశ్చితమైన ఒక క్రమపద్ధతిలోకి తేవడానికి ప్రయత్నించినవారిలో ప్రప్రథముడు మోర్గన్. ఏవన్నా ప్రధానములయిన కొత్త సంగతులు తెలియవచ్చి ఆయన అవలంబించిన వర్గీకరణ పద్ధతిలో మార్పులు తీసుకురావలసిన అగత్యం కలిగితేతప్ప, అదే అమలులో వుంటుందని అనుకోవచ్చు.

ఆటవిక యుగం, అనాగరిక యుగం, నాగరిక యుగం – అనే మూడు ప్రధానమైన యుగాల్లోనూ ఆయన మొదటి రెండు యుగాల్ని గురించీ, అనాగరిక యుగంలోంచి నాగరిక యుగంలోకి పరివర్తన దశను గురించీ మాత్రమే ఎత్తుకున్నాడు. అందులో ఆటవిక, అనాగరిక యుగాలు రెంటినీ ఒక్కొక్కదానిని మూడేసి దశలుగా విభజించాడు: నిమ్న దశ, నడిమి దశ, ఉన్నత దశ. జీవనాధార వస్తువులను ఉత్పత్తి చేసుకొనే పద్ధతిలో మనుష్యుడు పొందిన అభివృద్ధినిపట్టి ఆయన ఈ విభజన చేశాడు. ఏమంటే,

> "ప్రకృతిమీద మనుష్యుని ఆధిక్యత అనేది (జీవనాధార వస్తువుల ఉత్పత్తిలో) అతనికున్న నైపుణ్యంమీదనే ఆధారపడి వుంది. ఆహారోత్పత్తిని పూర్తిగా తన స్వాధీనంలో పెట్టుకోకలిగిన ప్రాణి ఒక్క మానవుడే. జీవనాధార వస్తువుల విస్తరణా, మానవజాతి అభివృద్ధిలో వచ్చిన ప్రధాన యుగాలూ కొంచెం ఇంచుమించుగా కలసి వున్నాయనవచ్చు."*

కుటుంబంయొక్క పరిణామం కూడా వీని పక్కపక్కనే జరుగుతుంది. అయితే, అక్కడ ఆవిధంగా యుగాల్ని విభజించేటందుకు నిశ్చితమైన కొలమానాలు స్పష్టంగా కనబడవు.

---

* మార్క్స్ – ఎంగెల్స్ పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజి 4. – సం.

# 1. ఆటవిక యుగం

1. నిమ్న దశ: ఇది మానవజాతియొక్క శైశవదశ. ఆ దశలో మనుష్యుడు ఇంకా తాను పుట్టిన ఉష్ణ, లేక సమశీతోష్ణ అరణ్యాలలోనే నివసిస్తున్నాడు. కనీసం పాక్షికంగానైనా అతడు చెట్లమీదనే నివసిస్తూవుండేవాడు. అలా కాకపోయివుంటే పెద్ద జంతువుల మధ్య బ్రతికివుండగలగడం అసంభవం. ఆ దశలో అతడు పళ్లు, కాయలు, దుంపలు తిని బ్రతికాడు. శబ్దోచ్చారణలో విస్పష్టత ఈ దశలోనే వచ్చింది. ఆ దశలో ఇదే ప్రధాన విజయం. మన చరిత్ర పరిశోధనకు అందినంతవరకూ ఈ ఆదిమ దశలో నివసిస్తున్న మానవుడు ఎక్కడా కనబడలేదు. ఆ దశ అనేక వేల సంవత్సరాలు కొనసాగి వుండవచ్చు. అయినా, ఇటువంటి దశ ఒకటి వుండేదని నిరూపించడానికి మనవద్ద ప్రత్యక్ష ప్రమాణం ఏదీలేదు; కాని మానవుడు జంతుసముదాయంలోంచి పరిణామం పొందాడనే దానిని మనం అంగీకరించేటట్లయితే, ఈ మాదిరి పరివర్తన దశను కూడా మనం అంగీకరించవలసి వుంటుంది.

2. నడిమి దశ: నిప్పు వుపయోగాన్ని తెలుసుకోవడం, తిండికి చేపలు, పీతలు, నత్తలు మొదలయిన జలచరాల్ని వుపయోగించడంతో ఈ దశ ఆరంభమవుతుంది. ఈ రెండింటికీ చాల దగ్గర సంబంధం వుంది, నిప్పును ఉపయోగించకపోతే చేపలు పూర్తియైన పుష్టి నివ్వలేవు. కొత్తగా లభించిన ఈ పోషకవస్తువుల సహాయంలో మానవుడు శీతోష్ణపరిస్థితులమీదా, ప్రదేశాల ప్రత్యేకతమీదా ఆధారపడనక్కర్లేకుండా స్వతంత్రుడు కాగలిగాడు. ఆటవిక యుగంలోనే అతడు నదుల వెంబడీ, సముద్రతీరాల వెంబడీ అధికతర భూభాగంలో విస్తరించాడు. మనం పాలియోలితిక్ అని పిలిచే పాతరాతియుగపు ఆరంభ దినాలనాటి రాతి పనిముట్లు నేడు ప్రపంచంలో అన్ని ఖండాలలోనూ అక్కడక్కడా కనిపిస్తున్నాయి. ఈ పనిముట్లు చాల మోటుగా, పదునులేకుండా బండగా వుంటాయి. ఇవన్నీ పూర్తిగానో, ప్రధానంగానో ఈ దశకు సంబంధించినవే. ఇవి ఆనాడు మానవుడు వలసపోయాడనడానికి ప్రత్యక్షోదాహరణలు. నూతన పరిసరాలలో మానవుని వస్తునిర్మాణ కౌశల్యానికి నిరంతరం పనికలుగుతూ వచ్చింది. ఒరిపిడినుంచి నిప్పు పుట్టించగలిగాడు. కొత్తకొత్త ఆహారపదార్థాల్ని సంతరించుకోడానికి అది తోడ్పడింది. ఉదాహరణకి పిండి పదార్థం అధికంగా వుండే కందమూలాలు మొదలయిన వాటిని వేడిబూడిద కుమ్ములోనో, నేలపొయ్యిలలోనో వుడకబెట్టడం నేర్చుకొన్నారు. వారు మొదట కనిపెట్టిన ఆయుధాలు గద, ఈటె. వీటి సహాయంతో జంతువులను వేటాడేవారు. అప్పుడప్పుడు అవి తిండికి దొరికేవి. అంతేగాని పుస్తకాలలో చదివే మాదిరిగా కేవలం వేటమీదనే జీవించిన జాతులు నిజానికెన్నడూ లేవు. వేటతో తిండి సంపాదన ఎప్పుడూ అనిశ్చితమే. ఆహారపదార్థాలు

దొరకడం ఎప్పుడూ అనిశ్చితంగా వుండడం కారణంగా బహుశా మనుష్యభక్షణం వచ్చినది ఈ దశలోనే అయివుంటుంది. ఈ అలవాటు ఈ దశనుంచి ఎంతో కాలంవరకూ కొన సాగింది. ఆస్ట్రేలియాలోని ఆదిమవాసులూ, పోలినీషియనులూ* నేడు కూడా ఆటవిక దశలోనే వున్నారు.

3. ఉన్నత దశ: విల్లూ, అంబూ కనిపెట్టడంతో ఈ దశ ఆరంభమవుతుంది. దీని వలన వేటద్వారా ఆహారం సంపాదించగలగడం నిత్యసాధ్యం అయింది. వేట నిత్యకృత్యాలలో ఒకటయింది; అత్యంత సమీకృత సాధనమైన విల్లు, నారి, అంబు అనేక విషయాల పరిజ్ఞానంతో మాత్రమే నిర్మించగల పనిముట్టు. దీనిని నిర్మించుకోగల వారికి విశేషమయిన అనుభవం, నిశితమైన ఊహాజ్ఞానం ఉందనే అనుకోవాలి. కుండలు చేయడం నేర్పు లేకపోయినా విల్లంబులు కనిపెట్టిన నాటినుంచే అతడు గ్రామాలలో స్థిరపడడం ఆరంభం అయినట్లు జీవనాధార వస్తువుల ఉత్పత్తిమీద మరింత ఆధిపత్యం లభించినట్లు మనకి కనిపిస్తుంది. (కుండలు చేయడం నేర్చుకోవడంతో మానవుడు ఆటవిక దశనుంచి అనాగరికదశలోకి మారడం ప్రారంభమవుతుందని మోర్గన్ అభిప్రాయం.) ఈ దశలో అతడు కర్రతో పాత్రలు, వంటపాత్రలు తయారుచేసినట్లు, చెట్లబెరడునుంచి నారతీసి, చేతితో వల్కాలాలు తయారు చేసుకొన్నట్లు (వారికింకా మగ్గం తెలియదు), నారపట్టతో, చువ్వలతో బుట్టలు అల్లి నట్లు, రాతిపనిముట్లకు పదునుపెట్టినట్లు (నియోలిథిక్) మనకు కనబడుతూంది. నిప్పు కనిపెట్టడం, రాతి గొడ్డలిని సంపాదించడంతో బుర్రదోనెలు సర్వసాధారణం అయి నాయి. కొన్నికొన్ని చోట్ల దూలాలూ, వాసాలతో ఇళ్లుకట్టడం కూడా నేర్చుకొన్నారు, ఉదాహరణకి అమెరికా వాయవ్యభాగంలోని ఇండియను**లకు ఇవన్నీ తెలుసు. వారు కుండలు చేయడం ఎరగరు; కాని, విల్లంబులు ఎరుగుదురు, ఇనుపకత్తి అనాగరిక మానవుడికీ, మందు గుండు నాగరిక మానవుడికీ ప్రధానాయుధం అయినట్టే విల్లంబులు ఆటవికుని ఆయుధం.

## 2. అనాగరిక యుగం

1. నిమ్న దశ: కుండలువాడకంలోకి రావడంతో ఈ దశ ఆరంభమవుతుంది. బుట్టలూ, కర్ర గిన్నెలూ పొయ్యిమీద పెడితే కాలి పోకుండేటందుకు వానికి మట్టిపూత

* పసిఫిక్ మహాసముద్రంలో అనేక ద్వీప సముదాయాలున్నాయి. వానిని పోలినీషియా అంటారు. వానిలోని ప్రజలు పోలినీషియనులు. — సం.

** తూర్పు ఇండియా దీవుల్లోనూ, పశ్చిమ ఇండియా దీవుల్లోనూ, అమెరికాలోనూ వున్న ఆదిమవాసుల్ని రెడ్ ఇండియను లంటారు. — సం.

పెట్టే అలవాటు వచ్చివుంటుంది. లోపలపాత్ర ఏదీ అవసరం లేకుండా, మట్టి అచ్చుతోనే పనిగడుస్తుందని ఆ తర్వాత త్వరలోనే కనిపెట్టి వుంటారు.

ఇంతవరకూ యీ పరిణామక్రమం, ఒక నిర్దిష్ట దశలో, వారు ఏ ప్రాంతంలో నివసించారన్న దానితో ప్రసక్తిలేకుండా, అన్ని ప్రజా సమూహాలకూ సాధారణంగా వర్తిస్తుందని మనం అనుకోవచ్చు. అయితే, అనాగరిక యుగం ఆరంభం కావడంతో, మనుష్యుని అభివృద్ధిలో మలుపులు కనబడ్డాయి. ఇక్కడినుంచి ప్రపంచంలోని రెండు ఖండాల ప్రకృతి సంపదలలో వున్న వైవిధ్యం అక్కడక్కడుండే ప్రజల అభివృద్ధి పథాన్ని నిర్ణయించసాగింది. పశువుల్ని మచ్చికచేసి పెంచటమూ, మొక్కా — మొటికా పెంచడమూ అనాగరిక యుగంలోని ప్రత్యేక లక్షణాలు. ప్రాచీన ప్రపంచం అనబడే ప్రాచ్యఖండంలో దాదాపుగా మనుష్యుడు మచ్చికచేసుకోగల జంతువులన్నీ వున్నాయి. ఒక్కటి మినహా వ్యవసాయానికి పనికివచ్చే మిగిలిన కాయధాన్యాలన్నీ వున్నాయి. పశ్చిమ ఖండంలో — అమెరికాలో — మచ్చికయ్యే జంతువు ఒక్క లామ మాత్రమే వుంది. అదైనా దక్షిణాన ఏవో కొన్ని ప్రదేశాలలో మాత్రమే వుంది. వ్యవసాయానికి అనుకూలమైన ధాన్యాలలో ఉత్తమం అయిన మొక్కజొన్న ఒక్కటే ఆ భూభాగంలో వుంది. ప్రాకృతిక పరిస్థితులలో వున్న ఈ వైవిధ్యం కారణంగా భూగోళ భాగాలు రెండింటిలోనూ వుండే ప్రజ ఎవరిదారి వారు తొక్కారు; ప్రతి ఖండంలోనూ ఆయా అభివృద్ధి దశలను గుర్తించడానికై వేరువేరు సరిహద్దుగుర్తులు కనిపిస్తాయి.

2. <u>నడిమి దశ</u>: తూర్పుగోళ భాగంలో పశువుల్ని మచ్చికచేయడంతో ఈ దశ ఆరంభమవుతుంది. ఆహారం కోసం నీటిపారుదల ద్వారా మొక్కల్ని పెంచి వ్యవసాయం చేయడంతో, పచ్చి ఇటికల్ని, రాళ్లనీ వుపయోగించి ఇళ్లు కట్టుకోవడంతో పశ్చిమార్ధగోళంలో ఈ దశ ఆరంభం అవుతుంది.

మన సమాలోచనను పశ్చిమార్ధగోళంనుంచి మొదలుపెట్టుకొద్దాం. ఎందుకంటే, యూరపియనుల ఆక్రమణ కాలందాకా అక్కడి ప్రజలు ఈ అభివృద్ధి దశను దాటి యెక్కడా ముందుకు సాగలేదు.

ఇండియన్లు కనుగొనబడేనాటికి, వారు అనాగరిక యుగపు నిమ్న దశలో వున్నారు (మిసిసిపీ నదికి తూర్పున నివసిస్తున్న వారందరూ అదే దశలో వున్నారు). వారు కొంత వరకు అప్పటికే మొక్కజొన్న, బహుశా, గుమ్మడి, పుచ్చ, యితర తోటపంటలు కూడా సాగుచేస్తున్నారు. వారి ఆహారంలో అధికభాగం యివే. వాళ్లు నివసించే యిళ్లు బల్లకూర్పు చేసినవి. గ్రామాల చుట్టూ వాడి గసిగలు పాతి కోరళ్లు తీర్చారు. కాని, వాయవ్య ప్రాంతంలోని తెగలు, ప్రత్యేకించి కొలంబియా నదీప్రాంతాల వారింకా ఆటవిక యుగపు పైదశలోనే వున్నారు. కుండలు చేయడంకాని, మొక్కలు పెంచడంగాని వారికి తెలియదు. రెండోవేపున

అమెరికా ఆక్రమణ నాటికి న్యూ మెక్సికోలోని "పుయేబ్లో" ఇండియన్లూ,* మెక్సికన్లూ, పెరూ నివాసులూ, మధ్య అమెరికా వాసులూ అనాగరిక యుగపు నడిమి దశలో వున్నారు. పచ్చి ఇటికలతోనో, రాతితోనో కట్టిన కోటలవంటి యిళ్లల్లో వారు కాపురం వున్నారు. ఎక్కడినించో నీరుపారించి మడులుకట్టి, ఆయా ప్రాంతాలనుబట్టీ, వాతావరణాన్నిబట్టీ మొక్కజొన్నో, ఇతర మొక్కలో పైరు చేస్తున్నారు, వారి ఆహారంలో అధికభాగం యివే, వీరు కొన్ని జంతువుల్ని కూడా మచ్చికచేశారు. మెక్సికన్లు టర్కీ కోళ్లని, తదితర పక్షుల్నీ పెంచుతున్నారు. పెరూవియన్లు లామని పెంచుతున్నారు. వారు ఇనుము నెరగరు. కాని కొన్ని ఇతర లోహాల్ని యెరుగుదురు. దాని ఫలితంగా వారింకా రాతి ఆయుధాలనూ, రాతి పనిముట్లనీ విడువలేకపోయారు. స్పానిష్ ఆక్రమణతో స్వతంత్రంగా అభివృద్ధి పొందే అవకాశాలన్నీ నశించిపోయాయి.

ఇక పూర్వార్ధగోళంలో పాలకూ, మాంసానికీ పనికివచ్చే జంతువుల్ని మచ్చికచేయటం ప్రారంభించిన నాటినుంచీ, అనాగరిక యుగపు నడిమి దశ ఆరంభమవుతుంది. ఈ దశలో చాలాకాలం గడిపినాకగాని ఇక్కడివారు మొక్కల పెంపకం నేర్చినట్లు కనబడదు. ఆర్యులూ, సెమైట్లూ** జంతువుల్ని మచ్చికచేసి, పెద్దపెద్ద మందల్ని పెంచారు. ఇతర అనాగరిక

---

* పుయేబ్లో – న్యూ మెక్సికో ప్రాంతంలో (ప్రస్తుతం నైరుతి అమెరికా, ఉత్తర మెక్సికో) నివసించిన ఉత్తర అమెరికాకు చెందిన ఇండియన్ తెగల బృందం. ఈ తెగలకు ఉమ్మడి చరిత్రా, సంస్కృతీ వుండేవి. వాటికి యీ పేరు పుయేబ్లో (ఒక ప్రజా సమూహం, సంఘం, గ్రామం) అన్న స్పానిష్ పదం (pueblo)నుంచి వచ్చింది. ఈ పేరును స్పానిష్ వలసదారులు యీ ఇండియన్లకూ, వారి గ్రామాలకూ అనువర్తింపచేశారు. వారు చుట్టూ గోడలచేత పరిరక్షింపబడిన 5 లేక 6 అంతస్తుల పెద్ద సామూహిక గృహాల్లో నివసించేవారు. అటువంటి ఒక్కొక్క యింటిలో కొన్ని వేలమంది నివసిస్తూండేవారు. – సం.

** భాస్కులు, తురుష్కులు, మాగ్యార్లు, ఫిన్నిషు, మరికొంత మందీ తప్ప ఇతర యూరపియనులూ, అర్మీనియా, పర్షియా ఉత్తర హిందూస్థానంలోని ప్రజలూ ఆర్యను జాతులుగా పేర్కొనబడతారు. ప్రాచీనకాలపు పర్షియాదేశపు తూర్పుభాగంలో "అరియానా," లేక "అరియా" అనే ప్రాంతం వుండేది. అక్కడినుంచే ఆర్యనులు నలు మూలలకు చెదిరి ప్రయాణించేరని చెప్తారు. ప్రస్తుతం పర్షియాకుపయోగించే "ఇరాన్" అనేది కూడా ఈ మాటనుంచే వచ్చింది.

సెమ్ అనే పూర్వపురుషుని వంశంవారు. ప్రధానంగా యూదుల్ని ఇప్పుడీ పేరుతో పిలుస్తారు. అస్సీరియన్, హీబ్రూ, ఫోనీషియన్, అరబిక్, ఇథియోపిక్ భాషల్ని సెమైటిక్ భాషలని పిలుస్తారు. – సం.

ప్రజలకన్న వారు ముందుకుపోవడానికి కారణమిదేననిపిస్తుంది. యూరపు ఆసియాలలోని ఆర్యనులు నేటికీ పశువులకు ఒకే పేర్లను వాడుతున్నారు. కాని సాగుచేస్తున్న మొక్కలకు మాత్రం దాదాపు ఎప్పుడూ వేర్వేరు పేర్లున్నాయి.

పశువుల మందల పెంపకం వారు అనువైన చోట్ల పచ్చిక మైదానాలలో పశుపాలకులుగా జీవించడానికి దారితీసింది. యూఫ్రటిస్, టైగ్రిస్ నదీతీరాలలోని పచ్చికబీళ్ళలో సెమైట్లూ, భారతదేశపు నదీ తీరాలలోనూ, ఒక్సస్, యక్సార్టస్ నదుల తీరాలలోనూ, దోన్, డ్నీపర్[109] నదీ తీరాలలోనూ వున్న పచ్చిక బీళ్లలో ఆర్యను తెగలూ ఇల్లాగే జీవించారు. బహుశా అటువంటి బీళ్ల ప్రాంతంలోనే వారు పశువుల్ని మచ్చికచేయడం మొదట నేర్చుకుని వుంటారు. తత్ఫలితంగా తర్వాతి తరాలవారికి యీ బీళ్లలో నివసిస్తున్న పశుపాలక గుంపులు ఆ పచ్చిక ప్రాంతాలలోనే పుట్టినారనిపించివుంటుంది. కాని, నిజానికి యీ బీడుభూములలో మానవజాతి జన్మించే అవకాశం లేదు. వారి పూర్వీకులయిన ఆటవిక మానవులకుగాని, ఆఖరుకు అనాగరిక యుగపు నిమ్న దశలో వున్నవారికిగాని యీ మైదానాలు ఏమాత్రమూ నివాసయోగ్యాలు కావు. పైగా నదీతీరాలలోని పచ్చికమైదానాల జీవితానికో మాటు అలవాటుపడ్డాక అనాగరిక యుగపు నడిమి దశలో వున్నవారికి తమ పూర్వులు పుట్టిపెరిగిన ఆ అరణ్యాలలోకి పోవడం స్వభావసిద్ధంగా అంగీకార యోగ్యమై వుండదు. ఆర్యన్లూ, సెమైట్లూ ఒకప్పుడు పశ్చిమ దిశకూ, ఉత్తరంవేపూ తరలిపోవలసివచ్చింది. అప్పుడైనా పశ్చిమాసియాలోనూ, యూరపులోనూ వున్న అరణ్యభూములలో పోడుకొట్టి కాయధాన్యాలు సాగుచేసి పశువులమేత కూర్చుకున్నారు. అననుకూలమైన ఆ ప్రాంతాలలో శీతాకాలపు చలిలో మందల్ని రక్షించుకొనేటందుకు అవకాశం ఉండేది. అప్పుడుగాని వారు అటువేపు కదలనే లేదు. ఈ గుంపులవాళ్ళు పశువుల మేతకోసమే మొదట కాయధాన్యాలు పండించారు. తర్వాతనే అవి మనుష్యుడి ఆహారంలో ప్రధానభాగం అయ్యాయి.

పాలూ, మాంసమూ బిడ్డల పెరుగుదలకు బాగా తోడ్పడతాయి. అవి రెండూ సమృద్ధిగావున్న ఆర్యన్, సెమైటిక్ ప్రజలు అధిక అభివృద్ధిపొందారంటే బహుశా అవే కారణం అయి వుండొచ్చు. అనాగరిక యుగపు నిమ్న దశలో వున్న ఇండియన్లు దాదాపుగా చేపలూ, మాంసం మాత్రమే తినేవారు. అదే దశలో వున్న న్యూ మెక్సికోలోని పుయేబ్లో ఇండియన్లు యించుమించు పూర్తిగా శాకాహారులు. అనాగరిక యుగపు నిమ్న దశలో వున్న మత్స్య మాంసాలు అధికంగా తినే ఇండియన్ల మెదడుకన్న పుయేబ్లో ఇండియన్ల మెదడు చిన్నది. ఏది ఎలా వున్నా మనుష్య భక్షణం ఇప్పటినుండే క్రమంగా అంతరించిపోయింది. కేవలం ఒక మతాచారంగానో, ఇంద్రజాలానికి సాధనంగానో (ఈ దశలో ఇంద్రజాలం కూడా మతాచారాలతో ఇంచుమించు సమానమైనదే) మాత్రమే అది మిగిలిపోయింది.

3. ఉన్నత దశ: ముడి ఇనుమును కరిగించి పోతపోయడం నేర్చుకొన్న నాటినుంచీ

ఈ దశ ఆరంభమవుతుంది. అక్షరాల సంకేతాలను పెట్టుకొని, వాటిని సాహిత్య రచన కుపయోగించడంతో నాగరిక యుగం ఆరంభమవుతుంది. మానవ సమాజ పరిణామంలో ఇంతవరకూ కడిచిన దశలన్నింటిలోను జరిగిన ఉత్పత్తి కన్నా ఈ దశలోని ఉత్పత్తి చాలా హెచ్చు. ఒక్క పూర్వార్ధగోళంలో మాత్రమే సమాజం ఈ దశను దాటి ముందుకి పోయిందని పైన మనం తెలుసుకున్నాం. వీర యుగంనాటి గ్రీకులు, రోము నిర్మాణానికి ముందునాటి ఇటాలియన్ తెగలు, టాసిటస్ కాలంనాటి జర్మనులు, వైకింగ్ యుగంనాటి నార్మన్లు* ఈ దశకు చెందినవారే.

అన్నింటికన్నా ముఖ్యంగా ఇనపచక్రరు వేసిన నాగలి — పశువులచే లాగబడేది — మనకీ దశలోనే కనబడుతుంది. దీని సహాయంతో విస్తృతంగా వ్యవసాయం సాగించడానికీ, పొలాలలో సాగుచేసే పద్ధతిని ప్రవేశపెట్టడానికీ వీలుచిక్కింది. ఆ విధంగా అంతర్కితంకన్న ఆహార పదార్థాలు అపరిమితంగా దొరకడానికి వీలుచిక్కింది. దీనితోబాటు అడవులు పోడు కొట్టి బాగుచేసి సాగుభూమిని, బీటిభూమిని తయారుచెయ్యడం అవసరమైంది. ఆ పని విస్తారంమీద జరగాలంటే ఇనపగొడ్డలీ, ఇనుప పలుగూ లేనిదే సాధ్యంకాదు. కాని దీనితో బాటు జనాభా వేగంగా పెరిగింది. చిన్నచిన్న ప్రదేశాలలో జనసమ్మర్దం ఎక్కువయింది. భూముల్ని దున్ని సాగులోకితీసుకురాక పూర్వం చాల అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే అయిదు లక్షల జనాభా ఒక కేంద్ర నాయకత్వం కింద ఏకమై వుండగలిగేది. బహుశా అటువంటి దెన్నడూ జరిగి వుండకపోవచ్చు కూడా.

హోమర్ గీతాలలో, ముఖ్యంగా "ఇలియడ్"లో అనాగరిక యుగపు ఉన్నత దశయొక్క వికాసం మనకు గోచరిస్తుంది. ఆ నాటికి ఇనుప పనిముట్లు బాగా వృద్ధిచెందాయి. కొలిమితిత్తులు, చేతిమరలు, కుమ్మరిసారె ఉపయోగించారు. నూనె తియ్యడం, సారాయి కాచడం తెలుసుకున్నారు. లోహ పరిశ్రమ ఒక కళగా వృద్ధిపొందింది. బండి, యుద్ధరథాలూ వచ్చాయి. పలకలతోనూ, దూలాలతోనూ ఓడల్ని నిర్మించారు. వాస్తువిద్య ఒక కళగా మారుతూంది, బురుజులూ, గోపురాలతో దుర్గనగరాలు కడుతున్నారు. హోమరు కావ్యాలూ, మహా పురాణాలూ

---

* వైకింగులు — స్కాండినేవియన్ ఓడదొంగలు, నావికులు. యూరపియన్ దేశాల తీరాలపై వీరు దాడులు జరిపి దోపిళ్లు చేస్తూండేవారు. 8వ శతాబ్దపు చివరి భాగానికీ 11వ శతాబ్దపు మధ్యభాగానికీ మధ్యకాలంలో ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం గుండా వీరు అమెరికాదాకా పయనించారు.

నార్మన్లు — ఉత్తర యూరపులో స్థిరపడిన స్కాండినేవియన్ తెగలు. మధ్యయుగపు తొలి సంవత్సరాల్లో, యీనాటి నార్వీజియన్లకూ, స్వీడ్‌లకూ, డేనులకూ ఉమ్మడిగా యీ పేరు వాడబడుతూవుండేది. — సం.

రాయబడ్డాయి. గ్రీకులు అనాగరిక యుగంనుంచి నాగరిక యుగంలోకి పరివర్తనచెందే క్రమంలో తెచ్చుకొన్న పెన్నిధులు యివి. సీజరూ, టాసిటసూ వర్ణించిన జర్మనులతో హోమరు వర్ణించిన గ్రీకుల్ని పోల్చిచూస్తే అనాగరిక యుగపు ఉన్నత దశలో ఉత్పత్తి ఎంత ఎక్కువగా వృద్ధిపొందిందో మనకు అర్థం అవుతుంది. ఆనాటికి జర్మనులు అనాగరిక యుగపు ఉన్నత దశలో అడుగుపెడుతున్నారు. హోమరునాటి గ్రీకులు ఆ దశను గడిచి ముందుకు అడుగు వేస్తున్నారు.

మానవజాతి ఆటవికదశనుంచి అనాగరిక యుగం గుండా నాగరిక దశయొక్క తొలి ఘట్టాలకు ఎలా చేరుకుందో మోర్గన్‌ను అనుసరించే నేనిక్కడ సంగ్రహంగా వర్ణించాను. ఇందులో ఎన్నో కొత్త అంశాలు మనకు కనిపిస్తాయి. వాటన్నింటినీ ఉత్పత్తిలో వచ్చిన అభివృద్ధిని అనుసరించి సరాసరి తీసుకోవడంచేత యెవ్వరూ వానిని కాదనడానికి వీలుండదు. కాని ఈ పుస్తకం ఆఖరయ్యేసరికి నేను వివరించబోతున్న దానితో పోల్చిచూస్తే మాత్రం యిది పేలవంగానూ, అరకొరగానూ కనబడక మానదు. ఏమంటే, ఆఖరుకిగాని, అనాగరిక యుగంనుంచి — నాగరిక యుగానికి పరివర్తన, వాటిమధ్యగల విస్పష్ట వ్యత్యాసం సంపూర్ణంగా కనబడదు. ప్రస్తుతానికి మోర్గన్ చేసిన విభజనని యీ విధంగా క్లుప్తీకరించ వచ్చు: ఆటవిక యుగం — ప్రకృతి ప్రసాదించిన వస్తువుల్ని వాని సహజస్థితిలోనే అనుభవించడం ఆటవిక యుగపు ప్రధాన లక్షణం. మానవుడు తయారుచేసుకొనే వస్తువులు ప్రధానంగా ఆ అనుభవానికి సాయపడేవిగా వుంటాయి. అనాగరిక యుగం — ఈ యుగంలో మానవుడు పశువుల్ని మచ్చికచేసి పెంచడం నేర్చుకున్నాడు. వ్యవసాయం ఆరంభించాడు. ప్రకృతి దత్తాలయిన వస్తువుల ఉత్పత్తిని మానవశక్తి ద్వారా అధికంచేసే మార్గాలు నేర్చుకున్నాడు. నాగరిక యుగం — ఈ యుగంలో మానవుడు ప్రకృతి ప్రసాదించిన వస్తువులమీద, పరిశ్రమలపైన, కళలపైన యింకా అధికంగా పనిచేసే పరిజ్ఞానం సంపాదించుకున్నాడు.

# II

## కుటుంబం

మోర్గన్, ఈనాటికీ న్యూయార్కు రాష్ట్రంలో నివసిస్తున్న ఇరాక్వా ఇండియన్ల మధ్య తన జీవితంలో అధికభాగాన్ని గడిపాడు. వారి తెగలలో ఒకటైన సెనెకాలలోకి దత్తు పోయాడు కూడా. అతడు వారి వాస్తవ కుటుంబ సంబంధాలకు విరుద్ధమైన రక్త సంబంధాల వ్యవస్థ వారిలో అమల్లో వున్నట్లు కనుగొన్నాడు. వారిలో ఒక విధమైన దంపతీ (ఏక భార్య, ఏక భర్తృత్వ) పద్ధతి అమలులో వుంది. అయితే భార్యాభర్తలలో ఏ

ఒక్కరైనా సులభంగా ఆ బంధాన్ని తెంచివేసుకోవచ్చు. దానికి ఆయన "జంట కుటుంబం" అని పేరుపెట్టాడు. వారికి కలిగిన సంతానం ఏ జంట తాలూకు పిల్లలో అందరికీ తెలుస్తుంది. అలాగే గుర్తిస్తారు కూడా. తండ్రి, తల్లి, కొడుకు, కూతురు, తోబుట్టినవాడు, తోబుట్టువు ఎవరో, ఆ పేర్లతో ఎవర్ని పిలవాలో సందేహించవలసిన అవసరం వుండదు. కాని యీ పదాల వాడకం భిన్నంగా వుంది. ఇరాక్వ్యా మగవాడు తన బిడ్డల్నేగాక తన సోదరుల పిల్లల్ని కూడా తన కొడుకులు, తన కూతుళ్లు అని పిలుస్తాడు. వారు కూడా అతనిని తండ్రి అనే అంటారు. కాని అతడు తన తోబుట్టువుల బిడ్డల్ని మాత్రం మేనల్లుళ్ళు, మేనకోడళ్లు అంటాడు. వారు అతన్ని మామ అంటారు. రెండోవేపున ఇరాక్వ్యా స్త్రీ తన అక్కచెల్లెళ్ల బిడ్డల్ని కూడా తన పిల్లలతోపాటు తన కొడుకులూ, తన కూతుళ్లూ అనే పిలుస్తుంది. వారు కూడా ఆమెను తల్లి అని పిలుస్తారు. కాని ఆమె తన అన్నదమ్ముల బిడ్డల్ని మేనల్లుళ్లు, మేనకోడళ్లు అంటుంది. వారామెను అత్త అంటారు. అదే విధంగా అన్నదమ్ముల బిడ్డలు ఒకరినొకరు అన్నలూ, తమ్ములూ అని పిలుచుకుంటారు, అక్కచెల్లెళ్ల సంతానం కూడా అంతే. కాని, స్త్రీయొక్క సంతానమూ ఆమె సోదరుల సంతానమూ ఒకరికొకరు బావలు, వదినలు — ఇవన్నీ వట్టి పదాలు మాత్రమే అనుకోకూడదు, ఇవి స్వ—పర భావాన్నీ, రక్తసంబంధాలలో వున్న సమానత్వ —అసమానత్వాల్నీ చూపిస్తాయి. పూర్తి సమగ్రమైన రక్తసంబంధ వ్యవస్థకు ప్రాతిపదికగా ఉపయోగపడతాయి. ఒకే మనిషికి వందలకొలది మందితో వున్న బాంధవ్య భేదాల్ని ప్రకటించగలిగిన ఇంకో విశేషం కూడా ఉంది. అమెరికాలోని ఇండియను తెగలవారందరిలో మాత్రమే గాకుండా (ఇంతవరకు మరొక వ్యవస్థ ననుసరించేవారు అక్కడ కనబడలేదు), భారతదేశంలోని ఆదిమవాసులలోనూ, దక్షిణ భారతంలోని ద్రవిడ తెగల్లోనూ, హిందూ స్థానంలోని గౌర* తెగల్లోనూ ఈ వ్యవస్థ యించుమించు యథాతథంగా అమలులో వుంది. దక్షిణ భారతదేశంలోని తమిళులలోనూ, న్యూయార్కు రాష్ట్రంలోని సెనెకా ఇరాక్వ్యాలలోనూ రెండు వందల బంధుత్వాలవరకూ యీనాటికి కూడా సమానంగా కనిపిస్తాయి, అమెరికాలోని ఇండియను లందరిలో మాదిరిగానే భారతదేశంలోని యీ తెగలలో కూడా రక్తసంబంధాల వ్యవస్థకీ, అమలులో వున్న కుటుంబ రూపానికీ వైరుధ్యం వుంది.

దీనికి కారణం ఏమిటి? ఆటవిక, అనాగరిక యుగాలలో వున్న ప్రజాసమూహాలన్నింటి సామాజిక వ్యవస్థలోనూ రక్తసంబంధాలకు నిర్ణయాత్మకమైన ప్రాముఖ్యం వుంది. అందుచేత చాలా ప్రాంతాలలో విస్తరించివున్న ఈ వైరుధ్యాన్ని కేవలం మాటలతో తోసిపుచ్చడం సాధ్యంకాదు. అమెరికా అంతటిలోనూ సర్వసాధారణంగా వున్న యీ వ్యవస్థ అక్కడి జాతు

* గౌరులు (లేక గౌడులు) — పశ్చిమ బెంగాల్లోని తెగలు. — సం.

లతో ఏ విధమైన సంబంధమూలేని ఆసియా ప్రజలలో కూడా వుంది. ఆఫ్రికా, ఆస్ట్రేలియాలలో కూడ సర్వత్రా కొద్ది మార్పులతో యీ వ్యవస్థే కనబడుతూంది. కనక దానిని ఒక చారిత్రక క్రమంలో వివరించాలే గాని, మాక్‌లెన్నాన్ వివరించ ప్రయత్నించిన మాదిరిగా ఏదో చెప్పెయ్యకూడదు. తండ్రి, బిడ్డ, కొడుకు, కూతురు మొదలయిన పదాలు కేవలం పిలవడానికి ఉపయోగపడేవి మాత్రమే కాదు, స్పష్టమైన, చాల ఖచ్చితమైన పరస్పర బాధ్యతలు వానిలో యిమిడివున్నాయి. మన మిప్పుడు చర్చిస్తున్న యీ ప్రజల సామాజిక వ్యవస్థలో యీ మొత్తం బాధ్యతలకు చాల ప్రాముఖ్యం వుంది. చివరకు దీనికి సమాధానం కూడా దొరికింది. సాండ్విచ్ ద్వీపాలలో (హవాయ్) 19వ శతాబ్దం ప్రథమార్ధ భాగం నాటికి ఒక విధమైన కుటుంబపద్ధతి అమలులో వుంది. ఆ కుటుంబంలోని తల్లి, తండ్రి, సోదరులు, తోబుట్టువులు, కొడుకులు, కూతుళ్లు, మేనమామలు, మేనత్తలు, మేనల్లుళ్లు మేనకోడళ్లు సరిగ్గా అమెరికను ఇండియనుల, ప్రాచీన భారతీయుల రక్తసంబంధాలలో సూచించబడుతున్న పద్ధతిలోనే ఉన్నారు. అయితే ఇక్కడ మరొక్క తమాషా వుంది. అక్కడ అమలులో వున్న రక్తసంబంధాల వ్యవస్థకీ, ఆనాడున్న కుటుంబ రూపానికీ సంబంధం లేదు. హవాయ్ దీవులలో వున్న రక్తసంబంధ వ్యవస్థ ప్రకారం అక్కచెల్లెళ్ల, అన్నదమ్ముల బిడ్డలందరూ ఒకరి కొకరు అన్నదమ్ములూ, అక్క చెల్లెళ్లూను. వారు తమ తల్లిదండ్రులకీ, తల్లి తోబుట్టువులకీ, తండ్రి సోదరులకీ మాత్రమే ఉమ్మడి బిడ్డలు కాక, తల్లిదండ్రులు ఇద్దరి తోడ బుట్టినవాళ్లకీ, తోబుట్టువులకీ కూడా ఉమ్మడి బిడ్డలు గానే పరిగణించబడుతారు. అమెరికాలోని రక్తసంబంధాల వ్యవస్థ ఒక ప్రాచీన కుటుంబ రూపాన్ని సూచిస్తూంది. కాని ఆ కుటుంబ రూపం మాత్రం అక్కడ అదృశ్యం అయింది. అయితే అటువంటిది హవాయ్ ద్వీపాలలో కనపడింది. కాని ఆ ద్వీపవాసుల రక్తసంబంధ సంప్రదాయం చూస్తే అంతకన్నా ప్రాచీనమైన మరో కుటుంబ రూపం కనబడుతుంది. ఆ కుటుంబ రూపం ఈనాడు ఎక్కడన్నా అమలులో ఉన్నట్లు చూపించలేము. కాని, అటువంటిది ఒకప్పుడు వుండితీరాలి; లేకుంటే, అక్కడ కనిపించే రక్తసంబంధ వ్యవస్థ లాంటిది ఉద్భవించి వుండేది కాదు.

> "కుటుంబం అనేది నిత్యం మారుతూ వుంటుంది. అదెప్పుడూ స్థిరంగా వుండదు. సమాజం నిమ్న దశనుండి ఉన్నత దశకు మారుతూన్న కొద్దీ అది కూడా నిమ్న దశనుండి ఉన్నత దశకు పురోగమిస్తూ వుంటుంది.... కాని కుటుంబ సంబంధాల వ్యవస్థ అలాకాదు, అది మారదు. చాలా కాలానికోమారు, కుటుంబంలో వచ్చిన ప్రధానమయిన మార్పుల్ని అది నమోదు చేస్తూంటుంది. కుటుంబ వ్యవస్థ గణనీయంగా మారినప్పుడు అదీ మారుతుంది. అంతవరకు అది మారదు" అని మోర్గన్ రాశాడు.

"రాజకీయ, న్యాయ, మత, తాత్విక వ్యవస్థల విషయంలో కూడా సాధారణంగా ఇంతే జరుగుతుంది"* అన్నాడు మార్క్స్. కుటుంబం మనుతూవుంటే రక్త సంబంధ వ్యవస్థ కరడుకట్టిపోతుంది. రక్తసంబంధాలు సాంప్రదాయంగా నిలబడిపోయి వుంటే, కుటుంబం దానిని అధిగమించి విస్తరిస్తుంది. పారిస్ సమీపంలో దొరికిన ఒక జంతువుయొక్క అస్థిపంజరంలోని, మార్సూపియాలియా ఎముకను పట్టి కువ్యే అది కంగారూ జాతి సస్తన జంతువుదనీ, అది ఇప్పుడు అంతరించిపోయినా ఆ జాతి జంతువు ఒకప్పుడు అక్కడ వుండేదనీ నిర్ధారణ చేశాడు. అలాగే మనం కూడా చరిత్రలో మాత్రమే మిగిలి పోయిన రక్తసంబంధ వ్యవస్థను పట్టి, దానికి సరిపడే కుటుంబ రూపం ఒకప్పుడక్కడ వుండేదని ఖచ్చితంగా చెప్పగలుగుతాం.

పైన మనం చర్చించిన రక్తసంబంధ వ్యవస్థలు, కుటుంబ రూపాల ప్రకారం ప్రతి బిడ్డకూ ఒకరికంటే ఎక్కువమంది తండ్రులూ, తల్లులూ కనిపిస్తారు. ఈనాడున్న వాటికీ వాటికీ వ్యత్యాసం వుంది. అమెరికను రక్తసంబంధ వ్యవస్థతో హవాయియనుల కుటుంబ పద్ధతి సరిపోతుంది. ఆ అమెరికను రక్తసంబంధ వ్యవస్థను బట్టి సోదరీ సోదరులు ఒకే బిడ్డకి తల్లిదండ్రులు కాజాలరు. కాని అందుకు భిన్నంగా హవాయియనుల రక్తసంబంధ వ్యవస్థ సరిగ్గా అల్లాంటి కుటుంబాన్నే సూచిస్తూంది. మనముందు అనేక కుటుంబ పద్ధతులు ఒకదాని తర్వాత మరొకటి రూపొందడం కనిపిస్తుంది. ఇవి ఇంతకుముందు ఏకైక మాత్రంగా అమల్లో ఉన్నట్లు అంగీకరింపబడ్డ ప్రతి కుటుంబ రూపానికీ భిన్నమైనవి. ప్రస్తుతం మనం సాంప్రదాయసిద్ధంగా ఏకభార్య, ఏకభర్తృత్వాన్నే అంగీకరిస్తాం. ఒక పురుషుడు ఎక్కువమంది భార్యల్ని కట్టుకొన్నా, ఒక స్త్రీ ఎక్కువమంది భర్తల్ని కలిగి వున్నా మనం దానిని దాచిపుచ్చుతాం. సమాజం విధించిన ఈ హద్దులు సిగ్గూ శరమూ లేకుండా అతిక్రమింపబడుతున్నా, వాటిని నీతిబోధచేసే కుసంస్కృతీ పరుల్లాగ మనం గూడా దాటవేస్తున్నాం. కాని ఆదిమ చరిత్రను అధ్యయనంచేస్తే ఏకకాలంలో స్త్రీలు బహుభర్తృత్వాన్నీ, పురుషులు బహుభార్యాత్వాన్నీ అవలంబించిన రోజులున్నాయనీ, అందుచేత బిడ్డల్ని అందరూ ఉమ్మడి బిడ్డలుగానే పరిగణించేవారనీ బోధపడుతుంది. ఈ పరిస్థితులు ఎన్నో మార్పులు పొందిపొంది చివరకు ఏకభార్యా, ఏకభర్తృత్వ (దంపతీ) పద్ధతి ఏర్పడిందని తెలుస్తుంది. ప్రారంభకాలంలో చాలమంది ఉమ్మడి వివాహబంధంలో ఇమిడివుండేవారు. కాని క్రమంగా ఒక్కొక్క మార్పు వచ్చినప్పుడల్లా వారి సంఖ్య తగ్గిపోతూ ఉండేది. చివరకు ఆ బంధంలో ఒక్క జంటని మాత్రమే ఇముడ్చుకొనే స్థితి ఏర్పడింది. ఇదే ఈనాడు అమలులో వున్న వివాహ పద్ధతి.

---

* మార్క్స్ – ఎంగెల్స్ పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజి 21. – సం.

ఈవిధంగా, మోర్గన్ కుటుంబంయొక్క పూర్వచరిత్రను పునరావలోకనంచేస్తూ వివాహపు ఆదిమదశకు చేరుకున్నాడు. ఆ దశలో స్త్రీ పురుష సంబంధాలలో ఏ విధమయిన నియమాలూ లేవు. తెగలోని ప్రతి స్త్రీ ఆ తెగలోని ప్రతి మగవానికీ భార్య. అలాగే ప్రతి పురుషుడూ తన తెగకు చెందిన స్త్రీలందరికీ భర్త. ఇటువంటి కుటుంబం ఒకనాడున్న దనే విషయంలో మోర్గన్ తన సహచరుల అభిప్రాయంతో ఏకీభవించాడు. 18వ శతాబ్దం నుంచీ ఇలాంటి సమాజం గురించి చెప్పుకోడం వుంది. కాని దానిని గురించి సాధారణ రూపంలో తప్ప మాట్లాడరు, పెద్దగా వివరాలు తెలియవు. అటువంటి స్థితి ఒకటున్న దని గాఢంగా నమ్మి, చారిత్రక, మత సంప్రదాయాలలో దాని అవశేషాల్ని కనిపెట్టడానికి పరిశోధనను జరిపిన మొదటి వ్యక్తి బాహోఫెన్. ఆయన చేసిన గొప్ప సేవల్లో అదొకటి. కాని ఆయన జాడలు తీసి కనిపెట్టిన వ్యవస్థ "గుంపుపెళ్లి" మాత్రమే. ఏ వావి వరసలూ లేని లైంగిక సంబంధాల వ్యవస్థ అంతకు చాలకాలం పూర్వానిది. దాని నాయన వూహించనేలేదు. ఈ విషయం మనకిప్పుడు తెలుస్తూంది. ఏ నియమాలూ లేని స్త్రీ–పురుష సంబంధాల వ్యవస్థ చాలా పూర్వకాలానిదై వుండాలి. అటువంటి పద్ధతి ఒకనాడు వుండివుంటే చాల వెనుకబడి వున్న ఆటవిక సమాజాలలో ఘనీభూతంగా నిలిచి వున్న అవశేషాల ఆధారంతో తప్ప, ప్రత్యక్షంగా వాటి జాడ తీయడం ఇంచుమించు అసాధ్యమైన పని. అంత ప్రాచీన దశకు అది చెందినది. ఈ సమస్యను పరిశోధకుల ఎదుటబెట్టి చర్చకు తేవడమే బాహోఫెన్ చేసిన గొప్పపని.*

మానవజాతియొక్క స్త్రీ పురుష సంబంధాల్లో ఈ విధమైన ప్రాథమిక దశ ఎన్నడూ

---

* బాహోఫెన్ తాను కనిపెట్టిన విషయాన్ని, వూహించిన విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదు. ఆ ఆదిమ దశను వర్ణించడంలో ఆయన "హెటెరిజం" అనే మాటను వాడేవాడు. ఇది గ్రీకులు వాడిన శబ్దం. వివాహంకాని మగవాళ్లు లేదా ఏకపత్నీ వివాహంలో వున్న మగవాళ్లు, అవివాహిత స్త్రీలతో సంబంధాలు కలిగివుండడం అనే అర్థంలో వారు యీ శబ్దాన్ని వాడారు. అంటే సమాజంలో ఒక నిర్ణీతమైన వివాహ పద్ధతి వున్నట్లూ, దాని వెలుపల కూడా స్త్రీ పురుష సంబంధాలు సాగుతున్నట్లూ, ఆ విధంగా వ్యభిచారానికి అవకాశాలున్నట్లూ, తడుతుంది. వారు యీ శబ్దాన్ని మరో అర్థంలో యెప్పుడూ ఉపయోగించలేదు. కాబట్టి నేనూ దీనిని మోర్గన్‌తోపాటు అదే అర్థంలో వాడుతున్నా. బాహోఫెన్ తాను కని పెట్టిన అత్యంత ప్రధానము లయిన సంగతులు అన్ని సందర్భాలలోనూ మాయావాదపు ముసుగులో దాగివుంటాయి. దీనికి కారణం వుంది. చరిత్రగతి పరిణామంలో స్త్రీ పురుష సంబంధాలు ఆయా కాలాలనాటి మత విషయిక భావాలలోంచి పుట్టాయనీ, వాస్తవ జీవిత పరిస్థితుల్లోంచి కాదనీ ఆయన వూహ. (ఎంగెల్స్ వివరణ.)

లేదని నిరాకరించడం ఈమధ్య ఒక ఫేషన్ అయిపోయింది. మానవజాతికి యీ దశ "అవమాన"మని వారి వూహ. ఆ అవమానం జరగకుండా చూడాలనుకున్నారు. అందుకోసం పైనచెప్పిన మాదిరి స్థితి వున్నదని నిరూపించేటందుకు ఆధారాలు లేవని అన్నారు. అలా అనడంకోసం మిగతా జంతు ప్రపంచంనుంచి వుదాహరణలు తెచ్చి చూపడానికి ప్రత్యేక ప్రయత్నాలు చేశారు. జంతు ప్రపంచాన్ని గురించి లెతూర్నొ పోగుచేసిన అసంఖ్యాక ఉదాహరణలు ("వివాహం, కుటుంబాల పరిణామాలు," 1888) అభివృద్ధి తక్కువగా వున్న జంతువులలోనే ఏ విధమైన నియమాలూ లేని లైంగిక సంబంధాలు కనబడతాయని రుజువుచేస్తాయి. కాని, మానవుని గురించీ, అతని ఆదిమ జీవితస్థితిని గురించీ తెలుసుకోవడానికి మాత్రం ఈ ఉదాహరణలు ఎంతమాత్రం తోడ్పడవని నేను చెప్పగలను. వెన్నెముకగల జంతువులు చాలకాలం వరకూ జంటగా దాంపత్యం నిర్వహిస్తాయంటే దానికి శరీర శాస్త్రరీత్యా సమాధానం చెప్పుకోవచ్చు. ఉదాహరణకి పక్షుల్నే తీసుకుందాం. గుడ్లు పొదిగే కాలంలో ఆడపిట్టకి సహాయం అవసరం. కాబట్టి పక్షుల్లో ఒకే పెంటీ ఒకే పుంజూ ఖచ్చితంగా దంపతీ జీవితం గడుపుతాయంటే, మనుష్యుడు కూడా అలాగే వుంటాడనడానికి అది రుజువు కాదు. మనుష్యుడు పరిణామం పొందినది పక్షులనుంచి కాదు. ఇంక ఖచ్చితమైన ఏకపత్నీత్వం, ఏకపతిత్వమే మహాసుగుణం అయితే మనం నారిపురుగు గుణవంతమైనదని చెప్పుకోవాలి. దాని శరీరంలో వున్న 50–200 ఖండాలలో ప్రతి ఒక్కదానిలోనూ స్త్రీ, పురుషా వయవా లున్నాయి. అది బ్రతికివున్నంతకాలమూ తనలో తానే జతకూడుతూంటుంది. పోనీ మనం సస్తన జంతువులకు మాత్రమే పరిమితమవుదామనుకుంటే, దానిలో అన్ని తరహాల లైంగిక పద్ధతులూ – ఏ విధమైన నియమాలూ లేకుండా సంబంధాలు నెరిపేవి వున్నాయి. గుంపుపెళ్లి లక్షణాలు కనబడతాయి. బహుభార్యాత్వం కనబడుతుంది. ఏకపత్నీత్వం, ఏకపతిత్వం వుంది. వానిలో బహుభర్తృత్వం ఒక్కటే లేదు. బహుభర్తృత్వాన్ని మానవులు మాత్రమే సాధించగలిగారు. మనకు సన్నిహితంగా వుండే చతుష్పాద క్షీరద జంతువులలో సైతం అన్నా తరహాల ఆడ, మగ సంబంధాలూ కనబడతాయి. అయితే ఇంకా దగ్గరకువచ్చి, నాలుగు వానర జాతుల్ని మాత్రమే తీసుకో దలిస్తే అవి ఒకప్పుడు బహుభార్యాత్వాన్నీ, మరొకప్పుడు ఏకపత్నీత్వాన్నీ అనుసరిస్తున్నట్లు మాత్రమే లెతూర్నొ చెప్పగలిగాడు. అవి కేవలం ఏకపత్నీత్వాన్నే అవలంబిస్తున్నాయని సొస్యూర్ రాసినట్లు జిరో-త్యాలోన్ పేర్కొన్నాడు. నరవానర జాతులు ఏకపత్నీత్వాన్నే అనుసరిస్తాయని ఈమధ్య వెస్టెర్మార్క్ తెలియజేశాడు. ("మానవజాతి వివాహ చరిత్ర," లండన్, 1891) కాని ఇంతవరకు ఆయన అభిప్రాయాలు కూడ సరైన రుజువు కాదు. ఇంతవరకు దొరికిన విషయ సామగ్రివలన ఒక్కటి తేలింది: దానిని లెతూర్నొ చిత్తశుద్ధితో ఒప్పుకున్నాడు:

"సస్తన జంతువులలో వాటి మానసిక పరిణామ స్థాయికీ, వాటి లైంగిక సంబంధాలకూ ఎక్కడా ఖచ్చితమైన పొందికలేదు."

దీనినే ఎస్పీనస్ తన పుస్తకంలో ("జంతువుల సమూహాలు," 1877) స్పష్టంగా రాశాడు:

"మనకు జంతువులలో కనిపించే సాంఘిక సముదాయాల 'మంద' ఉన్నతమైనది. అది ఎన్నో కుటుంబాల కలయికగా కనిపిస్తూంది. కాని మొదటి నుండి కూడ కుటుంబమూ, మంద అనేవి పరస్పర విరుద్ధమైనవి. అవి విలోమ నిష్పత్తిలో అభివృద్ధి చెందుతాయి."

పైన చెప్పినదాని వలన వానరజాతియొక్క కుటుంబ పద్ధతుల్ని గురించీ, తదితర సాంఘిక వ్యవస్థల్ని గురించీ యిదమిద్ధంగా మనకేమీ తెలియదని తేలిపోతూంది. మనకు ఇంతవరకు లభించిన సమాచారమంతా పరస్పర విరుద్ధంగా వుంది. దానికి మనం ఆశ్చర్య పడవలసిన పని కూడా లేదు, ఆటవిక తెగల్ని గురించి మనదగ్గర వున్న సమాచారంలో సైతం యెన్నో వైరుధ్యాలున్నాయి. దాన్ని సవిమర్శకంగా పరిశీలించి మంచిచెడ్డలు తేల్చవలసివుంది. మానవ సమాజాల్ని పరిశీలించడంకన్న వానర సమూహాల పరిశీలన కష్టతరం. కనక ఏమాత్రం ఆధారపడ్డానికి వీలులేని సమాచారాన్నిబట్టి ప్రస్తుతం మనం ఏ నిర్ణయానికీ రాకూడదు.

అంతకంటే మన సమాలోచనను ప్రారంభించడానికి పైనచెప్పిన ఎస్పీనస్ వాక్యం చక్కగా ఉపకరిస్తుంది. ఉన్నత జంతుజాలంలో మంద, కుటుంబం అనేవి పరస్పర పూరకమైనవి కావు; అవి పరస్పర విరుద్ధాలు. జతకూడే రోజుల్లో మగజంతువు చూపే ఈర్ష్యవల్ల మందల కట్టుబాట్లు సడలిపోవడమో, తాత్కాలికంగా గుంపుగా పెరిగే ప్రతి మందా విడిపోవడమో జరుగుతుంది — అని ఎస్పీనస్ ఎంతో స్పష్టంగా వర్ణిస్తాడు.

"కుటుంబ బంధాలు దృఢంగా వున్నప్పుడు మంద అనేది అరుదుగా ఏర్పడుతుంది. తద్విరుద్ధంగా బహుపత్నీత్వంగాని, ఆడ, మగ జంతువుల సంబంధాలలో స్వేచ్ఛగాని వున్నప్పుడు మంద దానంతటదే ఏర్పడుతుంది.... మంద ఏర్పడాలంటే కుటుంబ బంధాలు సడలిపోవాలి. వ్యక్తి మళ్లీ విముక్తుడు కావాలి. అందుచేతనే పక్షులలో నిర్మాణంలో కూడిన 'గుములు' మనకు అంతగా కనబడవు.... ఇంచుమించుగా నిర్మాణయుక్తములైన మందలు మనకు సస్తన జంతువులలోనే కనిపిస్తాయి. దీనికి కారణం వ్యక్తి కుటుంబంలో ఐక్యంకాకపోవడమే.... కనక మంద మనదనే సమష్టి భావానికి ఇది

నా కుటుంబం అనే సమష్టి భావంకన్న బలమైన శత్రువు వేరొకటి లేదు. కుటుంబంకన్న ఉన్నతమైన సామాజిక రూపం ఏర్పడిందంటే దానికి ఏకైక కారణం మూలమట్టుగా మారిపోయిన అనేక కుటుంబాలు దానిలో కలిసి పోవడమే, సరిగా యీ కారణంగానే ఈ కుటుంబాలు తర్వాత తర్వాత చాల అనుకూలమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు పునర్నిర్మితమై వుంటాయి. ఈ విషయమై సందేహం అవసరంలేదని నా అభిప్రాయం." (ఎస్పినస్ పై గ్రంథం జిరో-త్యాలోన్ "వివాహ, కుటుంబాల ఆవిర్భావం," 1884, పేజీలు 518–520.)

మానవ సమాజానికి సంబంధించిన కొన్ని విషయాల్ని తెలుసుకొనేటందుకు జంతు సముదాయాలుపయోగిస్తాయని మన కిక్కడ బోధపడుతూంది, కాని ఆ వుపయోగం వ్యతిరేకార్థంలో మాత్రమే. మనకు దొరికినంతవరకు ప్రమాణాల్నిబట్టి పరిశీలిస్తే ఉన్నత పరిణామదశలో వున్న వెన్నెముకగల జంతువులలో రెండు విధాలయిన కుటుంబ నిర్మాణం మాత్రమే కనబడుతుంది: ఒకటి బహుపత్నీత్వం, రెండు విడి జంట. బహుపత్నీత్వంలోను, జంటల పద్ధతిలోను కూడా నియమం వయస్సువచ్చిన ఒకే మగ జంతువు; ఒకే భర్త. కుటుంబ బంధనానికీ, పరిమితులకూ ప్రాతినిధ్యం వహించే మగ జంతువులో వుండే ఈర్ష్యాభావమే జంతు కుటుంబాన్ని మందకు వ్యతిరేకంగా మారుస్తుంది. దానిని ఏకాకిని చేస్తుంది. మగ జంతువులోని ఈర్ష్య సాంఘిక నిర్మాణాలలో ఉన్నతమైన "మంద" ఏర్పడడానికి ప్రతిరోధకం అవుతుంది. మందలోని ఐక్యతను సడలింపచేస్తుంది. కనీసం జతకూడే రోజుల్లో మందను తాత్కాలికంగా విడగొట్టేస్తుంది. మొత్తంమీద దాని అభివృద్ధిని నిరోధిస్తుంది. జంతువుల కుటుంబాలతో ఆదిమ మానవసంఘాన్ని పోల్చిచూడ రాదనడానికి ఇదొక్కటే చాలు. జంతుదశనుండి మానవుడు ముందుకు సాగిపోతున్నప్పుడు, ఆ రోజుల్లో వారిలో కుటుంబం అనేది ఉండకుండా వుండాలి; లేదా జంతుజాలంలో కన బడని కుటుంబ రూపం యేదో వారిలో వుండి వుండాలి. వేటగాండ్ర సమాచారాన్ని పట్టి వెస్టెర్మార్క్ గోరిల్లాలూ, చింపాంజీలూ ఒక ఆడదీ ఒక మగదీ చొప్పున జంటలు జంటలుగా నివసిస్తాయని రాశాడు, మానవుడు ఆనాటి ప్రాథమిక దశలో బ్రతకగలగాలంటే, అంతకంటే వున్నతమైన సామాజిక వ్యవస్థ అవసరం. పరిణామారంభ దశలో వున్న మాన వుడికి ఆత్మరక్షణకు అవకాశాలు చాల తక్కువ. ఆ జంతుప్రాయమైన దశలో వున్న మానవుడు చిన్నచిన్న గుంపులుగా ఏర్పడితేనే మనగలడు. జంతువులకన్న మానవుడు విశేషంగా అభివృద్ధి పొందాలంటేనూ, ప్రకృతిలో సాధ్యంకాగల మహోన్నతాభివృద్ధిని సాధించాలంటేనూ జంతువులలో కనిపించేదానికన్న ఉన్నతమైన సాంఘిక నిర్మాణం అవసరం. వ్యక్తిలో లోపంగా

వున్న ఆత్మరక్షణ శక్తిని పరస్పర సహకారం ద్వారా భర్తీ చేసుకోవాలి. ఈనాడు నరవానర జాతిలో కనిపించే పరిస్థితుల్నిబట్టి, ఏనాడో మానవునిలో వచ్చిన పరిణామాలను వూహించి చెప్పడం సాధ్యంకాదు. ప్రస్తుతం మనకు కనబడే యీ వానరజాతి పరిణామ పథంనుంచి వైదొలగిపోయినట్లూ, ఇది క్రమంగా అంతరించడమో, క్షీణదశకు రావడమో జరుగుతున్నట్లూ కనబడుతూంది. అందుచేతనే నేడు వాటిలో వున్న కుటుంబ రూపాల్ని చూపించి, ఆదిమ మానవుల కుటుంబ రూపాలకు సామ్యం తేబూనడం తప్పు అనేందుకు యీ ఒక్క కారణమే చాలు. జంతువులలోంచి మానవుడు పరిణామం పొందాలంటే మొట్టమొదట వయస్సు గాళ్లలో పరస్పర సహనం వుండాలి. ఈర్ష్య వుండకూడదు. అప్పుడే గుంపులు నాలుగు కాలాల పాటు వుండటం సాధ్యం, అటువంటి గుంపులలో మాత్రమే జంతువునుండి మానవుడు పరిణామం చెందడం సాధ్యం. ఈనాటికి కూడా ప్రపంచంలో ఏమూలనైనా ఈ మాదిరి ప్రాచీన, ఆదిమ కుటుంబ రూపం ఒకటుందా? చరిత్రలో ఇటువంటిది వుండేదని రుజువు పరచగలమా? ఉంది. ఇదే గుంపుపెళ్లి, దీనిలో కొంతమంది స్త్రీల గుంపూ, కొంతమంది పురుషులగుంపూ ఒకరికొకరు చెందివుంటారు. ఇక్కడ ఈర్ష్యకి తావులేదు. మరికొంత అభివృద్ధివచ్చిన దశలో మనకు అరుదైన బహుభర్తృత్వం కనబడుతుంది. ఈ నూతన రూపంలో మానవునిలో అసూయాభావం అసలే వుండదు. అందుచేత జంతువులలో ఇది కనబడదు. ఇప్పుడు మనకు కనిపించే గుంపుపెళ్లిళ్ల అన్నింటా చిత్రమైన గజిబిజి కట్టుబాట్లు కనబడతాయి, వానినిపట్టిచూస్తే, అంతకు పూర్వం అంతకంటేనూ అతి సాధారణమైన రూపంలో స్త్రీ పురుష సంబంధాలు వుండి వుండాలనిపిస్తుంది. వీటన్నింటినీ బట్టి తేలుతున్న దేమిటి? జంతువులనుండి మానవుడు పరిణామం పొందిన సంధిదశలో ఆ దశకు అనుకూలంగా స్త్రీ పురుష సంబంధాలలో వావివరుసలులేని పూర్తి విశృంఖ లత్వం వుండేది. అలాగాక ఆడ, మగ జంతువుల సంబంధాలలోంచి ఉదాహరణలు తీసుకొన డానికి ప్రయత్నిస్తే మనం అసలు విషయాన్ని వదలి దూరం పోవడమే తటస్థపడుతుంది.

స్త్రీ పురుష లైంగిక సంబంధాలలో విశృంఖలత్వం అంటే ఏమిటి? ఇప్పుడూ, ఇదివరకూ వున్న నిర్బంధాలూ, నిషేధాలూ లేకపోవడమే ఆ విశృంఖలత్వానికి అర్థం. ఈర్ష్య అనే ఆటంకం తొలగిపోయి వుండాలని యింతకుముందే మనం చూశాం. ఇప్పుడు మనం చూసే ఈర్ష్యాభావం అటు తర్వాత ఎంతో కాలానికి వృద్ధిపొందింది అనడం స్పష్టం. "వావి తప్పడం" అనే భావం కూడా అలాగ తర్వాత వచ్చినదే, మొట్టమొదటి దశలో సోదరీ సోదరులు భార్యాభర్తలుగా వుండేవారు. అంతేకాదు. తల్లిదండ్రులకూ, బిడ్డలకూ మధ్య లైంగిక సంబంధాలుండడం కొన్ని జాతులలో నేటికీ ఆమోదయోగ్యంగానే వుంది. పార్థియన్లు, పర్షియన్లు, సిథియన్లు, హూణులు మొదలయినవారిని గురించి ప్రాచీన గ్రీకులూ, రోమన్లూ రాసిన విషయాలను అటుంచి, బేరింగ్ జలసంధి ప్రాంతాలలో వున్న కవి

యట్లు, అలాస్కా సమీపంలోని కద్యాక్ దీవి వాసులు, బ్రిటిష్ ఉత్తర అమెరికా లోభాగం లోని తిన్నే ప్రజలలో ఇటువంటి ఆచారాలు వున్నాయని బాన్‌క్రాఫ్ట్ రాశాడు. ("ఉత్తర అమెరికాయొక్క పసిఫిక్ రాజ్యాల ఆదిమ జాతులు" 1875, సం. 1.) చిప్పేవా ఇండి యన్లలోనూ, చిలీలోని కుకూస్ జాతిలోనూ, కరిబియన్లు,* ఇండో-చైనాలోని కరెన్ తెగ లోనూ ఇటువంటి ఆచారం వున్నదని లెతూర్నో తెలుసుకొన్నాడు. మనుష్యులు కల్పించుకొన్న నిషేధాలలో వావి చాలా ముఖ్యమైనది. ఈ వావి వున్నా (నిజానికిది అత్యంత విలువైన ఆవిష్కరణ) వేర్వేరు తరాలకి చెందిన స్త్రీ పురుషుల మధ్య లైంగిక సంబంధాలు అత్యంత కుహనా సంస్కృతీపర దేశాలలో కూడ ఈనాడు వింతగా కనబడ్డం లేదు. అరవై ఏళ్లపై బడ్డ "కన్య" ముప్పదేళ్ల యువకుని పెళ్లాడేస్తూంది, ఆమె ధనవంతురాలై వుంటే అదేం విడ్డూరం అనిపించడంలేదు. ఇంక ఆరోజుల్లో వావిని కల్పించుకోని దశలో తల్లిదం డ్రులకూ, బిడ్డలకూ మధ్య లైంగిక సంబంధాలుండడం తప్పుగానూ, విడ్డూరంగానూ కనిపించి వుండదు. మనం ఈనాడు అనుసరించే వావివరసలు వేరు. వీనికీ ఆనాడు వారు కల్పించుకొన్న వావివరసలకూ సంబంధమే లేదు. పైగా ఈ రెండూ పరస్పర విరుద్ధంగా వుంటాయి కూడ, అందుచేతనే వాటిని అవతలగా పెడదాం. ఇంక మనకి కనిపించే కుటుంబ వ్యవస్థల్లోకెల్లా అతిప్రాచీనమైన దానిని చూస్తే, ఆనాడు దాంపత్య సంబంధాలలో ఎంతో స్వేచ్ఛవున్నట్లు కనిపిస్తుంది. స్వేచ్ఛ అనడంలో వుద్దేశం తర్వాత తర్వాత ఆచారాల రూపంలో అమలులోకి వచ్చిన నిర్బంధాలు ఆనాడు లేవనడమే. అంతేకాని, నిత్యజీవితంలో స్త్రీ పురుషులు యథేచ్ఛాచారం సాగించారనికాదు. ఒక స్త్రీ, ఒక పురుషుడు జతకూడి కొంతకాలం జీవించడంలో అభ్యంతరం ఎన్నడూ లేదని మాత్రమే దీని అర్థం. గుంపుపెళ్లిళ్లలో అధిక భాగం ఈ మాదిరి జంటలే, ఈ విధమైన కలయికలతో కూడిన ప్రాథమిక దశ లేదన డానికి వెస్టెర్మార్క్, ఒక బిడ్డ కలిగేవరకూ కలిసి వుండే అన్ని తరహాల దాంపత్య సంబంధా లకూ కూడ "వివాహం" అని పేరుపెట్టేడు. అయితే స్త్రీ పురుష సంబంధాలలో స్వేచ్ఛ వున్న అతి ప్రాచీన కాలంలో కూడా పైమాదిరి జంటవివాహాలు జరగడానికి అవకాశంవుంది. అప్పటికింకా స్త్రీ పురుష సంబంధాలలో నిర్బంధాలు సాంఘికాచారాలలోకి పరివర్తన పొంది వుండలేదు గనుక, ఆ వివాహాలు ఆనాటి స్వేచ్ఛాసూత్రాలకు భంగకరం కాదనీ చెప్పవచ్చు. కాని, వెస్టర్మార్క్ ధోరణి వేరు:

> "ఈ విశృంఖలత్వం వలన వ్యక్తుల అభిరుచి అణచివేయబడుతుంది,"

కనక "దీని రూపాంతరమే వ్యభిచారం" అని రాశాడు.

---

* కరిబియన్లు – దక్షిణ అమెరికా ఉత్తరభాగ ప్రాంతాల్లో నివసించే ఇండియన్ తెగల సమూహం: బ్రెజిల్, దాన్ని చేరి వున్న వెనిజులా ప్రాంతాలు, గయానా, కొలంబియా. – సం.

ఆదిమ సమాజాన్ని కేవలం వ్యభిచారగృహపు రంగు కళ్లద్దాలతోనే వూహించగలవారు ఆ సమాజాన్ని అర్థంచేసుకోలేరని నా వూహ. గుంపుపెళ్లిని గురించి చర్చించేటప్పుడు ఈ విషయానికి మళ్లీ వద్దాం.

స్త్రీ, పురుష సంబంధాలలో స్వేచ్ఛ వుండిన ఈ ప్రాచీన స్థితినుంచి, ఏనాడో చాలా కాలం క్రిందట కుటుంబంయొక్క ప్రాథమిక రూపం — రక్తసంబంధీకుల కుటుంబం — ఏర్పడిందని మోర్గన్ చెప్పాడు.

1. రక్తసంబంధీకుల కుటుంబం — ఇది కుటుంబ వ్యవస్థయొక్క ప్రప్రథమ దశ. ఇందులో వివాహబంధంలో కలిసే గుంపులు వారివారి తరాల్నిపట్టి విభజితం అవుతాయి. ఒక కుటుంబంలోని తాతలూ, అవ్వలూ ఒకరికొకరు భార్యాభర్తలు. వీరి సంతానం అయిన స్త్రీ పురుషులు మరల ఒకరికొకరు భార్యాభర్తలు. అలాగే వీరి బిడ్డలు, అంటే మొదటి తరంవారి మనుమలూ మనమరాండ్రూ (మూడోతరం) ఒకరి కొకరు భార్యాభర్తలు, అలాగే మునిమనుమలూ మనుమరాండ్రూ నాలుగవ బృందం. ఈమాదిరి వివాహాలలో ఒకటి రెండు తరాలవారు, రెండు మూడు తరాలవారు పరస్పరం వివాహ సంబంధాలు కలిగివుండ కూడదు. మనం చెప్పే పరిభాషలో వారికి వివాహ హక్కులు, బాధ్యతలు వుండకూడదు. తోడబుట్టిన ఆడ, మగవారి తాత ముత్తాతలద్వారా వేలు విడిచిన సోదరీసోదర బాంధవ్యం గలవారు ఒకరికొకరు అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూను. సరిగా అందుచేతనే వారు పరస్పరం ఆలుమగల సంబంధంకలిగి వుండడానికి అర్హులు. ఈ దశలో సోదరీసోదరుల మధ్య దాంపత్య సంబంధాలుండడం సర్వసాధారణ విషయం.* ఈ కుటుంబంయొక్క వైశిష్ట్యం ఏమిటంటే, దీనిలోని సభ్యులందరూ ఒక జంటయొక్క సంతానం అయివుంటారు. మొదటి జంట

---

* వాగ్నెర్ తాను రాసిన "నిబెలుంగ్" ప్రతిలో ఆదిమకాల స్థితిని గురించి పూర్తిగా అపభ్రంశం పట్టించినందుకు మార్క్స్ చాల ఘాటుగా విమర్శిస్తూ 1882 వసంతరుతువులో ఒక లేఖ రాశాడు.[110] "సోదరుడు సోదరిని భార్యగా కౌగలించుకోవడం ఎక్కడన్నా విన్నామా?"[111] అని వాగ్నెర్ ఆశ్చర్యం ప్రకటించేడు. ఈ అపవిత్ర పద్ధతుల్ని సంస్కరించి, ఆధునిక పద్ధతిలో ఆ "బూతుదేవతల" ప్రేమగాథలకు కొద్దిగా వావివరసల బిగింపులను జోడించేడు. దానిని మార్క్స్ విమర్శిస్తూ ఇట్లా అన్నాడు: "ఆదిమకాలంలో సోదరి భార్యగానే వుండేది. అది ఆనాడు నీతిబద్ధమే కూడా." (1884 ముద్రణకు ఎంగెల్స్ వివరణ.)

వాగ్నెర్ ఫ్రెంచి మిత్రుడూ, అయనమీద విశేషాభిమానంగల వాడూ అయిన బొన్యే ఈ వివరణతో ఏకీభవించలేదు. వాగ్నెర్ పూర్వకాలపు "ఎద్ద" అనే పుస్తకాన్ని వరవడిగా తీసుకొన్నాడనీ, అందులోని "ఒగిస్ద్రెక్క"లో[112] ఈదిగువ మాటలున్నాయనీ ఆయన వుదాహరించేడు. దానిలో లోకి అనే పాత్ర ఫ్రెయా అనే పాత్రను ఈవిధంగా నిందిస్తాడు:

సంతానం, ఆ సంతానంయొక్క సంతానం, అలాగే వారి సంతానం ప్రతి తరంలోనూ స్త్రీ పురుషు లొకరికొకరు సోదరీసోదరులు సరిగా ఆ కారణంచేతనే వారు ఒకరికొకరు భార్యా భర్తలు.

రక్తసంబంధీకుల కుటుంబ రూపం నేడెక్కడా కనిపించదు, ఎంతో వెనుకబడివున్న ప్రజలలో కూడా చరిత్రలో తెలిసినంతవరకు దీనికి సాక్ష్యాధారాలతో కూడిన ఉదాహరణ కనబడలేదు. అయినా అటువంటి కుటుంబ రూపం ఒకటి వుండితీరాలి. దానిని మనం వొప్పుకోక తప్పదు. హవాయి దీవుల ప్రజలలో కనిపించే రక్తబంధుత్వపు తరాలు యిటువంటి కుటుంబ రూపంలోనే ఏర్పడగలవు. ఆ రక్తబంధుత్వపు చిన్నెలు పోలినీషియా అంతటా అమలులో వున్నాయి. కాలక్రమేణా కుటుంబ రూపంలో వచ్చిన పరిణామాన్ని చూసినా ప్రాథమికదశలో ఈమాదిరి కుటుంబ రూపమే తప్పనిసరిగా వుండి తీరాలనిపిస్తుంది.

---

"నీ సోదరుడ్నే నువ్వు దైవసమక్షంలో కౌగలించుకున్నావు." దీనినిపట్టి చూస్తే, ఆనాటికప్పుడే సోదరీ సోదరుల మధ్య దాంపత్య సంబంధం నిషేధింపబడినట్లే కనిపిస్తుంది అని అతను రాశాడు. ఆదిమకాలపు పురాణగాధలపట్ల విశ్వాసం పూర్తిగా సడలిన దశకు 'ఒగిస్ ద్రెక్క' వ్యక్తీకరణ అయినట్లు కనబడుతుంది. ఇది లుకియాన్ మాదిరిగా దేవతల్ని అవహేళన పట్టించడం తప్ప వేరుకాదు. మెఫిస్టొఫెలెస్ మాదిరిగా లోకి ఆవిధంగా ఫ్రెయాను నిందించడం వాగ్నెర్ వాదాలకు వ్యతిరేకమే అవుతుందిగాని అనుకూలం కాజాలదు. మరో కొన్ని పద్యాల అనంతరం న్యోర్డ్‌తో లోకి ఇల్లా అన్నాడు: "మా చెల్లెలి ద్వారా నువ్వు అలాంటి కొడుకుని కన్నావు" (vidh systur thinni gaztu slikan mög). ఇంక నియోర్‌డ్ ఆసా వాసికాదు వానా నివాసిగాని. "యూంగ్లింగ వీరగాథ"లో[113] అతడు ఇలా అన్నట్లుంది: వానా దేశంలో సోదరీసోదరులమధ్య వివాహాచరం వుంది. కాని ఆ ఆచారం ఆసా దేశంలోలేదు. దీనినిపట్టి ఆసాలోని దేవతల కన్న వానాభూమిలోని దేవతలు ప్రాచీనులని తోస్తుంది. ఏది ఎలా వున్నా, నియోర్‌డ్ ఆసా భూమిలో అక్కడివారిమధ్య, వారితో సమానహోదాలో నివసించేడు. దీనినిపట్టి తేలుతున్న దేమిటి? నార్వే దేశపు దేవతల్ని వర్ణించే పురాణాలు రాయబడేనాటికి, కనీసం దేవతలలోనైనా సోదరీసోదరుల మధ్య వివాహాలు జరిగే పద్ధతి వున్నదనీ, ఆ పద్ధతి జనానికి అసహ్యం అనిపించే స్థితి లేదనీ చెప్పడానికి "ఒగిస్ ద్రెక్క" ఒక సాక్ష్యం. వాగ్నెర్‌ను సమర్థించదలచుకుంటే "ఎద్ద"ను "అడ్డంపెట్టుకొనే కన్న గ్యోతె నుపయోగించుకోవడం మంచిది. ఆయన దేవుడు, దేవదాసిని గురించిన జానపదగేయ కావ్యంలో ఇల్లాంటి పొరపాటు అభిప్రాయాన్నే ప్రకటించేడు. మతాచారాల దృష్ట్యా స్త్రీలు ఎక్కువ మంది పురుషులతో కలిసే విధాన్ని ఆయన ఆధునిక యుగపు వ్యభిచారంతో పోల్చేడు. (1891 నాటి నాలుగవ ముద్రణకు ఎంగెల్స్ వివరణ.)

2. పునాలువన్ కుటుంబం. తల్లిదండ్రులకీ సంతానానికీ మధ్య లైంగిక సంబంధాల నిషేధం కుటుంబ నిర్మాణంలో వచ్చిన మొదటిమెట్టు. ఆ తర్వాత వచ్చిన సోదరీసోదరుల మధ్య లైంగిక సంబంధాల నిషేధం రెండో మెట్టు. ఇంచుమించు సమాన వయస్కులు కావడంచేత సోదరీ సోదరులమధ్య లైంగిక సంబంధాలను నిషేధించడం చాలముఖ్యమూ, మొదటిదానికన్న చాల కష్టమూ కూడా. ఇది క్రమక్రమంగా అమలులోనికి తేబడింది. ప్రారంభంలో ఒకే తల్లి బిడ్డల మధ్య లైంగిక సంబంధాలు నిషేధించబడివుండాలి. అది కూడా ప్రారంభంలో చెదురు మదురుగా అవలంబించబడి చివరకు సాధారణాచారంగా పరిణమించి వుంటుంది (హవాయి ద్వీపాలలో అక్కడక్కడ నేటికీ ఈ ఆచారం చెదరుబదరుగా కనిపిస్తూనే వుంది). క్రమంగా ఈ నిషేధాన్ని ఒకటి, రెండు, మూడు తరాలకు చెందిన వేలువిడిచిన సోదరీసోదరులకు కూడా విస్తరింపచేసి వుంటారు.

> "ప్రాకృతిక వరణ సూత్రం ఏ విధంగా పనిచేస్తుందో చూపడానికిది మంచి వుదాహరణ" అన్నాడు మోర్గన్.

సోదరీసోదరులమధ్య దాంపత్య సంబంధాలు విధిగానూ, బాధ్యతగానూ అనుసరించ బడుతున్న తెగలకన్న ఆ ఆచారాన్ని నిషేధించిన తెగలు వేగంగా, బాగా అభివృద్ధి చెందాయనడం నిర్వివాదాంశం. ఆ అభివృద్ధి ఫలితంగా ఏర్పడి, బాగా విస్తరించిన గణసంస్థను చూస్తే, ఈ అడుగు ఎంత ప్రాముఖ్యత కలిగినదో గ్రహించగలం, అనాగరికయుగంలో వున్న ప్రజ లందరిలో కాకపోయినా, అత్యధిక సంఖ్యాకులలో వారి సాంఘిక వ్యవస్థకు యీ గణసంస్థ పునాది రాయి. గ్రీసు, రోములు సరాసరి దీని ద్వారానే నాగరికతలోనికి పరిణతిపొందాయి.

ప్రతి ఆదిమ కుటుంబం మహా అయితే రెండు మూడు తరాలు గడిచేక తప్పకుండా విడిపోయితీరాలి. ఆదిమకాలంలో తెగలోని వారంతా సమష్టిగా ఒకే ఇంట్లో నివసించే అలవాటు వుండేది. ఈ సామూహిక కుటుంబపద్ధతి అనాగరికయుగపు మధ్య దశవరకూ అన్ని తెగలలోనూ అమలులో వుంది. ఈ మాదిరి కుటుంబాలలోని జనులసంఖ్యకి కూడా ఒక పరిమితి వుంది. పరిస్థితుల్నిబట్టి ఆ సంఖ్య మారుతూవచ్చినా, ఒకే ప్రాంతం లోని యీ మాదిరి కుటుంబాలలో జనసంఖ్య ఇంచుమించు సమానంగానే వుంటుంది. ఒకే తల్లియొక్క సంతానం మధ్య లైంగిక సంబంధాలు దోషం అనే భావం రాగానే పాత కుటుంబాలు విచ్ఛిన్నమై నూతన కుటుంబ సమాజం యేర్పడక తప్పలేదు. ఈ నూతన సమాజం కుటుంబ సభ్యులందరూ ఆ కుటుంబానికి చెందినవారే కానక్కర్లేదు. తోబు ట్టువులంతా (స్వయానా తోబుట్టువులూ, వేలువిడిచిన తోబుట్టువులు) ఒక కుటుంబానికి కేంద్రమయ్యారు. వారి సహజాతులైన అన్నదమ్ములంతా మరో కుటుంబానికి కేంద్ర మవుతారు, ఇలాంటిదే ఏదో ఒక పద్ధతిలో ఈ నూతన కుటుంబం "రక్తసంబంధీకుల కుటుంబ

వ్యవస్థలో''నుండి పుట్టి ఉండాలి. మోర్గన్ దీనికి పునాలువన్ కుటుంబం అని పేరుపెట్టేడు. హవాయి దీవులలోని ఆచారం ప్రకారం కొంతమంది అక్కచెల్లెళ్లు (వాళ్ళు ఒక తల్లి బిడ్డలూ కావచ్చు, లేదా అక్కచెల్లెళ్ల మనవరాళ్లో, మునిమనవరాళ్లో అయి ఆ బంధుత్వం ద్వారా అక్కచెల్లెళ్లూ కావచ్చు.) తమ ఉమ్మడి భర్తలకి ఉమ్మడి భార్యలుగా వున్నారు. ఈ స్త్రీల తోడబుట్టినవాళ్లు వీరి భర్తలుగా వుండకూడదన్నారు కదా, అందుచేత వీరి భర్తలంతా అన్నదమ్ములే అయి వుండనక్కరలేదు. వారలా పిలుచుకోరు కూడ. వారు ఒకరినొకరు ''పునాలువ'' అని పిలుచుకున్నారు. ఆ మాట కర్థం ''సన్నిహిత సహచరులు, సహభాగులు.'' అదేవిధంగా ఒకే తల్లి కొడుకులో, వేలువిడిచినవారి సోదరులో తమ అక్కచెల్లెళ్లని కాక పైవారిని కొందరిని ఉమ్మడి భార్యలుగా చేసుకున్నారు. ఆ భార్యలు కూడ తమలో తమరు ''పునాలువ'' అనే పిలుచుకున్నారు. ఇది సంప్రదాయిక కుటుంబ స్వరూపం. దీనిలో ఎన్నో మార్పులు కాలక్రమేణా సంభవించాయి. దీని ప్రధాన లక్షణం యిది: ఒకానొక నిర్దిష్ట కుటుంబ వలయంలో భార్యలు, భర్తలు ఉమ్మడిగా ఒకరి నొకరు అనుభవిస్తారు. అయితే, భార్యల సోదరులు — మొదట్లో స్వయానా సోదరులు, దరిమిలా వేలు విడిచిన సోదరులు కూడా — మినహాయింపబడ్డారు, అలాగే మరోవైపు భర్తల అక్కచెల్లెళ్లు కూడా మినహాయింపబడ్డారు.

అమెరికాలో ఉన్న రక్తసంబంధ వ్యవస్థలోని అంతరువులన్నిటినీ ఉన్నవి ఉన్నట్లు తెలియజేసే కుటుంబ రూపం ఇదే. ఇందులో ఒక స్త్రీయొక్క చెల్లెళ్లు, అక్కల బిడ్డలు ఆమె బిడ్డలుగానే పిలువబడతారు. ఒక మగవాని సోదరుని బిడ్డలు కూడ అతని సంతానంగానే లెక్కపెట్టబడతారు. కాని సోదరీసోదరుల బిడ్డలు సోదరులు కాజాలరు. ఒక స్త్రీయొక్క అన్నదమ్ముల బిడ్డలు ఆమెకు మేనల్లుళ్లు, మేనకోడళ్లూను. అల్లాగే ఒక మగవానియొక్క తోబుట్టువుల సంతానం అతనికి మేనల్లుళ్లు, మేనకోడళ్లు. కాని సోదరీ సోదరుల సంతానం ఒకరి కొకరు మేనబావలు, మేనవదినలూను. ఒక స్త్రీయొక్క అక్కచెల్లెళ్ల భర్తలు ఆమెకూ భర్తలే. ఒక మగవానియొక్క అన్నదమ్ముల భార్యలు ఆయనకూ భార్యలే. ఇది ఆచరణలో అమలు జరగకపోయినా ఆ హక్కు మాత్రం మిగిలింది. సోదరీ సోదరుల మధ్య వివాహం నిషేధించబడగానే వారి సంతానాన్ని వివిధ తరగతులుగా విభజించవలసి వచ్చింది. అంతవరకూ అక్కచెల్లెళ్ల అన్నదమ్ముల బిడ్డలందరూ కలసి సోదరీసోదరులుగానే పరిగణింపబడేవారు. కాని యిప్పుడు ఒక భాగం పూర్వంలా సోదరీసోదరులుగానే ఉంటారు. ఇంకో భాగం సోదరీసోదరులుగా లెక్కలోకి రారు. అంటే అక్కచెల్లెండ్ర సంతానానికీ, రెండవవైపున అన్నదమ్ముల సంతానానికీ ఏకమాతృత్వం, ఏకపితృత్వం లేదు. అందుచేత మేనల్లుళ్లు, మేనకోడళ్లు, మేనబావలు, మేనవదినలు అనే బంధుత్వాలు మొట్టమొదటిమారు అవసరమయ్యేయి. అంతకుపూర్వం ఉన్న కుటుంబ రూపంలో యీ బాంధ

వ్యానికి అర్థంలేదు. ఒకే భార్య, ఒకే భర్త అనే సిద్ధాంతంమీద ఆధారపడిన వివాహ వ్యవస్థ వేటిలోనైనా యీ అమెరికన్ రక్తసంబంధ రూపం అసంగతంగా కనబడుతుంది. అటువంటి ఈ వ్యవస్థలోని ప్రతి చిన్న అంశానికీ సరిఅయిన సమాధానం పునాలువన్ కుటుంబ రూపంలో లభిస్తుంది. వాటి వ్యాప్తికి కూడ ఆధారాలక్కడనే దొరుకుతున్నాయి. ఈ రక్తసంబంధ వ్యవస్థ అమల్లో వున్న మేరకు, కనీసం సరిగా అదే మేరకు, పునాలువన్ కుటుంబమో, లేక అటువంటి మరో కుటుంబ రూపమో తప్పక ఉండివుండాలి.

అమెరికాలోని పూర్వపు స్పానిష్ సన్యాసులవంటి మత ప్రచారకులకు యీ ఆచారాలు పాషండాచారాలుగాను, "పరమ అసహ్యంగానూ" కనిపించాయి. అందుచేత వాటిని తోసేశారు. అలాకాక వారు కొంచెం విమర్శనా దృష్టితో పరిశీలించి ఉన్నట్లయితే, యీ మాదిరి క్రైస్తవేతర కుటుంబ రూపానికి నిదర్శనలు పాలినీషియా అంతటా కనబడి ఉండేవి. ఇటువంటి పద్ధతి హవాయీ ద్వీపంలో ఉన్నదని ధ్రువపడనే ధ్రువపడింది.* సీజరు బ్రిటన్‌పై దాడిచేసిన నాటికి అక్కడి ప్రజలు అనాగరికత్వ నడిమి దశలో వున్నారు. "సోదరులు సోదరులతో కలసి, తలిదండ్రులు తమ బిడ్డలతో కలిసి పది పన్నెండేసిమంది ఉమ్మడిగా భార్యలను కలిగి వున్నారు" అని ఆయన రాశాడు. ఇది గుంపుపెళ్ళి అని స్పష్టంగా చెప్పవచ్చు. అనాగరిక దశలోవున్న స్త్రీకి, భార్యలతో కాపురం చెయ్యగల వయసులోనున్న కొడుకులు పది పన్నెండుమంది వుండడం అసంభవం. కాని పునాలువన్ కుటుంబ రూపానికి సరిపడే అమెరికన్ రక్తసంబంధ వ్యవస్థలో ఇది సాధ్యం. దూరపు వారయినా, దగ్గర వారయినా అన్నదమ్ముల సంతానం ఒకరికొకరు అన్నదమ్ములుగానే లెఖ్ఖ. కనుక "తలిదండ్రులు తమ బిడ్డలతో" అనే సీజరు వాక్యం భ్రమాత్మకం కావచ్చు. అలాగని అది కేవలం అసంభవం అని తోసెయ్యడానికి వీలులేదు. ఈ వ్యవస్థ తండ్రీ, కూతురూ, లేక తల్లీ, కొడుకూ ఒకే వివాహ బృందంలో ఉండటాన్ని నిషేధించింది, కాని తండ్రీ, కొడుకూ, లేక తల్లీ కూతురూ ఒకే వివాహ బృందంలో ఉండటాన్ని పూర్తిగా నిషేధించలేదు. ఆటవిక,

---

* బాహోఫెన్ ఈ మాదిరి విశృంఖల సాంగత్యాన్ని "Sumpfzeugung" అని పిలిచాడు. దీనిని తాను నూతనంగా కనుక్కున్నానని ఆయన అభిప్రాయం. ఈ లైంగిక సంబంధాలు "గుంపుపెళ్లి"కి దారితీస్తాయి. "ఈ పునాలువన్ వివాహాలను బాహోఫెన్ చట్ట విరుద్ధమైనవానినిగా పరిగణించేట్లయితే, ఆనాటి మానవుడికి యీనాటి పెళ్లిళ్లలో చాలా భాగం వావితప్పినవిగా కనిపిస్తాయి. తండ్రివైపునుంచి, తల్లివైపునుంచి "కజిన్" బంధుత్వం కలవారు — అది దగ్గర బంధుత్వమైనా, దూరపుదైనా — నేడు వివాహం చేసుకుంటున్నారు. వీనిని రక్తసంబంధం గల అక్కచెల్లెళ్లు, అన్నదమ్ముల మధ్య జరుగుతున్న వివాహాలుగా అతడు పరిగణిస్తాడు." (మార్క్స్) — (ఎంగెల్స్ వివరణ.)

అనాగరిక ప్రజలు ఉమ్మడిగా భార్యలను కలిగి వున్నారని హెరోడోటస్, తదితర ప్రాచీన కాలపు గ్రంథకర్తలూ రాశారు. వాటికి యీ గుంపుపెళ్లి పద్ధతులు ఉదాహరణలుగా వున్నాయి. గంగానదికి ఉత్తరాన అయోధ్య రాష్ట్రంలోని తికూర్లను గురించి వాట్సన్, కేయ్‌లు తమ "ఇండియా దేశపు ప్రజలు" అనే పుస్తకంలో యిటువంటి విషయమే రాశారు:

> "వారు పెద్దపెద్ద కుటుంబాలలో కలిసి (అంటే, లైంగికంగా) దాదాపు విచక్షణా రహితంగా నివసిస్తున్నారు. ఒకవేళ ఇద్దరు వ్యక్తులు వివాహం చేసుకున్నట్లు పరిగణింపబడితే, ఆ బంధం నామమాత్రమే."

గణసంస్థ అత్యధిక సందర్భాల్లో పునాలువన్ కుటుంబ రూపంలోనుంచే సరాసరి వచ్చినట్లు కనిపిస్తుంది. ఆస్ట్రేలియాలోని తరగతుల విభజనపద్ధతి దానికి మూలం అయి ఉండవచ్చు.[114] ఆస్ట్రేలియనులకు గణాలున్నాయి. అక్కడ పునాలువన్ కుటుంబం యింకా లేదు. కాని అంతకంటే మొరటైన ఒక గుంపుపెళ్లి రూపం అక్కడ అమలులో ఉండేది.

అన్ని రకాల గుంపుపెళ్లిళ్లలోనూ పిల్లలకి తండ్రి ఎవరనేది తెలియదు. కాని తల్లి ఎవరో తెలుస్తుంది. కుటుంబంలోని పిల్లలందర్నీ ఆమె తన బిడ్డలనే అనవచ్చు. అందరి యెడలా సమానంగానే మాతృవిధులను నిర్వహించవచ్చు. అయినా ఆమె తన సహజ సంతానాన్ని గుర్తించగలదు. అందుచేత గుంపుపెళ్లి ఉన్నంత కాలమూ సంతానాన్ని తల్లివైపు నుంచే పరిగణిస్తారు, అందుచేత "ఆడపరంపర" మాత్రమే లెక్కలోకి వస్తుంది. ఆటవిక యుగంలోనూ: అనాగరిక యుగపు నిమ్న దశలోనూ ఉన్న ప్రజలందరిలో యిది యింతే. ఈ విషయాలను మొదట కనుక్కొన్నవాడు బాహోఫెన్. ఇది ఆయన సాధించిన గొప్ప విషయాల్లో రెండవది. తల్లివైపునుంచి సంతానాన్ని గుర్తిస్తారని సూచించడానికీ, దాని ఫలితంగా ఆ కాలంలో జ్ఞాతిబాంధవ్యం తల్లివైపునుంచే గుర్తించబడుతుందని సూచించడానికీ ఆయన "తల్లిహక్కు" అనే మాట నుపయోగించాడు. క్లుప్తతకోసం నేనూ అదే వాడుతున్నాను. కాని ఈ పదం సరిఅయినది కాదు. ఏమంటే ఈ దశలోవున్న సమాజంలో చట్టపరమైన అర్థంలో "హక్కు" అనే మాటకు అర్థంలేదు.

పునాలువన్ కుటుంబంలోని ప్రధాన బృందాలు రెండింటిలో ఒకటి తీసుకుందాం. ఒకే తల్లియొక్క కూతుళ్లూ, వారి వేలువిడిచిన అక్కచెల్లెళ్లూ ఒక బృందం. వీరి అందరి సంతానం, వీరందరికీ తల్లివైపునుంచి సోదర బంధుత్వం ఉన్న మగవాళ్లు కూడా ఈ బృందానికి చెందుతారు. ఈ బృందంలో అక్కచెల్లెళ్లకు అన్నదమ్ములు భర్తలుకారని ఊహిద్దాం. ఇట్టివారే తర్వాత గణసంస్థలో మనకు కనిపిస్తారు. ఇది గణంయొక్క ప్రప్ర

థమ రూపం. గణంలోని వారందరికీ ఆదిమాత ఒకర్తె. ఆమె వంశీయులలో ఒక్కొక్క తరంలోని ఆడ సంతతివారు అంతా ఒకళ్లకొకళ్లు అక్కచెల్లెళ్లు. వీరిలో అక్కచెల్లెళ్లకు వారి అన్నదమ్ములు భర్తలు కాజాలరు. అందుచేత ఆ భార్యాభర్తలకు ఆదిమాత ఒకర్తె కాదు. వారు ఒకే రక్తసంబంధానికి చెందినవారూ కాదు. ఈ అక్కచెల్లెళ్ల పిల్లలందర్నీ ఆ బృందంలోనివారిగానే గుర్తిస్తారు. ఏమంటే సంతానాన్ని తల్లివైపునుంచే గుర్తించుతారు కనుకనూ, అదే నిస్సందేహమైనది గనుకనూ అదే లెక్కలోకి వస్తుంది. తల్లివైపునుంచి బంధుత్వం కలిసిన వేలువిడిచిన సోదరీ సోదరుల మధ్య కూడా దాంపత్య సంబంధాలు నిషేధించబడ్డంతో, రక్తసంబంధీకుల కుటుంబ బృందం గణంగా మారిపోయింది. అంటే ఆడపరంపరకు చెందిన రక్తసంబంధీకులతో కుటుంబం ఏర్పడుతుంది. ఈ కుటుంబంలో వారిమధ్య వివాహం నిషిద్ధం, ఇప్పటినుంచీ గణం మొత్తానికి చెందిన సాంఘిక, మత స్వభావం గల సంస్థల సహాయంతో యివి దృఢపడ్డాయి. ఒకే తెగకు చెందిన గణాలలో కూడ దేనికది ప్రత్యేకంగా రూపొందాయి, దీనిని గురించి ముందుముందు తెలుసుకుందాం. అయితే పునాలువన్ కుటుంబ రూపంనుంచి దానంతటదే గణసంస్థ తప్పనిసరిగా పరిణామం పొందు తుందని గ్రహించకలిగినప్పుడు, అటువంటి సంస్థలుగల ప్రజలలో — అనాగరిక, నాగరిక జాతులందరిలోనూ — ఒకనాడు పునాలువన్ కుటుంబ రూపం ఉండేదని నిర్ధారణగా చెప్పవచ్చును.

మోర్గన్ తన పుస్తకం రాసేనాటికి గుంపుపెళ్లిళ్లకు సంబంధించిన విషయాలు మనకంతగా తెలియవు. తరగతులుగా ఏర్పడిన ఆస్ట్రేలియన్లలోని గుంపుపెళ్లిళ్లను గురించి మాత్రం చాల స్వల్పంగా తెలుసును. హవాయి దీవులలోని పునాలువన్ కుటుంబం గురించి తెలిసినంతవరకూ ఆయన 1871 నాటికి ప్రచురించాడు. ఈ పునాలువన్ కుటుంబం ఒకవేపు అమెరికన్ ఇండియన్ల రక్తసంబంధ రూపానికి పూర్తిగా సరిపడింది. మోర్గన్ పరిశోధనలన్నింటికీ యీ వ్యవస్థయే ఆరంభాంశం. రెండోవైపు తల్లిహక్కుతో కూడిన గణాలు సరాసరి పునాలువన్ కుటుంబంనుంచే పరిణతి పొందినాయని ఇది చూపుతోంది. అంతేకాక ఆస్ట్రేలియాలోని తరగతి విభజన పద్ధతి కంటె యీ పునాలువన్ కుటుంబం ఉన్నతమైన అభివృద్ధి దశను చూపుతోంది. అందుచేతనే "జంట పెళ్లి" రావడానికి ముందు ఇది ఒక అత్యవసరమైన మెట్టు అనీ, సర్వత్రా యిది ఆ కాలంలో ఉండిఉండాలనీ మోర్గన్ పరిగణించాడు. అటుతర్వాత గుంపుపెళ్లికి సంబంధించిన చాల విషయాలు మనకు తెలిసేయి. ఈ విషయంలో మోర్గన్ చాలా దూరం వెళ్లాడని మనకిప్పుడు తెలుసు. అయితేనేం, పునాలువన్ కుటుంబాన్ని కనుగొనడంద్వారా గుంపు పెళ్లిళ్లయొక్క అత్యున్నత, ప్రామాణిక రూపాన్ని ఆయన కనుగొన్నాడు. ఈ రూపంనుంచి ముందు దశలకు వచ్చిన పరిణామాలను అతి సులభంగా ఊహించ వచ్చును.

లారిమెర్ ఫైసాన్ అనే ఇంగ్లీషు మిషనరీ యీ గుంపుపెళ్లి విషయంలో అనేక కొత్త విషయాలు సమీకరించాడు. ఆయనకు మనం కృతజ్ఞత చూపవలసినదే. ఈ మాదిరి పెళ్లికి ప్రామాణిక నిలయమైన ఆస్ట్రేలియాలో యెన్నో సంవత్సరాలపాటు ఆయన యీ మాదిరి కుటుంబ రూపాన్ని గురించి పరిశోధించాడు. దక్షిణ ఆస్ట్రేలియాలోని మౌంట్-గాంబీర్ ప్రాంతంలో వున్న ఆస్ట్రేలియన్ నీగ్రోలు అతి నిమ్న అభివృద్ధి దశలో ఉన్నట్లు ఈయన కనుగొన్నాడు. ఇక్కడి తెగంతా రెండు పెద్ద తరగతులుగా విభజింపబడింది. వీటిలో ఒకటి క్రోకీ, రెండోది కుమైట్. ఈ రెండు తరగతుల్లోనూ కూడ తరగతిలోపల దాంపత్యం పూర్తిగా నిషిద్ధం. పైగా ఒక తరగతిలో పుట్టిన ప్రతి మగవాడూ పుట్టుకతోనే రెండవ తరగతిలో పుట్టిన ప్రతి స్త్రీకీ భర్త. అలాగే స్త్రీలు కూడా రెండో తరగతిలోని ప్రతి మగ వానికీ భార్యలు. ఇక్కడ వివాహం వ్యక్తుల మధ్య జరగలేదు. గుంపుకీ గుంపుకీ, తరగతికీ తరగతికీ మధ్య వివాహం జరిగింది. అయితే బహిర్వివాహపద్ధతిని అనుసరించే రెండు తర గతులుగా విభజింపబడటంతప్ప వీనిలో స్త్రీ పురుషుల వయస్సులో తారతమ్యాలుగాని, దగ్గర, దూర బంధుత్వాలుగాని అభ్యంతరంగా గుర్తించబడవు. ఈ విషయం యిక్కడ గమనించవలసివుంది. ప్రతి క్రోకీవానికీ, ప్రతి కుమైట్ ఆడుదీ భార్యే. అది జన్మతః వచ్చిన హక్కు. తల్లిహక్కు ప్రకారం, కుమైట్ స్త్రీ ద్వారా కలిగిన అతని కూతురు కూడ కుమైట్ తరగతికి చెందినదే అవుతుంది. ఆమె కుమైట్ తల్లియొక్క సంతానం కావడంచేత జన్మతః ఆమె ప్రతి క్రోకీ మగవానికీ భార్యే. ఆ మగవాళ్లలో తండ్రి కూడ వుంటాడు. మొత్తంమీద మనకు తెలిసినంతవరకూ యీ తరగతుల నిర్మాణం దానికి నిషేధం విధించినట్లు కనిపించదు. తల్లిదండ్రులకూ బిడ్డలకూ మధ్య లైంగిక సంబంధం వుండడం తప్పుగా పాటించబడని రోజులలో (ఈమాదిరి సంబంధాల నిషేధాలు వాటంతటవే ఆచరణలో కొస్తున్నప్పటికీ) ఈ సంస్థలు పుట్టి వుండాలి. స్త్రీ పురుష సంబంధాలు స్వేచ్ఛగా సాగుతున్న దశ అనేది లేకపోతే తరగతులు ఏర్పడేనాటికి తల్లిదండ్రులకీ, పిల్లలకూ మధ్య అదివరకే లైంగిక సంబంధం నిషేధించబడి ఒక ఆచారంగా పాటించబడి వుండాలి. అదే నిజమయితే రక్తసంబంధ వ్యవస్థలోంచి యీనాటి తరగతుల వ్యవస్థ పుట్టివుందనాలి. దాని తర్వాత వచ్చిన మొదటిదశ అనుకోవాలి. ఈ ఊహే మరింత సముచితమని నా అభిప్రా యం. నాకు తెలిసినంతవరకూ ఆస్ట్రేలియాలో తల్లిదండ్రులకూ, పిల్లలకూ మధ్య లైంగిక సంబంధాలున్నట్లు కనబడదు. తల్లిహక్కు గల గణసంస్థ బహిర్వివాహ పద్ధతికి పరిణామ రూపం. ఆ గణం ఏర్పడేందుకు పూర్వమే యీ నిషేధం అమలులోకి వచ్చినట్లు ఆస్ట్రేలియాలోని గణ విధానమే సూచిస్తోంది.

దక్షిణ ఆస్ట్రేలియాలోని మౌంట్-గాంబీర్ ప్రాంతంలోనేగాక, తూర్పుగా డార్లింగ్ నదీ ప్రాంతాలలోనూ, ఈశాన్యంగా క్వీన్స్‌లాండ్‌లోనూ కూడ రెండు తరగతుల వ్యవస్థ

అమలులో వున్నట్టు కనపడుతూంది. ఈవిధంగా, యిది బాగా వ్యాప్తిచెందింది. ఈ వ్యవస్థ అన్నదమ్ములకూ అక్కచెల్లెళ్ళకూ మధ్య, తల్లివైపు అన్నదమ్ముల పిల్లల మధ్య, అక్కచెల్లెళ్ల పిల్లల మధ్య వివాహాలను నిషేధిస్తోంది. వారంతా ఒకే తరగతికి చెంది ఉండటమే దీనికి కారణం. కాని అక్కచెల్లెళ్ల పిల్లలు, అన్నదమ్ముల పిల్లలు ఒకరినొకరు వివాహం చేసుకొనవచ్చు. న్యూసౌత్‌వేల్సులో డార్లింగ్ నదీ ప్రాంతాలలోని, కామీలారాయి తెగవారు వాని తప్పడాన్ని నిషేధించడంలో మరో అడుగు ముందుకు వేశారు. మొదట రెండు తరగతులు, మళ్లీ ఒక్కొక్కటి రెండు తరగతులుగా విభజన అయాయి. అదేవిధంగా, ఈ నాలుగు తరగతుల్లోని ప్రతి ఒక్కటీ మరో నిర్దిష్ట తరగతిని పెళ్లిచేసుకుంటుంది. మొదటి రెండు తరగతులూ పుట్టుకతోనే పరస్పరం భార్యాభర్తలు. తల్లి మొదటి తరగతికి చెందుతుందా, రెండవ తరగతికి చెందుతుందా అన్నదాన్నిబట్టి పిల్లలు మూడవ, లేక నాలుగవ తరగతికి చెందుతారు. అదే విధంగా పరస్పరం వివాహ బంధితులైన మూడవ, నాలుగవ తరగతులకు చెందిన పిల్లలు మరల మొదటి, రెండవ తరగతులకు చెందుతారు. ఈ విధంగా, తరగతులతోబాటు తరాలు కూడ విభజింపబడతాయి. ఒక తరంవారు ఒకటీ రెండూ తరగతులయితే, వారి తర్వాత తరం మూడోతరగతీ నాలుగోతరగతీ అవుతుంది. మూడోతరం మళ్లీ మొదటి రెండు తరగతులకు చెందుతుంది. ఈ పద్ధతిలో తల్లివేపునుంచి వేలువిడిచిన బంధువులు మొదటి తరంవారయితే భార్యాభర్తలు కాజాలరు. కాని వారి మనుమరాళ్లకూ ఆ అవకాశం వుంటుంది. ఇదొక చిత్రమైన గజిబిజి పద్ధతి. మాతృస్వామిక గణాల నిర్మాణంతో యిది మరింత గజిబిజి అయింది. కాని ఆ వివరాలలోకి యిప్పుడు పోలేము. ఇక్కడ గమనించవలసిందేమంటే వావితప్పిన లైంగిక సంబంధాన్ని నివారించడానికి ప్రయత్నాలు మళ్లీమళ్లీ చేయడం. కాని అవి సద్యోజనితంగా, లక్ష్యం తెలియకుండా జరిగాయి.

పై విషయాలనుపట్టి చూస్తే, ఆస్ట్రేలియాలో తరగతి పెళ్లి అనేది గుంపుగా ఉన్న ప్రజలమధ్య జరుగుతున్న ఉమ్మడి పెళ్లిగానే ఉందని తెలుస్తూంది. ఇది ఆ ఖండమంతా చిందరవందరగా నివసిస్తున్న పురుషుల, అట్లాగే చిందరవందరగా వున్న స్త్రీల మధ్య ఉమ్మడి వివాహం. ఈ గుంపుపెళ్లి సానికొంపల రంగు కళ్లద్దాలతో చూసే అల్పసంస్కారుల దృష్టిలో వట్టి వ్యభిచారం. నిజానికి దానిని జాగ్రత్తగా పరిశీలిస్తే అంత వికటంగా కనిపించదు. పైపెచ్చు యిల్లాంటి పద్ధతి అమలులో ఉన్నదనే అనుమానం కూడ ఎన్నో సంవత్సరాలదాక కలగలేదు. ఈనాడు కూడ యిదంతా పొరపాటు నిర్ధారణ అనే వాళ్ళు లేకపోలేదు. పైపై దృష్టితో చూస్తే యీ గుంపుపెళ్లి అస్థిరమైన దంపతీ వివాహంగా కనిపిస్తుంది. బహుభార్యాత్వానికీ, అడపాదడపా వ్యభిచారానికీ యివి ఒక రకమైన మారురూపం అనిపిస్తుంది. ఈ వివాహపద్ధతులు యించుమించుగా ఆచరణలో సగటు యూరపియన్ పద్ధతులకు సరిపడినట్లే కనిపిస్తుంది. ఆ వివాహ సంబంధాలను నియంత్రించే

సూత్రాలను తెలుసుకోడానికి ఫైసాన్, హౌవిట్‌ల మాదిరిగా సంవత్సరాల తరబడి కృషిచేయ వలసి వుంటుంది. ఆస్ట్రేలియన్ నీగ్రో తన యింటికి వందలకొద్దీ మైళ్లదూరంలో తన భాష కూడ తెలియని ప్రజలమధ్య తండానుండి తండాకీ, తెగనుండి తెగకీ తిరిగేటప్పుడు అమాయికంగా ఎటువంటి ప్రతిఘటనా లేకుండా తమను తాము సమర్పించుకొనే స్త్రీలు తరచుగా తనకు తటస్థపడటం అతను చూస్తాడు. చాలామంది భార్యలున్నవాడు ఆ రాత్రికి తన భార్యలలో ఒకర్తెను అతిథి కివ్వాలనేది వీరి ధర్మం. ఈ ఆచారం యూరోపి యనులకు అవినీతిగానూ, అధర్మంగానూ కనబడవచ్చు. కాని, ఆస్ట్రేలియన్ నీగ్రోలలో అమలులోవున్న ధర్మం అది. ఆ స్త్రీలు ఆగంతకుని వివాహ తరగతికి సంబంధించినవారు. అందుచేత జన్మతః వారతనికి భార్యలు. స్త్రీ పురుషుల నొకరినొకర్ని నిర్దేశిస్తున్న ఈ నైతిక ధర్మమే తమతమ తరగతులకు వెలుపల లైంగిక సంబంధాలను నిషేధిస్తూంది. వారిలో రాక్షస వివాహ పద్ధతి కొన్నిచోట్ల చాల ప్రచారంలోనూ, కొన్ని చోట్ల ఆచారంగా కూడా వుంది. అటువంటి సందర్భాలలో కూడా తరగతుల నియమం తు.చ తప్పకుండా పాటింపబడుతుంది.

జంటపెళ్లి రూపంలోనేనా యే ఇద్దరు వ్యక్తులమధ్యనే దాంపత్య సంబంధంవుండే స్థితి ఏర్పడుతూందనడానికి యీ రాక్షస వివాహ పద్ధతి ఒక సూచన. ఒక పడుచువాడు తన మిత్రులు కొందరిని సాయం తీసుకొని, ఒక పడుచు నెత్తుకుపోయినప్పుడూ, లేవ దీసుకుపోయినప్పుడూ వారందరూ ఆమె నొమారు వరుసగా అనుభవిస్తారు. ఆతరువాత ఆ ప్రయత్నం ప్రారంభించినవానికి ఆమె భార్యగా అంగీకరించబడుతుంది. అందుకు భిన్నంగా ఆవిధంగా పట్టితెచ్చిన ఆమె తన మగనినుంచి పారిపోయి, మరొకనిచేత పట్టుబడితే ఆమె రెండోవానికి భార్య అవుతుంది, మొదటివాని కామెమీద హక్కు వుండదు. ఆవిధంగా, ఒక మూల "గుంపుపెళ్లి" సర్వసాధారణాచారంగా పరిపాటిలోనే వున్నా, దాని పక్కపక్కనే దానితోపాటుగానే పరిమిత, ప్రత్యేక సంబంధాలు కూడా ఏర్పడుతున్నాయి. కొద్దికాలమే కలిసివుండనీ, దీర్ఘకాలం కలిసివుండనీ జంటలుగా నివసించడం ఏర్పడుతూంది. రెండోవేపున ఆ గుంపులలోను, వాటి సరసన బహుభార్యాత్వం కూడ సాగుతూంది. ఇక్కడ కూడా "గుంపు పెళ్లి" పద్ధతి క్రమక్రమంగా అంతరించిపోతూందన్నమాట. అయితే యూరపియనుల ప్రభావంవల్ల ముందేది అంతరిస్తుంది? గుంపుపెళ్లి రూపమా? దానిని అనుసరించే ఆస్ట్రే లియను నీగ్రోలా?

ఏది ఏమైనా ఆస్ట్రేలియాలో అమలులో వున్నమాదిరి తరగతి వివాహాలు గుంపుపెళ్లి పద్ధతిలో కూడ అతి ప్రాచీన, ప్రాథమిక రూపాలు. పునాలువన్ కుటుంబ రూపం మనకు తెలిసినంతలో అత్యున్నత అభివృద్ధి దశకు చెందిన గుంపుపెళ్లి రూపం. సంచార జీవితం గడుపుతున్న ఆటవిక దశలో వున్న మానవుని సామాజికాభివృద్ధి స్థాయికి ఇది

సరిపడుతుంది. పునాలువన్ కుటుంబం అమలులో వుందంటే ఆనాడు కొంతవరకు మానవులు స్థిరవాసం చేస్తున్నారనీ, సమిష్టి కుటుంబాలుగా నివసిస్తున్నారనీ వూహించగలం. ఆ కుటుంబం భవిష్యదభివృద్ధి దశకు ప్రాతిపదిక అవుతుంది. ఈ రెండు దశలకూ మధ్య తప్పకుండా ఎన్నో అంతర్దశ లుండితీరుతాయి. వాని పరిశీలన ఇప్పుడే ప్రారంభమయింది. దానినింకా తరచి చూసినవారు తక్కువ. ఎంతో పరిశోధన జరగవలసి వుంది ఈ విషయంలో.

3. జంటపెళ్లి కుటుంబం. గుంపుపెళ్లి కాలంలోనూ, అంతక్రితమూ కూడా స్త్రీ పురుషులు అల్పకాలమో, అధికకాలమో జంటలుగా కలిసి జీవించకపోలేదు. అసంఖ్యాకంగా వుండే భార్యలలో ఒకామె మగవానికి ముఖ్యభార్యగా వుండేది. (ముద్దులభార్య అనడానికి తగిన పరిస్థితులు అప్పటికింకాలేవు.) మిగిలిన మగవాళ్లందరిలో అత డామెకు ప్రధాన భర్త. ఇదే క్రిస్టియన్ మతబోధకులను ఎంతో కంగారుపెట్టిందని చెప్పవచ్చును. గుంపుపెళ్లి అంటే యిష్టంవచ్చినప్పుడు ఇష్టంవచ్చిన ఆమెను అనుభవించే భార్యల సమూహం అనీ, హద్దూపద్దూలేని వ్యభిచారానికి ఆటపట్టు అనీ వారు భావించారు. క్రమంగా గణసంస్థలు దృఢపడేకొద్దీ, చివరకు వివాహ సంబంధాలు అసంభవమైన "సోదరీ," "సోదర" తరగతుల సంఖ్య పెరిగినకొద్దీ, తత్ఫలితంగా జంట పెళ్లిళ్ల అలవాటునుంచి అవసరంగా మార్పు చెందాయి. రక్తసంబంధం కలవారి మధ్య వివాహ సంబంధాలపై నిషేధం గణసంస్థలో వచ్చింది. ఇది మరిన్ని మార్పులకు దారితీసింది. ఇరాక్యూలలోను, అనేక ఇండియను తెగలలోను మన కది కనిపిస్తూంది. వారు అనాగరిక యుగపు నిమ్నదశలో వున్నవారు. వారిలో అనేక వందల తరహాల బంధుత్వాలు ఏర్పడివున్నాయి. ఏ విధమైన బంధుత్వం కలిసినప్పటికీ వారి మధ్య వివాహం నిషిద్ధం. ఈ నిషేధాలు పెచ్చుపెరిగి గుంపుపెళ్లిళ్ల అంతకంతకు అసంభవం అయిపోయాయి; ఆ పద్ధతికి బదులు జంటపెళ్లి కుటుంబం అమలులోకి వచ్చింది. ఈ దశలో మగవాడు ఒకే ఆడదానితో జీవిస్తాడు. బహుభార్యాత్వమూ, ఇతర స్త్రీలతో పొందూ మగవాళ్ల ప్రత్యేక హక్కుగా తయారయింది. అయితే, ఆర్థిక కారణాల మూలంగా బహుభార్యాత్వం అరుదు. కాని, రెండోవేపున ఒకనితో వున్నంత కాలమూ స్త్రీ ఖచ్చితంగా పాతివ్రత్యం పాటించవలసిందే. మరొకరితో కలియడం జరిగితే బహుకఠోరంగా శిక్షింపబడేవారు. అయితే స్త్రీ పురుషులలో ఎవరికి ఇష్టంలేకపోయినా, వివాహబంధాన్ని అతి సులువుగా విడగొట్టివేసుకోవచ్చు. వారికి పిల్లలుంటే వారు వెనకటి మాదిరిగా తల్లి దగ్గరే వుంటారు.

ఈవిధంగా రక్తసంబంధంగల వారిమధ్య వివాహ నిషేధం విస్తరించిన కొద్దీ "ప్రాకృతిక వరణ" సూత్రం కూడ ప్రభావం కలిగిస్తుంది.

> "అంతక్రితం రక్తబాంధవ్యంలేని గణాలమధ్య వివాహం జరగడంవలన శారీరకంగానూ, మానసికంగానూ కూడ బలిష్ఠమైన సంతానం కలగసాగింది....

అభివృద్ధి పొందుతున్న రెండు తెగలు ఒకటిగా కలిసినప్పుడు కొత్త పుర్రె, మెదడూ విస్తరిస్తాయి. రెండు తెగలవారి శక్తిసామర్థ్యాలూ ఇద్దరిలోనూ విస్తరిస్తాయి"*

అన్నాడు మోర్గన్.

ఆవిధంగా గణనిర్మాణంలో వున్న తెగలు వెనకబడిన వానిమీద పైచెయ్యి సంపాదించడం లేదా వెనకబడిన తెగలు తమను తప్పనిసరిగా అనుకరించేటట్లు చేసుకోవడం తప్పదు.

కాబట్టి ప్రాచీనకాలంనాటి కుటుంబచరిత్రను పరిశీలిస్తే, వివాహబంధం పరిధి అంతకంతకూ సంకుచితం అవుతూవచ్చిందని తెలుస్తుంది. మొట్టమొదట తెగకుతెగంతా వివాహబంధ పరిధిలో వుండేది. ఆ పరిధిలో వున్న స్త్రీ పురుషులంతా ఉమ్మడిగా భార్యా, భర్తలు మొదట దగ్గరబంధువులు, క్రమంగా దూరబంధువులు, చివరకు పెండ్లి ద్వారా బంధుత్వం కలిసినవారిని కూడా వివాహ బంధంలోంచి మినహాయించడం, వారి మధ్య దాంపత్య సంబంధాలు నిషేధించడం వచ్చింది, గుంపుపెళ్లి ఏవిధంగానూ ఆచరణలో సాధ్యంకాకుండా పోయింది. ఇంక మిగిలింది జంట. ఆ జంటమధ్య కూడా వివాహసంబంధం అప్పటికింకా చాల వదులుగానే వుంది. అణుప్రాయమైన యీ జంటను కూడా తెంపివేస్తే ఇంక వివాహమనేదే వుండదు. ఈ ఒక్క విషయం చూసే ఒకే భార్య, ఒకే భర్త వివాహాలకు ఆధునిక అర్థంలో వ్యక్తులమధ్య లైంగిక ప్రేమ మూలంకాదని మనకు కనిపిస్తుంది. ఈ దశలో వున్న ప్రజ అందరిలోను యీ ఆచారం వుంది. దాని కింతకన్న పెద్ద సాక్ష్యం అక్కర్లేదు. అంతక్రితం అమలులోవున్న కుటుంబపద్ధతులలో మగవాడికి ఆడవాళ్ళకొరత యెన్నడూ లేదు. పైపెచ్చు చాల ఎక్కువగా లభించేవారు. కాని, ఇప్పుడింక ఆడవాళ్లు కరువయారు. వాళ్లకోసం వెతుకులాడవలసి వస్తుంది. ఫలితంగా జంటపెళ్లితోపాటుగా ఆడపిల్లల్ని ఎత్తుకొచ్చి పెళ్లి చేసుకోవడమూ, డబ్బు ఇచ్చి కొనుక్కోవడమూ వంటి పద్ధతులు వ్యాప్తిలోకి వచ్చాయి. ఇవి ఆ వ్యవస్థయొక్క గుర్తులే గాని, అంతకంటే మరేం కాదు. పరిస్థితులు మూలమట్టుగా మారిపోయినదానికి అవి ఫలితం మాత్రం కాదు. ఈ గుర్తులనూ భార్యల్ని సంపాదించడంలో అవలంబించిన పద్ధతుల్నీ మాక్‌లెన్నాన్ ప్రత్యేక తరగతి వివాహపద్ధతులనుగా ఊహించాడు: "రాక్షస వివాహం," "కన్యాశుల్క వివాహం" వాటి ప్రకారం ప్రత్యేక కుటుంబ తరగతులయాయి. అమెరికాలోని ఇండియను తెగలలోనూ, అదే అభివృద్ధిదశలో వున్న ఇతరులలోనూ ఎక్కడా సర్వసాధారణంగా వివాహ ప్రక్రియ వధూవరుల చేతులలో వుండదు, అసలు వారిని సంప్రదించడం అనేదే వుండదు. చేయవలసిందంతా తల్లుల ద్వారానే

---

* మార్క్స్ – ఎంగెల్స్ పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజి 28. – సం.

జరిగిపోతుంది. ఒకరి ముఖాలొకరు ఎరగని వ్యక్తుల్ని వారు దంపతులను చేసేస్తారు. వివాహకాలం సమీపించినాకనే తమకు సంబంధం కుదిరినట్లు వారికి తెలుస్తుంది. పెళ్లికి పూర్వం వరుడు వధూ పక్షంవారికి బహుమతులిస్తాడు. వధూ పక్షంలో కూడా ఆమె తల్లి వేపు వారికేగాని తండ్రికీ, తండ్రివేపువారికీ కాదు. పెళ్లికూతుర్ని కొనుక్కుని ఇచ్చిన బహుమతులుగానే వీనిని లెక్కకడతారు. ఇరువురిలో ఎవరు కాదన్నా ఆ పెళ్లి విచ్ఛిన్నం చేయబడుతుంది. కాని, చాలా తెగలలో – ఇరాక్వ్యూలనే వుదాహరణకు తీసుకోవచ్చు – ఆవిధంగా వివాహం విచ్ఛిన్నం కావడానికి జనాభిప్రాయం క్రమంగా ప్రతికూలంగా అభివృద్ధి చెందింది. తగవులు వచ్చినప్పుడు, ఇరువేపుల దగ్గర బంధువులూ కలుగచేసుకుంటారు. సమాధానపరచడానికి ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నాలన్నీ విఫలమైనప్పుడే దంపతులు విడిపోతారు. పిల్లలుంటే వారు తల్లిదగ్గరే వుంటారు. ఉభయులూ మళ్లీ వేరేవేరే పెళ్లిచేసుకోవచ్చు.

సొంత కాపురం పెట్టడాన్ని అవసరమూ, వాంఛనీయమూ చెయ్యజాలనంత బలహీనంగానూ, అస్థిరంగానూ, వుండటంచేత ప్రాచీన కాలంనుంచీ అనుశ్రుతంగా వస్తున్న సమిష్టి గృహ వ్యవస్థను జంటపెళ్లి రద్దుపరచలేక పోయింది. కాని సమిష్టి గృహ వ్యవస్థలో స్త్రీదే ఎప్పుడూ పైచేయి. అసలు తండ్రిని గుర్తించడం అసంభవమే కావడంచేత సంతానాన్ని తల్లివైపునుంచే గుర్తిస్తారు. ఫలితంగా తల్లులకే ఉన్నతమైన గౌరవం. నాగరికుల మనుకొనేవారిలో ప్రారంభంనుంచీ స్త్రీ పురుషుడికి బానిసగా వుంటూoదని పద్దెనిమిదో శతాబ్దపు వైతాళికుల కాలంనుంచీ ఒక అభిప్రాయం ప్రచారంలో వుంది. అది అత్యంత అసంగతమైన మాట. ఆటవికదశలో వున్న ప్రజలలో, అనాగరికయుగపు నిమ్న, నడిమి దశలలోని వారిలో, ఒక్కొక్కప్పుడు ఉన్నత దశలోని వారిలో కూడ స్త్రీ స్వతంత్రురాలు. అంతేకాదు ఆమెకెంతో గౌరవం. ఇరాక్వ్యూ జాతికి చెందిన సెనెకా తెగలమధ్య చిరకాలం జీవించిన ఆర్థర్ రైట్ అనే మతబోధకుడు జంట పెళ్లి కుటుంబంలో స్త్రీకి వుండే స్థానాన్ని ఇల్లా వివరించాడు:

> "ఇంక వారి కుటుంబ వ్యవస్థలో అంటే, పూర్వకాలపు పెద్ద ఇళ్లల్లో (అనేక కుటుంబాలు కలిసి ఏర్పడ్డ ఉమ్మడి గృహాలు) నివసిస్తున్నప్పుడు... ఇంట్లో ఒక జిమ్మా (గణం) అధికారం చలామణీ కావడం సంభవం. ఆ జిమ్మా స్త్రీలు ఇతర జిమ్మాల (గణాల)నుంచి పురుషుల్ని తెచ్చుకుంటారు.... సాధారణంగా ఇంట్లో ఆడవాళ్లదే పెత్తనం.... దినుసులన్నీ ఉమ్మడిసొత్తు. భర్త అనండి, ప్రేమికుడనండి, మగవాడు తన వంతు సంబారాలు తెచ్చి పడెయ్యకపోతే వాడి అవస్థ ఉంటుంది చూడాలి. ఏక్షణంలోనైనా అతడిని నెత్తిన గుడ్డవేసుకొని

పొమ్మనవచ్చు – అతడికాయింట పిల్లలెందరున్నాసరే, అతని వస్తువులెన్ని వున్నా సరే. నెత్తిన ఆదేశం వచ్చాక, మరి అక్కడ వుండడం అతనికి క్షేమం కాదు. నిజంగా పొగపెట్టేస్తారు. ఇంక తన జిమ్మా (గణం)కు పోవలసిందే. సాధారణంగా అతడు మరోచోట వివాహ సంబంధం కుదుర్చుకుని వెళ్లిపోతాడు. ఇతర అన్ని చోట్లలాగే ఇక్కడా జిమ్మా (గణం)లో స్త్రీలదే పెత్తనమూ అధికారమూ. అవసరం వచ్చిందంటే వాళ్లు తమ నాయకుడికి కూడా 'కొమ్ములు ఊడబీకి' (ఇది వాళ్ల పారిభాషికపదం) సామాన్య యోధులలో ఒకణ్ణిగా చెయ్యడానికి ఏమాత్రం వెనుతియ్యరు."*

సమిష్టి గృహవ్యవస్థలో ఆ యింట్లో వుండే స్త్రీలు అందరూ కాని, ఇంచుమించు అందరూగాని ఒకే గణానికి చెందివుంటారు. వారి భర్తలంతా ఇతర గణాలనుంచి వస్తారు. ప్రాచీన కాలంలో ఆడవాళ్ల పెత్తనం సర్వసాధారణ విషయం అయివుండటానికదే భౌతిక కారణం. ఈ విషయాన్ని బాహోఫెన్ గుర్తించాడు. ఆయన కనిపెట్టిన మహత్తర విషయాలలో ఇది మూడోది. ఆటవిక తెగల్లోనూ, అనాగరిక తెగల్లోనూ స్త్రీలమీద పనిభారం ఎక్కువని మతబోధకులూ, చూసివచ్చినవారూ చెప్తారు. దానికీ పైన పేర్కొనబడిన ఇంటి పెత్తనానికీ వైరుధ్యం లేదు. స్త్రీ పురుషుల మధ్య శ్రమ విభజనను నిర్ణయించేది సమాజంలో స్త్రీలకున్న స్థానం కాదు. దానికి పూర్తిగా ఇతర కారణాలున్నాయి. ఆడవాళ్లకు తగినవనుకునే వాటికన్న ఎక్కువ పనిచేసే ఆ ఆడవాళ్లకి యూరపియను సమాజంలోని ఆడవాళ్ల కన్నా ఎక్కువ గౌరవం వుంది. నాగరిక జాతులలోని గృహిణికి బూటకపు గౌరవం బోలెడంత లభిస్తుంది. నిజమైన పని ఆమెకుండదు. కాని ఆమె సామాజిక పాత్ర మాత్రం అధికంగా శ్రమపడి పనిచేసే అనాగరిక స్త్రీకన్న హీనం, అనాగరిక ప్రజలలో వారి స్త్రీ నిజంగా గృహిణి (lady, frowa, Frau), అన్ని విషయాలలోనూ ఆమె గృహపత్ని.

అమెరికా వాయవ్య ప్రాంతంలోనూ, ముఖ్యంగా దక్షిణ అమెరికాలోనూ వున్న ఆదిమ జాతులు ఆటవిక యుగపు ఉన్నత దశలో జీవితం గడుపుతున్నారు. వారిలో బహు సూక్ష్మంగా పరిశోధన జరిపితే తప్ప అమెరికాలో జంటపెళ్లి గుంపుపెళ్లి ఆచారాన్ని పూర్తిగా తొలగించిందో లేదో చెప్పడం కష్టం. దక్షిణ అమెరికాలోనివారిలో లైంగిక సంబంధాలు స్వేచ్ఛను గురించి అనేక కథలు వినబడుతున్నాయి. అవన్నీ వింటూంటే అక్కడ ప్రాచీన గుంపుపెళ్లి అలవాట్లు పూర్తిగా మాసిపోయాయనుకోడానికి వీలు కనిపించదు. అక్కచెల్లెళ్లలో పెద్ద

---

* మార్క్స్ – ఎంగెల్స్, పురావస్త్ర భాండారం, 9వ సంపుటం, పేజీలు 26–27. – సం.

ఆమెను కట్టుకొన్నవాడు ఆమె చెల్లెళ్లందరినీ యుక్త వయస్సు వచ్చిన వెంటనే, తన భార్య లనుగా చేసుకొనే హక్కు ఉత్తర అమెరికాలోని నలభయి తెగల వారిలో ఈనాటికీ ఆచారంగా వుంది. అక్కచెల్లెళ్లంతా ఉమ్మడి భర్తల్ని కలిగివుండే రోజులనాటి ఆచారాల అవశేషం ఇది. కాలిఫోర్నియా ద్వీపకల్పంలోని ఆదిమతెగలవారు (వీరు ఆటవిక యుగపు ఉన్నత దశ జీవితం గడుపుతున్నారు) కొన్ని ఉత్సవాలు జరుపుకొంటారనీ, ఆ సందర్భంలో అనేక "తెగల"వాళ్లు ఒక చోట చేరి స్వేచ్ఛా సంగమం జరుపుతారనీ బాంక్రాఫ్ట్ రాస్తున్నాడు. ఈతడు "తెగ"లని పేర్కొన్నవి గణాలు మాత్రమే. ఒక గణంలోని స్త్రీలు, మరొక గణంలోని పురుషు లందరికీ ఉమ్మడిగా భార్యలు, అలాగే రెండో గణంలోని వారు కూడా మొదటి గణంలోని పురుషులందరికీ ఉమ్మడి భార్యలు. ఆ ప్రాచీన యుగపు గణాల ఆచారాల స్మృతి చిహ్నాలే యీ వుత్సవాలు. ఇదే ఆచారం ఈనాటికీ ఆస్ట్రేలియాలో వుంది, కొన్ని తెగలలో కులపెద్దలు, నాయకులు, మంత్రగాళ్లయిన పురోహితులూ ఈ ఉమ్మడి భార్యల ఆచారాన్ని స్వప్రయోజనాల కోసం వినియోగించుకొంటున్నారు. స్త్రీలలో ఎక్కువ మందిని గుత్తగొంటున్నారు. కాని, వీరు సంవత్సరంలో కొన్ని ఉత్సవదినాలలోనూ, తెగలోని జనం అంతా సమావేశం అయిన కాలంలోనూ వెనుకటికాలపు సమష్టి అనుభవానికి వొప్పుకొని, తమ భార్యలు పడుచుకారుతో సుఖం అనుభవించగల అవకాశం కలిగించ వలసివుంటుంది. అప్పుడూ అప్పుడూ జరిగే యీ మాదిరి శతుర్నాలియల్లో[115] ఏ కొద్ది రోజులపాటో ప్రాచీనకాలపు స్వేచ్ఛాసంగమపద్ధతి అమలులోకి వస్తుందంటూ వెస్టెర్మార్క్ తన పుస్తకంలో (పుటలు – 28, 29) వుదాహరణలు ఇచ్చాడు. ఇండియాలోని హోలు, సంతాలులు, పంజాలు, కోటార్లు మొదలయినవారిలోనూ, కొందరు ఆఫ్రికన్ తెగల వారిలోనూ యీ ఆచారాలు కనిపిస్తున్నాయి. వెస్టెర్మార్క్ గుంపుపెళ్లి ఆచారం వుందనడాన్ని నిరాకరిస్తూ, యీ ఆచారం దాని అవశేషం కాదనీ, ఇతర పశువుల మాదిరిగా ఆదిమ మానవుడిక్కూడా సంగమకాలం వుండేదనీ, దాని అవశేషమే యీ ఆచారమనీ అన్నాడు.

గుంపుపెళ్లికీ, జంటపెళ్లికీ నడుమవుండే సంధిదశ బాహోఫెన్ కనిపెట్టిన నాలుగో మహత్తర విషయం. ఈ సంధిదశ విస్తృతంగా కనిపిస్తూంది. ప్రాచీనకాలంలో దేవతలు విధించిన నియమాలను అతిక్రమించినందుకై ప్రాయశ్చిత్త కర్మయని బాహోఫెన్ వూహిస్తున్నది నిజంచేత స్త్రీ తాను పవిత్రంగావుండే హక్కును కొనుక్కోవడం తప్ప వేరు కాదు. ప్రాచీన కాలపు భర్తల సమూహాన్ని వదల్చుకొని ఏ ఒక్కనితోనో వుండే హక్కును ఆమె కొనుక్కొనే పద్ధతిని తాంత్రికరూపంలో కనబరచడం తప్ప వేరుకాదు. ఆమె పరిమితంగా లొంగుబాటుకు ఒప్పుకోవడంతో ప్రాయశ్చిత్తం చేసుకొంటూంది. బాబిలోనియన్ వనితలు ఏడాదికోమాటు మిలిట్టా దేవాలయంలో దేహార్పణం చేసుకొనేవారు. ఆసియా మైనరులోని ప్రజలు తమ స్త్రీ సంతానాన్ని అనాయిటిస్ దేవాలయానికి యేళ్ల తరబడి పంపేసారు.

అక్కడ వారు తమకు నచ్చినవారితో స్వేచ్ఛా సంగమం చెయ్యాల్సివచ్చేది పెళ్లికి ఆడపిల్లలు ఈ విధంగా కొంతకాలం గడపడం అవసరంగా వారు భావించేవారు. మధ్య ధరాసముద్రానికీ, గంగానదికీ మధ్య ప్రదేశంలోని ఆసియా వాసులలో చాలామంది మతాచారాల పేరుతో ఈవిధంగా ఆచరిస్తూనే వున్నారు. ప్రాయశ్చిత్త రూపంలో స్త్రీ చేయవలసిన త్యాగం కాలక్రమేణా తగ్గించబడుతూ వచ్చిందని బాహోఫెన్ రాస్తున్నాడు.

"ఏటేటా, మళ్లీమళ్లీ ఆత్మార్పణం చేయడానికి బదులు ఒక్క మారుతోనే ప్రాయశ్చిత్తం పూర్తి అవుతూంది. పిల్లల తల్లులు స్వేచ్ఛా సంగమానికి ఒడబడవలసి రావడానికి బదులు కన్యలుగా వున్నప్పుడాపని కంగీకరించడంతో సరిపడుతూంది. వివాహకాలంలో జరిగేదానికి బదులు వివాహాత్పూర్వం ఆచరించడంతో సరిపుచ్చుతున్నారు. నియమం లేకుండా అందరితోనూ సంగమించవలసిన స్థితి పోయి, తానేరుకొన్న కొద్దిమందితో సంగమించడం చాలుననేది అంగీకరించబడింది." ("తల్లిహక్కు," పేజి XIX.)

ఈవిధంగా, మతాచారాలను అడ్డుపెట్టుకోవడం ఇతరులలో లేదు. త్రేసియన్లలోనూ, కెల్టు ప్రజల్లోనూ, తదితరుల్లోనూ పూర్వకాలం వివాహం అయ్యేవరకూ యువతులు స్వేచ్ఛా సంగమాన్ని అనుభవించేవారు. భారతదేశంలోని ఆదివాసులు చాలమందిలోనూ, మలేతెగలలోనూ, దక్షిణ సముద్ర ద్వీప వాసుల్లోనూ, అనేక అమెరికను ఇండియను తెగల్లోనూ ఈనాటికీ ఈ స్వేచ్ఛ అనుమతించబడుతూంది. ఇంచుమించు దక్షిణ అమెరికా అంతటా ఆదివాసి ప్రజలలో ఈ ఆచారం అమలులో వున్నదన్న విషయం కొంచెం అధికంగా దేశంలోపలికి వెళ్లివచ్చిన వారందరూ తెలియజేశారు. అమెరికన్ ఇండియను తెగలకు చెందిన ఒక ధనిక కుటుంబంలో తాను చూసిన విషయాన్ని అగాసిస్ అనే ఆయన "బ్రెజిలులో నా సంచారం" అనే పుస్తకంలో (1886లో బోస్టన్, న్యూయార్కులలో ప్రచురించబడింది, పేజి 266) రాశాడు. పరగ్వే తోడి యుద్ధంలో ఆ యింటి యజమాని ఒక సైన్యోద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయన కుమార్తెను చూచి అగాసిస్ "యీ అమ్మాయి తండ్రి ఎల్లా ఉన్నారంటూ" గృహయజమానురాలిని ప్రశ్నించాడు. ఆ ఆఫీసరు ఆమె భర్త అని అగాసిస్ భావించాడు. ఆమె చిరునవ్వు నవ్వింది. "Nao tem pai, é filha da fortuna" — "ఈ బిడ్డకు తండ్రి లేదు, దేవుడిచ్చిన బిడ్డ" అంది. — ఈ విషయాన్ని వుదాహరిస్తూ ఆయన ఇల్లా రాశాడు:

"తమ అక్రమ సంతానాన్ని గురించి ఇండియన్ స్త్రీలూ, మిశ్రమజాతి స్త్రీలూ ఎల్లప్పుడూ ఈవిధంగానే చెప్తారు. ఇది తప్పుగాగాని, సిగ్గుచేటనిగాని

వారు అనుకోరు. ఇది అసాధారణ విషయ మేమీ కాదు. ఇందుకు విరుద్ధంగా జరగడమే అసాధారణ విషయం. పిల్లలు [తరచుగా] తమ తల్లినే ఎరిగివుంటారు. ఎందుచేతంటే తమను పోషించే భారం, బాధ్యత ఆమె మీదనే వుంటుంది. వారికి తండ్రిని గురించి తెలియనే తెలియదు. తన విషయంలోగాని, బిడ్డల విషయంలోగాని శ్రద్ధ తీసుకోవలసిన బాధ్యత అతనికున్నదని తల్లి అనుకోనే అనుకోదు."

నాగరికులకి ఆశ్చర్యంగా కనిపించేది "తల్లిహక్కు"కి, "గుంపు పెళ్లి" ఆచారానికి సంబంధించి సర్వసాధారణమైన విషయం.

ఇంక ఇతర తెగల విషయం చూదాం. పెళ్లికొడుకు స్నేహితులూ, బంధువులూ, పెళ్లికి వచ్చినవారూ పెళ్లి సమయంలోనే ముందు పెళ్లికూతుర్ని అనుభవించాకనే పెళ్లికొడుకు వంతు వస్తుంది. ఆదిమకాలంలో బలెరిక్ దీవుల్లోనూ, ఆఫ్రికాలోని ఔగిల్లాల లోనూ యీ ఆచారం వుండేది. ఇథియోపియాలోని బారెయాలలో యీ ఆచారం ఇప్పటికీ వుంది. ఇంక ఇతరులలో అధికారి అయినవాడు — అతడిని తెగపెద్ద అనండి, గణపెద్ద అనండి, వారు కాకపోతే మంత్రవేత్త, పురోహితుడు, రాజు, ఎవరో — పేరు ఏదయితేనేం అధికారి సమాజప్రతినిధిగా మొదటిరాత్రి పెళ్లికూతురుతో గడుపుతాడు. ఈ ఆచారానికి ఎవరు ఎన్ని పై మెరుగులు పూసి మరుగుపరచబోయినా, మొదటిరాత్రి హక్కు యీనాటికీ గుంపుపెళ్లి పద్ధతికి చిహ్నంగా అలాస్కా ప్రాంతవాసులలో వుంది (బాంక్రాఫ్ట్ "దేశీయ తెగలు," 1, పేజి 81). ఉత్తర మెక్సికోలోని తాహౌలలోనూ (పై పుస్తకంలో పేజి 584), ఇతరప్రజలలోనూ కూడా యిది వుంది. మొట్టమొదట కెల్టిక్ జాతులు నివసించిన దేశభాగాలలో — ఉదాహరణకు ఆరగాన్‌లో — మధ్యయుగ మంతటా ఈ ఆచారం వుంది. ఇది గుంపుపెళ్లి పద్ధతినుంచి సరాసరి సంక్రమించింది. కాస్టీల్ రాష్ట్ర రైతు ఎన్నడూ భూదాసుడుగా జీవించలేదు. కాని, ఆరగాన్‌లో అత్యంతావమానకరమైన రూపంలో భూదాస్యం వుండేది. ఫెర్డినాండ్ ది కేథలిక్ 1486లో దానిని నిషేధిస్తూ చట్టం చేసే వరకూ అది అమలుజరిగింది. ఆయన ప్రకటించిన తాఖీదులో ఇల్లా వుంది:

"ఒక రైతు పెళ్లిచేసుకున్నప్పుడు... ఈ ప్రభువులు (సినార్‌లు, బారన్‌లు) మొదటిరాత్రి ఆమెను అనుభవించకూడదు. పెళ్లినాటి రాత్రి ఆమె పడుకున్నప్పుడు తమ అధికారాన్ని నిరూపించుకొంటూ ఆమెమీదుగా గాని, ఆమె ప్రక్కమీదుగాగాని దాటివెళ్లడం కూడదు. రైతుయొక్క కూతురుచేతగాని, కొడుకుచేతగాని డబ్బు ఇచ్చో, ఇవ్వకుండానో వారి యిష్టానికి వ్యతిరేకంగా

పనిచేయించుకో కూడదు." (సూగెన్‌హైమ్ రాసిన "దాస విధానం" అనే పుస్తకంయొక్క కాటలోనియన్ భాష మూలప్రతినుంచి ఉటంకించబడింది. ఇది 1861 పీటర్స్‌బర్గులో ప్రచురించబడింది. పేజి 355.)

హెటెరిజం లేక విశృంఖల సాంగత్య (Sumpfzeugung) స్థితినుంచి, ఏకభార్య – ఏక భర్తృత్వానికి మార్పు తెచ్చినది ముఖ్యంగా స్త్రీయేనని బాహోఫెన్ రాశాడు. అది ముమ్మాటికీ సత్యం. జీవితంలో ఆర్థిక పరిస్థితులు అభివృద్ధి పొందడంతో, ప్రాచీనకాలంనుంచి ఆచారంగా వస్తున్న దాంపత్య సంబంధాలలో అమాయిక, ఆదిమ స్వభావం తొలగిపోయింది. ప్రాచీన సామూహిక జీవిత పద్ధతి అంతరించడమూ, క్రమంగా జనాభా పెరుగుతూండడమూతో స్త్రీలకు వెనుకటి కాలపు దాంపత్య సంబంధాలు పీడాకరంగానూ, అవమానకరంగానూ తోచివుంటాయి. దానినుంచి బయటపడడానికి తాత్కాలికంగానో, శాశ్వతంగానో ఒకే మగవానితో వుండగల ఏకపత్నీత్వ హక్కు కోసం వారెంతో ఆదుర్దాపడి వుంటారు. ఈ ముందడుగు మగవాడివేపు నుంచి వచ్చింది మాత్రంకాదు. అతడికీ భావం కూడా కలిగివుండదు. ఏమంటే మగవాడు ఈనాటికీ కూడా గుంపుపెళ్లిలో వున్న సౌఖ్యాన్ని కలలో సైతం వదులుకొనే స్థితిలో లేడు. ఆ విధంగా, స్త్రీ జంటపెళ్లిలోకి మార్పు తెచ్చిన తర్వాతనే పురుషుడు ఖచ్చితమైన ఏకభర్త, ఏకభార్య పద్ధతిని ప్రవేశపెట్టగలిగాడు – ఆడదానికి మాత్రమే అనుకోండి.

ఆటవిక యుగానికీ, అనాగరిక యుగానికీ మధ్య సంధిదశలో జంట కుటుంబం అనేది ఏర్పడింది. ప్రధానంగా ఇది ఆటవిక యుగపు ఉన్నత దశలోనే కనిపిస్తున్నా, అనాగరిక యుగపు నిమ్న దశలో కూడా చెదురుబదురుగా ప్రారంభమైనట్లు కనబడుతూ వుంది. ఆటవిక యుగానికి గుంపుపెళ్లీ, నాగరిక యుగానికి దంపతీ వివాహం లాగే, అనాగరిక యుగానికి జంటపెళ్లి కుటుంబం ముఖ్యమైన లక్షణం. జంటపెళ్లినుంచి సుస్థిరమైన దంపతీ వివాహ రూపం అభివృద్ధి చెందాలంటే యింతవరకూ మనం చూసిన వానికంటే భిన్నమైన కారణాలుండాలి. జంటల ఫలితంగా గుంపు అనేది అంతరించి దాని చివరిరూపం అవతరించింది. ఇప్పుడున్నది ఒక స్త్రీ – ఒక పురుషుడు మాత్రమే వున్న జంట. ఈ జంట రెండు అణువుల కలయికతో ఏర్పడిన కణం వంటిది. ప్రాకృతిక వరణం అనేది ఎప్పటికప్పుడు సామూహిక వివాహ వలయాన్ని పరిమితం చేస్తూవచ్చింది. ఇక్కడితో దాని పని పూర్తి అయింది; అదింక చెయ్యగల దేమీ లేదు. నూతన సామాజిక శక్తులు ఏర్పడి వుండకపోయినట్లయితే యీ ఒంటి జంటనుంచి కొత్తతరహా కుటుంబ రూపం ఏర్పడవలసిన అవసరం కలిగివుండేదికాదు. ఆ నూతన చోదక శక్తులు ఏర్పడ్డాయి కూడా.

జంట పెళ్లి కుటుంబం సాంప్రదాయిక రూపంలో వున్న అమెరికా నిక్కడ వదిలేద్దాం.

ఇంతకన్న ఉన్నతమైన కుటుంబ రూపం ఇక్కడ ఏర్పడిందనుకొనేటందుకు చిహ్నాలు లేవు. అమెరికాను కనిపెట్టి, దానిని ఆక్రమించడానికి పూర్వం అక్కడ స్థిరమైన దంపతీ వివాహ వ్యవస్థ ఏ కాలంలోగాని, ఏ ప్రాంతంలోగాని ఏర్పడిందనుకొనేటందుకు ఉదాహరణలు కనబడవు. పాతప్రపంచంలో పరిస్థితి మాత్రం అది కాదు.

పాతప్రపంచంలో పశువుల్ని మచ్చిక చేయడమూ, మందలను పెంచడమూతో ఇదివరకు ఎన్నడూ తెలియని సంపద వనరులు వృద్ధి అయినాయి. వానితో పూర్తిగా నూతన సామాజిక సంబంధాలు ఏర్పడ్డాయి. అనాగరిక యుగపు నిమ్న దశవరకూ ప్రజలకున్న సంపద — ఇల్లు, బట్టలు, మోటురకం ఆభరణాలు, తిండి సంపాదించుకొనేందుకూ, వండుకొనేందుకూ పనికివచ్చే పరికరాలు, పడవలు, ఆయుధాలు, అతి సాధారణ రకం వంటపాత్రలూ వంటివే. ఏ రోజు కా రోజున వారు తిండికి తడుములాడుకోవలసిందే. ఇప్పుడింక గుర్రాలు, గాడిదలు, ఎడ్లు, గొర్రెలు, మేకలు, పందులు మొదలైన వానిని మందలుగా పెంచుతూ గోపాలక జాతులు వృద్ధిపొందాయి. యూఫ్రటీస్, టైగ్రిస్ నదీ తీరాలలో సెమైట్లు యిలాగే వృద్ధి పొందారు. ఇండియాలో పంచనద ప్రాంతంలోనూ, గంగా మైదానంలోనూ, ఓక్సస్, యక్సార్టస్ నదీ ప్రాంతాలలో జల కాష్ఠ సమృద్ధిగల బీళ్లలోనూ ఆర్యులు కూడా ఈవిధంగా వృద్ధిపొందినవారే. వారి కిప్పుడు సంపద లేర్పడ్డాయి. ఆ సంపదను కాస్త భద్ర పరచుకుంటే చాలు. కొద్దిపాటి శ్రద్ధచూపిస్తే చాలు, పశువులు మందలుగా పెరుగుతాయి. మంచి పుష్టికరమైన పాలు, మాంసం సమృద్ధిగా లభిస్తాయి. అంతవరకూ ఆహార సంపాదన కవలంబించిన పద్ధతులన్నీ పాతబడి పోయాయి. వెనకటి రోజుల్లో వేట తప్పనిసరి అయ్యేది. ఇప్పుడు అది వినోదంగా మారింది.

అయితే ఈ నూతన సంపదలు ఎవరివి? ప్రారంభంలో గణాలకే చెందివుంటాయనడంలో సందేహం లేదు. కాని, చాలా ప్రాచీన కాలంలోనే మందలు సొంత ఆస్తిగా మారిపోయి వుండాలి. ''మోసెస్ ఆదిగ్రంథం''లో ఫాదర్ అబ్రహామ్‌కు మందలూ అవీ వున్నాయని రాయబడి వుంది. అయితే సమష్టి కుటుంబ పెద్ద హోదాలో ఆయన వున్నాడా, లేక గణంలో వంశ పారంపర్యపు హక్కుతో నాయకుడు కావడంవలన ఆ మందలకు యజమానిగా ఉన్నాడా అనేది వూహించలేము. అయితే ఒకటి మాత్రం నిజం. ఆస్తికి యజమాని అనేది ఈనాడు మనం ఉపయోగిస్తున్న అర్థంలో ఆయనకు చెల్లదు. అనాగరిక యుగంలో కళాత్మక వస్తుజాలం — లోహ పాత్రలు, విలాస సామగ్రి, నర పశువులైన బానిసలు సమష్టి కుటుంబ పెద్ద విడి ఆస్తి అయి వున్నట్లే, చారిత్రక ప్రమాణాలు దొరకడం ప్రారంభం అయ్యేందుకు సరిగా ముందు అన్నిచోట్లా మందలు సమష్టి కుటుంబ పెద్దలవయిపోయినట్లే కనపడుతూంది.

ఈ రోజులనాటి కప్పుడే బానిసత్వం కూడ అమలులోకి రావడమే యిందుకు కారణం.

అనాగరిక యుగపు నిమ్న దశలో వున్న మనిషికి బానిసవల్ల ఉపయోగం లేదు. అందుచేత ఆ దశలో వున్న అమెరికన్ ఇండియన్లు ఓడిపోయిన తమ శత్రువులయెడ వ్యవహరించిన దానికి మరింత ఉన్నత దశలోని ప్రజలు భిన్నంగా వ్యవహరించారు. నిమ్న దశలోనివారు ఓడిపోయిన శత్రువుల్ని చంపెయ్యడమో, తమ తెగలోకి దత్తుచేసుకొని సోదరులనుగా ఆదరించడమో చేసేవారు. స్త్రీలను భార్యలనుగా తీసుకొనేవారు. లేదా వాళ్లనీ, వాళ్ల మిగిలివున్న పిల్లల్నీ దత్తు తీసుకొనేవారు. ఆ దశలో మానవుని శ్రమశక్తి అతని పోషణకు అవసరపడే దానికన్న అదనంగా వుత్పత్తి చెయ్యగల స్థితి లేదు. పశువుల మందల్ని పెంచడం, లోహాలు ప్రాసెస్‌చెయ్యడం, నేత నేయడం, వ్యవసాయం చెయ్యడం వచ్చాక ఏర్పడ్డ పరిస్థితులు వేరు. అంతవరకూ అడిగితే లభించే భార్యలకు యిప్పుడు మారకపు విలువ ఏర్పడి కొనబడుతున్నట్లే, శ్రమశక్తికీ అదే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా పశువుల మంద కుటుంబ ఆస్తిగా మార్పుచెందాక మరీను. పశువుల మంద పెరిగినంత వేగంగా కుటుంబం పెరగదు. మందల్ని కాయడానికి మంది అధికంగా వుండాలి. ఈ పనికి యుద్ధాలలో పట్టుబడిన ఖైదీలు వుపయోగపడ్డారు. పశువుల మాదిరిగానే వారు పిల్లల్ని కంటారు. పెరుగుతారు.

ఈ పశుసంపద కుటుంబాల సొంత ఆస్తిగా మారాక, వేగంగా వృద్ధిపొందసాగింది. దాని ఫలితంగా జంటపెళ్లి, గణంలో మాతృ ప్రాధాన్యమూ వున్న ఆనాటి సామాజిక వ్యవస్థ గట్టి దెబ్బతింది. జంటపెళ్లి కుటుంబంలో ఒక నూతన పరిస్థితిని తెచ్చిపెట్టింది. ఇప్పుడు కుటుంబంలో అసలు తల్లితోపాటు అసలు తండ్రి కూడా స్పష్టంగా కనబడుతున్నాడు. ఈనాటి కొందరు "తండ్రుల" కన్న ఆనాటి "తండ్రి" తన సంతానానికి నిజమైన తండ్రి అని చెప్పవచ్చు. ఆనాటికి కుటుంబంలో తిండి సంపాదించడం, దానికి కావలసిన పనిముట్లు చూసుకోవడం బాధ్యత మగవానిది. శ్రమవిభజన అల్లా వుండేది. అందుచేతనే తిండి సంపాదించుకొనేటందు కుపయోగపడే పనిముట్లు అతని స్వంత ఆస్తిగా వుండేవి. ఒకవేళ ఆ జంట విడిపోతే ఆడుదాని కింట్లో సామాను మిగిలేది. అతడు తన పనిముట్లు తీసుకొని వెళ్లిపోయేవాడు. ఆనాటి సమాజంలో వున్న ఆచారం ప్రకారం జీవనాధారమయిన పశువులూ, తరవాత కాలంలో పనిచేయడానికి పరికరాలుగా వుపయోగపడుతున్న బానిసలూ మగవాని ఆస్తిగా పరిగణింపబడ్డారు. అదే సమాజంలో ఆనాటికున్న ఆచారం ప్రకారం ఆ ఆస్తికి అతని పిల్లలు వారసులు కాజాలరు. వారసత్వం విషయంలో ఆనాటి స్థితి యిది:

ప్రారంభంలో తల్లిహక్కు గుర్తించబడేది. అంటే స్త్రీ పరంపరలోనే వంశక్రమం నిర్ణయించబడేది. అలాగే గణంలో అమలులోనున్న వారసత్వ ఆచారం ప్రకారం గణంలో చనిపోయిన వ్యక్తి ఆస్తి ఆ గణంలోవున్న అతని బంధువులకే సంక్రమించేది. ఆస్తి గణంలోంచి బయటికి పోరాదు. ఆదిలో ఆస్తి చాల తక్కువ కావడం, దానిని అతని సన్నిహిత బంధు

వులకి – అంటే తల్లివేపు రక్తసంబంధీకులకి వస్తుచెప్పేవారు. చనిపోయినవాని సంతానం అతని గణానికి చెందరు. వారి తల్లి గణానికి చెందేవారు. ప్రారంభంలో తల్లి తాలూకు రక్తబంధువులతో సమంగా వారికీ తల్లి వస్తువులు సంక్రమిస్తూండేవి. తర్వాత బహుశా ఆమె ఆస్తికి వారే ప్రథమ వారసులుగా గుర్తింపబడివుండొచ్చు. కాని, వారికి తండ్రినుంచి వారసత్వం ఏమీ సంక్రమించదు. ఏమంటే వారు అతని గణానికి చెందరు. అతని ఆస్తి అతని గణంలోనే వుండిపోవాలి. అందుచేత యజమాని చనిపోయినప్పుడు అతని మందలు అతని సోదరీ సోదరులకు, సోదరీ సంతానానికి – వారెవ్వరూ లేకపోతే అతని తల్లి చెల్లెళ్ళూ, వారి సంతానానికీ పోవలసిందే. అతని స్వంతబిడ్డలకు అతని ఆస్తిమీద వారసత్వపు హక్కు లేదు.

ఈవిధంగా, సంపదలు వృద్ధిపొందినకొద్దీ ఒకవేపు కుటుంబంలో స్త్రీకన్నా పురుషునికి ప్రాముఖ్యం వచ్చింది. రెండోవేపు ఆ ప్రాముఖ్యాన్ని ఉపయోగించుకొని అనూచానంగా వస్తున్న ఆచారానికి విరుద్ధంగా తన సంతానానికి వారసత్వం కలిగించాలనే ప్రయత్నాలకు ప్రేరణను కలిగించింది. కాని, తల్లిహక్కు గుర్తించబడుతున్నంతవరకూ అది సాధ్యంకాదు – అందుకోసం ఆ హక్కును తొలగించాలి, తొలగించారు కూడా. ఆ పని చేయడం, ఈనాడు మనం అనుకొనేటంత కష్టంకాదు. మానవజాతి చూచిన మహత్తర విప్లవాలలో ఇదొకటి. గణాలలో ఒక్క వ్యక్తిని కూడా నష్టపరచకుండా యిది సాధించబడింది. కుటుంబ సభ్యులందరూ ఎవరి హోదాల్లో వారు వుంటారు. భవిష్యత్తులో గణంలోని మగవాళ్ల సంతానం గణంలోనే వుండాలనీ, ఆడపడుచుల సంతానం వారి తండ్రి గణానికే చెందాలనీ ఒక్క నిర్ణయం చేస్తే చాలు. వంశక్రమాన్నీ, వారసత్వాన్నీ స్త్రీవేపునుంచి గుర్తించడం ఒక్క దెబ్బతో కూలదొయ్యబడింది. వాని స్థానే వంశక్రమాన్ని పురుషుడి వేపునుంచి గుర్తించడమూ, వారసత్వం తండ్రినుంచి సంక్రమించడమూ నెలకొల్పబడింది. నాగరిక ప్రజలలో ఈ విప్లవం ఎప్పుడు వచ్చిందో ఎలా జరిగిందో మనకేమీ తెలీదు. చరిత్ర యుగానికి పూర్వమే అది జరిగిపోయింది. కాని అది జరిగిందనడంలో మాత్రం సందేహం లేదు. తల్లిహక్కుకు సంబంధించిన చిహ్నా లెన్నింటినో బాహోఫెన్ సేకరించాడు. మార్పు జరిగిందనడానికి అవే పెద్ద నిదర్శనం. ఈ మార్పు ఎంత సులువుగా జరిగిందీ చూడాలంటే అమెరికాలోని ఇండియన్ తెగల నెన్నింటినో మనం పరిశీలించవచ్చును. వానిలో ఈ మార్పు వచ్చిన దీమధ్యనే. ఇంకా కొన్ని తెగలలో ఈమార్పు జరుగుతూంది. సంపదలు అభివృద్ధిపొందాయి. వారి జీవిత పద్ధతులు మారాయి. అడవులనుంచి "పచ్చికబయళ్ల"లోకి వారి నివాసం మారింది. నాగరికతా సంపర్కం, మత ప్రచారకుల నైతిక పలుకుబడి – యివన్నీ వారిలో యీ మార్పును తీసుకువచ్చాయి. మిస్సూరీ నదీ ప్రాంతంలోని తెగ లెనిమిదింటిలో ఆరింట మగవానినుంచి వంశక్రమాన్ని గుర్తించడమూ, మగవానినుంచి వారసత్వాన్ని గుర్తించడమూ అమలులోవుంది.

మిగిలిన రెండూ వంశక్రమాన్నీ, వారసత్వాన్నీ స్త్రీ వేపునుంచే గుర్తిస్తున్నాయి. షానీ, మియామీ, దెలవారే తెగలలో ఒక ఆచారం స్థిరపడింది. సంతానానికి తండ్రి ఆస్తి సంక్రమించేటట్లు చేయడానికై వారు తండ్రిగణానికి సంబంధించిన ఏదో ఓ పేరును వారికి పెట్టేవారు. "పేర్లు మార్చేయడం ద్వారా వస్తువునే మార్చివెయ్యాలన్న మానవ సహజమైన చమత్కారం కాక ఏమిటిది? తన స్వప్రయోజనానికి అవసరమైతే సాంప్రదాయాన్ని వదలకుండానే, దానిలో ఏదో నెరుసులు వెదకి దానినుంచి బయటపడ్డానికి ప్రయత్నించడం." (మార్క్స్.)* దీనివలన శుద్ధ గంద్రగోళం ఏర్పడింది. తండ్రిహక్కు సాధిస్తేనే యిది కొంతైనా తొలుగుతుంది. అలాగే జరిగింది. కొంత గజిబిజి అణిగింది కూడా. "ఇదే అతి సహజమైన మార్పుగా కనిపిస్తుంది." (మార్క్స్.)** పాత ప్రపంచంలో నాగరిక ప్రజలలో ఈ మార్పు ఏవిధంగా వచ్చింది అనే విషయమై న్యాయసూత్రాల తారతమ్య పరిశీలనచేసి చెప్పేవన్నీ కేవలం అనుమానసాధ్యాలే. ఉదాహరణకు ఎమ్. కొవలేవ్స్కీ రాసిన "కుటుంబమూ, ఆస్తీ: ఆవిర్భావం, అభివృద్ధి," (స్టాక్‌హోమ్ 1890) పుస్తకంలో చూడవచ్చు.

తల్లిహక్కును రద్దుచేయడమనేది స్త్రీ జాతికి సంబంధించి ప్రపంచ చారిత్రక ప్రాముఖ్యం కలిగిన ఘోర పరాజయం అని చెప్పాలి. ఇంట్లో కూడా మగవాడే పెత్తనం దొరకపుచ్చుకున్నాడు. స్త్రీ పరాభవం పొందింది. మగవాని కామానికి బానిస చేయబడింది. పిల్లల్ని కనే యంత్రంగా మార్చబడింది. వీరయుగంనాటి, ముఖ్యంగా పురాణయుగంనాటి గ్రీకులలో ఇది స్పష్టంగా కనబడుతూంది. క్రమంగా దానిని కప్పిపుచ్చడానికై మెరుగులు పెట్టారు, మేలి బురఖాలు తగిలించారు, మృదువైన రూపం యిచ్చారు. అయితే పతనావస్థ ఎంతమాత్రం రద్దుకాలేదనే సంగతి మరచిపోకూడదు.

ఇక్కడ పితృస్వామిక కుటుంబం అనేది ఒక మెట్టుగా ఏర్పడింది. మగవానికి సర్వాధికారాలూ సంక్రమించడంవలన కలిగిన మొదటి ఫలితాలు ఎలా వున్నాయో ఆ కుటుంబాన్ని చూసి గ్రహించవచ్చును. ఈ కుటుంబ వ్యవస్థయొక్క ప్రధాన లక్షణం బహుభార్యాత్వం కాదు. దానిని గురించి మరోచోట వివరిస్తా. దాని ముఖ్య లక్షణమేమిటంటే,

> "కుటుంబ పెద్ద పైతృకాధికారంలో స్వతంత్రులూ, పరాధీనులూ అయిన వ్యక్తులు చాలామంది ఒక కుటుంబంగా వుంటారు. కుటుంబ పెద్దకు చాల

---

* మార్క్స్ – ఎంగెల్స్, పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజి 111. – సం.

** అదే గ్రంథం, పేజి 112. – సం.

మంది భార్యలుండడమూ, పరాధీనుడైన దాసులకు ఒకే భార్యా బిడ్డలూ ఉండడమూ సెమైట్ తెగలలో కనిపిస్తుంది. ఒక పరిమిత ప్రదేశంలో పశువుల మందల్ని కాపాడుకోవడం ఈ వ్యవస్థ ప్రధానోద్దేశం."[116]

ఈ కుటుంబంయొక్క ప్రధాన లక్షణాలు పైతృకాధికారాన్ని నెలకొల్పడం, పరాధీనులను కూడా దానిలో చేర్చుకోవడమూను. ఈమాదిరి కుటుంబానికి మంచి వుదాహరణ రోమను కుటుంబం. ఆదిలో familia అన్న పదం కూపస్థమండూక వైఖరిగల ఆధునికుల ఆదర్శానికి (ఈ ఆదర్శం భావావేగ దౌర్బల్యాల, పొరపొచ్చాల సమ్మిశ్రమం). ప్రారంభంలో రోమనులు బానిసలను గురించి చెప్పేటప్పుడే కుటుంబ (familia) శబ్దాన్ని ఉపయోగించారు. వివాహితులైన భార్యాభర్తలు, వారి సంతానమూ దానిలోకి రానేరారు. Famulus అంటే ఇంటి బానిస, familia అంటే ఒక వ్యక్తికి చెందిన బానిసల మొత్తం. గయస్ కాలంనాటికి కూడా familia, id est patrimonium (అంటే వారసత్వం) యజమాని వీలునామా ప్రకారం సంక్రమించింది. సమాజంలో కొత్తగా ఏర్పడిన ఈ నిర్మాణానికి రోమనులు "ఫామిలీ" అనే పదాన్ని వుపయోగించారు. ఈ నిర్మాణం ఒక యజమాని అధీనంలో వుంటుంది; ఆయన అధీనంలో భార్య, పిల్లలు, బానిసలు వుంటారు. రోమనులలో కుటుంబ యజమానికి (తండ్రికి) తన అధీనంలోని వారిని చంపెయ్యడానిక్కూడా హక్కు వుంది.

"గ్రీకులూ, (ఆర్యన్) లాటిన్ తెగలూ వేరుపడటం జరిగాకనే, లాటిన్ తెగలలో భూములు సేద్యం చేయబడడం, బానిసత్వం చట్టసమ్మతం చేయబడడంలాంటి వ్యవస్థ వచ్చిన తర్వాతనే ఈ పేరు దానికి వచ్చింది."[117]

దీనికి మార్క్స్ మరో రెండు మాటలు జతపరిచాడు: "ఆధునిక కుటుంబంలో బానిసత్వమే కాదు, భూదాస్యం కూడా బీజరూపంలో మనకు కనిపిస్తోంది. ప్రారంభంనుంచీ వ్యవసాయపు పనులతో యిది జతపడివుంది. తర్వాత తర్వాత సమాజంలోనూ రాజ్యంలోనూ, విస్తృతరూపంలో బయటపడిన వైరుధ్యాలన్నీ దీనిలో సూక్ష్మ రూపంలో కనిపిస్తాయి."*

ఇలాంటి కుటుంబ రూపం జంట పెళ్లి కుటుంబంనుంచి, దంపతీ కుటుంబానికి

---

* మార్క్స్ – ఎంగెల్స్, పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజి 31. – సం.

రూపాంతరం చెందడాన్ని సూచిస్తుంది. భార్య పాతివ్రత్యాన్ని ధ్రువపరచడానికీ, బిడ్డల పితృత్వం స్థిరపరచడానికీ స్త్రీని ఏవిధమైన షరతులూ లేకుండా భర్తకు స్వాధీన పరిచారు. అతడామెను చంపేస్తే, తన హక్కును వినియోగిస్తున్నాడన్న మాట.

పితృస్వామిక కుటుంబ కాలంనుంచీ మనకు లిఖిత చరిత్ర లభిస్తోంది. న్యాయ సూత్రాల సమతులనం ద్వారా ఇక్కడ మన కెంతో విషయం లభిస్తుంది. ఈ విషయంలో మనకెంతో సమాచారం లభ్యమయింది కూడా. ఈ సందర్భంలో మనకు మక్సీమ్ కొవలేవ్‌స్కీ ఎంతో సేవ చేశాడు ("కుటుంబమూ, ఆస్తీ: ఆవిర్భావం, అభివృద్ధి," స్టాక్‌హోమ్, 1890, పేజీలు 60–100). ఈ నాటికి కూడా సెర్బులలోనూ, బల్గార్లలోనూ Zadruga (మిశ్రకూటమి అంటే దాని అర్థానికి దగ్గరలో వుంటుంది) అనే పితృస్వామిక కుటుంబ వ్యవస్థ వుంది. దానినే Bratstvo (భ్రాతృబృందం) అని కూడా అంటారు. ప్రాచ్య దేశీయులలో ఇదే కొద్ది రూపభేదంలో కనిపిస్తోంది. ఇవన్నీ తల్లిహక్కుమీద ఆధారపడిన గుంపుపెళ్లినుంచి వచ్చిన కుటుంబానికీ, ఈనాటి జంట కుటుంబానికీ మధ్య ఏర్పడిన అంతర్దశలని ఆయన నిరూపించాడు. పాత ప్రపంచ భాగంలోని నాగరిక ప్రజలు, ఆర్యనులు, సెమైట్లు మొదలయినవారిలో ఈ దశ నిరూపించబడినట్లు భావించవచ్చును.

ఇల్లాంటి సమష్టి కుటుంబం వుండేదనడానికి దక్షిణ స్లావులలో వున్న జాద్రుగా ప్రత్యేకమైన వుదాహరణ. ఒక మూలపురుషుని సంతానం కొన్ని తరాలమంది తమ తమ భార్యలతో బిడ్డలతో కలసి సమష్టిగా ఒకే యింట నివసిస్తారు. వారు సమష్టిగానే కుటుంబపు భూముల్ని సాగుచేస్తారు. కుటుంబం సమష్టినుంచి కావలసిన బట్టా పాతా తీసుకుంటారు. అదనపు వస్తువులు వారందరివీను. గృహస్వామి (domàcin) పర్యవేక్షణలో కుటుంబ వ్యవహారాలన్నీ నడుస్తాయి. కుటుంబానికి వెలుపల ఆయన కుటుంబ ప్రతినిధి. డబ్బుకు సంబంధించిన వ్యవహారాలన్నీ చూసుకుంటాడు. చిన్నచిన్న వస్తువులు బేరం పెడతాడు. కుటుంబ ధనానికీ, వ్యాపారాలకీ బాధ్యత అతనిది. ఈయనను పెద్దగా ఎన్నుకుంటారు. కుటుంబపెద్ద వయస్సులో కూడా పెద్దయే కావాలనే నియమం ఏమీలేదు. ఇక స్త్రీలంతా గృహస్వామిని (domàcica) అధీనంలో వుంటారు. ఆమె పర్యవేక్షణలో పనిపాటలు సాగిస్తారు. సాధారణంగా గృహస్వామిని కుటుంబ యజమాని పెద్దభార్యయే అయివుంటుంది. కుటుంబంలోని ఆడపిల్లల పెళ్లిళ్ల విషయంలో ఆమె మాట నిర్ణయం అనవచ్చును. కాని సర్వాధికారం కుటుంబ సమితిది. కుటుంబంలోని వయస్సు వచ్చిన స్త్రీ పురుషులంతా దానిలో సభ్యులు. ఈ సమితికి గృహస్వామి సమాధానం చెప్పుకోవాలి. ప్రధాన నిర్ణయాలు దాని ద్వారా జరుగుతాయి. కుటుంబ సభ్యులలో తప్పు చేసినవారికి అది దండన విధిస్తుంది. భూములు కొనడం అమ్మడం లాంటి ప్రధానమైన ఇచ్చి పుచ్చుకోడాలు దాని ద్వారానే జరుగుతాయి.

రష్యాలో కూడా ఇంకా ఇటువంటి పెద్దకుటుంబాలు అమలులో వున్నాయని సుమారు పదేళ్ల క్రితమే బయటపడింది. గ్రామ పంచాయతీ (ఒబ్ష్చినా) మాదిరిగానే ఈ సమష్టి కుటుంబం కూడా రష్యనుల ఆచారాలలో ఒక భాగంగా పాతుకొని వుంది. అతి ప్రాచీనమైన రష్యన్ న్యాయ సూత్రాలైన యారొస్లావ్ "ప్రావ్ద"లోనూ, దాల్మాటియన్ చట్టాలలోనూ[118] ఒకే పేరున (వెర్వ్) దీని ప్రసక్తి కనిపిస్తుంది. పోలండ్, జెక్ దేశాల చారిత్రక గ్రంథాలలో కూడ వీని ప్రసక్తి కనబడవచ్చు.

జర్మనులలో కూడ ఆదిలో సమాజంలోని ఆర్థిక యూనిట్ మనం ఇప్పుడు విడి కుటుంబం అని పిలిచేదిగాదనీ, సమిష్టి కుటుంబం మాత్రమేననీ హేయ్‌స్లెర్ (Institutes of German Right) రాశాడు. కొన్ని తరాల జనం లేక కొన్ని విడి కుటుంబాలు కలిసి ఈ సమష్టి కుటుంబం ఏర్పడుతుందని ఆయన రాశాడు. తరచుగా ఈ కుటుంబంలో పలువురు పరాధీనులు కూడా భాగమే. రోమను కుటుంబం కూడా ఇటువంటి కుటుంబ వ్యవస్థకు చెందినట్లు భావిస్తున్నారు. ఆ మేరకు ఇంతవరకూ వూహిస్తున్న మాదిరిగా ఇంటి పెద్దకు సర్వాధికారాలూ వుండడమూ, మిగిలిన వారికి ఏ హక్కులూ లేకపోవడమూ నిజమేనా అన్నది యిటీవల సందేహాస్పదమైంది. ఐర్లండులోని కెల్టుజాతివారిలో కూడ ఇటువంటి సమష్టి కుటుంబాలే వుండేవని భావిస్తున్నారు. ఫ్రెంచి విప్లవకాలంవరకూ ఫ్రాన్సులోని నివెర్నే ప్రాంతంలో parçonneries అనే పేరుతో ఈ సమష్టి కుటుంబాలు అమలులో వున్నట్లు తెలుస్తుంది. ఫ్రాంష్-కొంటేలో ఈనాడు కూడా యివి వున్నాయి. లువానా ప్రాంతంలో సోన లౌరా జిల్లా ఒకే కుటుంబానికి చెందిన అనేక తరాలవారు నివసిస్తున్న పెద్దపెద్ద ఎత్తయిన రైతుల ఇళ్లు ఉన్నాయి. ఇంటికి మధ్యన ఒక పెద్ద మండువా వుంటుంది. చుట్టువారా ఎత్తుగా పడకగదులు వుంటాయి. గదిలోకి వెళ్లాలంటే, ఏడెనిమిది మెట్లు ఎక్కవలసివుంటుంది.

అలెగ్జాండర్ ది గ్రేట్ కాలంనాటి నియార్కస్ భారతదేశంలో సమష్టి కుటుంబాలున్నాయనీ, సాగుభూములు వాని సమష్టి స్వాధీనంలో వున్నాయనీ రాశాడు. ఆ ప్రాంతాలలో పంజాబు, వాయువ్య సరిహద్దు రాష్ట్రాలలో ఈనాటికీ ఆ ఆచారం కొనసాగుతూ వుంది. కాకసస్‌లో ఈ ఆచారం వున్నదని కొవలేవ్‌స్కీ రుజువులు ఇవ్వగలిగాడు. ఆల్జీరియాలోని కబీల్ తెగలలో ఇది యీనాటికీ వుంది. అమెరికాలో కూడా యివి ఉన్నాయంటున్నారు. ఇవి ప్రాచీన మెక్సికోలో వున్నాయని జూరిటా వర్ణించిన "calpullis"[119] వంటివేనని అంటున్నారు. ఇందుకు భిన్నంగా కూనొవ్ పెరూ దేశాన్ని ఆక్రమించే నాటికి అక్కడ "మార్కు" వ్యవస్థను పోలిన వ్యవస్థ ఒకటి వున్నదనీ, వ్యవసాయపు భూమిని అప్పుడప్పుడు కొత్తగా వాటాలుపెడుతూ వ్యవసాయాన్ని వ్యక్తుల కిస్తున్నారనీ ("Ausland"[120] అనే

ప్రతిక సం 42–44 లు. 1890) స్పష్టంగా ధృవపరిచాడు. చిత్రమేమిటంటే పెరూలో మూర్కనే మార్కా అని పిలుస్తున్నారు.

ఏమైనా సమష్టిగా భూమి కలిగి, వుమ్మడిగా వ్యవసాయం చేసే సమష్టి కుటుంబాని కిప్పుడొక ప్రత్యేక ప్రాముఖ్యం ఏర్పడింది. గొప్ప ప్రాముఖ్యం కలిగిందనడంలో సందేహం లేదు. పాత ప్రపంచ భాగంలోని నాగరిక ప్రజలలో మాతృస్వామిక వ్యవస్థనుంచి దంపతీ కుటుంబం ఏర్పడే సంధి దశలో సమష్టి కుటుంబానికి ప్రప్రథమంలో కొద్ది కాలంపాటు సాగు భూమినీ, పచ్చికబీళ్లనూ పంచి వప్పచెప్పడంతో ప్రారంభించి, క్రమంగా వాటిని కుటుంబాల శాశ్వత హక్కుగా ఇచ్చివేసిన గ్రామాలు, మార్కు సంస్థలు ఏర్పడడానికి పూర్వం ఇటువంటి సమష్టి కుటుంబాలే వుండేవని కొవలేవ్స్కీ రాస్తున్నాడు. ఆ వివరాలు తర్వాత తీసుకుందాం.

ఈ సమష్టి కుటుంబాలలోని జీవిత పద్ధతులను గురించి, ఇతరత్రా ఎల్లా వున్నా, రష్యాలో మాత్రం గృహస్వామి తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసుకొన్నాడు. ఇంట్లో వున్న పడుచుపిల్లల్ని, ముఖ్యంగా కోడళ్లని బలాత్కరించి పక్కలోకి తెచ్చుకొనేవాడు. ఈ విషయాన్ని తెలిపే జానపద గేయాలు రష్యాలో చాలా వున్నాయి.

తల్లిహక్కును రద్దుచేశాక దంపతీ వ్యవస్థ అతి వేగంగా వృద్ధిపొందింది. దానిని గురించి చర్చించేముందు బహుభార్యాత్వం, బహుభర్తృత్వం గురించి కొద్ది మాటలు చెప్పడం అవసరం. ఈ రెండు వివాహరూపాలూ కూడ ఎక్కడో అరుదుగా చారిత్రక విలాస ఫలితాలుగా కనబడతాయేగాని వేరుకాదు. ఈ రెండూ ఒకే దేశంలో ఒకదాని ప్రక్క మరొకటి ఒకే కాలంలో కనిపిస్తే తప్ప వానిని చరిత్రలో ఎక్కడోగాని చూడం. అందుచేత, బహుభార్యాత్వంనుంచి మినహాయించబడిన మగవాళ్లు బహుభర్తృత్వంనుంచి మినహాయించబడిన ఆడవాళ్లతో సంతృప్తిపడి వూరుకోలేకపోయారు. ఏమంటే, ఇంతవరకూ సామాజిక వ్యవస్థ ఏదయినా, సమాజంలో స్త్రీ పురుషుల సంఖ్య సమానంగానే వుంటూంది. అందుచేతనే బహుభర్తృత్వం, బహుభార్యాత్వం ఏ ఒక్కటీ కూడా సాధారణాచారంగా ఏర్పడలేక పోయింది. వాస్తవానికి, ఒక్కొక్కప్పుడు ఎక్కువమంది భార్యల్ని పెట్టుకోవడం స్పష్టంగా బానిస వ్యవస్థనుంచి వచ్చినది. ప్రత్యేక హోదా వున్నవారే ఎక్కువమంది భార్యల్ని కలిగి వుండేవారు. సెమెటిక్ పితృస్వామిక కుటుంబాల్లో గృహస్వామి మాత్రమే బహుభార్యల్ని కలిగివుండేవాడు, కొన్ని సందర్భాల్లో అతనికి చెందిన ఇద్దరు ముగ్గురు కొడుకులు కూడా యీ పద్ధతిని చేబట్టేవారు. మిగతావారు ఒక్కొక్క భార్యతో సంతృప్తిపడవలసివచ్చేది. మొత్తం ప్రాచ్యమంతటా యిది యీనాడు యిలాగే వుంది. ధనవంతులకీ, రాజవంశీకులకూ మాత్రమే పెక్కుమంది భార్యల్ని చేసుకునే హక్కు వుంది. సాధారణంగా వీరు ఆడ బానిసల్ని కొనుక్కొని భార్యలనుగా చేసుకొనేవారు. సాధారణ ప్రజలందరూ దంపతీ వివాహంతోనే వుంటారు. భారతదేశంలోనూ, టిబెట్‌లోనూ

కనిపించే బహుభర్తృత్వ పద్ధతి కూడా ఇల్లాంటి అరుదైన ఆచారమే. వీటికి మూలం గుంపుపెళ్లి ఆచారమే అయి వుండొచ్చు. కాని ఆసక్తికరమైన యీ విషయమై ఇంకా పరిశీలన జరగవలసివుంది. ఏదేమైనా ఆచరణలో మహమ్మదీయుల అంతఃపురాలలో కనిపించే కఠోరత ఇక్కడ కనిపించదు. దానికన్న యీ బహుభర్తృత్వమే ఎక్కువ సహించదగినదిగా కనిపిస్తుంది. భారతదేశంలోని నాయర్లలో ఒక ఆచారం వుంది. వారిలో ముగ్గురు, నలుగురు, లేక అంతకన్న ఎక్కువమంది కలిసి ఒక భార్యను కట్టుకొంటారనేటంతవరకు ఖాయం. అయితే, అదే సమయంలో వారిలో ప్రతిఒక్కడూ మరో ముగ్గురు నలుగురితోనో, అంతకన్న ఎక్కువమందితోనో కలిసి ఉమ్మడిగా మరో స్త్రీని భార్యగా కలిగివుంటాడు. ఈవిధంగా అతను మూడో భార్యను, నాలుగో భార్యను, అలా ఎందరినైనా చేసుకోవచ్చు. ఈ రకం పెళ్లి జట్లలో – వాటిని స్వయంగా తనే వర్ణించాడు – ఒక కొత్త రకాన్ని (జట్టు పెళ్లి రకాన్ని) మాక్‌లెన్నాన్ కనుక్కోకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. ఈ రకం పెళ్లిళ్లలో పురుషులు ఏక కాలంలో చాల వాటిలో సభ్యత్వం కలిగి వుండటం సాధ్యం. జిరో-త్యూలోన్ చెప్పినట్లు గుంపుపెళ్లిళ్లలో అదొక తరహా. ఏకభార్య కుటుంబం పురుషులు బహుభార్యాత్వంలోనూ, స్త్రీలు బహుభర్తృత్వంలోనూ జీవిస్తారు.

4. దంపతీ వివాహం. అనాగరిక యుగపు నడిమి దశకూ – ఉన్నత దశకూ సంధి కాలంలో జంట పెళ్లి కుటుంబంనుంచి దంపతీ వివాహం అభివృద్ధి పొందిందని పైన తెలిపాను. దీని అంతిమ విజయం – నాగరికతయొక్క ప్రారంభ దశకు చిహ్నం. దీనిలో మగవానిది ప్రాధాన్యం. జన్మకారకుడైన తండ్రి విషయంలో సందేహం లేకుండా చేసుకోవడం దీని ముఖ్యోద్దేశం. తండ్రి అనంతరం అతని ఆస్తికి అతని బిడ్డలే సకాలంలో వారసులు కావాలనేది అక్కడున్న అవసరం. వివాహబంధంయొక్క గట్టిదనమే జంట పెళ్లికీ, దీనికీ తేడా. ఈ నూతన వ్యవస్థలో దంపతులలో ఎవరు కోరినా వివాహాన్ని ఛేదించడం సాధ్యపడదు. కాని, ఆచరణలో మాత్రం మగవాడు వివాహబంధాన్ని తెంచి, భార్యను తోసేయగలడు. దాంపత్య ధర్మాన్ని అతిక్రమించే హక్కు కూడా అతనికే మిగిలింది. (ఉంపుడుకత్తెను ఇంట్లో పెట్టనంతవరకూ మగవాడు దాంపత్య ధర్మాన్ని మీరగల హక్కును Code Napoléon* స్పష్టంగా అంగీకరిస్తోంది.) సమాజం అభివృద్ధి పొందినకొద్దీ మగవాడు తన యీ హక్కును ఉత్తరోత్తరాభివృద్ధిగా అమలుపరచుకొంటూ వచ్చాడు. భార్య మాత్రం గతకాలపు దాంపత్య జీవిత రూపాల్ని జ్ఞాపకం చేసుకొని దాన్ని పునరుద్ధరించగోరితే అతి కఠోర శిక్షలకు గురి అవుతుంది.

గ్రీకు ప్రజలలో ఈ నూతన వివాహ పద్ధతి అతి కఠోరరూపంలో కనబడుతుంది. గ్రీకు

* నెపోలియన్ శిక్షాస్మృతి. – సం.

పురాణగాథలలోని దేవకాంతలు స్త్రీలు ఎక్కువ గౌరవాన్నీ, స్వాతంత్ర్యాన్నీ అనుభవిస్తున్న దశకు ప్రాతినిధ్యం వహించగా, గ్రీకు వీర యుగంనాటి కప్పుడే మగవాని పెత్తనం స్థిరపడింది. స్త్రీ బానిసలతోడి పోటీలో భార్యలు అవమానితలయ్యే స్థితి కనబడుతూంది అన్నాడు మార్క్స్.* టెలెమాహుస్ తల్లిని దుయ్యబట్టి ఆమె నోరు నొక్కడం మనకు "ఒడిస్సే"లో కనబడుతుంది.** పట్టుబడిన పడుచులు విజేతల ఆనంద విలాసాలకు గురికావడం హోమరు రచనలలో కనబడుతుంది. సైన్యాధిపతులు తమతమ హోదాలననుసరించి వరుసక్రమంలో మిక్కిలి అందమైనవారిని ఆ పడుచులనుంచి ఏరుకొనేవారు. అటువంటి ఒక బానిస యువతికోసం అగమేమ్నన్ అఖిలెస్‌ల మధ్య ఏర్పడిన జగడం గురించే "ఇలియడ్"లో మనం చూస్తాం. కాస్త పేరుగల వీరుణ్ణి గురించి ప్రస్తావించినప్పుడల్లా హోమరు ఆ వీరుని గుడారంలోనూ, శయ్యలోనూ భాగస్వామినియైన బానిస యువతిని గురించి కూడా తప్పకుండా రాస్తాడు. ఆ పడుచుల్ని ఆ వీరులు గ్రీసు దేశానిక్కూడా తీసుకుపోయేవారు. భార్యతోపాటు ఒకే యింట్లో కాపురం పెట్టించేవారు. కస్సాండ్రాను అగమేమ్నన్ తన యింటికి తీసికెళ్లినట్లు ఎస్కిలస్ రాశాడు.*** ఈ పడుచులకు సంతానం కలిగితే వారికి కూడా తండ్రి ఆస్తిలో కొంత వాటా ఇచ్చేవారు. వారిని స్వతంత్రులుగానే పరిగణించేవారు. తెలమోన్‌కు ఒక దాసీ కన్యయందు పుట్టినవాడే తేయుక్రొన్. అతడు తండ్రి పేరుపెట్టుకోడానికి అనుమతింపబడ్డాడు. కట్టుకున్న భార్య వీటన్నింటినీ భరించాలి. అంతేగాని తాను తప్పదారి తొక్కరాదు, పతివ్రతగా వుండాలి. నాగరిక యుగంలోకన్న వీరయుగంనాడే గ్రీకు స్త్రీలు ఎక్కువ గౌరవాన్ని అనుభవించినమాట నిజం. ఏమంటే ఆమె ఔరసులను కంటుంది. గృహస్వామి తాను తెచ్చే బానిసస్త్రీల నామె పర్యవేక్షణలో వుంచుతాడు. వారిలోంచి కొందరిని వుంపుడుకత్తెల్ని చేసుకొంటే అది వేరే విషయం. దంపతీ వ్యవస్థతో పాటు పక్కపక్కనే బానిసత్వం సాగుతూండడమూ, ఇంట్లో అందమైన పడుచు బానిసలు వుండడమూ, వారిమీద అధికారం మగవాడిదే కావడమూ వలన ప్రారంభంనుంచీ దంపతీ వివాహంలో ఏకపతిత్వం స్త్రీకే విధి. మగవాడికి ఏకపత్నీత్వం నిబంధన కాదు. అదే ఈనాటికీ కొనసాగుతూంది.

తర్వాతి కాలంనాటి గ్రీకులకు సంబంధించినంతవరకు, దోరియన్లనీ, ఇయోనియనుల్నీ వేరువేరుగా తీసుకోవలసివుంటుంది. దోరియన్లలో హోమరు వర్ణించినవానికన్నా, ప్రాచీనములనదగిన వివాహ సంబంధాలుండేవి. దానికి మంచి ఉదాహరణ స్పార్టా. అక్కడ ఆనాడు

---

* మార్క్స్ – ఎంగెల్స్, పురాస్వత భాండారం, 9వ సంపుటం, పేజి 32. – సం.

** హోమర్, "ఒడిస్సే", గీతం I. – సం.

*** ఎస్కిలస్, "ఒరెస్టెయా. అగమేమ్నన్." – సం.

సర్వసాధారణంగా కనిపించేది జంట వివాహ పద్ధతి. ఆనాడక్కడ వుంటూవచ్చిన భావాల కనుగుణంగా దానిలో కొద్ది మార్పు ఉన్నాయనుకోండి — ఆ జంట వివాహాలలో కూడ గుంపుపెళ్లి తాలూకు చాలా అవశేషాలు కనిపిస్తున్నాయి. దంపతులకు పిల్లలు కలగకపోతే వివాహం రద్దు అవుతుంది. క్రీ. పూ. 560 సంవత్సరంనాటి అనక్సాండ్రీడిస్ రాజు మొదటి భార్యకు పిల్లలు కలగలేదని రెండో ఆమెను చేసుకొని రెండు కుటుంబాలను పెట్టాడు. అదే శతాబ్దంనాటి స్పార్టా రాజు అరిస్టోన్ ఇద్దరు భార్యలకూ పిల్లలు కలగక పోతే మూడో ఆమెను చేసుకొన్నాడు. మొదటి ఇద్దరిలో ఒకామెను వదిలివేశాడనుకోండి. ఇదిటువేపున వుండగా రెండో వేపున అనేకమంది సోదరులు ఉమ్మడిగా ఒక భార్యను చేసుకో వచ్చును. ఎవనికన్నా మిత్రుని భార్యమీద మక్కువ ఏర్పడితే అతనితో కలిసి ఆమెను అను భవించవచ్చును. బిస్మార్క్ అన్నట్లు పొగరెక్కిన "ఆబోతు" లాంటి వ్యక్తికి — పౌరుడు కాకపోయినా సరే అతనికి — తన భార్య నివ్వడంలో తప్పులేదని వారు భావించేవారు. తన వెంట విడవకుండా తిరుగుతున్న ప్రేమికుడిని ఒకణ్ణి ఒక స్పార్టను వనిత తన భర్తతో మాట్లాడిరమ్మని పంపినట్లు ప్లూటార్క్ ఒక చోట రాశాడు. అది ఆనాటి స్త్రీలకు అధికతర లైంగిక స్వాతంత్ర్యం వున్నట్లు సూచిస్తూందని ష్యోమన్ రాశాడు. కాబట్టి అస లైన భర్తృద్రోహం, భర్తకు తెలియకుండా ఇతరులతో సంగమించడం ఆ రోజులలో విన బడదు. రెండోవేపున, ఆ రోజుల్లో, కనీసం అది అత్యున్నత దశలో ఉన్నప్పుడు, స్పార్టాలో గృహ బానిసలు లేరు. బానిసలైన "ఇలాట్"లు విడిగా నివసించేవారు. అందుచేత స్పార్ట నులకు ఇలాట్[121] భూదాసుల స్త్రీలతో సంగమించాలన్న ఆకర్షణ తక్కువ. గ్రీసులోకన్న స్పార్టన్లలో స్త్రీల కెక్కువ గౌరవం లభించిందంటే కారణం ఇదే. గ్రీసుదేశపు స్త్రీలలో కల్లా స్పార్టన్ స్త్రీలూ, ఏథెనియను వేశ్యలలో అగ్రగణ్యులూ మాత్రమే గౌరవించబడేవారు. వారి మాటకు మన్నన వుండేది.

ఇయోనియన్ల స్థితి వేరు. ఆ విషయానికి ఏథెన్సును ఉదాహరణగా తీసుకోవచ్చు. వడుకు, నేత, కుట్టుపని, మహా అయితే కొద్దిపాటి రాయనూ, చదువనూ మాత్రమే అక్కడ ఆడపిల్లలు నేర్చుకొనేవారు. వారిని ఎవ్వరితోనూ కలియనిచ్చేవారు కాదు. స్త్రీల మధ్య మాత్రమే తిరుగుతూ వుండాలి. ఇంట్లో ఆడవాళ్ళుండే భాగం వేరుగా వుంటుంది. వాళ్ల మేడమీదనో, ఇంటి వెనుకభాగంలోనో నివసించేవారు. మగవాళ్లు, ముఖ్యంగా పైవాళ్లు, తేలికగా ఆ భాగంలో ప్రవేశించడం సాధ్యంకాదు. పై మగవాళ్లెవరైనా ఇంటికివస్తే, స్త్రీలు తమ భాగంలోకి తప్పుకొనేవారు. బానిసపడుచు తోడులేనిదే ఆడుది వీధిలోకి పోరాదు. ఇంటివద్ద కూడా వారిమీద గట్టి కాపలా వుండేది. వ్యభిచారుల్ని హడలగొట్టేటందుకు మొలోషియన్ వేటకుక్కల్ని పెంచేవారని అరిస్టోఫనిస్ రాశాడు.[122] ఆసియా నగరాలలో స్త్రీలమీద కాపలాకోసం కొజ్జాలని వినియోగించేవారు. హెరొడోటస్ కాలంనాటికే హియోస్

దీవిలో పెద్ద ఎత్తున కొజ్జాల్ని తయారుచేసి ఎగుమతి చేయడం సాగుతుండేది. ఈ కొజ్జాల్ని కొనేది ఒక్క అనాగరిక దశలోని ప్రజలు మాత్రమేకాదని వాక్సుమత్ రాస్తున్నాడు. ఆడుదానికి "oikurema" (ఇంటిని చక్కబెట్టే ఒక వస్తువు) అనే నపుంసకలింగ శబ్దాన్ని వాడాడు యూరిపిడీస్.* ఏథెనియన్ మగవానికి ఆడుది పిల్లల్ని కనడం, ఇంటిచాకిరి చెయ్యడం కోసమే. మగవాడికి ఆటలూ పాటలూ, ప్రభుత్వ వ్యవహారాలూ వుంటాయి. వాటిలో భార్యకు ప్రమేయం వుండదు. మగవాడికి తరచుగా బానిస ఆడవాళ్ళు దగ్గర వుంటారు. ఏథెన్సు పూర్ణ వికాస దశలో వున్నప్పుడు, వ్యభిచారాన్ని హెచ్చుగా అభిమానించారు. ప్రభుత్వమే దానిని ప్రోత్సహించింది. స్పార్టన్ స్త్రీలు తమ పాతివ్రత్యం ద్వారా ప్రాచీన సాధారణ స్త్రీ లోకాన్ని మించగా, గ్రీకు స్త్రీలలో ప్రముఖురాండ్రు తమ వ్యభిచార వృత్తిద్వారా అభివృద్ధి చెంది, తమ చాతుర్యం ద్వారా, కళాభిరుచుల ద్వారా సాధారణ స్త్రీలోకాన్ని అధిగమించారు. స్త్రీగా పరిణతి చెందేందుకుగాను ఆడది ముందుగా వేశ్య కావాలన్నది ఏథెనియన్ కుటుంబపు అతి పెద్ద కళంకం.

ఒక్క ఇయోనియన్లలోనేగాక, గ్రీసుదేశం అంతటిలోనూ, దాని వలసలలోనూ కూడ ఏథెనియను కుటుంబాన్నే కాలక్రమేణా ఆదర్శముగా తీసుకొన్నారు. కాని, ఇన్ని తాళాలూ, కాపలాలూ వున్నా గ్రీకు స్త్రీలు ఏదో అవకాశం చూసుకొని భర్తల్ని తరచుగా మోసగిస్తూనే వుండేవారు. తమ భార్యలయెడ మక్కువ చూపడానికి సిగ్గుపడే మగవాళ్ళు వేశ్యలతో రహస్య కామకలాపాలు సాగించేవారు. స్త్రీలకు సంభవించిన పతనం మగవాళ్ళకీ చుట్టుకొంది. వారిని కూడా పతనం పొందించింది. చివరకు మగకుర్రవాళ్ళతో సంగమించేటంత అధోగతికి పాలయ్యారు. గనిమెడ్ కథ ద్వారా తమ దేవతల్ని కూడా తమ దుస్థితికి తెచ్చారు.

ప్రాచీనకాలంలో బాగా నాగరికులై అభివృద్ధిచెందిన ప్రజలను పరిశీలించగా దంపతీ వ్యవస్థకు మూలం యిదీ అని బోధపడుతుంది. అది వ్యక్తులమధ్య ప్రేమకు ఫలితంగా ఏర్పడిందికాదు. దానికీ దీనికీ సంబంధమే లేదు. అప్పటికింకా వివాహాలు పూర్వం మాదిరిగా అవసరం కోసరమే జరుగుతున్నాయి. సహజ పరిస్థితులమీదగాక, ఆర్థిక పరిస్థితులమీద ఆధారపడిన తొలి కుటుంబ రూపం ఇది. ప్రాచీనకాలంనాటి సహజ సమష్టిస్వత్వం పోయి వ్యక్తిగత ఆస్తి హక్కు ఏర్పడడాని కిది ఫలితం. గ్రీకులీ విషయాన్ని దాపరికంలేకుండా ఒప్పేసుకున్నారు — మగవాడికి కుటుంబంలో పెత్తనం, అతని సంపదకు వారసులయ్యేటందుకై అతనికే పుట్టిన బిడ్డల్ని చూపడమే ఈ దంపతీ వివాహాల వుద్దేశాలు. మిగిలిన విషయాలలో దంపతీ వివాహం ఓ భారం ఎత్తుకోవడంగానూ, దేవకార్యంగా, పితృకార్యంగా,

---

* యూరిపిడీస్, "ఒరెస్టెస్". — సం,

ప్రభుకార్యంగానూ, తప్పనిసరియై చేసుకొంటున్నదిగానూ ఉండేది. ప్రతి మగవాడూ పెళ్లిచేసుకుతీరాలనీ, కనీస దాంపత్యధర్మాల్ని నిర్వర్తించాలనీ ఏథెనియను చట్టం శాసించింది.

కాబట్టి, స్త్రీ పురుషుల మధ్య సహృదయతకు ఫలితంగా తలఎత్తలేదు దంపతీ వివాహం. సహృదయత కది ఉత్తమరూప మసలేకాదు. తద్భిన్నంగా, స్త్రీజాతిని పురుషుడు తన అధీనంలోకి తెచ్చుకొనడంతో అది వచ్చింది. దానిలో ఆదిమకాలంలో స్త్రీ పురుషుల మధ్య ఎన్నడూ ఎరగని వైరుధ్యం వ్యక్తమైంది. 1846లో మార్క్స్, నేనూ కలిసి రాసిన ఒక అముద్రిత గ్రంథంలో ఈమాట కనిపిస్తుంది: "ప్రప్రథమ శ్రమవిభజన స్త్రీ పురుషుల మధ్య బిడ్డల ఉత్పత్తికోసం"* జరిగింది. దాని కీనాడు ఈ వాక్యం కూడా చేరుస్తాను. దంపతీ వివాహంలో స్త్రీ పురుషుల మధ్య పెంపొందిన వైషమ్యమూ మొట్ట మొదటి వర్గ శత్రుత్వమూ, స్త్రీ జాతిని పురుషజాతి అణచివేయడమూ మొట్టమొదటి వర్గపీడనమూ చరిత్రలో ఏకకాలంలో తలఎత్తాయి. దంపతీ వ్యవస్థ చారిత్రకంగా ఒక పెద్ద ముందంజ కాని, బానిసత్వం, వ్యక్తిగత సంపదతోపాటు ఇదొక నూతన యుగాన్ని ఆరంభించింది. ఆ యుగమే ఈనాటికీ సాగుతూంది. ఈ యుగంలో ముందుకువేసిన ప్రతి ఒక అడుగూ సాపేక్షక దృష్టిలో వెనుకడుగు కూడా. ఇందులో కొందరు దారిద్ర్యాన్నీ, హీనతనూ అనుభవించడం ద్వారా కొందరు సంపదలూ, అభివృద్ధీ అనుభవిస్తారు. ఈ దంపతీ వివాహ వ్యవస్థ నాగరిక సమాజంయొక్క సూక్ష్మరూపం. తదుపరి నాగరిక సమా జంలో పూర్తిగా వికసించబోయే శత్రుత్వాలయొక్క, వైరుధ్యాలయొక్క స్వభావాన్ని మనం దీనిలోనే అధ్యయనం చెయ్యవచ్చు.

జంటపెళ్లిగాని, చివరకు దంపతీ వివాహంగాని పరిపాటిలోకి వచ్చినంత మాత్రంచేత ఆదిమకాలంలో దాంపత్య సంబంధాలలో వుంటూ వచ్చిన స్వేచ్ఛ అంతరించలేదు.

> "పునాలువన్ గుంపులు క్రమంగా అదృశ్యం అయాయి. ఆదిమకాలంలో వుంటూ వచ్చిన దాంపత్య సంబంధాల స్వేచ్ఛ క్రమంగా సన్నగిలుతూ వచ్చింది. అయినా అది వృద్ధిపొందుతున్న కుటుంబ వ్యవస్థను అంటిపెట్టుకొనే వుంది, దానిని అంటిపెట్టుకొని నాగరికతా యుగపు అంచులవరకూ వచ్చి.... చివరకు కొత్త మాదిరి హెటెరిజానికి పరివర్తన పొందింది. కుటుంబాన్ని నీడలా ఆవరించుకొని నాగరికతా యుగంలో మానవజాతిని వెంటాడుతూనే వుంది."

---

* Marx and Engels, *The German Ideology*, Moscow, 1964, p. 42–43. – సం.

దంపతీ వివాహంతోపాటు, వివాహ బంధానికి వెలుపల మగవాళ్లకూ, కన్యలకూ లైంగిక సంబంధాలుండే ఆచారాన్ని మోర్గన్ హెటెరిజం అన్నాడు. ఇది నాగరికయుగం అంతటిలో వివిధ రూపాల్లో కనబడుతూంది. అంతకంతకు అది బాహాటంగా జారత్వంగా అభివృద్ధి చెందుతోంది. అసలీ హెటెరిజానికి మూలం గుంపుపెళ్లి. తన పవిత్రతను కొనుక్కొనేటందుకోసం స్త్రీ తన్ను నామకః సమర్పించుకొనే ఆచారంలోంచి ఇది బయలు దేరింది. ధనంకోసం సంగమించడం మొదట మత ధర్మంగా ఉండేది. ఇల్లాంటి సంగమాలు ప్రేమదేవతల దేవాలయాల్లో జరిగేవి. ఆ సంగమాల ద్వారా సంపాదించిన డబ్బు ఆదిలో ఆ దేవాలయాలకు చెందేది. ఆర్మీనియాలోని అనాయిటిస్, కోరింథ్‌లోని ఆఫ్రోదిత దేవాలయాలలోని హైరోదులిలు,[123] భారతదేశపు దేవదాసీలు, బాయాదరే లనబడేవారు (bailadeira — నాట్యకత్తె అనే పోర్చుగీసు మాటకు అపభ్రంశం ఇది) మొట్టమొదటి వ్యభిచారిణులు. ప్రారంభంలో సమాజంలోవున్న ప్రతి ఆడుదీ చేసి తీరవలసిన పనిని ఈ అర్చకురాండ్రు మాత్రమే స్త్రీ జాతి ప్రతినిధులుగా నిర్వహించేవారు. ఇతర ప్రజలలో వివాహానికి పూర్వం ఆడపిల్లలకుగల సాంగత్య స్వేచ్ఛనుంచి "హెటెరిజం" పుట్టింది. అందుచేత ఇది కూడా గుంపుపెళ్లికి అవశేషమే, అయితే యిది మనకు సంక్రమించిన పద్ధతి మాత్రం భిన్నం. అనాగరికయుగపు ఉన్నత దశలోనే వ్యక్తుల ఆస్తులలో అసమానత ఏర్పడింది. అప్పటికే బానిసల శ్రమతో పాటు అక్కడా అక్కడా వేతనశ్రమ కూడా ప్రారంభమయింది. అదే సమయంలో దానితో సంబంధం కలిగి బలవత్సంగమానికి లోబడవలసిన బానిస స్త్రీలతోపాటు వ్యభిచార వృత్తితో జీవించే స్వతంత్రురాండ్రైన స్త్రీలు కూడా వచ్చారు. గుంపుపెళ్లినుంచి నాగరికతకు సంక్రమించిన ఈ వారసత్వం ద్విముఖం. నాగరికత సృష్టించిన ప్రతిదానికీ రెండు ముఖాలున్నాయి. రెండు నాలికలున్నాయి. అన్నీ ఆత్మవిఘాతకాలు, పరస్పర విరుద్ధాలున్నూ. ఒకవేపున దంపతీ వివాహం, రెండోవేపున హెటెరిజం, దానితోపాటు ఉగ్ర రూపంలో సాగే వ్యభిచారం. హెటెరిజం మిగతా అన్నింటిలాగే ఒక సాంఘిక వ్యవస్థ, ఆదిమ కాలపు సాంగత్య స్వేచ్ఛ మగవాళ్లకు దానిలో లభిస్తుంది. వాస్తవానికి దానిని సహించడమేకాక, ముఖ్యంగా పాలకవర్గాలు చాలా ఉత్సాహంగా దాన్ని అమలుజరుపుతున్నప్పటికీ దాన్ని మాటల్లో అంతా ఖండించేవారే. అయితే ఈ పనిలో అపనింద అంతా ఆడవాళ్లదే. మగవాళ్ల కేమీలేదు. ఆడవాళ్లమీద మగవాళ్ల సర్వస్వాధికారమే సమాజపు ప్రధాన సూత్రమని చాటిచెప్పడానికన్నట్లు స్త్రీలను సమాజంనుంచి వెలిపెడుతున్నారు, గెంటివేస్తున్నారు.

రెండో వైరుధ్యం దంపతీ వివాహం లోపలనే బయలుదేరింది. హెటెరిజాన్ని ఆచరిస్తూన్న భర్త ప్రక్క అతనిచే నిరాకృతయైన భార్య, ఏ వైరుధ్యంలోనూ ఒక సగం లేకుండా రెండో సగం వుండదు. పండులో సగం తినేశాక చేతిలో పూర్తి పండు వుండదు. అయితే మగవాళ్లకు ఆ జ్ఞానం వున్నట్లు తోచదు. భార్యలు గట్టిగా పాఠం చెప్పేవరకూ వారు

తమ చేతిలో పూర్తి పండే వుందనుకున్నారు. అదివరకు సమాజంలో ఎన్నడూ కనబడని రెండు తరహాల వ్యక్తులు దంపతీ వివాహంతో ప్రత్యక్షమయ్యారు. ఒకడు రంకుమగడు. రెండవవాడు జారిణి భర్త. ఆడుదాన్ని మగవాడు లొంగదీశాడు. అయితే విశాలహృదయంతో విజేతలకు కిరీటాలు తగిలించే కార్యం విజితలు తీసుకున్నారు. దంపతీ వివాహం, హెటెరిజంతోపాటు జారత్వం కూడా ఒక అనివార్య సాంఘికవ్యవస్థ అయింది. దానిని నిషేధించారు. కఠోరశిక్షలు విధించారు. కాని దానిని నిలపడం అసాధ్యమైంది. పిల్లలకు తండ్రి ఎవరనేది వెనకటిలాగే ఇప్పుడూ నైతిక విశ్వాసంమీదనే ఆధారపడి నిర్ణయించవలసివచ్చింది. పరిష్కరించడం అసాధ్యం అయిన ఈ సమస్యను పరిష్కరించేటందుకు నెపోలియన్ శిక్షాస్మృతి 312వ ఆర్టికలులో ఈవిధంగా వుంది:

> "L'enfant conçu pendant le mariage a pour père le mari" — "వివాహిత దశలో కడుపునపడిన బిడ్డకు భర్తయే తండ్రి."

మూడువేల సంవత్సరాలపాటు దంపతీ వ్యవస్థ కొనసాగిన వెనుక కూడా పరిస్థితి ఇది.

నాగరికత ప్రారంభమైనప్పటినుంచీ వర్గాలుగా విడిపోయిన సమాజంలోని వైరుధ్యాలూ, శత్రుత్వాలూ సూక్ష్మరూపంలో దంపతీ వ్యవస్థలో కనబడతాయి. మగవాని ఏకచ్ఛత్రాధిపత్యానికి ఫలితంగా స్త్రీ పురుషుల మధ్య తీవ్ర సంఘర్షణలో ఆ వ్యవస్థకు మూలం అయిన చారిత్రక దశ ప్రతిబింబిస్తూంది. ఆ వైరుధ్యాలను అది పరిష్కరించుకోలేదు, అధిగమించనూలేదు. ఆ వివాహ వ్యవస్థయొక్క ప్రాథమిక లక్షణా లన్నింటితో వైవాహిక జీవితాన్ని గడుపుతూ భర్త పెత్తనానికి ఎదురుతిరిగే భార్యలున్న దంపతీ కుటుంబాలను గురించే నేనిది రాస్తున్నా. అన్ని వివాహాలూ ఇదేమాదిరిగా వుండవు. ఈ సంగతి జర్మను కూపస్థమండూకపు వైఖరిగలవాడికి బాగా తెలుసు. అతడు బయట ప్రభుత్వంలోనూ, ఇటు ఇంట్లోనూ కూడా తన పెత్తనాన్ని నిర్వహించుకోలేడు. భార్యయే కళ్లేలు చేతధరిస్తుంది. అయితే చీటికీమాటికీ స్త్రీ చేతిలో పరాభవం పొందే ఫ్రెంచి మగవానికన్న తానే నయమని అతని సంతృప్తి.

దంపతీ కుటుంబం గ్రీకుల్లో మాదిరిగా అంత కఠోరరూపంలో అన్నిచోట్లా, అందరిలోనూ కనబడదు. భవిష్యత్తులో ప్రపంచవిజేతలు కానున్న రోమనులు అంత నాగరికం కాకపోయినా దూరదృష్టిని ప్రకటించారు. వారిలో స్త్రీకి గ్రీకు స్త్రీలకన్న ఎక్కువ గౌరవం, స్వాతంత్ర్యం వున్నాయి. తన భార్యను చంపెయ్యడానిక్కూడా అతనికి హక్కు వుంది. ఆ హక్కే ఆమె పాతివ్రత్యానికి పెట్టనిగోడ అని అతని అభిప్రాయం. దీనికితోడు వారిలో భార్య కూడా భర్తతో సమంగా తన ఇష్టానుసారం వివాహ బంధాన్ని తెంచేసుకోగలదు.

జర్మనులు చారిత్రకరంగంలో అడుగుపెట్టిన తర్వాతనే దంపతీ వివాహంలో గొప్ప అభివృద్ధి వచ్చింది. బహుశా ఇది దారిద్ర్యానికి ఫలితంగానే అయివుంటుంది. వారిలో జంటపెళ్లి పద్ధతినుంచి దంపతీ వివాహ వ్యవస్థ పూర్తిగా విడివడి వుండలేదు. అదే ఆ అభివృద్ధికి కారణం. టాసిటను పేర్కొన్న మూడు అంశాల్ని పట్టి మనం వీనిని వూహించవచ్చు. ఒకటి, వివాహం ఒక పవిత్రకర్మగా భావించబడుతూ, "ప్రతి మగవాడూ ఒక ఆడుదానితో తృప్తిపడి వుంటున్నాడు. స్త్రీ పవిత్రంగా వుంటూంది" అని విశ్వసిస్తూన్నప్పటికీ, తెగల పెద్దలూ, హోదాగలవారూ ఎక్కువమంది భార్యల్ని కలిగివుంటున్నారు. జంటపెళ్లిళ్ల పరిపాటిగా వున్న అమెరికనులలో వున్న మాదిరి పరిస్థితే యిది. రెండోది, తల్లిహక్కునుంచి తండ్రిహక్కులోకి మార్పు కొద్దికాలం క్రితమే వచ్చివుంటుంది. ఏమంటే ఆనాటికింకా వారిలో తండ్రికంటే మేనమామ దగ్గరవాడుగా భావించబడుతున్నాడు. తల్లిహక్కు ప్రకారం గణాలలోని మగవారిలో సన్నిహిత బంధువు తల్లి సోదరుడు. అమెరికన్ ఇండియనులలో కూడ ఇదే పరిస్థితి కనబడుతుంది. మార్క్స్ తరచుగా చెప్పినట్లు వాళ్లలో మన ఆదిమ కాలపు చరిత్రను అర్థంచేసుకొనేందుకు వీలుకలిగించే కీలకం దొరికింది. ఇంక మూడోది, జర్మనులలో స్త్రీలకు అధికమైన మర్యాద ఇచ్చేవారు. సార్వజనిక వ్యవహారాలలో కూడా వారికి పలుకుబడి వుండేది. దంపతీ వ్యవస్థలో మగవాడిది ప్రాముఖ్యం ఈ రెండూ పరస్పర విరుద్ధాలు. ఈ అన్ని విషయాలలో జర్మనులకు స్పార్టనులతో పోలిక వుంది. ఆ స్పార్టనులలో జంటపెళ్లి పద్ధతి అంతరించి వుండలేదని మనం పైన చూశాం. ఆవిధంగా జర్మనుల రాకతో ఒక నూతన అంశం ప్రపంచ ప్రాముఖ్యాన్ని గడించింది. రోమన్ సామ్రాజ్య శిధిలాలమీద విభిన్న జాతులు సమ్మేళనమయ్యాయి. ఆ సమ్మేళనంలో దంపతీ వివాహం ఒక నూతన రూపంలో అవతరించింది. దీనిలో మగవాని ఆధిక్యత కొంతవరకు మృదుతరమైన రూపాల్లో వుంది. పైచూపులకే అయినా స్త్రీల స్థితి వెనుకటి కాలంలోకన్న చాలా గౌరవాన్వితంగానూ, స్వేచ్ఛాయుతంగానూ వుంటుంది. అతఃపూర్వం ప్రపంచానికి తెలియని ఆధునిక స్త్రీ పురుష ప్రేమ ప్రప్రథమంగా తలఎత్తింది. దీనికి మూలం దంపతీ వివాహమేనని చెప్పాలి. దంపతీ వివాహంలో గొప్ప నైతిక పరిణామం వచ్చేందుకు అవకాశం ఏర్పడింది. అయితే ఆ ప్రేమ వివాహంతోపాటు పుట్టిందా, వివాహం లోపల ఏర్పడిందా లేక వివాహానికి వెలుపలా అనేది ఆయా పరిస్థితులనుబట్టి వుండేది.

జర్మనులు అప్పటికి జంట కుటుంబ వ్యవస్థలోనే జీవిస్తూ వుండడం, ఆ కుటుంబాలలో స్త్రీలకుండే హోదావంటి హోదానే సాధ్యమైనంతవరకు దంపతీ వ్యవస్థలో కూడ ప్రవేశపెట్టడమూ ఈ అభివృద్ధికి కారణాలు. దంపతీ వ్యవస్థలో కొట్టవచ్చినట్లు కనబడే నైతిక వైరుధ్యాలు జంటపెళ్లిలో కనబడవు. అదే అభివృద్ధికి మూలం. అంతేగాని, జర్మనులలో ఏదో అద్భుతమైన నైతిక పారిశుధ్యం వుండడమూ, నిరుపమానమైన సచ్ఛీలత వుండడమూ

వలన కాదు. అసలీ పారిశుద్ధ్యమూ, సచ్ఛీలతా జంటపెళ్లిలో వుండే స్వాతంత్ర్యమే తప్ప వేరుకాదు. నిజం చెప్పాలంటే జర్మనులు తమ సంచారాలలో — ముఖ్యంగా ఆగ్నేయ దిశగా నల్లసముద్ర ప్రాంతాలకు పోయినపుడు — అక్కడి మైదానాలలోని సంచార జాతులనుంచి గుర్రపు సవారీతోపాటు ఎన్నో అసహ్యమైన వ్యసనాలను కూడా నేర్చుకొన్నారు. తైఫాలీ తెగని గురించి అమ్మియానుస్ రాసినదానిలోనూ, హెరులీల*ను గురించి ప్రొకోపియస్ రాసినదానిలోనూ ఇది చాల స్పష్టంగా వుంది.

దంపతీ వివాహంలోనే మనం చెప్పే ఆధునిక స్త్రీ పురుష ప్రేమ ఏర్పడగలదు. దాని అర్థం, వివాహితులయిన దంపతుల మధ్యనే ప్రేమ ఏర్పడిందనిగాని, వారిలోనే హెచ్చుగా వుండేదనిగాని కాదు. మగవానికి సర్వాధిపత్యం వుండే దంపతీ వివాహపు స్వభావమే ఆ ప్రేమ పుట్టడానికి అభ్యంతరకరం. చారిత్రకంగా క్రియాశీలమైన వర్గాలన్నింటా, అంటే పాలక వర్గాలన్నింటా వివాహం అనేది జంటపెళ్లి కాలంనుంచీ జరుగుతున్నట్లు ఆర్థిక ప్రయోజనాల నుద్దేశించి తల్లిదండ్రులచే ఏర్పాటుచేసేదేగాని, జరుగుతున్నదేగాని వేరుకాదు. దాంపత్య ప్రేమ చరిత్రలో ప్రప్రథమంగా మోహం రూపంలో కనబడుతుంది. ఏ వ్యక్తికైనా — కనీసం పాలకవర్గాల వారందరికీ — దానిని అనుభవించే అధికారం వుంది. లైంగిక వాంఛకది ఉత్తమరూపంగా గుర్తించబడింది. ఆ మోహానికి గమ్యం లైంగిక వాంఛయే. మధ్యయుగాలనాటి వీరయోధుల గాథలలో మనం చూసేది ఈ మోహాన్నే. అది అసలు వైవాహిక ప్రేమ కానేకాదు. పైపెచ్చు ఆ మోహం ప్రావాన్స్‌వాసులలో భర్తృద్రోహానికే దారితీసింది. దానిని శ్లాఘిస్తూనే కవులెన్నో గీతాలు రాశారు. జర్మన్ భాషలో ప్రభాత గీతికలు "అల్బాన్" ప్రావాన్సలుల కవితలలో చాల ఉత్తమమైనవి. వీరుడు తన ప్రేమికురాలయిన మరొకని భార్యతో నిద్రిస్తున్నాడు. వాకిట సేవకుడు కాపలావున్నాడు. ఉషః కాంతులు (అల్బా) విరుస్తూంటే తన యజమాని యితరుల కంటబడకుండా తప్పుకు పోయేందుకు వీలుగా అతడు యజమానుణ్ణి లేపుతాడు. ప్రేయసీ — ప్రేమికులు విడువలేక విడువలేక విడిపోతారు. ఔత్తరాహిక ఫ్రెంచి ప్రజలూ, జర్మను యోగ్యపురుషులు కూడ ఈమాదిరి గేయాల్నీ, వాటిని అనుసంధించి వుండే సాహసిక ప్రేమనూ అభిమానించారు.

---

* తైఫాలీ — గోథ్‌లకు సన్నిహితమైన ఒక జర్మన్ తెగ. 3వ శతాబ్దంనాటికి యీ తెగ నల్ల సముద్రపు ఉత్తర తీరాల్లో స్థిరపడింది. తరుపరి, 4వ శతాబ్దపు రెండవ అర్ధభాగంలో హూణులచేత యీ తెగ అక్కడినుంచి తరిమివెయ్యబడింది.

హెరులీ — ఇదొక జర్మన్ తెగ. కొత్త శకానికి ముందు యీ తెగ స్కాండినేవియన్ ద్వీపకల్పంలో స్థిరపడింది. 3వ శతాబ్దంలో వీరిలో కొందరు నల్ల సముద్రపు ఉత్తర తీరానికి తరలివెళ్లారు. అక్కడినుండి హూణులచేత వారు తరిమివెయ్యబడ్డారు. — సం.

మన వొల్ఫ్రామ్ ఫన్ ఎషెన్‌బాహ్ ఈ కథా వస్తువుతోనే మూడు ప్రభాతగీతికలను రాశాడు. నా ఉద్దేశంలో ఆయన రాసిన మూడు దీర్ఘ వీరకావ్యాలకన్న ఈ మూడు గీతికలే బాగున్నాయి.

ఈనాడు బూర్జ్వా వివాహాలు రెండుపద్ధతులలో జరుగుతున్నాయి. కాథలిక్ దేశాలలో తల్లిదండ్రులే తమ కొడుకుకు ఒక కన్నెను వెతికిచేస్తారు. దాని ఫలితంగా దంపతీ వివాహంలో సహజంగా వుండే వైరుధ్యాలు పూర్తిగా విజృంభిస్తాయి. భర్త వేశ్యలతో కులుకుతూంటాడు. భార్య జారత్వానికి ఎగబడుతుంది. చావుకిలాగే జారత్వానికి కూడా మందులేదనే అభిప్రాయంతోనే కాథలిక్ చర్చి విడాకుల్ని నిషేధించి వుండాలి. ఇంక ప్రొటెస్టెంట్ దేశాలలో, అక్కడ బూర్జ్వా కుటుంబాల యువకుడు తన వర్గంలోంచి తనకు నచ్చిన పడుచును చేసుకొనేందుకు యించుమించు స్వాతంత్ర్యం వుందనే చెప్పవచ్చు. ఫలితంగా ఇక్కడ వివాహాలకు ప్రేమ కొంతవరకు కారణం అయి వుంటుందనుకోవచ్చు. అయితే ప్రొటెస్టెంట్లు తమ కాపట్యాన్ని దాచిపెట్టుకొని, మర్యాదకోసం ప్రేమ ఎల్లప్పుడూ పెళ్లిళ్లకు కారణం అంటారు. ఇక్కడ భర్త వేశ్యల వెంటబడడం, భార్య జారత్వానికి పాల్పడడం సార్వత్రికం కాదు. వివాహం ఏ పద్ధతిలో జరిగినా మనుష్యులు మనుష్యులే. పెళ్లి కాకపూర్వం వున్న మనిషే పెళ్లి అయాకా వుంటాడు. పైగా ప్రొటెస్టెంటు దేశాల పౌరులు అధికాంశం కూపస్థమండూకపు వైఖరి గలవారు. అందుచేత, వారిలో బాగా ఫలించాయనుకొనే వివాహాలలో మంచివి ఏరి చూసినా, ప్రొటెస్టెంట్ల దంపతీ వివాహం సాధించిందల్లా శయ్యా సమభాగిత్వాన్ని మాత్రమే. విసుగునూ, అసహ్యాన్నీ గార్హస్థ్య సౌఖ్యం పేరుతో దాచిపెట్టుకొంటారు. నవలలలో మనం ఈ రెండు తరహాల వివాహాలనూ అద్దంలో చూచినట్లు చూడవచ్చును. ఫ్రెంచి నవల కాథలిక్ పద్ధతినీ, జర్మను నవల ప్రొటెస్టెంటు పద్ధతినీ చూపిస్తూంది. ఈ రెండింటా కథానాయకుడు సంచితార్థాన్ని సంపాదిస్తాడు. జర్మను నవలలో యువకుడు భార్యను సంపాదిస్తాడు. ఫ్రెంచి నవలలో భర్త భార్య ఉపపతియొక్క కొమ్ములు సంపాదించుకుంటాడు. ఈ యిద్దరిలో ఎవరిదెక్కువ దౌర్భాగ్యమో ఒక్కొక్కప్పుడు చెప్పడం కష్టం. అందుచేతనే జర్మను నవలలోని పేలవత్వం చూసి ఫ్రెంచి బూర్జ్వా అసహ్యించుకొంటాడు. ఫ్రెంచి నవలలోని "అవినీతి"ని చూసి జర్మను కుసంస్కృతీ పరుడు వెలపరించుకొంటాడు. ఇప్పుడు "బెర్లిను ప్రపంచ నగరం అవుతోంది" కనుక జర్మను నవలాకారులు కొంత జంకు విడిచి, తమకు చిరపరిచితములయిన హెటెరిజాన్నీ, జారత్వాన్నీ కథా వస్తువుగా తీసుకుంటున్నారు.

ఈ రెండు సందర్భాలలోనూ కూడ వధూవరుల వర్గస్థితినిబట్టి వివాహాలు జరుగుతాయి. అందుచేత ఇవి సదా ఒక ప్రయోజనాన్ని వుద్దేశించి జరుగుతున్నవిగానే వుంటున్నాయి. ప్రయోజనార్థం జరిగే ఈ రెండు తరహాల వివాహాలూ తరచు వట్టి వ్యభిచారాలే ననాలి. ఒక్కొక్కప్పుడు ఇద్దరూ వ్యభిచారానికే దిగుతారు. భార్య విషయంలో

ఆమాట సర్వసాధారణంగా యధార్థం. అయితే మామూలు వ్యభిచారిణికీ ఆమెకూ ఒక్కటే తేడా. కంట్రాక్టు కూలిలాగ ఎప్పటికప్పుడు కొంత డబ్బు తీసుకొని కొంతకాలం పాటు తన శరీరాన్ని అమ్ముకోవడంగాక, శాశ్వతంగా ఆమె తన శరీరాన్ని అమ్ముకొంటుంది. ప్రయోజనాన్ని వుద్దేశించి జరిగే పెళ్ళిళ్లను గూర్చి ఫోరియరు* చెప్పిన ఉపమానం అన్ని వివాహాలకూ వర్తిస్తుంది.

> "వ్యాకరణంలో రెండు వైయర్థకాలు ఒక అస్త్యర్థాన్ని తెలుపుతాయి. అలాగే వైవాహిక నియమాలలో రెండు వ్యభిచారాలు ఒక పాతివ్రత్యంగా లెక్క."

పీడిత వర్గాలలో మాత్రమే, అనగా నేటి శ్రామికవర్గంలో మాత్రమే భార్యాభర్తల మధ్య దాంపత్య ప్రేమ సర్వసాధారణం అయ్యే అవకాశం వుంది. వాళ్ల సంబంధాలను చట్టాలు అంగీకరించడమూ అంగీకరించకపోవడమూ వేరుమాట. ఈ వర్గం దగ్గరకు వచ్చేసరికి దంపతీ వివాహానికి మూలం అయిన కారణాలన్నీ తొలగిపోయాయి. ఈ వర్గానికి ఆస్తి అనేది ఏమీ వుండదు. ఆస్తికి వారసుల్ని కనేందుకేగద దంపతీ వివాహం వచ్చింది. మగవాని అధికారమూ దానికేగదా! ఆస్తి లేనప్పుడు మొగవాని పెత్తనానికి బలమూ వుండదు. ఈ ఆధిపత్యాన్ని కాపాడేటందుకే బూర్జువా చట్టాలు, ఆ చట్టాలు ఆస్తిపరులకే. శ్రామికులను అణచిపెట్టడం వాటి వుద్దేశం, చట్టాలంటే డబ్బుతో పని. పనివాడు దరిద్రుడు. అందుచేత భార్యపట్ల అతని వైఖరి విషయంలో డబ్బుకి విలువలేదు. ఇక్కడ వ్యక్తిగత, సమాజగత పరిస్థితులది ప్రాబల్యం, పైగా పెద్దపెద్ద పరిశ్రమలు వచ్చి స్త్రీని ఇంట్లోంచి బయటికి తెచ్చాయి. ఆమె తన శ్రమను అమ్ముకొనేటట్లు ప్రోత్సాహం ఇచ్చాయి. ఫ్యాక్టరీలలో ఆమెను ప్రవేశపెట్టాయి. తరచు కుటుంబంలో తిండికి డబ్బు సంపాదించేది ఆమె ఒక్కర్తే అవుతూంది. ఆవిధంగా మగవాడి పెత్తనానికి మూలం అయిన కారణాలన్నీ తుడుచుకుపోతున్నాయి. అయితే దంపతీ వివాహం వచ్చాక మగవాడికి బాగా అలవాటయిన చెయ్యి చురుకుతనం కొంత వుండచ్చు. శ్రామిక కుటుంబంలోని వధూవరులిద్దరికీ ప్రగాఢమైన ప్రేమ, పరస్పరానుబంధమూ వుండొచ్చు. మతాధికారుల ప్రభుత్వాధికారుల ఆశీస్సులూ, అనుమతులూ వారికి లభించవచ్చు. అయినా, దానిని దంపతీ వివాహం అని ఖచ్చితంగా చెప్పడానికి వీలులేదు. అందుచేత దంపతీ వివాహాన్ని తప్పనిసరిగా వెంటాడుతూ

---

* చార్ల్స్ ఫోరియర్ (1771–1837) ఫ్రెంచివాడు. ఉటోపియన్ సోషలిస్టులలో బాగా పేరున్నవాడు.

వుండే హెటెరిజమూ, జారత్వమూ యించుమించు లేకుండా పోతాయి. స్త్రీకి విడాకులు పొందే అధికారం లభించింది. భార్యాభర్తలకు పొత్తు కుదరకపోతే విడిపోతారు. అంటే శ్రామికుల వివాహాన్ని శబ్దార్థరీత్యా దంపతీ వివాహం అనగలమేగాని, చారిత్రకార్థంలో ఆ మాట చెల్లదు.

చట్టాల ద్వారా వస్తున్న అభివృద్ధివల్ల స్త్రీల బాధలు అంతకంతకు తొలగిపోతున్నాయని న్యాయశాస్త్రవేత్తలు అంటున్నారు. వధూవరులు ఇద్దరూ తమ ఇష్టంమీదనే వివాహం చేసుకోవాలనీ, వివాహానంతరం కూడా వారి హక్కులూ, బాధ్యతలూ, సమానంగానే వుండాలనీ, ఆధునిక నాగరిక చట్ట సంహితలు క్రమంగా అంగీకరిస్తున్నాయి. ఈ రెండూ నిక్కచ్చిగా చెల్లుబడి అయితే, స్త్రీలకు కావలసినవన్నీ లభించినట్లేనని వారి వాదన.

అతివాదియైన రిపబ్లికన్ బూర్జువా కూడా ఈ వాదననే శ్రామికుని విషయంలో తెచ్చి అతన్ని బర్తరఫ్ చేస్తాడు. ఉభయపక్షాలూ ఇష్టపూర్తిగా పని ఒప్పందం చేసుకొన్న ట్లుంటుంది. చట్టం ఉభయపక్షాలూ సమానులేనని కాగితంమీద అంగీకరిస్తే చాలు. ఆ ఒప్పందానికిద్దరూ ఇష్టపూర్తిగా అంగీకరించారని చట్టం అంటుంది. ఉభయులలో ఒకరు తమ వర్గస్థాన బలిమిచేత రెండోవారిమీద ఒత్తిడి తెస్తారన్న విషయమూ, ఆర్థికంగా ఇద్దరిదీ సమానమైన హోదాకాదనే విషయమూ చట్టానికి పట్టదు. ఆ ఒప్పందం అమలులో వున్నంతకాలమూ ఉభయపక్షాలవారికీ సమాన హక్కులుంటాయనీ, అందులో ఏ ఒక్కరైనా ఆ ఒప్పందాన్ని రద్దుపరచవచ్చుననీ చట్టం చెప్తుంది. కార్మికుని ఆర్థికస్థితి అటువంటిది. నామమాత్రంగా వున్న సమానతను కూడా వదులుకోక తప్పనిస్థితిని అది తెచ్చిపెడుతుంది. చట్టాని కదేమీ పట్టదు.

ఇంక పెళ్లి విషయం. ఎంతో అభివృద్ధి పొందిన దేశాలలోని చట్టాలు కూడా వధూవరులు తాము ఇష్టపూర్తిగా వివాహం చేసుకొంటున్నామని నమోదు చేయించుకొంటే చాలు, సంతృప్తిపడతాయి. ఈ చట్టాల తెరవెనుక నిజజీవితంలో ఏం జరుగుతూందో, ఈ ఇష్టపూర్తిగానే పెళ్లిచేసుకోవడం ఎలా తటస్థపడిందో చట్టానికిగాని, న్యాయశాస్త్రవేత్తల కుగాని పట్టదు. న్యాయశాస్త్రాల ప్రాథమిక సూత్రాలలో వున్న తేడాపాడాలను చూస్తే, ఈ వివాహ ఒప్పందం ఎంత ఇష్టపూర్తిగా జరుగుతూందో న్యాయశాస్త్రవేత్త తెలుసుకోగలుగు తాడు. జర్మనీలోనూ ఫ్రెంచి చట్టాలు అమలుజరిగే దేశాలలోనూ తండ్రుల ఆస్తి కొడుకులకు విధిగా సంక్రమిస్తుంది. వారసత్వం వారికి లేకుండా చేయడానికి వీలులేదు. కాని ఆ దేశాలలో బిడ్డలు వివాహ విషయంలో తల్లిదండ్రుల అంగీకారాన్ని పొంది తీరాలి. ఇంగ్లీషు చట్టాలు చెల్లే దేశాలలో వివాహానికి తల్లిదండ్రుల సమ్మతి పొంది తీరాలని లేదు. కాని, అక్కడ తల్లిదండ్రులు తమ ఆస్తిని తమ ఇష్టంవచ్చినట్లు చేసుకొనేటందుకు హక్కు వుంది. నామకః వారికో పైసా ఇచ్చి మిగిలింది సున్న చుట్టవచ్చు. దీనివలన

తేలేది ఏమిటి? ఆస్తిపరుల కుటుంబాలలో వివాహ విషయంలో స్వేచ్ఛ అన్ని దేశాలలో – అమెరికా, ఇంగ్లండు, జర్మనీ, ఫ్రాన్సు ఎక్కడా కూడా – ఒకే విధంగా వుంటూంది.

వివాహంలో భార్యాభర్తలకు చట్టరీత్యా సమాన హక్కులున్నాయనేది కూడా ఇంతే. ఉభయపక్షాల మధ్యా వున్న అసమానత గత సమాజ పరిస్థితులకు ఫలితంగా వచ్చింది మాత్రమే. స్త్రీలను ఆర్థికంగా అణచివుంచడం ఫలితంగా వచ్చిందేగాని దానికిది కారణం కాదు. ప్రాచీనకాలంనాటి సమష్టి గృహవ్యవస్థలో ఎంతోమంది జంటలు తమ సంతానంతో కలిసి జీవించేవారు. ఈ ఇండ్లలో గృహనిర్వహణ అంతా స్త్రీలది. మగవాని ఆహార సంపాదనకార్యంలాగే, గృహనిర్వహణ కార్యం కూడా ఒక సాంఘికకర్మ. సాంఘికావసరకర్మ. కాని పితృస్వామిక కుటుంబం వచ్చాక, అంతకంటేనూ దంపతీ వివాహ వ్యవస్థ ఏర్పడ్డాక పరిస్థితులలో మార్పు వచ్చింది. గృహనిర్వహణకి అంతవరకూ వుంటూవచ్చిన సాంఘిక స్వభావం పోయింది. అదిప్పుడు సాంఘిక కర్మకాదు; వ్యక్తిగత సేవ అయింది. సాంఘికోత్పత్తిలో ఆమెకు వుంటూవచ్చిన స్థానం పోయింది. ఇంట్లోని పనికత్తెలలో ఆమె మొదటిదైంది. అంతే పెద్దపెద్ద ఆధునిక పరిశ్రమలు వచ్చాకనే, ఆమె తిరిగి సాంఘికోత్పత్తి రంగంలో అడుగుపెట్టడానికి అవకాశం లభించింది. ఆ అవకాశమైనా కార్మిక స్త్రీకి మాత్రమే లభించింది. ఆమె తన కుటుంబపు స్వంతపనులు నిర్వహించపూనుకొంటే సాంఘికోత్పత్తిలో పాల్గొనలేదు. ఏమీ సంపాదించలేదు. సాంఘికకర్మలో పాల్గొని స్వతంత్రంగా జీవించ దలచిందా కుటుంబబాధ్యతలను నిర్వర్తించలేదు. ఫ్యాక్టరీలలో పనిలాగే ఇతర వృత్తులు – వైద్యం, లాయరు వృత్తివరకూ అన్నింటా ఒకటే పరిస్థితి. ఈనాటి విడి కుటుంబాలలో భార్య గృహదాసి. ఆ దాసీత్వం నిగూఢం కావచ్చు, బహిరంగంగావచ్చు. ఈ కుటుంబ వ్యవస్థకు మూలమే అది. నేటి సమాజంలో విడి కుటుంబాలు అణువులు, ఆ అణువుల సమూహమే ఈనాటి సమాజం. చాలా కుటుంబాలలో – ముఖ్యంగా ఆస్తివున్న కుటుంబాలలో – కుటుంబానికి తిండితెచ్చి పోషించవలసిన బాధ్యత మగవానిది. కుటుంబంలో అతని ఆధిక్యతకు మూలం అదే. దానికి ప్రత్యేకంగా చట్టాలు అక్కర్లేదు. కుటుంబం లోపల అతడు బూర్జువా, భార్య శ్రామికులకు ప్రాతినిధ్యం వహిస్తుంది. పారిశ్రామిక ప్రపంచంలో శ్రామికుని అణచిపెడుతున్న ఆర్థిక పీడన చూడదలచుకొంటే పెట్టుబడిదారీ వర్గానికి న్యాయచట్టాలలో కలిగించిన ప్రత్యేక సౌకర్యాలు రద్దుపరచాలి. ఉభయవర్గాలకూ చట్టరీత్యా పూర్తి సమానత్వం అమలుజరపాలి. ప్రజాతంత్ర రిపబ్లిక్ సమాజంలోని వర్గాల మధ్యనున్న వైషమ్యాలను అంతంపొందించదు. పైగా ఆ వైషమ్యాలను అమీ తుమీ తేల్చుకొనేటందుకు అవసరమైన రంగాన్ని సృష్టిస్తుంది. అదే విధంగా ఆధునిక కుటుంబంలో భార్యమీద భర్తకున్న ఆధిక్యతను రద్దుపరచాలన్నా, వారిరువురిమధ్యా సరిసమానమైన సాంఘిక సమానత్వం కల్పించాలన్నా ఉభయులకూ న్యాయశాస్త్ర రీత్యా సమానమైన హక్కుల్ని

కలిగించాలి. స్త్రీజాతి నంతనూ తిరిగి పారిశ్రామిక రంగంలోకి తీసుకొచ్చినప్పుడే వారు నిజంగా స్వతంత్రులవుతారని దీన్నిబట్టి బోధపడుతుంది. ఇందుకు విడి కుటుంబం సమాజానికి ఆర్థిక యూనిటుగా ఉండే ఆ స్థితిని రద్దుపరచాలి.

* * *

ఈవిధంగా, మానవజాతి ప్రధాన అభివృద్ధిదశలు మొత్తంమీద మూడింటిలోనూ మూడు విధాలైన వివాహ పద్ధతులు మనకు కనబడుతున్నాయి. ఆటవిక యుగంలో గుంపు పెళ్లి; అనాగరిక యుగంలో జంటపెళ్లి; నాగరిక యుగంలో దంపతీ వివాహం, దానికి తోడుగా జారత్వమూ, వ్యభిచారమూను. అనాగరిక యుగపు ఉన్నత దశలో జంటపెళ్లికీ, దంపతీ వివాహానికీ నడుమ ఒక స్థితిలో బానిస స్త్రీలమీద మగవానికి పూర్ణాధికారం ఏర్పడి బహుభార్యాత్వాన్ని అనుసరించారు.

మా వివరణనంతనూ చూస్తే ఒక విషయం స్పష్టపడుతుంది. గుంపుపెళ్లిలో వున్న సాంగత్యస్వేచ్ఛ క్రమంగా స్త్రీకి తగ్గించబడుతూ వచ్చింది. కాని మగవాడు పూర్వం మాదిరిగా దానిని అనుభవిస్తూన్నాడు. నిజం చెప్పాలంటే మగవాడి విషయంలో యీనాడు కూడా గుంపుపెళ్లి అమల్లో వుంది. ఏ పని స్త్రీ చేస్తే నేరమో, ఏ పనికి చట్టబద్ధమూ, సామాజికమూ అయిన తీవ్ర పరిణామాలుంటాయో అదే పని పురుషుడి విషయంలో గౌరవప్రదంగా పరిగణించబడింది. లేక మహా అయితే నైతికంగా ఓ చిన్న మచ్చగా పరిగణించబడి, అతనిచేత సంతోషంగా సహించబడేది. ఆ మచ్చని అతడు సంతోషంతో స్వీకరిస్తాడు. పెట్టుబడిదారీ విధానంలో సరుకుల ఉత్పత్తి వ్యవస్థ ప్రభావంతో పూర్వకాలపు "హెటియారిజమ్" మార్పు చెంది ఈ ఉత్పత్తికి సమన్వయపడుతూ బహిరంగ వ్యభిచారంగా మారుతోంది. ఈ మార్పు చాలా దుష్ఫలితాలను తెచ్చింది. ఇది ఆడవాళ్లలో కన్న మగవాళ్లలో ఎక్కువ దుష్పరిణామాన్ని కలిగించింది. వ్యభిచారానికి లోబడినవాళ్ళ మాత్రమే స్త్రీజాతిలో పతితలవుతారు. అదైనా అందరూ భావించేటంత ఎక్కువ పతనం కాదు. కాని, రెండోవేపున మగజాతి శీలసంపదనే అది పతనంచేస్తుంది. ప్రధాన కాలం సుదీర్ఘంగా వున్న సందర్భాలలో పదింట తొమ్మిది మంది ఒకరి కన్నుగప్పి ఒకరు జారత్వం నేర్చుకొంటున్నారు.

మనం ఇప్పుడొక సామాజిక విప్లవానికి సన్నిహితంగా వున్నాం. దంపతీ వివాహానికీ, దానికి అనుబంధంగా వచ్చిన వ్యభిచారానికీ ఈనాటివరకు పునాదిగా వున్న ఆర్థిక పరిస్థితులు దానిలో అంతర్థానం అవుతాయి. చాలా సంపద ఒకే వ్యక్తి చేతిలో – మగవాని చేతిలో – చేరడం, దానిని మరెవ్వరి పిల్లలకూ కాక తన పిల్లలకే సంక్రమింప చెయ్యాలనుకోవడం నుంచి దంపతీ వివాహం వచ్చింది. దీనికోసం దంపతీ వివాహంలో స్త్రీ వైపునుంచి పాతి

వ్రత్యం ముఖ్యం; మగవానికి ఏకపత్నీవ్రతం ముఖ్యంకాదు. అందుచేతనే మగవాడు రహస్యంగానో, బహిరంగంగానో బహుపత్నీత్వాన్ని అనుసరించడానికి స్త్రీ పాతివ్రత్యం ఆటంకంకాలేదు. రానున్న సామాజిక విప్లవం ఆస్తిలో హెచ్చుభాగాన్ని, ముఖ్యంగా వారసత్వంగా సంక్రమించే స్థిరాస్తిని, అంటే ఉత్పత్తి సాధనాలను, సామాజిక ఆస్తిగా మార్చివెయ్యడం ద్వారా వారసత్వం విషయంలో వచ్చే తాపత్రయాన్ని చాలవరకు తగ్గించేస్తుంది. అయితే ఆర్థిక కారణాలనుంచి ఉత్పన్నమైన దంపతీ వివాహం ఆ ఆర్థిక కారణాలు తొలగగానే అంతరించిపోతుందా?

అంతరించి పోవడానికి బదులు దంపతీ వివాహం పూర్తిగా అమలులోకి రావడం ప్రారంభమవుతుందన్న సమాధానం యివ్వడానికి కారణాలు లేకపోలేదు. ఉత్పత్తి సాధనాలు సామాజిక ఆస్తిగా మార్పుచెందగానే వేతనశ్రమ – అంటే శ్రామికవర్గం అదృశ్యం అయిపోతుంది. దానితోపాటు కొందరు స్త్రీలు శరీరాన్ని అమ్ముకోవలసిన అవసరమూ ఉండదు. వ్యభిచారం అంతరిస్తుంది. దంపతీ వివాహం క్షీణించడానికి బదులు వాస్తవ విషయంగా రూపొందుతుంది. మగవాళ్లు కూడా ఏకపత్నీవ్రతాన్ని పాలిస్తారు.

ఈవిధంగా మగవాని స్థితి బాగా మారుతుంది. కాని ఆడవాళ్ల స్థితి, ఆడవాళ్లందరి స్థితీ చాలా మారిపోతుంది. ఉత్పత్తి సాధనాలు సామాజిక ఆస్తిగా మారడంతో విడి కుటుంబం, సమాజానికి ఆర్థిక యూనిట్‌గా వుండడం పోతుంది. స్వంత ఇంటి నిర్వహణ సామాజిక కర్మగా మారుతుంది. పిల్లల చదువూ, పెంపకమూ సామాజిక ధర్మం అవుతుంది. వివాహితుల సంతానాన్నీ, అవివాహితుల సంతానాన్నీ కూడ సమాజం సమానశ్రద్ధతో చూస్తుంది. ఈనాడు కన్య తన మనసిచ్చిన వానితో జీవించడానికి ఆటంకంగా వున్నది దాని నైతిక ఆర్థిక ఫలితాలు యెలా వుంటాయోనన్న భయమే. ఆ భయం పోతుంది. దీనితో క్రమక్రమంగా సాంగత్య సంబంధాలలో నిషేధాలు, ఆటంకాలు పోతాయా? దానితో కన్యాత్వమర్యాద, స్త్రీ సహజమైన సిగ్గు విషయమై ప్రజలు సహనం చూపడం నేర్చుకోరా? ఆధునిక ప్రపంచంలో పరస్పర విరుద్ధాలైన దంపతీ వివాహమూ, వ్యభిచారమూ పక్కపక్కనే వుండటాన్నీ, రెండూ ఒకే సామాజిక పరిస్థితుల రెండు అంచులన్న సంగతినీ మనం చూడలేదా? ఈ రెండూ విడదీయరానివి. అందుచేత వ్యభిచారం అంతరిస్తుందంటే, దానితోపాటు దంపతీ వివాహం కూడా అంతరించదా?

ఇక్కడ ఒక కొత్త అంశం రంగంలోకి అవతరిస్తుంది. అదే స్త్రీ పురుషులమధ్య ప్రేమ. ఇది గతంలో దంపతీ వ్యవస్థలో బీజరూపంలో వున్నదే.

మధ్య యుగానికి పూర్వం వైయక్తిక లైంగిక ప్రేమ అనేదే లేదు. అందం, సాన్నిహిత్యం, సమానభావాలు మొదలైనవి స్త్రీ పురుషుల మధ్య సాంగత్య వాంఛను రేపెట్టాయనడంలో సందేహంలేదు. ఎవరైతేనేమి లేయని కనిపించినవారిని కట్టుకొన్నారనీ కాదు.

కాని, ఈనాడు మనం చెప్పే వ్యక్తి ప్రేమకూ, ఆనాటి వాంఛకూ పోలికేలేదు. ప్రాచీన కాలమంతట్లోనూ తల్లిదండ్రులు తమ బిడ్డలకు వివాహాలను కూర్చేవారు. వధూవరులు మాట్లాడకుండా వప్పుకొనేవారు. ఆకాలంలో దంపతుల మధ్య కనబడే కొద్దిపాటి ప్రేమకు మూలం ఆత్మీయాభిరుచి కాదు. దాంపత్య ధర్మంగా వచ్చినది మాత్రమే. అదీ వివాహానికి కారణం కాదు; వివాహంతో పాటు వచ్చినది మాత్రమే. ప్రాచీనకాలంలో మనం ప్రేమ అని చెప్పేది కుటుంబానికి వెలుపలనే కనబడుతుంది. థియోక్రిటసు, మోస్కసులు ప్రేమికులైన గోపాలుర ఆనంద విచారాలను వర్ణించారు. ఆ గోపాలురూ లోంగస్ వర్ణించిన డాఫ్నిస్ క్లోయాలూ స్వేచ్ఛాయుత పౌరుని రంగమైన ఆనాటి రాజ్య వ్యవహారాలతో ఏ విధమైన సంబంధంలేని బానిసలు. బానిసలలో తప్ప ఇతర స్వతంత్ర పౌరులలో కనిపించే ప్రేమవ్యవహారాలు ప్రాచీన సమాజ శైథిల్యానికి ఫలితం మాత్రమే. అధికారిక సమాజానికి వెలిగా వున్న స్త్రీలలోనూ, హెటరేలలో మాత్రమే ప్రేమ వ్యవహారాలు కనిపిస్తాయి. అంటే, ఏథెన్సు క్షీణదశలో వున్నప్పుడూ, చక్రవర్తులు రోముని పరిపాలించుతున్నప్పుడూ అక్కడకు వచ్చిన విదేశీయ స్త్రీలలోనూ, స్వతంత్రం పొందిన బానిస స్త్రీలలోనూ మాత్రమే ఈ ప్రేమ కనబడుతుంది. స్వతంత్రులైన మగ, ఆడ పౌరులమధ్య ప్రేమకలాపం సాగిందంటే అది జారత్వ రూపంలో సాగవలసిందే. ప్రాచీన కాలంలో ప్రేమ గీతాలు రాసిన కవి అనక్రెయోన్‌కి మనం లైంగిక ప్రేమగా భావించేదానితో ప్రసక్తే లేదు. ప్రేమిస్తున్న వారి లింగభేదంతో కూడ ఆయనకు ఎట్టి ప్రసక్తీ లేదు.

ప్రాచీన కాలంనాటి సాంగత్య వాంఛకూ, ప్రణయానికీ మనం చెప్పే ప్రేమకూ చాలా తేడా వుంది. మొదటిది — మనం చెప్పే ప్రేమ ఎదుటివారినుంచి ప్రతి ప్రేమ ఉందని తలుస్తుంది. ఇక్కడ ఆడుదానిది మగవానితో సమానమైన హోదా. కాని, ప్రాచీన ప్రణయంలో స్త్రీ అభిప్రాయాన్ని తెలుసుకోవడం చాల తక్కువగా జరిగింది. రెండోది, మనం చెప్పే ప్రేమలో తీవ్రతా, స్థిరత్వమూ వుంది. ప్రేమికులు వియోగాన్ని భరించడం చాల కష్టం. ఒకరి నొకరు పొందడానికి ఎన్ని కష్టాలకైనా సిద్ధపడతారు. ప్రాణ త్యాగానికి కూడా జంకరు. ఇటువంటి ఘటనలు ప్రాచీన కాలంలోనూ జరిగాయి. కాని, అవి జారత్వ సందర్భాలలో జరిగాయి. ఇంక ఆఖరుది — సాంగత్య సంబంధాలను ఏర్పరచుకోవడంలో మనం చెప్పే ప్రేమకు ఒక నూతన నైతిక ప్రమాణం ఏర్పడింది. ఆ సాంగత్య సంబంధం ఏర్పరచుకొన్నది వివాహితులా, వివాహం వెలుపలనా అనే దొక్కటే కాదు ఇప్పటి ప్రశ్న. స్వతస్సిద్ధంగా ప్రేమ వుండి సంబంధం పెట్టుకొన్నారా, లేకుండానేనా — అనేది కూడా ప్రశ్న అవుతుంది. ఫ్యూడల్ బూర్జువా సమాజాలలో ఈ నూతన నైతిక ప్రమాణం, ఇతర నైతిక ప్రమాణాలన్నింటిలాగే నిర్లక్ష్యం చేయబడుతూంది. అయితే అంతకన్న దిగజారనూ

దిగజారదు. వాటి అన్నింటిలాగే దీనినీ కాగితంమీద స్వీకరిస్తారు. అంతకంటె అధికం కోరడం ఇప్పట్లో సాధ్యంకాదు.

సాంగత్య ప్రేమ జన్మించడంతో అతి ప్రాచీన యుగం ముగిసింది. జారత్వంతో మధ్య యుగం ప్రారంభమయింది. ప్రాభాత గీతాల ప్రాదుర్భావానికి కారణం అయిన వీరప్రేమను గురించి పైన చెప్పాను. వివాహ సంబంధాలను విచ్ఛిన్నంచేసే ఈ మాదిరి వీరప్రేమకూ, వివాహ సంబంధాలకూ పునాదిగా వుండగల ప్రేమకూ మధ్య పెద్ద అగాధం వుంది. వీర శృంగారం ఆ అగాధాన్ని ఎన్నడూ పూర్తిగా పూడ్చలేదు. కులాసా స్వభావం గల లాటిన్ ప్రజల మాట అల్లావుంచి, ధర్మనిరతులమనే జర్మనులను తీసికొన్నా అంతే. "నిబెలుంగ్ గేయం" అనే పుస్తకాన్ని తీసుకుందాం. దానిలో క్రిమ్‌హిల్డ్ సీగ్‌ఫ్రిడ్‌ను గాఢంగా ప్రేమి స్తూంది. అతడూ క్రిమ్‌హిల్డ్‌ను బాగా ప్రేమిస్తున్నాడు. అయినా వరుని పేరు కూడా చెప్పకుండా ఆమె నొక వీరునికిచ్చి పెళ్లి చేయడానికి సిద్ధపరిచినట్లు గుంతెర్ ఆమెకు తెలియబరిచినప్పు డిల్లా అంది:

> "నన్నడగ వలసిన పనిలేదు. తమరు ఏది చేస్తే దానిని శిరసావహిస్తాను ప్రభూ! తమరు నాకు ఎవరిని భర్తగా నిర్ణయిస్తే వారిని సంతోష పూర్వకంగా స్వీకరిస్తాను."*

ఆమెకు సీగ్‌ఫ్రిడ్ ఎడగల ప్రేమను గురించి ఆలోచించవలసి వున్నదనేనా తోచ లేదు. కంటితో చూడనన్నా చూడకుండా బ్రున్‌హిల్డ్‌ను గుంతెర్ పెళ్లిచేసుకుంటాడు. అలాగే క్రిమ్‌హిల్డ్‌ను ఏత్సెల్ పెళ్లిచేసుకున్నాడు. "గుద్రున్"[124]లో కూడ మనకిదే కనబడుతుంది. అందులో ఐర్లెండు నివాసియైన సీగెబంట్ నార్వేదేశపు ఊటెని, హెగెలినేగన్ నివాసి హెటెల్ ఐర్లండు దేశపు హిల్డెనూ పెళ్లాడగోరారు. మోర్లండ్ నివాసి సీగ్‌ఫ్రిడ్, ఓర్మానూ నివాసి హోర్ట్‌ముట్, జీలాండు నివాసి హెర్విగ్‌లు గుద్రున్‌ను పెళ్లాడగోరుతారు. అయితే ఇక్కడ గుద్రున్ తనకు నచ్చిన హెర్విగ్‌ను వరిస్తుంది. యువ ప్రభువు వధువును అతని తల్లితండ్రులే వెతికి చేయడం పరిపాటి. వారు చనిపోయిన ఘట్టంలో అతడే తన సామంత వృద్ధుల సలహాలు తీసుకొని చేసుకొంటాడు. ఆ వృద్ధుల మాటలకెంతో విలువని స్తాడు. ఇవ్వక తప్పదు కూడా. ఒక వీరుడో, సామంతుడో, ప్రభువో పెళ్లిచేసుకొంటున్నాడంటే అదొక రాజకీయ విషయం. నూతన బంధుత్వ సంబంధాలతో అధికారాన్ని విస్తరింపజేసుకొనే ప్రక్రియ అది. అక్కడ వంశంయొక్క ప్రయోజనాలకేగాని, వ్యక్తి వాంఛలకు ప్రాముఖ్యం వుండదు. అటువంటిచోట వివాహానికి ప్రేమదే అంతిమ నిర్ణయం ఎలా అవుతుంది?

---

* "Nibelungenlied," Song X. — సం.

మధ్యయుగపు పట్టణాలలోని గిల్డుల (వృత్తిసంఘాల) సభ్యుల విషయంలో కూడ అంతే. గిల్డులకు ప్రత్యేక నిబంధనావళులున్నాయి. ఇతర గిల్డులతో నూతన గిల్డులోని ఇతర సహచరులతోనూ, తనవద్ద పని నేర్చుకొంటున్న వారితోనూ, పని నేర్చుకుని స్వతంత్రంగా పనిచేసుకుంటున్న వారితోనూ సంబంధం వుంచుకొనే విషయంలో కృతకమైన హద్దులను ఏర్పరుస్తూ చట్టాలున్నాయి. ఇవన్నీ అతనికి రక్షణనివ్వడానికి ఏర్పడ్డవే. కాని అవే తనకు అనుకూలవతియైన భార్యను ఏరుకోగల కూటాన్ని పరిమితం చేస్తున్నాయి. ఆ కూటంలో కూడా తగిన వధువును అతని తల్లిదండ్రులే వెదుకుతారు. కుటుంబ ప్రయోజనాలకే గాని, అతని ఇష్టానిష్టాలకు యీ సంక్లిష్ట పద్ధతిలో స్థానం వుండదు.

కనక మధ్యయుగాల ఆఖరువరకూ వివాహం అనేది చాలా హెచ్చు సందర్భాలలో ఆదిలో వున్నట్లే వుండిపోయింది. వధూవరుల సమ్మతికి అందులో ప్రాధాన్యం లేదు. ప్రారంభంలో మనుష్యుడు వివాహితుడుగానే పుట్టేవాడు. పుట్టుకతోనే పురుషుల గుంపుకంతకూ స్త్రీ భార్య. అలాగే స్త్రీల గుంపుకంతకూ పురుషుడు భర్త. గుంపుపెళ్లిలో తర్వాత అనేక మార్పులు వచ్చి కొత్త రూపాలు ఏర్పడ్డాయి. వానిలో కూడా ఇటువంటి సంబంధాలే వుండి వుంటాయి. అయితే ఆ గుంపులు అంతకంతకు పరిమితమయిపోతూవచ్చాయి. జంట పెళ్లిళ్లలో మామూలుగా తల్లులు తమ బిడ్డలకు సంబంధాలు కుదిర్చేవారు. ఆ యువ దంపతులకు తమ గణంలోనూ, తెగలోనూ బలీయమైన స్థానం ఏర్పడేటట్లు చూసి ఈ సంబంధాలు కుదిర్చేవారు. క్రమంగా ఉమ్మడి ఆస్తికన్న సొంత ఆస్తికి ప్రాముఖ్యం వచ్చింది. తన బిడ్డలకే ఆస్తి సంక్రమింప చెయ్యాలనే ఆదుర్దా కలిగింది. తండ్రిహక్కూ, దంపతీ వివాహం ప్రాముఖ్యానికి వచ్చాయి. దానితో అంతకుముందెప్పటికన్న పెళ్లి ఇంకా ఎక్కువగా ఆర్థిక విషయాలమీదనే ఆధారపడి జరిగేది. శుల్కం ఇచ్చి కన్యను కొనుక్కొనే పద్ధతి అంతరించింది. ఆడదానికే కాక మగవాడికి కూడా విలువ కట్టడం అన్నది అమల్లోకి వచ్చింది. విలువ అతని గుణగణాలకు కాక, అతనికున్న ఆస్తినిబట్టి వచ్చింది. వధూవరుల మధ్య పరస్పర ప్రేమే వారి వివాహానికి మూలం కావాలనీ, మిగిలిన ఆలోచనలన్నీ వాని వెనుకనేననీ పాలక వర్గాలు ఆదినుంచి ఎన్నడూ వూహించి కూడా వుండరు. అటువంటి దెక్కడైనా జరిగిందంటే ఏ పుస్తకాలలోని ప్రణయ కథలోనో అయివుండాలి. లేకుంటే సంఘంలోనివాళ్లుగా పరిగణన చేయబడని పీడిత వర్గాల ప్రజలలో జరిగివుండాలి.

కొత్త భూఖండాలు కనిపెట్టబడినాక, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రపంచ వ్యాపార, వస్తూత్పత్తుల ద్వారా ప్రపంచ ఆధిపత్యం సంపాదించేటందుకు ప్రయత్నాలు ఆరంభించిన నాటి పరిస్థితులివి. ఆ పరిస్థితులకు ఈ మాదిరి వివాహపద్ధతే సరియైనదని అనుకోవచ్చు. అదే వాస్తవ పరిస్థితి కూడా. చరిత్రగతియొక్క ఆంతర్యాన్ని వూహించడం సులభం కాదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే ఆ వివాహపద్ధతిని విచ్ఛిన్నం చేయవలసి

వచ్చింది. అదీ చిత్రం. ఆ ఉత్పత్తి విధానం ప్రతి ఒక్కదానినీ వర్తకపు సరుకుగా మార్చే సింది. ఆవిధంగా అనుశృతంగా వస్తున్న ఆచారాలను, చారిత్రకంగా లభించిన హక్కులను, ప్రాచీన సంప్రదాయాలను తుడిచేసింది. వానిస్థానే కొనుబడి అమ్మకాలనూ, "స్వేచ్ఛాయుత మైన" ఒప్పందాన్నీ తెచ్చిపెట్టింది. ప్రాచీన కాలంతో పోల్చిచూస్తే మనం చాలా పురోగ మించామనీ, వారసత్వంగా వచ్చిన సంబంధాల స్థానే ఇచ్ఛాపూర్వకంగా ఒప్పందాలు కుదు ర్చుకొనే దశకు వచ్చామనీ హెచ్. ఎస్. మెయిన్ అనే బ్రిటిష్ న్యాయశాస్త్రవేత్త రాస్తు న్నాడు. ఆ విషయాన్ని తానేదో గొప్పగా కనుక్కొన్నట్లు ఆయన అనుకొంటున్నాడు. ఈ విషయాన్ని—అది నిజమైన మేరకు—మేము "కమ్యూనిస్టు ప్రణాళిక"*లో ఏనాడో రాశాం.

ఒప్పందాలు కుదుర్చుకోవాలంటే వ్యక్తులు యథేష్టంగా తమరిని, తమ కార్యాల్ని, తమ ఆస్తిని వినియోగించుకోగల స్థితి వుండాలి. ఒకరి నొకరు సమానమయిన షరతులతో వ్యవహరించగలగాలి. "స్వతంత్రులూ", "సమానులూ" అయిన వ్యక్తుల్ని సృష్టించడం సరిగా పెట్టుబడిదారీ వుత్పత్తి విధానంయొక్క ప్రధాన లక్షణాలలో ఒకటి. ప్రారంభంలో ఈ పని అంత చైతన్యంతో నిర్వహించబడలేదు. పైగా దానికి మతం ముసుగు కూడా వుండేది. కాని, లూతరన్, కాల్వినిస్టు సంస్కరణలు వచ్చాక సంపూర్ణ స్వేచ్ఛతో, మన స్ఫూర్తిగా చేసిన పనులకే మనుష్యుడు బాధ్యుడనే సిద్ధాంతం అమలులోకి వచ్చింది. అవినీతి కార్యాలు చేయవలసిందిగా తెచ్చే ఒత్తిడిని ప్రతిఘటించడం నైతిక విధి అన్న భావం వ్యాప్తిలోకి వచ్చింది. ఇంతవరకూ అమలులో వున్న వివాహ పద్ధతులతో యిదెలా పొసుగు తుంది? బూర్జువావర్గంయొక్క అభిప్రాయానుసారం పెళ్లి అనేది ఒక ఒప్పందం, ఒక చట్టబద్ధం అయిన వ్యవహారం. ఇద్దరు వ్యక్తులను శారీరకంగానూ, మానసికంగానూ జీవి తాంతంవరకూ బంధించి వుంచే వ్యవహారం గనక అది చాల ప్రధానమైనది. స్థూలంగా చూస్తే ఐచ్ఛికంగానే ఈ ఒప్పందం చేసుకొంటున్నారన్నది నిజమే. ఉభయుల అంగీకారం తీసుకోకుండా వివాహం జరగడంలేదు. కాని ఆ అంగీకారం ఎల్లా సంపాదించారు? దాని నెవరు కుదిర్చారు అన్నదందరికీ చాలా బాగా తెలుసు. ఇతర ఒప్పందాలన్నింటికీ నిజమైన స్వేచ్ఛ వుండాలన్నప్పుడు దీనికి మాత్రం వుండొద్దూ? దంపతులు కాబోతున్న యువతీ యువకులు తమరినీ, తమ శరీరాలనూ, శరీరాంగాలనూ ఇష్టాపూర్తిగా సమర్పించుకొనేటందుకు అధికారం వుండొద్దూ? వీరధర్మం స్త్రీ పురుష లైంగిక ప్రేమను ఒక ఆదర్శంగా తెచ్చింది. కాని ఆ వీరపురుషుల ప్రేమ అన్యకాంతాసక్తం. అలాగాకుండా భార్యాభర్తలమధ్య ప్రేమ వుండడం బూర్జువా సమాజంలో సరైన ఆదర్శం కాదూ? వివాహితలు ఒకరినొకరు ప్రేమిం

---

* ఈ సంకలపు మొదటి భాగాంలో 39–81 పేజీలు చూడండి. — సం.

చుకోవడం ధర్మం అయినప్పుడు ప్రేమించుకొన్నవారే పెళ్ళిచేసుకోవడం, ప్రేమలేని చోట పెళ్ళిచేసుకోకుండా ఉండడం మాత్రం ధర్మంకాదూ? తల్లిదండ్రుల, బంధువుల, సంధానకర్తల హక్కులకన్న ప్రేమించుకొన్నవారి హక్కు ఎక్కువదికాదూ? స్వతంత్రంగా పరిశీలించి నిర్ణయించుకొనే హక్కు మతానికీ చర్చికీ కూడ వర్తించేటప్పుడు యువతరం వారి శరీరాలను, ఆత్మలను, ఆస్తిపాస్తులను సుఖదుఃఖాలను పెద్దలే నిర్ణయించాలనే దుర్భరాధికారాన్ని సహిస్తారా?

అనుశ్రుతంగా వస్తున్న అభిప్రాయాలు మూలమట్టంగా కదిలిపోయి ప్రాచీన సామాజిక బంధాలు శిథిలం అయిపోతున్న కాలంలో ఈ ప్రశ్నలు రాక మానవు. ఉన్నట్లుండి ప్రపంచం పదిరెట్లు పెరిగిపోయింది. ఒక అర్ధగోళంలో నాలుగోవంతును మాత్రమే ఎరిగిన పశ్చిమ యూరపు వాసులకు ఒక్కమారు భూగోళమంతా కళ్లయెదుట కనబడింది. వెంటనే వారా మిగిలిన ఏడు భాగాలనూ స్వాధీనంలోకి తెచ్చుకోడానికై కదిలారు. వారి జన్మభూముల పాతకాలపు ఇరుకు సరిహద్దులు అదృశ్యమైనట్లే మధ్యయుగాల ఆలోచనా విధానాలు నిర్మించిన వేల సంవత్సరాల సంకుచిత నిషేధాలు కూడా శిథిలమై పోయాయి. మానవుని బహిరంతర్దృష్టులముందు అనంత విశాల దిగంతాలు పరుచుకున్నాయి. భారతదేశపు సంపదలూ, మెక్సికో, పోటోసీ*ల బంగారు, వెండి గనులూ చూసి కళ్లు కుదుతూ వుండగా గౌరవ మర్యాదలు తరతరాలుగా వస్తున్న వృత్తిసంఘ ప్రత్యేక హక్కుల గురించి పట్టించుకొనే పడుచు వాడుంటాడూ? బూర్జువా వర్గానికిది వీరయుగం. వాళ్ల శృంగారం, ప్రేమ స్వప్నాలూ వారికున్నాయి. కాని, అవన్నీ బూర్జువా పునాదులమీద నిర్మింపబడ్డవే. అంత్య పరిశీలనలో బూర్జువా ఆశయాలతో సాగేవే.

ముఖ్యంగా ప్రొటెస్టాంటు దేశాలలో అంతవరకూ అమలులోవున్న సామాజిక పరిస్థితులు పూర్తిగా కదిలిపోయినాయి. ఆ దేశాలలో బూర్జువా వర్గం వృద్ధిపొందుతూంది. వారు పైన చెప్పిన విధంగా వివాహ ఒప్పందం స్వేచ్ఛాయుతంగా జరగాలనే దానిని కూడా అంతకంత కధికంగా గుర్తించారు. వివాహం ఒకే వర్గం వారిమధ్య జరుగుతూంది. కాని, తమ వర్గానికి సంబంధించిన వారిలోనే తమకు నచ్చినవారిని ఎంచుకునేటందుకు కొంతవరకు స్వేచ్ఛ ఇస్తున్నారు. పరస్పర లైంగిక ప్రేమలేకుండా, స్వేచ్ఛాయుతమైన అంగీకారం లేకుండా జరిగే పెళ్లి నీతిదూరమని కాగితాలమీద అంగీకరించారు. పద్యాలలో పాడారు. నైతిక సూత్రంగా ఒప్పుకున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే, ప్రేమించి వివాహం చేసుకోవడం మానవుని హక్కు (droit de l'homme) అన్నారు. మానవుని హక్కు అన్నప్పుడొక్క మగవాడిదే

---

* పోటోసీ ఖనిజసంపద అశేషంగావున్న ఒక రాష్ట్రం బొలీవియాలోనిది. – సం.

కాదు, అసాధారణ విషయంగా స్త్రీకి కూడా యీ హక్కు (droit de la femme) నంగీకరించారు.

కాని, ఇతర మానవహక్కులకూ, దీనికీ ఒక్క విషయంలో తేడా వుంది. ఆ ఇతర హక్కులు ఒక్క పాలకవర్గానికి — బూర్జువావర్గానికే — వర్తించుతాయి. పీడితవర్గమైన శ్రామికవర్గానికి అవి వర్తించవు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వారికి అవి నిరాకరించబడుతున్నాయి. ఈ హక్కు విషయంలో కూడా చరిత్ర తన విడ్డూర విలాసాన్ని ప్రకటించింది. పాలకవర్గం విషయంలో పరిచితమైన ఆర్థిక పరిస్థితుల ప్రభావమే కొనసాగుతోంది. అందుచేత వారిలో ఇష్టాపూర్తిగా జరిగిన వివాహాలు అరుదుగానే కనిపిస్తాయి. కాని, పాలిత ప్రజలలో ఈ వివాహాలు సర్వసాధారణం. ఈ విషయాన్ని మనం పైన చూశాం.

దీనివలన తేలుతున్న దేమిటి? వివాహంలో పూర్తియైన స్వేచ్ఛ వుండాలంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమూ, దాని ఫలితంగా ఏర్పడిన ఆస్తి సంబంధాలూ రద్దయిపోవాలి. అప్పుడే భార్యాభర్తల ఎన్నికలో ఆర్థిక విషయాలకు ప్రాముఖ్యం యివ్వడం తొలగుతుంది. అప్పుడు పరస్పర ఆకర్షణ తప్ప వివాహానికి మరో కారణం వుండదు.

లైంగిక ప్రేమ స్వభావసిద్ధంగానే ఏకముఖమైనది. ఈ ఏకముఖత్వం ఈనాడు ఒక్క స్త్రీ విషయంలోనే పాటించబడుతోంది. అందుచేతనే లైంగిక ప్రేమమీద ఆధారపడి జరిగే వివాహం దంపతీ వివాహంగానే వుంటుంది. గుంపుపెళ్లిళ్లనుంచి జంటపెళ్లిలోకి మార్పు తీసుకువచ్చినది ముఖ్యంగా స్త్రీయేనని బాహోఫెన్ చెప్పినది సత్యమని పైన తెలుసుకొన్నాం. జంటపెళ్లినుంచి దంపతీ వివాహంలోకి మార్పుతెచ్చినది మగవాడు. చారిత్రకంగా చూస్తే ఈ మార్పును తీసుకురావడంవలన కలిగిన ముఖ్యమైన ఫలితం స్త్రీ అధమస్థితికి రావడమూ, మగవాని జారత్వానికి అవకాశం లభించడమూను. తమ బ్రతుకుతెరువు కోసమూ, బిడ్డల భవిష్యత్తును చూసీ స్త్రీలు మగవానిలో సర్వసాధారణంగా కనిపించే జారత్వాన్ని సరిపుచ్చుకొనేటట్టు చేసే ఆర్థిక విషయాల్ని ఆలోచించవలసిన అగత్యం పోయి స్త్రీ పురుషుల మధ్య సమానత్వం ఏర్పడినప్పుడు జరిగేది — స్త్రీలు బహుభర్తృకలు కావడంకాదు. పురుషులు నిజంగా ఏకపత్నీవ్రతులవడం. గతకాలపు అనుభవంవలన తెలుస్తున్నదది.

ఆస్తి సంబంధాల ఫలితంగా వచ్చివుండడంచేత దంపతీ వివాహంలో అనేక లక్షణాలు ప్రత్యక్షమైనాయి. ఒకటి మగవాని పెత్తనం, రెండోది వివాహం రద్దుచేయడానికి వీలు లేకపోవడం. నూతనదశలో ఈ లక్షణాలు కచ్చితంగా అదృశ్యమైపోతాయి. వివాహంలో మగవాని ఆధిక్యత ఆర్థికంగా అతనికున్న ప్రాబల్య ఫలితమే. ఆ ప్రాబల్యంతోపాటు ఆధిక్యమూ రద్దవుతుంది. వివాహ విచ్ఛేదానికి అవకాశం లేకపోవడం రెండు కారణాలవలన తటస్థపడింది. ఒకటి, దంపతీ వివాహానికి మూలం అయిన ఆర్థిక పరిస్థితులు, రెండోది, ఆ ఆర్థిక పరిస్థితులకూ, దంపతీ వివాహానికీ గల సంబంధాన్ని సరిగా అర్థంచేసుకోక మతం దంపతీ స్థితికి

యివ్వవలసిన దానికంటే అధిక ప్రాముఖ్యం యిచ్చింది. అప్పటినుంచీ అదే ఆచారంగా వచ్చేసింది. ఈనాడు దీనికి సహస్ర ఛిద్రాలు ఏర్పడ్డాయి. ప్రేమగలప్పుడే వివాహం జరగడం నీతి అయితే, ప్రేమ కొనసాగే వివాహబంధం మాత్రమే నీతివంతమైనదికదా! వ్యక్తులమధ్య ఏర్పడే లైంగిక ప్రేమకు కాలవ్యవధి ఆయా వ్యక్తులలో – ముఖ్యంగా మగవారిలో – చాల భిన్నంగా వుంటుంది. ప్రేమ అంతరించాక, మరియొకరిమీద గాఢమైన ప్రేమ ఏర్పడ్డాక ఆ యిద్దరూ విడిపోవడం వారికీ సంఘానికీ కూడ క్షేమం. అనవసరంగా విడాకుల కేసుల ఊబిలోపడి గింజుకోవలసిన బాధ అప్పుడు తప్పుతుంది.

కాబట్టి పెట్టుబడిదారీ వుత్పత్తి విధానం రద్దయాక దాంపత్య సంబంధాలు ఎలా వుంటాయనేదానికి బదులు ఏమేమి వుండవో మాత్రమే ప్రస్తుతం చెప్పగలుగుతాం. కొత్తగా వచ్చేది ఏమిటి? నూతనతరం బయలుదేరినప్పుడు వారే దానికి సమాధానం చెప్పగలుగుతారు. ధనంతోగాని, సామాజికాధికారంతోగాని ఆడుదానిని స్వాధీనపరచుకోవడం మగవాడు జీవితంలో ఎన్నడూ ఎరగనప్పుడు, నిజమైన ప్రేమతో తప్ప ఆడుది మగవానిచెంత చేరవలసిన అవసరం లేనప్పుడు, ఆర్థికకారణాలవల్ల ప్రేమికులు కలియలేని పరిస్థితులు తొలగినప్పుడు దానికి సమాధానం దొరుకుతుంది. ఆ మాదిరి జనం పుట్టాక, ఈనాడు మనం ఇచ్చే సలహాలకి వారు చిల్లిగవ్వ విలువ కూడా ఇవ్వరు. తమ అలవాట్లని తామే నిర్ణయించుకొంటారు. వ్యక్తుల ఆచరణకు అనుకూలంగా జనాభిప్రాయాన్ని తామే సృష్టించుకొంటారు. ఆ సమస్యకు అదే పరిష్కారం.

మోర్గన్‌ను వదలి మనం చాలా దూరం వచ్చేశాం. ఇప్పుడిక ఆయన సంగతి చూద్దాం. నాగరిక యుగంనాటి సామాజిక రూపాల చారిత్రక పరిశోధన ఆయన పుస్తకంలో లేదు. అది దాని పరిధిలోదీ కాదు. అందుచేత ఆయన దానిలో దంపతీ వ్యవస్థయొక్క ప్రస్తుత స్థితిని సంగ్రహంగా చెప్పి వూరుకొన్నాడు. దంపతీ వ్యవస్థ సామాజిక పురోగమన ఫలితమే నని ఆయన ఒప్పుకొన్నాడు. దీనిలో ఇంచుమించు స్త్రీ పురుషుల మధ్య పూర్తి సమానత ఏర్పడుతుందన్నాడు. అయితే యీ గమ్యాన్ని చేరుకోవడం జరిగిందని ఆయన భావించలేదు. కాని ఆయన యిలా అన్నాడు:

> "కుటుంబం అనేది నాల్గు దశలు గడిచి అయిదో దశలో వుందని మనం ఒప్పుకుంటే భవిష్యత్తులో ఈ దశ మాత్రం స్థిరంగా ఉండగలదా అనే ప్రశ్న వెంటనే ఉదయిస్తుంది. దాని కొక్కటే సమాధానం. గతంలోలాగానే భవిష్యత్తులో కూడ సమాజం పురోగమించినప్పుడల్లా అది కూడా పురోగమించాలి, సమాజం మారినప్పుడల్లా దానితోపాటు అది కూడా మారితీరాలి. దానిని సామాజిక వ్యవస్థ సృష్టించింది. కనక సామాజిక సంస్కృతి దానిలో ప్రతిబింబిస్తూంటుంది.

నాగరికయుగం వచ్చాక దంపతీ కుటుంబంలో ఎంతో మార్పు వచ్చింది. ఈ మధ్యనీమధ్య చాల ముఖ్యమైన అభివృద్ధి వచ్చింది. దీనిని బట్టి స్త్రీ పురుషుల మధ్య సమానత్వం సాధించబడేంతవరకూ దానిలో ఇంకా మార్పులు వచ్చే అవకాశం వుందనుకోవచ్చు. సుదూర భవిష్యత్తులో దంపతీ కుటుంబం సామాజికావసరాలకు సరిపడకపోవచ్చు.... దాని తర్వాత వచ్చేదాని స్వభావాన్ని గురించి జోస్యం చెప్పడం అసాధ్యం."

# III

## ఇరాక్వ్యా గణం

ప్రస్తుతం మనం మోర్గన్ కనిపెట్టిన మరో విషయానికి వద్దాం. రక్త సంబంధాలను పట్టి కుటుంబంయొక్క ఆదిమ రూపాల్ని నిర్ధారణ చేయడమంత ముఖ్యమైనదే ఇదీను. గ్రీకులలోని genea, రోమనులలో gentes అనబడేవీ, అమెరికన్ ఇండియన్లలో జంతువుల పేర్లతో పిలువబడే రక్తసంబంధీకుల సంస్థలూ ఒకటేనని ఆయన స్పష్టపరిచాడు. అమెరికాలోని వ్యవస్థ గణంయొక్క ప్రాథమిక రూపం అనీ, గ్రీకులదీ, రోమనులదీ అటు తర్వాతి రూపాలనీ చూపించాడు. ప్రాచీనకాలంలో గ్రీకుల్లోనూ, రోమనులలోనూ కనిపించే సామాజికవ్యవస్థ అంతా గణాల, రక్తసంబంధిత కూటాల, తెగల రూపం ధరించింది. అలాంటి వ్యవస్థే అమెరికను ఇండియనులలో కూడా కనబడుతోందని నిరూపించాడు. ఈనాటివరకు మనవద్దనున్న సమాచారాన్నిబట్టి నాగరిక దశకు చేరుతున్న అనాగరిక తెగలన్నింటిలో గణసంస్థ వున్నదని చూపించాడు. దీనితో ప్రాచీన కాలపు గ్రీసు రోముల చరిత్రలలో ఇంతవరకు కొరుకుడుబడకుండా వున్న భాగాలు ఒక్కమాటు స్పష్టం అయాయి. అదే సమయంలో రాజ్యం అనేది ఏర్పడక పూర్వం, ఆదిమ సామాజిక వ్యవస్థలో వున్న ప్రధాన లక్షణాలన్నింటిపైనా అనుకోకుండా అది వెలుగు ప్రసరింపచేసింది. తెలిశాక అదంతా సాధారణమైన విషయంగా కనిపిస్తుంది. కాని ఈమధ్యనీమధ్యనే మోర్గన్ దానిని కనిపెట్టాడు. అంతకుపూర్వం 1871లో ప్రచురింపబడిన పుస్తకం రాసేనాటికి* ఆయన ఇంకా ఆ రహస్యాన్ని గ్రహించలేదు. మామూలుగా ఎంతో గర్వంగా, సర్వజ్ఞుల మనుకొంటూండే ఆంగ్లేయ ప్రాచీన చరిత్ర పండితులు మోర్గన్ ఈ రహస్యాన్ని బయటపెట్టాక, కొంతకాలంపాటు బెల్లంకొట్టిన రాళ్లల్లాగా చల్లగా వూరుకున్నారు.

---

* ఈ పుస్తకంలో 145 పేజి చూడండి. – సం.

అమెరికన్ ఇండియన్ తెగలలోని ఈ రక్తసంబంధీకుల గుంపును మోర్గన్ gens అనే లాటిన్ పేరుతో పిలిచాడు. ఈ gens అనే మాటా, అదే అర్థం ఇచ్చే genos అనే గ్రీకు మాటా ఆర్యనుల gan అనే మాటలోంచి పుట్టాయి. (ఆర్యను భాషలోని g జర్మన్‌లో kగా మారుతుంది అని ఒక సూత్రం వుంది. ఆవిధంగా g kగా మారి గణ అనేది జర్మనులలో kan అయింది.) ఆర్యనులలోని gan అనే మాటకు "కను" అని అర్థం. Gens, genos, సంస్కృతంలోని janas, గోథిక్ భాషలలోని kuni (పైన చెప్పిన సూత్రం ప్రకారం), ప్రాచీనకాలంనాటి నార్డిక్ తెగలలోనూ, ఆంగ్లో – శాక్సన్ తెగలలోనూ వున్న kyn, ఇంగ్లీషువాళ్ల kin, మధ్య జర్మనీలోని పీఠభూములలోని ప్రజలు వాడే künne ఇవన్నీ ఒకే మాటలోంచి వచ్చాయి. ఇవన్నీ గణం అనే అర్థం ఇచ్చే మాటలే. ఒకే వంశ కర్తనుంచి వచ్చేమని చెప్పుకునే రక్తసంబంధీకుల గుంపులకే gens అని లాటిన్‌లోనూ, genos అని గ్రీకులలోనూ వుపయోగించబడింది. ఈ gens, genos ఒక మూలపురుషుడినుంచి వచ్చినవి. ఏవో కొన్ని సామాజికమైన మతసంబంధమైన వ్యవస్థలద్వారా ఇవి ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేక జిమ్మాగా ఏర్పడతాయి. ఈ జిమ్మాలు ఏమిటో, వాని మూలం ఏమిటో ఈమధ్యవరకూ మన చరిత్రకారులకు అగమ్యగోచరంగా వుండిపోయింది.

వెనకటి ప్రకరణంలో పునాలువన్ కుటుంబాన్ని గురించి చెప్పినప్పుడు మొట్టమొదట గణ (gens) నిర్మాణం ఎలా వుందో తెలుసుకున్నాం. పునాలువన్ వివాహ పద్ధతి కారణంగా, ఆ దశలో వుండే అభిప్రాయాల ప్రకారం పూర్వీకురాలు ఒకామె వంశకర్తగా గుర్తించబడుతుంది. ఆమె వంశీకులు "గణం"గా ఏర్పడతారు. ఈమాదిరి కుటుంబ రూపంలో పిల్లల తండ్రి ఎవరో చెప్పడం సాధ్యంకాదు.... గనక ఈ గణాలలో స్త్రీల వేపునుంచే వంశపారంపర్యం గుర్తించబడుతుంది. మగవాళ్లు – సోదరులు – తమ సోదరీలనే పెళ్లాడడం వుండదు – మరొక వంశంలోనివాళ్లనే పెళ్లాడుతారు. తల్లి హక్కు ప్రకారం ఆ స్త్రీలకు పుట్టిన సంతానం తండ్రుల గణాలలోకి రాలేరు. అందుచేత ప్రతి తరంలోనూ కూతుళ్ల సంతానం మాత్రమే గణంలో వుంటారు. కొడుకులకు పుట్టినవాళ్లు వాళ్ల తల్లుల గణంలోకి పోతారు. ఈవిధంగా రక్తసంబంధీకులంతా ఒకే ప్రత్యేకమైన గుంపుగా ఏర్పడ్డాక, తెగలో ఇదే మాదిరిగా అనేక గుంపులు ఏర్పడతాయి, ఏమవుతుంది?

ఇరాక్వ్యాలలో, ముఖ్యంగా సెనెకా తెగలో వున్న గణాలను మోర్గన్ మొట్టమొదటి ప్రామాణిక రూపంగా తీసుకున్నాడు. సెనెకా తెగలో ఎనిమిది గణాలు వున్నాయి. వాటిలో ఒక్కొక్కటి ఒక్కొక్క జంతువు పేరుతో పిలవబడుతుంది: (1) తోడేలు, (2) ఎలుగు, (3) తాబేలు, (4) బీవర్, (5) దుప్పి, (6) నీటికాకి, (7) కొంగ, (8) డేగ – ప్రతి గణంలోనూ ఈ క్రింది అలవాట్లు వుండేవి.

1. గణం సాకెమ్‌నూ (శాంతికాలంలో పెద్ద), ప్రధాన నాయకుణ్ణీ (యుద్ధ

రంగంలో సేనాధిపతి) ఎన్నుకొంటుంది. సాకెమ్‌ను గణసభ్యులలోంచే ఎన్నుకోవాలి. ఆ పదవి వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది. అంటే దాని వుద్దేశం, ఆ పదవి ఖాళీకాగానే వెంటనే భర్తీ చేయాలనే. యుద్ధనాయకుడు మరో గణంనుంచి కూడా ఎన్నుకోబడవచ్చు. ఆ పదవి మధ్యమధ్య కాళీగా వుండవచ్చు. పాత సాకెమ్ కొడుక్కు ఆ అధికారం ఎన్నడూ లభించదు. ఏమంటే ఇరాక్వ్యాలలో తల్లి పరంపరే అమలులో వుంది. అందుచేత అతని కొడుకు మరో గణానికి చెందేవాడు. సాధారణంగా పూర్వపు సాకెమ్ తమ్ముణ్ణో, మేనల్లుణ్ణో ఎన్నుకునేవారు. ఎన్నికప్పుడు అందరూ — స్త్రీలూ, పురుషులూ కూడ — వోటు చేసేవారు. అయితే ఆ ఎన్నికను మిగిలిన ఏడు గణాలూ ధ్రువపరచాలి. అటు తర్వాత ఎన్నుకోబడిన వ్యక్తిని ఆ వుద్యోగంలో స్థిరపరచడం తంతు జరిగిస్తారు. ఈ తంతు జరపడానికి యావత్తు ఇరాక్వ్యా సమాఖ్యకూ సంబంధించిన సాధారణ సమితి సమావేశమవుతుంది. దీని ప్రాముఖ్యం ఏమిటో తర్వాత రాస్తాను. గణం లోపల సాకెమ్ పితృభావంతో కూడిన పూర్తి నైతిక అధికారాన్ని మాత్రమే నిర్వహించేవాడు. తన పెద్దరికాన్ని అమలు జరిపేటందుకు ఆయనవద్ద బలగం వుండదు. గణం పెద్దగా ఆయన సెనెకా తెగ సమితిలోనూ, ఇరాక్వ్యా సమాఖ్య సమితిలోనూ సభ్యుడు అవుతాడు. సైనిక దండయాత్రలలో మాత్రమే యుద్ధ నాయకుడు ఆజ్ఞలని ఇవ్వగలడు.

2. గణం తనకు ఇష్టం లేకుంటే సాకెమ్‌నూ, యుద్ధ నాయకుణ్ణీ కూడ తొలగించవచ్చును. ఈ తొలగింపు కార్యక్రమాన్ని కూడా గణంలోని స్త్రీ పురుషులంతా కలిసే చేసేవారు. ఉద్యోగంనుంచి తొలగించబడినవారు మిగిలిన వారందరిలాగే సామాన్య వ్యక్తులూ, సాధారణ యోధులుగా పరిగణించబడేవారు. గణంయొక్క ఇష్టానికి వ్యతిరేకంగా తెగ సమితి కూడా సాకెమ్‌లను వారి పదవులనుంచి తొలగించవచ్చును.

3. గణ సభ్యులు ఎవ్వరూ గణంలోనివాళ్లని పెళ్లి చేసుకోకూడదు. గణంయొక్క మూలసూత్రం ఇదే. దానిని కలిపి వుంచుతున్న సూత్రం యిదే. రక్తసంబంధం కలిసిన వ్యక్తులే గణంలో వుంటారనే అభిప్రాయాన్ని ఈ సూత్రం రెండో కొసనుంచి వ్యక్తీకరించేది. అతి సామాన్యమైన ఈ చిన్న విషయాన్ని కనిపెట్టి, మోర్గన్ గణంయొక్క స్వభావాన్ని మొట్టమొదటిసారిగా స్పష్టపరిచాడు. ఇంత క్రితం ఈ విషయం తెలియదు. ఆటవికుల్నీ, అనాగరికుల్నీ గురించిన వార్తలలో వారి గణ వ్యవస్థకు సంబంధించిన వివిధ సంస్థ లన్నింటికీ వుండే తేడాలను ఎరగక తెగ, కులం, థమ్ మొదలయిన పేర్లను అన్నింటినీ ఒకే విధంగా వాడిన పద్ధతి చూస్తే ఇది రుజువు అవుతుంది. ఈ సంస్థ లన్నింటి మధ్యా వివాహ సంబంధాలు నిషిద్ధం అని చెప్పిన ఘట్టాలు కూడా వున్నాయి. వీటన్నింటి ఫలితంగా ఎంతో గంద్రగోళం ఏర్పడింది. మధ్యలో మాక్‌లెన్నాన్ నెపోలియన్ లాగా ముందుకు వచ్చి అంతిమ నిర్ణయాలు ఇచ్చేశాడు: అంతర్వివాహాన్ని అంగీకరించినవీ, అంగీకరించనవీగా

తెగలన్నింటినీ విభజించాడు. పరమ గజిబిజికి కారణమైన ఆ విభజన నిర్ణయం చేశాక వాటిలో ఏది ఆదిమం, ఏది తర్వాతది — అని అర్థంలేని పరిశీలన ప్రారంభించాడు. రక్తసంబంధీకులతో గణాలు ఏర్పడ్డాయనీ, గణ సభ్యులమధ్య వివాహం నిషిద్ధమనీ బయల్పడ్డాక గాని ఈ గొడవ అణగలేదు. మనకు ఇరాక్వ్యాలు కనబడిననాటి కప్పుడే వారి గణాలలో అంతర్వివాహం ఖచ్చితంగా నిషేధించబడింది.

4. మరణించిన వ్యక్తుల ఆస్తిని గణంలో మిగిలినవారు పంచుకునేవారు — అది గణంలోనే వుండితీరాలి. ఇరాక్వ్యాలకు వున్న ఆస్తి స్వల్పమే, గనుక వ్యక్తి వదలిపోయిన వారసత్వ ఆస్తిని గణంలోని అతని దగ్గర బంధువులకు పంచేవారు. అందువల్ల ఒక మగవాడు చనిపోతే అతడి సహజ సోదరులు, సోదరీలు, అతడి మేనమామ అతని ఆస్తిని తీసుకొనేవారు. ఒక స్త్రీ చనిపోతే ఆమె బిడ్డలు, సహజ సోదరీలు ఆమె ఆస్తిని తీసుకొనేవారు. అంతేగాని ఆమె సోదరులకు దానిని తీసుకునే హక్కుండేదికాదు. అదే కారణంగా భార్యాభర్తలు ఒకరి ఆస్తికి మరొకరు వారసులు కాజాలరు. అలాగే తండ్రి ఆస్తికి బిడ్డలు వారసులు కాజాలరు.

5. గణంలో సభ్యులు పరస్పర సహాయం, రక్షణ యిచ్చుకోవాలి. ముఖ్యంగా యితరుల వల్ల తమవారికి జరిగిన అక్రమాలకు ప్రతీకారం చేయడంలో సహాయం చేయాలి. వ్యక్తి తన రక్షణకు గణంమీద ఆధారపడేవాడు, ఆధారపడగలిగేవాడు. ఎవరైనా అతడిని గాయపరిస్తే గణాన్ని గాయపరిచినట్టే ఎంచుకునేవారు. దీనినిబట్టి — గణ సభ్యుల మధ్య రక్తసంబంధాలు వున్నాయనీ — రక్తానికి రక్తంతో ప్రతీకారం తీర్చుకోవాలనే సంప్రదాయాన్ని బేషరతుగా ఇరాక్వ్యాలు గుర్తించేవారనీ ద్యోతకమవుతుంది. గణసభ్యుని ఇతరుడెవరైనా చంపితే, మరణించిన వ్యక్తికి సంబంధించిన గణం అంతా రక్తప్రతీకారం తీర్చుకోవాలనే నిబంధన వుండేది. మొదట మధ్యవర్తిత్వం కొరకు ప్రయత్నం జరిగేది. ముద్దాయికి సంబంధించిన గణం సమావేశమై మరణించిన వ్యక్తికి సంబంధించిన గణానికి కొన్ని సూచనలు చేసేది — సాధారణంగా క్షమాపణతోపాటు కొంత విలువైన బహుమతులను పరిహార మివ్వడానికి సంసిద్ధతను తెలిపేది. వీటిని అంగీకరించితే తగాదా అంతటితో పరిష్కారమైనట్లుగానే ఎంచబడేది. అంగీకారం కుదరకపోతే వ్యక్తి కోల్పోయిన గణం ఒకరినికాని కొందరు సభ్యులనుగాని కక్ష తీర్చుకొనేందుకు నియమించేది. ఖూనీచేసిన వానిని వెంబడించి చంపివేయడం వారి కర్తవ్యం. ఇలా జరిగినపుడు ముద్దాయికి సంబంధించిన గణానికి ఎలాంటి ఆక్షేపణా చేసే హక్కు లేదు. ఆ విషయం అంతటితో సర్దుబాటయినట్లుగానే ఎంచబడేది.

6. గణానికి ప్రత్యేకమైన పేర్లు, లేక పేర్ల జాబితా వుండేది. మొత్తం తెగ అంతటిలో ఆ గణానికి సంబంధించినవారే ఆ పేర్లను ఉపయోగించే హక్కు వుంటుంది. ఇందువల్ల వ్యక్తి పేరునుబట్టి అతడు ఏ గణానికి చెందినవాడో తెలుసుకోవచ్చు. గణం పేరును

కలిగివుండటమంటే దానితోబాటు సహజంగానే గణం హక్కులను కూడ అతడు కలిగి వుంటాడు.

7. గణం కొత్త వ్యక్తులను తనలో చేర్చుకోవచ్చు; తద్వారా వారు తెగ మొత్తంలో చేరినట్లుగా ఎంచబడతారు. చంపకుండా వున్న యుద్ధ ఖైదీలని చేర్చుకోవడం ద్వారా సెనెకా తెగలో వారు సభ్యులయేవారు. తత్ఫలితంగా వారికి గణ హక్కులు, తెగ హక్కులు కూడ సంప్రాప్తమయేవి. గణంలోని సభ్యులు కొందరు కోరడం వల్లనే కొత్తవారిని గణం లోకి స్వీకరించేవారు. కొత్త వ్యక్తిని తన సోదరునిగానో, సోదరిగానో స్వీకరించుతానని మగ సభ్యుడు కోరుతాడు. స్త్రీ అయితే తన బిడ్డగా స్వీకరించుతానని గణాన్ని కోరుతుంది. స్వీకారం ఖాయమవాలంటే సంప్రదాయ ప్రకారం గణ సమావేశం లాంఛనప్రాయమైన తంతు జరిపి ఆమోదముద్ర వేయడం అవసరం. సభ్యుల సంఖ్య చాలా తగ్గిపోయిన సంద ర్భాలలో, ఇతర గణాల అనుమతితో వారి సభ్యులను, తమలోకి స్వీకరించడం తరచు జరుగుతూంటుంది. ఇరాక్వూలలో గణంలోనికి ఇతరులను స్వీకరించే తంతును తెగసమితి జరిపే బహిరంగ సభలో సాగించేవారు; ఆచరణలో యిదొక మతకర్మవలే జరిగేది.

8. ఇండియన్ గణాలలో ప్రత్యేకంగా మతసంబంధమైన కర్మకాండ ఉన్నాయని రుజువుచేయడం చాలాకష్టం — ఐనప్పటికీ ఇండియనులు జరిపే మత కర్మకాండలన్నీ గణాలకు సంబంధించినవే. ఇరాక్వూలలో సంవత్సరానికి ఆరు మతోత్సవాలు జరిగేవి. వాటిలో వివిధ గణాలకు చెందిన సాకెమ్‌లూ, యుద్ధ నాయకులూ పదవిరీత్యా "మత రక్షకులుగా" ఎంచబడేవారు. పురోహితుల బాధ్యతను నెరవేర్చేవారు.

9. గణానికి ఉమ్మడి శ్మశానం వుండేది. న్యూయార్కు రాష్ట్రంలోని ఇరాక్వూల శ్మశానం, తెల్లవాళ్ల గదుముకు రావడమువల్ల ఇపుడు అంతర్ధానమయింది. కాని ఇదివరకు వుండేది. ఇతర ఇండియన్ తెగలలో ఉమ్మడి శ్మశానాలు ఇప్పటికీ వున్నాయి; ఉదాహర ణకు ఇరాక్వూలకు సన్నిహితంగా వుండే టుస్కరోరాస్ తెగలో వున్నాయి. వారిపుడు క్రిస్టి యన్లు ఐనప్పటికీ వారిలోని ప్రతిఒక గణానికీ గోరీలదొడ్డిలో వేర్వేరు పంక్తులు ప్రత్యేకించ బడ్డాయి. బిడ్డల గోరీలున్న పంక్తిలోనే తల్లి గోరీ కూడ ఏర్పాటు చేస్తారు. తండ్రి శవాన్ని మాత్రం ఆ పంక్తిలో పాతిపెట్టరు. ఇరాక్వూలలో కూడ గణ సభ్యులందరూ శోకభాగస్వా ములుగా అంత్యక్రియలలో పాల్గొంటారు, గోరీని తయారుచేస్తారు; అంత్యోపన్యాసాలు వగైరా తంతు సాగిస్తారు.

10. గణంలోని యుక్తవయస్కులైన స్త్రీ పురుషులందరికీ సమాన హక్కు లుంటాయి. వారంతా కలసి గణసమితిని ఎన్నుకుంటారు. సాకెమ్‌ను, యుద్ధనాయకుని ఎన్నుకునేందుకూ, పదవులనుంచి తొలగించేందుకూ యీ సమితికి అధికారముంటుంది. ఇతర "మత రక్షకుల" విషయంలో కూడ యిదే పద్ధతి అవలంబించబడుతుంది. చంపబడిన

గణసభ్యులకు నేరపరిహార బహుమతులను ఏమి తీసుకోవాలో లేక రక్తప్రతీకారాన్ని ఎవరు వహించాలో కూడ సమితే నిర్ణయించుతుంది. కొత్తవారిని గణంలోనికి స్వీకరించుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే గణంలో సర్వంసహాధికారం సమితిదే.

నమూనాప్రాయమైన ఇండియన్ గణం హక్కులు పైన చెప్పినవే.

> "ఇరాక్వా గణంలోని సభ్యులందరూ వ్యక్తిగతంగా స్వతంత్రులు. ఒండొరుల స్వాతంత్ర్యాన్ని రక్షించే బాధ్యత వారికి వుంది. సభ్యులందరి వ్యక్తిగత హక్కులు, ప్రయోజనాలు సమానమే. సాకెమ్‌కు, యుద్ధనాయకునికి వీటి విషయంలో ఆధిక్యత ఏమీలేదు. వారంతా రక్తసంబంధమున్న సోదరబృందం. అలా నిర్వచింపనప్పటికీ స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరత్వం గణంలోని సభ్యులందరినీ బంధించే సూత్రాలు. సామాజిక విధానానికి ప్రాథమిక యూనిట్‌గా గణం వుండేది. ఆ పునాదిపైనే ఇండియన్ సమాజమంతా నిర్మింపబడింది.... ఇండియన్లలో సర్వసాధారణంగా ప్రదర్శితమయ్యే స్వాతంత్ర్యం, వ్యక్తి హుందాతనం అనే లక్షణానికి ప్రాతిపదిక ఈ సామాజిక యూనిట్‌లోనే వుంది."*

ఉత్తర అమెరికాలోని ఇండియన్లను కనుగొన్న సమయానికి వారందరూ మాతృస్వామిక గణాలలో సంఘటితమై వుండేవారు. డకోటాస్‌లాంటి కొన్ని తెగల్లో మాత్రమే గణవ్యవస్థ శిథిలమయింది: ఓజిబ్వా, ఓమహ్ వగైరా మరికొన్ని తెగలలో జనం పితృస్వామిక గణాలుగా సంఘటితమయి వుండేవారు.

ఐదు లేక ఆరు గణాలను కలిగివున్న ఇండియను తెగలు అనేకం వుండేవి. వీటిలో మూడు, నాలుగు గణాలు ఒక ప్రత్యేకబృందంగా కలసివుండేవి. ఈ ప్రత్యేక, గ్రూపునకువున్న ఇండియన్ పేరును మోర్గన్ జాగ్రత్తగా గ్రీకు పదం "ఫ్రాట్రీ" (సోదర కూటం) లోనికి యథామాతృకంగా అనువదించాడు. ఈవిధంగా సెనెకా తెగలో రెండు కూటాలుండేవి. మొదటిదాంట్లో ఒకటినుంచి నాలుగు గణాలవరకు, రెండోదాంట్లో ఐదునుంచి ఎనిమిదవ గణంవరకు వుండేవి. జాగ్రత్తగా పరిశీలించిన మీదట ఈ కూటాలు ప్రధానంగా — ఆ తెగ ప్రారంభదశలో ఏ యే గణాలలోకి చీలిపోయిందో — వాటికే ప్రాతినిధ్యం వహించుతూ వుండేవని బోధపడుతుంది; ఏమంటే గణాలలో అంతర్వివాహం నిషేధించబడిన తరువాత ప్రతి తెగకూ — అది స్వతంత్రంగా మనగలగాలంటే — కనీసం రెండు గణాలు అయినా వుండటం అవసరమయింది. తెగ పెరిగేకొలదీ ప్రతి గణం తిరిగి రెండు లేక మూడు

---

* మార్క్స్ — ఎంగెల్స్, పురావస్తు భాండారం, 9వ సంపుటం, పేజి 71. — సం.

గణాలుగా విభజింపబడేవి. అలా ఏర్పడినవి యిపుడు వేర్వేరు గణాలుగా వుండగా ప్రారంభ దశలో ఒకే గణంలోనుంచి విడిపోయినవాని నన్నిటినీ కలిపి సోదర కూటంగా ఎంచేవారు. సెనెకాస్ తెగలోనూ, ఇతర ఇండియన్ తెగల్లోనూ కూడ, కూటంలో వున్న గణాలు అన్నీ సోదర గణాలుగా ఎంచబడేవి. ఇతర కూటాల్లో వున్న గణాలు కజిన్ (వివాహ యోగ్యమైన ) గణాలుగా ఎంచబడేవి. అమెరికన్ ఆదిమ సామాజిక విధానంలో ఈ పేర్లు రక్తసంబంధాలను సూచించుతాయని మనకు తెలుసు. వాస్తవానికి ప్రారంభ దశలో సెనెకా తెగలో ఒకే కూటంలో అంతర్వివాహాలు నిషేధించబడ్డాయి; కాని ఈ నిషేధం చాలకాలం క్రిందటనే తొలగిపోయి, కేవలం ఒకే గణంలోని అంతర్వివాహాలపై నిషేధం మాత్రమే నిలిచి వుంది. ''ఎలుగు,'' ''దుప్పి'' పేర్లు కలిగిన గణాలు సెనెకా తెగలో మొట్టమొదట విభజింపబడినవనీ, తక్కినవన్నీ వాటి పునర్విభజన వల్ల ఉత్పన్నమైన గణాలు అనీ సంప్రదాయంవల్ల తెలుస్తూంది. ఈ కొత్త వ్యవస్థ ఒకసారి గట్టిగా వేళ్ళు పాదుకున్న తర్వాత, అవసరాన్ని బట్టి దాన్ని మార్చుకుంటూ వచ్చారు. ఒక కూటంలోని గణాలు చనిపోయినపుడు ఇతర కూటంలోని కొన్ని గణాలను మొత్తంగా దానిలోకి మార్చుకోవడం జరిగేది, వేర్వేరు తెగల్లోని వివిధ కూటాలలో ఒకే పేరుగల గణాలు వుండటానికి యిదే కారణమని బోధ పడుతుంది.

ఇరాక్వ్యాలలో కూటపు బాధ్యతలు పాక్షికంగా సాంఘికమైనవి, పాక్షికంగా మతపరమైనవి. (1) బంతి ఆటలో రెండు కూటాల మధ్య పోటీ జరిగేది; ప్రతి కూటం తనకున్న మంచి ఆటగాళ్లను ఎంచుకొనేది; వారు ఆడుతుండగా తక్కిన వారంతా ప్రేక్షకులుగా చూసే వారు; తమ తమ పక్షాలు గెలుస్తాయని పందాలు కాచేవారు. (2) తెగసమితి సమావేశంలో ప్రతి తెగకు చెందిన సాకెమ్, యుద్ధనాయకుడు ఒకేచోట కలసి కూర్చునేవారు: రెండు గ్రూపులూ ముఖాముఖీ ఎదురుగా కూర్చుని వుండగా ప్రతి ఉపన్యాసకుడూ వేర్వేరుగా కూర్చున్న సోదర కూట ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడేవారు. (3) తెగలో ఒక ఖూనీ జరిగినట్లయితే, ఒకవేళ చనిపోయినవాడూ చంపినవాడూ ఒకే కూటానికి చెంది వుండకపోతే, నష్టపడిన గణం తన సోదర గణానికి అభ్యర్థన చేసేది: కూటమి సమితి సమావేశం జరిపి, రెండో కూటానికి సమష్టిగా అభ్యర్ధన చేసేది; తగాదాను పరిష్కరించుకోడానికి సమితి సమావేశం పిలువమని కోరేది. దీన్నిబట్టి కూడ కూటమే మొదటి గణం అనీ, దానిలోనుంచి విడిపోయిన ప్రత్యేక బలహీన గణం కంటే, కూటమే కృషిచేస్తే విజయావకాశం ఎక్కువగా వుందనీ బోధపడుతుంది. (4) ప్రముఖ వ్యక్తి చనిపోయినపుడు అంత్యక్రియల ఏర్పాటును రెండో కూటంవారు చేస్తారు. మృతుని కూటానికి చెందినవారంతా అంత్యక్రియల్లో బంధువులుగా పాల్గొంటారు. సాకెమ్ చనిపోయినట్లయితే ఆ ఖాళీని గురించి రెండో కూటం ఇరాక్వ్యాల ఫెడరల్ సమితికి తెలి

యజేస్తుంది. (5) కూటమి సమితి మళ్ళీ రంగంలోకి వచ్చి సాకెమ్ ఎన్నిక జరిగించుతుంది. ఈ ఎన్నికను ఆ కూటంలోని సోదర గణాలు కూడ ఆమోదించినట్లే సాధారణంగా ఎంచ బడుతుంది; కాని ఇతర కూటానికి చెందిన గణాలు వ్యతిరేకించవచ్చు. అలాంటి సందర్భంలో ఆ కూటమి సమితి సమావేశమై చర్చించాలి; ఒకవేళ అది కూడా వ్యతిరేకతను సమర్థించితే సాకెమ్ ఎన్నిక రద్దవుతుంది. (6) పూర్వం ఇరాక్వ్యూలకు ప్రత్యేక మతక్రియలుండేవి; వాటిని medicine lodges* అని తెల్లవాళ్ళు పిలిచేవారు. సెనెకాతెగలో ప్రతికూటానికి ఒకటి చొప్పున రెండు ప్రత్యేక మత వ్యవస్థలు ఈ తంతును నిర్వహించేవి. కొత్త సభ్యులను స్వీకరించేటపుడు మంత్రాలను వల్లించేవారు. (7) 1521లో కోర్టేస్ మెక్సికోను జయించినపుడు[125] టాక్స్కాలాలో వున్న నాలుగు విభాగాలలో నివశించే నాలుగువంశాలూ వాస్తవానికి నాలుగు కూటాలని దాదాపు రుజువయింది; గ్రీకుల్లోనూ, అదేవిధంగా రక్తసంబంధీకులైన జర్మన్లలోనూ వున్న సంప్రదాయాలనుబట్టి కూడ ఈ కూటాలు సైనిక విభాగాలుగా గూడ వుండేవని బోధపడుతుంది. ఈ నాలుగు వంశాలూ స్వంత నాయకుల ఆధ్వర్యాన, స్వంత యూనిఫాం జెండాలతో యుద్ధంలోకి వెళ్లేవి.

కొన్ని గణాలు కలసి ఒక కూటమైనట్లే, సాంప్రదాయికంగా కొన్ని కూటాలు కలసి ఒక తెగగా వుండేవి, బాగా బలహీనపడిన తెగలలో మధ్య నుండే కూటం లోపించిన ఉదాహరణలు చాల వున్నాయి. అమెరికాలోని ఇండియన్ తెగ ప్రత్యేకత లేమిటి?

1. స్వంత ప్రాంతాన్ని అధీనంలో వుంచుకోవడం, స్వంత పేరును కలిగివుండటం ప్రతి తెగా వాస్తవంగా తాను నివసించుతున్న ప్రాంతంతోపాటు వేటాడేందుకూ చేపల పట్టేందుకూ తగినంత అదనపు ప్రాంతాన్ని కూడ కలిగివుండేది. దీని తరువాత ఈ తెగ అధీనంలో వున్న ప్రాంతానికీ మరో తెగకు అధీనంలో వున్న ప్రాంతానికీ మధ్య తటస్థప్రాంతముండేది. పరిసరంలో వుండే రెండు తెగలు మాట్లాడే భాషలూ దగ్గర సంబంధం కలిగినవిగా వున్నపుడు ఈ తటస్థప్రాంతం తక్కువ విస్తీర్ణంకలిగి వుండేది. భాషలకు సాన్నిహిత్యంలేనపుడు తటస్థప్రాంత విస్తీర్ణం ఎక్కువగా వుండేది. జర్మన్ల సరిహద్దు అడవి అలాంటి తటస్థప్రాంతం. సీజర్‌యొక్క స్వేవ్‌లు తమ అధీనప్రాంతం చుట్టూ వదలిన పడావు భూమి కూడ అలాంటి తటస్థ ప్రాంతమే. జర్మనులకూ డేన్సుకూ మధ్య వుండే Isarnholt (డేనిషు ప్రజలు jarnved, limes Danicus అని దీనిని పిలిచేవారు), జర్మనులకు, స్లావ్ తెగలకూ మధ్య ఉండే సాక్సన్ అడవీ – స్లావానిక్ జాతులు దీనినే "రక్షణ అడవి" అని పిలిచేవారు – branibor – దీనినుంచే బ్రాండెన్‌బర్గ్ అనే పేరు ఉత్పన్నమయింది – ఇవన్నీ తటస్థ ప్రాంతమే. అనిర్దిష్టమైన సరిహద్దుల మధ్యవున్న

* మంత్రగత్తెల మందిరాలు. – సం.

ప్రాంతాన్ని తెగయొక్క ఉమ్మడి భూమిగా ఎంచేవారు; ఇరుగుపొరుగు తెగలు ఆ విషయాన్ని గుర్తించేవి. పరుల ఆక్రమణనుంచి తెగ తన ప్రాంతాన్ని రక్షించుకునేది. చాల సందర్భాలలో సరిహద్దులు అనిర్దిష్టంగా ఉన్నందున జనసంఖ్య ఎక్కువగా పెరిగినపుడు మాత్రమే, ఆచరణలో ఇబ్బంది కలిగేది. తెగల పేర్లు, ఉద్దేశ్యపూర్వకంగా ఎంచుకున్నవి కాదనీ, కేవలం యధాలాపంగా సంఘటిల్లినవి మాత్రమేననీ అనిపించుతుంది. కాలక్రమేణా కొత్త తెగ ఏర్పడినపుడు ఇరుగుపొరుగు తెగలు తమ పేర్లలోంచిగాక మరోపేరును కొత్తదానికి సూచించడం సహజంగా తటస్థించేది: ఉదాహరణకు కెల్ట్ తెగ తమ పొరుగు తెగకు జర్మన్స్ (die Deutschen) అనే చారిత్రాత్మకమైన పేరు పెట్టగా, జర్మన్స్ తెగ కొత్తగా ఏర్పడిన తెగకు Germani (Germanen) అని నామకరణం చేసింది.

2. ఈ తెగకు ప్రత్యేకమైన మాండలికం వుండేది. వాస్తవానికి తెగ, మాండలికం ఏక కాలంలో ఉంటాయి. పాతతెగల పునర్విభజన ద్వారా కొత్త తెగలు, మాండలికాలు ఏర్పడటం అమెరికాలో ఈమధ్యకాలంవరకు జరుగుతుండేది. ఇప్పటికైనా ఈ పరిణామం ఆగిపోయిం దనలేము. బలహీనపడిన రెండు తెగలు ఒకటిగా కలిసిపోయినపుడు — అరుదుగా మాత్రమే యిలా జరుగుతుంది — ఆ తెగలో రెండు సన్నిహితమైన మాండలికాలు కనిపించుతుండేవి. అమెరికా తెగల సగటు జనాభా రెండు వేలకు లోపుగా వుండేది. ఐతే చెరొకీస్ అను తెగలో దాదాపు ఇరవై ఆరువేల జనాభా వుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఒకే మాండలికం మాట్లాడే తెగలన్నిటిలోకీ యిదే పెద్దది.

3. గణాలు ఎన్నుకున్న సాకెమ్‌లను, యుద్ధనాయకులను ఖాయపరచే హక్కు తెగకు వుంది.

4. వారి గణం అంగీకరించక పోయినప్పటికీ వారిని తొలగించే హక్కు కూడ తెగకు వుంటుంది. ఈ సాకెమ్‌లు, యుద్ధనాయకులు తెగ సమితిలో సభ్యులు కాబట్టి వీరి ఎన్నికను ఖాయపరచడం, తొలగించడంలో తెగకు వున్న హక్కును అర్థంచేసుకోవడం సులభమే. ఎచటనైనా తెగల సమాఖ్య ఏర్పడి, ఆ తెగలన్నీ సమాఖ్య సమితిలో ప్రాతినిధ్యం కలిగి వుంటే, పై హక్కులు ఆ సమాఖ్యకు దఖలుపడతాయి.

5. ఉమ్మడి మతభావాలు (మైథాలజీ), పూజా పునస్కారాలు తెగకు ప్రత్యేకంగా వుంటాయి.

> "ఆటవిక తెగల ప్రజలందరివలెనే అమెరికన్ ఇండియన్లు కూడ మత విశ్వాసం కలవారు."

వారి పురాణాలను యింకా ఎవరూ విమర్శనాత్మకంగా పరిశీలించలేదు. తమ మత విశ్వాసాలన్నిటికీ వారు అప్పటికే రూపాలిచ్చారు. — అనేక రకాల భూతాలను మానవ రూపంలో

వూహించుకున్నారు – కాని అప్పటికింకా వారు ఆటవిక దశ దిగువస్థాయిలో వున్నందున తాము పూజించే దేవతలకు ప్రాతినిధ్యం వహించే ప్రతిమలను – విగ్రహాలను తయారు చేయలేదు. ప్రకృతినీ, పంచభూతాలనూ పూజించే విధానంనుంచి బహుదేవతల పూజా పద్ధతి పరిణామం చెందింది. వివిధ తెగలకు క్రమబద్ధంగా వచ్చే పండుగల్లో ప్రత్యేక పూజా విధానాలు, ముఖ్యంగా నృత్యాలు, ఆటలు వుంటాయి. అన్ని మత ఉత్సవాల్లోనూ నృత్యం తప్పనిసరిగా వుంటుంది. ప్రతి తెగా వాటిని ప్రత్యేకంగా నిర్వహించుకుంటూండేది.

6. ఉమ్మడి వ్యవహారాలను తెగ సమితి పరిష్కరించేది. అన్ని గణాలయొక్క సాకెమ్‌లూ, యుద్ధనాయకులూ ఈ సమితి సభ్యులుగా వుండేవారు. వీరిని ఎన్నుకునేందుకూ, వీరి ఎన్నికను ఎప్పుడైనా రద్దుచేసేందుకూ గణాలకు అధికారమున్నందున వీరిని గణాలకు నిజమైన నాయకులనుగా ఎంచవచ్చు. తెగలోని సభ్యుల ఎదుట బహిరంగంగానే తెగ సమితి చర్చలు జరిగేవి; తెగ సభ్యులు ఈ చర్చల్లో పాల్గొనవచ్చును, తమ అభిప్రాయాలను తెలుపవచ్చు. నిర్ణయాధికారం మాత్రం సమితి సభ్యులకే వుంటుంది. హాజరుగా వున్న ప్రతిఒక్కరూ సమితికి తమ అభ్యర్థన చెప్పుకోవచ్చు. స్త్రీలు సైతం తాము కోరుకున్న ప్రతినిధి ద్వారా తమ అభిప్రాయాలను తెలుపవచ్చు. అంతిమ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా చేయాలనే సంప్రదాయం ఇరాక్వ్యాలలో వుంది. జర్మన్ మార్క్ సంఘాలలో కూడ చాలా నిర్ణయాలు యిదే పద్ధతిలో జరిగేవి. ముఖ్యంగా ఇతర తెగలతో సంబంధాలను గురించి నిర్ణయం తీసుకునే బాధ్యత తెగ సమితిది. రాయబారవర్గాలను కలుసుకోవడం, పంపడం, యుద్ధం ప్రకటించడం, శాంతిసంధి చేసుకోవడంవంటి బాధ్యతలను తెగ సమితే నిర్వహించేది. యుద్ధం సంభవించినపుడు ప్రధానంగా స్వచ్ఛంద సైనికులే (వాలంటీర్లు) పోరాడేవారు. శాంతిసంధి చేసుకున్న తెగలతో తప్ప యితర తెగలన్నిటితో సూత్రప్రాయంగా యుద్ధ పరిస్థితి వున్నట్లుగానే వుండేది. అలాంటి శత్రువులపై సైనికదాడులు అధికభాగం కొద్దిమంది ప్రముఖ వీరుల ఆధ్వర్యాన నిర్వహించబడేవి. యుద్ధనృత్యాన్ని ఏర్పాటు చేసేవారు. ఆ నృత్యంలో చేరినవారంతా సైనిక చర్యల్లో పాల్గొనేందుకు అంగీకరించినట్లుగా ఎంచబడేది. వెంటనే సైనికదళం ఏర్పాటయి ముందుకు సాగిపోయేది. తెగ నివశించే ప్రాంతంపై దాడిచేసినపుడు అదేవిధంగా స్వచ్ఛంద సైనికులే (వాలంటీర్లు) ప్రధానపాత్ర వహించి రక్షణ బాధ్యతను నిర్వహించేవారు. అటువంటి సైనికదళాలు బయల్దేరేటపుడూ, తిరిగివచ్చినపుడూ బహిరంగోత్సవాలు జరిపేవారు. అలాంటి దాడులకు తెగ సమితి అనుమతి తీసుకోవలసిన అవసరంలేదు. అనుమతి అడగడం, యివ్వడం అనే పద్ధతే లేదు. ఇవి సరిగా టాసిటస్ వర్ణించినట్లుగా జర్మన్ సైనికభృత్యులు జరిపే స్వంతదాడులవలె వుండేవి. ఐతే జర్మన్ సైనికభృత్యులకు అప్పటికే వలంటీర్ల లక్షణాలు పోయి, సర్వకాలం – శాంతి సమయంలో కూడ సంఘటితమై వుండే కేంద్రీకృత సైన్యం చుట్టూ యుద్ధ సమయంలో

వలంటీర్లను సమీకరించే పద్ధతి అమల్లోకి వచ్చింది. అటువంటి సైనికదళాలు అరుదుగా మాత్రమే ఎక్కువ సంఖ్యలో వుండేవి. సాధారణంగా తక్కువ సంఖ్యలో వుండేవి. దూర ప్రాంతాలకు వెళ్లి దాడిచేసిన ఇండియన్ల ప్రముఖ దండయాత్రల్లో కూడ బహుకొద్ది పోరాట దళాలు మాత్రమే పాల్గొనేవి. ఒక ముఖ్యయుద్ధంలో అలాంటి దాడిసేనలు ఎక్కువగా పాల్గొన్నప్పుడు ప్రతి దళమూ తన నాయకుని ఉత్తరువులను మాత్రమే శిరసావహించేది. యుద్ధ పథక నిర్వహణలో వుండాలిసిన ఐకమత్యాన్ని కాపాడేందుకు నాయకుల సమితి బాధ్యత వహించేది. రైన్‌నది ఎగువప్రాంతంలో ఆలామన్ని నాలుగవ శతాబ్దంలో ఇలాంటి యుద్ధ నిర్వహణ పద్ధతినే అవలంబించారని అమ్మియానుస్ మార్సెల్లినుస్ వర్ణించాడు.

7. కొన్ని తెగలలో ముఖ్యనాయకుడు వుండేవాడు. అతని అధికారం అతి స్వల్పం. సాకెమ్‌లలో ఒకడు ఈ పదవిలో వుండి, తక్షణమే చర్య తీసుకోవలసిన విషయాలపై నిర్ణయాలు చేసేవాడు: సమితి సమావేశమయ్యాక అంతిమ నిర్ణయం చేసేది. ఈ పద్ధతిలో కార్యనిర్వాహకోద్యోగిని సృష్టించాలనే ప్రయత్నం ద్యోతకమవుతుంది; అయితే ఈ ఆరంభ ప్రయత్నం ఫలించలేదని తరువాత చరిత్ర నిరూపించింది. చాలా సందర్భాలలో — అన్ని సందర్భాల్లో కాకపోయినా — ముఖ్య సైన్యాధ్యక్షుడే అలాంటి వుద్యోగిగా అభివృద్ధి చెందేవాడు.

అమెరికన్ ఇండియన్లలో అత్యధిక సంఖ్యాకులు తెగలలో సమీకృతులయ్యే దశను మించి అభివృద్ధి చెందలేదు. వీరు అనేక చిన్న తెగలుగా వుంటూండేవారు. అవి ఒకదాన్నుంచి మరొకటి విస్తృతమైన సరిహద్దు ప్రాంతాలవల్ల వేరుపడి వుండేవి. నిరంతర యుద్ధాల వల్ల బలహీనపడి, కొద్దిమంది జనం విశాల ప్రాంతంలో నివసించుతుండేవారు. తాత్కాలిక అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే నిమిత్తం బంధుత్వం కలిగిన తెగలమధ్య ఒడంబడికలు జరిగేవి. ఆ అవసరం గడచిపోయాక ఒడంబడిక రద్దయిపోయేది. కొన్ని ప్రాంతాలలో ఒకే శాఖకు చెందిన తెగలు, తరువాత విడిపోయి వేర్వేరు తెగలుగా నివసించినప్పటికీ, తిరిగి సమాఖ్యగా ఏకమైన వుదాహరణలు వున్నాయి. జాతులుగా రూపొందించడానికి ప్రథమ ప్రాతిపదిక ఈ విధంగా ఏర్పడింది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఇరాక్వా తెగలోనే ఇలాంటి సమాఖ్య అత్యున్నతరూపం మనకు కన్పించుతుంది. మిస్సిసిపీ నదికి పశ్చిమాన నివసించే డకోటా వంశానికి చెందిన ఒకశాఖయే ఇరాక్వాలు అయివుండొచ్చు. అచటనుండి వలసవెళ్లి, వారు అనేకచోట్ల చాలాకాలం తిరిగి ప్రస్తుత న్యూయార్క్ రాష్ట్రంలో చివరకు నివాసమేర్పరచుకున్నారు. అచట ఐదు తెగలుగా సెనెకా, కాయుగా, ఒనందగా, ఒనీదా, మోగాక్ అనే తెగలుగా విడిపోయారు. చేపలు పట్టటం, వేటాడటం, సామాన్యమైన తోటల పెంపకంపై జీవించెవారు. చుట్టూ రక్షణకంచెలున్న గ్రామాలలో నివసించేవారు. ఐదు తెగలకు సంబంధించిన ఉమ్మడి గణాలు వుండేవి. మొత్తం 20 వేలకు

లోపు జనాభా వుండేది. ఒకే భాషకు చెందిన సన్నిహిత సంబంధం కలిగిన మాండలిక పదాలను వాడుతుండేవారు. ఐదు తెగలు ఒకే ప్రదేశాన్ని పంచుకున్నందున వారు నివసించే ప్రాంతాలు కూడ ఇరుగు పొరుగున ఆనుకునే వుండేవి. ఈ ప్రాంతం కొత్తగా జయించబడినది కాబట్టి తరిమివేసిన వాళ్లనుంచి రక్షించుకొనేందుకు సహజంగానే ఈ ఐదు తెగలమధ్య సహకారం వుండేది. ఈ తెగలు కనీసం 15వ శతాబ్దారంభం నాటికి ఒక "శాశ్వత లీగు"గా, ఒక సమాఖ్యగా పరిణతి చెందాయి. ఈ సమాఖ్య తాను కొత్తగా పుంజుకున్న బలం దృష్ట్యా, వెంటనే దురాక్రమణపర స్వభావాన్ని సంతరించుకుంది. ఈ సమాఖ్య అధికారం అత్యున్నతదశలో వుండగా – 1675 సంవత్సరం ప్రాంతంలో – చుట్టూవున్న విశాలప్రదేశాన్ని జయించింది; కొన్ని తెగలను తరిమివేసింది; మరి కొన్నిటినుండి కప్పం చెల్లించేటట్టు చేసింది. అనాగరిక యుగపు నిమ్న దశనుండి బయట పడని అమెరికన్ ఇండియన్లు (మెక్సికన్లు, న్యూ మెక్సికన్లు, పెరూవియన్లను మినహాయించి) సాధించిన అత్యంతాభివృద్ధి చెందిన సామాజిక సంస్థ యీ ఇరాక్వా సమాఖ్యయే. ఇరాక్వా సమాఖ్యయొక్క ప్రధాన లక్షణాలు యివీ:

1. తమ ఆంతరంగిక వ్యవహారాల్లో సమానత్వం, స్వాతంత్ర్యం అనే ప్రాతిపదికమీద ఆధారపడి రక్తసంబంధాలు కలిగిన ఐదు తెగలూ శాశ్వతమైన కూటంగా ఏర్పడ్డాయి. ఈ తెగలమధ్య వున్న రక్తసంబంధాలే ఈ సమాఖ్యకు నిజమైన పునాది. ఈ అయిదు తెగల్లోనూ మూడింటిని తండ్రి తెగలని పిలిచేవారు. అవి పరస్పరం సోదర తెగలుగా ఎంచబడేవి. తక్కిన రెండు తెగలనూ కొడుకు తెగలని పిలిచేవారు. అవి కూడ పరస్పరం సోదర తెగలుగా ఎంచబడేవి. అన్నిటికంటె పురాతనమైన మూడు గణాల ప్రతినిధులు మూడు తెగల్లో వుండేవారు. ఈ గణాలకు చెందిన సభ్యులు ఐదు తెగల్లో వున్నప్పటికీ వారంతా సోదరులే. మాండలిక భేదాలున్నప్పటికీ ఉమ్మడి భాషను వాడుతున్నారంటే వారంతా ఒకే వంశంనుంచి అభివృద్ధి చెందిన వారేనని ద్యోతకం అవుతుంది.

2. సమాఖ్య వ్యవహారాలను నిర్వహించేందుకు సమాఖ్య సమితి వుండేది. సమానహోదా, అధికారంగల యాభైమంది సాకెమ్‌లు దీన్లో సభ్యులుగా వుండేవారు. ఈ సమితే సమాఖ్య వ్యవహారాలన్నింటిలోనూ నిర్ణయాధికారం కలిగివుండేది.

3. సమాఖ్య ఏర్పడిన సమయంలో ఈ యాభైమంది సాకెమ్‌లూ వివిధ తెగలలోనూ, గణాలలోనూ వుండేవారు. సమాఖ్య లక్ష్యాలకు అనుగుణంగా ప్రత్యేకంగా ఏర్పరచిన కొత్త వుద్యోగాల బాధ్యతలను నిర్వర్తించేవారు. ఖాళీ ఏర్పడినప్పుడల్లా ఆయా గణాలు కొత్తవారిని ఎన్నుకునేవి. వారిని ఎప్పుడైనా తొలగించే అధికారం కూడ వాటి కుండేది. ఐతే సమాఖ్య వుద్యోగాల్లో వారిని నియమించే హక్కు మాత్రం సమాఖ్య సమితికి వుండేది.

4. సమాఖ్యయొక్క యీ సాకెమ్ లందరూ తమ తమ తెగల్లో కూడ సాకెమ్‌లుగా వుండేవారు. తెగ సమితిలో సభ్యత్వ, ఓటింగు హక్కు వారికుండేది.

5. సమాఖ్య సమితి నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా జరిగేవి అయి వుండాలి.

6. ఓటింగ్ తెగలవారీగా జరిగేది. అంటే ముందుగానే ప్రతి తెగకు చెందిన సమితి సభ్యులూ ఒక అంగీకారానికి వచ్చిన తర్వాతనే అందరూ పాటించి తీరాలిసిన నిర్ణయం జరిగేది.

7. ఐదు తెగల కౌన్సిళ్లకూ సమాఖ్య సమితి సమావేశాన్ని పిలిచే హక్కు వుంది; కాని తనంతట తానే సమావేశమయ్యే అధికారం సమాఖ్య సమితికి లేదు.

8. దాని సమావేశాలు బహిరంగంగా ప్రజల ఎదుటనే జరిగేవి. ఇరాక్వా ప్రజల్లో ప్రతివారికీ మాట్లాడే హక్కు వుండేది. నిర్ణయాధికారం కౌన్సిల్‌కు మాత్రమే వుండేది.

9. సమాఖ్యకు అధికార హోదాగల అధిపతి లేడు. ముఖ్య కార్యనిర్వాహక అధికారి లేడు.

10. ఐనప్పటికీ సమానహోదా, అధికారంగల ఇద్దరు ముఖ్య యుద్ధనాయకులు సమాఖ్యకు వుంటారు. (స్పార్టన్లలో "ఇద్దరు రాజులు," రోమనులలో ఇద్దరు కాన్సల్సు వున్నట్లుగా).

నాలుగువందల సంవత్సరాలకుపైగా ఇరాక్వా ప్రజలు నివసించిన సామాజిక విధానమిది. ఇప్పటికీ వారావిధంగానే జీవించుతున్నారు. మోర్గన్ తెలిపిన విషయాలను కొంత వివరంగానే యిచట వుదహరించాను. ఏమంటే రాజ్యం యింకా ఏర్పడని అప్పటి సామాజిక విధానాన్ని పరిశీలించడానికి అవి ఉపకరించుతాయి. ప్రతి సందర్భంలోనూ పాలితులనుండి వేరుపడిన ప్రత్యేక అధికారవర్గం వుండటమే రాజ్యానికి పూర్వగ్రహీతాంశం. ఈ వాస్తవిక దృష్టిలోనే జర్మన్‌ల మార్కు నిర్మాణం ప్రధానంగా సామాజిక వ్యవస్థే ననీ, తరువాత దశలో అది రాజ్యానికి పునాదిగా వినియోగపడినప్పటికీ మొదట్లో రాజ్యంతో నిమిత్తంలేని సామాజిక వ్యవస్థే అనీ మౌరెర్ గుర్తించాడు. అందుచేత మార్కులు, గ్రామాలు, గడీలు, పట్టణాలు వగైరా ఆదిమ సామాజిక సంస్థలతోపాటు క్రమక్రమంగా, వాటి పక్కనే ప్రభుత్వాధికారం ఏవిధంగా తలయెత్తిందో తన రచనలలో మౌరెర్ పరిశీలించాడు. ఉత్తర అమెరికా ఇండియన్లు ప్రారంభంలో ఒకే ఆదిమతెగలకు చెందినప్పటికీ క్రమంగా విస్తరించి విశాల భూఖండంలో ఎలా వ్యాప్తిచెందారో; చీలిపోయిన తెగలు మరల గ్రూపులు గానూ, ప్రజలుగానూ ఎలా రూపొందాయో; భాషలు మార్పుచెందుతూ ప్రారంభంలోని ఏకత్వం కోల్పోయి చివరకు ఎలా పరస్పరం అర్థంగాని ప్రత్యేక భాషలుగా రూపొందాయో ఉత్తర అమెరికన్ ఇండియన్లను పరిశీలిస్తే తెలుస్తుంది. అదే సమయంలో తెగలలోని ఒక్కొక్క గణం అనేక గణాలుగా ఎలా విభజన అయ్యాయో; ఆదిమ మాతృస్వామిక గణాలలో సోదర కూటాల రూపంలో ఎలా కొనసాగిందో; చాలాకాలం క్రిందటనే విడిపోయిన తెగల్లో దూరదూరాన వుంటున్నప్పటికీ పాతగణాలయొక్క పేర్లు అదేవిధంగా ఎలా కొనసాగుతున్నాయో తెలుస్తుంది. ఉదాహరణకు "తోడేలు," "ఎలుగు" పేర్లు కలిగిన గణాలు

అధికసంఖ్యాక ఇండియన్ తెగలలో ఇప్పటికీ వున్నాయి. పైన వర్ణించిన సామాజిక విధానం వాటన్నిటికీ మొత్తంమీద వర్తించుతుంది. ఐతే వాటిలో చాలా తెగలు యింకా రక్తసంబంధం కలిగిన తెగల సమాఖ్యను ఏర్పరచుకునే దశకు రాలేదు.

కాని సామాజిక యూనిట్‌గా గణాలను పరిగణించితే గణాలు, ఫ్రాట్రీస్ (సోదర కూటాలు), తెగలు తప్పనిసరిగా వీటినుండే అభివృద్ధి చెందాయనే విషయాన్ని సహజంగా మనం గమనించి తీరుతాం. ఇవి మూడూ కూడా వేర్వేరు నిష్పత్తిలో రక్తసంబంధం కలిగిన గ్రూపులే; ప్రతిదీ స్వంత వ్యవహారాలను స్వయంగా పరిష్కరించుకునే సంపూర్ణ వ్యవస్థగా మనుతూ, తక్కిన వాటికి అనుబంధంగా కూడా వుండేది. అనాగరిక యుగపు నిమ్న దశలోని సామాజిక వ్యవహారాలన్నింటినీ నిర్వహించుకునే వాటిపై వుండేది. అందుచేత ఎచటనైనాసరే ఒక ప్రజల్లో గణం సామాజిక వ్యవస్థ యూనిట్‌గా వుంటే, పైన వర్ణించిన మాదిరి తెగ వుండేమో మనం పరిశీలించవలసి వుంటుంది. తగినన్ని ఆధారాలు లభ్యమయితే — ఉదాహరణకు గ్రీకులు, రోమన్లలో — మనం వాటిని స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఒకవేళ ఆధారాలు దొరక్కపోతే అమెరికన్ సామాజిక నిర్మాణంతో పోల్చిచూడటంవల్ల అత్యంత క్లిష్టమైన అనుమానాలను, సందేహాలను తొలగించుకోవచ్చు.

ఈ గణ సామాజిక వ్యవస్థ మానవజాతి బాల్యోచితమైన సరళతను తెలుపుతూ ఆశ్చర్యం కొల్పేదిగా వుంటుంది! సైనికులు, జెండార్మీలు లేక పోలీసులు లేకుండా, ప్రభువులు, రాజులు, గవర్నర్లు, ప్రిఫెక్టులు, న్యాయాధీశులు లేకుండా, బందిఖానాలు, విచారణలు లేకుండా ప్రతిదీ సాఫీగా నడిచిపోతుంది. అన్ని పోట్లాటలు, తగాదాలు, అందుకు సంబంధించినవన్నీ — గణం లేక తెగ, లేక విడి గెంటీస్ — తమ మధ్య తాము పరిష్కరించుకునేవి. రక్తప్రతీకారం అనేది తీవ్ర లేక అరుదుగా ప్రయోగించే చర్య ఉండేది. ప్రస్తుత నాగరిక సమాజంలో అమలు జరుగుతున్న మరణశిక్ష కేవలం దానికి ప్రత్యామ్నాయ నాగరిక రూపమేగాక, అది నాగరికతయొక్క మంచిచెడ్డలన్నింటినీ కలిగివుంది. ప్రస్తుతం కంటే అపుడు ఉమ్మడి సమస్యలు చాల ఎక్కువగా వున్నప్పటికీ — కొన్ని కుటుంబాలు కలసి ఒకే ఉమ్మడి ఇంట్లో సామూహికంగా నివశించేవారు, భూమి తెగయొక్క ఆస్తిగా వుండేది, చిన్న చిన్న తోటలను మాత్రం తాత్కాలికంగా సమష్టి కుటుంబాలకు యిచ్చేవారు — ఇప్పటివలె విస్తృతమైన క్లిష్టమైన పరిపాలనా యంత్రాంగం ఏమాత్రం అవసరంకాలేదు. ప్రతి సమస్యనూ అందుకు సంబంధించినవారే పరిష్కరించుకునేవారు. అనేక సందర్భాలలో శతాబ్దాలనుండి వస్తున్న సంప్రదాయం ప్రకారం ఎన్నడో నియంత్రితం చెయ్యబడివుంది. సమాజంలో బీదవారు, అన్నార్తులు వుండేవారుకారు. వృద్ధులు, రోగులు, యుద్ధంలో గాయపడినవారియెడల బాధ్యతలు ఏమిటో గణాలకు తెలుసు. స్త్రీలతో సహా గణ సభ్యులంతా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించేవారు. అప్పటికింకా బానిసలు

ఏర్పడేందుకు అవకాశంలేదు. జయించిన ఇతర తెగలను బానిసలుగా చేసే పద్ధతి ఇంకా రాలేదు. ఇరాక్వ్యాలు దాదాపు 1651లో ఎరీలనూ, "తటస్థ జాతులనూ"[126] జయించినపుడు తమతోపాటు సమానులుగా సమాఖ్యలో చేరమని వారిని ఆహ్వానించారు. ఓడిపోయినవాళ్ళు నిరాకరించిన సందర్భాల్లో మాత్రమే వారిని ఆ ప్రాంతంనుంచి తరిమివేశారు. అలాంటి సమాజంలో తయారైన స్త్రీ పురుషులను చూసినపుడు తెల్లవాళ్ళంతా మెచ్చుకున్నారు. అవినీతి ఎరుగరనీ, వ్యక్తిగత హుందాతనాన్ని, నిజాయితీని, నైతిక బలాన్ని, ధైర్యస్థైర్యాలను ప్రదర్శించుతారనీ ఆటవికులైన ఇండియన్లను కలిసికొన్న తెల్లవాళ్ళు ఒప్పుకున్నారు.

ఆఫ్రికాలో ఈమధ్యనే ఆటవికుల ధైర్యానికి మచ్చుతునకలయిన ఉదాహరణలను మనం చూశాం. కొలది సంవత్సరాలక్రితం జులూకాఫిర్లు, రెండు నెలలక్రితం నూబియన్లలాగా — ఈ రెండు తెగల్లోనూ గణ సామాజిక వ్యవస్థ యింకా నశించలేదు — ఏ యూరోపియన్ సైన్యమూ చెయ్యలేనిదాన్ని చేశారు.[127] బరిసెలు, బల్లాలు మాత్రం ధరించి, ప్రేలుడు ఆయుధాలు లేకుండా, ప్రపంచ ప్రఖ్యాత ఇంగ్లీషు సైన్యం బ్రీచ్‌లోడర్లతో కురిపించే గుళ్లవర్షంలో పురోగమించి, బయనెట్ కాల్బలాలతో బాహాబాహీ యుద్ధం చేసి, అనేకసార్లు వారిని వెనక్కి తరుమగలిగారు. ఆయుధాలలో విపరీతమైన తేడా వున్నప్పటికీ, సైనిక తర్ఫీదు, సైనిక విన్యాసాలు అంటే ఏమిటో ఎరుగని ఆటవికులు అలా చేయగలిగారు. తమకంటే కాఫిర్ త్వరగా వెళ్లగలడనీ, ఇరవైనాలుగు గంటల్లో గుర్రంకంటే ఎక్కువ దూరం ప్రయాణం చేయగలడనీ ఇంగ్లీషువాళ్ళు గోలపెట్టారు. ఆటవికుల శక్తిసామర్థ్యాలకూ, సహనశక్తికీ యిది నిదర్శనమనవచ్చు. ఆటవికుల చిన్న కండరాలు సైతం కొరడావారు మాదిరిగా ఉక్కువలె గట్టిగా వుంటాయని ఇంగ్లీషు చిత్రకారుడొకడు పేర్కొన్నాడు.

వర్గవిభజనలు ఉత్పన్నంకాకముందు మానవజాతి, మానవసమాజం అంత హుందాగా వుండేది. అప్పటివారి పరిస్థితులను ప్రస్తుత నాగరిక సమాజంలో అత్యధిక సంఖ్యాకుల స్థితితో మనం పోల్చిచూస్తే, ప్రస్తుత శ్రామికులూ, చిన్న రైతులకూ, ఆదిమగణ సమాజంలోని స్వతంత్ర సభ్యులకూ మధ్య బ్రహ్మాండమైన అంతరముందని బోధపడుతుంది.

చిత్రపటముయొక్క ఒక భాగమిది. ఐతే ఈ నిర్మాణం నశించిపోవడం తప్పనిసరనే సంగతిని మనం మరచిపోరాదు. ఏమంటే ఇది ఎన్నడూ తెగదశను మించి అభివృద్ధి చెందలేదు. తెగల సమాఖ్య ఏర్పడటంలో దీని పతనావస్థ ప్రారంభమయిందన్న సంగతిని ఇకముందు తెలుసుకుంటాం. ఇతరులను జయించి తమ అధీనంలో వుంచుకోవాలనే ఇరాక్వ్యాల ప్రయత్నాలలోనే యిది ద్యోతకమయింది. తెగ పరిధికి బయటవున్నవన్నీ శాసన పరిధికి బయట వున్నట్లుగా ఎంచబడేవి. స్పష్టమైన శాంతి ఒడంబడిక లేనపుడు తెగలమధ్య నిరంతర యుద్ధం కొనసాగేది. ఇతర జంతువు లన్నిటినీ మించిన క్రూరత్వంతో మనిషి యుద్ధం

చేసేవాడు. ఈ యుద్ధం దరిమిలా ఆస్తి రక్షణ దృష్ట్యా మాత్రమే సడలింపబడేది. అమెరికన్ ఇండియన్లలో మనం గమనించినట్లుగా ఉత్పత్తి విధానం చాల వెనుకబడిన దశలో వున్నప్పుడే గణసమాజ విధానం పూర్తిగా వికసించివుంది. అనగా విశాలమైన ప్రాంతములో తక్కువ జనాభా నివసించుతూ, బాహ్యప్రకృతి మానవునిపై తన ఇష్టానుసారం దాదాపు పూర్తి పెత్తనం చెలాయించుతున్నపుడు, ప్రకృతి శక్తులను అర్థంచేసుకోలేనందున శైశవ దశయందున్న మానవమేధస్సుపై మత విశ్వాసాల రూపంలో అవి ప్రతిబింబించుతున్నపుడు గణసమాజం వర్ధిల్లింది. తనకూ, ఇతరులకూ సంబంధించినంతవరకు మానవుని అభివృద్ధికి తెగయే సరిహద్దుగా వుండిపోయింది. తెగ, గణము, వాటికి సంబంధించిన వ్యవస్థలూ, పవిత్రంగాను, అనతిక్రమణీయమైనవిగాను వుండేవి. అంతకంటే బలాధిక్యత కలిగిన సహజ ప్రకృతి శక్తులముందు బలహీనుడుగానూ, మనోవాక్కాయకర్మలలో పూర్తిగా బానిసగానూ మానవుడు వుండిపోయాడు. ఆదిమ యుగంలోని ప్రజలు మనకు ఆకర్షణీయంగా కన్పించినప్పటికీ, వారిలో ఒండొరులమధ్య ఏమంత తేడా వుండేదికాదు. కార్ల్ మార్క్స్ చెప్పినట్లు ఆదిమ సమాజంయొక్క బొడ్డుతాడుకు అతడు సంధించబడి వుండేవాడు. ఈ ప్రాచీన సమాజంయొక్క బంధనాలను తెంచివేయాలసివుంది: అవి తెంచివేయబడ్డాయి. ప్రాచీన గణసమాజంయొక్క సరళమైన నైతిక ఆధిక్యతనుంచి ఆదినుంచీ పతనమైనట్లుగానే కన్పించే శక్తులచేత ఆ బంధనాలు తెంచివేయబడ్డాయి. స్వార్థ ప్రయోజనాలైన, తుచ్ఛమైన దురాశ, క్రూరమైన కామేచ్ఛ, క్షుద్రమైన పేరాశ, సమష్టి ఆస్తిని దోచుకునే స్వార్థం వగైరా కొత్త నాగరిక, వర్గసమాజపు అతినీచమైన ప్రయోజనాలు ప్రవేశించాయి. దొంగతనం, మానభంగం, దగా, ద్రోహం వగైరా అత్యంత క్రూర పద్ధతుల ద్వారా వర్గరహితమైన పాత గణసమాజం నాశనం చేయబడింది. మరి తత్ఫలితంగా రూపొందిన నూతన సమాజం తన 2,500 సంవత్సరాల అస్తిత్వక్రమంలో అణచివేయబడిన అత్యధిక సంఖ్యాకులను దోచుకోవడం ద్వారా అల్ప సంఖ్యాకులు అభివృద్ధిచెందుతూ వచ్చారు. ఈరోజు సైతం యిదివరకటి కంటే మరింతగా అదే పద్ధతి కొనసాగుతూంది.

## IV

## గ్రీకు గణం

గ్రీకులూ, వారితోపాటు పెలాస్‌గియన్లూ, ఒకే మూల తెగనుండి అభివృద్ధి చెందిన ఇతర ప్రజలూ చారిత్రక దశకు ముందుకాలంనుండీ అమెరికన్లవలెనే — సామాజిక వ్యవస్థలను నిర్మించుకునేవారు: గణం, ఫ్రాట్రీ, తెగ, తెగల సమాఖ్యలు. కొన్ని సమాజాల్లో

ఫ్రాట్రీ (సోదరగణాల కూటమి) లోపించవచ్చు. ఉదాహరణకు డోరియన్లలో యివి లేవు. అలాగే కొన్ని సమాజాల్లో తెగల సమాఖ్యలు యింకా పూర్తిగా అభివృద్ధి చెందివుండక పోవచ్చు. కాని ప్రతి సమాజంలోనూ గణనిర్మాణం మాత్రం వుండి తీరేది. గ్రీకులు చరిత్రలో ప్రవేశించేనాటికి వారు నాగరికతా ప్రాంగణంలో వున్నారు. పై అధ్యాయనంలో వివరించిన అమెరికన్ ఇండియన్లకూ గ్రీకులకూ మధ్య రెండు పెద్ద సామాజిక దశల అంతరం వుంది. ఇరాక్వ్యూలకంటే వీరుల యుగానికి చెందిన గ్రీకులు రెండు దశలను అధిగమించారు. ఈ కారణంవల్లనే ఇరాక్వ్యూ గణాలలో కన్పించే పాతగిలిపోయిన లక్షణాలు గ్రీకుల గణాలలో కన్పించవు. గుంపు వివాహపద్ధతి గణనీయంగా చెదిరిపోయింది. మాతృస్వామ్యం స్థానే పితృస్వామ్య హక్కు అమల్లోకి వచ్చింది. స్వంత ఆస్తి ఏర్పడటంవల్ల గణ సమాజ నిర్మాణానికి మొదటి గండి పడింది. మొదటిదానివెంట సహజంగానే రెండో గండి పడింది: పితృస్వామిక హక్కు ఏర్పడటంతోటే భాగ్యం కలిగిన వారసురాలిని పెళ్లాడిన భర్తకు ఆమె సంపద దఖలుపడటం — అనగా ఒక గణానికి చెందిన ఆస్తి మరో గణానికి దఖలుపడటం ప్రారంభమైంది. అంటే గణ సమాజ శాసనాలకు పునాది బద్దలైపోయింది. అలాంటి సందర్భాలలో ఆ యువతి గణంలోని వానినే వివాహమాడుటకు అనుమతి లభించడమేగాక, ఆస్తి గణంలో ఉంచుకునే దృష్టితో అలా వివాహమాడ్డం తప్పనిసరి అయింది.

గ్రీసుదేశ చరిత్రను రాసిన గ్రోట్, ఏ విధంగా ఎథీనియన్ గణాల ఐక్యత కాపాడబడిందో తెలుపుతూ, అందుకు ముఖ్య కారణాలను ఇలా ఉదహరించాడు:

1. ఉమ్మడి మతకర్మలను నిర్వహించడం, పురోహితుల ప్రత్యేక హక్కు. గణం యొక్క ఆదిమ మూలపురుషుడుగా భావించబడే ఒక ప్రత్యేక దేవుణ్ణి పూజించడం పురోహితుని విధి; దానికి చిహ్నంగా ప్రత్యేక వంశనామం (ఇంటిపేరు).

2. ఉమ్మడి సమాధిస్థలం (డెమోస్థనీస్ రాసిన "ఎబులీడెస్"తో పోల్చి చూడండి.)

3. పరస్పర వారసత్వ హక్కులు.

4. పరస్పరం సహాయం చేసుకొనేందుకు, రక్షించుకొనేందుకు, నష్టాలకు ప్రతిక్రియ చేసేందుకు గణసభ్యులు బాధ్యత వహించాలి.

5. కొన్ని సందర్భాలలో ముఖ్యంగా తలిదండ్రులను కోల్పోయిన కుమార్తెలను లేక సంపదకు వారసురాండ్రను గణంలోనే వివాహం చేసుకునేందుకు పరస్పర హక్కును, బాధ్యతను గుర్తించాలి.

6. కనీసం కొన్ని సందర్భాలలోనైనా ఉమ్మడి ఆస్తిని కలిగి ఉండటం, గణంలో ఒక ఆర్హాన్‌ని, కోశాధికారిని కలిగి వుండటం.

కొన్ని గణాలను ఒక గ్రూపుగా సమీకరించుతున్న ఫ్రాట్రీ కుటుంబంలో అంత సన్నిహిత సంబంధాలు ఉండేవి కావు. కాని యిక్కడ కూడా పరస్పరం పాటించుకునే యిదేమాదిరి

హక్కులు, బాధ్యతలు వుండేవి. ముఖ్యంగా సోదరగణాల కూటమి సభ్యులందరూ కలిసి పాటించే మతకర్మలు, తమలో ఒకడు చంపబడినప్పుడు తీసుకొనే ప్రతీకార చర్యలు ఒకే విధంగా వుండేవి. అలాగే తెగకు చెందిన సోదరగణాల కూటములన్నీ కలిసి నిర్ణీత సమయాల్లో ప్రభువులనుంచి ఎంచుకోబడిన తెగ న్యాయాధీశుని ఆధ్వర్యాన పవిత్ర కర్మలు సమష్టిగా నిర్వహించేవి.

గ్రోట్ రాసిన ప్రాచీన గ్రీసు చరిత్రలోని విషయాలను గమనించాం. వీటినిగురించి మార్క్స్ ఇలా అన్నాడు: "గ్రీకుల గణాలలో (ఉదాహరణకు ఇరాక్వాలలో లాగే) ఆటవిక లక్షణాలు స్పష్టంగా గోచరించుతాయి."* మనం ఇంకా లోతుకు పోయి పరిశీలించినప్పుడు ఈ సంగతి మరింత నిస్సందేహంగా నిరూపితమవుతుంది.

గ్రీకుల గణాలకు ఈ కింది లక్షణాలు కూడా వున్నాయి:

7. తండ్రిహక్కు ప్రకారం వారసత్వం.

8. పెద్ద ఆస్తులకు వారసురాళ్లయ్యే యువతుల విషయంలో తప్ప గణాలలో అంత ర్వివాహం నిషేధింపబడింది. ఈ మినహాయింపూ, దానిని విధిచేయడమూ చూస్తే పూర్వపు నిబంధనలు అమల్లో వున్నాయని తెలుసుకోవచ్చు. దీనినిపట్టి వివాహానంతరం స్త్రీ తాను పుట్టిన గణంలోని మతసంబంధమైన కర్మలను వదలుకొని భర్తయొక్క గణానికి చెందిన మత కర్మలను స్వీకరిస్తుందని, ఆయనకు చెందిన సోదర కూటంలో చేర్చుకోబడుతుందనీ ఇదొక సర్వసాధారణ నియమమనీ తెలుసుకోవచ్చు. దీనినీ, డికెయార్కస్ రాసిన ఒక విష యాన్ని చూస్తే గణానికి వెలుపలనే వివాహం జరగడం నియమమని తెలుస్తుంది. స్త్రీ పురుషు లెవ్వరికీ తమ గణంలోనే వివాహమాడే హక్కు లేదని బెక్కర్ తన "హరిక్లెస్"లో రాశాడు.

9. గణంలోకి కొత్తవారిని దత్తు తెచ్చుకొనే హక్కు; ప్రత్యేక సందర్భాలలోనే దత్తు జరిగేది. దత్తు తెచ్చుకొనేది కుటుంబంలోనికే, కాని బహిరంగ కర్మకాండ కొంత వుంటుంది. అయితే అసాధారణ సందర్భాల్లో మాత్రమే యిది జరిగేది.

10. నాయకులను ఎన్నుకొనే హక్కూ, తొలగించే హక్కూ. ప్రతి గణానికీ ఒక ఆర్హాన్** వుండేవాడని మనం ఎరుగుదుం. అయితే ఈ పదవి ఏవో కొన్ని కుటుంబాల్లో వంశక్రమాను గతంగా వుంటుందనే మాట ఎక్కడా చెప్పబడలేదు. అనాగరిక యుగం ఆఖరువరకూ ఈ హోదాలు వంశక్రమానుగతాలుగా ఉన్నాయని చెప్పేటందుకు ఎక్కడా అవకాశం లేదు.

---

* మార్క్స్ – ఎంగెల్స్, పురావస్తు భాండారం, 9వ సంపుటం, పేజి 134. – సం.

** ప్రాచీన కాలంలో ఏథెన్సులో అత్యున్నత అధికారి. – సం.

గణంలో ధనికులకూ, బీదలకూ సమాన హక్కులే వుంటూ వచ్చిన ఆనాటి పరిస్థితులలో అటువంటి వంశక్రమానుగతములైన హోదాలు వుండటం పూర్తిగా అసంగత విషయం.

ఒక్క గ్రోట్ కాదు, నిబుర్, మోమ్సెన్ వగైరా ప్రాచీనకాలపు చరిత్రకారు లెవ్వరూ ఈ గణ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. విస్పష్టములయిన దాని లక్షణాలు అనేకాన్ని వారు సరిగ్గానే గమనించారు. కాని, మొత్తంమీద వారు గణం అనేది కొన్ని కుటుంబాల సమూహంగా భావించారు. అందువలన దాని స్వభావాన్నీ, దాని మూలాన్నీ పట్టుకోవడం వాళ్లకి అసాధ్యం అయింది. గణనిర్మాణంలో కుటుంబం ఒక యూనిట్‌గా వుండలేదు, వుండజాలదు కూడా. ఏమంటే కుటుంబంలోని స్త్రీ పురుషు లిద్దరూ తప్పనిసరిగా చెరో గణానికీ సంబంధించినవారై వుంటారు. గణం యావత్తూ సోదర కూటం ((ఫ్రాట్రీ)లోనూ, సోదర కూటాలు తెగలోనూ అంతర్భాగాలుగా వుంటాయి. కాని కుటుంబంలో సగం మగవాని గణానిదీ. సగం ఆడుదాని గణానిదీను. రాజ్యం కూడా కుటుంబాన్ని (పబ్లిక్) చట్టరీత్యా గుర్తించదు. ఈనాటికీ సివిల్ న్యాయశాస్త్రంలో మాత్రమే దానికి అస్తిత్వం ఉంది. అయినా కూడా యింతవరకు లిఖిత చరిత్ర యావత్తూ ఒక అసందర్భపు ఊహను—యీ ఊహ 18వ శతాబ్దంలో అనతిక్రమణీయమైనదిగా తయారైంది—విభజన రేఖగా తీసుకొంటూ వచ్చింది. నాగరికతకు ఏమాత్రమూ ముందుది కాని దంపతీ కుటుంబం అనే బీజం చుట్టూరానే సమాజమూ, రాజ్యమూ ఏర్పడి, క్రమంగా దృఢపడ్డాయన్నదే ఆ ఊహ.

"గ్రీకులు తమ గణాలను పురాణగాథలకు ముడిపెట్టినా, పురాణాలలోని దేవతలూ, దేవాంశసంభూతులూ కన్న గణాలే ప్రాచీనమనీ, ఆ దేవతలను వారే కల్పించుకొన్నారనీ గ్రోట్ గమనించడం మంచిది"* అన్నాడు మార్క్స్.

ప్రముఖుడూ విశ్వసనీయుడూ అయిన సాక్షిగా గ్రోట్‌ను మోర్గన్ తరుచుగా వుదహరిస్తుంటాడు. ఏథెన్సులోని ప్రతి గణాన్నీ సుప్రసిద్ధుడైన పూర్వపురుషునిపేర పిలిచేవారని ఆయన రాస్తున్నాడు. సోలోన్ కాలానికి ముందు విధిగానూ, అటు తర్వాతా తన ఆస్తి విషయమై వీలునామా రాయకుండా మనిషి మరణిస్తే ఆయన గణంవారికే ఆస్తి సంక్రమించేది. ఏ వ్యక్తి అయినా హత్యచేయబడితే అతని దగ్గిర బంధువులు, వారు లేకపోతే అతని గణంలోనివారూ, వారు కాకుంటే సోదర కూటమివారూ దోషిని న్యాయ స్థానానికి తెచ్చే హక్కు బాధ్యతలు కలిగి వుంటారు;

> "అతి ప్రాచీనములైన ఎథీనియన్ చట్టాలు గణ, సోదర కూట విభజనల మీదనే ఏర్పడి వున్నట్లు కనబడుతుంది...."

---

* మార్క్స్—ఎంగెల్స్, పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజి 136.—సం.

గణ సభ్యులందరికీ మూలపురుషు డొకడే అనేది "శుష్క పండితులకు" చిక్కు సమస్య అన్నాడు మార్క్స్. సహజంగానే, యీ పూర్వపురుషులు వట్టి పురాణగాథ అని వారి అభిప్రాయం కనుక ఆదిలో బొత్తిగా పరస్పర సంబంధం లేని వేర్వేరు కుటుంబాలనుంచి గణవ్యవస్థ ఎలా ఏర్పడిందో వారు చెప్పలేకున్నారు. కనీసం గణాల అస్తిత్వాన్ని వివరించేందుకైనా, వాళ్లు దీన్ని ఏదో విధంగా సాధించాలి. ఇంక మాటల సుడిగుండంలోపడి సుళ్లు తిరుగుతారు. "మూలపురుషుడు అభూత కల్పనే. కాని గణం అన్నది సత్యం" అనేమాట ఒక్కటే వల్లిస్తున్నారు. చివరకు గ్రోట్ యిలా అంటాడు (బ్రాకెట్లలో వ్యాఖ్యలు మార్క్స్‌వి):

> "ఈ వంశానుక్రమాన్ని గురించి — కొన్ని ప్రాముఖ్యమైన, పవిత్రమైన సందర్భాల్లో, మాత్రమే అది జనం ముందు ప్రస్తావింపబడుతుంది కనుక — మనం అరుదుగా మాత్రమే వింటాం. ఉన్నత గణాల మాదిరిగానే సామాన్య గణాలకు కూడ ఉమ్మడి కర్మకాండ [విచిత్రం కదూ, గ్రోట్‌గారూ!], ఉమ్మడి మానవాతీత మూలపురుషుడూ, వంశవృక్షమూ వుంటాయి [సామాన్యతర గణాలలో ఉండడం ఎంత విడ్డూరం గ్రోట్‌గారూ!]. నిర్మాణమూ, ఆదర్శ ప్రాతిపదికా ఒక్కటే [అయ్యా, ideal కాదండి, carnal— మన భాషలో దైహికం!]."*

దీనికి మోర్గన్ యిచ్చిన సమాధానాన్ని క్రోడీకరించి మార్క్స్ ఇలా రాశాడు: "గణాల ప్రప్రథమ రూపానికి అనుగుణమైన రక్తసంబంధాల వ్యవస్థ ఇతర మానవులందరికి వలెనే గ్రీకులకు కూడా వుండేది. అది గణ సభ్యులందరిలో వారి పరస్పర బంధుత్వ పరిజ్ఞానాన్ని భద్రపరిచేది. చిన్నతనంనుంచీ అలవాటుగా ఈ అతి ప్రధాన విషయాన్ని వారు నేర్చుకొంటారు. దంపతీ వ్యవస్థ వచ్చాక ఇది మూలబడింది. గోత్ర నామంతో ఒక వంశ పారంపర్యత లభించేది. దానితో పోల్చి చూస్తే విడి దంపతీ కుటుంబం అప్రముఖంగా కనిపించేది. ఆ పేరుగల వారందరికీ పూర్వ పురుషు డొక్కడేనని ఆ పేరు గుర్తు చేస్తూంటుంది. కాని గణాలలో వంశ పారంపర్యత బాగా దీర్ఘం అయిపోయాయి. వాటిలోని సభ్యులిప్పుడు తమ పరస్పర బంధుత్వాన్ని చెప్పకోవడం కూడా కష్టమైపోయింది. ఏవో కొద్ది సందర్భాలలో కొద్దికాలం క్రితమేవున్న మూలపురుషులు ఉంటే మాత్రమే బంధుత్వాన్ని చెప్పకోగలుగుతారు. దత్తతచేసుకొన్న సందర్భాలలో తప్ప ఆ పేరే వారందరికీ మూలపురుషు

---

* మార్క్స్ — ఎంగెల్స్, పురాపత్ర భాండారం, 9వ సంపుటి, పేజి 136. — సం.

డొకడేనని చెప్పేటందుకు బలమైన సాక్ష్యం. గ్రోట్*, నిబుర్‌లు గణసభ్యులమధ్య బంధుత్వం లేదనడంతో అసలు గణాలే అభూతకల్పనగా తోసేసినట్లయింది. పుస్తకాల పురుగుల్లాంటి ఆదర్శ విజ్ఞానశాస్త్రవేత్తలే ఇటువంటి పని చెయ్యగలరు. దంపతీ వ్యవస్థ రాకతో తరతరాలుగా పేర్కొనే వంశవృక్షం మరీ దూరం అయిపోయింది. గత కాలంనాటి విషయాలన్నీ ఇంక పురాణ గాథలలో ప్రతిబింబించ వలసినదే. ఫలితంగా కాల్పనిక వంశవృక్షాలే వాస్తవ గణాల్ని సృష్టించాయనే అభిప్రాయానికి వచ్చారీ అజ్ఞానులు. ఇప్పటికీ అదే వల్లిస్తున్నారు.''**

అమెరికనులలో లాగ ఏక మాతృకమయిన గణం, అనేక దుహితృగణాలుగా విడివడి ఫ్రాట్రీ అయింది. విడిపోయిన గణాలను కలుపుతూ, వారికందరకూ మూలవ్యక్తి ఒక్కరే ననే విషయాన్ని అది జ్ఞాపకం చేస్తూంది.

> ''హెకటెయస్ సోదర కూటంలో ఈనాడున్న వారందరూ పదహారు పురుషాంతరాలక్రితం ఒకే దేవుడినుంచి వచ్చా''రని గ్రోట్ రాశాడు.

అందుచేత, ఈ సోదర కూటంలోని గణాలన్నీ అక్షరశః సహోదర గణాలే. హోమర్ ఈ సోదర కూటాన్ని ఒక సైన్యదళం (యూనిట్)గా పేర్కొన్నాడు. నెస్టార్ అనేవాడు అగమేమ్నన్‌కు చేసిన హితోపదేశం ఇది: ''సైన్యాలను తెగలవారీగానూ, సోదర కూటాల వారీగానూ వరుసలుగా నిలబెట్టు, అప్పుడు సోదర కూటం సోదర కూటానికీ, తెగ తెగకూ వత్తాసునిస్తాయి.''***

తోడి సోదరకూటం వాడిని చంపినప్పుడు హంతకుణ్ణి న్యాయాధిపతిముందు పెట్టడం సోదర కూటంయొక్క ధర్మం, హక్కూ కూడ. ప్రాచీన కాలంలో సోదర కూటానికి రక్త ప్రతీకారం ప్రతిక్రియా బాధ్యత వుండేదనడాని కిది నిదర్శనం. అంతేకాదు, ఆ కూటమిలోని వారందరికీ – పుణ్యస్థలాలూ, మతోత్సవాలూ ఒక్కటే. ప్రకృతిని ఆరాధించే ప్రాచీన కాలపు ఆర్య సంస్కృతినుంచి గ్రీకు పురాణగాథా శతం పరిణతి పొందడానికి మూలం ఈ గణాలూ, సోదర కూటాలే. వానిద్వారా, వానిలోనే ఇవి వృద్ధి పొందాయి. సోదర కూటానికీ అధిపతి (phratriarchos) ఉంటాడు. సోదర కూటాల సమావేశాలు చేసే నిర్ణయాలను అందరూ పాటించ వలసిందేననీ, అది ఒక న్యాయనిర్వహణ, పాలక సంస్థగా

---

* మార్క్స్ రాతప్రతిలో పోలక్స్ అని పేర్కొనబడింది. 2వ శతాబ్దానికి చెందిన యీ గ్రీకు పండితుని పేరును గ్రోట్ పదేపదే ఉదహరించాడు. – సం.

** మార్క్స్ – ఎంగెల్స్, పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజీలు 138–139. – సం.

*** హోమర్, '''ఇలియడ్,'' గీతం II. – సం.

వ్యవహరిస్తుందనీ, కులాంజ్ రాస్తున్నాడు. తర్వాత తర్వాత ఏర్పడిన రాజ్య వ్యవస్థ గణాలను ఉపేక్షించినా, సోదర కూటాలకున్న సార్వజనిక క్రియాకలాపాన్ని వానికే వదలిపెట్టింది.

సన్నిహిత బంధుత్వం వున్న సోదర కూటాలు కొన్ని కలిసి తెగ అవుతుంది. అత్తికాలో నాలుగు తెగ లుండేవి. ఒక్కొక్క తెగలో మూడేసి సోదర కూటాలుండేవి. ఒక్కొక్క సోదర కూటంలో ముప్ఫయ్యేసి గణాలుండేవి. దానంతటదే రూపొందుతున్న నిర్మాణంలో బుద్ధి పూర్వకంగా కలుగచేసుకొని ఒక పద్ధతి ప్రకారం దానిని ఏర్పాటు చేశారనడానికి గణాలూ, సోదర కూటాలూ విభజన ఇంత ఖచ్చితంగా వుండడాన్నిబట్టి గ్రహించవచ్చును. ఈ పని ఎప్పుడు జరిగింది? ఎందుకు జరిగింది? అనే విషయాన్ని గ్రీసుదేశపు చరిత్ర చెప్పదు. ఏమంటే వీరయుగానికి పూర్వంనాటి విషయాలు గ్రీకులకే జ్ఞాపకం లేవు.

గ్రీకు ప్రజలు ఒక చిన్న దేశంలో చాలా ఒత్తుగా నివసించేవారు. అందుచేత వారి మాండలికాలలో తేడా అంత విస్పష్టంగా కనబడలేదు. విశాలమైన అమెరికన్ అడవులలో జీవించినవారిలో ఈ తేడా చాలా స్పష్టంగా కనిపిస్తుంది. అయినా గ్రీసులో కూడా ఒకే ప్రధాన మాండలికం మాట్లాడే తెగలు మాత్రమే ఐక్యంగా జీవించడాన్ని మనం చూస్తాం. ఆఖరుకి చిన్న అత్తికాకు కూడా ఒక ప్రత్యేకమైన మాండలికం వుంది. అదే క్రమంగా గ్రీసుదేశపు వచన సాహిత్యంలో ప్రధాన భాషగా రూపొందింది.

హోమర్ రాసిన మహా కావ్యాలను చదివితే, ఆనాటికే గ్రీకు తెగలు చిన్న చిన్న జాతులుగా ఏకం అయ్యాయనీ, అయినా ఇంకా గణాలు, సోదర కూటాలు, తెగలు తమ తమ స్వాతంత్ర్యాన్ని పూర్తిగా అనుభవిస్తూనే వున్నాయనీ కనబడుతుంది. అప్పటి కానాటికే వారు ప్రహరీగోడలున్న పట్టణాలలో నివసిస్తున్నారు. మందలు, వ్యవసాయం, వృద్ధిపొంది, చేతివృత్తులు ప్రారంభం అయినాయి. దానితో జనసంఖ్య పెరిగింది. సంపన్నతలో హెచ్చు తగ్గులు అధికమయ్యాయి. తత్ఫలితంగా ప్రాచీనకాలపు ఆదిమ ప్రజాతంత్ర వ్యవస్థలో కులీనులంటూ కొందరు తలఎత్తారు. మంచి భూమికోసమూ, దోపిడికోసమూ చిన్న చిడి జాతులు నిరంతరం యుద్ధాలు చేస్తూండేవి. యుద్ధంలో చేజిక్కినవారిని బానిసలుగా పట్టే వుంచుకోవడం ఆనాటికే ఆచారమైంది.

ఈ తెగలలోనూ, చిన్న జాతులలోనూ నిర్మాణం ఈదిగువ మాదిరిగా వుండేది:

1. శాశ్వతమైన అధికార సంస్థ <u>సమితి</u> (bulê). గణ నాయకులు ప్రథమంలో సమితి సభ్యులుగా వుండేవారు. కాలక్రమేణా వారి సంఖ్య బాగా పెరిగింది. ఇంక సమితిలోకి సభ్యుల్ని ఏరి తీసుకొనేవారు. దానితో సమితిలో కులీనశక్తులు అభివృద్ధిచెంది, బలపడేందుకు అవకాశం ఏర్పడింది. వీరయుగం నాటి సమితిలో కులీనులు (kratistoi) సభ్యులుగా వుండేవారని డియొనీసియన్ స్పష్టంగా రాస్తున్నాడు. ప్రధాన విషయాలన్నింటా సమితిది అంతిమ నిర్ణయాధికారం. ఎటియోక్లస్ శరీరాన్ని సకల మర్యాదలతో ఖననం చేయాలనీ, పాలినీకెస్

శరీరాన్ని కుక్కలు పీక్కుతినేటట్లు పారెయ్యాలనీ థెబెస్‌లోని సమితి ఆజ్ఞాపించినట్లు ఎస్కిలస్ రాశాడు.* తర్వాత కాలక్రమేణా రాజ్యం ఏర్పడ్డప్పుడు, ఈ సమితి శాసన సభగా మార్పుచెందింది.

2. ప్రజాసభ (agora). ఇరాక్వ్యాలలో స్త్రీ పురుషులందరూ సమితి సమావేశం అప్పుడు చుట్టూ నిలబడి వుండేవారనీ, చర్చలలో క్రమబద్ధంగా పాల్గొంటూ దాని నిర్ణయాలు రూపొందడంలో సాయపడేవారనీ మనం చూశాం. హోమర్ కాలంనాటి గ్రీసు దేశీయులలో, పాత జర్మన్ న్యాయసంస్థ పరిభాషను ఉపయోగిస్తే ఈ Umstand (చుట్టూ నిలబడి వుండేవారు) ఒక పూర్తి ప్రజాసభగా పరిణతి పొందింది. ప్రాచీన కాలపు జర్మన్లలోనూ అంతే. ప్రధానమైన విషయాలను నిర్ణయించవలసివచ్చినప్పుడు సమితి ఈ మహాసభను సమావేశపరిచేది. దానిలో ప్రతి మగవానికీ మాట్లాడేహక్కు వుంది. ("అర్థించేవాళ్ల"లో ఎస్కిలస్ చెప్పినట్లు) చేతులు ఎత్తడం ద్వారా తీర్మానాలు ఆమోదించ బడ్డాయి. ఒకప్పుడు ఔను – కాదు ద్వారా తేల్చేవారు. ఈ ప్రజాసభది అంతిమ నిర్ణయం. ఈ విషయాన్నే షోమన్ "గ్రీసు ప్రాచీనాచారాలు" అనే తన గ్రంథంలో ఇలా రాశాడు:

> "ప్రజల సహకారం అవసరమయ్యే విషయాన్ని చర్చించినప్పుడు వారి కిష్టంలేని దానిని నెత్తిన రుద్దినట్లు హోమర్ ఎక్కడా చెప్పలేదు."

ఆ రోజుల్లో తెగలో వయసువచ్చిన ప్రతి మగవాడూ ఒక యోధుడు. ప్రజలకు అతీతంగా, వారికి వ్యతిరేకంగా వుండే ప్రభుత్వాధికారం ఏదీ అప్పటికి లేదు. ప్రాచీన ప్రజా తంత్ర వ్యవస్థ అప్పటికింకా మంచి ఉచ్చదశలో వుంది. సమితియొక్కా, బాసిలస్‌యొక్కా అధికారం, హోదా తెలుసుకోవాలంటే దీనిని గమనించాలి.

3. సైనికాధికారి (basileus). ఈ విషయమై మార్క్స్ చేసిన వ్యాఖ్య యిది: "జన్మాదీ రాజవంశీకుల నౌకర్లుగా వ్యవహరిస్తున్న యూరపు ఖండపు విద్వాంసులు బాసిలస్‌ను రాజుగా (ఈనాటి అర్థంలో) పేర్కొంటున్నారు. అమెరికా దేశీయుడైన మోర్గన్ (రిపబ్లిక్ పక్షపాతి) కాదంటున్నాడు. ఇచ్చకాలమారి గ్లాడ్‌స్టన్‌నూ, ఆయన పుస్తకం 'ప్రపంచపు యువావస్థ'నీ విమర్శిస్తూ వ్యంగ్యంగానే అయినా వాస్తవికంగా యిలా అన్నాడు:

> " 'వీరయుగంనాటి గ్రీకు సేనాధిపతులను గ్లాడ్‌స్టన్ పెద్దమనిషి లక్షణాలున్న రాజులూ, రాజకుమారులూ అంటున్నాడు. అయితే మొత్తంమీద గ్రీకులలో జ్యేష్ఠాధికారానికి సంబంధించిన ఆచారంగాని, చట్టంగాని ఉన్న సంగతి స్పష్ట మని ఆయన అంగీకరిస్తున్నాడు. కాని అది పూర్తి స్పష్టంగా లేదంటున్నాడు.' "**

* ఎస్కిలస్ "థెబ్స్‌కు వ్యతిరేకంగా ఏడుగురు." – సం.

** మార్క్స్ – ఎంగెల్స్, పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజి 143. – సం.

వాస్తవానికి అటువంటి జ్యేష్ఠత్వ వ్యవస్థ తగుమాత్రంగానే తప్ప అత్యంత సునిశితంగా నిర్వచింపబడనప్పుడు, అది అసలు లేనట్లేనన్న సంగతిని గ్లాడ్‌స్టన్‌గారు స్వయంగా గ్రహించే వుండాలి.

ఇరాక్వ్యూలలోనూ, ఇతర ఇండియనులలోనూ సాకెములా నాయకులా పారంపర్యతను గురించి పైన తెలుసుకున్నాం. వుద్యోగులందర్నీ చాలావరకు గణాలలోనే ఎన్నుకొనేవారు. కనుక వారు ఆ గణాలనుంచే పారంపర్యంగా వచ్చేవారు. ఖాళీవచ్చినప్పుడు దానిలో వెనుకటి వాని సన్నిహిత గణబంధువును నియమించడం క్రమంగా వచ్చింది. సాధారణంగా తమ్ముణ్ణో, మేనల్లుణ్ణో నియమించేవారు, ఏదో పెద్ద కారణం వుంటేతప్ప అతనిని కాదనడం వుండేదికాదు. గ్రీసులో తండ్రిహక్కు గుర్తించబడడంచేత ఆ హక్కు ప్రకారం బాసిలెసు పదవి కొడుక్కు లేక కొడుకుల్లో ఒకనికి సంక్రమించేది. అంటే తర్వాత అధికారిని ప్రజలు ఎన్నుకొన్నా సాధారణంగా కొడుకులనే ఎన్నుకొనేవారని దీనినిబట్టి గ్రహించవచ్చును. అయితే అంతమాత్రాన ప్రజలు ఎన్నుకోనవసరం లేకుండా చట్టరీత్యానే వారసత్వం కొడుక్కు వచ్చేస్తూందనుకోకూడదు. గ్రీకులలోనూ, ఇరాక్వ్యూలలోనూ కూడ గణాలలోనే ప్రత్యేకంగా కులీన కుటుంబాలు ఏర్పడడానికి ప్రాతిపదిక ఇక్కడ మనకు కనబడుతుంది. గ్రీకులలో నాయకత్వమూ, రాజరికమూ భవిష్యత్తులో వంశపారంపర్యం అయ్యేటందుకు కావలసిన ప్రాతిపదిక ఏర్పడ్డట్టే కనబడుతుంది. గ్రీకులలో బాసిలెసును ప్రజలు ఎన్నుకొంటున్నారను కోవలసి వుంది. లేక కనీసం రోమనులలో "రాజు" (rex) విషయంలో జరిగినట్లు సమితియో, ప్రజాసభో — సర్వాధికారం వుందన్న సంస్థ ఏదో ఒకటి — ఆ అధికారాన్ని ధృవపరచవలసి వుండేది.

"ఇలియడ్" కావ్యంలో అగమేమ్నన్ గ్రీకు ప్రజలకు సర్వాధికారి అయిన రాజుగా గాక, ఒక నగరాన్ని ముట్టడిస్తున్న సమాఖ్య సైన్యాల సర్వ సైన్యాధ్యక్షుడుగా కనిపిస్తాడు. ఒడిస్సస్ ఈ విషయాన్నే ప్రసిద్ధమైన గ్రంథభాగంలో యిలా పేర్కొంటాడు: గ్రీకులలో అంతఃకలహం వచ్చినప్పుడు బహుజన పరిపాలన క్షేమంకాదు, ఒకరిని పరిపాలకుడుగా పెట్టుకుందాం వగైరా — (రాజదండం మాట తర్వాత తర్వాత చేర్చిన ప్రక్షిప్తం.)* దీనిమీద మార్క్స్ ఇలా వ్యాఖ్యానించాడు. "ప్రభుత్వం ఏ రూపంలో వుండాలనే విషయం మీద ఒడిస్సస్ ఇక్కడ ఉపన్యసించడంలేదు. యుద్ధరంగంలో సర్వసేనాధిపతి ఆజ్ఞలకు కట్టుబడి వుండాలని కోరుతున్నాడాయన. ట్రాయ్ నగరం ముందు గ్రీకులు సైనికులుగా వచ్చారు. అగోరా (ప్రజాసభ) కార్యక్రమాలు బాగా ప్రజాతంత్ర పద్ధతులలోనే సాగుతున్నాయి. బహుమతులను — అంటే దాడులలో చేజిక్కినవానిని పంచిపెట్టవలసి వచ్చినప్పుడు

* హోమర్, "ఇలియడ్," గీతం II. — సం.

అఖిల్లెస్ ఆ పనిని అగమేమ్నన్‌కో, మరో బాసిలసుకోగాక 'అకాయియనుల సంతానానికి' — అంటే ప్రజలకు వప్పచెప్తున్నాడు. 'జియస్‌వంశీకు'డనీ 'జియస్ పరిపోషితు'డనీ ఎవరికన్నా విశేషణం తగిలించినందువలన వచ్చే ప్రత్యేకత ఏమీలేదు. ఏమంటే, ప్రతి గణమూ ఎవరో ఒక దేవుని సంతానమే. తెగ నాయకుని గణం ఒక ప్రసిద్ధుడైన దేవత సంతానంగా భావించేవారు. ఇక్కడ ఆ 'ప్రసిద్ధుడైన' దేవుడు 'జియస్.' 'ఇలియడ్' తర్వాత చాలాకాలానికి రాయబడిన 'ఒడిస్సే' కావ్యంలో కూడా పందులకాపరి ఎవ్మేయస్‌వంటి క్రీతదాసుల్ని కూడా 'దైవాంశ సంభూతులు' (dioi, theioi) అనే వర్ణించారు. వందిమాగధి ములియోసునూ, అంధగాయకుడు డెమొడోకస్‌నూ 'హీరో'లని పిలవడం 'ఒడిస్సే' కావ్యంలో కనబడుతుంది.* హోమరు రాజులనుగా వర్ణించిన వారిని గ్రీకు రచయితలు 'బాసిలస్'లని పేర్కొంటున్నారు. (ఏమంటే హోమరు వర్ణించిన రాజుల ప్రధాన లక్షణం సైన్యాధిపత్యం.) ఈ రాజులతోపాటు సమితీ, ప్రజాసభ కూడ పనిచేస్తూండేవి. దీనినిపట్టి అదొక 'సైనిక ప్రజాతంత్రం' అనుకోవలసి వుంది." (మార్క్స్.)**

బాసిలస్‌కు సైనిక బాధ్యతలేకాదు. పురోహితుడూ, న్యాయాధికారీ కూడ ఆయనే. న్యాయాధికారిగా నిర్వహించవలసిన బాధ్యతలను గురించి స్పష్టంగా ఎక్కడా చెప్పబడలేదు. కాని తెగయొక్క ముఖ్య ప్రతినిధిగానో తెగల సమాఖ్యయొక్క ముఖ్య ప్రతినిధిగానో ఆయన పురోహితుని బాధ్యతలను నిర్వర్తించవలసి వుంటుంది. పౌర, పరిపాలనా బాధ్యతలను గురించి ఎక్కడా చెప్పలేదు. కాని, సమితిలో ఆయన ఉద్యోగరీత్యా ప్రతినిధిగా పాల్గొంటాడు. శబ్దశాస్త్రరీత్యా చూస్తే బాసిలస్ అనే జర్మన్ మాటను König అని అనువదించడం సరియైనదే. König (Kuning) అనేది Kuni, Künne పదాలనుంచి వచ్చింది. వాటికి అర్థం గణానికి పెద్ద. అయితే ప్రాచీనకాలంనాటి గ్రీకు దేశీయుల బాసిలసుకు ఈనాడు మనం König (రాజు) అనే మాటకు చెప్పే అర్థం చెల్లదు. థుసిడిడెస్ ప్రాచీనకాలపు basileia patrikê అని స్పష్టంగా పేర్కొన్నాడు. అంటే అతనికా అధికారం గణంనుంచి లభించిందన్నమాట. ఆ పదవి అధికారాలు నిర్దిష్టం చేయబడ్డాయని, అంటే పరిమితం చేయబడ్డాయని ఆయన రాశాడు. వీరయుగంనాడు బాసిలసు స్వతంత్ర ప్రజమీద నాయకుడు అనీ, అతడు సైన్యాధిపతి, న్యాయాధిపతి, ప్రధాన పురోహితుడుగా వ్యవహరి

---

* మార్క్స్ రాతప్రతిలో ఎంగెల్స్ వదిలేసిన వాక్యభాగం యిలా వుంది: "బాసిలస్ మాదిరిగానే, అగమేమ్నన్ విషయంలో ఒడిస్సస్ వాడిన కోయిరనోస్ **χοιρανος** అన్న పదానికి కూడా అర్థం సేనాధిపతి అని మాత్రమే. — సం.

** మార్క్స్ – ఎంగెల్స్, పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజీలు 144–145. — సం.

స్వాడనీ అరిస్టాటిల్ రాస్తున్నాడు. అందుచేత బాసిలసుకు ఈనాడు మనం చెప్పే అర్థంలో ప్రభుత్వాధికారం లేదు.*

ఈ విధంగా వీరయుగంనాటి గ్రీకు వ్యవస్థలో ప్రాచీనకాలపు గణసంఘ పద్ధతి ఇంకా బలీయంగా వున్నట్లే మనకు తెలుస్తూంది. అయితే రెండో వేపున దాని శైథిల్యారంభ లక్షణాలు కూడా కనబడుతూనే ఉన్నాయి. తండ్రిహక్కు ఏర్పడింది. మగవాని సంతానానికే ఆస్తి వారసత్వం వచ్చింది. దానితో కుటుంబంలో ఆస్తి పోగుబడింది. ఆ ఆస్తి వల్ల గణంకన్న కుటుంబం బలపడింది. ఆస్తిలో హెచ్చు తగ్గులతో సాంఘిక నిర్మాణంలో కూడా మార్పు వచ్చింది. వంశక్రమానుగతమైన కులీన వ్యవస్థకూ, రాజరికానికీ ప్రాతిపదికలు ఏర్పడ్డాయి. బానిసత్వం ప్రత్యక్షమయింది. మొట్టమొదట యుద్ధ ఖైదీలకు మాత్రమే ఇది పరివ్యాప్తం. క్రమంగా తమ తెగలోనివారినీ, తమ గణంలోనివారినీ కూడ బానిసల్ని చేయసాగారు. పూర్వం తెగల మధ్యనే ఘర్షణలు వుండేవి. ఇప్పుడు జీవనాధారం కోసం, పశువుల్నీ, బానిసల్నీ, ఇతర సంపదల్నీ దోచి తెచ్చుకొనేటందుకోసం పనికట్టుకొని దాడులూ, దండయాత్రలూ సాగిస్తున్నారు. సంగ్రహంగా చెప్పాలంటే సంపదలకు మెప్పు లభించింది. ధనం సర్వసమ్మాన్యం అయింది. సంపదలను బలాత్కారంగా దోచుకొనేటందుకు వెనుకటి గణ సంఘ అంగాలనే ఉపయోగించుకొంటున్నారు. అప్పటికున్న లోపం అల్లా ఒక్కటే. గణసంఘంలోని సామూహిక పద్ధతులకు వ్యతిరేకంగా వ్యక్తులు పోగుచేసుకొన్న ఈ కొత్త సంపదలను కాపాడి, గతంలో ఎంతో చులకనగా చూడబడే వ్యక్తిగత ఆస్తిని పవిత్ర మైనదిగా స్థిరపరచి ఆ పవిత్రతను కాపాడడమే మానవ సమాజంయొక్క ప్రధానగమ్యంగా ప్రకటించే వ్యవస్థ కావాలి. అంతేకాకుండా, ఆస్తులు సంపాదించేటందుకు అనుసరిస్తున్న

---

* గ్రీకు దేశీయుల బాసిలసును గురించి చెప్పినట్లే అజ్టెక్ తెగవారి సేనానాయకుణ్ణి కూడా అధునాతనార్థంలో రాజు అని పొరపాటుగా పేర్కొన్నారు. ప్రారంభంలో ఈ విషయం సరిగా అర్థంగాక స్పెయిన్ దేశీయులు అతిశయోక్తులు చెప్పారు. దాని తర్వాత తర్వాత బుద్ధి పూర్వకంగానే తప్పుచెప్పారు. ఈ రిపోర్టులను మొట్టమొదటి మారు చారిత్రక దృష్టితో విమర్శించినవాడు మోర్గనే. మెక్సికోవాసులు అనాగరిక యుగపు నడిమి దశలో జీవిస్తున్నారనీ, అయితే న్యూమెక్సికోలోని పాబ్లో ఇండియనులకన్న ఉన్నత దశలోనే ఉన్నారనీ చెప్పాడు. వక్రీకరింపబడిన రిపోర్టుల్ని పట్టిచూస్తే వారి నిర్మాణం ఈ విధంగా ఉన్నట్లు కనబడుతుంది. మూడు తెగల సమాఖ్య (కాన్ఫెడరసీ) ఏర్పడివుండేది. తదితర తెగలు యెన్నో ఆ సమాఖ్యకు సామంత తెగలుగా వుండేవి. ఈ సమాఖ్యకు ఒక సమాఖ్య సమితి, సమాఖ్య సైన్యాల నాయకుడు వుండేవారు. స్పెయినువారు ఆ నాయకుణ్ణే "చక్రవర్తి" అన్నారు. (ఎంగెల్స్ వివరణ.)

నవీన పద్ధతులకు, సంపదల నిరంతరాభివృద్ధికి సమాజంయొక్క ఆమోదముద్ర వేసి, సమాజంలో కొత్తగా తలయెత్తుతున్న వర్గవిభజననే కాకుండా, ఆస్తిపరుల వర్గం ఆస్తిలేని వర్గాలను దోచుకొని, పాలించే హక్కును కూడా శాశ్వతంగా సాగనిచ్చే సంస్థ కావాలి.

ఆ మాదిరి సంస్థ అవతరించింది. రాజ్యం సృష్టించబడింది.

## V

## ఏథీనియన్ రాజ్యావిర్భావం

రాజ్యం అనేది ఏ విధంగా క్రమంగా అభివృద్ధి పొందిందో ప్రాచీనకాలంలో ఏథెన్సులో జరిగిన పరిణామాల్ని చూస్తే అర్థం అవుతుంది. గణవ్యవస్థకు చెందిన కొన్ని సంస్థలు మారాయి. వానిలో కొన్నింటిస్థానే నూతన సంస్థలు ఏర్పడ్డాయి. చివరకు అన్నింటినీ తొలగించి ప్రభుత్వోద్యోగులు ఆధిపత్యం వహించారు. వాస్తవంగా "సాయుధులైన ప్రజలు" గతంలో గణాలు, సోదర కూటాలు, తెగల ద్వారా ఆత్మరక్షణ చేసుకొనేవారు. ఇప్పుడు ప్రభుత్వాధికారుల అధీనంలో, ప్రజానీకానికి వ్యతిరేకంగా ఉపయోగించడానికిగాను సాయుధమైన "ప్రభుత్వ అధికారం" ఆ సాయుధప్రజ స్థానాన్ని ఆక్రమించింది. ఈ మార్పులన్నీ ప్రాచీనకాలపు ఏథెన్సుకేసి చూస్తే బాగా తెలుస్తాయి. వస్తూవున్న ఈ మార్పుల స్వరూపాన్ని ముఖ్యంగా మోర్గన్ వర్ణించాడు. ఆ మార్పులకు కారణభూతమైన ఆర్థిక ప్రాతిపదికను చాలవరకు నేను చేర్చాను.

ఏథీనియను తెగలు నాలుగూ వీరయుగం నాటికి ఇంకా అత్తికాలో వేర్వేరు భాగాలుగా నివసిస్తూ వుండేవి. ఆ తెగల తాలూకు పన్నెండు సోదర కూటాలు కెక్రోప్సుయొక్క పన్నెండు నగరాలలో వేరేవేరే నివసిస్తున్నాయి. వీరయుగంనాటి నిర్మాణమే వాని కుండేది: ఒక ప్రజా సభ, ప్రజా ప్రతినిధుల సమితి, బాసిలెసు. లిఖితరూపంలో చరిత్ర లభిస్తున్న కాలంనాటికి అప్పుడే భూమి పంపిణీ జరిగిపోయింది. అది వ్యక్తిగత ఆస్తిగా పరివర్తన పొందింది. అంటే అనాగరిక యుగపు ఉన్నత దశ ముగిసే కాలంనాటికి అనుగుణమైన దశ అది. ఆనాటికి వర్తకపు సరుకుల వుత్పత్తి బాగా పరిణతి పొందింది. దానికి అనుగుణంగానే వ్యాపారమూ వృద్ధి పొందింది. కాయ ధాన్యాలను పండించడానికి తోడు ద్రాక్షాసవం, నూనె తీయడం జరుగుతూంది. ఈజియన్ సముద్ర వ్యాపారం అంతకంతకు అధికంగా ఫొనీషియనుల చేతినుంచి అత్తిక్‌ల చేతికి జారిపోతూంది. భూముల్ని అమ్మకొనడం, కొనుక్కోవడం,

వ్యవసాయం, చేతివృత్తులూ వీటిమధ్య శ్రమవిభజన పంపిణీ, వ్యాపారం, నౌకాయానం మొదలైన వాని ఫలితంగా గణాలు, సోదర కూటాలు తెగలలోని ప్రజలు పరస్పరం కలిసిపోయారు. సోదర కూటాలకూ, తెగలకూ చెందిన మండలాలలోకి పైవారు చాలమంది వచ్చి చేరారు. ఆ విధంగా చేరినవారు స్వదేశీయులే అయినా ఆయా నిర్మాణాలకు చెందినవారుకారు. అందుచేత తమ యింట్లోనే వారు పరాయివారుగా పరిగణించబడతారు. శాంతి కాలంలో ఏథెన్సులోని బాసిలసునుగాని, ప్రజా ప్రతినిధుల సభనుగాని సంప్రతించకుండానే తెగలూ, సోదర కూటాలూ తమ వ్యవహారాలను తాము నిర్వహించుకొనేవి. అయితే ఆ తెగకూ, సోదర కూటానికీ సంబంధించని జనానికి వారి నిర్వహణలో పాత్ర వుండక పోవడం సహజమే.

గణ సంఘానికి చెందిన పరిపాలనాంగాల క్రమపద్ధతి పనితీరుని అది యెంత గంద్రగోళ పరిచిందంటే వీరయుగం నాటికే దానిని మార్చుకోవలసిన అవసరం ఏర్పడింది. నూతన వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీనిని తెసెయస్ ఏర్పరచాడంటారు. ఏథెన్సులో కేంద్రపరిపాలనా సంస్థను ఏర్పరచడం ఈ మార్పులోని ప్రధానాంశం. అంటే ఇంతవరకూ తెగలు తమంత తాముగా చూసుకొంటున్న బాధ్యతలను కొన్నింటిని, అందరికీ సంబంధించిన వ్యవహారాలనుగా ప్రకటించారు. వాని బాధ్యతను ఏథెన్సులో వుండే సార్వజనిక సమితికి వప్పజెప్పారు. అమెరికాలోని ఆదివాస ప్రజలెవ్వరూ ఎప్పుడూ వేసివుండని ముందడుగు ఎథీనియనులు వేశారు. ఇరుగుపొరుగు తెగలు కలిసి ఏర్పడిన సరళ సమాఖ్య పోయింది. దాని స్థానంలో తెగలన్నీ కలిసి ఒకే ప్రజగా ఏర్పడడం తటస్థించింది. దీనితో అందరికీ వర్తించే ఎథీనియను ప్రజా న్యాయశాస్త్రం ఏర్పడింది. తెగలూ, గణాలూ అనుసరిస్తున్న న్యాయశాస్త్ర సంప్రదాయాల కిది అతీతం. ఏథెన్సు పౌరులయిన వారికి అది కొన్ని హక్కుల నిస్తూంది. తమ తెగకు సంబంధించని ప్రాంతంలో కూడా ఏథెన్సువాసులకు న్యాయరక్షణ అదనంగా లభిస్తూంది. గణ నిర్మాణాన్ని శిథిలమొనర్చిన చర్యలలో యిదే మొదటిది. అత్తికా తెగలకు చెందని, వారి గణవ్యవస్థకు ఎంతమాత్రం సంబంధించని బయటి ప్రజలను తర్వాత తర్వాత క్రమంగా దానిలో చేర్చుకొన్నారు. దాని కిది నాంది. గణాలు, సోదర కూటాలూ తెగల విభజనతో నిమిత్తం లేకుండా ఎథీనియను ప్రజలందరినీ థెసెయస్ మూడు వర్గాలుగా విభజించాడు. ఏప్రతిడెలు — అంటే కులీనులు, గెయొమోరిలు — అంటే భూమి దున్నేవారు, దెమియూర్గిలు అంటే చేతివృత్తులవారు. ప్రభుత్వోద్యోగాలను నిర్వహించే ప్రత్యేకాధికారం కులీనులకే మంజూరుచేశారు. అయితే వివిధ వర్గాలమధ్య న్యాయశాస్త్ర విభేదాలను సృష్టించకపోవడంచేత ఈ విభజన కార్యరూపం ధరించలేదు. అయితే దీనిని గమనించడం అతిముఖ్యం. చాపకింద నీరులాగ సమాజంలో అడుగుపెడుతున్న నూతన సామాజిక శక్తుల స్వరూపం వీటిలో కనబడుతూంది. గణాలలోని కొన్ని

కుటుంబాలు ఆచారం రీత్యా అధికారంలో వుండడం అనేది అప్పటికే వచ్చింది. ఇంచుమించు ఆ ప్రత్యేకాధికారాన్ని ప్రశ్నించేవారు కూడా లేరనేది కనబడుతూంది. ఈ కుటుంబాలు సంపన్నమైనవీ అందుచేతనే బల సంపన్నమైనవి కూడా. ఇవి గణంతో నిమిత్తం లేకుండా ప్రత్యేక సౌకర్యాల ననుభవిస్తున్న వర్గంగా ఏకం కావడం ప్రారంభమయింది. అప్పుడే తల ఎత్తిన రాజ్యం వారి యీ పదవుల ఆక్రమణకు అంగీకరించింది. మరో సంగతి కూడా తెలుస్తూంది. వ్యవసాయదారులకూ, చేతివృత్తులవారికీ మధ్య శ్రమ విభజన బాగా స్పష్టపడి పోయింది. అందుచేత సమాజాన్ని గణాలుగానూ, తెగలుగానూ విభజించే పాత సామాజిక పద్ధతి పనికిరాదనే స్థితి ఏర్పడింది. చిట్టచివరకు అది గణసమాజానికీ రాజ్యానికీ మధ్య పొత్తు ఎంతమాత్రం కుదరని శత్రువైరుధ్యం ఉన్నట్లు చాటింది. రాజ్యాన్ని నిర్మించే మొదటి ప్రయత్నమంటే గణాలను విడగొట్టడం. గణసభ్యులు అగ్ర, అధమ వర్గాలుగా విభజింప బడడం. తర్వాత అధమవర్గాన్ని వృత్తులనుబట్టి రెండు వర్గాలుగా విభజించడం. ఆ విధంగా ఒక వర్గాని కొకవర్గాన్ని పోటీ పెట్టడం.

అక్కడనుంచి సోలోన్ కాలంవరకు ఏథెన్సు రాజకీయ చరిత్ర అంతగా తెలియరావడం లేదు. బాసిలసు పదవి నిరుపయోగ దశకు వచ్చింది. కులీనులనుంచి ఎన్నుకోబడిన అర్హానులు రాజ్యాధిపతులయ్యారు. కులీన పరిపాలన అంతకంతకు బలపడుతూవచ్చి కొసకు క్రీ. పూ. 600 ప్రాంతంలో దుర్భరమైపోయింది. ప్రజల స్వాతంత్ర్యాన్ని నలిపివేయడానికై వారు ధనాన్నీ, వడ్డీవ్యాపారాన్నీ ప్రధాన సాధనాలుగా ఉపయోగించారు. కులీనులు ముఖ్యంగా ఏథెన్సులోనూ, ఆ చుట్టుపట్టలోనూ నివసించేవారు. సముద్ర వ్యాపారమూ, మధ్య మధ్య యింకా వదలని సముద్ర దొంగతనాలూతో వారు సంపన్నులయ్యారు. వారి చేతులలో ధనం కేంద్రీకరింపబడింది. స్వయంపోషక ఆర్థిక వ్యవస్థపై ఏర్పడిన గ్రామీణ సమాజాలు సాంప్రదాయిక జీవితంలో యీ ధనం ప్రవేశించి, వానిలోని సమిష్టితత్వాన్ని విశీర్ణం చేసింది. గణ నిర్మాణానికీ, ద్రవ్య విధానానికీ బొత్తిగా పొత్తు కుదరదు. అత్తికా సన్నకారు రైతులు వినాశంకావడమూ, వారికి రక్షణ నిస్తున్న గణ సంబంధాలు బెసికిపోవడమూ ఏకకాలంలో జరిగాయి. ఆనాటికి అప్పుడే ఎథీనియన్లు తనఖా పద్ధతిని కనిపెట్టారు. అప్పు పత్రాలుగాని, తనఖా పత్రాలుగాని గణాలనూ, సోదర కూటాలనూ లెక్కచేయవు. పూర్వ కాలపు గణవ్యవస్థ ధనాన్ని ఎరగదు. పరపతి, ధనరూపమైన రుణం దానికి తెలియదు. అందుచేత కులీనులు సాగించే ధన పరిపాలన విస్తరించినకొద్దీ నూతన చట్టాలు కావలసి వచ్చాయి. రుణం తీసుకొన్న వానినుంచి రుణదాత కది రక్షణనిస్తూంది. ధనస్వాములు చిన్నరైతుల్ని దోచుకొనేటందుకు అధికారం ఇస్తుంది. ఈ భూమి ఫలానా వారికి ఫలానా మొత్తానికి తనఖా పెట్టివున్నదనే మాటలు కట్టిన రాటలు అత్తికా ప్రాంతంలో ఎక్కడ చూసినా ప్రత్యక్షమైనాయి. అలాంటి రాటలు పాతివుండని భూములు చాలవరకు వడ్డీ

ఇవ్వనందుకో, తనఖాకాలం దాటిపోవడంచేతనో అమ్ముడై, కులీనులయిన వడ్డీ వ్యాపారుల ఆస్తులలో కలిసిపోయినవే. అంతవరకూ భూమికామందుగా వున్న రైతును కౌలుదారుగా ఆ భూమినే చేసుకోనిస్తే గొప్పమాటే. పండించినదాంట్లో కొత్త యజమానికి ఆరింట అయిదు వంతులు చెల్లించాలి. మిగిలిన ఒక వంతుతో అతడు బ్రతకాలి. అసలది అంతతో కాలేదు. తనఖా భూమి అమ్మగా వచ్చిన ధనంతో రుణం తీరకపోతే దానికింకా వున్న భూమిని తనఖా పెట్టాలి. అలా పెట్టేటందు కేమీలేకపోతే రుణం తీర్చేటందుకోసం తన సంతానాన్ని విదేశాలలో ఊడిగంకోసం బానిసలనుగా అమ్మేసి రుణం తీర్చాలి. తండ్రి తన బిడ్డల్నే అమ్ముకోవడం తండ్రి హక్కుకూ, దంపతీ వివాహానికీ కలిగిన ప్రథమ ఫలితం! ఆ రక్తపిపాసి కంతకూ తృప్తికలగకపోతే అప్పు తీసుకొన్న వానిని కూడా అతడు బానిసగా అమ్మివేయవచ్చు. ఏథీనియను ప్రజలలో నాగరికత యింత ఆహ్లాదకరంగా ప్రారంభమయింది.

గణవ్యవస్థకు అనుగుణంగా ప్రజల జీవితం సాగుతూన్న వెనకటి రోజుల్లో అటువంటి విప్లవం అసాధ్యమే అయ్యుండేది. కాని ఇక్కడ అది వచ్చేసింది. ఎలా వచ్చిందో ఎవరికీ తెలియదు. ఒక్కమారు ఇరాక్వ్యాలవంక చూద్దాం. ఏథీనియన్లకు తెలియకుండానే, నిస్సందేహంగా వారి ఇష్టానికి పూర్తి విరుద్ధంగా అక్కడ వచ్చిన పరిస్థితులవంటివి ఇరాక్వ్యాలలో వూహించను కూడా సాధ్యంకాదు. వారిలో ఉత్పత్తి పద్ధతులు ఏళ్లు గడిచినా మారడంలేదు. అందుచేత వ్యవస్థ బయటనుంచివచ్చిన ఆ మాదిరి ఘర్షణలు అక్కడ రాలేవు. ధనికులకూ, బీదలకూ, దోపిడీ చేసేవారికీ చేయబడేవారికీ మధ్య వైషమ్యాలు అక్కడ తలఎత్తలేవు. ప్రకృతి శక్తుల్ని అదుపులో పెట్టుకోగల శక్తి ఇరాక్వ్యాలలో ఏర్పడలేదు. దాని కింకా వారు చాలా దూరంలోనే వున్నారు. అయితే ప్రకృతిసిద్ధమైన పరిమితులలోనే వారు తమ వుత్పత్తికి తామే అధికారులుగా వుంటున్నారు. వారికున్న చిన్న చిన్న పెరళ్లలో పంట కాపు సరిగ్గా లేకపోయినా, తమ చెరువుల్లోనూ, వాగుల్లోనూ చేపలు దొరకడం తగ్గిపోయినా, అడవుల్లో వేట దొరక్కపోయినా తమ జీవిక సంపాదనా ప్రయత్న ఫలితం ఏమవుతుందో వారెరుగుదురు. ఆహారం దండిగా వుండడమో, తక్కువగా వుండడమో మాత్రమే వారెరుగుదురు. వారి వుత్పత్తి పద్ధతి కంతే ఫలితం. అంతేగాని సమాజంలో వూహించని వుత్పాతాలేవీరావు. గణబంధాలు తెగిపోవు. గణసభ్యులూ, సోదర కూటంలోని సభ్యులూ పరస్పర విరుద్ధ వర్గాలుగా విభజింపబడిపోయి ఒకరితో ఒకరు ఘర్షించడం జరగదు. చాలా చాలా పరిమితం అయిన హద్దుల్లో వుత్పత్తి జరుగుతుంది. కాని తాము వుత్పత్తి చేసినదానికి తామే యజమానులు. అనాగ రికయుగపు వుత్పత్తి విధానంలో వున్న గొప్ప సౌకర్యం అదే. నాగరిక యుగంగమనంతో అది పోయింది. ప్రకృతి శక్తులమీద ఈనాడు మానవునికున్న ప్రభుతలో ఈనాడు సంఘంలో సాధ్యం అవుతున్న స్వేచ్ఛతో ఆ సౌకర్యాన్ని తిరిగి సంపాదించుకోగలం. అది ముందు తరాల వారి కర్తవ్యం.

గ్రీకులలో అలాగ కాదు. పశువుల మందలూ, విలాస వస్తువులూ వ్యక్తిగత ఆస్తిగా వుండడంచేత వారిలో వస్తుమారకం ప్రారంభమైంది. వస్తువులు వర్తకపు సరుకులుగా మార్పు చెందాయి. తర్వాత వచ్చిన విప్లవాని కంతకూ మూలం ఇక్కడుంది. ఉత్పత్తిదారులు తమ వస్తువులను సరాసరి వాడుకోక మార్పిడి ద్వారా చేతులు దాటిపోనిచ్చారు. ఆవిధంగా వానిమీద వారికి పెత్తనం జారిపోయింది. ఇంక అవేమి అయ్యాయో వారికి తెలియదు. ఉత్పత్తి అయిన వస్తువు ఏదో ఒకరోజున ఉత్పత్తిదారులకే ఎదురుతిరిగి, వారిని దోచుకునే, అణచివేసే సాధనంగా మార్పుచెందేందుకు అవకాశం ఏర్పడింది. అందుచేత వ్యక్తుల మధ్య మార్పిడి పద్ధతిని అంతరింపచేస్తేతప్ప, ఏ సమాజమూ దీర్ఘకాలం తన వుత్పత్తిని తన యాజమాన్యంలో వుంచుకోలేదు, ఉత్పత్తిక్రమంలో వచ్చే సామాజిక పర్యవసానాలను అదుపులో వుంచుకోలేదు.

వ్యక్తులమధ్య మార్పిడి స్థిరపడి, వస్తువులు వర్తకపు సరుకులుగా మార్పుచెందాక, వుత్పత్తి అయిన వస్తువులే వుత్పత్తిదారులమీద పెత్తనం చేస్తాయన్న విషయం ఎథీనియనులకు త్వరలోనే తెలిసివచ్చింది. వర్తకపు సరుకుల వుత్పత్తిలో రైతులు ఎవరికి వారు తమ తమ స్వంతానికి భూములు దున్నుకోవడం ప్రారంభమయింది. దానితో త్వరలోనే భూమి మీద వ్యక్తిస్వత్వం వచ్చింది. తరువాత ధనం వచ్చింది. ధనం అనేది విశ్వజనీనమైన వర్తకపు సరుకు. అది ఇచ్చి ఏ వర్తకపు సరుకునైనా మార్పిడిచేసుకోవచ్చు. మానవుడు ధనాన్ని సృష్టిస్తున్న సమయంలో తానొక నూతన సామాజిక శక్తిని, ఏ సార్వత్రిక శక్తికైతే యావత్తు సమాజమూ తల ఒగ్గవలసి వస్తుందో ఆ శక్తిని, సృష్టిస్తున్నానని ఎరగడు. తన సృష్టికర్తల కిష్టంలేకుండా, వారికి తెలియకుండానే హఠాత్తుగా అవతరించిన యీ నూతన శక్తి, మహా క్రూరంగా ఎథీనియన్లను అదిమివేసింది.

ఇక చేసేదేముంది? ధనంయొక్క విజయయాత్రను ప్రాచీన గణ వ్యవస్థ నిలవరించ లేకపోయింది. ధనం, అప్పులవాళ్లు, ఋణగ్రస్తులు, బలాత్కారంగా ఋణాల వసూళ్లు మొదలైన వానిని ఆ వ్యవస్థ ఏమాత్రం తనలో ఇముడ్చుకోలేకపోయింది. అయితే ప్రబలమైన ఒక నూతన సామాజిక శక్తి వచ్చి కూర్చుంది. నీతిబోధలూ, గతకాలపు మేలుకోసం కలవరించడాలూ, ధనాన్నిగాని, వడ్డీవ్యాపారాన్నిగాని వెళ్లగొట్టలేవు. దీనికితోడు గణవ్యవస్థలో అనేక చిన్న చిన్న గండ్లు కూడా ఏర్పడ్డాయి. గణ సభ్యులూ, సోదర కూటాల సభ్యులూ నిరాటంకంగా అత్తికా అంతటా కలిసిపోయారు, ముఖ్యంగా ఏథెన్సులో మరీను. ఒక్కొక్క తరం గడిచినకొద్దీ యిది పెచ్చుపెరిగింది. ఏథెన్సు పౌరుడు తన భూమిని తన గణానికి చెందని ఇతరులకు అమ్ముకోవచ్చుగాని, ఇంటిని మాత్రం అమ్మకూడదనే నిషేధం వున్నాపై గణాలవారు ఎక్కువగా ఏథెన్సుకువచ్చి చేరుతూనే వున్నారు. పరిశ్రమలూ, వ్యాపారమూ వృద్ధిపొందినకొలదీ వ్యవసాయమూ, చేతిపరిశ్రమలూ మొదలయిన వివిధ ఉత్పత్తి శాఖలమధ్య

శ్రమవిభజన పెంపొందింది. వేర్వేరు వృత్తులలో మెళుకువలూ, వ్యాపార నౌకాయానమూ మొదలయినవి వృద్ధిపొందాయి. ఇప్పుడు ప్రజలు వారి వారి వృత్తులనుబట్టి నిర్దిష్టములయిన జనసమూహాలుగా విభజించబడ్డారు. ఒక్కొక్క సమూహాని కంతకూ కొత్తకొత్త సామూహిక ప్రయోజనాలు ఏర్పడ్డాయి. ఈ సామూహిక ప్రయోజనాలకు గణంలో గాని, సోదర కూటంలో గాని తావు లేదు. వానికోసం కొత్త వుద్యోగు లవసరం అయ్యారు. బానిసల సంఖ్య కూడా బాగా పెరిగింది. బహుశా ఆ తొలిదశనాటి కప్పుడే స్వతంత్రులయిన ఎథీనియను ప్రజలకన్న వారి సంఖ్యే ఎక్కువగా వుండివుంటుంది. ప్రారంభంలో గణ సమాజానికి బానిసత్వం తెలియదు. అందుచేత సంఖ్య పెరిగిపోతున్న ఈ పరాధీనుల్ని అదుపులో వుంచే సాధనం ఆ సమాజానికి తెలియదు. ఇదిగాక వ్యాపారరీత్యా ఎందరో పైవాళ్లు వచ్చి ఏథెన్సులో కాపురాలు పెట్టారు. అక్కడ డబ్బు చేసుకోవడం సులువు. కనకనే వారంతా వచ్చి చేరారు. వెనుకటి వ్యవస్థ ప్రకారం కొత్తవారి కక్కడ పౌరహక్కు లుండవు. చట్ట రక్షణా లభించదు. అలవాటుకొద్దీ సహించినా, అక్కడి ప్రజలలో వారు కలతలకు కారణమైన పరాయి వారుగానే వుండిపోతున్నారు.

సంగ్రహంగా చెప్పాలంటే, గణవ్యవస్థకు రోజులు దగ్గరపడుతున్నాయి. సమాజం రోజురోజుకూ ఆ వ్యవస్థను మించి పెరుగుతూంది. తన కళ్లముందే తలఎత్తుతూన్న బాధాకరమయిన దుష్టశక్తుల్ని అది అరికట్టలేక పోతూంది. వాటిని అదుపులో కూడా పెట్టలేకుంది. ఈలోగా చల్లగా రాజ్యం వృద్ధిపొందింది. మొట్టమొదట పట్టణాలకూ, పల్లెలకూ మధ్య, తర్వాత పట్టణాలలోనే వివిధ పరిశ్రమల మధ్య శ్రమవిభజనతో ఏర్పడిన నూతన జనసమూహాలు తమ ప్రయోజనాల రక్షణకై నూతన సంస్థలను నిర్మించాయి. అనేక రకాల పనులకు ప్రభుత్వోద్యోగాలు నెలకొల్పబడ్డాయి. అన్నింటికన్నా ముఖ్యంగా ప్రథమ దశలో వున్న యీ రాజ్యానికి యుద్ధబలగాలు కావాలి. ఎథీనియనులలో సముద్ర వ్యాపారం ప్రాచుర్యంలో వుంది. అందుచేత అప్పుడప్పుడు వచ్చే చిన్న చిన్న యుద్ధాల కోసమూ, వ్యాపార నౌకల రక్షణ కోసమూ నౌకాసైన్యాలు ముఖ్యంగా వుండాలి. సోలోన్‌కు పూర్వమే ఎప్పుడో తెగకు పన్నెండు చొప్పున చిన్న చిన్న ప్రాదేశిక విభాగాలు చేశారు. ఈ జిల్లాలను "నౌక్రారీ" లంటారు, ప్రతి నౌక్రారీ ఒకొక్క యుద్ధనావకు మనుష్యులను పరికరాలతో సహా సిద్ధంచేసి ఇవ్వాలి. దానితోపాటు ఇద్దరు గుర్రపు రౌతుల్ని కూడా పంపాలి. గణ వ్యవస్థకు ఈ ఏర్పాటు రెండు విధాలుగా దెబ్బ. ఒకటి – గణవ్యవస్థలో ఆ గణంలోని ప్రజలందరూ సాయుధులు. అందరూ పోరాటానికి సిద్ధంగా వుండేవారు. కాని, ఇప్పుడల్లా కాదు. ఒక కొత్త ప్రభుత్వ బలగం వారిస్థానే ఏర్పడింది. రెండోది – రక్తసంబంధం వున్న సమూహాల ప్రకారం గాక, ఒకేచోట నివసించడాన్నిబట్టి ప్రభుత్వ కార్యకలాపాల కోసం ప్రజలను మొట్టమొదట విడదీశారు. దీని ఫలితం ఎలా వుంటుందో చూద్దాం.

గణ వ్యవస్థ పీడిత ప్రజలకు ఏమాత్రం సాయం చేయగలిగే స్థితిలేదు. అందుచేత వారు అప్పుడే తలఎత్తుతున్న రాజ్యం సహాయంకోసం చూశారు. సొలోన్ రాజ్య వ్యవస్థ రూపంలో వారికి సాయం లభించింది. అదే సమయంలో వెనుకటి రాజ్య వ్యవస్థ నుపయోగించుకొని అది బలపడింది. క్రీ. పూ. 594లో సొలోన్ ఈ సంస్కరణను ఏవిధంగా తీసుకువచ్చాడనేది మనకిక్కడ అవసరంలేదు. ఆస్తిహక్కును పరిమితంచేస్తూ ఆయన రాజకీయ విప్లవాల నెన్నింటినో తీసుకువచ్చాడు. ఈనాటివరకూ వచ్చిన విప్లవాలన్నీ ఒక విధమైన ఆస్తినుంచి మరోవిధమైన ఆస్తికి రక్షణ నిచ్చినవే. ఒకదానికి నష్టం కలిగించనిదే రెండవదానికి అవి రక్షణ నివ్వలేవు. ఫ్రెంచి మహావిప్లవం బూర్జువా ఆస్తిని కాపాడేందుకై ఫ్యూడల్ ఆస్తికి నీళ్లువదలింది. సొలోన్ తెచ్చిన విప్లవంలో రుణగ్రస్తుల ఆస్తి రక్షణకై రుణదాతల ఆస్తికి నష్టం కలిగింది. అప్పుల్ని కొట్టిపారేశారు. ఏం జరిగిందో వివరాలు తెలియవు. కాని, సొలోన్ తన పద్యాలలో తనఖాపెట్టిన భూములలోని రాటల్ని లాగి పారవేశాననీ, అప్పులకోసం అమ్మివేయబడినవారూ, దూరదేశం పారిపోయినవారూ తిరిగివచ్చేటట్లు చేశాననీ సగర్వంగా చాటుకున్నాడు. ఆస్తిహక్కును బాహాటంగా ధిక్కరించడం ద్వారా మాత్రమే యిది సాధ్యం. నిజంచేత ఒక రకం ఆస్తిని కాపాడేటందుకై మరొక రకం ఆస్తిని స్వాధీనపరచుకోవడమే రాజకీయ విప్లవాలన్నింటి గమ్యం. ఆవిధంగా స్వాధీనపరచుకోవడాన్నే దొంగిలించడం అని కూడా అంటారు. ఈ 2500 సంవత్సరాల కాలంలోనూ ఆస్తిహక్కుల అతిక్రమణ ద్వారానే వ్యక్తిగత ఆస్తి రక్షించబడగలిగిందన్న మాట యథార్థం.

కాని, యిప్పుడిక స్వతంత్రులయిన ఎథీనియనులను మళ్లీ బానిసలను చేయడానికి వీలులేకుండా కొన్ని ఏర్పాట్లు చేయవలసివుంది, మొదట యిది సాధారణ చర్యల ద్వారా సాధింపబడింది. ఉదాహరణకు, రుణానికై వ్యక్తులను కుదువపెట్టుకొనే పద్ధతిపై జరిగిన ఒప్పందాలను నిషేధించడం వంటి పద్ధతుల ద్వారా యీ పనిని సాధించారు. కనీసం ఒక్కొక్క వ్యక్తి స్వత్వంలో వుండే భూమికి గరిష్ఠ పరిమితిని ఏర్పరచేందుకు రైతుల భూములను స్వాధీనపరచుకొనేటందుకై కులీనవర్గం చూపుతున్న అత్యాశను ఆటంకపరిచారు. తర్వాత రాజ్య వ్యవస్థ సంబంధమైన మార్పులు చేశారు. వానిలో మనం చాల ముఖ్యం అనుకునేవి ఇవి:

ఒక్కొక్క తెగనుంచి నూరుగురు చొప్పున, సమితి సభ్యుల సంఖ్యను నాలుగువందలకు పెంచారు. ఇక్కడ యింకా తెగ ఒక ప్రాతిపదికగా వుంది. నూతన రాజకీయ వ్యవస్థలోకి తీసుకున్న పాత అంశం ఇదొక్కటే. మిగిలినవన్నీ మారాయి. సొలోన్ ఎథీనియను పౌరులను నాలుగు వర్గాలుగా విభజించాడు. వారి అధీనంలోవున్న భూమీ, చేతికివచ్చే పంటా, ఆ విభజనకు ప్రాతిపదికలు. మొదటి మూడు వర్గాలకూ కనీసం 500, 300, 150

మెడిమ్నుల ధాన్యం కనీసపంట (మెడిమ్ను అంటే సుమారు 41 లీటర్లు) అంతకు తక్కువ భూమిగలవారూ, అసలు భూమిలేనివారూ నాలుగో వర్గం. మొదటి మూడు వర్గాలవారే ప్రభుపదవులకు అర్హులు. అత్యున్నత పదవులకు మొదటి తరగతి వారినే నియమించాలి. నాలుగో తరగతివారు శాసనసభలో మాట్లాడవచ్చు, వోటు చేయవచ్చు అంతే. కాని ఈ సభకే పదవులు బాధ్యత వహించాలి. ఈ సభలోనే వారి ఎన్నిక జరుగుతుంది. ఇక్కడనే చట్టాలు చేస్తారు. ఈ సభలో నాలుగో తరగతి వారిదే అధిక సంఖ్య. సంపన్నులకు సౌకర్యాలనే పేరుతో కులీన వర్గాల ప్రత్యేక హక్కులను కొంతవరకూ పునరుద్ధరించారు. నిర్ణయాత్మకమైన అధికారం ప్రజలే నిలుపుకున్నారు. యోధదళాల పునఃనిర్మాణానికి ఈ నాలుగు వర్గాలనూ ప్రాతిపదికలను చేశారు. మొదటి రెండు వర్గాలూ ఆశ్వికదళం, మూడో వర్గం పదాతిదళంలోనే బలమైన ఆయుధాలు కలిగిన విభాగం అవుతుంది. నాలుగో వర్గం తేలిక ఆయుధాలు ధరించే కవచాలులేని కాల్బలంగానో, నౌకా సైనికులుగానో పని చేస్తారు. బహుశా వీరికి జీతాలనిస్తూండివుంటారు.

ఆవిధంగా, వ్యక్తిగత ఆస్తి అనే కొత్త అంశం రాజ్య వ్యవస్థలోకి చొప్పించబడింది. ఆయా వ్యక్తులకుండే ఆస్తినిపట్టి వారి వారి హక్కులూ, బాధ్యతలూ తరతమ స్థాయిల్లో నిర్ణయించబడినాయి. ఆస్తిపరవర్గాలు బలపడినకొద్దీ రక్త సంబంధాలమీద ఏర్పడిన వెనుకటి వ్యవస్థ వెనుకబట్టింది. గణ వ్యవస్థకు మరో ఓటమి కలిగింది.

ఆస్తినిపట్టి రాజకీయ హక్కుల తరతమ స్థాయిని ఏర్పరచడం రాజ్య వ్యవస్థకు తప్పనిసరి అవసరమేం కాదు. వేర్వేరు రాజ్యాల నిర్మాణ చరిత్రలో దానికి ప్రాముఖ్యం వుండొచ్చు. కాని, చాలా రాజ్యాలకు — అందులోనూ బాగా వృద్ధిపొందిన వాటికి కూడా — దాని అవసరం లేకపోయింది. ఏథెన్సులో కూడా ఇదొక తాత్కాలిక సంధిదశలో మాత్రమే వుంది. అరిస్టీడిస్ కాలంనుంచీ పౌరులందరూ అన్ని వుద్యోగాలకూ అర్హులే.

తరువాత ఎనభైయ్యేళ్లల్లోనూ ఎథీనియను సమాజంలో వచ్చిన మార్పులు తదనంతర శతాబ్దాలలో బాగా బలపడ్డాయి. సోలోన్‌కు పూర్వం భూముల్లో చట్టా వ్యాపారం బాగా సాగేది. కాని, సోలోన్ దానిని ఆపుచేశాడు. భూముల అపరిమిత కేంద్రీకరణ నిరోధింపబడింది. బానిసల శ్రమ నంతకంత కధికంగా వినియోగించుకొంటూ వ్యాపారం, చేతిపరిశ్రమలు, ఉపయోగకరములయిన కళలు నిర్వహించబడ్డాయి. క్రమంగా అవి మానవుని కార్యకలాపాలలో ప్రధాన శాఖ లయాయి. ప్రజలలో విజ్ఞానం పెరిగింది. వెనకటల్లే తమ సోదర పౌరులనే బహు క్రూరంగా దోచుకొనేటందుకు బదులు ఎథీనియనులు ముఖ్యంగా బానిసలనూ, బయటినుంచి వచ్చినవారినీ దోచుకోవడం సాగిస్తున్నారు. చరాస్తి, ధనరూపమైన సంపద, బానిసలు, ఓడలు అంతకంతకు పెరిగాయి. ప్రారంభ దినాలలో ధనానికున్న పరిమితులతో అది భూములు కొనుక్కునేటందుకో సాధనంగా మాత్రమే వుండేది. ఇప్పుడు

దానిని సంపాదించడమే ఒక ఆశయంగా మారింది. దీనితో కులీన వర్గానికి పోటీగా నూతన ధనిక వ్యాపార, పారిశ్రామిక వర్గం ఒకటి బయలుదేరింది. దీనితో పాత గణ వ్యవస్థకు గల చివరిపట్టు కూడా అంతరించింది. గణాలు, సోదర కూటాలు, తెగలలోని ప్రజ అత్తికా అంతటా ఇరుగుపొరుగులతో కలిసిపోయి నివసిస్తున్నారు. అందుచేత అవి రాజకీయ సంస్థలుగా పూర్తిగా నిరుపయోగం అయినాయి. ఎథీనియన్ పౌరులు చాలా హెచ్చుమంది అక్కడున్న గణాలు వేనికీ చెందరు. వారు బయటినుంచి వచ్చారు. ఇక్కడ వారికి పౌరసత్వం ఇచ్చారు. అంతేగాని రక్తసంబంధాలపై ఏర్పడిన పూర్వకాలపు నిర్మాణాలలోకి వారిని దత్తు తీసుకోలేదు. వీరుగాక విదేశాలనుంచి వలసవచ్చినవారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వుంది. చట్ట రక్షణ మాత్రమే వారి కుంటుంది.[128]

ఈమధ్య కాలంలో వివిధ వర్గాలమధ్య ఘర్షణలు కొనసాగాయి. కులీన వర్గం తన పూర్వపు ప్రత్యేక హక్కుల్ని తిరిగి సంపాదించుకోచూసింది. కొద్దికాలంపాటు వారు తమ ఆధిపత్యాన్ని సంపాదించుకొన్నారు కూడా. ఇంతలో క్రీ. పూ. 509లో క్లీస్థెనెస్ విప్లవం వచ్చింది. దానితో వారు పూర్తిగా తోసివేయబడ్డారు. మిగిలివున్న కొద్ది గణవ్యవస్థ తాలూకు అవశేషాలు కూడా రద్దు అయాయి.

గణాలూ, సోదర కూటాలమీద ఆధారపడివున్న వెనుకటి నాలుగు తెగలనూ క్లీస్థెనెస్ తన కొత్త రాజ్యవ్యవస్థలో వదిలేశాడు. వానిస్థానే సరికొత్త నిర్మాణం ఒకటి ప్రవేశపెట్టబడింది. అదివరకే నౌకారీల ద్వారా ప్రయత్నింపబడిన విధంగా నివాస ప్రాంతాలవారీగా పౌరులను విభజించుతూంది ఈ నూతన నిర్మాణం రక్తసంబంధాలపై ఏర్పడిన నిర్మాణంలో సభ్యత్వం గాక, నివశించే ప్రదేశాని దీవేళ ప్రాముఖ్యం. ప్రజల్ని గాక ప్రదేశాలను నేడు విభజించారు. రాజకీయంగా దేశవాసులు వారివారి ప్రాంతాలకు కేవలం బంధితులయేవారు.

అత్తికా నంతనూ స్వపరిపాలనాధికారం వున్న నూరు పట్టణాలుగా విభజించారు. వీనిని డెమేలంటారు. డెమేలో నివసించే ప్రజలు (డెమోట్లు) ఒక ప్రభుత్వాధిపతిని (డెమార్క్), ఒక కోశాధికారిని, చిన్న చిన్న నేరాలను విచారించేటందుకై ముప్ఫయిమంది జడ్జీలను ఎన్నుకుంటారు. వారికి హెరోస్ (వీరుడు) అనబడే ఒక సంరక్షక దైవంతోబాటు ఒక స్వంత దేవాలయం యివ్వబడింది. దాని పూజారులను వాళ్ళు ఎన్నుకొనేవారు. డెమోట్ల సభదే డెమేలో అత్యున్నతాధికారం. స్వయంపాలితమైన అమెరికను పట్టణానికిది నకలంటూ మోర్గన్ చెప్పిన మాట యథార్థం. ఏథెన్సులో రాజ్యం ప్రారంభమైన దీ యూనిట్‌లోనే. దీని ఉన్నత పరిణామ రూపమే ఆధునిక రాజ్యంలో ప్రత్యక్షమయింది. ఆ పరిణామ రూపంలో అది పర్యవసితం అవుతుంది.

ఇలాంటి పది డెమేలు ఒక తెగ. దీనికీ పూర్వకాలం గణ వ్యవస్థ నాటి తెగకీ సంబం

ధంలేదు. దీని నిప్పుడు ప్రాంతీయ తెగ అంటున్నారు. ఈ ప్రాంతీయ తెగ స్వపరిపాలక మైన రాజకీయ సంస్థ మాత్రమే కాదు. సైనిక సంస్థ కూడాను. అదొక అధిపతిని ఎన్ను కొంటుంది. ఆయనను ఫిలార్కు అంటారు. ఆయన అశ్వ దళాలకు నాయకత్వం వహిస్తాడు. కాల్బల నాయకుడైన టాక్సియార్కును, తెగ ప్రాంతంలో సమకూర్చిన యావత్ సైన్యా లకూ నాయకుడు స్ట్రాటెగోసును ఎన్నుకొంటుంది. అంతేకాదు; సైన్యాధిపతీ, సైన్యాలతో సహా తెగ అయిదు యుద్ధనావలను పంపుతుంది. ప్రతి ప్రాంతీయ తెగకూ ఒక్కొక్క అత్తికావీరుడు కులదైవంగా నిర్ణయించబడతాడు. ఇంక ఏథెన్సులోని సమితికి ప్రతి తెగా ఏభయిమంది ప్రతినిధులను ఎన్నుకొంటుంది.

పూర్ణరూపమైన ఎథీనియన్ రాజ్యాన్ని పది తెగలు ఎన్నుకొన్న 500మంది ప్రతినిధుల సమితి పరిపాలించేది. దానికి పైన ప్రజా సభ వుండేది. దానిలో ప్రతి ఎథీనియను పౌరుడూ పాల్గొవచ్చు. వోటు చేయవచ్చు. ఆర్ఖానులూ, ఇతర వుద్యోగులూ వివిధ పరిపాలనా శాఖలనూ, న్యాయస్థానాలనూ నిర్వహించేవారు. సర్వాధికారియనే వాడెవ్వరూ ఏథెన్సులో లేడు.

వలసవచ్చినవారూ, స్వాతంత్ర్యం పొందిన బానిసలూ మొదలయిన అధీనప్రజల సంఖ్య అత్యధికం కావడంవల్ల, యీ నూతన రాజ్య వ్యవస్థచేత గణవ్యవస్థ తాలూకు పరిపా లనాంగాలు ప్రజా వ్యవహారంనుంచి పూర్తిగా తొలగింపబడ్డాయి. అవి కేవలం కొంతమందికే పరిమితమయ్యే సంస్థలుగానూ, మత సంఘాలుగానూ వ్యవహారంలో మిగిలాయి. కాని వాని తాలూకు నైతిక బలమూ, వెనుకటి గణ వ్యవస్థ వున్న నాటినుంచీ అనూచానంగా వస్తున్న భావనలూ, అభిప్రాయాలూ చాలాకాలంవరకు మిగిలేవున్నాయి. క్రమంగా గాని అవి అంతరించలేదు. రాజ్యానికి చెందిన తదుపరి సంస్థలో ఈ విషయం కనబడుతుంది.

ప్రజానీకంకన్న భిన్నమైన ప్రభుత్వబలగం వుండడమనేది రాజ్యంయొక్క ప్రధాన లక్షణమని పైన చూశాం. ఆరోజులలో ఏథెన్సులో సైనిక పోలీసు బలగం ఒకటుండేది. ప్రజలు సన్నద్ధపరచిన, ప్రజలు పనిచేసే నౌకా సైన్యం వుండేది. బయటి శత్రువులనుంచి ఆత్మరక్షణకూ, బానిసలను అదుపులో వుంచడానికీ ఇవి వుపయోగించేవి. ఆనాటి కప్పుడే దేశ జనాభాలో బానిసలే అత్యధిక సంఖ్యలో వుండేవారు. పౌరుల విషయంలో ఈ ప్రభుత్వ బలగం పోలీసు బలగం రూపంలో మాత్రమే వుండేది. ఈ పోలీసు బలగం రాజ్యం ఏనాడు పుట్టిందో ఆనాడే వచ్చింది. కనుకనే అమాయకులయిన 18వ శతాబ్దపు ఫ్రెంచివారు కొందరు నాగరిక జాతుల్ని గురించి కాక "పోలీసులున్న జాతులు" (nations policées)*

---

* ఇదొక శబ్దక్రీడ: policé అంటే నాగరిక, police అంటే పోలీసు అని అర్థం.— సం.

అంటూ పేర్కొనడం జరిగింది. ఆ విధంగా ఏథీనియనులు రాజ్యంతోపాటుగనే పోలీసుల్ని ఏర్పరచుకొన్నారు. కాల్బంటుల్లా, విల్లంబులతోడి గుర్రపు రౌతులూ ఈ పోలీసు బలగంతో వుండేవారు. (దక్షిణ జర్మనీ, స్విట్జర్లాండులలో Landjäger అనేది వీరినే.) ఈ పోలీసులంతా బానిసలే. పోలీసు పనిని స్వతంత్రుడైన ఏథీనియను పౌరుడెంతో నీచంగా భావించేవాడు. ఆ పనిచేసేకన్న సాయుధ బానిస చేతిలో అరెస్టు కావడం మేలని భావించేవాడు. వెనుకటి కాలపు గణ సంస్థలనాటి మనస్తత్వం ఇది. అయితే రాజ్యానికి పోలీసు బలగం వుండాలి. అది లేనిదే అది మనలేదు. అయితే అది ఇంకా ప్రారంభ దశలో వుంది. దానికి తగినంత నైతిక గౌరవం యింకా ఏర్పడలేదు. ఆ బలగంలో చేరి పనిచేయడం గౌరవ ప్రాయంగా భావించే దశ ఏర్పడలేదు. కనుకనే వెనుకటి గణ సంస్థలనాటి మనస్తత్వాని కది అప్రతిష్ఠాకరంగా కనపడుతుంది.

అప్పటికి రాజ్యంయొక్క ప్రధాన సంస్థలన్నీ ఏర్పడినట్లే. ఇంక అక్కడ సంపద, వ్యాపారం, పరిశ్రమలు అతివేగంగా వృద్ధిపొందాయి. ఏథీనియనుల సామాజిక పరిస్థితికి అది బాగా సరిపడి వుందనడానికింత కన్నా వేరు నిదర్శనంలేదు. సామాజిక, రాజకీయ వ్యవస్థలకు మూలం కులీనవర్గానికీ, సామాన్య ప్రజలకూ మధ్య వర్గ వైషమ్యాలు కావు. బానిసలకూ — స్వతంత్ర ప్రజకూ, అధీన ప్రజలకూ — పౌరులకూ మధ్య నున్న వర్గ వైషమ్యాలు మూలం అయినాయి. ఏథెన్సు మంచి ఉచ్చ స్థితిలో వున్నపుడు ఏథీనియను స్వతంత్ర పౌరులు — ఆడ, మగ, పిల్లలంతా కలిసి 90,000 వుండేవారు. ఆడ, మగ బానిసలు 3,65,000 వుండేవారు. అధీన ప్రజ — స్వేచ్ఛ సంపాదించిన బానిసలూ, వలసవచ్చినవారూ 45,000 వుండేవారు. ఆ లెక్కనచూస్తే, వయసువచ్చిన ప్రతి మగ పౌరుడికీ బానిసలు పద్దెనమండుగురు చొప్పున, అధీన ప్రజ యిద్దరు చొప్పున వుండే వారన్నమాట. పెద్ద పెద్ద సావిళ్ళలో ఓవర్సీర్ల పర్యవేక్షణకింద చాలమంది బానిసలు కలసి కార్ఖానాలలో పనిచేసేవారు. అందుకే బానిసల సంఖ్య అంత ఎక్కువగా వుంది. వ్యాపారమూ, పరిశ్రమలూ పెరగడంతో సంపద కొద్దిమంది చేతులలో పోగుపడి, కేంద్రీకరింపబడింది. ఇంక స్వతంత్ర ప్రజలలో అత్యధికభాగం దరిద్రంతో వుండేవారు. చేతిపనులు నేర్చుకుని బానిస పనివారితో పోటీచేయడం అప్రతిష్ఠ, నీచమూ అని వారి భావన. అదీగాక వానిలో కొంచెం లాభమూ కనబడదు. అల్లాగని ఆ పనికి దిగకపోతే పూర్తిగా వీధిన పడవలసిందే. మరో మార్గం లేదు. ఆనాడున్న పరిస్థితులలో అత్యధిక సంఖ్యాకులైన బీద స్వతంత్ర ప్రజ ఏథీనియను రాజ్యాన్ని తమతోపాటు అథోగతికి ఈడ్చుకుపోయారు. యూరపియను స్కూలుటీచర్లు రాజరిక ప్రభుత్వాలకు కోపం తెప్పించకుండా వుండేటందుకని ఏథెన్సు పతనానికి కారణం అక్కడ ఉండిన ప్రజాతంత్ర వ్యవస్థయేనంటూ మనల్ని నమ్మించ పలుకుతున్నారు. కాని అది యథార్థంకాదు. శ్రమించడం అప్రతిష్ఠ

కరమనే భావన స్వతంత్ర ప్రజలలో కలిగింది. అలా కలగడానికి కారణమైన బానిస వ్యవస్థే ఏథెన్స్ పతనానికి దారితీసింది.

ఎథీనియన్లలో రాజ్యం పుట్టినతీరు మొత్తంమీద రాజ్య నిర్మాణానికి ఒక మంచి ఉదాహరణ; బహిరంగంగా గాని, ఆంతరికంగా గాని ఉత్పాతాలేవో రావడం వలన అది ఏర్పడలేదు. కొద్దికాలం పిసిస్ట్రాటసు ప్రభుత్వాన్ని ఆక్రమించుక్కూర్చున్నా రాజ్యంమీద దాని ప్రభావం నామరూపాలక్కూడా లేదు. మరోవంక సరాసరి గణవ్యవస్థలోంచి బాగా పరిణతి పొందిన రూపంలో ప్రజాతంత్ర రిపబ్లికు నేరుగా ఉత్పన్నమయింది. దానికి సంబంధించిన ప్రధాన వివరాలన్నీ దీనినుంచే మనకు తగినంతగా లభ్యం అయ్యాయి.

# VI

## రోములో గణం, రాజ్యం

ఒక తెగగా ఏర్పడిన కొన్ని లాటిన్ గణాలు (వీని సంఖ్య ఒక వంద అట) మొదట నిర్మించుకొన్న గ్రామమే రోమ్ అని దానికి సంబంధించిన స్థలపురాణం చెప్తూంది. తర్వాత వంద గణాలున్న సబెల్లియన్ తెగ దానితో చేరింది. ఆఖరున మరో వంద వేర్వేరు గణాలున్న మరో తెగ వచ్చి అక్కడ చేరింది. గణాలే సహజమైన వ్యవస్థలని ఈ కథనిబట్టి చూడగానే స్పష్టంగా తెలుస్తూంది. ఆ గణాలు చాల సందర్భాలలో మొట్టమొదటి నివాస భూమిలోనే నివసిస్తున్న తల్లిగణాన్నుంచి పుట్టినవని తెలుస్తూంది. తెగలనేవి కృత్రిమంగా ఏర్పడ్డవేనన్న గుర్తులు కనిపిస్తూనే వుంటాయి. అయినా వానిలో చాలావరకు బంధుగణాలే వుంటాయి. కృతకంగాగాక సహజంగానే ఏర్పడిన ప్రాచీనగణం నమూనాలోనే తెగలు ఏర్పడతాయి. బహుశా పైనచెప్పిన మూడు తెగలలోనూ అసలు తెగ ఏదో బీజంగా వుండివుందంటే అసంబద్ధంకాదు. ఆ రెంటినీ కలుపుతున్న సోదర కూటంలో పదేసి గణాలున్నాయి. దానిని క్యూరియా అంటారు. ఆవిధంగా రోములో ముప్ఫయి క్యూరియా లున్నాయి.

రోమను గణం గ్రీసులోని గణంలాంటి వ్యవస్థయేనని సర్వసాధారణంగా అంగీకరిస్తున్న విషయం. అమెరికాలోని ఎర్ర ఇండియన్లలో కనిపిస్తున్న ఆదిమ సామాజిక యూనిటువంటి దాని పరిణత రూపమే గ్రీకు గణం అనేటట్లయితే. రోమన్ గణం విషయంలో కూడా అంతే అనుకోవాలి. అందుచేత దీనిని గురించి క్లుప్తంగా చెప్పకుపోవచ్చు.

నగరం ఏర్పడిన ఆరంభంలో రోమను గణ వ్యవస్థ ఈవిధంగా వుంది:

1. చనిపోయిన గణసభ్యుల తాలూకు ఆస్తిపై వారసత్వపు హక్కు పరస్పరంగా

వుండేది. ఆస్తి గణంలోనే వుండిపోయేది. గ్రీషియను గణంలోలాగానే రోమను గణంలో కూడ తండ్రిహక్కు అమలులో వుంది. అందుచేత స్త్రీ సంతానానికి వారసత్వం లేదు. పన్నెండు పలకల చట్టం[129] లిఖితపూర్వకంగా లభించే రోమన్ చట్టాలన్నింటిలోకీ మనకు తెలిసినంతవరకు అతి ప్రాచీనమైనది. దాని ప్రకారం ఆస్తికి ఔరసులది మొదటిహక్కు. ఔరసులు లేనప్పుడు అగ్నాటెలది హక్కు (మగవాని తరఫు బంధువు). వాళ్లూ లేనప్పుడు గణ సభ్యులది హక్కు. ఏ విధంగానైనా ఆస్తి గణంలోనే వుండిపోయేది. సంపదలు పెరగడం దంపతీవివాహం ద్వారా గణంలో వున్న ఆచారాలలోకి కొత్తకొత్త చట్ట నిబంధనలు ప్రవేశించడం మన కిక్కడ కనిపిస్తూంది. మొదట వారసత్వపు హక్కు గణ సభ్యులందరికీ సమంగానే వుండేది. దాని నెప్పుడో అగ్నాటెలకి మాత్రమే పరిమితం చేశారు. తరువాత మగసంతానానికీ, వారి మగ సంతానానికీ మాత్రమే పరిమితం చేశారు. అయితే ఈ క్రమం పన్నెండు పలకల చట్టంలో విలోమరూపంలో కనబడుతుంది.

2. ఉమ్మడి శ్మశానం ఒక టుంటుంది. క్లాడియా కులీన గణం రోముకు రెగిల్లీనుంచి వలసరాగానే, నగరంలో జనం నివసించేటందుకు స్థలమూ, శ్మశాన ప్రదేశమూ కేటాయించారు. అగస్టస్ పరిపాలనలో సైతం, ట్యూటోబుర్గ్ అరణ్యంలో మరణించిన వారుస్ శిరస్సును రోముకు తీసుకువచ్చి, అక్కడి gentilitius tumulus*లో పాతిపెట్టారు. దానినిపట్టి అతని గణానికి (క్వింక్టిలియా) స్వంత సమాధి వుందని చెప్పవచ్చును.

3. గణాలకు ప్రత్యేక మతకర్మలు సార్వజనికంగా వుంటాయి. ఈ sacra gentilitia** అందరకూ తెలిసినవే.

4. గణంలోపల వివాహం చేసుకోకూడదనే నియమం వుంది. ఈ విషయమై రోములో చట్టం అంటూలేదు. కాని, ఆచారం మాత్రం వుంది. అనేకమంది రోమను దంపతుల పేర్లు ఆనాటివి ఇప్పుడు వింటున్నాం. వాట్లలో ఏ ఒక్క జంటలోనూ కూడా స్త్రీ పురుషులిద్దరికీ ఒకే గణనామం కనబడదు. వారసత్వపు నియమం కూడా ఈ విషయాన్ని నిరూపిస్తూంది. స్త్రీ వివాహం చేసుకొంటే అగ్నాటియ హక్కుల్ని పోగొట్టుకొంటుంది. ఆమె తన గణాన్ని వదలిపెడుతుంది. ఆమెకుగాని, ఆమె సంతానానికిగాని ఆమె తండ్రి ఆస్తినుంచి లేదా ఆమె సోదరుల ఆస్తినుంచి వారసత్వం సంక్రమించదు. అలాగ సంక్రమిస్తే తండ్రియొక్క గణంలోంచి ఆ ఆస్తి బయటికి పోతుంది. తన గణంలోని మగవానిని ఆడుది పెళ్లి చేసుకోకూడ దన్నప్పుడే ఈ నియమానికి అర్థం వుంటుంది.

5. భూమిమీద యాజమాన్యపు హక్కు అందరికీ వుంటుంది. ప్రాచీనకాలంలో తెగ

* గణ శ్మశానం. — సం.

** గణంయొక్క పవిత్రోత్సవాలు. — సం.

అధీనంలోని భూమిని మొదట పంచినప్పుడు గణానికి భూమి లభించేది. లాటిన్ తెగలలో ఈ భూములలో కొంత భాగం తెగ అధీనంలోనూ, కొంతభాగం గణం అధీనంలోనూ వుండేది. మరికొంత భాగం కుటుంబాలకింద వుండేది. ఆ ప్రాచీనదశలో కుటుంబం అంటే ఒంటి కుటుంబాలనడానికి అవకాశంలేదు. వ్యక్తులకు మొదట భూములను కేటాయించిన వాడు రోముల్ అంటారు. ఆయన ఒక్కొక్కనికి రెండేసి యుగెరలు (సుమారు ఒక హెక్టారు — లేక రెండున్నర ఎకరాలు) ఇచ్చాడట. అయినా అటుతర్వాత కూడా గణాల అధీనంలో భూములున్నట్లు కనబడుతుంది. రిపబ్లికు ఆంతరిక చరిత్ర కంతకూ కీలకంగా ప్రభుత్వ భూములు కూడ వుండేవి.

6. గణ సభ్యులు పరస్పర సహాయం చేసుకోవడానికీ, ప్రతిక్రియ చేయడంలో ఒకరి కొకరు సాయం చేసుకోవడానికీ పూచీపడి వుంటారు. మనకు లిఖిత చరిత్రలో ఈ చట్టం బాపతు స్వల్పావశేషాలు మాత్రమే కనబడతాయి. ప్రారంభంనుంచీ కూడ రోమన్ రాజ్యం మంచిబలాన్ని ప్రదర్శిస్తూ వచ్చింది. అందుచేత ప్రతిక్రియచేసే బాధ్యత రాజ్యంమీదనే వుంటూ వచ్చింది. అప్పియసు క్లాడియసును అరెస్టు చేసినప్పుడు అతని గణం యావత్తూ ఆఖరుకి వ్యక్తిగత శత్రువులతో సహా విచారసూచకంగా దుస్తులు ధరించారు. రెండో ప్యూనిక్ యుద్ధంలో[130] ఖైదు చేయబడిన తోడిగణ సభ్యుల్ని విడిపించుకొనేటందుకు గణాలు పరిహార ధనం పోగుచేయడానికి ప్రయత్నించారు; ఆ పని చేయరాదని సెనేట్ (శాసనసభ) నిషేధించింది.

7. గణ సభ్యులకు గణనామం ధరించే హక్కు వుంటుంది. చక్రవర్తుల కాలం వరకూ ఇది అమలులో వుంది. స్వతంత్రం పొందిన బానిసలు తమ యజమానుల గణనామం పెట్టుకొనేటందుకు అనుమతింపబడేవారు. కాని ఇతర గణ హక్కులేవీ వారికుండేవి కావు.

8. గణంలోకి పైవారిని దత్తు తెచ్చుకొనే హక్కు వుండేది. రెడ్ ఇండియన్లలో మాదిరిగా కుటుంబంలోకి దత్తు తీసుకొనేవారు. దానితో వారు గణంలోకి దత్తు తీసుకో బడినట్లే.

9. నాయకుల్ని ఎన్నుకొనేందుకూ, తొలగించేటందుకూ హక్కు వున్నదని ఎక్కడా పేర్కొనలేదు. కాని, రోము ఏర్పడిన కొత్తలో రాజును ఎన్నుకొనేవారు. అక్కడినుంచి అన్ని వుద్యోగాలకూ మనుషుల్ని ఎన్నుకోవడమో, నియమించడమో జరిగేది. క్యూరియాలు (సోదర కూటాలు) తమ పురోహితుల్ని కూడా ఎన్నుకొనేవి. దీన్నిబట్టి గణ నాయకుల్ని (principes) కూడా ఎన్నుకొనేవారని మనం వూహించవచ్చు. అభ్యర్థుల్ని ఒక కుటుం బంనుంచి తీసుకొనే ఆచారం ఎంత పాతుకొనిపోయినా, ఎన్నుకోవడం అనేది వుండేదని చెప్ప డంలో తప్పుండదు.

రోమను గణాలలో వుంటూ వచ్చిన అధికారాలు ఇవి. తండ్రి హక్కులోకి పూర్తిగా

మార్పు వచ్చిందనేది తప్పు వానికీ ఇరాక్వ్యా గణాలలోని హక్కులకూ, బాధ్యతలకూ ఏమీ తేడా లేదు. ఇక్కడ కూడా "ఇరాక్వ్యాలు స్పష్టంగా దర్శనమిస్తున్నారు."*

రోమను గణాలకి సంబంధించిన సమస్యలను చాలా బాగా ఎరుగుదురన్న విఖ్యాత చరిత్రకారులలో కూడా ఎంతో గంద్రగోళం వుందనడాని కొక్క వుదాహరణ చూపుతాను. రిపబ్లికు కాలంనాటి, అగస్టసు కాలం నాటి రోమను కుటుంబ నామాలను గూర్చిన పరిశోధన గ్రంథం ("రోమన్ పరిశోధనలు", బెర్లిన్ 1864, సంపుటి I)లో మోమ్సెన్ ఇలా రాశాడు:

"గణంలోని అందరు మగవాళ్లూ — దత్తత తెచ్చుకొన్నవాళ్లు — పోషింపబడు తున్నవారితో సహా — గణ నామాన్ని ధరించేవారు. ఆడవాళ్ల కూడా ధరించేవారు. ఒక్క బానిసలే మినహాయింపు.... తెగకు (gens అని పదం మోమ్సెన్ అలా అనువదించాడు) ఆదిపురుషు డొకడున్నాడనీ, వారంతా ఆయన సంతతి యనీ భావన. ఆ ఆదిపురుషుడు నిజమైన వ్యక్తే కావచ్చు. కేవలం కల్పిత వ్యక్తే కావచ్చు. ఉమ్మడి కర్మకాండలు, శ్మశానాలు, వారసత్వం వారిని కలుపుతున్నాయి. స్వతంత్రు లందరూ, స్త్రీలు సహా గణాలలో నమోదుకావాలి, అయివుండి తీరాలి. అయితే వివాహిత స్త్రీయొక్క గణనామధేయాన్ని నిర్ధారణ చేయడంలో కొంత కష్టం కలుగుతూంది. తమ గణంలోని వారినేగాని పై వారిని పెళ్ళాడగూడదనే నిషేధం వున్నంతవరకూ ఈ కష్టంలేదు. చాలకాలంపాటు గణంలోపలకన్న వెలుపల మగళ్లని సంపాదించడం చాలా చాలా కష్టం అయినట్లే కనిపి స్తూంది. బయటివారిని వివాహమాడే హక్కును (gentis enuptio) ఆరో శతాబ్దిలో ఒక ప్రత్యేక హక్కుగానో, బహూకృతిగానో కలగచేసేవారు.... అయితే ఆ ప్రాచీనకాలంలో ఈవిధంగా గణం బయటివారిని స్త్రీ వివాహం ఆడితే ఆమెను భర్తయొక్క తెగలోకి పంపేసేవారు. వెనుకటిరోజుల్లో మత సంబంధంగా వివాహం చేసుకున్నప్పుడు స్త్రీ తన భర్త కుటుంబంలోకి చట్ట రీత్యాను, మతాచార రీత్యానూ కూడా మార్చివేయబడేదనడంలో ఏమాత్రం సందేహం అవసరంలేదు. వివాహిత స్త్రీ తన గణ సభ్యులనుంచి వారసత్వం పొందే హక్కును పోగొట్టుకుంటుందనీ, ఆమె భర్తకు, పిల్లలకు, ఆయన గణ సభ్యులకు సంబంధించిన వారసత్వపు కూటంలోకి చేర్చుకోబడేదనీ అందరకూ తెలుసు. ఆమె భర్త ఆమెను తన సంరక్షణలోకి తన కుటుంబంలోకి తెచ్చుకొన్నప్పుడు ఆమె అతని గణానికి చెందకుండా ఉండడ మెల్లాగ?" (పేజీలు 8–11.)

---

* మార్క్స్ — ఎంగెల్స్, పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజి 134. — సం.

మోమ్సెన్ చెప్తున్నదానినిబట్టి ఒక గణానికి చెందిన స్త్రీలు మొదట తమ గణంలోని వారినే వివాహమాడేటందుకు స్వాతంత్ర్యం కలిగివుండేవారు. ఆయన చెప్పేదాని ప్రకారం రోమను గణాలలో అంతర్వివాహాలే ఆచారం, బహిర్వివాహాలు కాదు. ఇతర ప్రజలందరి అనుభవానికి ఈ అభిప్రాయం వ్యతిరేకం. లివీ (పుస్తకం 39, ప్రకరణం 19)లోని ఒకమాట మోమ్సెన్ తెలుపుతున్న పొరపాటు అభిప్రాయానికి చాలవరకు మూలం. అసలా వాక్యం మీదనే ఎంతో తర్జనభర్జన వుంది. నగరశకం 568లో – అంటే క్రీస్తుపూర్వం 186లో – శాసనసభ చేసిన నిర్ణయాన్ని ఆ వాక్యం తెలుపుతుంది:

> "uti Feceniae Hispalae datio, deminutio, gentis enuptio, tutoris optio item esset quasi ei vir testamento dedisset; utique ei ingenuo nubere liceret, neu quid ei qui eam duxisset, ob id fraudi ignominiaeve esset" – "ఫెసెనియా హిస్పల్లో తన ఆస్తిని అంతనూగాని, కొంత గాని అమ్మేసుకొనేటందుకు, గణం వెలుపల పెళ్లిచేసుకొనేటందుకు, ఒక సంరక్షకుని ఏర్పరచుకొనేటందుకూ హక్కు వుంది. వీలునామా ద్వారా ఆ హక్కు నామె (మృత) భర్త ఇచ్చినట్లే ఆ అధికారం చెల్లుతుంది. ఆమె ఒక స్వతంత్ర వ్యక్తిని పెళ్లిచేసుకోవచ్చును. ఆమెను పెళ్లిచేసుకోవడం అతనికి అవమానముగా గాని, అప్రతిష్ఠగా గాని వుండదు."

ఫెసెనియా స్వతంత్రం పొందిన బానిస అని స్పష్టంగా తెలుస్తోంది. ఆమెకు తన గణం బయట వివాహమాడే హక్కునిస్తున్నారు. తన మరణానంతరం గణం వెలుపలివారిని పెళ్లిచేసుకొనే అధికారాన్ని లిఖిత రూపంలో ఆమెకిచ్చేందుకు భర్త హక్కును గలిగివున్నాడనేది కూడా నిర్వివాదాంశం. అయితే అది యే గణం వెలుపలవారిని?

మోమ్సెన్ వూహిస్తున్నట్లు స్త్రీ తన గణంలో వానినే పెళ్లిచేసుకోవలసి వుంటే ఆమె పెళ్లి అయిం తర్వాత గణం విడిచి పోనక్కరలేదు. అసలు గణాలలో అంతర్వివాహాలు అనుమతించబడేవనే దానికి మొదట సాక్ష్యం కావాలి. ఇంక స్త్రీ గణం లోపలివారినే పెళ్లిచేసుకోవాలంటే మగవాడికిక్కూడా అంతేకదా? లేకుంటే వానికి భార్య ఎప్పటికీ దొరకదు. అంటే మగవాడు తనకు లేని హక్కును వీలునామా ద్వారా భార్యకు కలుగచేస్తున్నాడన్నమాట. ఇది చాలూమూలంలేని చట్టం. ఈ విషయాన్ని మోమ్సెన్ అర్థంచేసుకోక పోలేదు. అందుకే:

"గణానికి వెలుపల వివాహం చేసుకోవాలంటే ఆ అధికారం పొందిన వ్యక్తి

మాత్రమే కాదు. గణ సభ్యులందరూ అంగీకరించడం అవసరమయి వుండొచ్చు, బహుశా" (పుట 10 వివరణ) అని రాశాడు.

ఇది చాలా సాహసంతో కూడిన వూహ. మరొకటి, అసలు పుస్తకంలోని మాటను ఈ వివరణ కాదంటూంది. భర్తయొక్క ప్రతినిధిగా శాసనసభ ఆమెకీ హక్కునిస్తూంది. అతను ఇవ్వగల దానికన్న శాసనసభ ఇస్తున్న అధికారం హెచ్చుకాదు లొచ్చుకాదు. అది మినహాయింపుల్లేని పరమమైన హక్కు. దాన్ని వినియోగించుకుని ఆమె పెళ్లిచేసుకొనే కొత్త వ్యక్తికి ఏ ఇబ్బందీ కలగదు. ఈ హక్కు నుపయోగించుకోవడంవలన ఆమెకెలాంటి బాధలూ కలిగించరాదని శాసనసభ, అప్పుడున్న భవిష్యత్తులో రాబోయే కాన్సలులనూ, ప్రాటర్లనూ ఆదేశిస్తూంది. అందుచేత మోమ్సెన్ ఆలోచన పూర్తి అనంగీకారయోగ్యంగా కనిపిస్తోంది.

మరొకటి: ఒక స్త్రీ తన గణంలోనివానిని గాక బయటి గణం వానిని పెళ్లిచేసుకొంటుంద నుకొందాం. అలా చేసుకొన్నాక కూడా తన గణంలోనే వుందనుకొందాం. పై ఉల్లేఖన ప్రకారం, ఆమె భర్తకు ఆమెను తన గణం వెలుపలవానిని పెళ్లిచేసుకొనేటందుకు అనుమతించే హక్కు వుంటుంది. అంటే తనదిగాని గణంలో వ్యవహారాలు చక్కబెట్టే హక్కు అతనికున్నదన్నమాట. అసలీ ఆలోచనకే ఆస్కారంలేదు. దానిని గురించి యింతకు మించి చర్చించడం కూడా అనవసరం.

ఆ స్త్రీ తన గణం వెలుపలివానిని పెళ్లిచేసుకొని, అతని గణంలోకి వెళ్లిపోయిందను కోవడమే ఇక్కడ సముచితం. అల్లా జరుగుతూందని మోమ్సెన్ అంగీకరించాడు కూడా. అలా అనుకొంటే సర్వం అవగతం అవుతుంది. వివాహంతో స్త్రీ తన గణంనుంచి బయటికి పంపివేయబడింది. భర్త తాలూకు గణ సంఘంలో చేర్చుకోబడింది. ఆవిధంగా కొత్త గణంలో ఆమె స్థానానికి ఒక ప్రత్యేకత వుంది. ఇప్పుడు ఆమె గణ సభ్యురాలే కాని రక్తబంధుత్వం లేదు. ఆమెను ఆ గణంలో చేర్చుకొన్న విధానం చూస్తే, వివాహం ద్వారా తను ప్రవేశించిన గణంలో ఆమె వివాహం చేసుకొనేందుకు ముందునుంచీ ఎటువంటి నిషేధమూ లేదని స్పష్టపడుతుంది. గణానికి సంబంధించిన వైవాహిక కూటంలో ఆమెను చేర్చుకొన్నారు. ఆమె భర్త చనిపోతే అతని ఆస్తిలో కొంతభాగం ఆమెకు వస్తుంది. అంటే తనతోడి గణ సభ్యుని ఆస్తిలో వాటా ఆమెకు వస్తుందన్నమాట. ఆ ఆస్తి గణాన్ని విడిచి బయటకు పోకూడదనడంలో అసహజం ఏమీలేదు. అది గణంలోనే వుండాలంటే తన మొదటి భర్తయొక్క గణంలోనివానినే పెళ్లిచేసుకోవాలి. పైవానిని చేసుకోకూడదు. ఆ విషయంలో ఆమెకు మినహాయింపు వర్తింపచేయగలవాడు, ఆమెకా ఆస్తినిచ్చిన మొదటి భర్త మాత్రమే. ఆమెకు ఆస్తిలో కొంతభాగం ఇస్తూ, వివాహం ద్వారాగాని వివాహానికి ఫలితంగా గాని ఆ ఆస్తిని మరో గణంలోకి తీసుకొని పోవచ్చుననే హక్కు సంక్రమింపచేసిననాటికి అతడు తన ఆస్తికి

అధికారిగానే వున్నాడు. అందుచేత అతడు తన ఆస్తిని తన యిష్టానుసారం ఖర్చు చేసు కొన్నట్లయిందేగాని వేరుకాదు. ఆమెకూ, ఆమె భర్త గణానికీ మధ్యనున్న సంబంధం — అతడామెను తన ఇష్టానుసారం వివాహం చేసుకొని గణంలోకి ప్రవేశపెట్టాడేగాని వేరుకాదు. అందుచేత పెళ్లిచేసుకొని ఆ గణంలోంచి బయటకు వెళ్లిపోయే అధికారం ఆమె కివ్వ గలవాడు అత్యంత సహజంగా ఆమె భర్త మాత్రమే. అంటే రోమను గణాలలో అంతర్వి వాహ పద్ధతి వున్నదనే అభిప్రాయాన్ని వదలివేస్తే విషయం విస్పష్టం అవుతూంది. గణాలు బహిర్వివాహ పద్ధతినే అనుసరించేవని మోర్గన్ చెప్పినదానినే అంగీకరించాలి.

ఇంక చాలమందిలో ప్రచలితంగా వున్న మరో అభిప్రాయం వుంది. వీరి అభిప్రాయం ప్రకారం లివీ వాక్యాల భావం యిదీ:

> "స్వతంత్రం పొందిన బానిస యువతులు (libertae) ప్రత్యేకానుమతి లేనిదే e gente enubere (గణం వెలుపల వివాహం చేసుకోలేరు, లేక capitis diminutio minima అంటే కుటుంబ హక్కులకు కించిత్తు నష్టం కూడా వాటిల్లకుండా వుండటంతో సంబంధించినది గనుక స్వతంత్రురాలైన బానిస యువతి (liberta) గణ కూటాన్ని విడిచిపెట్టేందుకు దారితీసే ఏ పని చెయ్యాలన్నా సాధ్యంకాదు." (లాంగె "రోమన్ ప్రాచీనాచారాలు," బెర్లిన్, 1856, సంపుటి 1, పుట 195లో హూష్కెని గూర్చి వ్యాఖ్యానిస్తూ లివీయొక్క పై వాక్యానికి అర్థం చెప్పాడు.)

ఇదే అంగీకరించవలసివస్తే స్వతంత్రురాండ్రయిన రోమను స్త్రీల హోదా ఏమిటో అర్థం కాకుండా పోతుంది. గణంలోనే వారు వివాహంచేసుకోవలసి వుంటుందనడానికి ఆస్కారం యింకా తగ్గిపోతుంది.

Enuptio gentis గణం వెలుపల వివాహం చేసుకోవాలనే మాట లివీయొక్క ఈ వాక్యంలో తప్ప రోమను సాహిత్యంలో మరెక్కడా కనబడదు. Enubere (వెలుపల వివాహం) అనే మాట మూడుచోట్లనే కనిపిస్తుంది. అది కూడా లివీ పుస్తకంలోనే, అక్కడ కూడా దానికి గణ శబ్దంతో సంబంధం లేదు. రోమను స్త్రీలు తమ గణంలోని వారినే వివాహం చేసుకోవలసివుండేదనే అభూత కల్పనకు ఆధారం ఈ వాక్యం ఒక్కటే. కాని అది విమర్శకు ఎంతమాత్రం నిలబడదు. స్వతంత్రం పొందిన బానిస స్త్రీలకు మాత్రమే వర్తించే ప్రత్యేక నిబంధనలను గురించినదయివుండొచ్చు ఆ వాక్యం. అదే అయితే పుట్టుకనుంచీ స్వతంత్రురాండ్రే అయిన స్త్రీలకు (ingenuae) అది వర్తించదు. అలాగాక స్వతంత్రం గానే జన్మించిన స్త్రీలకు కూడా అది వర్తించేటట్లయితే స్త్రీలందరూ తమ గణం వెలుప లనే వివాహమాడాలనే నిబంధన వుండేదనీ, వివాహానంతరం వారు తమ భర్త గణంలోకి

మార్చబడేవారనీ దాని అర్థం. ఆవిధంగా మోమ్సెన్ అభిప్రాయం తప్పు అనీ, మోర్గన్ మాటే సరియనీ తేలుతూంది.

ఫేబియన్ల కులీన గణం సెనేట్ అనుమతి పొంది, పొరుగున వున్న వెయీ పట్టణం మీద దాడిచేయగలిగిందంటే, రోము ఏర్పడి దాదాపు మూడువందల సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా గణ వ్యవస్థ తాలూకు బంధనాలు ఎంత దృఢంగా నిలిచాయో అర్థం చేసుకోవచ్చు. మూడు వందల ఆరుగురు ఫేబియన్లు ఆ పట్టణంమీదికి దాడి వెళ్లారట. యీ నగరవాసులు దారికాచి అందరినీ హతంచేశారు. ఒక్క కుర్రవాడు మాత్రమే తప్పించుకు బయటపడ్డాడు. అతడే ఆ గణాన్ని మరల పరివ్యాపింపజేశాడు.

పదేసి గణాలు సోదర కూటంగా ఏర్పడతాయనీ, దానినిక్కడ క్యూరియా అంటారనీ, దానికి గ్రీకులలోని సోదర కూటానికి వున్నవానికన్న ఎక్కువ ప్రధానబాధ్యత లుండేవనీ పైన చెప్పాను. ప్రతి క్యూరియాకూ వేర్వేరు మతాచారాలుండేవి. పురోహితులు, పవిత్ర వస్తు శేషాలూ దేనికి దానికే వేరు. పురోహితులంతా కలిసి రోమను మతాచార్యుల పీఠంగా ఏర్పడేవారు. పది క్యూరియాలు ఒక తెగ. బహుశా ఆరంభంలో ప్రతి తెగకూ ఎన్నుకొన్న నాయకుడు వుండేవుంటాడు – అతడే యుద్ధకాలంలో నాయకుడూ పురోహితుడు కూడ. ఇతర లాటిన్ తెగలలో ఇదే ఆచారం వుండేది. మూడు తెగలూ కలిసి రోమను ప్రజలు populus romanus అయారు.

ఈవిధంగా, రోమను గణాలలో దేనికో ఒకదానికి చెందివుండి, తత్కారణంగా ఏదో ఒక క్యూరియాలోనూ, తెగలోనూ సభ్యులైన వారు మాత్రమే రోమను ప్రజకు చెందగలరు. రోమను ప్రజల పాలనా నిర్వహణ మొట్టమొదట కింది విధంగా వుండేది. ప్రభుత్వ వ్యవహారాలను సెనేట్ నిర్వహించేది. దీనిలో మూడువందల గణాల నాయకులూ వుండేవారని నిబుర్ రాసినది నిజం. గణాల పెద్దలు గనక వారిని patres – పితరులు – అనేవారు. వారితో ఏర్పడిన సెనేట్ – పెద్దల సమితి. Senate – senex వృద్ధుడు – అనే మాటనుంచి ఏర్పడింది. ఈ పెద్దల్ని ఎన్నుకొనేటప్పుడు కూడా వారిని ఒకే కుటుంబంలోంచి ఎన్నుకోవడం ఆచారం అయింది. ఆవిధంగా ఆనువంశిక కులీన కుటుంబాలు ఏర్పడ్డాయి. వీరు తమను తాము పాట్రీషియన్లు (కులీనులు) అని పిలుచుకొనేవారు. సెనేట్ సభ్యత్వాలకూ, ఇతర ప్రభుత్వోద్యోగాలకూ తమవరకే హక్కుగలదని చెప్పుకొనేవారు. ప్రజలు ఈ మాటకు అభ్యంతరం చెప్పకపోయేసరికి క్రమంగా అది వారి హక్కుగానే తయారయింది. మొట్టమొదటి సెనేటర్లకూ, వారి వారసులకూ పాట్రీషియను హోదాలను రోములస్ స్థిరపరచాడన్న కథ దీనినే చెప్తూంది. ఎథీనియన్ bulêకు లాగే సెనేట్‌కు కూడా అనేక వ్యవహారాలలో నిర్ణయాలు తీసుకొనే హక్కు వుంది. ప్రధాన విషయాలలో, ముఖ్యంగా కొత్త చట్టాలు చేయవలసి వున్నప్పుడు ప్రాథమిక చర్యలు తీసుకునే హక్కు దానికి వుంది.

ప్రజాసభ వానిమీద నిర్ణయాలు తీసుకొనేది. దానికే comitia curiata—(క్యూరియాల సమావేశం)—అని పేరు. క్యూరియా వారీగా ప్రజలు సమావేశం అయేవారు: ప్రతి క్యూరియాలో బహుశా గణాలనుబట్టి కూర్చునేవారు. సమస్యలను నిర్ధారణ చేయ వలసి వచ్చినప్పుడు ముప్ఫయి క్యూరియాలలో ప్రతిఒక దానికీ ఒక వోటు వుండేది. క్యూరియాల సమావేశం చట్టాలు ఆమోదించవచ్చు, నిరాకరించవచ్చు. Rex (రాజు) అనబడే అధికారితోసహా ఉన్నత పదవుల్లో వారందర్నీ అదే ఎన్నుకుంటుంది. యుద్ధ ప్రకటన చేసేది. (శాంతి కుదుర్చుకొనే అధికారం సెనేట్‌కు—శాసనసభకు—వుండేది.) రోమను పౌరులకు మరణశిక్షలు విధించబడిన సందర్భాలన్నింటా, కక్షిదారులు చేసుకొనే అప్పీళ్లలో అది సుప్రీం కోర్టుగా అంతిమ తీర్పు నిచ్చేది. శాసనసభ, ప్రజాసభలతోపాటు "రెక్స్" వుండేవాడు. గ్రీకుల బాసిలసువంటివాడే ఈయన. అంతేగాని మోమ్సెన్ చెప్పినట్లు ఆయన నిరంకుశ ప్రభువుకాదు.* రెక్స్ సైన్యాధిపతి కూడాను. ఆయనే ఉన్నత మతాచార్యుడు. కొన్ని న్యాయస్థానాలలో అధ్యక్షపీఠం అధిరోహిస్తాడు. పౌరజీవితానికి సంబంధించిన అధికారాలేవీ ఆయనకు లేవు. సైన్యాధిపతిగా క్రమశిక్షణ నమలుపరచ వలసినంతవరకూ, న్యాయాధ్యక్షుడుగా శిక్షను అమలుపరచవలసినంతవరకూనే తప్ప అంతకు మించి పౌరుల జీవితాలు, స్వాతంత్ర్యం, ఆస్తిమీద ఆయనకే విధమైన అధికారం లేదు. రెక్స్ పదవి వంశపారంపర్యం కాదు. అందుకు భిన్నంగా ఆయనను ఎన్నుకొనేవారు. బహుశా అంతకుపూర్వం ఆ పదవిలో వున్నవాడు అతని పేరు సూచించేవాడో ఏమో. మొదట క్యూరియాల సభ అతనిని ఎన్నుకుంటుంది. తర్వాత రెండవ సభ అతనిని లాంఛనపూర్వకంగా స్థిరపరిచేది. టార్క్వినియస్ గర్విష్ఠుకి పట్టిన గతి చూస్తే రెక్సును తొలగించే హక్కు కూడా వుండేదని ధ్రువపడుతుంది.

వీరయుగంనాటి గ్రీకులలో మాదిరిగానే, ఈ రాజు లనబడేవారి కాలం నాటి రోమను

---

* లాటిన్ భాషలోని rex, కెల్టిక్-ఐరిష్ ప్రజల righ, గోథిక్ ప్రజల reiks ఇవన్నీ ఒక్కటే. దీనికి అర్థం తెగనాయకుడు. జర్మను Fürst, ఆంగ్లేయుల first, డేనుల förste ("ప్రధాన") లాగే ఇదీను. నాలుగో శతాబ్దంలో గోథిక్ ప్రజలందరికీ సైన్యాధిపతి అయిన వానిని (ఈతడే భవిష్యత్తులో రాజు అయాడు) thiudans అని పిలిచేవారు. బైబిలుకు ఉల్ఫిల చేసిన అనువాదంలో ఆయన అర్టక్సేర్‌క్సెస్‌నుగాని, హెరోద్‌నుగాని ఎక్కడా reiks అనలేదు. వారిని thiudans అన్నాడు. టిబెరియస్ చక్రవర్తి రాజ్యాన్ని reiki అనలేదు, thiudinassus అన్నారు. గోథిక్ ప్రజలలోని తియూడన్స్ శబ్దాన్ని తియుడరేక్స్ రాజు అని అనువదిస్తున్నారు. అది తప్పు. థియొడోరిహ్ (జర్మన్లలో డీట్రిహ్) అని రెండు పేర్లు కలిపి పలకాలి. (ఎంగెల్స్ వివరణ.)

లలో కూడా సైనిక ప్రజాస్వామ్యం వుండేది. గణాలు, సోదర కూటాలు, తెగల వ్యవస్థనుంచే అది పరిణతి పొందింది. వానిమీదనే ఆధారపడి ఏర్పడింది. క్యూరియాలు, తెగలూ అనేవి కృత్రిమములయిన వ్యవస్థలయినా సమాజంలో ఆవిర్భవించిన నిసర్గమైన, సహజమైన నమూనాలనుంచి అవి ఏర్పడ్డాయి. ఆ నమూనా వ్యవస్థలు యింకా సమాజంలో చుట్టూ వుండనే వున్నాయి. సహజక్రమంలోనే బలపడిన కులీన ప్రభువర్గం బలవత్తరం అయింది. రెక్సలు తమ అధికారాన్ని క్రమంగా విస్తరింపచేసుకొంటూ వున్నా వ్యవస్థ నిర్మాణంయొక్క ప్రాథమిక మౌలిక లక్షణాలలో మార్పు రాలేదు. అదే ప్రధానమైన విషయం.

ఈ మధ్యకాలంలో రోము జనాభా, రోమను భూభాగమూ బాగా పెరిగాయి. కొత్త ప్రాంతాలను ఆక్రమించుకొని భూభాగాన్ని పెంచారు. వారికి స్వాధీనం అయిన లాటిన్ జిల్లాలనుంచి, యితర ప్రదేశాలనుంచి ప్రజలు వలసరావడంతో నగర జనాభా పెరిగింది. ఈ కొత్త జనం అంతా (ప్రస్తుతానికి భూస్వాముల రక్షణలోని సామాన్యుల సమస్యను వదిలేద్దాం) వెనుకటి గణాలకు, సోదర కూటాలకు, తెగలకు చెందినవారు కాదు. అందుచేత వారిని రోమను ప్రజగా (populus romanus) లెక్కకట్టలేదు. వ్యక్తిగతంగా వారు స్వతంత్రులు. భూములు పెట్టుకోవచ్చు. పన్ను లివ్వాలి. సైనికులుగా పనిచెయ్యాలి, కాని, వారికి వుద్యోగాలివ్వలేదు. క్యూరియా సమావేశాలలో వారు పాల్గొనడానికి వీలులేదు. జయించిన రాష్ట్రాలలోని ప్రభుత్వ భూములను పంచేటప్పుడు వారికి వాటాలు లేవు. వారినే ప్లెబియను (సామాన్య) లన్నారు. ప్రభుత్వ వ్యవహారాలలో వారి కెట్టి హక్కులూ లేవు. క్రమంగా వారి సంఖ్య పెరిగింది. వారికి సైనిక శిక్షణ లభించింది. వారివద్ద ఆయుధాలున్నాయి. అందుచేత, కొత్తవారిని చేర్చుకోకుండా తలుపులు బిడాయించుకున్న వెనుకటి ప్రజలకు యీ నూతనులు క్రమంగా ప్రమాదకరంగా తయారయ్యారు. రోమను ప్రజలకూ, ప్లెబియనులకూ భూములు సమానంగానే పంచిపెట్టనడినట్లు తోస్తుంది. పారిశ్రామిక సంపదా, వ్యాపార సంపదా చెప్పదగినంత విశేషంగా లేకపోయినా, ప్రధానంగా అది ప్లెబియనుల చేతులలోనే వుండివుండాలి.

రోము నగరనిర్మాణం గురించీ ప్రారంభకాలపు చరిత్రను గురించీ అనేక అద్భుతగాథలు ప్రచారంలో వుండటంవల్ల వానిని అంధకారంలో పెడుతున్నాయి. వానిపై వ్యాఖ్యానించి నివేదికలు తయారుచేసిన న్యాయశాస్త్ర ప్రవీణుల రాతలు ఆ అంధకారాన్ని మరింత గాఢం చేస్తున్నాయి. ఫలితంగా ఆ కాలపు పరిస్థితులను గురించి స్పష్టంగా ఏం చెప్పడానికీ వీలు లేకుండా వచ్చింది. వెనుకటికాలపు గణవ్యవస్థను నిర్మూలించిన ఆ మహావిప్లవం ఎలా సాగింది? ఎందుకు జరిగింది? — చెప్పలేకున్నాము. ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. ప్లెబియన్లకూ, రోమన్ ప్రజలకూ మధ్య జరిగిన ఘర్షణలే ఆ విప్లవానికి కారణం.

నూతన పాలనా నిర్వహణ ప్రకారం, గ్రీకుల నమూనాలో, ముఖ్యంగా సొలోన్ చట్టం

నమూనాలో రెక్స్ సెర్వియస్ టులియస్ కొత్త ప్రజాసభను ఏర్పాటుచేసినట్లు చెప్తారు. దాని ప్రకారం సైనిక కొలువుచేస్తే ప్రజాసభలో రోమను ప్రజలూ, ప్లెబియనులూ కూడ వుండేవారు. చెయ్యనివారు మినహాయింపబడేవారు. ఎవరు సైన్యములో ఉన్నారు, ఎవరు లేరు అనేదొక్కటే అర్హత అయింది. సైన్యాలలోకి పనికివచ్చే వయస్సున్న మగవాళ్లం దర్నీ ఆస్తినిపట్టి ఆరు తరగతులుగా విభజించారు. మొదటి అయిదు తరగతులకూ ఆస్తులు ఈ విధంగా వుండాలి. 1. లక్ష ఆసులు; 2. 75 వేల ఆసులు; 3. 50 వేల ఆసులు; 4. 25 వేల ఆసులు; 5. 11 వేల ఆసులు. వీటిని మార్కులలోకి మారిస్తే 1–14,000; 2–10,500; 3–7,000; 4–3,600; 5–1,570 వుంటుందని ద్యురో డి ల మాల్ రాస్తున్నాడు. అంతకంటే తక్కువ గల ఆరవ తరగతి ప్రొలిటేరియన్లు (శ్రామికులు) వారికి పన్నులుండవు. వారు సైన్యాలలో కొలువుచేయనక్కరలేదు. ఈ నూతన ప్రజాసభను సెంచురియాట (comitia centuriata) అన్నారు. సైనికుల మాదిరిగా ప్రజలను నూరేసిమందిని ఒక్కొక్క ముఠాగా విడదీస్తారు. ఆ ముఠానే సెంచురియా – (శతం) అంటారు. ప్రతి శతానికీ ఒక్కొక్క వోటు వుంటుంది. వానిలో ఒకటవ తరగతి వారివి 80, రెండవ తరగతివి 22, మూడవ దానివి 20, నాలుగో దానివి 22, అయిదో దానివి 30 శతాలు. నామమాత్రంగా ఆరో తరగతికి ఒక శతం ఇచ్చారు. దీనికి బాగా ధనవంతులైన వారితో ఏర్పడిన అశ్వసైన్యాలవి 18 శతాలు వుండేవి. అంతా కలిపి 193 శతాలు. అందుచేత మెజారిటీ కావాలంటే 97 ఓట్లు కావాలి. అశ్వసైన్యాలవీ, మొదటి తరగతి వారివీ కలిపి 98 ఓట్లు వున్నాయి. వారిద్దరూ కలిస్తే ఇతరులతో ప్రమేయం లేకుండానే నిర్ణయాలు చేయగలుగుతారు.

ఏవో కొన్ని నామమాత్రపు ప్రత్యేకాధికారాలు మినహా వెనుకటి క్యూరియాల సమావేశాలకుంటూ వచ్చిన రాజకీయాధికారా లన్నీ కొత్త సంచురియా సమావేశాలకు లభించాయి. ఫలితంగా క్యూరియాలూ, వానిలో వుండే గణాలూ ఏథెన్సులో మాదిరిగా కేవలం విభిన్న ప్రైవేటు మతాచార సంస్థలుగా దిగజార్చబడ్డాయి. ఆవిధంగానే చిరకాలంపాటు కొనసాగాయి. కాని క్యూరియాల సమావేశం రూపుమాసిపోయింది. వెనుకటి తెగలు మూడింటినీ రాజ్యం నుంచి తప్పించేందుకై నాలుగు ప్రాంతీయ తెగల్ని సృష్టించారు. ఒక్కొక్క తెగకు నగరంలో నాలుగో భాగాన్ని కేటాయించారు. వాటిలో ప్రతిదానికీ కొన్ని రాజకీయ హక్కులు ఉన్నాయి.

ఈ విధంగా రోములో కూడా రాజరిక అధికారం అనబడేది రద్దుకాక పూర్వమే రక్తసంబంధాలమీద ఏర్పడిన వెనుకటి సమాజ వ్యవస్థ అంతరించింది. మొదటి ప్రభుత్వ చట్టాన్ని రద్దుచేసి, ప్రాంతీయ విభజనా, సిరిసంపదల హెచ్చుతగ్గులూ మీద ఏర్పడిన నిజమైన కొత్త పాలనా నిర్వహణను అమలు జరిపారు. సైన్యంలో పనిచేసి తీరవలసిన

పౌరులు ప్రభుత్వ బలగంగా ఏర్పడ్డారు. వారు బానిసలను అణచడానికే కాకుండా, సైనిక కొలువునుండి మినహాయింపబడి, ఆయుధాలు ధరించే హక్కులేని శ్రామికులు అనబడేవారికి వ్యతిరేకంగా కూడా యీ ప్రభుత్వాధికారం ఉన్ముఖం చెయ్యబడింది.

అసలైన రాజ్యాధికారాలన్నీ స్వాధీనపరచుకొన్న చివరి రెక్స్ టార్క్వినియస్ గర్విష్ఠిని తరిమేసి, ఆయనకు బదులు ఇరాక్వ్యాలలో మాదిరిగా సమానాధికారాలున్న ఇద్దరు సైన్యాధిపతులను (కాన్సల్‌లు) నియమించారు. దీనితో నూతన రాజ్య వ్యవస్థ మరింత గట్టిపడింది. రోమను రిపబ్లిక్ చరిత్ర అంతా యీ రాజ్య వ్యవస్థ పరిధిలోనే గడిచింది. ఉద్యోగాలకోసమూ, ప్రభుత్వం యాజమాన్యంలో వున్న భూములలో వాటాకోసమూ పాట్రీషియన్లకూ (కులీనులు) ప్లెబియన్లకూ (సామాన్యులు) మధ్య ఎన్నో పోరాటాలు జరిగాయి. క్రమంగా పాట్రీషియను (కులీన) తరగతి కొత్తగా ఏర్పడ్డ భూస్వామ్య—ధనస్వామ్యవర్గంలో చేరిపోయింది. సైన్యాలలో చేరడంతో కుంగిపోయిన రైతుల భూములన్నీ క్రమంగా ఈ కొత్త వర్గం స్వాధీనంలోకి పోయాయి. ఆవిధంగా తమ చేతికి వచ్చిన విశాల భూఖండాలను వారు బానిసల తోడ్పాటుతో సాగుచేసుకొన్నారు. ఇటలీ అంతటా జనసమ్మర్దం తగ్గిపోవడానికి కారకులయారు. ఈవిధంగా సామ్రాజ్య పాలనకే కాకుండా, ఆ తర్వాత జర్మను అనాగరిక తెగల ఆగమనానికి కూడా మార్గాన్ని సుగమం చేశారు.

# VII

## కెల్టులలోనూ, జర్మన్లలోనూ గణం

అనేకమంది ఆటవిక, అనాగరిక ప్రజాసమూహాలలో ఈనాటికీ చాలవరకు శుద్ధమైన రూపంలో గణసంస్థలు కనిపిస్తూనే వున్నాయి. వాటన్నింటినీ గురించి రాయడానికి ఇక్కడ చోటు చాలదు. ఆసియాలోని నాగరిక జాతుల ప్రాచీన చరిత్రలో కనిపించే ఆ మాదిరి సంస్థల జాడలను వివరించడానికి కూడా చోటు చాలదు. ఏదో ఒకటి ఎక్కడో అక్కడ ప్రతి అడుగునా అగతగులుతూనే వుంటుంది. ఏవో కొద్ది వుదాహరణ లిస్తాను. గణాన్ని తప్పుగా అర్థం చేసుకోడంలో విశేష శ్రమపడ్డ మాక్‌లెన్నాన్ గణాలంటూ వుండేవని తెలియక పూర్వమే వానియొక్క ప్రధాన లక్షణాలను చూపాడు. చాల సరిగ్గా వర్ణించాడు. కల్మీకులలోనూ, చెర్కేషియనులలోనూ, సామోయెదులలోనూ,* వార్లీ, మాగార్, మున్ను

* నేంత్సీలకు యిది పాత పేరు. — సం.

పోరీలనే ఇండియన్ జాతులలోనూ ఈ వ్యవస్థ వుందని చూపించాడు. ష్టావ్‌లు, ఖెవ్‌సూర్‌లు, స్వానేతియన్‌లు మొదలయిన కకేషియను తెగలలో ఈ గణవ్యవస్థ వున్నదని ఈమధ్యనే కొవలేవ్‌స్కీ కనుక్కొని వర్ణించాడు. కెల్టులూ, జర్మన్లలో వున్న గణ వ్యవస్థల్ని గురించి నాలుగు మాటలిక్కడ చెప్పకొనేందుకు మనం పరిమితమవుదాం.

ఇప్పటికీ అమలులోనున్న అతి ప్రాచీనకాలపు కెల్టిక్ చట్టాలను చూస్తే ఆనాటికి గణాలు మంచి ఉచ్ఛస్థితిలో వున్నట్లు కనబడుతుంది. ఐర్లండులో, ప్రజల మానసిక ప్రవృత్తులలో ఈనాటికీ అది సజీవంగా వుంది. ఇంగ్లీషువాళ్లు దానిని బలాత్కారంగా రద్దు చేసినా అది వారి మనస్సులలోంచి తొలగనే లేదు. గత శతాబ్దం మధ్యవరకూ అది స్కాట్లండులో మంచి ఉచ్ఛస్థితిలో వుంది. అక్కడ కూడా అది బ్రిటిషువాళ్ల ఆయుధాలు, చట్టాలు, కోర్టుల బలానికి మాత్రమే లొంగిపోయింది.

ఇంగ్లీషువాళ్ల ఆక్రమణకు ఎన్నో శతాబ్దాల క్రితమే రాయబడిన ప్రాచీనకాలపు వెల్ష (వేల్సుదేశపు) చట్టాలు[131] (ఇవి పదకొండో శతాబ్దానికి పూర్వమే రాయబడ్డాయి) చూస్తే గ్రామాలకి గ్రామాలు సమూహంగా వ్యవసాయం చేయడం కనిపిస్తుంది. అది సార్వత్రికం కాకపోయినా, ఒకప్పుడు సర్వత్రా ఆ ఆచారం అనుసరించబడేది. ప్రతి కుటుంబానికీ స్వంతంగా చేసుకొనేటందుకు అయిదేసి ఎకరాలుండేవి. ఆ భూమిగాక అందరూ కలిసి వ్యవసాయం చేసుకొని పంటను పంచుకొనే భూమి కొంత వేరే వుండేది. ఈ గ్రామ సంఘాలు గణాలన్నా అయివుంటాయి, లేదా వాని శాఖలన్నా అయివుంటాయనడంలో సందేహం ఉండజాలదు. నాకు వ్యవధి లేనందున నేను పునఃపరిశీలించలేకపోయిన వెల్ష చట్టాలను గురించి కొత్త పరిశీలనలు దీనిని బలబరచనప్పటికీ (వాటిని గురించి నేను రాసుకొన్న అంశాలు 1869 నాటివి[132]) ఐర్లండు స్కాట్లండుల సారూప్యాలే దీనికి రుజువులు. అయితే ఐరిషు, వెల్ష సమాచారాన్ని పరిశీలిస్తే పదకొండో శతాబ్దంనాటి కింకా కెల్టులలో జంట వివాహపద్ధతి పోయి దంపతీ వివాహ వ్యవస్థ ఏర్పడలేదని కనిపిస్తుంది. వేల్సులో వివాహ విచ్ఛేదం అసాధ్యం కాలేదు. ఏడేళ్లు జరిగిపోయే లోపున రద్దుకు దరఖాస్తు పెట్టుకోవచ్చు. ఏడేళ్లు కావడానికి మూడేమూడు రాత్రులు తరవాయి వుండగానైనా వివాహితులు విడిపోవచ్చు. అప్పుడు వారు తమ ఆస్తిని పంచుకొంటారు. ఆడుది వాటాలు వేస్తుంది. మగవాడు ఏరుకుంటాడు. ఇంట్లో సామాన్లు పంచుకోవడం విషయంలో చాలా విచిత్రమైన నిబంధనలున్నాయి. మగవాడు విడాకులు కోరివుంటే ఆడుదానికి ఆమె తెచ్చిన కట్నాన్నీ, మరికొన్ని యితర సామానుల్నీ తిరిగి ఇచ్చెయ్యాలి. ఆడుది విడాకులు కోరితే ఆమెకు వచ్చేది తగ్గుతుంది. ముగ్గురు పిల్లలుంటే రెండో సంతానాన్ని ఆడుదీ, మిగిలిన ఇద్దర్నీ మగవాడూ తీసుకుంటారు. విడాకులు పొందాక ఆడుది మళ్లీ పెళ్లిచేసుకొంటే కూడ ఆమె మొదటి భర్త ఆమెను పిలుచుక పోతే, రెండో మగని మంచంమీద ఒక కాలు పెడు

తున్నా, ఆమె మొదటి భర్తవెంట వెళ్లక తప్పదు. స్త్రీ పురుషు లిద్దరూ ఏడేళ్లపాటు కలిసి జీవిస్తే, పెళ్లి తంతు జరగక పోయినా వారిద్దరూ భార్యాభర్తలుగానే పరిగణింపబడు తారు. వివాహానికి పూర్వం కన్యల కన్యాత్వం గురించి పెద్ద పట్టింపులు లేవు. అది రక్షింప బడాలనే నియమమూ లేదు. ఈ విషయాన్ని గురించిన నిబంధనలు చాలా అసందర్భంగా కనిపిస్తాయి. బూర్జువా నైతిక నిబంధనల కవి పూర్తిగా విరుద్ధం. స్త్రీ మరొకనితో సంగ మిస్తే మగడు ఆమెను కొట్టడం తప్పుకాదు. మూడు సందర్భాలలో మాత్రమే మగడు భార్యను శిక్ష భయంలేకుండా కొట్టవచ్చు. వానిలో ఇదొకటి. అలాగ కొట్టడం మగని హక్కులలో ఒకటి, అలా కొట్టాక ఆమెపైన మరి తప్పువెయ్యడానికి వీలులేదు ఏమంటే

"ఒక తప్పుకు రెండు శిక్షలులేవు, పరిహారమో, ప్రతిక్రియో – అంతే."[133]

ఆస్తి విషయంలో నష్టపడకుండా విడాకులు కావాలనడానికి రకరకాల కారణాలను ఆడుది చూపవచ్చును. మగవాని నోరు దుర్వాసన వేస్తూంటే చాలు విడాకులు కోరవచ్చు. మొదటి రాత్రి అనుభవించే హక్కుకు పరిహారంగా తెగ నాయకుడికీ లేక రాజుకూ చెల్లించవలసిన ధనం చట్టాలలో ప్రముఖంగా కనిపిస్తుంది. [Gobr merch అంటారు దీనిని, మధ్య యుగాలలో దీనిని marcheta అన్నారు, ఫ్రెంచిలో marquette అంటారు.] ప్రజా సభలలో వోటు చేసే హక్కు స్త్రీల కుంది. ఐర్లండులో కూడా ఇటువంటి పరిస్థి తులే వున్నట్లు కనబడుతుంది. కాలపరిమితిగల వివాహాలు అక్కడా పరిపాటే. విడాకుల ప్పుడు స్త్రీల విషయంలో ఉదారమైన సౌకర్యాలున్నాయి. వాటిని స్పష్టంగా నిర్దేశించారు కూడా. ఆఖరికి ఇంట్లో చాకిరీ చేసినందుకు ప్రతిఫలం కూడా ఇప్పిస్తారు. అనేకమంది భార్యలలో ఒకామె ప్రధాన భార్యగా వుండేది. చనిపోయిన వాని ఆస్తిని పంచడంలో పిల్లలు చట్టబద్ధంగా పెళ్లిచేసుకొన్న ఆమెకు కలిగారా, లేదా అనేది పరిగణించేవారు కాదు. ఈ జంటపెళ్లి నిబంధనలు చూస్తే, ఉత్తర అమెరికా ప్రజలలోని వివాహ నిబంధనలు చాల కఠోరంగా వున్నాయనిపిస్తాయి. సీజరు కాలంనాటికి యింకా గుంపుపెళ్లి ఆచారంలో వున్న ప్రజలు పదకొండో శతాబ్దంనాటికి ఈ ఆచార స్థితిలోనే వున్నారంటే ఆశ్చర్యంలేదు.

ఐరిషుగణాన్ని (sept వీరిలో తెగను clainne క్లాన్ అంటారు) గురించి ప్రాచీన కాలపు న్యాయశాస్త్ర గ్రంథాలు చెప్తున్నాయి. వానిని వర్ణిస్తున్నాయి. తెగ తాలూకు భూములను ఇంగ్లీషురాజు రాజ్యభాగాలుగా మార్పించేటందుకు పదిహేడో శతాబ్దంలో అక్కడకు పంప బడిన ఇంగ్లీషు న్యాయశాస్త్రవేత్తలు కూడా దానిని ధృవపరుస్తున్నారు. తెగ నాయకులు భుక్తంచేసుకోనివి తప్ప మిగిలిన భూములు తెగ అంతటి సొత్తుగా పరిగణించబడుతుండేవి. అప్పటికే నాయకులు భూములు తమవనడం ప్రారంభమయింది. ఒక గణసభ్యుడు చనిపోయి, ఆ యింటివాళ్లు చెదిరిపోయినప్పుడు గణనాయకుడు (ఇతనిని ఇంగ్లీషు న్యాయ శాస్త్రవేత్తలు caput cognationis అన్నారు) గణం తాలూకు భూమినంతనూ

ఇళ్ల వరసన తిరిగి పంచిపెట్టేవాడు. జర్మనీలో అనుసరించిన మాదిరి నిబంధనలవంటి వాని ప్రకారమే సాధారణంగా ఇదీ జరుగుతూ వుండి వుండాలి. Rundale* పద్ధతులలో భూములను చేసుకొనే గ్రామా లిప్పటికీ కొన్ని వున్నాయి. నలభయి యాభై ఏళ్ల క్రితం ఇవి చాలా ప్రచురంగా వుండేవి. గణం తాలూకు ఉమ్మడి భూమిగా ఒకప్పుడు వున్నదానిని విడి విడిగా సేద్యం చేసుకుంటూ వుండిన రైతులు ఇంగ్లీషువాళ్ల ఆక్రమణ అనంతరం తమ తమ భూమికి పన్ను ఇచ్చుకోవడం వచ్చింది. అయితే సేద్యానికి పనికివచ్చే భూమినీ, గోభూమినీ కలిపి వాటాలుగా పంచుకొనేవారు. ఆయా భూమి వున్నచోటు, దాని మంచి చెడ్డలూ పట్టి పీలికలు చేసేవారు. వీనిని "గెవన్" అని మోసెల్‌లో పిలుస్తారు. ప్రతీ గవన్ లోనూ ప్రతి రైతుకూ కాస్త కాస్త భూమి ఇస్తారు. పచ్చిక బీళ్లూ, చౌడుపర్రలూ సమష్టిగా వుండేవి. ఏభయ్యేళ్ల క్రితం కూడా అప్పుడూ అప్పుడూ, కొన్ని చోట్ల ఏటేటా కూడా, భూముల నీ విధంగా పంచుకొంటుండేవారు. రుండాల్ పద్ధతి అనుసరిస్తున్న అచ్చంగా జర్మనీదేశపు మోసెల్ నదీతీరానా, లేక హోహ్‌వాల్డ్‌లలో అనుసరింపబడే (Gehöfer-schaft) వ్యవసాయ కుటుంబాల సంఘం నమూనాలాగే కనిపిస్తుంది. గణం "factions"** రూపంలో కొనసాగుతుంది. ఐర్లండులోని రైతులు పార్టీలుగా ఏర్పడే పద్ధతి అర్థంలేని పూర్తి అవకతవక విభజనమీద ఆధారపడి వుంది. ఇంగ్లీషువాళ్లకది అర్థమే కాదు. ఈ పార్టీలు కుస్తీలకోసమే నన్నట్లు కనిపిస్తుంది. చావచితకకొట్టుకోవడం వాళ్ల ఆట. వెనుకటి గణాల అవతారాలివి. పూర్వకాలపు గణవ్యవస్థ తాలూకు భావన వీనిలో ప్రత్యక్షం అవుతూవుంది. సందర్భవశాత్తూ ఒక విషయం చెప్పకోవాలి. ఒకే గణానికి సంబంధించిన సభ్యులు తమ పాత గణ భూములలో కలిసి జీవించడం ఇప్పటికీ అక్కడక్కడ కనిపిస్తుంది. ఉదాహరణకి — పూర్వపు మొనాఘన్ కౌంటీలో నివసిస్తున్న వారిలో అధిక సంఖ్యాకులలో 1830–40 మధ్య నాలుగు కుటుంబనామాలు వుండేవి. అంటే వారంతా నాలుగు గణాలకు, నాలుగే తెగలకు చెందినవా రన్నమాట.***

---

* ఏకాండంగా వున్న భూమికి పలువురు స్వామ్యం వహించడం. — సం.

** పార్టీలు. — సం.

*** కొద్ది రోజులపాటు నేను ఐర్లండులో వున్నప్పుడు[134] గణాలనాటి భావనా ధోరణిలో గ్రామీణ ప్రజ ఏ మేరకు జీవిస్తున్నారో మరోసారి చూశాను. రైతు భూస్వామిని తెగ నాయకుడు గానే భావిస్తున్నాడు. సమష్టి ప్రయోజనాలకోసం ఆయన వ్యవసాయాన్ని తనిఖీ చేస్తుంటాడనీ, ఆ శ్రమకు ప్రతిఫలంగా శిస్తు చెల్లిస్తున్నాననీ అతని భావన. అవసరం వచ్చినప్పుడు భూస్వామి ఆదుకోవాలని అతడి అభిప్రాయం. అలాగే జరుగుబాటున్నవాళ్లందరూ కష్టంలో వున్న ఇరుగుపొరుగు బీదవాళ్లకు సాయపడడం వారి బాధ్యతగా పరిగణింపబడుతోంది.

1745నాటి తిరుగుబాటును అణచివేసినప్పటినుంచీ స్కాట్లండులో గణవ్యవస్థ చితికి పోయింది.[135] ఆ వ్యవస్థలో స్కాచ్ "క్లాన్" (సమష్టి కుటుంబం)కు వున్న సంబంధం ఎటువంటిదో పరిశీలించవలసి వుంది. అదొక సంబంధం అనడంలో సందేహం లేదు. స్కాట్లండు మెట్టభూములలోని "క్లాన్"లను వాల్టర్ స్కాట్ తన నవలల్లో సవిస్తరంగా వర్ణించాడు. మోర్గన్ దానిని గురించి ఇలా చెప్పాడు:

"నిర్మాణంలోనూ, స్వభావంలోనూ కూడా అది శ్రేష్ఠమైన నమూనా గణం. గణ జీవితానికి గణ సభ్యులపై ఎటువంటి ప్రభావం వుంటుందో అందులో అద్భుతంగా కనబడుతుంది.... కుటుంబ కక్షలు, రక్త ప్రతీకారాలు వానిలో కనిపిస్తాయి. గణాల స్థానిక స్వభావాలు, సమష్టిగా భూములు కలిగి వుండటం, క్లాన్ నాయకులపట్ల సభ్యుల విధేయత, క్లాన్‌లో వాళ్ల ఒకరొకరి యెడల కనబరచుకొనే విశ్వాసం — ఇవన్నీ గణ సమాజంలో విధిగా సాధారణంగా కనబడే లక్షణాలు.... మగవాని వేపున సంతతిని గుర్తిస్తారు. మగవాళ్ల సంతానం క్లాన్‌లో వుంటారు. ఆడవాళ్ల సంతానం వాళ్ల వాళ్ల తండ్రుల క్లాన్‌లకు చెందుతారు."

స్కాట్లండులోని పిక్ట్ రాజకుటుంబంలో ఆడవాళ్లవైపునుంచి వారసత్వం వుందని బెడ రాశాడు. దానిని పట్టి పూర్వకాలంలో స్కాట్లండులో తల్లిహక్కు అమలులో వుండేదని గ్రహించవచ్చు. మధ్యయుగాలనాటివరకూ వెల్ష ప్రజలలోనూ, స్కాటిషు ప్రజలలోనూ పునాలువన్ కుటుంబాచారాలు అమలులో వున్నట్లు నిదర్శనాలున్నాయి. వెనుకటి భర్తల సమూహానికి ఆఖరు ప్రతినిధిగా క్లాన్ నాయకుడో, రాజో ప్రతి పెళ్లికూతురుతో మొదటిరాత్రి

---

ఆ సాయం చేయడం దయాధర్మ భిక్షంగా కాదు. తెగలోని బీదవాడు తెగలోని కలవాళ్లనుంచీ, తెగ నాయకుడినుంచీ సహాయం పొందే హక్కు వుంది. ఐరిష్ రైతుల బుర్రలలో ఆధునిక బూర్జువా ఆస్తి భావనలు ప్రవేశపెట్టడం అసంభవంగా వుందని ఆర్థిక శాస్త్రవేత్తలూ, న్యాయశాస్త్రవేత్తలూ గొడవ చేస్తున్నది అందుకే. హక్కులేగాని బాధ్యతలులేని ఆస్తి అనేది ఐరిష్‌వాని వూహకే అందదు. ఇంగ్లండు, అమెరికాలలోని పెద్దపెద్ద ఆధునిక నగరాలలో విభిన్నమైన నైతిక, న్యాయ సంస్కారాలున్న ప్రజల మధ్యకు వచ్చిపడ్డ ఐరిష్ వాళ్ల న్యాయం, నీతి అనేవి ఏమీ అర్థంగాక తలక్రిందులై పోతున్నారన్నా, ప్రజలలోని నిరుత్సాహానికి వారూ పాల్పడిపోతున్నారన్నా ఆశ్చర్యంలేదు. (1891 నాటి ముద్రణకు ఎంగెల్స్ వివరణ.)

గడిపే హక్కును అమలుజరుపుకోగలడు. ఆ హక్కునుంచి ప్రతిఫలం ఇచ్చి పెళ్లికూతురు బయటపడినప్పుడు మాత్రమే యీ హక్కుకు మినహాయింపు లభిస్తుంది.

* * *

వలసలనాటి వరకూ జర్మన్లు గణాలుగా ఏర్పడి వున్నారనేది నిర్వివాదాంశం. క్రీస్తుకు కేవలం కొద్ది శతాబ్దాలకు పూర్వం వారు డాన్యూబు, రైన్, విస్త్యులా నదులకూ, ఉత్తర సముద్రానికీ మధ్యనున్న భూములలో నివాసం ఏర్పరచుకొన్నారు. కింబ్రీ, ట్యూటానీ తెగల వలస జోరుగా సాగుతూ వుంది. సుయేవిలు సీజరుకాలంవరకూ స్థిరపడనేలేదు. వారు గణాలుగాను, బంధుకూటాలుగానూ (gentibus cognationibusque) స్థిరపడి నివసిస్తున్నారని సీజరు స్పష్టంగా రాస్తున్నాడు. Julia gens*కు చెందిన రోమను నోట gentibus మాట వచ్చిందంటే అది ఏదో పొరపాటున జారిందనుకోకూడదు. దానికి కచ్చితమైన అర్థం వుంది. ఇతర జర్మన్లందరి విషయంలో కూడా ఇంతే. రోమను రాష్ట్రాలను జయించి జర్మన్‌లు వానిలో నివాసం ఏర్పరచుకొనేటప్పుడు కూడా గణాలవారీగానే స్థిరపడినట్లు కనబడుతుంది. దిగువ డాన్యూబ్ నదీప్రాంత భూములను ఆక్రమించి, అక్కడ స్థిరపడిన వారు గణాలవారీగానే (genealogiae) స్థిరపడినట్లు "అలమన్నియన్ చట్టాల" వలన తెలుస్తూంది.[136] తర్వాత కాలంలో మార్కు, గ్రామ సమాజం అనే మాటలను వుపయోగించిన అర్థంలోనే genealogia కూడ వుపయోగించబడింది. genealogiae అనేవి పెద్ద పెద్ద సామూహిక గృహాలనీ, భూమిని అవి పంచుకొనేవనీ, వాటినుంచే సామూహిక గ్రామాలు పరిణతి పొందాయనీ ఈ మధ్య కొవలేవ్‌స్కీ రాశాడు. బుర్గుదియన్లూ, లాంగోబార్డునూ (వీరు గోథిక్, హెర్మినోనియన్ తెగలకు చెందిన వారు) వాడిన fara అనే పదం ఇంచుమించు "అలమన్నియన్ చట్టాల"లో genealogia వుపయోగించిన అర్థంలోనే వాడారు. దీనిని గణానికి వుపయోగించారా, సామూహిక గృహ కుటుంబానికి వుపయోగించారా అనే విషయాన్ని ఇంకా పరిశీలించవలసి వుంది.

జర్మను లందరిలో గణం అనేదానిని తెలిపే ఏకపదం ఏమన్నా వుందేమో తెలుసుకోడానికి భాషావివరణలు ఏమాత్రమూ తోడ్పడడం లేదు. శబ్దోత్పత్తిశాస్త్ర రీత్యా గ్రీకుల genos, లాటిన్ gens, గోథిక్‌ల kuni, మధ్య ఎగువ జర్మన్‌ల künne ఇవన్నీ ఒకే అర్థంలో వుపయోగించబడ్డాయి. ఆడుది అనే అర్థంలో గ్రీకులు gynê, స్లావ్‌లు zena, గోథిక్‌లు gvino, ప్రాచీన నోర్సుతెగలు kona, kuna అనే శబ్దాలు వాడుతారు. వీటన్నింటికీ ఉత్పత్తి ఒక్కటే. ఇవన్నీ మనకు తల్లిహక్కు అమలులో వున్న స్థితిని గుర్తుచేస్తు

* జూలియన్ గణం. — సం.

న్నాయి. లాంగోబార్డులూ, బుర్గుందియన్లూ వాడిన fara యనే మాట fisan అనేదాని నుంచి వచ్చివుంటుందనీ, fisan అనే మాటకు అర్థం "కనుట" అనీ గ్రిమ్ రాస్తున్నాడు. సంచరించు అనే అర్థం ఇచ్చే faran, fahren అనే మాటనుంచి fara వచ్చిందనడం బాగుంటుందని నా అభిప్రాయం. సంచార జాతులు కదిలి నడిచేటప్పుడు ఆ బిడారులో ఒక్కొక్క ప్రత్యేక భాగానికి ఆ మాటల నుపయోగిస్తారు. ఆ భాగంలో అందరూ బంధువులే వుంటారని వేరే చెప్పనక్కర్లేదు. మొదట తూర్పు దిశగా, అక్కడినుంచి పడమటి దిక్కుగా శతాబ్దాల తరబడి సాగిన ఆ సంచారాలలో ఆ మాట క్రమంగా గణ సంఘానికి ప్రత్యామ్నాయంగా వుపయోగంలోకి వచ్చింది. ఇదిగాక గోధికులలో sibja, ఆంగ్లో—సాక్షన్లలో sib, ప్రాచీన ఎగువ జర్మన్లలో sippia, sippa, Sippe — బంధువులు — అనే పదాలున్నాయి. ప్రాచీన నోర్స్ తెగలలో బహువచన రూపంలో sifjar (బంధువులు) అనే మాట వుంది. ఈ మాటకు Sif అనే ఏకవచనం వుంది. కాని అది ఒక దేవత పేరు మాత్రమే. ఇవిగాక "హిల్డెబ్రాండ్ గీతం"[137]లో మరో పదం వుంది. హిల్డెబ్రాండ్ హదుబ్రాండ్ నీ విధంగా ప్రశ్నించారు:

"వీరందరిలో నీ తండ్రి ఎవరు?... నీ బంధుకూటం ఏది?" (eddo huêlîhhes cnuosles du sîs).

గణం అనేదానికి జర్మన్లందరిలో వాడకంలో ఏదన్నా ఒకే పదం వుంటే అది గోధికుల kuni అయి వుండాలి. ఆ కుటుంబానికే చెందిన భాషలన్నింటిలో అదే అర్థం ఇచ్చే మాటలన్నిటికీ అది దగ్గరగా వుండడ మొక్కటే కాదు. గణ నాయకుడు, తెగ నాయకుడు అనే అర్థం ఇచ్చే kuning, König — రాజు — అనే పదాలు దానినుంచే పుట్టాయి. Sibja, Sippe — అనే మాటల గురించి పరిగణనలోకి తీసుకోనక్కర్లేదు. ప్రాచీన నోర్స్ తెగలలో sifjar పదానికి రక్తబంధువులు అనేగాక, వివాహ రీత్యా కలిసిన బంధుత్వాలు కూడా అర్థంలో చేరతాయి. అంటే రెండు గణాలకు చెందిన సభ్యులు ఆ శబ్దార్థంలోకి వస్తారు. కనుక sif అనేది గణానికి పేరు అయి వుండదు.

మెక్సికనులలోనూ, గ్రీకులలోనూ లాగే జర్మనులలో కూడా యుద్ధ వ్యూహాలలో అశ్వదళాలనూ, పదాతి దళాలనూ గణాలవారీగా నిలబెడతారు. "కుటుంబాలవారీగా, బంధుత్వాలవారీగా" అని టాసిటసు అనిర్దిష్టరూపంలో చెప్పడానికి ఆయన కాలంనాటి కప్పుడే ఎన్నడో రోములో గణాలు అంతరించిపోవడమే కారణం.

టాసిటస్ రచనలలో ఒక వాక్యం చాల ప్రధానమైనది వుంది; తల్లి సోదరుడు తన మేనల్లుణ్ణి కొడుకులాగే చూసుకొంటాడు. మేనమామకూ మేనల్లునికీ గల రక్తసంబంధం, తండ్రికీ కొడుకుకూ మధ్య వుండే సంబంధంకన్న ఘనిష్ఠమూ పవిత్రమూ నంటారు

కొందరు. అందుచేతనే హామీగా వ్యక్తులను వుంచగోరినప్పుడు స్వంత కొడుకును కన్న, సోదరి సంతానాన్ని తమ అధీనంలో వుంచమనడంవలన ఎక్కువ పూచీ వుంటుందనుకొంటారు. ఇది తల్లిహక్కు అవశేషం. జర్మన్ల ప్రత్యేక లక్షణంగా దీనిని చెప్తారు.* ఆ గణ సభ్యుడు తనకు హామీగా తన కొడుకును వప్పచెప్పినప్పుడు మాట తప్పితే ఆ కొడుకు బలి అయి పోతాడు. ఆ బాధ్యత ఆ తండ్రి ఒక్కడిదే. అలాగాక సోదరి కొడుకును బలిపెట్టేస్తే అతి పవిత్రమైన గణ ఆచారాన్ని అతిక్రమించినట్లే. ఆ బాలుణ్ణో, యువకుణ్ణో రక్షించ వలసిన బాధ్యత అతని సన్నిహిత బంధువుది. అతని మరణానికా బంధువుదే పూచీ. అతడా కుర్రవానిని కుదువ పెట్టడం తప్పు. కుదువపెట్టినప్పుడు మాట నిలుపుకోవాలి. జర్మన్లలో గణవ్యవస్థ వుందనేటందుకు ఇతర నిదర్శనాలు కనబడకపోయినా ఈ వాక్యం ఒక్కటే చాలు.

"దేవతం అస్తమయం – ప్రపంచ విలయం" వర్ణించే ప్రాచీన నోర్సు తెగలవారి పాట ఒకటుంది. దాని పేరు "Völuspâ." టాసిటస్ తర్వాత మరో ఎనిమిదివందల ఏళ్ళనాటిదీ పాట. దీనిలో కొన్ని వాక్యాలు గమనించవలసి వున్నాయి. "సీరెన్ దివ్యదృష్టి" అనే ఆ భాగంలో ప్రళయానంతరం ప్రపంచం అంతటా అవినీతీ, అనాచారమూ ప్రబలి పోతుందంటూ చెప్తారు. దీనిని బాంగ్, బుగ్గెలు వివరించి చూపారు. ఈ వివరణలో క్రిస్టియన్ మతధాయలు కూడా కలగాపులగం చేశారు.

---

* మేనమామకూ, మేనల్లునికీ మధ్య చాల దగ్గరతనం వుందనుకోవడం తల్లిహక్కు అవశేషం. ఇది చాలమంది ప్రజలలో కనిపిస్తుంది. వీరయుగపు పురాణ గాథలలో మాత్రమే గ్రీకులు దీనిని ఎరుగుదురు. మెలియాగర్ తన తల్లి అల్తేయా సోదరుల (థెస్టియస్ కొడుకులు)ను చంపాడు. అల్తేయా దీనిని మహాపాపం అంటుంది. హంతకుడి (తన కొడుకే)ని నిందిస్తుంది. వాని చావు కోరుతూ ప్రార్థిస్తుంది. "దేవత లామె ప్రార్థనను మన్నించి మెలియాగర్‌ను చంపివేశారు" అని డియోడోరస్ రాశాడు. (IV, 34.) ఆయన మరో కథ ప్రకారం (డియోడోరస్, IV, 44) హెరాక్లిస్ నాయకత్వాన అర్గోనాట్లు థ్రేసియాలో దిగారు. అక్కడ ఫీనెయస్ తన రెండో భార్య ప్రోద్బలంతో, తను విడిచి పెట్టేసిన మొదటిభార్య క్లియోపాత్రా కొడుకులిద్దరినీ హింసించడం చూశారు. ఫినెయస్ మొదటిభార్య క్లియోపాత్రా బొరియాడ్ తెగకు చెందినది. థ్రేసియాలో దిగిన ఆర్గోనాట్లలో కొందరు బొరియాడే లున్నారు. బొరియాడ్స్ గనక వారు క్లియోపాత్రాకు సోదరులు. హింసించబడుతున్న ఆ బాలురకు మేనమామలు. ఆ వార్త తెలియగానే వారు తమ మేన ల్లుని పక్షాన నిలబడ్డారు. సంరక్షకుల్ని చంపేసి వారిని విడిపించారు. (ఎంగెల్స్ వివరణ.)

"Broedhr munu berjask ok at bönum verdask, munu *systrungar* sifjum spilla."

"సోదరులు సోదరులతో యుద్ధాలు చేస్తారు. ఒకరొకరిని చంపుకొంటారు. సోదరుల పిల్లలు ప్రేగు బంధాలను కోసేసుకుంటారు."

పాటలో వుపయోగించిన systrungar అనే మాటకు తల్లి సోదరి కొడుకు అని అర్థం. కవి దృష్టిలో, అటువంటివారు రక్తబాంధవ్య పరిత్యాగం చెయ్యడం భ్రాతృహత్యా పాపంకన్న హీనం. Systrungar అనే మాటలో వుంది కీలకం. తల్లివేపు బాంధవ్యంలోని ప్రగాఢత్వాన్ని అది తెలియపరుస్తూంది. Syskina-börn లేక syskina-synir (సోదరుల, సోదరీల పిల్లలు, కొడుకులు) అనే పదాలను వుపయోగించి వుంటే వేలు విడంవచ్చి, బంధుత్వం బలపడడానికి బదులు క్షీణిస్తుంది. ఈవిధంగా "Voluspâ" రాయబడిన వైకింగుల కాలంనాటికి సైతం, స్కాండినేవియాలో తల్లి హక్కును ఇంకా పూర్తిగా మరచిపోలేదు.

ఇంకపోతే — టాసిటస్ కాలం నాటికి — కనీసం ఆయన బాగా ఎరిగిన జర్మన్లలో తల్లిహక్కు పోయి తండ్రిహక్కు ఏర్పడిందని స్పష్టంగా చెప్పవచ్చు. పిల్లలు తండ్రికి వారసులు. పిల్లలు లేకపోతే సోదరులు, పెత్తండ్రులు, పినతండ్రులు, మేనమామలు వారసులు. తల్లి సోదరుడికి వారసత్వం వుందనడం పైన పేర్కొన్న ఆచారాన్ని కాపాడడం గానే భావించాలి. జర్మన్లలో తండ్రిహక్కు ఏర్పడి ఎంతో కాలము కాలేదనడాని కదో నిదర్శనం. తల్లిహక్కును సూచించే అవశేషాలు మధ్యయుగం వరకూ కనిపిస్తూనే వున్నాయి. అంతవరకు, ముఖ్యంగా దాసులలో (సెర్ఫుల), పితృత్వం ఇంకా సందేహాస్పదమే. నగరానికి పారిపోయిన దాసుడిని తిరిగిరమ్మని, ఫ్యూడల్ ప్రభువు డిమాండు చేస్తే పారిపోయినవాడు దాసుడేనని ఆరుగురు రక్తబంధువులు — ముఖ్యంగా అతని తల్లి వేపు బంధువులు ప్రమాణం చెయ్యవలసి వుంది. ఉదాహరణకు ఔగ్స్‌బర్గు, బాసెల్, కైజర్స్‌లౌటర్న్‌లలో ఈ నిబంధన వున్నది. (మౌరెర్, "నగరవ్యవస్థ," 1, పేజి 381.)

అప్పట్లో శిథిలమై పోనారంభించిన తల్లిహక్కుయొక్క మరొక అవశేషమేమిటంటే, స్త్రీ జాతిపట్ల జర్మన్లకు గల గౌరవం — రోమన్ల దృష్టిలో యిది ఊహకు అతీతమైన విషయం. జర్మనులు మాటకు నిలబడేటట్లు చేయడానికి కులీన కుటుంబాల యువతుల్ని హామీగా పెట్టుకోవడం ఉత్తమోత్తమంగా భావిస్తారు. తమ భార్యల్నీ కూతుళ్ళనీ శత్రువు పట్టుకొని, బానిసల్ని చేస్తాడేమోనని భయం కలిగినప్పుడు వారు యుద్ధంలో విపరీతమైన తెగువ చూపిస్తారు. స్త్రీని ఎంతో పవిత్రురాలినిగా, దైవజ్ఞురాలిగా గౌరవిస్తారు. ప్రధాన విషయాలలో ఆమె సలహాలు తీసుకొంటారు. బటేవియను తిరుగుబాటు కంతటికీ

ఉత్తేజకురాలు వెలెడా అనే లిప్ నదీ ప్రాంతంలోని బ్రుక్టెరియన్ పురోహితురాలు. ఆ తిరుగుబాటులో జర్మన్, బెల్జియన్ తెగలు సివిలిస్ నాయకత్వాన గాల్‌లో రోమను పరిపాలనను మూలమట్టుగా కదల్చివేశాయి.[138] ఇంటిలో ఆడుదానికి సంపూర్ణాధికారం వున్నట్లు అగుపిస్తుంది. ముదుసలులూ, చిన్నపిల్లలతో కలిసి స్త్రీలు ఇంటెడు చాకిరీ చేస్తారనీ, మగవాళ్ల వేటకు పోవడం, తాగి తందనాలాడ్డంలో కాలం గడుపుతూంటారనీ టాసిటసు రాస్తున్నాడు; అయితే పొలాలలో వ్యవసాయం చేసేదెవరో ఆయన చెప్పలేదు. బానిసలు సుంకం చెల్లించేవారేగాని, వెట్టిచాకిరీ చేయవలసిన పనేమీ లేదని ఆయన విస్పష్టంగా రాశాడు. అందుచేత ఆ కొద్దిపాటి వ్యవసాయపు పనులనేనా యే వయసు వచ్చిన మగవాళ్లో చేసేవారన్నమాట.

వారిలో జంటపెళ్లి పద్ధతి అమలులో వున్నదనీ, క్రమంగా దంపతీ వివాహంలోకి మార్పు వస్తున్నదనీ పైన రాశాను. అప్పటికింకా దంపతీ వ్యవస్థ స్థిరంకాలేదు. కులీనులలో బహుభార్యాత్వం అంగీకరించబడుతుంది. మొత్తంమీద (కెల్టులలోవలె కాకుండా) జర్మన్లలో కన్యలు చాల కట్టుదిట్టంగా తమ కన్యాత్వాన్ని కాపాడుకోవాలని విధించేవారు. జర్మన్లలో వివాహబంధం చాల పవిత్రంగా భావించబడుతుందని టాసిటసు చాల ఉత్సాహంగా రాశాడు. స్త్రీ జారత్వం ఒక్కటే విడాకులు కోరడానికి తగినంత కారణం అవుతుందన్నాడు. కాని, ఆయన చెప్పేదాంట్లో మధ్య మధ్య ఖాళీలు చాలా కనిపిస్తున్నాయి. మరొకటేమిటంటే అవినీతిమయ జీవితంలో మురిగిపోతున్న రోమనులకు నీతిమయ జీవితాన్ని చూప ప్రయత్నిస్తున్నట్లు ఆయన రాతలవల్ల స్పష్టంగా తెలిసిపోతూంది. ఒకటి మాత్రం వాస్తవం: అడవులలో నివసిస్తున్న జర్మనులు నీతివిషయంలో ఉత్తమాదర్శం చూపుతూండవచ్చు. కాని, బయటి ప్రపంచంతో కొద్దిపాటి సంబంధం కలిగేసరికే అందరు యూరపియన్ల మాదిరిగానే వారూ తయారయ్యారు. రోమను జీవితప్రవాహపు సుడిగుండంలో పడేసరికి జర్మను తెగలలో వారిభాషకన్న వేగంగా నీతిపరత్వం అంతరించి పూరుకొంది. తూర్స్ నగరవాసి గ్రిగోరీ రచనలు చదివితే ఆ విషయం తెలుస్తుంది. రోములోలాగ జర్మను మహారణ్యాలలో సున్నితమైన విలాసజీవితం వుండజాలదని వేరే చెప్పనవసరం లేదు. అందుచేత ఈ విషయంలో కూడా జర్మన్లు రోమన్లకంటే గొప్పవారేనని చెప్పవచ్చు. అంతమాత్రాన లైంగిక వ్యవహారాల్లో సంయమాన్ని ఆపాదించనవసరంలేదు. అటువంటి సంయమం మొత్తంగా ఏ ఒక ప్రజాసమూహంలోనూ ఎన్నడూ లేదు.

తండ్రుల, బంధువుల స్నేహాలూ, శత్రుత్వాలూ కూడా కుటుంబంలో పారంపర్యంగా బాధ్యతగా సంక్రమించే పద్ధతి గణవ్యవస్థనుంచి వచ్చింది. హత్యచేసినా, మరోనష్టం కలిగించినా రక్త ప్రతీకారానికి బదులు పరిహార ద్రవ్యం (వెర్‌గెల్డు) ఇచ్చే పద్ధతి కూడా ఆ వ్యవస్థనుంచి వచ్చినదే. ఈ వెర్‌గెల్డు పద్ధతి ఒక జర్మన్లలోనే వున్నదని ఒక తరంక్రితం

భావించేవారు. గణవ్యవస్థలో అనుసరించబడే రక్త ప్రతీకారానికి ఇది ప్రత్యామ్నాయ రూపమనీ, వందలకొలది ప్రజాసమూహాలలో ఈ ఆచారం వున్నదనీ ఈ మధ్యకాలంలో నిరూపింపబడింది. ఉదాహరణకు అమెరికను ఇండియనులలో ఆతిథ్యంలాగే ఇదీ ఒక కర్తవ్యంగా భావించబడుతూంది. జర్మనులు నెరపే ఆతిథ్యాన్ని గురించి టాసిటను వర్ణించినదీ ("జర్మానియా," ప్రకరణం 21), ఇండియనులలో ఆతిథ్యం గురించి మోర్గన్ వర్ణించినదీ చాలావరకు వివరాలలో సైతం ఒక్కలాగే వున్నాయి.

టాసిటను కాలంనాటికే జర్మన్లు సాగుభూమిని పంచేసుకొన్నారా? ఈ విషయం గూర్చి ఆయన రాసిన మాటలకు ఏం అర్థం చెప్పాలి? – అనే వానిమీద ఎన్నో ఆవేశాలు పెరిగాయి. ఎడతెగని చర్చ జరిగింది. అదంతా గత చరిత్ర. అన్ని దేశాలలోనూ కూడా భూమిని గణం అంతా కలిసి సాగుచేసేవారనీ, తర్వాత సమష్టి సామూహిక కుటుంబాలు సాగుచేయడం వచ్చిందనీ అందరూ అంగీకరిస్తున్నారు. సమష్టి సామూహిక కుటుంబాలు భూమిని సాగుచేస్తాయనే విషయాన్ని సీజర్ స్వేవ్‌లు తెగల వారిలో చూశాడు; తర్వాత విడి విడి కుటుంబాలకు భూములు కేటాయించి ఇచ్చేవారు. అప్పుడప్పుడు మళ్లీ ఏకంచేసి తిరుగా ఇళ్లవరుసల్ని పంచుతూండేవారు. సాగుభూమిని విడి కుటుంబాలకు మధ్య మధ్య తిరిగి తిరిగి పంచే పద్ధతి ఈనాటికీ జర్మనీలో కొన్ని ప్రాంతాలలో అమలు జరుగుతూంది. ఈ విషయం గూర్చి విశేషం చెప్పనక్కర్లేదు. స్వేవ్‌లలో భూమిని పంచుకోవడం, ఎవరికి వారు సాగుచేసుకోవడం లేదని సీజరు స్పష్టంగా రాశాడు. జర్మన్లు కూడా అలాగే వుండేవారు. ఆ దశనుంచి ఒక నూట ఏభయ్యేళ్లలో టాసిటస్ కాలంనాటికి ఎవరికివారు సాగుచేసుకోవడం, ఏటేటా భూములు పంచుకోవడం స్థితికి వచ్చేరంటే అది నిస్సందేహంగా మంచి అభివృద్ధి అనే చెప్పాలి. సమష్టి వ్యవసాయంనుంచి భూమిపై విడి వ్యక్తులకు స్వామ్యం వుండే దశకు అంత స్వల్పకాలంలో బయటివాళ్ల ప్రమేయం లేకుండా మార్పు రావడం అసంభవం. టాసిటను రాతలు చూస్తే నాకు అనిపిస్తున్నది ఏమిటంటే: ప్రతి ఏడాదీ సాగుభూములు మార్చి మార్చి పంచుకొనేవారు. అయినా బోలెడంత ఉమ్మడి భూమి మిగిలి వుండేది. ఆనాటి జర్మన్ల గణవ్యవస్థకు సరిపడే వ్యవసాయస్థితీ, భూమిని అనుభవించే దశ అది.

వెనుకటి కూర్పులలో ఉన్నట్లుగానే పై పేరాను యథాతథంగా ఉంచేస్తున్నాను. ఈలోగా మరో సమస్య ఉత్పన్నమైంది. పితృస్వామిక సామూహిక కుటుంబం సార్వజనికం కాకపోయినా బాగా విస్తృతమైనదేననీ, తల్లిహక్కుతో వుండే సమష్టి కుటుంబానికీ, ఆధునికమైన విడి కుటుంబానికీ మధ్య యిది వంతెన వంటిదనీ కొవలేవ్‌స్కీ నిరూపించిన తరువాత (పైన పేజి 44* చూడండి) మౌరెర్ – వైత్స్‌లు ఇప్పటికీ భూమి అందరి సమష్టి స్వామ్యంలో

* ఈ సంపుటంలో 191–192 పేజీలు చూడండి. – సం.

వుండేదా, వ్యక్తిగత ఆస్తిగా ఉండేదా అని చర్చించుకోవడం అర్థంలేదు – సమష్టి స్వామ్యంలో ఉండే ఆస్తి ఏ రూపంలోకి మారిందనేదే ఇప్పటి సమస్య. సీజరు కాలంనాడు స్వేవ్‌లలో భూమి అందరి ఆస్తి కావడమే కాదు, దానిని అందరికోసం అందరూ కలిసి సాగుచేసే వార నడంలో సందేహం లేదు. ఇక్కడున్న సమస్య ఆ సమాజంలో ఆర్థిక యూనిటు గణమా? సామూహిక గృహ కుటుంబమా? లేక రెంటికీ నడుమంతరంగా ఉండే సమష్టి బంధు కూటమా? లేక ఆయా భూములలో ఉన్న పరిస్థితులను పట్టి మూడు పద్ధతులూ ఒకదాని పక్కనొకటి అమలులో ఉన్నాయో – అనే విషయంమీద చిరకాలం వాదవివాదాలు జరగక తప్పదు. టాసిటసు వర్ణించిన పరిస్థితులు మార్కు (గ్రామ సంఘం)లో వుండవనీ, సామూహిక గృహ కుటుంబంలో మాత్రమే వుంటాయనీ, సమష్టి కుటుంబం బాగా జనాభా పెరిగాక ఎంతో కాలానికి మార్కుగా (గ్రామ సంఘం) మారిందనీ కొవ లేవ్‌స్కీ చెప్తున్నాడు.

అందుచేత, రోమనుల కాలంలో ఆక్రమించుకొన్న జర్మను జనావాసాలూ, తర్వాత రోమనులనుంచి గెలుచుకొన్న భూములతో వారు ఏర్పరచుకొన్న జనావాసాలూ గ్రామాలు కావనీ, పెద్ద పెద్ద సమష్టి కుటుంబాలు మాత్రమేననీ, ఆ ఇళ్లలో ఎన్నో తరాలవాళ్లు కలిసి జీవిస్తుంటారనీ, ఆ యింటికి సరిపడేటంత పాటి భూమిని సాగుచేసుకొంటూ, చూట్టూ ఉన్న అడవి భూమిని ఉమ్మడి మార్కుగా పొరుగువారితో కలిసి ఉపయోగించు కొనేవారనీ చెప్పవచ్చు. ఈ పరిస్థితులలో ప్రతి ఏటా భూమిని మార్చేవారంటూ టాసిటసు రాసిన మాటకు వ్యవసాయ సంబంధంగా అర్థం చెప్పుకోవలసి వుంటుంది. ఆ సమష్టి కుటుంబం ఏడాదికో భూమిని సాగుచేసేదనీ, ఈ ఏడాది సాగుచేసిన భూమిని మరు సంవత్సరం బీడు పెట్టేవారనీ, లేదా పడావుగా ఉంచేవారనీ ఆ మాటకు అర్థం చెప్పుకోవాలి. జనాభా చాలా తక్కువగా ఉండడంచేత బోలెడంత ఖాళీ జాగా ఉండేది. అందుచేత భూమి కోసం తగాదాలుండేవికావనుకోవాలి. కొన్ని శతాబ్దాలు గడిచి, సమష్టి కుటుంబంలో జనం బాగా పెరిగిపోయి, అప్పటికున్న ఉత్పత్తి పరిస్థితులలో సమష్టి వ్యవసాయం సాధ్యం కాకుండాపోయి, ఫలితంగా సమష్టి కుటుంబాలు విడిపోయివుండాలి. కొత్తగా ఏర్పడిన వేర్వేరు ఇళ్ల వారికి వెనుకటి ఉమ్మడి భూముల్నీ, బీళ్లనీ పంచివుంటారు. మొదట ఈ పంపిణీ కొంత కొంత వ్యవధిలో జరుగుతూండేది. తర్వాత శాశ్వతంగా పంచేసుకొని వుంటారు. కాని, అడవులూ, గోభూములూ, నీటి నెలవులూ ఉమ్మడి సొత్తుగానే మిగిలిపోయాయి.

అభివృద్ధి ఈ క్రమంలోనే వచ్చినట్లు రష్యా చరిత్రలో నిరూపితం అవుతూంది. జర్మనీలోనూ, తర్వాత జర్మనులు ప్రవేశించిన దేశాలలోనూ కూడ ఇదే జరిగిందనడమే టాసిటసు రచనలలోని మాటలకు సరియైన అర్థంగా తోస్తుంది. టాసిటసు కాలంనాడు గ్రామ సంఘాలున్నాయనుకోడంలో వచ్చిన ఇబ్బందులనుంచి బయటపడేటందు కిదొ

క్కటే పద్ధతి. Codex Laureshamensis[139] వంటి అతి ప్రాచీన పత్రాలను సులభంగా అర్థం చేసుకొనేటందుకు సామూహిక మార్క్ గ్రామాలకన్నా సామూహిక గృహ కుటుంబాలను గణనలోకి తీసుకొంటేనే ఎక్కువ వీలుపడుతుంది. దానితో మళ్లీ కొన్ని కొత్త చిక్కులూ, కొత్త సమస్యలూ వస్తాయి. వానిని పరిష్కరించవలసి వుంటుందనుకోండి. అది వేరు. ఇంకా పరిశోధన చేసినప్పుడే అవి పరిష్కారం అవుతాయి. జర్మనీ, స్కాండినేవియా, ఇంగ్లండులలో సామూహిక గృహ కుటుంబ కూడా ఒక మధ్యంతర దశ మాత్రమేననే అభిప్రాయాన్ని కాదనలేను.

సీజరు కాలానికి జర్మన్లు అప్పుడే స్థిరావాసాలు ఏర్పరచుకొన్నారు. కొంతమంది యింకా స్థిరనివాసాలు వెతుక్కుంటున్నారు. కాని టాసిటస్ కాలం నాటికి వారప్పుడే స్థిరావాసాలు ఏర్పరచుకొని నూరేళ్లయింది. తత్ఫలితంగా జీవనాధార వస్తువుల వుత్పత్తి ఎంతో పెరిగింది. అది కనిపిస్తూనే వుంది. దుంగలతో కట్టిన ఇళ్లలో వారు నివసించేవారు. వెనక అడవుల్లో వున్నప్పుడు ధరించినట్లే వూలు పై బట్టలూ, జంతు చర్మాలూ ధరించేవారు. ఆడవాళ్లూ, ధనికులూ లోపల నారబట్టలు ధరించేవారు. పాలు, మాంసం, అడవి పళ్లు తినేవారనీ – ఓట్స్‌తో చేసిన జావ తాగేవారనీ ప్లినీ రాశాడు. (ఐర్లండులోనూ, స్కాట్లండులోనూ కెల్టు తెగల వారి ప్రధానాహారం ఈనాటికీ యీ జావయే.) వారి సంపద పశువులు, అవంత మేలుజాతివి కావు. ఆవులు – చిన్నవిగా, వికారంగా వుండేవి. కొమ్ములుండేవి కావు. వాళ్ల గుర్రాలు పొట్టివి. అంత వేగంగా పరుగెత్త గలవి కావు. రోమను నాణాలనే ధనంగా వాడేవారు. అదయినా చాలా అరుదుగా వాడేవారు. వెండి, బంగారు నగలు యెరగరు. ఆ లోహాలకంత ప్రాముఖ్యమూ యిచ్చేవారు కాదు. కనీసం రైన్, డాన్యూబ్ నదుల వద్దనున్న వారిలో ఇనుము వాడకం బాగా తక్కువ. ఉన్నది కూడా పైనుంచి తెప్పించుకొన్నదే. రూనిక్* లిపిని (గ్రీకు, లాటిన్ అక్షరాల అనుకరణ) రహస్య లిపిగా వుపయోగించేవారు. ముఖ్యంగా మత సంబంధమైన మంత్ర తంత్రాలకు వుపయోగించేవారు. నరబలులు బాగా పరిపాటిగా వుండేవి, సంగ్రహంగా చెప్పాలంటే వారు అప్పుడప్పుడే అనాగరిక యుగపు మధ్య దశనుండి ఉన్నత దశలో అడుగుపెట్టా రనాలి. రోమనులతో సంబంధం పెట్టుకొన్న తెగలు రోమనులనుంచి పారిశ్రామిక వస్తువుల్ని తెచ్చుకొనేవారు. అందుచేత వారిలో బట్టల పరిశ్రమా, లోహ పరిశ్రమా స్వంతానివి వృద్ధిపొందలేదు. ఈశాన్య దిశలో బాల్టిక్ సముద్ర తీరప్రాంతపు తెగలలో ఈ పరిశ్రమలు వృద్ధిపొందాయి. ష్లేస్విగ్ బందలలో దొరికిన పొడుగయిన ఇనుప కత్తి, కవచము, వెండి శిరస్త్రాణం, రెండో శతాబ్దాంతం నాటి రోమను నాణాలూ, వలసల మూలంగా నాలుగు వేపులకూ విస్తరించిన

---

* 16వ శతాబ్ది వరకూ యూరపు ఉత్తర భాగంలో ప్రజలు వాడిన అక్షరాలు. – సం.

జర్మను పాత్రసామగ్రులూ చూస్తే, అవి రోమను వస్తువుల నమూనాలో తయారు అయినా, మంచి పనితనం కనబరుస్తున్నాయి. ఒక్క ఇంగ్లండుకు తప్ప, రోమన్ సామ్రాజ్యంలో ఏ మూలకు వలస వెళ్లిన వారిలోనూ కూడ దేశీ పరిశ్రమలు అంతరించక మాన లేదు. నిగనిగలాడే కంచు పొలుసులు (కవచాలమీద బిగించేవి) చూస్తే పరిశ్రమ ఒకే స్థాయిలో ఎలా అభివృద్ధి పొందిందో తెలుస్తుంది. ఇంగ్లండులో, స్వీడన్‌లో లభించిన వాని లాగే బుర్గుండి, రుమేనియా, అజోవ్ సముద్ర గర్భంలోను దొరికిన వస్తువులు కూడా ఒకే మాదిరి కార్ఖానాలో తయారయినట్లే కనిపిస్తాయి. నిస్సందేహంగా అవన్నీ జర్మనుల తయారీలే.

వాళ్ల సామాజిక నిర్మాణం కూడా అనాగరిక యుగపు ఉన్నత దశకు అనుగుణంగానే వున్నాయి. టాసిటను జెప్పిన దాన్నిబట్టి సాధారణంగా నాయకుల (ప్రిన్సిపేలు) కౌన్సిలు ఒక టుండేది. అంత ప్రధానం కాని విషయాలను యీ కౌన్సిలే పరిష్కరించేది. ప్రధాన విషయాలను ప్రజాసభ నిర్ణయానికి తెచ్చేది. అనాగరిక యుగపు నిమ్న దశలో ప్రజాసభలు గణాల స్థాయిలోనే జరుగుతాయి. కాని, తెగలు, తెగల సమాఖ్యల స్థాయిలో జరగవు. కనీసం అమెరికనులలో చూసిన దానిని పట్టి మనకు తెలిసింది అంతే. కౌన్సిలులోని నాయకులకు (ప్రిన్సిపేలు), సైన్యనాయకులకు (డ్యూక్‌లు) భేదం విస్పష్టంగా కనిపిస్తూంది. ఇరాక్వ్యాలలోనూ అంతే. ప్రిన్సిపేలు తమ సోదర తెగ ప్రజలనుంచి ధాన్యం, పశువులూ మొదలయిన వానిని బహుమతులుగా తీసుకోవడం, కొంతవరకు ఆ ఆదాయం మీదనే బ్రతకడమూ ఆరంభమయింది. అమెరికాలో లాగానే ఇక్కడ కూడా సాధారణంగా వీరిని ఒకే కుటుంబంలోంచి ఎన్నుకొనేవారు. తండ్రిహక్కులోకి మార్పు రాగానే గ్రీసు రోములలో మాదిరిగా జర్మనులో కూడా ఎన్నుకోబడవలసిన వుద్యోగాలు వంశపారంపర్యపు వుద్యోగాలుగా మారాయి. దానితో ప్రతి గణంలోనూ కులీన కుటుంబాలు తయారయాయి. తెగలలో పైకివచ్చిన ప్రాచీన కాలపు ఈ కులీన కుటుంబాలు వలసల కాలంలోనో, అటు తర్వాత కొద్దికాలం లోపలనో అంతరించిపోయాయి. పుట్టుకను పట్టిగాక సామర్థ్యాన్ని పట్టే సైన్యనాయకుల్ని ఎన్నుకొనేవారు. వారి అధికారం చాలా స్వల్పం. తమ ఆదర్శ బలమే వారికున్న బలం. సైన్యాలలో క్రమశిక్షణ పురోహితుల ద్వారా రక్షింపబడుతూందని టాసిటస్ స్పష్టంగా రాశాడు. అసలు అధికారం అంతా ప్రజాసభది. రాజు లేక తెగ నాయకుడు అధ్యక్షత వహిస్తాడు. ప్రజలు నిర్ణయిస్తారు. గొణుగుడు "నిరాకరణ"కు గుర్తు, ఉత్సాహ ధ్వనులూ, ఆయుధాల చప్పుడూ "అంగీకారానికి" గుర్తు. ప్రజాసభే న్యాయస్థానం కూడా. దానికే దరఖాస్తులు పెట్టుకొనేవారు. అదే నిర్ణయాలు చేసేది. పిరికితనం, ద్రోహం, విడ్డూరమైన అలవాట్లు — వీనికి మాత్రమే మరణశిక్షలు విధించేది. గణాలూ, తదితర శాఖలూ కూడ ఇల్లాగే జనసభలో విచారణలు జరిపేవి. అక్కడ నాయకుడు అధ్యక్షుడుగా

కూర్చుంటాడు. జర్మను కోర్టులన్నింటా జరిగేటట్లే అతడు కార్యక్రమాన్ని నడుపుతాడు. ప్రశ్నలు వేస్తాడు. జనసభ తీర్పు చెప్పడమే జర్మనులలో ఎప్పుడూ, ఎక్కడా అలవాటు.

సీజరు కాలంనుంచీ తెగలు సమాఖ్యలుగా ఏర్పడడం ప్రారంభమయింది. వానిలో కొన్నింటికి అప్పుడే రాజులు ఏర్పడ్డారు. గ్రీకులు, రోమనులలో వలే జర్మనులలో కూడ సర్వసైన్యాధ్యక్షుడు నిరంకుశాధికారం నెలకొల్పడానికి ప్రయత్నించనారంభించాడు. కొన్ని సందర్భాల్లో ఆ ప్రయత్నాలు నెరవేరాయి కూడా. అంతమాత్రంచేత వారు నియంతలయి పోలేదు. కాని గణ వ్యవస్థ తాలూకు బంధనాలను ఛేదించడానికి వారు వుపయోగపడ్డారు. స్వాతంత్ర్యం పొందిన బానిసలు ఏ తెగకూ చెందినవారు కాకపోవడం చేత సాధారణంగా తక్కువగానే చూడబడేవారు. కాని, కొత్త రాజుల ప్రాపకంలో పదవులు, సంపదలు, మర్యాదలు కూడ సంపాదిస్తున్నారు. ఆ సైన్యాధిపతులు రోమన్ సామ్రాజ్యాన్ని ఆక్రమించి పెద్ద పెద్ద దేశాలకు అధిపతులయ్యాక కూడా అదే కొనసాగింది. ఫ్రాంకు తెగలవారిలో రాజుల వద్దనున్న బానిసలూ, విముక్తి పొందిన బానిసలూ రాజ దర్బారుల్లోనూ, తర్వాత రాజ్యంలోనూ ప్రముఖ పాత్ర వహించారు. నూతన కులీన వర్గంలో అధిక భాగం వారినుంచి ఏర్పడినదే.

రాజరికాలు తల ఎత్తడానికి ప్రధానంగా తోడ్పడినది ప్రత్యేక దళాలు. గణ వ్యవస్థ తోపాటు తమంత తాముగా యుద్ధాలు చేసేటందుకై కొందరు యోధుల్ని ప్రత్యేక దళాలుగా సమీకరించడం అమెరికాలోని రెడ్ ఇండియన్లలో తల ఎత్తడం పైన చూశాం. జర్మన్లలో ఈ ప్రత్యేక దళాలు స్థిర సైన్యాలుగానే తయారయాయి. కొంత పేరు సంపాదించుకొన్న సైన్యనాయకుడి చుట్టూ దోపిడీలు సాగించే అభిలాషతో యువకులు చేరేవారు. వారు అతనిపట్ల విధేయులుగా ఉండేవారు, అతను వారిపట్ల విశ్వాసంగా ఉన్నమాదిరిగానే. ఆ నాయకుడు వారికి తిండిపెట్టేవాడు, బహుమతు లిచ్చేవాడు, తరతమ క్రమంలో నిర్మాణ పరిచేవాడు, తక్షణావసరాలకీ, చిన్న చిన్న ఘర్షణలకూ దగ్గరనున్న అంగరక్షకులు, కొద్ది బలగమూ సరిపడేది. పెద్ద యుద్ధాలకోసం శిక్షితులయిన సేనా నాయకులుండేవారు. సొంత దళాలు అంత శక్తిమంతాలు కావు. ఆ విషయం ఇటలీలో ఒడోవాకర్ విషయంలో నిరూపితం అయింది కూడా. ఈ దళాలు అంత శక్తిమంతాలు కాకపోయినా వెనుకటి రోజులలో ప్రజలకున్న స్వాతంత్ర్యాలను విధ్వంసం చేసేటందుకవి బీజాలు వేశాయి. వలసల కాలంలోనూ, తర్వాతనూ ఇవి ఆ పనే చేశాయి. ఒకటి – రాజు అధికారంలోకి రావడానికి తగిన వాతావరణం కల్పించాయి. రెండోది – టాసిటసు చెప్పినట్లు వారిని చెదిరిపోకుండా వుంచాలంటే నిరంతరాయంగా యుద్ధాలూ, దోపిడిదాడులూ సాగించవలసిందే. దోచుకోవడం వారికి ప్రధాన గమ్యం అయింది. నాయకుడికి తన చుట్టుప్రక్కల చేయడానికేమీ కనబడకపోతే అతడు తన సొంత సిబ్బందిని యుద్ధాలు, దోపిడీ అవకాశాలూ వున్న ఇతర దేశాల

మీదకు నడిపించేవాడు. రోమను జెండా కింద జర్మను సహాయక సేనలు జర్మనులనే ఎదుర్కొని పోరాడిన ఘటనలున్నాయి. వారంతా ఈ విధంగా చేర్చుకొన్న ప్రత్యేక దళాలే. వారి సంఖ్య కూడా ఎక్కువగానే వుండేది. జర్మను జాతికి సిగ్గూ, శాపమూ అయిన కిరాయి సైనికుల వ్యవస్థ ఇక్కడ ప్రాథమిక రూపంలో వుంది. రోమన్ సామ్రాజ్యాన్ని జయించాక ఈ రాజులవద్ద నున్న సొంత దళాలు, రోమను దర్బారీలు, క్రీతదాసులూ – వీరే భావి కాలపు కులీనవర్గంలో అత్యధిక భాగం అయ్యారు.

మొత్తంమీద, వీరయుగంనాటి గ్రీకులలోనూ, రాజ నామధారులనాటి రోమనులలోనూ కనిపించే మాదిరి నిర్మాణమే జర్మను తెగలు ప్రజలుగా ఏర్పడిన రోజులలో వారిలో కూడా కనబడుతుంది: ప్రజాసభలు, గణనాయకుల సమితులు, రాజరికంకోసం అర్రులుజాస్తున్న సేనానాయకులు – గణవ్యవస్థలో ఏర్పడగల అత్యున్నత నిర్మాణం అది. అనాగరిక యుగపు ఉన్నత దశలో ఏర్పడే నమూనా నిర్మాణం అది. ఈ నిర్మాణంయొక్క పరిమితులను దాటి, సమాజం ఒక్క అడుగు ముందుకు వేసిందంటే గణవ్యవస్థ ఛిన్నాభిన్నం అయిపోతుంది. అలాగే విచ్ఛిన్నం అయింది కూడా. ఆ నిర్మాణం స్థానే రాజ్యం ఏర్పడింది.

# VIII

## జర్మన్లలో రాజ్యావిర్భావం

టాసిటసు రాసిన దానినిబట్టి జర్మనుల జనాభా చాల ఎక్కువ. వేర్వేరు జర్మన్ ప్రజాసమూహాల సంఖ్య రమారమి ఎంత వుంటుందో సీజరు రాసేడు. రైన్ నది ఎడమ గట్టుకి వచ్చిన ఉసిపెటన్లూ, టెన్క్టెరన్లూ ఆడా, మగా, పిల్లా – పెద్దా అంతా కలిసి 1,80,000 మంది వుంటారని ఆయన రాశాడు. మంచి ఉచ్ఛ దశలో కూడ ఇరాక్వాలు 20,000 మందికి మించిలేరు. ఆ 20 వేలమంది వున్నప్పుడే వాళ్ళ గ్రేట్ లేక్సనుంచి ఓహియో* పోటోమాక్‌ల** వరకూ దేశాన్ని దద్దరిల్లిపోయేలా చేశారు. అంత కంటే జర్మన్ల సంఖ్య ఒక లక్షకు పైగా ఎక్కువగా వుండేది.*** చారిత్రక నివేదికల్ని పట్టి

* ఓహియో – మిస్సిసిపీ నది ఎడమగట్టున వున్న ఉపనది. – సం.

** పోటోమాక్ – సంయుక్త రాష్ట్రాల తూర్పు భాగంలోని నది. – సం.

*** గాల్‌లోని కెల్టులను గురించి డియోడోరసు రాసిన అంశాన్నిబట్టి ఇక్కడ చెప్పిన అంకె సరిగ్గా వుందనే అనాలి. "గాల్‌లో పలు ప్రజా సమూహాలు నివసిస్తున్నాయి. వారి

మనకు తెలిసిన రైన్ ప్రాంత ప్రజల్ని దేశపటంమీద గుర్తుపెట్టామంటే ఆ మాత్రం జనం ప్రష్యా ప్రభుత్వ పరిపాలనలోని ఒక జిల్లా అంతమేరలో – అంటే 10 వేల చదరపు కిలోమీటర్లు లేక 182 భౌగోళిక చదరపు మైళ్ల మేరలో – నివసిస్తూండేటంతమంది వుంటారు. రోమనుల కాలంలో Germania Magna* విస్తులా నదివరకూ విస్తరించి 5 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి వుండేది. సగటున ఒక్కొక్క తెగలో లక్ష వుంటారనుకొన్నా, Germania Magna జనాభా 50 లక్ష లుంటుంది. అనాగరిక దశలో వున్న ప్రజలలో అంతమంది వుండడం అసాధారణమే. అయితే అంతమందివున్నా సగటున చదరపు కిలోమీటరుకు 10 మంది చొప్పునే వున్నట్లవుతుంది. అంటే చదరపు మైలుకి 550 మంది. ఈనాటి పరిస్థితులలో ఆ సంఖ్య చాల తక్కువ. ఆనాడు జర్మను తెగలన్నీ నివసించినది కూడ ఇక్కడే కాదు. గోథిక్ తెగల తాలూకు బస్తార్నియనులూ, పెవ్‌కినియనులూ, తదితరులూ కార్పేతియన్ పర్వతాల వెంట డాన్యూబ్ ముఖద్వారం వరకూ నివసించేవారు. వారి సంఖ్య చాల ఎక్కువగా వుండేది. జర్మనులలో అయిదో అధిక సంఖ్య గల తెగ అని వారిని గురించి ప్లినీ రాశాడు. క్రీ. పూ. 180 నాటికే వారు మాసిడోనియా రాజు పెర్సియస్ అధీనంలో కిరాయి సైనికులుగా పనిచేస్తుండేవారు. ఆగస్టసు కాలం నాటివరకూ వారు ఇంకా అడ్రియానోపిల్ పరిసరాల వరకూ చొచ్చుకువస్తూనే వున్నారు. వారి సంఖ్య పది లక్ష లుంటుందనుకొన్నా క్రీస్తు శకారంభం నాటికి జర్మను ప్రజల సంఖ్య ఏవిధంగానూ 60 లక్షలకు తగ్గదు.

జర్మనీ Germanienలో స్థిరపడ్డాక వారు అంతకంతకు వేగంగా పెరిగినట్లు కనబడుతుంది. పైన చెప్పినట్టు వారిలో బాగా పరిశ్రమలు వృద్ధిపొందడమే దానికి నిదర్శనం. ష్లేస్విగ్ బందలలో దొరికిన వస్తువులు క్రీ. శకం మూడో శతాబ్ది తర్వాతివని, వాని తోపాటు దొరికిన రోమను నాణాలను బట్టి గ్రహించవచ్చును. అంటే ఆనాటికి బాల్టిక్ ప్రాంతంలో లోహ, వస్త్ర పరిశ్రమలు బాగా వృద్ధిపొందాయన్నమాట. రోమను సామ్రాజ్యంతో వ్యాపారం చురుకుగా సాగుతూంది. ధనిక తరగతులలో కొద్దీగొప్పా భోగం, విలాసం కనిపిస్తూంది. ఇవన్నీ జనాభా అధికతర సాంద్రతకు నిదర్శనలు. సరిగ్గా ఈ సమయంలోనే

---

అందరిదీ సమాన సంఖ్య కాదు. అధికంలో అధికం 2 లక్షలమంది వున్నవారూ, తక్కువలో తక్కువ 50 వేలు వున్నవారూ కూడా వున్నారు." (Diodorus, Siculus, V, 25.) అంటే సగటు సంఖ్య లక్షా ఇరవైయైదువేలు అన్నమాట. గాల్‌లో నివసించే ప్రజలు బాగా వృద్ధిలో వున్నారు. అందుచేత జర్మనులకన్న ఎక్కువ సంఖ్యలోనే వుంటారు. (ఎంగెల్స్ వివరణ.)

* విశాల జర్మనీ. – సం.

జర్మనులు రైన్ నది, రోమన్ రక్షణ ప్రాకారం డాన్యూబ్ నది—పొడుగుగా తమ దాడి ప్రారంభించారు. పెరిగిపోతున్న జనాభా బయటికి దారి చూసుకుంటున్న దనడానికిదొక ప్రత్యక్ష నిదర్శనం. ఈ దాడి ఉత్తర సముద్రంనుంచి నల్ల సముద్రందాకా సాగింది. మూడు శతాబ్దాల నిరంతర పోరాటాలలో స్కాండినేవియాలోని గోథ్‌లూ, బుర్గుండియన్లూ తప్ప మిగతా గోథిక్ ప్రజాసమూహాలలో ప్రధానభాగం ఆగ్నేయ దిశగా కదిలింది. సుదీర్ఘ శ్రేణిలో సాగుతున్న దాడులలో వీరు వామపార్శ్వంగా నిలబడ్డారు. ఎగువ డాన్యూబ్ తీరభాగానికి చెందిన జర్మన్లు (హెర్మినోనియన్లు) ముందుకు చొరుచుకు వెళ్లారు. ఈనాడు ఫ్రాంకులనే ఇస్త్రాయెవోనియన్లు రైన్‌నది వెంబడినే దక్షిణరంగంలో పోరాడుతున్నారు. బ్రిటన్‌ను జయించే పని ఇంగాయెవోనియన్ల పాలబడింది. అయిదో శతాబ్దం ఆఖరుకి రోమను సామ్రాజ్యం నిర్వీర్యం అయింది. నిశ్శక్తం, నిస్సహాయం అయిపోయింది. జర్మనుల దాడినాపే శక్తి అక్కడేదీ మిగలలేదు.

గత ప్రకరణాలలో ప్రాచీన గ్రీకు, రోమను నాగరికతల పుట్టుకను చూశాం. ఇప్పుడు వాని అంత్యావస్థను చూస్తున్నాం. రోమను ప్రపంచాధికారం శతాబ్దాలుగా మధ్యధరా సముద్ర ప్రాంత దేశా లన్నింటినీ చెక్కపట్టినట్లు చదును చేసేసింది. సంకీర్ణం అయిపోయిన లాటిను భాషను గ్రీకు గాని, ఇతర దేశభాషలు గాని ప్రతిఘటించ లేకపోయినాయి. వాటి స్థానంలో సంకర లాటిన్ భాష చోటుచేసుకుంది. జాతుల ప్రత్యేకత లేమీ మిగులలేదు. గాల్‌లు, ఐబీరియనులు, లిగురియన్లు, నొరికన్లు* అంతా రోమనులే అయిపోయారు. రక్త సంబంధాలను పట్టి ఏర్పడిన ప్రాచీన వ్యవస్థను రోమను పరిపాలనా, రోమను చట్టాలూ తుడిచి పెట్టివేశాయి. ఆ విధంగా స్థానిక, జాతీయ ఆత్మ వ్యక్తీకరణల అవశేషాలు కూడా రద్దయిపోయాయి. రోమను అనేది ఒక జాతి పేరు కాదు. జాతి శూన్యత కది చిహ్నం—అందుచేత రోమను ననే భావం ప్రాచీన వ్యవస్థలేని లోపాన్ని భర్తీచేయలేక

---

* ఐబీరియన్లు—ప్రాచీనకాలంలో ఐబీరియన్ ద్వీపకల్పంలోని కొంతభాగంలోను, దానిని చేరివున్న మధ్యధరా సముద్ర దీవులలోను, ఆనాటి ఫ్రాన్సు ఆగ్నేయ భాగంలోను నివసించిన తెగల సమూహం.

లిగురియన్లు—ప్రాచీనకాలంలో ఇటాలియన్ ద్వీపకల్పంలోని అధికాంశభాగంలో నివసించిన తెగల బృందం. క్రీ. పూ. 6వ శతాబ్దంలో ఇటాలియన్ తెగలచేత వీరు యీ ద్వీపకల్పపు వాయవ్య భాగానికీ, గాల్‌యొక్క ఆగ్నేయ కోస్తా భాగానికీ తరిమివేయబడ్డారు.

నొరికన్లు—ఇల్లీరియన్, కెల్టిక్ తెగల బృందం. నొరికమ్‌యొక్క ప్రాచీన రోమన్ రాష్ట్ర భూభాగంలో (యిప్పుడీ ప్రాంతం కొంత స్టైరియాలోనూ, కొంత కారింతియాలోనూ వుంది) యీ తెగలవారు స్థిరపడ్డారు.—సం.

పోయింది. కొత్త జాతులు ఉత్పన్నం కావడానికి కావలసిన బీజాలు సర్వత్రా వున్నాయి. వివిధ రాష్ట్రాలలోని లాటిన్ మాండలికాలు అంతకంతకు విడిపోతున్నాయి. ఇటలీ, ఫ్రాన్సు, స్పెయిన్, ఆఫ్రికాలను వేర్వేరు దేశాలనుగా చేస్తున్న ప్రకృతిసిద్ధములయిన సరిహద్దులు అలాగే వున్నాయి. ఆ హద్దుల్ని మరిచిపోవడమూ సాధ్యం కాదు. కాని వీనిని కొత్త జాతులనుగా ఏకీకృతం చేయగల శక్తులు ఎక్కడా కూడా లేవు. ఎక్కడా అభివృద్ధికి అవకాశాలు కనిపించవు. సృజనాత్మక శక్తి మాట అటుంచి, శైథిల్యాన్ని నిరోధించగల శక్తి కూడా ఏ మాత్రమూ లేదు. అంత సువిశాల భూభాగంలోని అసంఖ్యాక ప్రజాకోటిని కలిపి వుంచుతున్న దొక్క రోమను రాజ్యం మాత్రమే. కాలక్రమేణా ఆ రాజ్యమే వారికి శత్రువూ, పీడాకరమూ అయింది. రాష్ట్రాలు రోమును ధ్వంసం చేశాయి. రోము కూడ అన్నిటిలాగ ఒక రాష్ట్ర నగరమే అయిపోయింది. దానికి కొన్ని ప్రత్యేక హోదాలున్నాయేగాని అది ఇప్పుడు పాలక నగరం కాదు. ప్రపంచ సామ్రాజ్యాని కది ఇప్పుడు కేంద్రం కాదు. చక్రవర్తులూ, ఉపచక్రవర్తులూ అక్కడ వుండడం లేదు. ఇప్పుడు కాన్‌స్టాంటినోపుల్, ట్రీర్, మిలాన్ నగరాలు వారి మకాములు. రోమను రాజ్యం ప్రజలను పీకి, పీడించే ఒక బ్రహ్మాండమైన సంక్లిష్ట యంత్రం అయిపోయింది. పన్నులు, ప్రభుత్వానికి సేవలు, అనేకరకాల లెవీలు, ప్రభుత్వం వసూలుచేసే అపరాధాలతో ప్రజానీకం అంతకంతకు గర్బదరిద్రులయిపోతున్నారు. ప్రొక్యురేటర్లు,* పన్ను వసూలు చేసేవారు, సైనికులు ప్రజలనుంచి డబ్బు పిండేటందుకు అనుసరించే పద్ధతులు దుర్భరం అయిపోయినాయి. ప్రపంచ వ్యాప్తంగా అధికారం సంపాదించిన రోమను రాజ్యం పరిస్థితుల నీ గతికి తెచ్చింది. దేశంలో భద్రతను నిలపడం, బయటినుంచి దాడిచేస్తూన్న అనాగరికులనుంచి రక్షణ కల్పించడం యివే దాని అస్తిత్వ యోగ్యతలయ్యాయి. కాని, దేశంలో అది నిలుపుతున్న భద్రత వట్టి అరాచకం కన్న అధ్వాన్నం. పౌరులకు అనాగరికుల దాడులనుంచి రక్షణ నిస్తున్నట్లు భావించడం ఆత్మవంచన. ఏమంటే పౌరులు అనాగరిక ప్రజలను ఆపదోద్ధారకులనుగా అభినందిస్తున్నారు.

సామాజిక పరిస్థితులు కూడా అంత దుర్భరంగానే వున్నాయి. రిపబ్లికు చివరి కాలంలో, ఆక్రమించిన రాష్ట్రాలను నిర్దయగా దోపిడీ చేయడం ఒక్కటే రోమను పరిపాలనకు ప్రాతిపదిక అయింది. చక్రవర్తులు ఈ దోపిడీని రద్దు చేయలేదు. పైపెచ్చు దానినొక క్రమ పద్ధతిలో పెట్టారు. సామ్రాజ్యం శిథిలం అవుతున్న కొద్దీ పన్నులు పెరిగాయి. నిర్బంధ చాకిరీ ఎక్కువయింది. వుద్యోగులు సిగ్గు బిడియాలు విడిచి ప్రజలను అదిరించి, బెదిరించి దోపిడీ చేశారు. రోమను పెత్తందార్లు ఎన్నడూ పరిశ్రమలూ, వ్యాపారమూ ముట్టుకోలేదు.

---

* రోమను చక్రవర్తుల తరపున రాష్ట్రాలలో ఆర్థిక విషయాలు నిర్వహించే ఉద్యోగి. — సం.

వడ్డీ వ్యాపారంలో వారు అందరి తలలూ తన్నారు. అంతటివాళ్లు మరి పుట్టలేదు, పుట్టబోరు. వ్యాపారం, వాణిజ్యం ఏలాగో కొంతకాలం సాగింది. కాని ఉద్యోగుల లంచాలతో అంతరించిపోయింది. మిగిలిన కొద్దిపాటి వాణిజ్యం ఒక్క తూర్పు భాగంలో గ్రీకు రాష్ట్రంలోనే సాగుతుండేది. ఆ విషయం ఇక్కడ మన పరిశీలనకు అప్రస్తుతం. సర్వత్రా దారిద్ర్యం తాండవించింది. వ్యాపారం, పరిశ్రమలు, కళలు, చివరకు జనాభాయే క్షీణించాయి. పట్టణాలు పాడుబడ్డాయి. వ్యవసాయం బాగా చితికిపోయింది. రోమనుల ప్రపంచాధిపత్యం యొక్క అంతిమ ఫలితాలివి.

ప్రాచీనకాలంలో ప్రపంచంలో ప్రధానమైన ఉత్పత్తి శాఖ వ్యవసాయమే. ఇంతకు ముందెన్నటికన్న నేడు అదే గతి అయింది. రిపబ్లికు చివరి దశలో ఇటలీ దేశం అంతటా పెద్దపెద్ద ఎస్టేట్లు (లాటిఫుండియా) తలఎత్తాయి. వాటిని రెండువిధాలుగా వుపయోగించేవారు. ప్రజల్ని తోలేసి పెద్దపెద్ద బీళ్లు పెట్టి పశువుల్నీ, జీవాల్నీ పెంచేవారు. వాటిని మళ్లెయ్యడానికీ, సంరక్షించడానికీ కొద్దిమంది బానిసలు సరిపడతారు. లేదా వాటిలో బానిసల సాయంతో పెద్దపెద్ద పండ్లతోటలు నాటేవారు. తోటల యజమానుల భోగవిలాసాలకూ, పట్టణాలలో అమ్మడానికీ వాటి ఫలసాయం వినియోగం అయ్యేది. కాలం గడిచిన కొద్దీ యజమానులు చితికిపోవడం, నగరాలు పాడుపడటం మూలంగా తోటలు పాడయిపోయాయి. కాని బీళ్లు పెరిగాయి. బానిసల శ్రమమీద కొనసాగే లాటిఫుండియను ఆర్థిక వ్యవస్థ ఇంక లాభకరంగా లేదు. కాని అప్పట్లో భారీ వ్యవసాయానికి సాధ్యమైన రూపం అదొక్కటే. చిన్న కమతాల సాగే మళ్లీ లాభకరం అయింది. ఒక్కొక్క ఎస్టేటునే కమతాలుగా విడదీసి, వంశపారంపర్యంగా వ్యవసాయం చేసుకొనే రైతుల కిచ్చారు. వారు నిర్ణీతమైన మక్తా చెల్లించేవారు. కొంతమంది రైతులకుగాక పాలికాపులకు ఇచ్చేవారు. వారిని రైతులనేదానికన్న మేనేజర్లనవచ్చు. వారికి ఏడాది చేసిన పనికి పంటలో ఆరో వంతో, తొమ్మిదో వంతో ఇచ్చేవారు. కాని, ఈ చిన్న కమతాలను ముఖ్యంగా "కొలోనీ"కి పంచేవారు. వారు ఆ భూమికే అతుక్కుపోయి వుంటారు. ఏటా నిర్ణీతమైన మక్తా చెల్లిస్తారు. వారిని భూములతో సహా అమ్మేసుకోవచ్చు. ఈ "కొలోనీ" బానిసలు కారు. అటు స్వతంత్రులూ కారు. స్వతంత్ర పౌరులను వారు పెళ్లి చేసుకోగూడదు. తమ తరగతికే చెందిన వారిని చేసుకొన్నా ఆ వివాహాలను గుర్తించరు. బానిసలలో లాగే వీరిలోనూ స్త్రీలు ఉంపుడు గత్తెలుగా మాత్రమే పరిగణింపబడతారు. మధ్యయుగాల నాటి భూదాసులకు (సెర్ఫు) వీరు పూర్వులు.

ప్రాచీన కాలంనాటి బానిసత్వానికి కాలదోషం పట్టిపోయింది. గ్రామసీమలలోని పెద్ద పెద్ద ఎస్టేట్లలోనూ, పట్టణాలలోని కర్మాగారాలలోనూ కూడ శ్రమకు తగ్గ ప్రతిఫలం ముట్టడంలేదు. వాటిలో తయారైన వస్తువులను కొనేవాళ్లే లేరు. సామ్రాజ్యం మంచి

ఉచ్ఛస్థితిలో వున్నప్పుడు పెద్దపెట్టున వుత్పత్తిసాగేది. ఇప్పుడు చిన్న కమతాల వ్యవసాయం, చిన్న గృహపరిశ్రమలు ఏర్పడ్డాయి. వానిలో బానిసలు చాలమంది వుండ వలసిన పనిలేదు. ధనవంతుల ఇళ్లలో పనికీ, ఆడంబరాలకీ మాత్రమే సమాజంలో బానిసల అవసరం మిగిలింది. అయితే బానిసత్వం క్షీణదశలో ఉన్నా ఉత్పాదక శ్రమనంతనూ బానిస చాకిరీగానే భావించడం పోలేదు. స్వతంత్రులయిన రోమనులకు పనిచెయ్యడం అప్రతిష్ఠాకరం అయింది. ఇప్పుడున్న వారంతా స్వతంత్ర రోమను ప్రజలేనాయె. ఆ విధంగా అసలే ఎక్కువగా వున్న బానిసలు, ఒక మూల పెరిగి పోతున్నారు. వారిని పోషించడం యజమానులకు బరువై పోతూంది. వారికి స్వాతంత్ర్యం ఇచ్చేస్తున్నారు. రెండో వేపున తిండికి లేని స్వతంత్ర ప్రజలు (అమెరికాలోని పూర్వపు బానిస రాష్ట్రాలలో బీదలయిన తెల్లజాతివారిలాంటి వాళ్లు) "కొలోనీ"లూ పెరిగి పోతున్నారు, ప్రాచీన యుగపు ఈ బానిస విధానం క్రమంగా అంతరించి పోవడంలో క్రైస్తవ మతానికి ఏమీ ప్రమేయం లేదు. రోమను సామ్రాజ్యంలో బానిస విధాన ఫలితాలలో మాత్రం అది శతాబ్దాల తరబడి భాగస్వామి అయింది. ఆగామి కాలంలో క్రిస్టియను మతస్థులే సాగించిన బానిస వ్యాపారాన్ని అది నిరోధించలేదు. ఉత్తరాన జర్మనులు, మధ్యధరా సముద్ర ప్రాంతంలో వెనీషియన్లు, తరువాతి కాలపు నీగ్రో బానిసల వ్యాపారాన్ని* అది ఆపడానికి ప్రయత్నించలేదు. బానిసత్వం వలన ఇక ఎంతమాత్రం లాభం లేకపోయింది. కనుక అది అంతరించిపోయింది. బానిసత్వం అంతరించినా ఉత్పాదకమయిన పని చెయ్యడం అప్రతిష్ఠాకరమనే విషమయ భావనను స్వతంత్ర ప్రజలలో మిగిల్చే పోయింది. రోమను ప్రపంచం దారి తెన్నులులేని దుర్గమారణ్యంలో చిక్కుపడింది, ఆర్థికంగా బానిసత్వం నిరుపయోగం. స్వతంత్ర ప్రజలలో పని చేయడం అవినీతి. ఒకటి బ్రతకలేదు. రెండో దానికి బ్రతుకు లేదు. అది సామాజికోత్పత్తిలో ప్రధాన రూపం కాలేదు. పూర్తి విప్లవం వస్తేనే పరిస్థితి బాగుపడటం సాధ్యం.

రాష్ట్రాలలో పరిస్థితు లింతకన్న మెరుగ్గా లేవు. మనుకున్న సమాచారం ఎక్కువగా గాల్ రాష్ట్రానికి సంబంధించింది. కొలోనీతో పాటు గానే స్వతంత్రులైన చిన్న రైతులు కూడా చాలమంది అక్కడవున్నారు. ఉద్యోగులు, న్యాయాధీశులు, వడ్డీ వ్యాపారులు సాగించే దురంత దోపిడీనుంచి రక్షించుకొనేటందుకు వారు మంచి పలుకుబడి, అధికారమూ వున్న వారి రక్షణ కోరుతుండేవారు. ఒకళ్లూ, ఇద్దరూ వ్యక్తులు కాదు, గ్రామాలకు

---

* క్రెమోనా నివాసి బిషప్ ల్యూత్ప్రాండ్ చెప్పినదాన్ని బట్టి పదో శతాబ్దంలో పవిత్ర జర్మను సామ్రాజ్యం[140]లోని వెర్డున్‌లో కొజ్జాల్ని తయారుచేయడం వ్యాపారంగా సాగింది. వారిని మూర్‌ల అంతఃపురాల కోసం స్పెయినుకు ఎగుమతి చేసి బోలెడు లాభాలు గడించేవారు. (ఎంగెల్స్ వివరణ.)

గ్రామాలు ఈ విధంగా ఎవరో ఒకరి రక్షణలోకి చేరేవి. అది అతి అయ్యేసరికి నాలుగో శతాబ్దంలో చక్రవర్తులు ఆ ఆచారాన్ని నిషేధించారు కూడా, రక్షణ కోరుతూ ఒకరి అండ చేరిన వారికా పద్ధతి ఏ విధంగా వుపకరించింది? ఆ రక్షకుడు తన రక్షణ కోరిన వారంతా తమ భూములను తనకు స్వాధీనం చెయ్యాలనీ, అలాచేస్తే జీవితాంతం వారికే ఆ భూములు భుక్తంచేస్తాననీ వాగ్దానం చేశాడు. హోలీ చర్చి ఈ కిటుకును పట్టుకొని తొమ్మిది, పది శతాబ్దాలలో భగవంతుని కీర్తినీ, చర్చి ఆస్తులనూ విస్తరింప చేసుకొంది. అయితే ఆ మొదటి రోజుల్లో పరిస్థితి వేరు. క్రీ. శ. 475 ప్రాంతంలో మార్సేల్స్ బిషప్ సాల్వియాన్ ఈ పద్ధతిని వట్టి దోపిడీ యని నిరసించాడు. రోమను వుద్యోగులూ, పెద్ద భూస్వాములూ అమలు పరుస్తున్న పీడనను భరించలేక "రోమనులు" ఎందరో అనాగరికు లాక్రమించిన ప్రాంతాలలోకి పారిపోయేవారనీ, అక్కడికి వెళ్లేక మళ్లీ రోమను పరిపాలన కిందికి తిరిగి ఎక్కడ పోవలసివస్తుందోననే భయం వారికి వుండేదనీ ఆయన రాశాడు. బీదలు తమ సంతానాన్ని తరచు బానిసలనుగా అమ్మివేసే ఆచారం ఆ రోజుల్లో వుందనడానికి దానిని నిషేధిస్తూ చేసిన చట్టమే సాక్ష్యం.

రోమను ప్రజలను వారి రోమను రాజ్యాధికారం బారినుండే కాపాడినందుకు ప్రతిఫలంగా జర్మన్ అనాగరికులు మూడింట రెండువంతుల భూమిని తాము కాజేసి తమలో తాము పంచేసుకొన్నారు. గణవ్యవస్థలో భూమి పంపకం జరిగింది, ఈ విజేతల సంఖ్య ఎక్కువ కాకపోవడంచేత ఎంతో భూమి పంచుకోకుండా మిగిలిపోయింది. దానిలో కొంత గణాల అధీనంలో, కొంత తెగల అధీనంలో, కొంత ఆ ప్రజలందరికిగా వుండిపోయింది. గణాలు సాగు భూములనూ, బీడు భూములనూ ఇళ్ల వరసన సమానంగా లాటరీ పద్ధతిలో పంచిపెట్టేవారు. వాటిని ఏకంచేసి మళ్లీ, మళ్లీ పంచేవారో లేదో మనకు తెలియదు. మొత్తంమీద రోమను రాష్ట్రాలన్నింటా ఈ ఆచారం త్వరలోనే అంతరించి, ఎవరికి పంచిన భూమి వారి దాన విక్రయాది సర్వస్వామ్యములు గల స్వంత ఆస్తి అయింది. అడవులూ, బీడు భూములూ, విభజించబడకుండా అందరి వుపయోగంలో వుండేవి. ఈ విధంగా వాడుకోవడమూ, పంచుకొన్న భూములను వ్యవసాయం చేసే విధానమూ ప్రాచీనాచారం ప్రకారం, సామూహిక నిర్ణయానుసారంగా జరిగేవి. గ్రామాలలో గణ వ్యవస్థ ఎక్కువకాలం సజీవంగా వున్నకొద్దీ, రోమనులూ, జర్మనులూ కలిసిపోయినకొద్దీ ప్రాదేశిక బంధనాలముందు రక్త సంబంధాలు విశీర్ణమైపోయాయి. మార్కు (గ్రామ సంఘం)లో గణం అంతర్లీనమైపోయింది. అయినా సభ్యుల మధ్య బంధుత్వ చిహ్నాలు కనిపిస్తూనే వుండేవి. ఉత్తర ఫ్రాన్సు, ఇంగ్లండు, జర్మనీ, స్కాండినేవియాలలో (మార్కులలో గణ వ్యవస్థ చిహ్నాలు అవశేషాలుగా మిగిలిన చోట్ల) గణ నిర్మాణం క్రమంగా ప్రాంతీయ నిర్మాణంగా రూపొందింది. రాజ్య వ్యవస్థలో అది అంతర్గతం అయింది. అయితే, గణ వ్యవస్థ

యొక్క ప్రత్యేక లక్షణం అనదగిన సహజ ప్రజాతంత్ర స్వభావం దానిలో మిగిలింది. తర్వాత శతాబ్దాలలో వచ్చిన క్షీణత్వంలో కూడ గణవ్యవస్థ చిహ్నం కొంత మిగిలింది. మన కాలంలో కూడా పీడిత ప్రజలుపయోగించేటందుకు సిద్ధంగా ఒక ఆయుధం ఆ విధంగా మిగిలింది.

దేశాక్రమణకు ఫలితంగా తెగలలోనూ, మొత్తం ప్రజలలోనూ వున్న గణాల తాలూకు సంస్థలు విశీర్ణమైపోయాయి. వానిలోని రక్తబంధుత్వ సంబంధాలు వేగంగా అంతర్ధానమయిపోయాయి. ఓడించిన ప్రజలను పాలించడానికి గణ వ్యవస్థతో పొసగదన్న సంగతి మనకు తెలుసు. ఆ విషయమే మన కిక్కడ బృహద్రూపంలో ప్రత్యక్షమవుతూంది. రోమను రాష్ట్రాలను స్వాధీనపరచుకొన్న జర్మను ప్రజలు ఈ ప్రాంతాల పరిపాలనకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే రోమనులు యావన్మందినీ తమ గణాలలోకి దత్తు తెచ్చుకోలేరు. గణసంస్థల సాయంతో వారిని పరిపాలించనూ లేరు. రోమను స్థానిక పరిపాలనా సంస్థలు ప్రారంభంలో యథాపూర్వకంగా పని సాగిస్తూనే వున్నాయి. కాని, వానిపైన అంతవరకూ వున్న రోమను రాజ్యానికి బదులుగా దేనినేనా ఏర్పరచాలి. ఈ ప్రత్యామ్నాయం మరో రాజ్యం అవుతుందే గాని వేరుగాదు. ఆ విధంగా గణ వ్యవస్థ తాలూకు పరిపాలనాంగాల్ని రాజ్యపాలనాంగాల్నిగా పరివర్తనం పొందించాలి. పరిస్థితుల ప్రాబల్యంవల్ల ఈ పనిని అతి వేగంగా నిర్వహించ వలసివుంది. విజేతల మొదటి ప్రతినిధిగా వుండేవాడు సైన్యాధిపతి. జయించిన ప్రదేశాలను బాహ్యాభ్యంతర కల్లోలాలనుంచి రక్షించ గలిగేటందుకు అతని అధికారాలను విస్తృత పరచాలి. సైన్యాధినాయకత్వాన్ని రాజరికంగా మార్చవలసిన సమయం వచ్చింది. ఆ పని జరిగిపోయింది.

ఫ్రాంకుల రాజ్యాన్ని తీసుకొందాం. ఇది విశాలమైన రాజ్యభాగం. ఇక్కడ పెద్ద, చిన్న జిల్లాలకు (Gun) మార్కు గ్రామాలకు కేటాయించిన భూములు పోను ఇంకా ఎంతో భూమి వుండిపోయింది. పెద్దపెద్ద అడవి భూము లున్నాయి. అవన్నీ విజేతలయిన సాలియను తెగల అనియమితాధికారంలోకి వచ్చేశాయి. సాధారణ సైన్యాధిపతి ఫ్రాంకుల రాజు కాగానే ఆ ప్రజా ఆస్తిని రాజకుటుంబపు ఆస్తినిగా చేయడమే మొట్టమొదట అతడు చేసిన పని. దానిని తన దళానికి వతన్‌దారీలుగా[141] దానం చేశాడు. మొదట స్వంత బలగంగా వున్న యోధులూ, తర్వాత చిన్న చిన్న సేనానాయకులూ అతని ప్రత్యేక దళంగా వుండేవారు. క్రమంగా రోమనులుగా మారిన గాల్ తెగలవారు కూడా అతని వతన్‌దారీ వర్గంలో చేరారు. వీరికి చదువనూ, రాయనూ తెలియడమూ, రోమను భాష ఆ చట్టాలు, లాటిన్ సాహిత్యంతో పరిచయమూ వుండడంచేత వీరు రాజుకు సన్నిహితులయ్యారు. వీరేగాక అతని దర్బారులో చేరిన బానిసలు, భూదాసులు, స్వతంత్రం పొందిన బానిసలలో కొందరిపై మక్కువ పెంచుకొని వారిని కూడా తన అనుచర వతనుదారులనుగా చేసుకున్నాడు. వీరందరికీ ప్రజల భూముల నిచ్చాడు. మొదట అధికాంశం బహుమ

తులుగా ఇచ్చాడు. తర్వాత వతన్‌దారీలుగా ఇచ్చాడు. ప్రారంభంలో చాల సందర్భాలలో రాజు బ్రతికి వున్నంతవరకే ఇది చెల్లేటట్లు ఇచ్చాడు. ఈ విధంగా ప్రజల ఖర్చుమీద కొత్తగా ఒక కులీన వర్గం ఏర్పడింది.

అంతేకాదు. వెనుకటి గణ నిర్మాణం ద్వారా సుదూర వ్యాప్తమైన సామ్రాజ్యాన్ని పాలించడం సాధ్యం కాదు. గణ నాయకుల సమితి పాతబడి ఎక్కువకాలం కాకపోయినా, అన్నప్పుడూ అది సమావేశం అవుతూండడం సులభం కాదు. అందుచేత త్వరలోనే శాశ్వతమైన రాజసిబ్బంది దాని స్థానంలో ఏర్పరచబడింది. వెనుకటి ప్రజాసభ నామమాత్రంగా వుంది. కాని క్రమంగా అది ప్రజాసభగా గాక, సైన్యాలలోని చిన్న చిన్న నాయకుల, కొత్తగా తలఎత్తిన ప్రముఖుల సభగా రూపొందసాగింది. నిరంతరాయంగా సాగుతున్న అంతర్యుద్ధాలతోనూ, ముఖ్యంగా చార్లె మాగ్నె కాలంనాటి దండయాత్రలతోనూ ఫ్రాంక్ రాష్ట్రంలోని ప్రజానీకమూ, భూములున్న స్వతంత్ర రైతులూ కటిక దరిద్రంలో కూరుకుపోయారు. ఉన్నదంతా వూడ్చుకుపోయింది; రిపబ్లిక్ చివరి రోజులలో రోమన్ రైతులకు పట్టిన దుర్గతే వీరికీ పట్టింది. మొదట వీరే మొత్తం సైన్యాలలో పనిచేసేవారు. ఫ్రాన్సును జయించాక వీరే సైన్యాలకు మూలపీఠం అయ్యారు. అటువంటివారంతా ఎంత దరిద్రులు అయిపోయారంటే తొమ్మిదో శతాబ్దం ప్రారంభం నాటికి వారిలో 20 శాతం మంది కూడా సైనిక పరికరాల్ని సమకూర్చుకోలేనంత దుస్థితిలో పడ్డారు. వెనుకటి రోజుల్లో రాజు పిలవనంపుతే స్వతంత్రులయిన రైతులు వచ్చి సైన్యాలలో చేరిపోయేవారు. కాని, ఇప్పుడు కొత్తగా ఏర్పడిన సామంత ప్రభువుల భటవర్గం సైన్యాలుగా ఏర్పడుతూంది. ఈ భటవర్గంలో ఎందరో స్వతంత్ర గ్రామీణులు కూడా (విలియన్లు) వుండేవారు. ఒకనాడు వారి పూర్వులే ఏ రాజునూ, ఎవరి పెత్తనాన్నీ అంగీకరించేవారు కారు. తర్వాతి తరాలలో రాజుదే కాని మరెవ్వరి పెత్తనాన్నీ ఒప్పుకొనేవారు కారు. వారి వంశీకులే ఈనాడు ప్రతి సామంతుడి క్రిందా పని చెయ్యడానికి, ఏ పని చెయ్యడానికైనా సిద్ధంగా వున్నారు. చార్లె మాగ్నె తర్వాత వచ్చిన రాజులకాలంలో అంతర్యుద్ధా లెక్కువయ్యాయి. రైతుల పరిస్థితి మరింత దుర్భరమయింది. రాజు బలహీనపడ్డాడు. చార్లె మాగ్నె ఏర్పరచిన జిల్లా సామంతులు (Gaugrafen)[142] తమ హోదాను వంశపారంపర్యపు హక్కుగా చేసుకొనేటందుకు ప్రయత్నించారు. వారితోపాటు ఇతర సామంతులూ ఎవరికివారు తమ అధికారాన్ని సుస్థిరం చేసుకో ప్రయత్నించారు. నార్మనుల దాడులతో రైతులు పూర్తిగా ధ్వంసం అయారు. నాలుగువంద లేళ్లక్రితం ఫ్రాంకుల దాడులముందు రోమను సామ్రాజ్యం ఎంత నిస్సహాయస్థితిలో వుందో, చార్లె మాగ్నె చచ్చిపోయిన ఏభయ్యేళ్లనాటికి నార్మన్ల దాడులముందు ఫ్రాంక్ సామ్రాజ్యం అంత నిస్సహాయ స్థితిలోకి వచ్చేసింది.

బయటి దాడులను తిప్పికొట్టే శక్తి లేకపోవడమే కాకుండా, ఆంతరంగిక వ్యవస్థ,

లేకపోతే అవ్యవస్థ కూడ అంత అస్తవ్యస్తంగానూ వుంది. తమ పూర్వులైన రోమన్ "కాలోనీ" వుండిన దుస్థితికి స్వతంత్ర ఫ్రాంక్ రైతులు కూడా దిగజారి పోయారు. దోపిడులూ, యుద్ధాలతో చితికిపోయి రాజరికాధికారం రక్షణ యివ్వలేకున్న స్థితిలో వారు నూతన ప్రభువుల్నో, చర్చినో తమ రక్షకులుగా ఎన్నుకోవలసి వచ్చింది. కాని యిందుకు వారు చాలా మూల్యం చెల్లించవలసివచ్చింది. తమకు పూర్వంనాటి గాల్ రైతులలాగే వారూ తమ పోషకులు పేర భూములను వప్పచెప్పి, కౌలుదారులుగా వాటినే చేసుకొనేటందుకు తీసుకోవలసివచ్చింది. కౌళ్ల పలురకాలు. కాని అన్నింటా కూడా వెట్టి చాకిరీ చెయ్యడమూ, మక్తాలు ఇవ్వడమూ సమానలక్షణం. ఒకమారు ఈ పరాధీన స్థితికి పాల్పడ్డాక క్రమంగా వారు వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని కూడా కోల్పోయారు. కొన్నితరాలలో వారు భాదాసులుగా మారిపోయారు. ఆనాడు పారిస్‌కు సమీపంగావున్న (ఈనాడిది పారిస్ లోనే ఒక పేట అయింది) సెయింట్-జర్మన్-దే-ప్రెస్ మఠం తాలూకు ఇర్మినాన్ రికార్డులను చూస్తే స్వతంత్రులయిన రైతులు ఎంతవేగంగా పతనం పొందారో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ మఠం భూములు చుట్టుప్రక్కల జిల్లాలలోకంటూ వ్యాపించి వుండేవి. చార్లె మాగ్నె కాలంనాడు కూడా ఆ భూముల్లో 2,788 ఇళ్లవాళ్లుండేవారు. జర్మన్ పేర్లే గాని, ఇంచుమించు వాళ్ల అందరూ ఫ్రాంకులే. వారిలో 2,080 ఇళ్లవాళ్లు కాలోనీలు, 35 ఇళ్లవాళ్ళ లిటీ*లు, 220 మంది బానిసలు, 8 మంది మాత్రమే స్వంతభూమి హక్కు గలవారు! పోషకుడు రైతులచేత వారి భూమినంతనూ తనపేర బదిలీచేయించుకొని, వారికి జీవితపర్యంతం భుక్తాధికారాన్ని మాత్రమే యిచ్చే ఆచారాన్ని సాల్వియాన్ దైవద్రోహం అని నిందించాడు. కాని, ఈనాడు రైతులనుంచి చర్చి ఆ పద్ధతిమీదనే భూములు తీసుకొంటూంది. ఫ్యూడల్ దాసత్వం అంతకంతకు రూపం ధరిస్తూంది. రోమనుల కాలం నాటి అంగారియా[143]లాంటి పద్ధతులలోనే ఇది నిర్మించబడుతూంది. జర్మనుల మార్కుగ్రామాల ప్రజలు సార్వజనిక కార్యాలయిన వంతెనలు నిర్మించడం, రోడ్లను పోయడం వంటి పనులలో పాల్గొన్నట్టే రోమనులు ప్రభుత్వ కార్యాలలో వెట్టిపని చెయ్య వలసివచ్చింది. ఆవిధంగా ప్రజానీకం నాలుగువందల ఏళ్లక్రితం ఏ స్థితిలో వుందో అదే స్థితికి వచ్చినట్లు కనిపిస్తుంది.

దీనివలన రెండు విషయాలు మాత్రం స్పష్టం అవుతున్నాయి. మొదటి విషయం: రోమను సామ్రాజ్యపు అవసాన దశలో పరిశ్రమలూ, వ్యవసాయమూలో సాగుతున్న వుత్పత్తి స్థితికి పూర్తిగా అనుకూలమైన రూపంలోనే ఆనాడు సామాజిక విభజనా, ఆస్తిపంపకమూ జరిగింది. కాగా అది అనివార్యం. రెండో విషయం: నాల్గువందల ఏళ్లు గడిచినా ఆ వుత్పత్తి

---

* అర్ధ స్వతంత్రులైన రైతులు. — సం.

స్థితి అంతగా పెరగనూలేదు, తరగనూలేదు. అందుచేత మళ్లీ అదే సామాజిక విభజనా, ఆస్తి పంపకమూ ప్రత్యక్షమయ్యాయి. రోమను సామ్రాజ్యపు అంతిమ శతాబ్దాలలో పల్లెలమీద పట్టణాలకున్న ఆధిక్యం అంతరించింది. జర్మను పరిపాలన ప్రారంభ శతాబ్దాల్లో ఆ ఆధిక్యతను అవి సంపాదించుకోనేలేదు. దీని అర్థం వ్యవసాయమూ, పరిశ్రమలూ కూడ చాల కింది దశలో వున్నాయన్నమాట. ఆ పరిస్థితులలో సామాన్యంగా పెత్తందారులయిన పెద్దపెద్ద భూఖామందులూ, పరాధీనులయిన చిన్న రైతులూ విధిగా బయలుదేరుతారు. ఆ దశలో బానిసల శ్రమతో నిర్వహించబడిన రోమను లాటిఫుండియన్ ఆర్థిక వ్యవస్థను గాని, దాసుల చాకిరీతో సాగే కొత్త రకం పెద్దపెద్ద కమతాల వ్యవసాయ పద్ధతిని గాని, ఆనాటి సమాజంలో ప్రవేశపెట్టడం సాధ్యంకాదు. ఇందుకు చార్లెమాగ్నె ఎంతో ఖర్చుపెట్టి సుప్రసిద్ధములైన తన రాజరికపు ఎస్టేట్లలో పెద్ద స్థాయిలో పరిశోధనలు చేశాడు. కాని ఫలితం ఏమీ మిగలలేదు. ఈ పరిశోధనలను మఠాలు కొనసాగించాయి. వానికి మాత్రమే అవి లాభించాయి. అయితే మఠాలు బ్రహ్మచారి జీవితంమీద ఆధారపడిన అసాధారణ సాంఘిక సంస్థలు, అవి అసాధారణములయిన పనులే చేయగలవు. సరిగా అందుకే అవి మినహాయింపులుగానే ఉండిపోవలసివుంది.

అయితేనేం, ఈ నాలుగు వందల యేళ్లలోనూ అభివృద్ధి బొత్తిగా లేకపోలేదు, కొంత వుంది. ప్రధానములయిన వర్గాలు మొదట ఏవయితే వున్నాయో, చివర కూడా అవే వున్నా, ఆ వర్గాలలోని ప్రజలు మారారు. పురాతన బానిసత్వం అంతరించింది. పనిచేయడం బానిసత్వం అనుకుంటూ భిక్షం ఎత్తే స్థితికి వచ్చిన బీద స్వతంత్ర ప్రజ యిప్పుడు లేరు. రోమన్ "కాలోనస్"కీ, కొత్తగా వచ్చిన భూదాసుడికీ నడుమ స్వతంత్రుడైన ఫ్రాంక్ రైతు వచ్చాడు. శిథిలం అయిపోతున్న రోమనుల వ్యవస్థనాటి "అర్థం లేని అహంకారాలూ, నిరుపయోగమయిన కలహాలూ" పూర్తిగా తుడుచుకుపోయాయి. శిథిల నాగరికత తాలూకు విధ్వంసం మధ్య గాక, నూతన నాగరికత తాలూకు ప్రసవవేదనలో తొమ్మిదో శతాబ్దపు కొత్త వర్గాలు రూపొందాయి. కొత్తగా వచ్చిన యజమానులూ, సేవకులూ తమకు పూర్వంవున్న రోమను యజమానులతో, సేవకులతో పోలిస్తే మానవు లనవచ్చు. అయితే రోమనుల కాలంనాడు బలవంతులైన భూస్వాములకూ, చాకిరీచేసే రైతులకూ మధ్య వుంటూండిన సంబంధాలు రైతులకు సంబంధించినంతవరకు ప్రాచీన ప్రపంచ క్షీణతకు చిహ్నాలు. ఈనాడివి భూస్వాముల నూతనాభివృద్ధికి ఆరంభకాలు. ఈ నాలుగు వందల యేళ్లలో కొత్తగా వచ్చిందేదీ లేనట్లు అనిపిస్తుంది. కాని ఒక గొప్ప విషయం ఉత్పన్నం అయింది. పశ్చిమ యూరపులోని జనాభా రాబోయే చరిత్ర నిర్మాతలైన ఆధునిక జాతులుగా, నూతన సమూహాలుగా విభజితం అయింది. నిజంచేత జర్మనులు యూరప్‌కు నూతన జీవం పోశారు. అందుచేతనే జర్మన్‌ల కాలంలో రాజ్యాలు శిథిలం

కావడం, నార్సు-సారాసెన్ జాతుల పరాధీనతకు దారితీయలేదు. వతన్‌దారీ, న్యాస (commendation)[144] స్థితినుంచి ఫ్యూడలిజంలోకి అభివృద్ధి వచ్చింది. ఈ దశలో జనాభా అత్యధికంగా పెరిగింది. మరో రెండువందల సంవత్సరాలకి ప్రారంభమైన క్రూసేడ్లలో[145] ఎంతో జనక్షయం అయినా లెక్కరానంత ఎక్కువగా జనం అభివృద్ధి అయ్యారు.

శిథిలం అయిపోతున్న యూరపుకు కొత్త జీవం ఇవ్వడానికి జర్మన్లు ప్రయోగించిన నిగూఢ సమ్మోహక శక్తి ఏమిటి? దురభిమానపరులయిన చరిత్రకారులు చెప్తున్నట్లు జర్మను జాతిలో ఏదో అద్భుతశక్తి అంతర్గతంగా వుందా? ఏమీ కాదు. ఆర్యను తెగలలో జర్మనులు చాలా ప్రతిభగల వాళ్లనడంలో సందేహంలేదు. అందులోనూ ఆ రోజుల్లో వాళ్లు పూర్తి అభివృద్ధిక్రమంలో వున్నారు. అయితే వాళ్ల జాతిలో వున్న ప్రత్యేక లక్షణాలు గాక వారి అనాగరిక వ్యవస్థ — వారి గణ నిర్మాణమే — యూరపును పునరుజ్జీవింప చేసింది.

వ్యక్తిగత సామర్థ్యం, వీరత్వం, స్వాతంత్ర్యాభిలాష, పరిపాలనకు సంబంధించిన వ్యవహారాలన్నీ స్వంత వ్యవహారాలుగా భావించే ప్రజాతంత్ర స్వభావం — మొత్తంమీద రోమనులలో లుప్తమైన ఈ గుణాలు జర్మన్లలో యింకా అప్పటికి వున్నాయి. రోమను సామ్రాజ్యపు బురదనుంచి నూతన రాజ్యాలను ఏర్పరచడానికి, నూతన జాతుల్ని సృష్టించడానికి సమర్థత వీరికే వున్నది. ఇవన్నీ గణవ్యవస్థయొక్క ఫలితాలూ, ఉన్నత దశలోవున్న అనాగరిక తెగల ప్రత్యేక లక్షణాలూ కాకపోతే మరేమిటి?

వెనుకటి దంపతీ వివాహ వ్యవస్థలో వారు మార్పు తెచ్చారు. కుటుంబంలో మగవాని అధికారాన్ని కొంచెం దిగతీశారు. స్త్రీలకు అతః పూర్వంకన్న హెచ్చు హోదా యిచ్చారు. వారి అనాగరిక స్థితి, గణసంస్థ నాటి ఆచారాలు, తల్లిహక్కు కాలంనాటి అలవాట్లూ కాకపోతే దీనికి వేరు కారణం ఏముంది?

జర్మనీ, ఉత్తర ఫ్రాన్సు, ఇంగ్లండు — కనీసం ఈ మూడు అతి ప్రధానమైన దేశాలలోనూ మార్కు గ్రామాల రూపంలో శేషించి వున్న సిసలయిన గణవ్యవస్థను వారు భూస్వామ్య వ్యవస్థలోకి పరిణామం పొందించగలిగారు. అత్యంత కఠోరమైన మధ్యయుగాల దాసత్వ పరిస్థితులలో కూడ పీడిత రైతాంగం ప్రతిఘటించేటందుకు ఒక ఆధారాన్నీ, స్థానికంగా ఐక్యం అయి నిలబడే అవకాశాన్నీ కలగజేశారు. ప్రాచీన కాలంనాటి బానిసలకు గాని, ఈనాటి శ్రామికవర్గానికిగాని ఇటువంటి అవకాశం సంసిద్ధంగా లేదు. వారు అనాగరిక యుగపు అలవాట్లతో, పూర్తి అనాగరిక గణాలుగా నివసించడం తప్ప దీనికి మరో కారణం ఏదైనా వుందా?

చివరి విషయ మేమంటే: అదివరకు వారు తమ ప్రాంతాలలో అనుసరించేలాంటి సౌమ్య దాసత్వ పద్ధతిని సర్వత్రా వ్యాప్తం చేశారు. క్రమంగా రోమను సామ్రాజ్యంలో

బానిసత్వం రద్దు అయి, దాసత్వ పద్ధతి కాలూనుకుంది. పీడిత ప్రజ క్రమేణా ఒక వర్గంగా విముక్తి పొందేటందుకిదొక సాధనం అయిందని ఫోరియర్ చెప్పాడు. Fournit aux cultivateurs des moyens d'affranchissement *collectif et progressif** అందుచేత ఇది బానిసత్వం కన్న ఎన్నోరెట్లు మెరుగు. బానిసత్వంలో మధ్యంతర దశ అనేది లేకుండా సరాసరి వ్యక్తి విముక్తి పొందేటందుకే అవకాశం వుంది. (విజయవంత మైన తిరుగుబాటు ద్వారా బానిసత్వం రద్దయినమాట ప్రాచీన యుగంలో వినం). కాని మధ్య యుగంనాటి భూదాసులు ఒక వర్గంగా, మెట్టు తర్వాత మెట్టుగా విముక్తి సాధించారు. దీనికి కారణం వారి అనాగరిక స్థితి కాకుంటే మరేమిటి? వారు యూరపులో ప్రాచీన కాలంలో ఉత్పత్తి కోసం వినియోగించిన బానిసత్వంగాని, ప్రాచ్యదేశాలలో అమలు జరిగిన మాదిరి గృహ బానిసత్వంగాని ఎరుగరంటే, అందుకు ఆ అనాగరిక స్థితే కదా కారణం?

జర్మనులు రోమను ప్రపంచంలో ప్రవేశపెట్టిన ప్రాణశక్తి అనాగరికత తప్ప వేరు కాదు. నిజానికి శిథిల నాగరికతతో మూలుగుతున్న ప్రపంచాన్ని పునరుజ్జీవింపచెయ్యగలవారు ఒక్క అనాగరికులు మాత్రమే. వలసల బయలుదేరేటందుకు పూర్వం జర్మనులు అనాగరిక యుగపు ఉన్నత దశలో జీవిస్తున్నారు. అదే ఈ మార్పులు తేవడానికి అత్యంత అనుకూల మైన విషయం. ఆ విషయం గ్రహిస్తే సర్వం అవగతం అవుతుంది.

# IX

## అనాగరికత: నాగరికత

గ్రీకు, రోమను, జర్మను యీ మూడు గొప్ప ప్రజాసమూహాల వుదాహరణలతో గణవ్యవస్థ ఏ విధంగా శిథిలం అయిపోయిందో మనం పైన చూశాం. ఇంక ఆఖరున అనాగరిక యుగపు ఉన్నత దశలో సమాజపు గణవ్యవస్థను శిథిలపరచి, నాగరిక యుగం అవతరణతో దానిని పూర్తిగా రద్దు పరచిన ఆర్థిక పరిస్థితులను పరిశీలిద్దాం. దీనికై మార్క్సు రాసిన "పెట్టుబడి," మోర్గన్ పుస్తకం లాగే అవసరం.

గణవ్యవస్థ ఆటవిక యుగపు నడిమి దశలో పుట్టింది. ఉన్నత దశలో అభివృద్ధి పొందింది. మనకు ఇంతవరకు దొరికిన ఆధారాల్ని పట్టి చూస్తే అది అనాగరిక యుగపు

---

* భూమిని దున్నుకొనే రైతులు సమష్టిగా, క్రమ విముక్తి పొందేటందుకు సాధనం అయింది. — సం.

నిమ్న దశలోనుంచి ఉన్నతి పొందినట్లు కనబడుతుంది. అందుచేత మన పరిశీలనను ఆ దశనుంచే ఎత్తుకుందాం.

ఈ దశకు ఆమెరికను ఇండియనులను ఉదాహరణకి తీసుకొందాం. వీరిలో గణవ్యవస్థ పూర్తిగా అభివృద్ధి పొందింది. తెగ ఎన్నో గణాలతో ఏర్పడుతుంది. సాధారణంగా మాత్రం దానిలో రెండే గణాలు వుంటాయి. జనాభా హెచ్చిన కొలదీ మొదటి గణాలనుంచి ఎన్నో పిల్లగణాలు వేరుపడతాయి. వానికా తల్లి గణం ఫ్రాట్రీ (సోదర కూటం)గా ఏర్పడుతుంది. ఒక్కొక్క తెగ అనేక తెగలుగా విడిపోయిన సందర్భాలలో కూడా మొదటి గణాలే ప్రత్యక్ష మవుతాయి. సన్నిహితాలయిన తెగలు కనీసం కొన్ని చోట్ల సమాఖ్య (కాన్ఫెడరసీ)గా ఏర్పడతాయి. నిరాడంబరమైన ఈ నిర్మాణం ఆనాడున్న సమాజంలోని పరిస్థితులకు పూర్తి అనుగుణంగా వుంది. ఇవి ఆ దశలో సహజంగా ఏర్పడే విశిష్టమైన సమూహాలు తప్ప వేరేమీ కావు. ఆ మాదిరిగా నిర్మాణం పొందిన సమాజంలోని అంతరిక ఘర్షణలన్నింటినీ ఇది సర్దుబాటు చేయగలదు. బయటివారితో ఘర్షణవస్తే దాన్ని యుద్ధం తీరుస్తుంది. ఆ యుద్ధంలో తెగ తుడుచుకు పోయినా పోవచ్చు. అంతేగాని మరొకరి కింద అణగివుండడం జరగదు. గణ నిర్మాణంలో పాలకులూ, పాలితులూ వుండడానికి స్థానం లేదు. ఈ నిర్మాణంలోని లోపమూ, గొప్పదనమూ కూడ అదే. తెగలో విధులకూ, హక్కులకూ మధ్య అంతరం ఏర్పడలేదు. సామాజిక విషయాలలో భాగస్వామి కావడం, రక్తప్రతీకారం, నష్టపరిహారం మొదలయినవి హక్కులా, విధులా అనేది ఇండియను నెప్పుడూ ఎదుర్కోలేదు. తిండి, నిద్ర, వేట — వీటిని హక్కులనాలా, విధులనాలా అనే ప్రశ్నలాగే ఇవి కూడా అసందర్భంగా వారికి కనిపిస్తాయి. అలాగే తెగగాని, గణంగాని, విభిన్న వర్గాలుగా విభజించబడడం అసంభవం. ఎందుకో తెలుసుకోవాలంటే ఆనాటి పరిస్థితుల ఆర్థిక పునాదుల్ని పరిశీలించవలసి వుంటుంది.

జనాభా చాలా పల్చన. తెగల నివాస స్థలాలలోనే జనసాంద్రత, ఆ నివాస స్థలానికి చుట్టూ వేటాడేందుకు అడవు లుంటాయి. వానికి వెలుపల తటస్థ ప్రాంతపు అడవి. ఆ బయట మరో తెగ, వేటాడే అడవి. శ్రమ విభజన చాలా ప్రాథమిక దశలో సరళంగా వుంటుంది. స్త్రీ పురుషుల మధ్యనే శ్రమ విభజన. మగవాడు యుద్ధాలకు పోతాడు. వేటకీ, చేపలు పట్టుకోడానికీ వెడతాడు. తిండికి వుపయోగించే ముడివస్తువుల్నీ, వానిని సంపాదించేటందుకు వినియోగించే పరికరాల్నీ సంపాదించుకొంటాడు. ఆడుది ఇల్లు చూసుకొంటుంది. తిండీ, బట్టా తయారుచేస్తుంది. వంట వండుతుంది. కుట్టుపనీ, నేతపనీ చూస్తుంది. స్త్రీ పురుషులకు వారివారి కార్యరంగాలలో సంపూర్ణాధికారం, మగవాడు అడవిలో, ఆడుది యింటిలో — యజమానులు. వారు వారు తయారు చేసుకున్నవీ, వాడుతున్నవీ పనిముట్లు, వారి స్వంతం. ఆయుధాలూ, వేటకు — చేపల వేటకు పనికివచ్చే

పనిముట్లూ మగవాడివి. ఇంటి పనిముట్లు, పాత్రలు ఆడుదానివి. చాలా కుటుంబాలు కలిసి సమష్టిగా గృహ నిర్వహణను చూసుకొంటాయి.* ఇల్లు, తోట, పడవ లాంటి వానిని సమష్టిగా తయారుచేసుకొంటారు. సమష్టిగా అనుభవిస్తారు. అవి సమష్టి ఆస్తి. అందుచేత "తన శ్రమతో స్వయంగా సంపాదించుకొన్న ఆస్తిని స్వంతానికి కలిగి వుండడం" ఈ కాలంలో మాత్రమే అమలులో వుంది. ప్రస్తుతపు నాగరిక యుగంలోనే ఇట్టి పద్ధతి అమలులో వుందంటూ న్యాయశాస్త్రజ్ఞులూ, ఆర్థికవేత్తలూ చెప్పే మాటలు వట్టి బూటకం. ఆధునిక పెట్టుబడిదారీ ఆస్తి ఈ చిట్టచివరి న్యాయశాస్త్ర సంబంధమైన అబద్ధంమీద ఆధారపడి వుంది.

కాని, మానవ సమాజం ప్రతిచోటా ఇదే దశలోనే నిలిచిపోలేదు. ఆసియాలో మచ్చిక చేసి, పెంచడానికి వీలయిన జంతువుల్ని కనుక్కొన్నారు. అడవి దున్నల్నీ, గేదెల్నీ అయితే వేటాడి పట్టుకోవాలి. అదే మచ్చికపడ్డ ఆవు అయితే రోజూ పాలిస్తుంది. ఏటా ఓ దూడని పెడుతుంది. బాగా అభివృద్ధి పొందిన ఆర్యను, సెమైట్, బహుశా తురానియన్ మొదలయిన తెగల వారంతా పశువుల్ని మచ్చిక చేయడం, మందల్ని పెంచడం, మళ్లవేసుకోవడమే ప్రధాన వృత్తిగా పెట్టుకొన్నారు. అనాగరిక జనసామాన్యంనుంచి గోపాలక తెగలు విడిపోయాయి. ఇదే మొట్టమొదటి పెద్ద సామాజిక శ్రమ విభజన. గోపాలకులు ఇతర అనాగరిక జాతుల కన్న జీవితావసర వస్తువుల్ని హెచ్చుగా సంపాదించుకో గలిగేవారు. కొత్త కొత్త వస్తువుల్ని కూడ తయారు చేసుకొనేవారు. పాలు, పాలనుంచి తయారయిన వస్తువులు, ఉన్ని, గొర్రెబొచ్చు వడికి తయారుచేసిన బట్టలు తెచ్చుకో గలిగారు. ముడి వస్తువులు అధికంగా లభ్యం అయిన కొద్దీ ఈ వస్తువు లందరికీ అందుబాటులోకి రాసాగాయి. దీనితో వస్తువుల క్రమబద్ధమైన మారకానికి ప్రప్రథమంగా అవకాశం ఏర్పడింది. ఇతః పూర్వపు దశలలో మారకం కదాచిత్కం. ఆయుధాల్నీ, పరికరాల్నీ తయారు చేయడంలో ప్రత్యేక నిపుణత ఏర్పడినప్పుడు తాత్కాలిక శ్రమ విభజన అమలులోకి వచ్చి వుంటుంది. రాతి పనిముట్లు తయారుచేసిన కర్మశాల లిప్పుడు చాలచోట్ల మనకు లభ్యం అవుతున్నాయి. ఇవి కొత్త రాతియుగం నాటివనడం నిస్సందేహం. ఈ కర్మాగారాలల్లో ప్రత్యేక నిపుణత సంపాదించిన వారు బహుశా గ్రామాని కంతకూ కావలసిన వస్తువుల్ని తయారుచేస్తూండి వుంటారు. భారతదేశపు గణ సమాజంలో శాశ్వత చేతివృత్తులవారు ఇప్పటికీ అలాగే పనిచేస్తున్నారు. ఏది ఎలావున్నా ఈ దశలో మారకం తెగలోవారి మధ్యనే జరుగుతుంది.

---

* ముఖ్యంగా వాయువ్య అమెరికాలో, (చూ. బాంక్రాఫ్ట్) క్వీన్ ఛార్లొటీ ద్వీపాలలోని హైదా తెగలో 7 వందలమంది కలసి వుంటున్న ఇళ్లున్నాయి. నూట్కాలలో తెగ అంతా ఒకే వెన్నువాసంకింద జీవిస్తారు. (ఎంగెల్స్ వివరణ.)

అదీ అరుదు. కాని గోపాలక తెగలు స్థిరపడినాక వేరువేరు తెగల సభ్యుల మధ్య మార్పి డికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడడం కనిపిస్తుంది. అది ఇంకా అభివృద్ధి పొంది, క్రమబద్ధమైన వ్యవస్థగా స్థిరపడేటందుకు అన్ని పరిస్థితులూ ఏర్పడ్డాయి, ప్రారంభంలో ఒక తెగవారూ మరో తెగవారూ తమ తమ నాయకుల ద్వారా మార్పిడి జరిగించి వుంటారు. కాని మందలు వ్యక్తుల అధికారంలోకి వచ్చేసిన కొద్దీ వ్యక్తుల మధ్య మార్చుకోవడం ఎక్కువై, చివరికా పద్ధతే ఏకైక పద్ధతి అయింది. గోపాలకులు తమ ఇరుగు పొరుగు వారితో మార్చుకొనే ప్రధానమైన వస్తువు పశువు. ఇతర వస్తువు లన్నింటి విలువను సరి తేల్చుకొనే సరుకు పశువులయినాయి. దానిని ప్రతివారూ అంగీకరించారు — సూక్ష్మంలో చెప్పాలంటే డబ్బు చేసే పనిని పశువు నెరవేర్చింది. సరుకుల మార్పిడి ప్రాథమిక దశలో వున్న ఆరోజుల్లోనే డబ్బు అనే సరుకుయొక్క అవసరం అతి వేగంగా వృద్ధి పొందింది.

అనాగరిక యుగపు నిమ్న దశలో పండ్ల తోటల పెంపకం గురించి ఆసియావాసులు బహుశా ఎరగరు. కాని నడిమి దశ నాటికి దానిని నేర్చుకొన్నారు. వ్యవసాయానికి అది నాంది. తురానియన్ పీఠభూముల్లో శీతకాలం చాలా నెల లుంటుంది. ఆ క్లిష్టమైన శీతోష్ణ స్థితిలో పశుగ్రాసం జాగ్రత్త చేసుకొంటే తప్ప పశువుల్ని పోషించుకోవడం సాధ్యం కాదు. అందుచేత ఇక్కడ పశువుల మేతకోసం ధాన్యం, గడ్డి సంపాదించడానికై భూమిని సేద్యం చేయవలసిన తప్పనిసరి అవసరం ఏర్పడింది. నల్ల సముద్రపు ఉత్తర తీర పచ్చిక మైదానాలలో కూడ ఇదే పరిస్థితి. ఒకమారు పశువుల కోసం ధాన్యం పండించాక అది మనుష్యులకే ఆహారం అయింది. సేద్యంలో వున్న భూమి తెగ అందరిదీ. ప్రారంభంలో దానిని గణాలవారీగా పంచేవారు. తర్వాత గణాలు సామూహిక గృహాలకు పంచాయి. అటు పిమ్మట వ్యక్తుల వుపయోగానికి ఇవ్వసాగారు. ఈ వ్యక్తుల కేవో ఆ భూమిమీద కొద్ది స్వామ్యమూ, కొన్ని హక్కులూ యిచ్చారేగాని, అంతకుమించి మరేమీలేదు.

ఈ దశలో సాధించబడిన పారిశ్రామిక విజయాలలో రెండు ఎంతో ప్రధానమైనవి వున్నాయి. ఒకటి మగ్గం, రెండోది లోహాలను కరిగించి, వుపయోగించడమూను. వానిలో రాగీ, తగరమూ ఆ రెండింటి మిశ్రణం వలన తయారయిన కంచూ అతి ముఖ్యమైనవి. కంచుతో ఆయుధాలూ, పనిముట్లు చేసుకొన్నారు. కాని రాతి పనిముట్లు పూర్తిగా పోలేదు. ఇనుము రావాలి దానికి. అయితే అప్పటికి ఇనుము తీయడం కనిపెట్టలేదు. నగలకూ అలంకారాలకూ వెండీ, బంగారమూ, వినియోగంలోకి రానారంభించాయి. అప్పటికే వాని విలువ రాగి, కంచుకన్న చాలా హెచ్చుగా వున్నదని భావించవచ్చును.

పశువుల పెంపకం, వ్యవసాయం, గృహపరిశ్రమలు మొదలయిన అన్ని శాఖల్లోనూ వుత్పత్తి హెచ్చింది. మనుష్యుని శ్రమ అతని పోషణకు సరిపడే దానికన్న హెచ్చుసంపదను వుత్పత్తి చేయగలుగుతూ వుంది. అదే సమయంలో, గణ సభ్యులు, సామూహిక గృహాల

వారు, ఒంటరి కుటుంబాలవారు రోజురోజూ చేయవలసిన పని అంతకంతకు హెచ్చింది. ఆ దశలో అదనపు శ్రమశక్తి అవసరం అయింది. యుద్ధం ఆ కొరతను తీర్చింది. యుద్ధ ఖైదీలను బానిసలను చేయసాగారు. శ్రమయొక్క ఉత్పాదక శక్తి పెరిగింది. తత్ఫలితంగా సంపదలు పెరిగాయి. ఉత్పత్తి రంగాలూ విస్తరించాయి. వీనికి ఫలితంగా ఆనాటి చారిత్రక పరిస్థితులలో మొట్టమొదటి సామాజిక శ్రమ విభజన బానిసత్వాన్ని అనివార్యంగా తీసుకొని వచ్చింది. సంఘంలోని శ్రమయొక్క ఈ మొదటి బృహత్ విభజనతో సంఘమే రెండు బృహత్ వర్గాలుగా విభజించబడిపోయింది. యజమానులు — బానిసలు, దోపిడిగాండ్రు — దోచుకోబడేవారు ఏర్పడ్డారు.

తెగల, గణాల ఉమ్మడిసొత్తుగా వున్న మందలు కుటుంబపు పెద్దల స్వంత సొత్తుగా మారిందెప్పుడో, అది ఏ విధంగా జరిగిందో యిప్పటికీ చెప్పడం కష్టమే. మొత్తంమీద ఈ కాలంలోనే ఇది జరిగి వుంటుంది. మందలూ, ఇతర సంపదలూ అభివృద్ధి పొందడంతో కుటుంబ వ్యవస్థలో ఒక పెద్ద విప్లవమే వచ్చింది. జీవితావసర వస్తువుల్ని సంపాదించే బాధ్యత ఎప్పుడూ మగవానిదే. ఆ సంపాదన కవసరమైన పరికరాల నతడే తయారుచేసు కొనేవాడు. అందుచేత ఆ పరికరాలు ఎప్పుడూ అతని స్వంత ఆస్తిగానే వుండేవి. ఇప్పుడా జీవితావసరాల్ని సమకూర్చే పరికరాలు మందలు, పశువుల్ని మచ్చిక చేసుకోవడమూ, వానిని కాచుకొనడమూ మగవాని పనులు. అందుచేత పశువులు అతడివి. వానిని మార్చుకొని సంపాదించుకొన్న సరుకులూ, బానిసలూ అతని సొత్తు. ఈ జీవితావసర వస్తువుల్ని స్వాయత్తం చేసుకోవడంవలన వచ్చిన అదనపు వుత్పత్తి అంతా మగవాడిది. ఆడుది ఆ వస్తువుల నాతనితో కలిసి అనుభవించగలదు. అంతేగాని, వాటి స్వామ్యంలో ఆమెకు వాటా లేదు. వేటాడి జీవించిన "ఆటవిక" యోధుడు, ఇంట్లో స్త్రీకి తర్వాతనే, అతడంత కంటే ఎక్కువ కోరలేదు. పెద్ద మనిషే అయిన గోపాలకుడు తన ఐశ్వర్య మదంలో, ముందుకు తోసుకువచ్చి స్త్రీని వెనక్కి నెట్టేశాడు. ఆమె ఏమీ అనలేకపోయింది. కుటుంబంలోని శ్రమ విభజన భార్యాభర్తల ఆస్తి పంపిణీని నిర్ణయించింది. ఆ శ్రమ విభజనలో ఇప్పుడు మార్పేమీ రాలేదు కాని, నే డది గృహ సంబంధాల్ని తలక్రిందులు చేసింది. దీనికి కారణం కుటుంబానికి వెలుపల శ్రమ విభజనలో వచ్చిన మార్పే. స్త్రీ ఇదివరకు ఇంటిపనుల బాధ్యత తీసుకొనేది. అదే ఆమెకు ఇంట్లో పెత్తనం వుండడానికి కారణం. కాని ఇప్పుడదే మగవాని పెత్తనానికి కారణం అయింది. పురుషుడు జీవితావసర వస్తువుల్ని సంపాదించే పనికీ, స్త్రీ వహించే గృహ నిర్వహణ బాధ్యతకూ పోలికే లేదు. మొదటిది అతి ప్రధానం. రెండోది అప్రధానం అయింది. దీనివలన మనకేం బోధపడుతూంది? స్త్రీ సామాజికోత్పత్తి రంగానికి దూరం అయి, స్వంత ఇంటి పనులలోనే మునిగి వున్నంతకాలమూ ఆమె స్వతంత్రురాలు కాలేదు. మగవానితో సమానంగా హక్కుల్ని పొందలేదు. సమాజం మొత్తం

మీద స్త్రీ భారీఎత్తున వస్తూత్పత్తి విధానంలో పాల్గొనాలి. గృహకృత్యాలకు ఆమె వినియోగించేది అత్యల్ప కాలమే కావాలి. ఆనాడే స్త్రీలకు విముక్తి. ఆధునికాలైన పెద్ద పరిశ్రమలు మాత్రమే అల్లాంటి అవకాశాన్ని కలిగించగలిగాయి. అవి స్త్రీలకు పనిచేసే అవకాశాలను విశేషంగా కలిగిస్తున్నాయి. అంతేకాదు, స్త్రీలను పనిలోకి రప్పిస్తున్నాయి. పైగా స్వంత ఇంటిపనుల్ని అంతకంతకు అధికాధికంగా సామాజిక పరిశ్రమనుగా మారుస్తున్నాయి.

మగవానికి యింట్లో కూడా ఆధిపత్యం చిక్కడంతో అతని పూర్తి పెత్తనానికిగల ఆఖరు ఆటంకం కూడా తీరిపోయినట్లే. తల్లిహక్కును తోసిపుచ్చి తండ్రిహక్కు ఏర్పడింది. జంట పెళ్లి పోయి దంపతీ వివాహం వచ్చింది. వానితో అతని నిరంకుశత్వం బలపడసాగింది. ఇది పూర్వపు గణవ్యవస్థలో గండి కొట్టింది. దంపతీ కుటుంబానిది ఇప్పుడు పెత్తనం. ఆ కుటుంబం పుట్టుకే గణవ్యవస్థకు అపత్కారంగా తయారైంది.

ఈ మెట్టు దాటితే మనం అనాగరిక యుగపు ఉన్నత దశలో పాదం మోపుతాం. నాగరిక జాతులన్నింటిలోనూ ఇది వీరయుగం. ఈ యుగంలో ఇనుప కత్తేకాకుండా, ఇనుప గొడ్డలి, ఇనుప కరుగోల కూడా వచ్చాయి. ఇనుము మానవుడికి లభ్యం అయింది. ఉర్లగడ్డ రాకకు పూర్వం మానవజాతి చరిత్రలో విప్లవకర పాత్రను నిర్వహించిన ముడి సరుకుల్లో ఇనుమే కడపటిది. అతి ముఖ్యమైనదిన్నూ. ఇనుము విశాల భూభాగాల్ని సేద్యంలోకి తెచ్చింది. ఎండపొడ కనపడని అడవులు బంగన బయళ్ళుగా మారాయి. రాళ్లనీ, యితర లోహాల్ని కూడా ఛేదించగలంత గట్టిదనం, వాడీవున్న పనిముట్లు అతనికి లభించాయి. కాని ఒక్క రోజులో ఈ పనులన్నీ జరిగిపోలేదు. మొదట తయారుచేసిన ఇనుము కంచుకంటేనూ మెత్తగా వుండేది. అందుచేతనే రాతి ఆయుధాలు క్రమక్రమంగాగాని అంతరించలేదు. "హిల్డెబ్రాండ్ గేయం"లో ప్రస్తావింపబడిన యుద్ధంలో రాతిగొడ్డళ్ళు ప్రయోగింపబడటమే కాకుండా క్రీ. శ. 1066లో జరిగిన హాస్టింగ్స్ యుద్ధంలో[146] కూడా రాతి గొడ్డళ్లనుపయోగించారు. కాని అభివృద్ధి యిప్పుడిక నిర్నిరోధమైంది. ఆటంకాల్నీ, అభ్యంతరాల్నీ దాటుకుంటూ అభివృద్ధి అతివేగంగా జరిగింది. పట్టణాలు వెలిశాయి. రాళ్లూ – ఇటికలతో ఇళ్లు కట్టడం ప్రారంభమయింది. తెగలకూ, తెగల సమాఖ్యలకూ ప్రధాన కేంద్రాలయిన నగరాల్ని రక్షించుకొనేటందుకు రాతి గోడలూ, గోపురాలూ, కోటలూ, బురుజులూ నిర్మింపబడినాయి. ఇవన్నీ వాస్తుశాస్త్రంయొక్క అభివృద్ధిని సూచిస్తున్నాయి. దాడులూ, ప్రమాదాలూ ఎక్కువ అవుతున్నాయనీ, వానినుంచి ఆత్మరక్షణ అవసరమవుతూందనీ కూడ ఇవి సూచిస్తున్నాయి. సంపద విశేషంగా వృద్ధిపొందింది. కాని యిప్పుడది విడి వ్యక్తుల స్వంతమైంది. నేత, లోహ పరిశ్రమ, ఇతర పరిశ్రమలూ వృద్ధిపొంది, అనేకరకాల వస్తువులు తయారవుతున్నాయి. వాని తయారీలో ఎంతో వైవిధ్యమూ కళాత్మక నగిషీ వృద్ధిపొందాయి. వ్యవసాయం ఫలితంగా ధాన్యము, పప్పులు, పళ్లేకాదు లభ్యం అవుతున్నది,

నూనె, సారాయి కూడా లభ్యం అవుతున్నాయి. వానిని తయారు చేయడం నేర్చుకున్నారు. ఇన్ని రకాల పనుల్ని ఒకే మనిషి చెయ్యలేడు. రెండో బృహత్ సామాజిక శ్రమ విభజన జరిగింది. చేతిపనులు వ్యవసాయంనుంచి విడబడినాయి. శ్రమ ఉత్పాదకతా, ఉత్పత్తీ నిరంతరాయంగా అభివృద్ధి పొందడంతో మానవుని శ్రమ శక్తికి విలువ ఎంతగానో పెరిగింది. ఇంతవరకు బానిసత్వం అక్కడా, అక్కడా అతి ప్రాథమిక దశలో వుండేది. నేడు అది సామాజిక వ్యవస్థలో ఒక ఆవశ్యక భాగం అయింది. బానిసలు ఉత్పత్తిలు సాయం చెయ్యడం మాత్రమేనా! పొలాలలో పనిచేసేదీ వారే అయ్యేరు. వ్యవసాయం పరిశ్రమలూ అనే రెండు ప్రధాన విభాగాలుగా ఉత్పత్తి విధానంలో విభజన వచ్చాక కేవలం మారకం కోసమే ఉత్పత్తి జరగడం ఆరంభమయింది. వర్తకపు సరుకులు ఉత్పత్తి అయాయి. దానితోబాటు తెగ లోపలా, సరిహద్దులలోపలా మాత్రమేకాక, సముద్రాంతర దేశాలతో కూడ వ్యాపారం ఆరంభమయింది. కాని ఇవన్నీ యింకా అతి ప్రాథమిక దశలోనే వున్నాయి. వెండి, బంగారాలు ప్రాముఖ్యానికి వస్తున్నాయి. అన్నిటితోనూ విలువకట్ట దగిన, డబ్బు రూపకమైన, సార్వత్రిక వర్తకపు సరుకుగా అవి అప్పుడప్పుడే అమలులోకి వస్తున్నాయి. కాని, అప్పటికి నాణేలు యింకా పోతపొయ్యబడలేదు. తూకాన్ని పట్టి మాత్రమే వాటిని విలువ కడుతున్నారు.

ఈ కొత్త శ్రమ విభజనకు ఫలితంగా సమాజంలో వర్గా లేర్పడ్డాయి. బానిసలూ – యజమానులతోపాటు బీదలూ – ధనికులూ అంటూ ఏర్పడ్డారు. అప్పటికి క్షీణించగా మిగిలిన సాముదాయక గృహాలలో ఇంటి పెద్దల స్వంత ఆస్తులలో ఏర్పడిన హెచ్చు తగ్గులు పూర్తిగా ఆ వ్యవస్థనే భగ్నంచెయ్యడానికి దారితీశాయి. వానితోపాటు సమాజపు సమష్టి ప్రయోజనార్థం ఉమ్మడి వ్యవసాయమూ అంతరించింది. సాగులోనున్న భూమిని మొదట ఇళ్లవరసన ఏయేటి కాయేడు ఎప్పటికప్పుడు పంచి ఇచ్చేవారు. తర్వాత శాశ్వతంగానే కేటాయించారు. అయితే అది పూర్తిగా వ్యక్తిగత ఆస్తిగా మారిపోవడానికి చాలాకాలం పట్టింది. జంటపెళ్లిళ్లు దంపతీ వివాహాలుగా మారడంతో సమంగానే యీ మార్పూ జరిగింది. ఇప్పుడింక విడి కుటుంబమే సమాజానికి ఆర్థిక యూనిట్ అయింది.

జనాభా సాంద్రత బాగా పెరిగాక తెగలోని పనులూ, బయటి పనులూ కూడ చేసుకోడానికి మరింత ఏకీభావం అవసరమైంది. ఈ దశలోనే ప్రతిచోటా తెగలు సమాఖ్యలుగా (కాన్ఫెడరసీలు) ఏర్పడడం, త్వరలో సమ్మిశ్రమమైపోవడం, ఆ పిమ్మట అనేక వేరువేరు తెగల భూములు కలిసిపోయి ఒకే జాతియొక్క ప్రాంతంగా ఏర్పడటం అవసరమైంది. సేనాధిపతి (rex, basileus, thiudans) ఒకడు తప్పనిసరి అవుతాడు. ఆ ఉద్యోగి లేకపోవడానికి వీలులేదు. ఎక్కడెక్కడ ప్రజాసభలు లేవో అక్కడల్లా అవి స్థాపింపబడ్డాయి. సేనానాయకుడు, కౌన్సిలు, ప్రజాసభ ఇవి గణవ్యవస్థ తాలూకు పరిపాలనాంగాలు. ఇవి క్రమంగా సైనిక ప్రజాస్వామ్యంగా మారాయి. యుద్ధం, యుద్ధ సన్నాహాలు జాతీయ

జీవనంలో ప్రధాన విధు లయిపోయాయి. అందుకే సైనిక ప్రజాస్వామ్య అవసరమైంది. సంపదలను పోగుచేయడమే జీవిత పరమార్థం అనుకొనేవారికి ఇరుగుపొరుగుల ఐశ్వర్యానికి కన్ను కుట్టుతుంది. వారు అనాగరికులుకదా, పనిచేయడం ద్వారా కన్న దోచుకోవడం ద్వారా సంపన్నులు కావడం సులువుగానూ, గౌరవప్రదంగానూ వారు భావించనారంభించారు. తమకేదన్నా అపకారం జరిగినప్పుడు ప్రతిక్రియగానో, తెగలో జనాభా పెరిగిపోయి కొత్త చోట్ల భూములను సంపాదించుకోవలసి వచ్చినప్పుడో గతంలో యుద్ధాలు జరిగేవి. ఇప్పుడవి ఒక వృత్తిగా మారాయి. కేవలం దోపిడీకోసమే యుద్ధాలు జరుగుతున్నాయి. కోటల రక్షణకింద నగరాలు పెరిగాయి. కోటగోడల మొదళ్లలో తవ్విన కందకాలలో గణవ్యవస్థ సమాధి అయిపోయింది. కోట గోడలమీద బురుజులు నాగరికత నందుకున్నాయి. ఆంతరంగికంగానూ ఇదే స్థితి. ఈ దోపిడీకోసం జరుగుతున్న యుద్ధాలలో సేనానాయకులూ, అలాగే ఉపసేనానాయకులూ బలపడ్డారు. కొత్త ఉద్యోగుల్ని ఎన్నుకోవలసి వచ్చినప్పుడు ప్రజలు అతనిని అతఃపూర్వపు ఉద్యోగి కుటుంబంలోంచే ఎన్నుకొనేవారు. ఇప్పుడది మారి పోయింది. ముఖ్యంగా తండ్రిహక్కు ఏర్పడినాక పదవులు క్రమంగా వంశక్రమానుగతం అయాయి. ఈ కొత్త పద్ధతిని ప్రజలు మొదట చూసీ చూడనట్లుగా వదిలివేశారు. క్రమంగా ఆ పదవి మాదేనని అడిగే దశ వచ్చి, చివరకు అది హక్కుగా అనుభవించ సాగారు. ఆ విధంగా కుటుంబ క్రమానుగతంగా రాజరికమూ, సామంతమూ ఏర్పడ్డాయి. అంతవరకూ ప్రజలలో, గణంలో, సోదర కూటమిలో, తెగలలో పాదుకొనివున్న గణవ్యవస్థయొక్క పరిపాలనాంగాలు, తమ పునాదుల్ని తామే నిర్మూలించుకొన్నాయి. గణవ్యవస్థ దానికి పూర్తిగా విరుద్ధమైన నిర్మాణంగా మారిపోయింది. తమ స్వంత వ్యవహారాలను స్వేచ్ఛగా నిర్వహించుకొనే తెగల వ్యవస్థ యిప్పుడు తమ పొరుగు తెగలను దోచుకొని అణచివేసే వ్యవస్థగా తయారైంది. ఇదివరకు ప్రజాభిప్రాయాన్ని అమలుపరిచే సాధనాలుగావున్న గణవ్యవస్థ తాలూకు పరిపాలనాంగాలు, ఇప్పుడు ప్రజలమీద పెత్తనం వహించి వారిని అణచిపెట్టే స్వతంత్రమైన పరిపాలనాంగాలుగా పరిణామం పొందాయి. ధనాశ గణంలోని సభ్యులలో కొందరిని ధనికులుగానూ, మిగిలినవారిని బీదలుగానూ మార్చి వుండకపోతే ఈ మార్పు జరిగేది కాదు. "ఒకే గణంలోనివారి ఆస్తుల హెచ్చు తగ్గులు ఆ గణ సభ్యుల ప్రయోజన సామ్యాన్ని రద్దుచేశాయి. వానిని పరస్పర విరుద్ధమైనవిగా మార్చాయి" (మార్క్స్);* లేకుంటే ఈ మార్పూ వచ్చేది కాదు. బానిసవిధానం అన్నిచోట్లా వ్యాపించి, చివరకు బానిసలే పనిచేస్తే

---

* మార్క్స్ – ఎంగెల్స్, పురాపత్ర భాండారం, 9వ సంపుటం, పేజీలు 153–54. – సం.

రనే భావం వ్యాపించింది. ఇది జరిగి వుండకపోతే దోపిడీకన్న పనిచేయడం నీచమనే వూహ వచ్చి వుండేది కాదు.

* * *

ఇప్పటికి మనం నాగరికత ఆరంభం అయిన రోజులలోకి వచ్చేశాం. శ్రమ విభజనలో వచ్చిన కొత్త మార్పులతో నాగరిక దశ ఆరంభం అవుతుంది. అనాగరిక యుగపు నిమ్న దశలో ప్రజలు తమ ఉపయోగంకోసం మాత్రమే వస్తువుల్ని ఉత్పత్తి చేసుకొనేవారు. ఏదన్నా మారకం జరిగినా అరుదు. యాదృచ్ఛికంగా అవసరాలకు మించి లభించిన అదనపు వస్తువులతోనే మార్పిడి చేసుకొనేవారు. అనాగరిక యుగపు నడిమి దశలో పచ్చిక మైదానపు ప్రజలవద్ద పశుసంపద సమకూడింది. ఈ పశువులమందలు ఒక పరిమితిని మించి అభివృద్ధి అయినపుడు అవి తెగకు అవసరమయ్యే వస్తువులకు మించి ఉత్పత్తి చేస్తూంటాయి. దీనితో మందలున్న ప్రజలకూ, మందలు లేకుండా వెనుకబడి వున్న తెగలకూ మధ్య శ్రమ విభజన జరిగింది. ఒకదాని ప్రక్క నొకటిగా రెండు అంతరువులలో ఉత్పత్తి జరుగుతూంది. దానితో క్రమబద్ధంగా మారకం కొనసాగడాని కవసరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. అనాగరిక యుగపు ఉన్నత దశలో మరో శ్రమ విభజన జరిగింది. ఈమారు చేతిపనులూ, వ్యవసాయమూ విడిపోయినాయి. దానికి ఫలితంగా మారకంకోసమే తయారయ్యే వర్తకపు సరకుల ప్రమాణం ఎక్కువయింది. ఉత్పత్తి సాగిస్తున్న వ్యక్తులు తమ వస్తువుల్ని మార్చుకోవడం సామాజికంగా ఒక అవసర కార్యం అయింది. ఈ శ్రమ విభజన లన్నింటినీ నాగరికత స్థిరపరచి, పెంపొందించింది. పట్టణాలకూ, పల్లెలకూ మధ్య విభేదాల్ని పెంపొందించడం ద్వారా వాని నింకా నిశితం చేస్తుంది. (ప్రాచీన యుగంలో పట్టణాలు పల్లెలమీద ఆర్థికంగా అధికారం చెలాయించేవి. మధ్యయుగాల్లో పట్టణాలపైన పల్లెలు ఆధిపత్యం చెలాయించేవి.) నాగరికత ఇంతవరకున్న శ్రమ విభజనను స్థిరపరచడమే కాకుండా, మరో నూతన విభజనను కూడా సృష్టించింది. ఈ నూతన విభజన ఎంతో వింతయైనదీ, చాల ముఖ్యమైనదీ కూడ. ఉత్పత్తితో ఏమాత్రమూ సంబంధం లేని ఒక వర్గాన్ని అది సృష్టించింది. వారే వర్తకులు. ఈ వర్తకులకు సంబంధం ఉత్పత్తితో కాదు, మారకంతో. ఇంతవరకు వర్గా లనేవి ఉత్పత్తి రంగంలోనే ఏర్పడ్డాయి. ఆ రంగంలో పాల్గొంటున్న వ్యక్తులు పని చేయించేవారుగా కొందరు, పని చేసేవారుగా కొందరు విడిపోయారు. పెద్ద ఎత్తుమీద వుత్పత్తి చేసేవారుగానూ, స్వల్ప ప్రమాణంలో వుత్పత్తి చేసేవారుగానూ విడిపోయారు. ఇప్పుడు ఉత్పత్తిలో ఏవిధంగానూ పాల్గొనకుండా, ఉత్పత్తి విధానాన్నంతనూ చేతిలోకి తెచ్చుకొని, ఉత్పత్తిదారుల్ని ఆర్థికంగా తన గుప్పిట్లో పెట్టుకొన్న వర్గం ఒకటి మొట్టమొదటి పర్యాయం చరిత్ర రంగంలో ప్రత్యక్షమయింది. ఇది ఇద్దరు వుత్పత్తిదారుల

మధ్య తప్పనిసరిగా అవసరమయిన దళారీలాగ వ్యవహరించి, ఉభయుల్నీ దోచుకుంటుంది. ఉత్పత్తిదారులకు మార్పిడి చేసుకొనే ఇబ్బందీ, నష్టభయం లేకుండా చేస్తున్నట్లు నటిస్తూ, వస్తువులను దూరపు మార్కెట్లకు అందించి ప్రజలకు మహోపకారం చేస్తున్నట్లు నటిస్తూ ఇతరుల కష్టాన్ని దోచుకొనే వర్గం ఒకటి తయారయింది. సంఘంలో వీరు "పరాన్నభుక్కులు"గా తయారయ్యారు. వారు తాము చేస్తున్న స్వల్పమైన పనికి ప్రతిఫలంగా స్వదేశంలోనూ, విదేశాలలోనూ తయారవుతున్న దాంట్లో సారాన్నంతనూ జుర్రేశారు. అశేషమయిన సంపదలను పోగుచేసుకున్నారు. దానితోబాటు సంఘంలో పలుకుబడి సంపాదించుకొన్నారు. ఈ పలుకుబడితో వారు నాగరిక యుగంలో అధికాధికంగా గౌరవాలూ, ఉత్పత్తి మీద ప్రాబల్యమూ సంపాదించుకొన్నారు. చిట్టచివరకు వారు కూడా ఒక వర్తకపు సరుకు తయారు చేయకపోలేదు. ఆ సరుకు పేరే మధ్య మధ్య సంభవించే వ్యాపార సంక్షోభాలు.

అభివృద్ధిక్రమంలో మనం చర్చిస్తున్న దశనాటికి ఈ వర్గం పిన్న ప్రాయంలోనే వుంది. భవిష్యత్తులో తన ఎదుటగల బృహత్తర విషయాలను ఆ వర్గం ఆ రోజుల్లో వూహించి కూడా వుండదు. అయినా తను రూపొందుతోంది. తన అవసరం ఏమీలేదని త్రోసి వేయగల స్థితి ఆనాటికే లేదు. అదే చాలు. ఈ వర్గంతోపాటుగానే లోహపు ద్రవ్యం — నాణెం కూడా అమలులోకి వచ్చింది, వృద్ధిపొందింది. ఉత్పత్తిదారుల్నీ, ఉత్పత్తినీ ఉత్పత్తితో సంబంధంలేని బయటివారు తమ గుప్పట ఇరికించుకోగలగడానికి లోహపు ద్రవ్యం (నాణెం) ఒక సాధనం అయింది. వర్తకపు సరుకు లన్నింటినీ కొనగల వర్తకపు సరుకు, ఇతర వర్తకపు సరుకులన్నింటినీ తనలోనే ఇముడ్చుకొన్న వర్తకపు సరుకు, సంకల్ప మాత్రాన వాంఛిత సరుకుగా మారిపోగల ఒక అద్భుతశక్తి రూపొందించబడింది. ఇది చేతిలో వున్నవాడు ఉత్పత్తిని చేతిలో పట్టుకోగలడు. ఇది అధికంగా ఎవరివద్ద వుంది? వర్తకులవద్ద. లక్ష్మీపూజ అతనివద్ద సలక్షణంగా జరుగుతూంది. డబ్బు ముందు ఇతర సరుకులూ, వానిని ఉత్పత్తి చేసేవారూ కూడ సాష్టాంగం చేయవలసిందేనని అతడు స్పష్టపరచాడు. మూర్తీభవించిన సంపదే డబ్బు. దీనిముందర ఇతర సంపదలు దిగతుడుపేనని అతడు ప్రత్యక్షంగా నిరూపించాడు. ద్రవ్యశక్తి వయస్సులో వున్ననాడు ప్రదర్శించినంత దౌర్జన్యాన్నీ, క్రౌర్యాన్నీ మరెప్పుడూ ఎక్కడా చూడం. వర్తకపు సరుకులు డబ్బుకి అమ్ముడుపోవడం ప్రారంభమైనాక అప్పులివ్వడమూ, జట్టీలివ్వడమూ అమలులోకి వచ్చాయి. దానితో వడ్డీలు, వడ్డీ వ్యాపారమూ వచ్చాయి. ప్రాచీన కాలంనాటి ఏథెన్సు నగరంలోనూ — రోములోనూ ప్రభుత్వ చట్టాలు రుణదాతకు రుణగ్రస్తుని స్వాధీనపరచినప్పటి నిర్దయను మరేకాలపు చట్టాలూ చూపలేదు. ఈ రెండు నగరాల్లోనూ కూడా ఈ చట్టాలు ఆర్థిక పరిస్థితుల వొత్తిడిలో తమంతగా తలఎత్తినవే!

వర్తకపు సరకులు, బానిసలు, డబ్బు సంపదతోపాటు భూసంపద కూడా ఏర్పడింది. ప్రారంభంలో తాత్కాలికోపయోగంకోసం గణాలూ, తెగలూ తమ సభ్యులకు పంచి ఇచ్చిన భూఖండాలు వారి వారి సుస్థిర వంశక్రమాధికారం గల ఆస్తిగా మారిపోయాయి. ఈ భూములమీద గణసమాజానికున్న అధికారాన్ని తొలగించి, ఎవరికి వారు తమ తమ హక్కుల్నీ, అధికారాన్నీ స్థిరపరచుకొనేటందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. గణసమాజానికి భూమిమీద హక్కు వుండడం వారి చేతులకు సంకెల వేసినట్లుంది. ఆ సంకెల బరువు తీరాక వారికి కొత్తగా లభించిన ఆ భూమి ఆస్తి బరువు కూడా తీరిపోయింది. భూమిమీద స్వేచ్ఛాయుత మైన పూర్తి హక్కు ఏర్పడడం అంటే దానిని కలిగివుండేటందుకు నిషేధాలూ, నిర్బంధాలూ లేకపోవడమేనా? భూమిని అన్యాక్రాంతం చెయ్యగలగడం కూడా అందులో భాగమే. భూమి గణపు హక్కులో వున్నంతకాలం అటువంటి హక్కు మనిషికి లేదు. గణానికీ, తెగకూ భూమిమీద హక్కు వుండడం భూస్వామికి ఒక పెద్ద సంకెల. ఆ సంకెళ్లను తొలగించడంతో కొత్త యజమానులకు తమ భూములతోవున్న అవిభాజ్య సంబంధాలు తెగిపోయాయి. భూమి వ్యక్తిగత ఆస్తిగా మారిన కాలంలోనే డబ్బు కూడా కనిపెట్టబడింది. వ్యక్తిగత ఆస్తి అనే మాటకు అర్థం ఏమిటో అది చూపించింది. భూమి కూడా ఒక వర్తకపు సరుకే. దానిని అమ్మవచ్చు, తనఖా పెట్టవచ్చు. అది వ్యక్తిగత ఆస్తిగా మారడంతోనే భూమి తనఖా కూడా వచ్చింది. (ఏథెన్సులో మన కిది కనబడుతుంది.) దంపతీ వివాహం వెంట హెటిరిజమూ, వ్యభిచారమూ వెన్నంటి వచ్చినట్లే భూమిపై హక్కుతోపాటు తనఖా కూడా వెంటబడింది. మానవుడు భూమిమీద సంపూర్ణాధికారం కావాలన్నాడు. దాన దమన విక్రయాధికారాలూ, స్వతంత్రం వుండాలన్నాడు. అది లభించింది. ఇదిగో tu l'as voulu Georges Dandin!*

వ్యాపారం, డబ్బు, వడ్డీ వ్యాపారం, భూమిమీద వ్యక్తిగత యాజమాన్యం, తనఖా — ఇవి వృద్ధిపొందేకొద్దీ ఒక చిన్నవర్గం చేతుల్లో సంపదలు పోగుపడి అతివేగంగా కేంద్రీకృతం కాసాగాయి. ప్రజాసామాన్యంలో దారిద్ర్యం, దారిద్ర్యంలో మునిగివుండే ప్రజల సంఖ్య — దానితోపాటే పెరగసాగాయి. ఆదినుంచీ ఈ ధనస్వామ్య వర్గం, పాత తెగల ప్రభువర్గం నుంచి భిన్నంగానే వృద్ధిపొందింది. క్రమేణా వారిని వెనక్కి నెట్టివేసింది. (ఏథెన్సు, రోములలోనూ, జర్మన్లలోనూ కూడ ఇదే కనబడుతుంది.) సంపదల హెచ్చుతగ్గుల్నిపట్టి పౌరులలో వర్గాలు ఏర్పడడంతోనే బానిసల సంఖ్య (ముఖ్యంగా గ్రీసులో) విపరీతంగా పెరిగి

---

* "జార్జ్ దండేన్" అనే మొల్యేర్ హాస్యనాటకంలోని మాట. "సరే నీ మాటే చెల్లనీ జార్జ్ దండేన్!" అని దాని అర్థం. — సం.

పోయింది.* వారిచేత బలప్రయోగంతో పనిచేయించారు. బానిస శ్రమ పునాదిపైన సమాజపు ఉపరి నిర్మాణమంతా పోషింపబడింది.

ఈ సామాజిక విప్లవం ఫలితంగా గణవ్యవస్థ ఏమయిందో యిప్పుడు చూద్దాం. ఈ నూతన శక్తుల అభివృద్ధితో గణవ్యవస్థకు ఏపాటి ప్రమేయమూ లేదు. కనక దాని విషయంలో గణవ్యవస్థ నిస్సహాయమయిపోయింది. గణనిర్మాణం సజీవంగా వుండాలంటే కొన్ని పరిస్థితులుండాలి. ఒక గణంలోని జనంగాని, కనీసం ఒకే తెగకు చెందినవారుగాని ఒకే నిర్ణీతమైన ప్రదేశంలో జీవించాలి. ఆ ప్రదేశంలో ఇతర తెగల ప్రజలు నివసించకూడదు. కాని ఈ పరిస్థితి మారిపోయి చాలకాలం అయిపోయింది. ఇప్పుడు ఏ ప్రదేశంలో చూసినా అనేక తెగలకు, అనేక గణాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. ప్రతిచోటా పౌరులతోబాటు బానిసలు, రక్షితులు, విదేశీయులు అందరూ కలిసిపోయి వుంటున్నారు. అనాగరిక యుగపు మధ్యదశయొక్క అంతిమ దినాలలోనే ప్రజలు సంచార జీవితం వదలి స్థిరనివాసాలకు అలవడ్డారు. వ్యాపారం, వృత్తులలో మార్పుదల, భూ యాజమాన్యంలో వచ్చిన మార్పుల కారణంగా ప్రజలు తరచుగా చోట్లు మారి నూతన ప్రదేశాలకు వెళ్లిపోతున్నారు. గణసభ్యులు వెనకటి మాదిరిగా తమ ఉమ్మడి వ్యవహారాలను చక్కబెట్టుకొనేటందుకు ఒకచోట కూడడం సాధ్యం కాదు. మత సంబంధమైన ఉత్సవాలవంటి అప్రధాన విషయాలకోసం కేవలం మొక్కుతీర్చుకుందుకన్నట్లు సమావేశమయ్యేవారు. అంతే. కొన్ని పనుల నిర్వహణకై గణసంస్థ లుద్దేశించబడినాయి. ఆ పనుల నిర్వహణకు అవి చాలు. కాని, నేడు ఉత్పత్తి సంబంధాలు చాలా తారుమారు అయ్యాయి. తత్ఫలితంగా సమాజంలో ఎన్నో మార్పులు వచ్చాయి. వెనుకటివానికి తోడు కొత్త అవసరాల్నీ, బాధ్యతల్నీ సృష్టించాయి. ఇవి పూర్వపు గణ నిర్మాణానికి సంబంధించినవీ కావు. దానికి అనుగుణమూ కావు. ప్రతి అడుగులోనూ దానికి అడ్డుపడ్డాయి. శ్రమ విభజనతోబాటుగానే అనేక తరహాల చేతివృత్తులవాళ్లు బయలుదేరారు. ఒక్కొక్క తరహాకు చెందిన వృత్తిలోనే అనేక గణాలకు, అనేక ఫ్రాట్రీలకు (సోదర కూటాలకు), అనేక తెగలకు సంబంధించిన వారు అనేకులు పనిచేస్తున్నారు. అంతేనా, విదేశీయులు కూడా ఎందరో వచ్చి చేరారు. అందుచేత నూతనంగా ఏర్పడిన పరిపాలనా సంస్థలు గణవ్యవస్థకు వెలుపల, దాని సరసన—అంటే దానితో పోటీగా నిర్మించవలసివుంటుంది. ప్రతి గణసంస్థలోనూ ఈ ప్రయోజన వైరుధ్యం పనిచేస్తూనే

---

* ఏథెన్సులో బానిసల సంఖ్య గురించి పేజి 126 చూడండి (ఈ సంపుటిలో పేజి 252). కొరింత్‌లో, దాని ఉచ్చ స్థితిలో 4 లక్షల 60 వేలు, ఎగినాలో 4 లక్షల 70 వేలు బానిసలుండేవారు. రెండు చోట్లా కలిసి స్వతంత్ర పౌరుల కంటె పది రెట్లుండేవారు. (ఎంగెల్స్ వివరణ.)

వుంది. పల్లెలకూ పట్టణాలకూ మధ్య ప్రయోజనాల్లో వైరుధ్యం ఏర్పడింది. ఒకే గణంలో, ఒకే తెగలో ధనికులు, దరిద్రులు, రుణదాతలు, రుణగ్రస్తులు వుంటున్నారు. మరొకటి కూడా జరుగుతూంది. గణానికి చెందని జనం ఎందరో ఆ ప్రదేశంలో వుండే వారు. రోములో జరిగినట్టు ఆ ప్రదేశంలో ఒక శక్తిగా వుండేవాళ్లు ఏ తెగ లోనూ, ఏ బంధు కుటుంబంలోనూ ఇముడ్చుకోజాలనంత సంఖ్యలో వారు వుండేవారు. వారికి యెదురెత్తుగా, వారికి ప్రవేశార్హతలేని, ప్రత్యేక హక్కులు గల సమితులుగా గణ సంస్థ లుండేవి. సహజ రూపంలోనే వచ్చిన ప్రాచీన ప్రజాతంత్ర విధానం, కృత్రిమంగా, ఏర్పరచబడిన ప్రభువిధానంగా మార్పు చెందింది. ఇంక చివరి విషయం — అంతర్వైరుధ్యాల నెరగని సమాజంతో గణవ్యవస్థ ఏర్పడింది. అది ఆ సమాజానికే తగును. ప్రజాభిప్రాయం మినహాగా దాని చేతిలో మరొక నిర్బంధ పరికరం లేదు. కాని ఈనాటి సమాజమో? తన ఆర్థిక వ్యవస్థకు ఫలితంగా ఈ సమాజం స్వతంత్రులు, బానిసలు ధనికులు — బీదలు, దోచుకొనేవారు — దోచుకోబడేవారుగా విడిపోవలసివచ్చింది. ఈ సమాజంలో ఈ వైరుధ్యాలు ఉత్తరోత్తరా తీవ్రతరం అవుతాయేగాని — సమన్వయం కావు. అటువంటి పరిస్థితులలో ఉభయ వర్గాలూ నిరంతరం ప్రత్యక్ష పోరాటంలో చిక్కుకొనైనా చిక్కుకోవాలి. లేదా ఈ రెండింటికీ అతీతంగా కనబడే మూడోశక్తి ఆ రెండు వర్గాల నడుమునున్న ప్రత్యక్ష పోరాటాన్ని అణచివేసి, ఆర్థికరంగంలో శాసనానుకూలపద్ధతులలో వర్గ పోరాటం కొనసాగించుకోనివ్వాలి. గణవ్యవస్థ ప్రయోజనానికి కాలదోషం పట్టింది. శ్రమ విభజనా, దానికి ఫలితంగా సమాజం వర్గాలుగా చీలి పోవడం ఆ నిర్మాణాన్ని ఛిన్నాభిన్నం చేశాయి. దాని స్థానే <u>రాజ్యం</u> ఏర్పడింది.

* * *

గణవ్యవస్థ శిథిలాలపైన నిర్మింపబడిన మూడు ప్రధాన రాజ్య రూపాలను గురించి పైన మనం విడివిడిగా పరిశీలించాం. ఏథెన్సు స్వచ్ఛమూ స్వతస్సిద్ధమూ అయిన విధంగా రాజ్యం పరిణామం పొందడాన్ని చూపిస్తుంది. గణసమాజం లోపలనే వృద్ధిపొందిన వర్గ వైరుధ్యాలలోంచి రాజ్యం అక్కడ పుట్టుకువచ్చింది. కాని రోములో పరిస్థితులు వేరు. ఇక్కడ గణసమాజం ప్రత్యేక కులీన ప్రభుత్వవ్యవస్థగా తయారయింది. దానిచుట్టూ వేలకొలది మంది ప్లెబియన్ సామాన్యులున్నారు. వారికి బాధ్యతలే గాని హక్కులులేవు. ప్లెబియనుల విజయసాధనతో అతఃపూర్వపు గణ వ్యవస్థ శిథిలం అయింది. ఆ శిథిలాల మీద రాజ్యం నిర్మితం అయింది. దీనిలో కులీన ప్రభువులయిన గణ సభ్యులూ, ప్లెబియనులూ కూడ లీనమయిపోయారు. ఇంక మూడోది — రోమను సామ్రాజ్యాన్ని కూలదోసి జర్మనులు స్థాపించిన రాజ్యం. ఇక్కడ జర్మనులు పెద్దపెద్ద భూభాగాలను

ఆక్రమించుకొన్నారు. గణవ్యవస్థకు వాటిమీద పెత్తన నిర్వహణ కావలసిన సాధనాన్ని సమా కూర్చలేకపోయింది. ఫలితంగా రాజ్యం ఏర్పడింది. ఇక్కడి విజేతలు దేశంలోని ప్రజలతో తీవ్రమైన పోరాటాలు చేయవలసిన పని లేకపోయింది. తమకంటె ఉన్నతస్థితిలోవున్న శ్రమ విభజనను ఎదుర్కోనక్కరలేకపోయింది. విజితులూ విజేతలూ ఆర్థిక పరిణామ క్రమంలో ఇంచుమించు ఒకే స్థాయిలో వున్నారు. ఫలితంగా సంఘంలోని ఆర్థిక పునాదులు పూర్వం మాదిరిగానే వుండిపోయాయి. ఈ కారణాలన్నింటిచేతా గణవ్యవస్థ ఎన్నో శతాబ్దాల వరకూ ఏదో ఒకరూపంలో జీవించి వుండగలిగింది. మార్కు గ్రామం ప్రాదేశిక రూపమైన ఒక రూపాంతరం. తర్వాత కాలంలో కులీన—ప్యాట్రిషియన్ కుటుంబాల రూపంలోనూ దీత్మర్షెన్‌లో లాంటి రైతుకుటుంబాలలోనూ స్వల్పకాలంపాటు పునురుజ్జీవం పొందింది.*

అందుచేత రాజ్యం అనేది పైనుంచి ఎవరో సమాజంమీద రుద్దిన శక్తి కాదు. "నైతిక ఆదర్శానికి మూర్తిమంతం అనీ," "కారణానికి ప్రతిబింబమూ, ప్రతిరూపమూ" అనీ హేగెల్ చెప్పే మాటలలో[148] నిజం ఎంతవుందో, పైనుంచి సమాజంమీద రుద్దబడిందనే మాటలో గూడ అంతే నిజం వుంది. అందుకు భిన్నంగా సమాజ పరిణామక్రమంలోని ఒక ప్రత్యేక దశలో రాజ్యం సమాజంలోంచే పుడుతుంది. రాజ్యం ఏర్పడింది అంటే ఆ సమాజంలో సమన్వయించడానికి సాధ్యపడని ఆత్మ వైరుధ్యాలు వచ్చాయని అర్థం. తనకు స్వాధీనంలోలేని, సర్దుబాటుకు సాధ్యంకాని శత్రువైరుధ్యాలు దానిలో పుట్టాయన్నమాట. ఈ శత్రువైరుధ్యాలు పరస్పర విరుద్ధ ప్రయోజనాలుగల వర్గాలూ తమ నిష్ఫల పోరాటంలో తమరినీ, తామున్న సమాజాన్నీ కూడ నాశనం చేసుకోకుండా నిలపడమూ, ఆ పోరాటాల తీవ్రతను తగ్గించి, "భద్రత"ను కాపాడేటందుకూ సమాజానికి అతీతంగా కనబడే శక్తి ఒకటి అవసరం అయింది. ఆ శక్తి సమాజంలోనే పుట్టింది. కాని, సమాజానికి అతీతంగా వుంటూ అంతకంత కది సమాజంనుంచి దూరం అవుతూవుంది. ఆ శక్తే రాజ్యం.

ప్రాచీనకాలంనాటి గణనిర్మాణానికి భిన్నంగా ఈ రాజ్యం, మొదట తను పాలించే ప్రజలను <u>ప్రాంతీయ పద్ధతిమీద</u> విభజిస్తుంది. ప్రాచీన గణసంస్థలు రక్తసంబంధీకులతో ఏర్పడ్డవి. ఈ సంస్థ లిప్పుడు నిరుపయోగం అయ్యాయి. దానికి ముఖ్య కారణం ఒకటుంది. ఆ సంస్థలు పనిచెయ్యాలంటే ముందు ఆ సంస్థలోని వారంతా ఒకే నిర్ణీత ప్రదేశంలో

---

* గణాలంటే ఏమిటో చూచాయగానైనా తెలిసిన మొదటి చరిత్రకారుడు నిబుర్. దీత్మర్షెన్[147] కుటుంబాల పరిచయమే ఆయన కది తెలుపగలిగింది. అయితే ఆ పరిచయమే ఆయనలో ఎన్నో తప్పుడు అభిప్రాయాలకు మూలం అయింది. (ఎంగెల్సు వివరణ.)

నివసించాలి. ఆ స్థితి ఏనాడో పోయింది. ప్రదేశా లెక్కడ వక్కడే వున్నాయి. కాని ప్రజలు చలనశీలులయారు. అందుచేతనే ప్రాంతీయ పద్ధతిమీద విభజన మొదటి మెట్టు అయింది. పౌరులు గణాలతోగాని, తెగలతోగాని నిమిత్తంలేకుండా తమ నివాస భూములలో తమ సామాజిక బాధ్యతలనూ, హక్కులనూ నిర్వహించే పద్ధతి ప్రవేశపెట్టారు. వారు వారు నివసించే ప్రదేశాల ప్రకారం పౌరులను రాజ్యంలోకి తీసుకురావడం అనేది అన్నిచోట్లా సమానమే. అందుచేతనే ఈ నూతన నిర్మాణం సహజమైనదిగానే కనబడుతుంది. కాని, రోమ్ ఏథెన్సుల చరిత్ర చూస్తే గణాల పునాదిపై ఏర్పడిన ప్రాచీన నిర్మాణాన్ని తొలగించి, దాని స్థానే రాజ్యాన్ని నెలకొల్పడానికి ఎంతో కాలం, తీవ్రమైన ఘర్షణలూ అవసరమయ్యాయని గ్రహించగలుగుతాం.

మనకి విస్పష్టంగా కనిపిస్తూన్న మరో విలక్షణగుణం—ప్రభుత్వ అధికారం నెలకొల్పబడడం. ప్రజలే సాయుధ శక్తిగా వ్యవహరించడానికీ, ప్రభుత్వ అధికారం పనిచేయడానికీ పోలికేలేదు. ప్రజలు వర్గాలుగా విడిపోవడంచేత వారు సాయుధులుగా, స్వతంత్రంగా పనిచేయడం ఇంక జరగదు. కనుకనే ప్రత్యేకంగా యీ ప్రభుత్వాధికారం అవసరం అయింది. బానిసలు కూడా ప్రజానీకంలోనే లెక్క. ఏథెన్సులో 3,65,000 మంది బానిసలుంటే, స్వతంత్ర పౌరులు 90,000 మంది మాత్రమే వుండేవారు. ఈ స్వతంత్రులకు ప్రత్యేక సౌకర్యాలు మాత్రం వుండేవి. ఎథీనియను ప్రజాస్వామ్యంలోని ప్రజా సైన్యం ప్రభువర్గ ప్రభుత్వాధికారంగా బానిసలను అణచి వుంచేది; కాని ప్రజల్ని కూడా అదుపులో వుంచవలసినప్పుడు పోలీసు బలగం కూడా అవసరం అయింది. ఈ సంగతిని మేము పైన పేర్కొన్నాం. ప్రభుత్వ అధికారం ప్రతి రాజ్యంలోనూ వుంటుంది. ఒక్క సాయుధ భటులే కాకుండా అనుబంధంగా బందిఖానాలు, అనేకానేక బలప్రయోగ సంస్థలూ వచ్చాయి. వీటిలో దేనినీ గణవ్యవస్థ ఎరుగదు. ఇంకా వర్గవైరుధ్యాలు వృద్ధిపొందని సమాజాలలోనూ, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కొన్ని కాలాల్లోనూ, కొన్ని ప్రాంతాల్లోనూ ప్రభుత్వ అధికారం లేనేలేదనిపించేటంత అల్పరూపంలో వుండొచ్చు, రాజ్యం లోపలనే వర్గవైరుధ్యాలు నిశితం కావడమూ, ఇరుగు పొరుగు రాజ్యాలు బలవంతములైన సంఖ్యాధికములు గావడంతో ప్రభుత్వ అధికారం బలపడుతూ వస్తుంది. ఒక్కమారు నేటి యూరపును చూడండి, వర్గ పోరాటాలు, విదేశాల ఆక్రమణకై పోటీల మూలంగా ప్రభుత్వ అధికారం అక్కడి సమాజాన్నీ, చివరకు రాజ్యాన్నీ కూడ మింగివేసేటంతగా పెరిగిపోయింది.

ఈ ప్రభుత్వ అధికారం పోషించడం కోసం రాజ్యంలోని ప్రజలనుంచి పన్నులు వసూలు చేయవలసివచ్చింది. గణసమాజంలో పన్నుల నెరగరు. ఈవేళ మనకు దానిని గురించి చాలా బాగా తెలుసు. నాగరికత వృద్ధిపొందినకొద్దీ ఎంతలేసి పన్నులూ చాలవు. భవిష్యత్తులో తనకు రాబోయే ఆదాయాన్ని ప్రభుత్వం ఇప్పుడే తాకట్టు పెడుతుంది.

అప్పులు తీసుకుంటుంది. ప్రభుత్వపు అప్పులంటూ ఏర్పడతాయి. పాత యూరపు ఖండంలో ఈ విషయాన్ని గురించి ఎన్నో వుదాహరణలు లభిస్తాయి.

ప్రభుత్వ అధికారాన్నీ, పన్నులువేసే అధికారాన్నీ చేతిలోపెట్టుకొన్న అధికారివర్గం సమాజాని కతీతమయిన సమాజాంగ మయ్యారు. గణ (క్లాన్) సంస్థల పరిపాలనాంగాల కివ్వబడిన స్వతంత్రమూ, మనస్ఫూర్తియైన గౌరవమూ లభించినా అది వారికి చాలిందికాదు. వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వ శక్తి వారిని సమాజానికి దూరంచేస్తుంది. అందు చేత ప్రత్యేక శాసనాలుచేసి వాని ద్వారా వారికి గౌరవం కట్టబెట్టారు. వారి మాట విని తీరవలసిన పరిస్థితి కలిగించారు. పలుకుబడి సృష్టించారు. గణసమాజంలోని పరిపాలనాంగా లన్నింటికీ వున్న అధికారంకన్న నాగరిక రాజ్యంలోని పరమహీనుడయిన పోలీసు ఉద్యోగికి వుండే "అధికారం" యెక్కువ. నాగరిక యుగంలోని గొప్ప గొప్ప రాజులు, రాజకీయవేత్తలు, సేనా ధిపతులు గణసంస్థల నాయకులలో అతిసాధారణుడికి కూడా ప్రజలనుంచి లభించే మనస్ఫూ ర్తియైన మర్యాదకు అసూయపడవలసి వుంటుంది. దీనికి కారణం అతడు సమాజంమధ్య వుంటాడు. కాని, ఈ నాయకులు సమాజానికి అతీతులుగా, యేదో బాహ్యమైనదాని ప్రతినిధులుగా వ్యవహరిస్తారు.

వర్గాల మధ్య పోరాటం ముమ్మరంగా సాగుతున్న కాలంలో వర్గవైరుధ్యాలను అదుపులో వుంచడంకోసం రాజ్యం పుట్టింది. అందుచేతనే అది సమాజంలో మంచి శక్తీ, ఆర్థిక బలమూ వున్న వర్గంయొక్క రాజ్యంగానే వుంటుంది. రాజ్యంయొక్క సహాయంతో ఆ వర్గం రాజకీయంగా కూడా బలపడుతుంది. ఆ విధంగా పీడిత వర్గాన్ని అదిమిపెట్టి, దోచు కొనేందుకు నూతన సాధనాలను సంపాదించుకొంటుంది. ప్రాచీన రాజ్యం బానిస యజ మానుల చేతుల్లో, బానిసల్ని అణచిపెట్టి అదుపులో వుంచేటందుకు సాగించబడింది. ఫ్యూడలు రాజ్యం కులీనవర్గం వారిది. దాని ద్వారా వారు దాసులయిన రైతుల్నీ, బానిసల్నీ అదుపులో వుంచేవారు. ఆధునిక ప్రాతినిధ్య రాజ్యం పెట్టుబడిదారులు వేతన కార్మికులను దోపిడీచేసే సాధనంగా వుపయోగపడుతూంది. ఒక్కొక్కప్పుడు ఘర్షిస్తున్న వర్గాలు ఇంచు మించు సమాన బలంతో వుంటూంటాయి. అటువంటి సమయంలో తప్పిదారి రాజ్యం మాధ్యస్థం వహిస్తున్నట్లు కనబడుతుంది. తాత్కాలికంగా మధ్యస్థంగానే వుండొచ్చు. 17, 18 శతా బ్దాలనాటి నిరంకుశ రాజరికం ఈ మాదిరిదే. అది అటు కులీన వర్గానికీ, ఇటు బూర్జువా వర్గానికీ మధ్య సమతులనాన్ని పాటించింది. ఉభయుల్నీ అణచిపెట్టి వుంచింది. మొదటి ఫ్రెంచి సామ్రాజ్యపు, మరింతగా రెండో సామ్రాజ్యపు బోనపార్టిజం ఇలాంటిదే. బూర్జువావర్గాన్నీ, శ్రామికవర్గాన్నీ ఒకదాని కొకదానిని పోటీపెట్టి తాను పైన నిలబడింది. ఈ మాదిరిగానే ఈమధ్య బిస్మార్కు నిర్మించిన నూతన జర్మను సామ్రాజ్యమూ వ్యవహరించింది. ఆ వ్యవహారంలో పాలకులూ, పాలితులూ కూడా అపహాస్యం పాలయ్యారు.

పెట్టుబడిదారుల్నీ, కార్మికుల్నీ ఒకరిపై ఒకరిని ఆడించి, క్షీణించిపోతున్న ప్రష్యను భూస్వాముల ప్రయోజనాల కోసం ఆ యిద్దర్నీ ఒకే విధంగా మోసగిస్తూవుంది.

అదీగాక, చరిత్రలో మనకి కనబడే రాజ్యాలు చాలవాటిలో పౌర హక్కులు వారి వారికి గల ఆస్తుల్నిపట్టే నిర్ణయించడం కనబడుతుంది. దీనికి అర్థం — ఆస్తిలేనివారి వర్గం నుంచి ఆస్తిగలవారి వర్గాన్ని కాపాడేటందుకే రాజ్యం ఏర్పడిందనే. ఏథెన్సులోనూ, రోము లోనూ ఆస్తినిపట్టే తరగతి విభజన జరిగిందని చూశాం. మధ్యయుగంలోని ఫ్యూడలు రాజ్యా లలో వారివారి ఆధీనంలో వున్న భూమి పరిమితినిపట్టి రాజకీయాధికారం వుండేది. ఆధు నికములయిన ప్రజా ప్రతినిధి రాజ్యాలలో వోటర్ల అర్హతలు వారి ఆస్తుల్నిపట్టే నిర్ణ యించబడే పద్ధతిలో వ్యక్తమవుతుంది. కాని, ఆస్తిపాస్తులలోని విభేదాల్ని రాజకీయంగా గుర్తించవలసిన అవసరం ఏమీలేదు. అలాగ గుర్తించడం ఆ రాజ్యం పరిణామ క్రమంలో బాగా నిమ్న దశలో వుందనడానికి నిదర్శనం. ప్రజాతంత్ర రిపబ్లికు రాజ్యంయొక్క అత్యు న్నత రూపం. ఆధునిక సామాజిక పరిస్థితులలో ఈ రాజ్యరూపం తప్పనిసరీ, అత్యవసరమూ అవుతూంది. శ్రామికవర్గానికీ — బూర్జువావర్గానికీ మధ్య అంతిమ పోరాటం ఈ రాజ్యంలోనే తేలిపోతుంది. ఈ రాజ్యం ఆస్తుల తేడాల్ని అధికారయుతంగా పరిగణించదు. ఈ రాజ్యంలో సంపదలు తమ అధికారాన్ని పరోక్షంగా నిర్వహిస్తాయి. పరోక్షంగా అయినా, ఆ అధికారం ఖచ్చితంగా నిర్వహిస్తాయి. ఇది అమెరికాలోలాగ అధికారుల లంచగొండితనం ద్వారా జరగవచ్చును. రెండోది స్టాక్ ఎక్స్ఛేంజికీ, ప్రభుత్వానికీ మధ్య మైత్రి ఏర్పరచడం ద్వారా జరగవచ్చును. ఈ పద్ధతిలో ప్రభుత్వరుణం పెరిగిన కొద్దీ జాయింట్ స్టాక్ కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజిని కేంద్రంగా చేసుకొని రహదారుల్నే కాకుండా, ఉత్పత్తిని కూడా తమ చేతుల్లో కేంద్రీకరించుకోవచ్చు. ఈమధ్య ఏర్పడిన ఫ్రెంచి రిపబ్లికూ, అమెరికా సంయుక్త రాష్ట్రాలూ దీనికి స్పష్టమైన ఉదాహరణలు. వెనుకటినుంచీ మంచి రాజ్యమని పేరున్న స్విట్జర్లాండ్ కూడా ఈ విషయంలో తన వంతు ఆదర్శాన్ని చూపించింది. ప్రభు త్వానికీ — స్టాక్ ఎక్స్ఛేంజికీ మధ్య స్నేహం ఏర్పడడానికి ప్రజాతంత్ర రిపబ్లిక్కే ఉండ నక్కర్లేదని ఇంగ్లండూ, నూతన జర్మను సామ్రాజ్యమూ నిరూపించాయి. నూతన జర్మను సామ్రాజ్యంలో సార్వజనిక వోటింగ్ హక్కువలన లాభపడినది బిస్మార్కా? బ్లైహ్రోడెరా? అనేది చెప్పడం కష్టం. ఇంకోటి కూడా ఉంది. సార్వజనిక వోటింగు హక్కు ద్వారా ఆస్తి పరుల వర్గం తన పరిపాలనను సరాసరి సాగిస్తుంది. పీడితవర్గానికి — ప్రస్తుతంలో శ్రామిక వర్గం — తన విమోచన సాధించుకొనే శక్తి కలగనంతకాలమూ వారిలో అధిక భాగం ఈ వున్న సామాజిక వ్యవస్థకే తల ఒగ్గుతారు. రాజకీయంగా పెట్టుబడిదారీ వర్గంలోని తీవ్ర వామపక్షానికి అనుబంధంగా మాత్రమే వుండిపోతారు. తమ విమోచన సాధించుకోడానికి పక్వమైన కొద్దీ కార్మికులు తామే పార్టీగా ఏర్పడతారు.

పెట్టుబడిదారుల ప్రతినిధులకు గాక తమ ప్రతినిధులకే వోటు చేసుకొంటారు. ఆ విధంగా సార్వజనిక వోటుహక్కు శ్రామికవర్గంయొక్క పరిణతిని కొలిచే సాధనం అవుతుంది. యీనాటి రాజ్యంలో అది అంతకంటే అధికంగా వుండదు, వుండలేదు. అయితే అదే చాలు. ధర్మామీటరులాగ సార్వజనిక వోటుహక్కు కార్మికులలో పొంగులువారే దశను చూపించే నాటికి వారూ, పెట్టుబడిదారులూ ఏమిచెయ్యాలో అర్థం చేసుకోగలరు.

ఈ విధంగా రాజ్యం అనేది అనాదిగా వచ్చినది కాదని తెలిసిపోతూంది. రాజ్యంతో నిమిత్తం లేకుండా సాగిన సమాజాలు ఒకప్పుడున్నాయి. రాజ్యం, రాజ్యాధికారాల్ని గురించి వాటికి కించిత్తూ తెలియదు. ఆర్థిక పరిణామక్రమంలో ఒకదశ వచ్చేసరికి సమాజం వర్గాలుగా విభజితం అవుతుంది. ఆ విభజనకు ఫలితంగా రాజ్యం తప్పనిసరి అవుతుంది. ఉత్పత్తి పరిణామక్రమంలో మనం యిప్పుడొక ప్రత్యేక దశను వేగంగా సమీపిస్తున్నాం. ఈ దశలో వర్గాలుండడం అనవసరమే కాదు, ఉత్పత్తికి ఆటంకం కూడాను. అవి ఎల్లా పుట్టాయో అల్లాగే తప్పనిసరిగా అంతరిస్తాయి. వానితోపాటు రాజ్యమూను. ఉత్పత్తిదారులు సమానమూ స్వతంత్రమూనైన హోదాలో ఉత్పత్తిని సాగించేటట్లు సమాజం పునర్నిర్మాణం అవుతుంది. అది స్వస్థలానికి — ప్రాచీన రాజ్యయంత్రాన్ని వస్తుప్రదర్శనశాలకు మార్చి రాట్నం, కంచుగొడ్డలి మొదలైన వాని సరసన భద్రపరుస్తుంది.

* * *

పై సమాలోచననుపట్టి నాగరికత అనేది సమాజంయొక్క అభివృద్ధిక్రమంలో ఒక దశ అని తేలుతూంది. ఆ దశలో శ్రమ విభజన, దాని ఫలితంగా వ్యక్తుల మధ్య ఏర్పడిన వస్తుమార్పిడి, ఈ రెండూ కలిసి వర్తకపు సరుకుల ఉత్పత్తి పూర్తిగా పరిణతిపొంది, అంతక్రితం వున్న సామాజిక వ్యవస్థనంతనీ సమూలంగా మార్చివేశాయి.

అతఃపూర్వపు సమాజ దశ లన్నింటా వస్తూత్పత్తి ప్రధానంగా సమిష్టిగా జరిగేది. చిన్నవో, పెద్దవో ఆ కమ్యూనిస్టు సంఘాలలో ఉత్పత్తిని సరాసరి పంచిపెట్టేవారు. ఈ సమిష్టి ఉత్పత్తి చాలా చాలా పరిమితమైన హద్దులలో జరిగేది. అయితే ఉత్పత్తిదారులు ఆ ఉత్పత్తిక్రమంమీదా, ఉత్పత్తియైన వస్తువులమీదా స్వాధీనం కలిగి ఉండేవారు. ఉత్పత్తియైన వస్తువు ఏమయిందో వారు ఎరుగుదురు; దానిని వారే అనుభవించారు. అది వారి చేతులు దాటి పోలేదు. ఈ పునాదులమీదనే ఉత్పత్తి సాగుతున్నంతకాలమూ అది వారికి అందకుండా పెరిగిపోలేదు. వారికి వ్యతిరేకంగా, చేతికి అందని విరుద్ధ శక్తుల్ని తయారు చేయలేదు. కాని నాగరికతలో అది తప్పనిసరీ, పొడుగూనా జరిగేదిన్నీ.

ఈ ఉత్పత్తి విధానంలోకి క్రమంగా శ్రమ విభజన చొరబారింది. ఉత్పత్తి సమష్టిగా సాగించడమూ, అనుభవించడమూ అనే పద్ధతిని అది నాశనం చేసింది. వ్యక్తులు వస్తువుల్ని స్వాధీనం చేసుకోవడం పరిపాటి చేసింది. ఆ విధంగా వ్యక్తుల మధ్య మార్పిడి ఉత్పన్నమైంది. అదెల్లా జరిగిందో పైన చూశాము. క్రమంగా వర్తకపు సరుకుల ఉత్పత్తే ప్రాబల్యంగల రూపం అయింది.

వర్తకపు సరుకుల ఉత్పత్తితో ఉత్పత్తి స్వంత ఉపయోగంకోసం గాక, మార్పిడికోసమే జరుగుతుంది. ఉత్పత్తి అయిన వస్తువులు తప్పకుండా చేతులు మారతాయి. మార్పిడిలో ఉత్పత్తిదారు చేతిలోంచి ఆ వస్తువు జారిపోతుంది. దాని గతి ఏమైందో అతనికి తెలియదు. ధనమూ, ఇద్దరు ఉత్పత్తిదారులమధ్య దళారిగా వ్యాపారీ వచ్చాక మార్పిడి పద్ధతిలో మరింత గజిబిజి ఏర్పడుతుంది. వస్తువుల అంతిమగతి మరింత అనిశ్చితం అవుతుంది. వర్తకులు అసంఖ్యాకంగా వుంటారు. ఒకడేం చేస్తున్నదీ రెండోవానికి తెలియదు. వర్తకపు సరుకులు చేతులు మారడమేకాదు, మార్కెట్లు కూడా మారతాయి. ఉత్పత్తిదారులు తాము చేసే ఉత్పత్తి మొత్తంమీదా, తమ జీవిత పరిస్థితులమీదా అదుపు కోల్పోయారు. ఆ అదుపును వర్తకులు సంపాదించుకోలేదు. ఫలితంగా వస్తువులూ, వస్తూత్పత్తీ యదృచ్ఛాధీనాలుగా తయారయ్యాయి.

అంతస్సంబంధాలలో యాదృచ్ఛికత ఒక కొస అయితే రెండో కొస ఆవశ్యకత. ప్రకృతిలో కూడ యాదృచ్ఛికతదే పెత్తనం. ప్రతి రంగంలోనూ ఈ యాదృచ్ఛికతలో ఆవశ్యకతా, క్రమబద్ధతా అంతర్గర్భితంగా వుంటాయని చాలా కాలంక్రితమే చూపించాము. ప్రకృతిలోలాగే సమాజంలో కూడా ఇది అంతే. సమాజ కార్యకలాపాలనూ, సమాజ విధానాలనూ మానవుడు తన అదుపులో ఉంచుకొనేటందుకు సాధ్యంకానంత బలీయం అయివాని తలకు మించిపోతే అవి కేవలం యాదృచ్ఛికంగానే కనబడతాయి. వానిలో అంతర్గతంగా వుండే విశిష్ట ధర్మాలు యాదృచ్ఛికంగా తటస్థపడిన సహజావసరాల లాగే కనబడతాయి. ఆ నియమాలు సరుకుల ఉత్పత్తిలోనూ, మారకంలోనూ కనిపించే యాదృచ్ఛికతలను కూడా అదుపు చేస్తాయి. ఉత్పత్తినీ, మారకాన్నీ కొనసాగించే వ్యక్తుల కవి వింతగా కనిపించవచ్చు. ప్రారంభంలో ఎక్కడనుంచో ఆగంతుకంగా వచ్చినట్లు కూడా అనిపించవచ్చు. వాని స్వభావాన్ని గుర్తించేటందుకు చాలా శ్రమా, శ్రద్ధా తీసుకోవాలి. వర్తకపు సరుకుల ఉత్పత్తికి సంబంధించిన ఆర్థిక నియమాలు ఈ ఉత్పత్తి రూపపు అభివృద్ధి వివిధ దశల్నిపట్టి మార్పు చెందుతూ వచ్చాయి. కాని మొత్తంమీద యీ నియమాలే నాగరికతా దశ అంతటిలో ప్రాముఖ్యం వహించాయి. ఈనాడు కూడా ఉత్పాదితమే ఉత్పత్తిదారునిమీద పెత్తనం చలాయిస్తూంది. ఈనాడు గూడా సమాజంలో మొత్తం ఉత్పత్తి ఒక క్రమపద్ధతిలో, సమష్టిగా ఆలోచించి నిర్ణయించి జరగడంలేదు. గుడ్డిగా నడిచే కొన్ని నియమాలు దానిని శాసిస్తున్నాయి. మొండి

బలంతో అవి తోసుకుపోతున్నాయి. చివరకు అప్పుడప్పుడు వచ్చే వ్యాపార సంక్షోభపు తుఫానుల రూపంలో అవి కనబడుతున్నాయి.

ఉత్పత్తి అభివృద్ధి క్రమంలో చాలాకాలం కిందటే మానవుని శ్రమశక్తి ఉత్పత్తిదారుని పోషణ కవసరమైన దానికన్నా అదనంగానే ఉత్పత్తి చేయగల స్థితి వచ్చిందనీ, శ్రమ విభజనా, వస్తువుల మార్పిడీ ఈ దశకు సమకాలీనాలేననీ పైన చూశాం. మనుష్యుడు కూడా వర్తకపు సరుకు కావచ్చుననే "సత్యం" గ్రహించడానికి ఎంతోకాలం పట్టలేదు. మానవుణ్ణి బానిసను చేస్తే అతని శ్రమశక్తిని కూడా అమ్మడం, కొనడం సాగించి ఉపయోగించుకో వచ్చని గ్రహించారు. మానవులు వస్తువుల మార్పిడి ప్రారంభించారో లేదో తామే మార్పిడికానారంభించారు. కావాలన్నా వద్దన్నా కర్తృత్వం పోయి ప్రేక్షకస్థితికి వచ్చేశారు.

నాగరికతా యుగంలో బానిసత్వం పూర్తి అభివృద్ధి పొందింది. బానిసత్వంతో సమాజం దోపిడీ చేసేవారూ, దోపిడీ చెయ్యబడేవారుగా చీలిపోయింది. నాగరికతాయుగం అంతటిలో ఈ విభజన కొనసాగుతూనే వుంది. బానిసత్వం అనేది మొట్టమొదటి దోపిడీ రూపం. అది ప్రాచీనయుగానికే తగినది. మధ్యయుగాలలో దాని స్థానే భూదాస్యం ఏర్పడింది. ఆధునిక యుగంలో వేతనశ్రమ వచ్చింది. నాగరికతయొక్క మూడు మహాశకాలలోనూ ఈ మూడు రకాల చాకిరీ పద్ధతులూ అమలుజరిగాయి. వీనినెప్పుడూ బానిసధర్మం అంటిపెట్టుకొనే వుంటూంది. ఒకప్పుడు బాహాటంగానే కనిపించేది. ఈనాడు కొంచెం మారురూపంలో వుంది. అంతే తేడా.

వర్తకపు సరుకులు ఉత్పత్తిచేయడంతో నాగరికయుగం ఆరంభం అయింది. వర్తకపు సరుకుల ఉత్పత్తి ఆర్థికమైన కొన్ని లక్షణాలతో ప్రారంభమైంది. (1) నాణాల రూపంలో డబ్బు, దానితోపాటు డబ్బురూపంలో పెట్టుబడీ, వడ్డీ, వడ్డీ వ్యాపారమూను; (2) ఉత్పత్తిచేసేవారికి మధ్యదళారీలుగా వర్తకులు; (3) భూమిమీద వ్యక్తిగత స్వామ్యం, తనఖా పద్ధతి; (4) బానిస శ్రమే ప్రధాన ఉత్పత్తిరూపం కావడం. నాగరికతకు అనుగుణమైనదీ, నాగరికతాదశలో సర్వసామాన్యమైనదీ దంపతీ వివాహపద్ధతి. స్త్రీమీద మగవాని పెత్తనం స్థిరపడింది. విడి కుటుంబం సమాజంలో ప్రాథమిక ఆర్థిక యూనిటు అయింది. నాగరిక సమాజంలో రాజ్యం సమాజాన్ని పట్టివుంచుతుంది. అన్ని క్లిష్ట సమయాలలోనూ ఇది ఎప్పుడూ పాలకవర్గాలదిగానే వుంటుంది. సర్వ సమయాలలోనూ ఇది పీడిత వర్గాలను, దోపిడి చేయబడే వర్గాలను అణచివుంచేటందుకు యంత్రాంగంగానే వుంటుంది. నాగరికతకు ఇతర లక్షణాలు కొన్ని వున్నాయి; సామాజిక శ్రమ అంతటినీ విభజించడంలో పట్టణాలకూ — పల్లెలకూ మధ్య వ్యత్యాస స్థిరీకరణ దాని లక్షణాలలో ఒకటి. వేరొకటి వీలు నామాలను ప్రవేశపెట్టడం. దీని ద్వారా మానవుడు తన మరణానంతరం కూడా ఆస్తిని సంక్రమింపజేశాడు. ఇది ప్రాచీన గణవ్యవస్థకు పూర్తిగా విరుద్ధం. సోలోన్ కాలంవరకూ

ఏథెన్సు ప్రజలు కూడా దీని నెరుగరు. ఎప్పుడు జరిగిందో తెలియకపోయినా రోములో ప్రారంభంలోనే యిది కనబడుతుంది.* జర్మనీలో మతాచార్యులు దీనిని ప్రవేశపెట్టారు. యోగ్యులైన జర్మన్లు తమ ఆస్తిని దైవ కైంకర్యం చేయడానికి ఆటంకాలు లేకుండా చేసేటందుకు దీనిని ప్రవేశపెట్టారు.

గణసమాజం చేయజాలని పనులను నాగరికత దీని ఆధారంగా సాధించింది. మానవునిలోని ఇతర శక్తులన్నింటినీ ఒకమూలకు నెట్టి, అత్యంత క్షుద్రమైన ఉద్రేకాలను కదలించి, విజృంభింపచేసి తద్వారా ఈ కార్యాల్ని సాధించింది. నాగరికత తలయెత్తినది మొదలు నేటివరకూ వట్టి దురాశే దానిని ముందుకు నడుపుతూంది; సంపద, ఇంకా సంపద, మరింత సంపద; సంపద — సమాజంయొక్క సంపద కాదు, పిసినారియైన వ్యక్తి సంపద — అదే దాని ఏకైక గమ్యం, నిర్ణాయక గమ్యమూను. ఈ గమ్యాన్ని సాధించడంలో విజ్ఞానశాస్త్ర పరిణామమూ, అప్పటప్పట కళాసంపద పరిపూర్ణంగా వికసించడమూ, వుట్టవుడియంగా దాని ఒడిలో పడ్డాయి. అవే లేకపోతే యీనాటి సంపద సంచయనంలో సాధింపబడిన విజయాలు అసాధ్యమే అయ్యుండేవి.

అసలు నాగరికత అనేది ఒక వర్గాన్ని మరొకవర్గం దోచుకోవడం అనే పద్ధతిమీద ఆధారపడుతోంది. అందుచేత దాని అభివృద్ధి పొడుగునా వైరుధ్యాలతోటే సాగుతూంది. ఉత్పత్తిలో ప్రతి ఒక ముందడుగూ, అత్యధిక సంఖ్యాకులయిన పీడితవర్గంయొక్క పరిస్థితుల విషయంలో ఒక వెనుకడుగే. ఒకరికి వరం అయినది మరొకరికి శాపం; ఒక్కొక్క వర్గం నూతనంగా స్వాతంత్ర్యం పొందిందంటే మరో వర్గం కొత్త పీడనకు గురి అయిందన్నమాటే. యంత్రాలను ప్రవేశపెట్టడం వలన కలిగిన ఫలితాలను నేడందరూ ఎరుగుదురు. అనాగరిక ప్రజలలో హక్కులకూ — బాధ్యతలకూ భేదం చూపడం సాధ్యం కాదు. నాగరిక

---

* "ఆర్జిత హక్కుల వ్యవస్థ" పుస్తకం రెండో భాగంలో లాసాల్ రోమనులలో వీలునామా అనేది రోము అంత ప్రాచీనమూను, "వీలునామాలులేని కాలం రోమను చరిత్రలోనే లేదు" అని రాశాడు. వీలునామా అనేది రోముకు పూర్వమే "మృతసంస్కార" పద్ధతులలోంచి వచ్చిందన్నాడు. హేగెల్ తత్వశాస్త్రంమీద అత్యధిక భక్తిగల లాసాల్ రోమను చట్టంలోని అంశాలకు మూలం రోమను సామాజిక పరిస్థితులలో వుందేమో పరిశీలించడానికి బదులు ఇచ్ఛ అనే "పర్యాలోచన భావన" ప్రాతిపదికమీద చరిత్రకు పూర్తిగా విరుద్ధమైన నిర్ణయానికి వచ్చాడు. రోమనుల వారసత్వ చట్టంలో ఆస్తి మార్పిడి ప్రధానమైనది కాదని అటువంటి పర్యాలోచన భావనతోనే నిర్ణయించడంలో ఆశ్చర్యపడనక్కర లేదు. ప్రాచీన కాలంనాటి రోమను న్యాయవేత్తల భ్రమలను లాసాల్ విశ్వసించడమే కాదు, ఆ భ్రమలలో అతడు వారిని మించిపోతున్నాడు. (ఎంగెల్స్ వివరణ.)

ప్రజలలో ఆ భేదం కనిపిస్తుంది. ఒక వర్గానికి ఇంచుమించు అన్ని హక్కులనూ, మరో వర్గానికి ఇంచుమించు అన్ని బాధ్యతలనూ ఇచ్చేసి వానిమధ్యనున్న వైరుధ్యం, అత్యంత మూఢుడికి కూడా తెలిసేటట్లు చేసింది నాగరికత.

కాని, యిది ఉండవలసిన విధంగా లేదు. పాలకవర్గానికి మంచిదైనదే సమాజాని కంతకూ మంచిదిగా వుండాలి. పాలకవర్గం సమాజంతో అవినాభావ సంబంధం కలిగివుండాలి. అందుచేత నాగరికత అభివృద్ధిపొందినకొద్దీ తాను తప్పనిసరిగా సృష్టించిన చెడుగులను ప్రేమ ముసుగులో అలంకరించ వలసివస్తుంది. వానిని పొగడడమో, అసలవి లేనే లేవనడమో చేయవలసివస్తుంది. అంటే గత రెండు సమాజ వ్యవస్థలలోనూ, నాగరికత యొక్క ప్రాథమిక దశలలోనూ మనం ఎరగని మోసకారితనాన్ని సృష్టిస్తుంది. మోసానికి పరాకాష్ఠగా: పీడకవర్గం తన పీడన సాగిస్తున్నది కేవలం, ప్రత్యేకించి పీడితవర్గపు ప్రయోజనార్థమే; పీడితు లీ విషయం గుర్తించలేకపోయినా ఎదురుతిరిగినా తమకు ఉపకారం చేసేవారిపట్ల అది వట్టి కృతఘ్నత తప్ప వేరు కాదు — అని ప్రకటిస్తుంది.*

ముగింపుగా నాగరికతమీద మోర్గన్ తీర్పును వుదహరిస్తాను:

> "నాగరికతారంభంనుండీ ఆస్తి ఎంత విశేషంగా, ఎంతటి భిన్నభిన్న రూపాలలో పెరిగిపోయిందంటే, దాని ఉపయోగాలు ఎంతగా విస్తరించాయంటే, దాని స్వంతదారుల లాభంకోసం అది ఎంత మెలకువతో నిర్వహించబడుతూందంటే, ప్రజలకు సంబంధించినంతవరకు, అలవిగాని మహా శక్తిగా అది తయారయింది. తాను సృష్టించిన మహాశక్తి యెదుట మానవ మేధస్సు దిగ్భ్రాంతిచెంది చేష్టలుడిగి నిలబడింది. అయినా, మానవుని బుద్ధి ఆస్తిమీద ఆధిపత్యం సంపాదించగల రోజు వస్తుంది. రాజ్యానికీ, అది రక్షిస్తున్న ఆస్తికీ మధ్య నుండవలసిన సంబంధాలను నిర్వచిస్తుంది. ఆ ఆస్తిదారుల బాధ్యతలనే

---

* ఫోరియరు తన రచనలలో అక్కడా అక్కడా నాగరికతమీద చాల ప్రశస్తమైన విమర్శలు చేశాడు. మోర్గనూ, నేనూ చేసిన విమర్శలతోపాటు వానిని కూడా జతపరుద్దామని మొదట అనుకున్నా, కాని దురదృష్టవశాత్తూ వ్యవధి లేకపోయింది. దంపతీ వివాహమూ, భూమిమీద వ్యక్తిస్వామ్యమూ నాగరికతయొక్క లక్షణాలంటూ, వానిని ధనికులు బీదలతో యుద్ధంచేయడంగా ఫోరియరు ఇదివరకే భావించినట్లు చెప్పి వూరుకోదలచాను. విరుద్ధ ప్రయోజనాలతో కొట్టుమిట్లాడే అసమగ్ర సమాజా లన్నింటా విడి కుటుంబాలే (les familles incohérentes) ఆర్థిక యూనిట్లుగా వుంటాయనే అంశాన్ని ఆయన చెప్పాడు. (ఎంగెల్స్ వివరణ.)

కాకుండా వారి హక్కులకు హద్దుల్ని ఏర్పరుస్తుంది. వ్యక్తుల ప్రయోజనాల కన్న సమాజ ప్రయోజనాలు ముఖ్యం. ఆ రెండింటిమధ్య న్యాయమైన, సమరస మైన సంబంధాలను ఏర్పరచాలి. ఆస్తిని సంపాదించడమే మానవజాతి ధ్యేయం కాదు. గతంలో మాదిరిగానే భవిష్యత్తులో కూడా ప్రగతియే నియమంగా ఉండాలంటే, ఆస్తి సంపాదనయే మానవజాతి అంతిమ లక్ష్యం కాదు. మానవుడు భూమిమీదికి వచ్చినప్పటినుంచి జరిగిన కాలంలో నాగరికత ఏర్పడిన తర్వాత నేటివరకు జరిగినది అత్యల్ప కాలం. ఇకముందు జరగవలసినదాంట్లో కూడ అత్యల్ప భాగమే. ఆస్తి సంపాదనయే ఆశయం, ఆదర్శంగా వుండే స్థితి ఆ సమాజంతోపాటు రద్దు అవుతుంది. ఏమంటే అటువంటి పద్ధతి ఆత్మ వినాశకరం. పరిపాలనలో ప్రజాస్వామ్యం, సమాజంలో సోదరభావం, హక్కులూ సౌకర్యాలలో సమానత్వం, సార్వజనిక విద్య — ఇవి రాబోయే మరింత ఉన్నత సమాజాన్ని సూచిస్తున్నాయి. అనుభవం, బుద్ధి విజ్ఞానం నిబ్బరంగా అటే దారితీస్తున్నాయి. ప్రాచీనకాలపు గణాలలో వుంటూవచ్చిన స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరభావం ఒక నూతన ఉన్నత రూపంలో పునరుజ్జీవితం కావడమే యిది." (మోర్గన్, "ప్రాచీన సమాజం," పేజి 552.)*

1884, మార్చి చివర — మే 26 మధ్య
రచింపబడింది

1884లో జూరిచ్‌లో
ప్రత్యేకమైన పుస్తకంగా ప్రచురింపబడింది

సంతకం: ఫ్రెడరిక్ ఎంగెల్స్

---

* మార్క్స్ — ఎంగెల్స్, పురాపత్ర భాండారం, 9వ సంపుటి, పేజీలు 56–57. — సం.

# వివరణలు

[1] ఆదిలో యీ వ్యాసం మరింత వివరమైన – "బానిసత్వపు మూడు ప్రధాన రూపాలు" ("Three Main Forms of Enslavement") అనే శీర్షిక కలిగిన – రచనకు ఉపోద్ఘాత ప్రాయంగా ఊహించబడింది. అయితే అది కార్యరూపం ధరించలేదు. ఎంగెల్స్ చివరకు, ఉపోద్ఘాతప్రాయమైన యీ భాగానికి "వానరుడు మానవుడుగా మారే క్రమంలో శ్రమ నిర్వహించిన పాత్ర" అనే పేరు పెట్టాడు. మానవుని భౌతిక ఆకృతి రూపొంద డంలోను, మానవ సమాజ సృష్టిలోను శ్రమ నిర్వహించిన కీలకమైన పాత్రను ఎంగెల్స్ తన యీ రచనలో విశ్లేషించాడు. సుదీర్ఘమైన చారిత్రక ప్రక్రియ ఫలి తంగా వానరుడు గుణాత్మకంగా ఒక నూతన ప్రాణిగా – మానవుడుగా – ఏవిధంగా రూపాంతరం చెందాడో ఆయన తన యీ రచనలో వివరించాడు. – 7.

[2] చార్లెస్ డార్విన్ రచించిన "The Descent of Man and Selection in Relation to Sex" ("మానవ ఆవిర్భావం, లైంగిక వరణం") చూడండి. ఈ పుస్తకం లండనులో 1871లో ప్రచురింపబడింది. – 7.

[3] 1873నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి యిది ప్రస్తావన. జర్మనీలో 1873 మేలో ప్రారంభమైన "ఘోర వినాశం" 1870 దశకం చివరిదాకా కొనసాగిన సుదీర్ఘ ఆర్థిక సంక్షోభానికి నాందీప్రాయమైనది. – 21.

[4] "Rheinische Zeitung für Politik, Handel und Gewerbe" ("రాజకీయాలకు, వాణిజ్య, పరిశ్రమలకు సంబంధించిన రైనిషె పత్రిక") – జర్మన్ దినపత్రిక. దీని ప్రచురణ కొలోన్‌లో 1842 జనవరి 1నుంచి 1843 మార్చి 31వరకు జరిగింది. 1842 ఏప్రిల్‌నుంచి మార్క్స్ దానికి వ్యాసాలు రాశాడు, అక్టోబరునుంచి దాని సంపాదకవర్గంలో చేరాడు. – 22, 109.

[5] "Kölnische Zeitung" ("కొలోన్ వార్తాపత్రిక") – ఈ జర్మన్ దినపత్రిక ప్రచురణ కొలోన్‌లో 1802లో ప్రారంభమైంది. 1848–49 విప్లవ కాలంలోనూ, అటుతర్వాత అభివృద్ధినిరోధక దశలోనూ యీ దినపత్రిక ప్రష్యన్ లిబరల్ బూర్జువా వర్గంయొక్క పిరికి, విద్రోహపూరిత విధానాన్ని ప్రతిబింబించింది. 19వ శతాబ్దపు చివరి దశలో యీ పత్రిక నేషనల్ లిబరల్ పార్టీతో సంబంధం కలిగియుంది. – 22.

[6] "Deutsch-Französische Jahrbücher" ("జర్మన్-ఫ్రెంచి ఐతిహాస వార్షిక సంచికలు") – కె. మార్క్స్, ఎ. రూగె సంపాదకత్వంకింద జర్మన్ భాషలో పారిస్ నుంచి ప్రచురింపబడింది. జమిలి సంచిక ఒక్కటి మాత్రమే 1844 ఫిబ్రవరిలో వెలువడింది. దీనిలో మార్క్స్, ఎంగెల్స్‌ల రచనలు ప్రచురింపబడ్డాయి. వాళ్లిద్దరూ భౌతికవాద, కమ్యూనిజం దృక్పథాన్ని గట్టిగా చేపట్టారనడానికి ఆ రచనలు రుజువు. మార్క్స్‌కీ, బూర్జువా రాడికల్ అయిన రూగెకూ మధ్య వున్న అభిప్రాయభేదాలు ఆ పత్రిక ఆగిపోడానికి ప్రధాన కారణమైంది. – 23, 118.

[7] మార్క్స్‌ను ఫ్రాన్సునుండి బహిష్కరించే ఉత్తరువు, ప్రష్యన్ ప్రభుత్వపు ఒత్తిడి కారణంగా, ఫ్రెంచి ప్రభుత్వంచేత 1845 జనవరి 16న జారీచెయ్యబడింది. – 23.

[8] జర్మన్ కార్మిక సంఘం – బెల్జియంలో నివసించే జర్మన్ కార్మికుల రాజకీయ చైతన్యాన్ని పెంపొందించేందుకూ, వారిమధ్య శాస్త్రీయ కమ్యూనిస్టు భావాలను వ్యాపింపచేసేందుకూ గాను మార్క్స్ ఎంగెల్సులు 1847 ఆగస్టులో బ్రస్సెల్స్‌లో యీ సంఘాన్ని స్థాపించారు. మార్క్స్ ఎంగెల్సుల, వారి అనుయాయుల మార్గనిర్దేశకత్వంలో యీ సంఘం బెల్జియంలోని జర్మన్ విప్లవ కార్మికులను చట్టరీత్యా సమీకరించే ఒక కేంద్రంగా తయారైంది. ఈ సంఘపు ప్రముఖ సభ్యులు కమ్యూనిస్టు లీగుయొక్క బ్రస్సెల్స్ శాఖ సభ్యులు కూడా. బ్రస్సెల్స్‌లోని జర్మన్ కార్మిక సంఘపు కార్యకలాపాలు, బెల్జియన్ పోలీసులు దాని సభ్యులను అరెస్టు చెయ్యడం, దేశబహిష్కృతులను చెయ్యడం కారణంగా, 1848 ఫిబ్రవరిలో ఫ్రాన్సులో జరిగిన బూర్జువా విప్లవానికి కొద్ది రోజుల తర్వాత, నిలిచిపోయాయి. – 24, 119.

[9] "Deutsche-Brüsseler Zeitung" ("జర్మన్ బ్రస్సెల్స్ వార్తాపత్రిక") – బ్రస్సెల్స్‌లో జర్మన్ రాజకీయ ప్రవాసులచేత నెలకొల్పబడిన యీ వార్తాపత్రిక 1847 జనవరినుండి 1848 ఫిబ్రవరివరకు ప్రచురింపబడింది. 1847 సెప్టెంబరునుండి మార్క్స్ ఎంగెల్సులు యీ పత్రికకు విడువకుండా రచనలు పంపుతూ, దాని సంపా

దకీయ విధానంపైన గట్టి ప్రభావాన్ని బరపారు. వారి మార్గదర్శకత్వంలో యీ పత్రిక కమ్యూనిస్టు లీగు ప్రచార సాధనం అయింది. – 24, 109, 119.

10 "Neue Rheinische Zeitung. Organ des Demokratie" ("నూతన రైనిషె పత్రిక. డెమోక్రసీ పత్రిక") – ఈ దినపత్రిక 1848 జూన్ 1నుండి 1849 మే 19దాకా కొలోన్‌లో వెలువడింది. మార్క్స్ దాని ప్రధాన సంపాదకుడు. ఎంగెల్స్ సంపాదకవర్గంలో పనిచేశాడు. – 25, 109.

11 1848 జూన్ 23–26 తేదీల్లో పారిస్ కార్మికులు చేసిన వీరోచితమైన తిరుగుబాటుకు ఇది ప్రస్తావన. దానిలో 40–45 వేలమంది పాల్గొన్నారు. ఫ్రెంచి బూర్జువా వర్గం ఈ తిరుగుబాటును అత్యంత పాశవికంగా అణచివేసింది. 1848–1849 సంవత్సరాల్లో యూరప్‌లో జరిగిన విప్లవక్రమానికి యీ తిరుగుబాటు పరాకాష్ఠ. ఈ తిరుగుబాటే శ్రామికవర్గానికీ బూర్జువావర్గానికీ మధ్య జరిగిన తొలి మహా అంత ర్యుద్ధం. – 25.

12 "Neue Rheinische Zeitung. Politisch-Ökonomische Revue" ("కొత్త రైనిషె పత్రిక. రాజకీయ ఆర్థిక సమీక్ష") – కమ్యూనిస్టు లీగుయొక్క యీ సిద్ధాంత పత్రిక మార్క్స్ ఎంగెల్సులు స్థాపించారు. 1849 డిసెంబరు – 1850 నవంబరు మధ్య యీ పత్రిక సంచికలు మొత్తం ఆరు వెలువడ్డాయి. – 25.

13 "Kreuzzeitung" ("క్రాస్ వార్తాపత్రిక") – జర్మన్ దినపత్రిక అయిన "Neue Preußische Zeitung" ("కొత్త ప్రష్యన్ వార్తాపత్రిక") శీర్షికలో యుద్ధకాల సైన్యపు (Landwehr) చిహ్నమైన క్రాస్ ఉపయోగింపబడుతూవుండిన కారణంగా దానికి యీ పేరు వాడుకలోకి వచ్చింది. బెర్లిన్‌లో 1848 జూన్‌నుండి 1939వరకు వెలువడిన యీ పత్రిక రాజదర్బారీ కుట్రముఠాయొక్క, ప్రష్యన్ బడా భూస్వాములయొక్క ప్రచార సాధనం. – 25.

14 ఒక వారంపాటు జరిగిన తీవ్ర పోరాటానంతరం 1848 నవంబరు 1న ఆస్ట్రియా చక్రవర్తి సేనలు వియన్నాలో ప్రజల తిరుగుబాటును అణచివేసి, ఆ నగరాన్ని ఆక్ర మించుకున్నాయి.

1848 నవంబరు, డిసెంబరు మాసాల్లో ప్రష్యాలో ఒక అభివృద్ధినిరోధక రాజకీయ కుట్ర జరిగింది; నవంబరు 1న, బాహాటంగా విప్లవ ప్రతీఘాత ప్రభుత్వ మొకటి అధికారంలోకి వచ్చింది. నవంబరు 9న ప్రష్యన్ జాతీయ అసెంబ్లీ సమా

వేశాలను బెర్లిన్‌నుండి బ్రాండెన్‌బుర్గ్ పట్టణానికి మార్చుతూ ఆజ్ఞలు జారీచెయ్య బడ్డాయి; జాతీయ అసెంబ్లీ సభ్యుల్లో అధిక సంఖ్యాకులు తమ సమావేశాన్ని బెర్లిన్‌లోనే కొనసాగించారు, కాని నవంబరు 15న వారి సైనిక దళాలు చెదరగొట్టాయి. డిసెంబరు 5న జాతీయ అసెంబ్లీ రద్దుతో, అభివృద్ధినిరోధక రాజ్యాంగచట్ట ప్రకటనతో ఆ రాజకీయ కుట్ర ముగిసింది. – 26.

15 మే 3–8న డ్రెస్డెన్‌లోనూ, దక్షిణ, పశ్చిమ జర్మనీలోనూ 1849 మే – జూలై మాసాల్లో సామ్రాజ్య రాజ్యాంగ రక్షణకోసం (1849 మార్చి 28న ఫ్రాంక్‌ఫుర్ట్ పార్లమెంటుచేత ఆమోదింపబడిన యీ రాజ్యాంగం పలు జర్మన్ రాజ్యాలచేత తిరస్కరింపబడింది) జరిగిన ప్రజా తిరుగుబాట్లకు యిది ప్రస్తావన. సద్యోజనితంగా, చెదురు బదురుగా, అసంఘటితంగా జరిగిన కారణంగా యీ తిరుగుబాట్లు అణచివెయ్య బడ్డాయి. – 26.

16 1849 జూన్ 13న, మహీధరం పార్టీ అనే ఒక పెటీబూర్జువా పార్టీ, విప్లవాన్ని అణచివేసేందుకుగాను ఇటలీకి ఫ్రెంచి సేనలను పంపడానికి వ్యతిరేకంగా, పారిస్‌లో ఒక శాంతియుత ప్రదర్శనను ఏర్పాటుచేసింది. ఆ ప్రదర్శన సైన్యంచేత చెదరగొట్ట బడింది. మహీధరం పార్టీ నాయకులు పలువురు అరెస్టుచెయ్యబడి దేశంనుండి వెళ్లగొట్టబడ్డారు లేక ఫ్రాన్సునుండి ప్రవాసులుగా వెళ్లిపోవలసిన పరిస్థితిలో పడ్డారు. – 26, 128.

17 కొలోన్‌లో కమ్యూనిస్టులపై కేసు విచారణ (1852 అక్టోబరు 4నుండి నవంబరు 12వరకు) – "కమ్యూనిస్టు లీగు"కి చెందిన 11 మంది సభ్యులపై ప్రష్యన్ ప్రభుత్వం పెట్టిన కల్పితమైన కేసు విచారణ. నకిలీ పత్రాలు, కూట సాక్ష్యాల ఆధారంగా, పెద్ద రాజ్యద్రోహారోపణ చెయ్యబడిన యీ 11 మందిలోనూ ఏడుగురు నిందితులకు మూడేళ్లనుండి ఆరేళ్లవరకు కఠినమైన దుర్గ కారావాస శిక్ష విధింపబడింది. – 26, 114.

18 "New York Daily Tribune" – ప్రగతిశీల బూర్జువా దినపత్రిక. 1841నుండి 1924దాకా ప్రచురింపబడిన యీ పత్రికలో మార్క్స్ ఎంగెల్సులు 1851 ఆగస్టునుండి 1862 మార్చిదాకా తమ రచనలు ప్రచురించారు. – 27, 109.

19 అమెరికాలో అంతర్యుద్ధం (1861–65) – ఉత్తరాదికి చెందిన పారిశ్రామిక రాష్ట్రలకూ, దక్షిణాదికి చెందిన తిరుగుబాటుదారు బానిసయాజమాన్య రాష్ట్రాలకూ మధ్య జరిగింది. – 27.

[20] ఇటాలియన్ యుద్ధం – 1859లో ఆస్ట్రియాకు వ్యతిరేకంగా ఫ్రాన్సు ప్యేమొంట్‌ల మధ్య జరిగిన యుద్ధం. పైకి ఇటలీ విముక్తికోసం అని చెప్తూ మూడవ నెపోలియన్ ఆరంభించిన యుద్ధం యిది. కాని నిజానికి కొన్ని భూభాగాలను ఆక్రమించుకోవాలనీ, ఫ్రాన్సులో బోనపార్ట్‌ల పాలనను సుసంఘటితం చేసుకోవాలనీ అతను ఆశించాడు. కాని మూడవ నెపోలియన్, ఇటలీలో ఉవ్వెత్తున ఉప్పొంగిన జాతీయ విముక్తి ఉద్యమాన్ని చూసి భయపడిపోయి, ఇటలీ విభజనను యథాతథంగా పరిరక్షించేందుకుగాను ఆస్ట్రియాతో వేరుగా ఒక శాంతిసంధి చేసుకున్నాడు. ఈ సంధి మేరకు ఫ్రాన్సు సవోయ్, నీస్‌లను ఆక్రమించుకుంది. లొంబార్డీ సార్డీనియాకు బదలాయింపబడింది. వెనిస్ ఆస్ట్రియా పాలనకింద వదిలెయ్యబడింది. – 27.

[21] "Das Volk" ("ప్రజలు") – 1859 మే 7నుంచి, ఆగస్టు 20వరకు లండనులో జర్మన్ భాషలో ప్రచురింపబడిన వారపత్రిక. మార్క్స్ యీ పత్రికా నిర్వహణలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. మార్క్స్ వాస్తవానికి జూలైనుంచి దీని సంపాదకుడయ్యాడు. – 27.

[22] పారిస్‌లోని తుయిలెరీ రాజభవనానికి యిది ప్రస్తావన. రెండవ సామ్రాజ్య కాలంలో యిది మూడవ నెపోలియన్ నివాసంగా వుంది. – 27.

[23] ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధం జరిగినప్పుడు 1870 సెప్టెంబరు 4నాటి ప్రజా సాముహిక విప్లవాత్మక తిరుగుబాటు ఫలితంగా రెండవ సామ్రాజ్యం కూలిపోయింది. రిపబ్లిక్ ప్రకటింపబడింది. జాతీయ రక్షణ ప్రభుత్వమనబడే ఒక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చెయ్యబడింది. దీనిలో మితవాద రిపబ్లికన్లూ, రాజరికవాదులూ కూడా వున్నారు. వాస్తవానికి త్యేర్ ప్రోత్సాహంతో, పారిస్ గవర్నర్ జనరల్ అయిన ట్రూషూ నాయకత్వాన ఏర్పడిన యీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలకు ఎసరుపెట్టేందుకూ, శత్రువుతో దేశద్రోహపూరితమైన ఒడంబడికలు కుదుర్చుకొనేందుకే స్థిరసంకల్పంతో కృషి చేసింది. – 27.

[24] ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌యొక్క హేగ్ మహాసభ 1872 సెప్టెంబరు 2–7 తేదీల మధ్య జరిగింది. ఆ మహాసభకు మార్క్స్ ఎంగెల్సులతోబాటు 15 దేశాల కేంద్ర సంఘాలనుండి 65 మంది ప్రతినిధులు హాజరయారు. ఆ మహాసభయొక్క యావత్తు కార్యకలాపాలకూ మార్క్స్ ఎంగెల్సులు మార్గదర్శకత్వం వహించారు. కార్మికోద్యమంలోని అన్ని రకాల పెటీబూర్జువా ఒంటెత్తువాదానికీ వ్యతిరేకంగా అనేక సంవత్సరాలుగా మార్క్స్ ఎంగెల్సులు, వారి అనుచరులు సాగించిన పోరాటం

ఆ మహాసభలో శిఖరస్థాయిని చేరుకుంది. అరాజకవాదుల చీలికవాద కార్యకలాపాలు నిరసింపబడ్డాయి, వారి నాయకులు ఇంటర్నేషనల్‌నుండి బహిష్కరింపబడ్డారు. హేగ్ మహాసభ నిర్ణయాలు వివిధ దేశాల్లో కార్మికవర్గంయొక్క స్వతంత్ర రాజకీయ పార్టీల స్థాపనకు మార్గాన్ని సుగమం చేశాయి. – 28.

[25] 1871 నాటి పారిస్ కమ్యూన్ – కార్మికవర్గంయొక్క విప్లవాత్మక ప్రభుత్వం, 1871 మార్చి 28నుండి మే 28వరకు యిది అధికారంలో వుంది. శ్రామికవర్గ నియంతృత్వానికి సంబంధించిన తొలి చారిత్రకానుభవాన్ని కార్మికవర్గానికి యిది సమకూర్చింది. 1871 మార్చి 18 నాటి శ్రామికవర్గ విప్లవానికీ, తదనంతర దశయైన శ్రామిక వర్గ నియంతృత్వానికీ ఈ పదం విస్తృత రూపంలో వాడబడుతోంది. కార్ల్ మార్క్స్ రాసిన "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లో పారిస్ కమ్యూన్ చరిత్రా, దాని సారభూత లక్షణాలూ సవివరంగా విశ్లేషింపబడ్డాయి (ఈ సంకలనంలో రెండవ భాగం చూడండి). – 28.

[26] "సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం" అనే ఎంగెల్స్ రచన "ఆంటీ డ్యూరింగ్"లోని మూడు అధ్యాయాలు. సమగ్రమైన ప్రపంచ దృక్పథంగా, మార్క్సిస్టు బోధనలను కార్మికులకు తేలికగా వివరించేందుకు ఈ మూడు భాగాలూ తిరిగి రచింపబడ్డాయి. ఇందులో మార్క్సిజంలోని మూడు భాగాలనూ ఎంగెల్స్ వివరించాడు. గతితార్కిక, చారిత్రక భౌతికవాదం ఎలా ఆవిర్భవించిందో ఇందులో ఎంగెల్స్ నిరూపించాడు. మార్క్స్ చేసిన రెండు గొప్ప ఆవిష్కరణల ఫలితంగానే – చరిత్రకు సంబంధించిన భౌతికవాద దృక్పథం వివరణ, అదనపు విలువ సిద్ధాంతం సృష్టి – ఈ రెంటివల్లనే, సోషలిజానికి శాస్త్రీయ పునాది ఏర్పడ్డదని ఇందులో ఎంగెల్స్ నిరూపించాడు. – 35.

[27] 1875 మే 22–27 తేదీల్లో జరిగిన గోతా మహాసభలో జర్మన్ కార్మికోద్యమంలో రెండు ధోరణులు సమైక్యమయ్యాయి. అవి ఎ. బేబెల్, వి. లీబ్‌క్నెఖ్ట్‌ల నాయకత్వాన సోషల్-డెమోక్రటిక్ కార్మిక పార్టీ (ఐసెనాఖర్లు), లాసాలియన్ అఖిల జర్మన్ కార్మిక సంఘం. సమైక్య పార్టీకి జర్మనీ సోషలిస్టు కార్మిక పార్టీ అని పేరు పెట్టబడింది. దీనితో జర్మన్ కార్మికోద్యమంలో చీలిక అంతం చెయ్యబడింది. గోతా మహాసభకు సమర్పించిన సమైక్య పార్టీ కార్యక్రమాన్ని మార్క్స్ ఎంగెల్సులు తీవ్రంగా విమర్శించారు, అది కొన్ని సవరణలతో ఆమోదింపబడింది. – 35.

[28] ద్విలోహ ప్రమాణం – బంగారం, వెండి అను రెండు లోహాలు ఒకేసారి, ద్రవ్య బాధ్యతలను నిర్వహించే వ్యవస్థ. – 36.

29 ప్రాకృతిక వరణం – సజీవ ప్రకృతి నియమబద్ధంగా అభివృద్ధి చెందుతుంది. జీవజాతులు చారిత్రకాభివృద్ధి క్రమంలో మారుతున్న పరిసరాల పరిస్థితులకు సర్దుకుంటున్నాయి. ఈ క్రమంలో బలహీనమైనవి నాశనమైపోతాయి, బలమైనవి పరిస్థితుల కనుగుణంగా మార్పులుచెంది సజీవంగా వుంటాయి. ఈ సిద్ధాంత సంస్థాపకుడు డార్విన్. – 36.

30 "Vorwärts" ("పదండి ముందుకు") – జర్మన్ సోషలిస్టు కార్మిక పార్టీ కేంద్ర పత్రిక. 1876 అక్టోబరు 1నుండి 1878 అక్టోబరు 27వరకు లైప్జిగ్‌లో ప్రచురితమైంది. 1877 జనవరి 3, 1878 జూలై 7 తేదీల మధ్య ఈ పత్రికలోనే, ఎంగెల్స్ రచించిన "ఆంటీ డ్యూరింగ్" ప్రచురించబడింది. – 36.

31 "మార్క్" – ప్రాచీన జర్మన్ గ్రామ సమాజం (సంఘం). "సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం" అను గ్రంథం జర్మన్ ముద్రణకు అనుబంధంగా, ప్రాచీన కాలం నుండి జర్మన్ రైతాంగంయొక్క సంక్షిప్త చరిత్ర వ్యాసాన్ని ఈ పేరుతో ఎంగెల్స్ ప్రచురించాడు. – 37.

32 స్టాక్‌హోంలో 1890లో ప్రచురితమైన యం. యం. కొవలేవ్‌స్కీ గ్రంథం "Tableau des origines et de l'évolution de la famille et de la proprieté" ("కుటుంబం, ఆస్తుల ఆవిర్భావమూ, అభివృద్ధీ")నీ, 1886లో మాస్కోలో ప్రచురితమైన "ఆదిమ చట్టం. సంచిక 1. గణం" అనే గ్రంథాన్నీ ఇక్కడ ఎంగెల్స్ ప్రస్తావిస్తున్నాడు. – 37.

33 అజ్ఞేయతావాదం – ఒక భావవాద సిద్ధాంతం. దాని ననుసరించి ప్రపంచం అజ్ఞేయం, మానవుని తర్కజ్ఞానం పరిమితం, మానవేంద్రియానుభూతులను మించి ఏమీ తెలుసుకోలేము. కొందరు అజ్ఞేయతావాదులు భౌతిక ప్రపంచంయొక్క వాస్తవిక ఉనికిని గుర్తిస్తారు. కాని దానిని గ్రహించగలమనే విషయాన్ని నిరాకరిస్తారు. మరికొందరు భౌతిక ప్రపంచపు ఉనికినే నిరాకరిస్తారు. తన ఇంద్రియానుభూతిని మించి అదనంగా ఏదైనా ఉన్నదీ లేనిదీ మానవుడు తెలుసుకోలేడని వారి వాదన. – 38.

34 స్కూల్‌మన్ (శుష్కతార్కికవాది) – మధ్యయుగంపు మత సిద్ధాంతమైన, పాండిత్యవాదాన్ని ప్రవచించిన వారిలో ఒకడు. అత్యంత అనిర్దిష్టీకరణ, వాస్తవ జీవితంనుండి పూర్తిగా వేరుపడటం ఈ ధోరణి లక్షణాలు. క్రైస్తవ చర్చియొక్క మూఢ విశ్వాసాలన్నిటినీ, అనేకమైన తార్కిక కుయుక్తులతో వీరు సమర్థించ యత్నిస్తారు. – 38.

35 నామినలిస్టులు – మధ్యయుగపు తత్వవేత్తలలో ఒక శాఖ, సాధారణ భావనలన్నీ, వీరి

దృష్టిలో విడి విషయాలకు పేర్లు మాత్రమే. మధ్యయుగాల వాస్తవికవాదులవలె గాక, సాధారణ భావనలకు స్వతంత్ర ప్రతిపత్తి లేదనీ, అవి కేవలం పేర్లు, మాటలు లేక అనిర్దిష్ట భావనాక్రమాలు మాత్రమేననీ వీరు భావిస్తారు. అనగా వస్తువులు ప్రాథమికమైనవి, భావాలు ద్వితీయమైనవి అని వారు గుర్తిస్తున్నారని దీని అర్థం. ఈ దృష్ట్యా నామినలిజం, మధ్యయుగాలలో భౌతికవాదంయొక్క ప్రాథమిక వ్యక్తీకరణ అని చెప్పవచ్చు. – 38.

[36] హోమియోమెరీలు – అత్యంత స్వల్పమైనా, గుణాత్మకంగా నిర్దిష్టమైన భౌతికకణాలు. ఇవి అనంతమైన విభజనకు గురిచెయ్యబడుతాయి. అనక్సగోరస్ దృష్టిలో హోమియోమెరీలు, ఉనికిలో గల అన్నిటికీ ప్రాథమిక పునాది. వీని సంయోగమే వస్తు వైవిధ్యానికి కారణం. – 39.

[37] J. Locke "An Essay Concerning Human Understanding" ("మానవ అవగాహనకు సంబంధించిన ఒక వ్యాసం") లండన్‌లో మొట్టమొదట 1690లో ప్రచురితమైంది. – 40.

[38] ఆస్తికవాదంలో అంతర్గతమైన ఒక మత ఛాందసం. సృష్టికి మూలకారకుడైన ఒక సాకార దేవుడు వున్నాడని దాని నమ్మకం. – 40.

[39] ఇంద్రియానుభూతివాదం (sensationalism) – తత్వశాస్త్రంలో ఒక ధోరణి. దాని ప్రకారం ఇంద్రియగ్రాహ్య జ్ఞానం, ఇంద్రియ అనుభూతులు, అవబోధలు, కోర్కెలు మొదలైనవి యావత్తు విజ్ఞానానికీ, మానవుని యావత్తు బౌద్ధిక శక్తులకూ పునాది, మూలం. – 40.

[40] డేయిజం – ఒక మతతాత్విక ధోరణి. దాని ప్రకారం దృష్టిలో దేవుడు నిరాకారుడు, కాని విశ్వానికి హేతుపూర్వకమైన ప్రాథమిక కారకుడు. అయితే ఇతడు ప్రకృతిలోను, మానవ జీవితంలోను జోక్యం కలిగించుకోడు. – 40.

[41] లండన్ పారిశ్రామిక ప్రదర్శనం – మొట్టమొదటి ప్రపంచ వర్తక-పారిశ్రామిక ప్రదర్శనం 1851 మే – అక్టోబరు మాసాల్లో జరిగింది. – 41.

[42] బాప్టిస్టులు – క్రైస్తవ మతంలో అత్యంత విస్తారమైన విభాగాల్లో ఒకటి. క్రీస్తులో చైతన్యపూర్వకంగా విశ్వాసాన్ని ప్రకటించిన వయోజనులకు మాత్రమే బాప్టిజం దీక్ష ఇవ్వవలెనని వీరి భావం. క్రైస్తవ చర్చికి సంబంధించిన అనేకమైన కర్మకాండలను,

విశ్వాసాలను వీరు తోసిపుచ్చుతారు. పవిత్ర రచనలకు వ్యక్తులు తమ సొంత వ్యాఖ్య చెప్పుకునే హక్కును వీరు సమర్థిస్తారు. మొదటి బాప్టిస్టు సంఘాలు ఇంగ్లండులోను, అమెరికా లోని ఇంగ్లీషు కాలనీలలోను 17వ శతాబ్దిలో ఏర్పడ్డాయి. – 41.

43 సాల్వేషన్ ఆర్మీ – ఇంగ్లండులో 1865లో ఏర్పడి 1880లో సైనిక నమూనాపై పునర్నిర్మితమైన అభివృద్ధినిరోధక మత, జనహిత పరాయణ సంస్థ (కనుకనే దానికి ఆ పేరు). బూర్జువావర్గం విస్తారంగా ఇచ్చిన దానధర్మాలమీద ఆధారపడిన, ఈ సంస్థ చాలా దేశాలలో సేవా సంస్థల సముదాయాన్ని ఏర్పరచింది. దోపిడీదారులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలనుండి శ్రమజీవుల దృష్టిని మళ్లించేందుకు ఇవి ఉద్దేశితమైనాయి. – 41.

44 ఆధ్యాత్మికవాదం (spiritualism) – ప్రపంచానికి గల ప్రాథమికమైన ఆధ్యాత్మిక పునాదిని ప్రతిపాదించే భావవాద బోధన. ఈ ధోరణికి చెందినవారు శరీరానికి సంబంధం లేకుండానే ఆత్మ జీవిస్తుందని భావిస్తారు. – 45.

45 స్కిస్మాటిక్ – భిన్నాభిప్రాయం కలవాడు అని ఈ మాట అర్థం, గ్రీక్ మాట. స్కిస్మా (చీలుబ)నుండి ఇది ఆవిర్భవించింది. క్రైస్తవ, చారిత్రక సాహిత్యంలో ఈ మాటను, మధ్య యుగాలలో క్రైస్తవ చర్చిలో వచ్చిన విభేదాలను సూచించేందుకు వాడుతున్నారు. – 46.

46 1688 ఇంగ్లీషు విప్లవం, బ్రిటిష్ బూర్జువా చరిత్ర రచనలో, మహత్తర విప్లవంగా ప్రస్తావించబడ్డది. 1688 రాజకీయ కుట్ర ఫలితంగా స్టూవర్టు వంశం పదవీభ్రష్టమైంది. ఆరెంజ్ వంశస్థుడైన విలియం అధిపతిగా, చట్టబద్ధ రాచరికం (1689) ఏర్పడ్డది. ఈ రాచరికం, భూస్వామ్య ప్రభువుల అధికారానికీ, బడా బూర్జువావర్గానికీ మధ్య కుదిరిన రాజీకి ప్రతిబింబం. – 48.

47 గులాబీల యుద్ధం – ఇంగ్లండులో జరిగిన రాజవంశాల యుద్ధం (1455–85). లంకాస్టర్, యార్క్ అను ఫ్యూడల్ కుటుంబాల మధ్య ఈ యుద్ధం జరిగింది. వీరు ఎర్రటి, తెల్లటి గులాబీలను తమ చిహ్నాలుగా ధరించేవారు. కనుకనే దీనికి గులాబీల యుద్ధం అనే పేరు వచ్చింది. ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందిన దక్షిణ ప్రాంతానికి చెందిన పెద్ద ఫ్యూడల్ ప్రభువులు యార్క్ వంశాన్ని బలపరిచారు. పట్టణ ప్రజలు, నైట్లు (ప్రభువంశీకులు) కూడ వీరిని బలపరిచారు. ఉత్తరాది ప్రాంతానికి చెందిన ఫ్యూడల్ ప్రభువులు లంకాస్టర్ వంశాన్ని బలపరిచారు. ఈ యుద్ధం ఫలితంగా పెద్ద

ప్రభువంశాలన్నీ దాదాపు సర్వనాశనమైనాయి. ట్యూడర్లు అను నూతన వంశం అధికారంలోకి వచ్చింది. వీరు దేశంలో నిరంకుశ రాచరికాన్ని స్థాపించారు. – 48.

[48] కార్టీజియనిజం – 17వ శతాబ్దపు ఫ్రెంచి తత్వవేత్త డెకార్ట్ అనుయాయులు ప్రతిపాదించిన సిద్ధాంతం. ఆయన తాత్విక సిద్ధాంతంనుండి వీరు భౌతికవాద నిర్ధారణలు చేశారు. – 50.

[49] "మానవ హక్కుల ప్రకటన" – 1789లో ఫ్రెంచి రాజ్యాంగ నిర్ణయసభ ఈ ప్రకటనను ఆమోదించింది. నూతన బూర్జువా వ్యవస్థయొక్క రాజకీయ సూత్రాలను ఇది ప్రతిపాదించింది. 1791లో ఫ్రెంచి రాజ్యాంగంలో ఇది చేర్చబడ్డది. 1793లో తమ "మానవ హక్కుల ప్రకటన"ను తయారుచేసేటప్పుడు జాకొబిన్‌లు ఈ ప్రకటనను నమూనాగా వాడుకున్నారు. 1793 రిపబ్లికన్ రాజ్యాంగానికి పీఠికగా ఈ ప్రకటనను నేషనల్ కన్వెన్షన్ ఆమోదించింది. – 51.

[50] ఇక్కడా, ఆ తర్వాత "Code civil" ("కోడ్ నెపోలియన్") అను ప్రస్తావన వచ్చిన ప్రతి సందర్భంలోనూ, ఎంగెల్స్ మొత్తం బూర్జువా న్యాయశాస్త్ర వ్యవస్థనంతా ప్రస్తావిస్తున్నాడు. ఇందులో అయిదు న్యాయసంహితలున్నాయి (సివిల్, సివిల్ ప్రొసీజర్, కమెర్షియల్, క్రిమినల్, క్రిమినల్ ప్రొసీజరు). వీటిని 1804–10 సంవత్సరాల మధ్య నెపోలియన్ బోనపార్టే జారీచేశాడు. ఈ న్యాయసంహితలు నెపోలియన్ ఫ్రాన్సుచే స్వాధీనంచేసుకోబడిన పశ్చిమ, వాయవ్య జర్మనీ ప్రాంతాలలో అమలు జరిగాయి. 1815లో ఈ ప్రాంతాలు ప్రష్యాకు దత్తంచేయబడిన తర్వాత కూడా ఈ న్యాయసంహితలు కొనసాగాయి. – 51.

[51] భయానక పాలన – 1793 జూన్‌నుండి 1794 జూలైవరకు జాకొబిన్లు అమలుజరిపిన విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వ దశ. – 52, 64.

[52] ప్రజల ఒత్తిడి కారణంగా 1831లో కామన్సు సభచేత ఆమోదింపబడి, చివరకు 1832 జూన్‌లో ప్రభువుల సభ ఆమోదాన్ని పొందిన ఎన్నికలచట్టపు సవరణకోసం జరిగిన ఉద్యమానికి యిది ప్రస్తావన. భూస్వామ్య, ధనిక ప్రభువర్గానికి వ్యతిరేకంగా ఉన్ముఖంచెయ్యబడిన యీ సవరణ, పార్లమెంటులోకి పారిశ్రామిక బూర్జువావర్గ ప్రతినిధుల ప్రవేశ మార్గాన్ని తెరిచింది. ఈ సంస్కరణకోసం జరిగిన పోరాటంలో ప్రధాన శక్తియైన కార్మికవర్గమూ, పెటీబూర్జువావర్గమూ ఉదార బూర్జువావర్గంచేత మోసగింపబడ్డారు. ఎన్నిక హక్కులు వారికి మంజూరు చెయ్యబడలేదు. – 53.

[53] 1846 జూన్‌లో ఇంగ్లీషు పార్లమెంటు ధాన్యపు చట్టాలను రద్దుచేసే బిల్లును ఆమోదించడానికి ప్రస్తావన ఇది. ధాన్యం దిగుమతిని పరిమితపరచడానికి లేక నిషేధించడానికి ఉద్దేశించి పెద్ద భూస్వాముల ప్రయోజనాల కనుగుణంగా అవి ప్రవేశపెట్టబడ్డాయి. – 53.

[54] 1824లో ప్రజా వత్తిడి ఫలితంగా, ఇంగ్లీషు పార్లమెంటు కార్మిక సంఘాలపై నిషేధాన్ని రద్దుచేస్తూ ఒక చట్టాన్ని ఆమోదించింది. – 53.

[55] ప్రజా కోర్కెల పత్రం (People's Charter) – చార్టిస్టుల (57వ వివరణ చూడండి) కోర్కెలను కలిగివున్న ఈ ప్రణాళిక, 1838 మే 8న, పార్లమెంటుకు సమర్పించబడే బిల్లు రూపంలో ప్రచురించబడింది. అందులో ఆరు క్లాజులున్నాయి. సార్వజనీన ఓటింగు హక్కు (21 సంవత్సరాల వయస్సు పైబడినవారికి), పార్లమెంటుకు ప్రతి సంవత్సరం ఎన్నికలు, రహస్య బ్యాలెట్, సమానమైన నియోజక వర్గాలు, పార్లమెంటు అభ్యర్థులకు ఆస్తి అర్హత ఉండనక్కరలేదనే నిబంధన, పార్లమెంటు సభ్యులకు వేతనాలు. ఈ హక్కుల సాధనకై చార్టిస్టులు పార్లమెంటుకు మూడు దఫాలుగా, 1839, 1842, 1849లలో అర్జీలు పెట్టుకున్నారు. కాని ఇవన్నీ తోసివేయబడ్డాయి. – 53.

[56] ధాన్యపు చట్టాల వ్యతిరేక లీగు – 1838లో మాంచెస్టర్ ఫ్యాక్టరీ సొంతదారులైన కాబ్డెన్, బ్రైట్‌లచే స్థాపించబడిన ఇంగ్లీషు పారిశ్రామిక బూర్జువావర్గంయొక్క సంస్థ. వాణిజ్యంలో సంపూర్ణ స్వేచ్ఛ కావాలనే డిమాండుతో ముందుకువచ్చి, అది ధాన్య చట్టాలను రద్దుచేయాలని ప్రయత్నించింది. తద్వారా కార్మికుల వేతనాలను తగ్గించడం, భూస్వామ్య ప్రభువర్గ ఆర్థిక, రాజకీయ పలుకుబడిని బలహీనపరచడం దాని ఉద్దేశం. ధాన్యం చట్టాలు రద్దుచేయబడిన తరువాత (1846) లీగు రద్దుచేయబడింది. – 53.

[57] చార్టిజం – కార్మికుల హీన పరిస్థితుల కారణంగానూ, రాజకీయ హక్కుల అభావం కారణంగానూ ఉత్పన్నమైన బ్రిటిష్ కార్మికుల రాజకీయోద్యమం. ఇది 19వ శతాబ్దపు 30వ దశకంనుండి 50వ దశకం మధ్యవరకు సాగింది. ప్రజల చార్టర్ (ప్రజా కోర్కెల పత్రం)లోని కోర్కెల అమలుకోసం పోరాటం జరపాలన్నది యీ ఉద్యమం యొక్క మూలమంత్రం. చార్టర్‌లో సార్వజనిక ఓటింగు హక్కుకోసం డిమాండూ, కార్మికులకు యీ హక్కును గ్యారంటీ చేసే పలు నిబంధనలూ ఉన్నాయి. లెనిన్

మాటల్లో చార్టిజం "తొలి విస్తృత, రాజకీయంగా సంఘటిత, నిజమైన శ్రామికవర్గ విప్లవాత్మక ప్రజోద్యమం." – 54, 116.

58 1848 ఏప్రిల్ 10న, లండన్‌లో చార్టిస్టులు ఒక ప్రజా ప్రదర్శనను చేశారు. ప్రజా కోర్కెల పత్రాన్ని పార్లమెంటు ఆమోదించాలని కోరుతూ పిటిషన్ ఇవ్వటమే ఈ ప్రదర్శన లక్ష్యం. కాని నిర్వాహకుల ఊగిసలాట, అనిశ్చితత్వాల కారణంగా, ఈ ప్రదర్శన గందరగోళంతో ముగిసింది. ఈ ప్రదర్శన వైఫల్యాన్ని వినియోగించుకొని అభివృద్ధి నిరోధకులు కార్మికులపై దాడిచేశారు. చార్టిస్టులపై నిర్బంధాలను ప్రయోగించారు. – 54.

59 1851 డిసెంబరు 2వ తేదీన లూయీ బోనపార్ట్ రాజకీయ కుట్ర చేశాడు. దానితో రెండవ సామ్రాజ్య పాలన ప్రారంభమైంది. – 54.

60 బ్రదర్ జొనాథన్ – అమెరికాలోని ఇంగ్లీషు వలసలు స్వతంత్రం కొరకు పోరాడుతున్నప్పుడు (1775–83) ఉత్తర అమెరికన్లకు సమష్టిగా ఇంగ్లీషువారు హాస్యంగా పెట్టిన మారుపేరు. – 54.

61 రివైవలిజం – ప్రొటెస్టెంట్ మతంలో ఒక ఉద్యమం. ఇంగ్లండులో 18వ శతాబ్దపు ప్రథమ అర్ధ భాగంలో పుట్టి ఆపిమ్మట ఉత్తర అమెరికాకు వ్యాపించింది. మత ఉపన్యాసాలివ్వటంద్వారాను, విశ్వాసపరులతో కూడిన కొత్త సంఘాలను ఏర్పరచటంద్వారాను, వారు క్రైస్తవ మత పలుకుబడిని బలపరచటానికీ, విస్తృత పరచటానికీ ప్రయత్నించారు. మూడి, సంకే అను ఇద్దరు అమెరికన్ ప్రచారకులు ఈ ఉద్యమ నిర్వాహకులు. – 54.

62 రెండవ పార్లమెంటరీ సంస్కరణ – ఈ సంస్కరణకొరకై ఇంగ్లండులో ఒక ఉద్యమం సాగింది. చివరకు 1867లో కార్మికోద్యమంయొక్క ఒత్తిడి ఫలితంగా ఈ సంస్కరణ ప్రవేశపెట్టబడ్డది. ఈ సంస్కరణోద్యమంలో ఒక ప్రధాన పాత్రను, మొదటి ఇంటర్నేషనల్‌యొక్క జనరల్ కౌన్సిల్ నిర్వర్తించింది. ఈ సంస్కరణ ఫలితంగా ఓటర్ల సంఖ్య రెండింతల కంటె ఎక్కువగా పెరిగింది. నైపుణ్యంగల కార్మికులలో ఒక విభాగానికి ఓటు హక్కు లభించింది. – 56.

63 విగ్గులు – 1680 దశకపు మొదటి సంవత్సరాల్లో ఏర్పడిన ఇంగ్లండులోని పెద్ద రాజకీయ పార్టీ. రాజు అధికారాన్ని పరిమితం చేయాలని కోరిన బడా వ్యాపార, ఫైనాన్సు బూర్జువావర్గంయొక్క, బూర్జువా ప్రభువర్గీయులయొక్క ప్రయోజనాలకు ఈ పార్టీ ప్రాతినిధ్యం వహించింది. 1850 దశకంలో విగ్గులు బూర్జువావర్గంయొక్క ఇతర

రాజకీయ విభాగాలతో చేరి లిబరల్ పార్టీ అను కొత్త పార్టీని ఏర్పరచటంతో ఒక పార్టీగా విగ్గుల అస్తిత్వం ముగిసిపోయింది. – 57.

64 టోరీలు – ఇంగ్లండులో 17వ శతాబ్దం చివర స్థాపించబడిన ఒక రాజకీయ పార్టీ. అది భూస్వామ్య ప్రభువర్గంయొక్క, మతాధికార నిశ్రేణిలో ఉన్నత విభాగంయొక్క ప్రయోజనాలను బలపరచింది. పాత ఫ్యూడల్ సంప్రదాయాలను భుజానవేసుకొని ఉదారవాద, ప్రగతిశీల డిమాండ్లకు వ్యతిరేకంగా పోరాడింది. 19వ శతాబ్ది మధ్యంలో దీనినుండి కన్సర్వేటివ్ పార్టీ రూపొందింది. – 57.

65 కథీడర్ సోషలిజం (విద్యా పీఠపు సోషలిజం) 1870–1890 దశకాల మధ్య బూర్జువా సిద్ధాంతంలోని ఒక ధోరణి. విశ్వవిద్యాలయ ఆసనాలనుండి, సోషలిజం పేరుతో, బూర్జువా సంస్కరణవాదాన్ని బోధించే జర్మన్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు దీనికి ప్రధాన ప్రతినిధులు. (కనుకనే ఈ ధోరణిని వ్యంగ్యంగా కథీడర్ సోషలిజం అన్నారు.) ఈ ప్రొఫెసర్లు (ఎ. వాగ్నెర్, జి. ష్మొలెర్, యల్. బ్రెంటానో, డబ్ల్యు. సోంబర్ట్ తదితరులు) రాజ్యం వర్గాతీత వ్యవస్థ అని వాదించారు. ఇది విరుద్ధవర్గాల ప్రయోజనాలను సమన్వయంచేసి, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు భంగం కలిగించకుండా క్రమంగా, సోషలిజం స్థాపిస్తుందని వీరు వాదించారు. వ్యాధిగ్రస్తులు, ఆకస్మిక ప్రమాదాలకు లోనైన కార్మికులకు భీమా సౌకర్యం కల్పించటం ద్వారాను, ఫ్యాక్టరీ చట్టాలను ఆమోదింప చేయటంద్వారాను, కార్మికుల పరిస్థితిని మెరుగుపరచడం వారి ఉద్దేశం. సుసంఘటితమైన కార్మిక సంఘా లున్నట్లయితే, రాజకీయ పోరాటం, కార్మికవర్గ పార్టీలు అనవసరమని వీరి భావం. రివిజనిజంయొక్క సైద్ధాంతిక ధోరణులలో ఇది ఒకటి. – 57.

66 కర్మకాండవాదం (ritualism) – మొట్టమొదట 1830 దశకంలో చర్చి ఆఫ్ ఇంగ్లండులో ఆవిర్భవించిన ఒక ధోరణి. ఈ ధోరణిని అనుసరించినవారు ఆంగ్లికన్ చర్చిలో కాథలిక్ కర్మకాండను, కొన్ని కాథలిక్ ఛాందస సంప్రదాయాలను పునరుద్ధరించాలని ఆందోళన చేశారు. – 58.

67 కార్మికవర్గం, పేద ప్రజలు నివసించే తూర్పు లండన్ ప్రాంతం ఇక్కడ ప్రస్తావించబడ్డది. – 59.

68 "కమ్యూనిస్టు సూత్రాలు" అను గ్రంథంలో 1847లో ఎంగెల్స్, అభివృద్ధియైన పెట్టుబడిదారీ దేశాలలో ఒకే సమయంలో కార్మిక విప్లవాలు విజయం పొందే అవకా

శమున్నదనే అందుచేత ఒక్క దేశంలోనే కార్మికవర్గ విప్లవం విజయం పొందటం అసాధ్యమనే సూత్రీకరణను ప్రతిపాదించాడు. గుత్తపెట్టుబడిదారీ విధాన పూర్వ దశలో ఈ సూత్రీకరణ సరైనదే. గుత్తపెట్టుబడిదారీ విధానం రూపొందిన నూతన చారిత్రక పరిస్థితులలో లెనిన్ ఒక కొత్త నిర్ణయానికి వచ్చాడు. సామ్రాజ్యవాద దశలో పెట్టుబడిదారీ విధానంయొక్క రాజకీయ, ఆర్థిక అభివృద్ధి అసమానంగా ఉంటుందన్న సూత్రాన్ని లెనిన్ రూపొందించాడు. ఈ పరిస్థితిలో సోషలిస్టు విప్లవం ఒకేసారి పెక్కు దేశాలలోనైనా విజయం పొందవచ్చు, లేక ఒకేఒక్క దేశంలోనైనా జయప్రదం కావచ్చు. అన్ని దేశాలలోనో, లేక అత్యధిక దేశాలలోనో సోషలిస్టు విప్లవాలు ఒకేసారి జయప్రదం కావటం అసంభవమని లెనిన్ వాదించాడు. "యూరప్ సంయుక్త రాష్ట్రాలు అనే వివాదం గురించి" (1915) అనే వ్యాసంలో మొట్టమొదటిసారిగా లెనిన్ ఈ సూత్రీకరణను రూపొందించాడు. – 60.

69 సోషలిస్టు వ్యతిరేక చట్టం (అసాధారణ చట్టం) – 1878 జర్మనీలో బిస్మార్కు ప్రభుత్వంచేత ప్రవేశపెట్టబడినది. కార్మిక సోషలిస్టు ఉద్యమాన్ని వ్యతిరేకించడం యీ చట్టానికి లక్ష్యం. దీనిప్రకారం సోషల్-డెమోక్రట్ల పార్టీ శాఖలన్నీ, కార్మిక సంఘాలన్నీ, కార్మికుల పత్రికలన్నీ నిషేధించబడ్డాయి, సోషలిస్టు సాహిత్యం స్వాధీనం చేసుకోబడింది; సోషల్-డెమోక్రట్లు అన్ని విధాల హింసలకూ గురి అయారు, దేశం నుండి బహిష్కరించబడ్డారు. 1890లో కార్మికోద్యమపు ఒత్తిడివల్లనే సోషలిస్టు వ్యతిరేక చట్టం రద్దుచేయబడింది. – 62, 132.

70 "సోషల్ కాంట్రాక్టు" అనే తన సుప్రసిద్ధ గ్రంథంలో రూసో వివరించిన సూత్రం ప్రకారం, ఆదిమ సమాజంలో మనుషులు సహజ పరిస్థితులలో నివసించేవారు. అప్పుడు వారందరూ సమానంగా ఉండేవారు. వ్యక్తిగత ఆస్తి ఏర్పడటం, ఆస్తుల అసమానతల పెరుగుదల ఫలితంగా, ప్రజలు, సహజ పరిస్థితులనుండి నాగరిక పరిస్థితులకు మారారు. సామాజిక ఒప్పందం ఆధారంగా రాజ్యం రూపొందింది. అయితే ఆ తర్వాత రాజకీయ అసమానతలు పెరిగి, సామాజిక ఒప్పందం భగ్నమైంది. ఎట్టి హక్కులూ లేని ఒక కొత్త పరిస్థితి తలఎత్తింది. నూతన సామాజిక ఒప్పందంపై ఆధారపడిన హేతుపూర్వక రాజ్యంద్వారా ఈ పరిస్థితిని అంతం చేయవచ్చునని రూసో వాదించాడు. – 62.

71 అనబాప్టిస్టులు – వయోజనులు మాత్రమే మత దీక్షకు అర్హులనీ, కనుక పుట్టుకతోనే మత దీక్ష పొందినవారికి తిరిగి మతదీక్ష ఇవ్వాలనీ వాదించే ఒక శాఖ సభ్యులు. వారు

జర్మనీలో 1525 నాటి రైతు యుద్ధంలో గమనీయమైన పాత్ర వహించారు. – 63.

72 "అసలు లెవెలర్లు" ("సమానతపరులు") లేక "డిగ్గర్లు" ("తవ్వేవాళ్లు") అను వారిని ఇక్కడ ఎంగెల్స్ ప్రస్తావిస్తున్నాడు. 17వ శతాబ్దిలోని ఇంగ్లీషు బూర్జువా విప్లవంలో ఉగ్రవాదులకు వీరు ప్రతినిధులు. పట్టణాలలోను, గ్రామాలలోను గల పేదప్రజల ప్రయోజనాలను వీరు బలపరిచారు. వ్యక్తిగత భూస్వామ్య విధానం రద్దుకావాలనీ, ఆదిమ సమానత్వ కమ్యూనిజం కావాలనీ డిమాండుచేశారు. ఉమ్మడి భూములను సమిష్టిగా సాగుచేయడంద్వారా ఈ సూత్రాలను అమలుపరచాలని వీరు ప్రయత్నించారు. – 63.

73 ఊహాజనిత కమ్యూనిజంయొక్క ప్రముఖ సిద్ధాంతవేత్తలైన థామస్ మూర్ రచించిన "ఊహాస్వర్గం," థామస్ కాంపనెల్లా రచించిన "ఆదిత్య నగరం" అనే గ్రంథాలను ఎంగెల్స్ ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు. – 63.

74 డైరెక్టరేట్ – 1795–99 మధ్యలో ఫ్రాన్సులో ప్రధానమైన కార్యనిర్వాహక సంస్థ. దానిలో అయిదుగురు డైరెక్టర్లుంటారు. ఇందులో ఒకరిని ప్రతి సంవత్సరమూ ఎన్నుకుంటారు. ఈ సంస్థ ప్రజాతంత్ర ఉద్యమాన్ని వ్యతిరేకించింది. ఈ ఉద్యమానికి వ్యతిరేకంగా ప్రయోగింపబడిన భయానక పాలనను బలపరచింది. బడా బూర్జువా ప్రయోజనాలను కాపాడింది. – 64, 67.

75 "స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం" అనే ఫ్రెంచి బూర్జువా విప్లవం ప్రముఖ నినాదం ఇక్కడ ప్రస్తావించబడ్డది. – 65.

76 న్యూలనార్క్" – స్కాటిష్ పట్టణమైన లనార్క్ వద్ద నిర్మితమైన పత్తి నూలు మిల్లు. ఒక చిన్న పట్టణంతోపాటు, ఇది 1784లో నిర్మితమైంది. – 65.

77 "మూడవ ఎస్టేటు – ఫ్యూడల్ ఫ్రాన్సులో తక్కువ సౌకర్యాలుగల వర్గం (రైతులు, వ్యాపారస్తులు, చేతివృత్తులవారు, ఆపిమ్మట బూర్జువావర్గం). 18వ శతాబ్దపు ఫ్రెంచి విప్లవానికి ముందు ఈ మాట ప్రత్యేక ప్రాధాన్యతను పొందింది. ప్రజా సహకారం అవసరమై బూర్జువావర్గం, ఫ్యూడల్ ప్రభువులయొక్క, మతాధిపతులయొక్క ప్రత్యేక సౌకర్యాలకు వ్యతిరేకంగా తన చుట్టూ ప్రజలను ఒకేఒక "మూడవ ఎస్టేటు" రూపంలో సమీకరించింది. – 67.

78 నూరు రోజులు – నెపోలియన్ అధికారం తాత్కాలికంగా పునః స్థాపితమైన కాలం.

ఎల్బా దీవిలోని ప్రవాసంనుండి పారిస్‌కు, 1815 మార్చి 20న తిరిగి వచ్చి, తిరిగి అదే సంవత్సరం జూన్ 22న అతను పదవీత్యాగం చేసేంతవరకు గడచిన కాలం. – 69.

[79] వాటర్లూ – బ్రస్సెల్స్ సమీపంలోని ఒక స్థలం. ఇక్కడ 1815 జూన్ 18న, మొదటి నెపోలియన్ అంతిమ పరాజయానికి గురయ్యాడు. ఆ యుద్ధంలో ఆంగ్లో డచ్చి సైన్యాలకు వెల్లింగ్‌టన్, ప్రష్యన్ సైన్యాలకు బ్లూహెర్ నాయకత్వం వహించారు. – 69.

[80] గ్రేట్ బ్రిటన్ – ఐర్లెండుల బృహత్తర జాతీయ సంఘటిత ట్రేడ్ యూనియన్‌లు – 1833 అక్టోబరులో లండన్‌లో జరిగిన సహకార సంఘాల, ట్రేడ్ యూనియన్ల కాంగ్రెసులో ఈ సంఘటన అధికార పూర్వకంగా నెలకొల్పబడింది. రాబర్ట్ ఓవెన్ ఆ సభకు అధ్యక్షత వహించాడు. బూర్జువా సమాజం, ప్రభుత్వంయొక్క తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన్న మీదట, ఈ సంఘటన ఆగస్టు 1834లో రద్దుగావించబడ్డది. – 74.

[81] ఇంగ్లండులోని పెక్కు నగరాలలో, ఓవెన్ అనుకూల సహకార సంఘాల కార్మికులచే స్థాపించబడిన, శ్రమోత్పాదిత వస్తువులను సరసమైన ధరకు మార్పిడిచేసే మార్కెట్లు (Equitable Labour Exchange Bazaars) అనబడే వాటిని ఎంగెల్స్ ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు. ఈ మార్కెట్లలో శ్రమోత్పాదిత వస్తువులను లేబర్ నోట్లద్వారా మారకంచేసేవారు. ఈ నోట్లను ఒక గంట పని కాలం ప్రాతిపదికపై వెల కట్టేవారు. అయితే ఈ మార్కెట్లు అతి త్వరలో దివాళా తీశాయి. – 74.

[82] చిన్న ఉత్పత్తిదారుల మధ్య డబ్బు అవసరం లేకుండా సరుకుల మార్పిడి చేసుకునేందుకు, కార్మికులకు ఉచిత రుణం కలిగించేందుకు తోడ్పడే ప్రత్యేక బ్యాంకును ఏర్పరచేందుకు 1848–49లో విప్లవ కాలంలో ప్రూడన్ ఒక ప్రయత్నం చేశాడు. 1849 జనవరి 31న అతడు ఏర్పరచిన "ప్రజా బ్యాంకు" దాదాపు రెండు నెలలు పనిచేసింది. అది పని ప్రారంభించక ముందే, దాని వైఫల్యం స్పష్టమైపోయింది. ఏప్రిల్ మొదట్లో ఈ బ్యాంకు మూసివేయబడింది. – 74.

[83] క్రీ. పూ. మూడవ శతాబ్దంనుండి, క్రీ. త. ఏడవ శతాబ్దంవరకు గల కాలం ఇక్కడ ప్రస్తావించబడ్డది. చరిత్రలో దీనిని అలెగ్జాండ్రియన్ దశ అంటారు (ఆ కాలంలో అంతర్జాతీయ వ్యాపారానికి ప్రధాన కేంద్రమైన అలెగ్జాండ్రియా నగరం కారణంగా ఈ పేరు ఏర్పడ్డది). ఈ దశలో గణితశాస్త్రం, యంత్రగతిశాస్త్రం, భూగోళశాస్త్రం,

ఖగోళశాస్త్రం, శరీర నిర్మాణశాస్త్రం, శరీరశాస్త్రం — వంటి అనేక విజ్ఞాన విభాగాలలో త్వరితగతిన అభివృద్ధి సాగింది. — 77.

84 15వ శతాబ్దపు రెండవ భాగంనుండి, 17వ శతాబ్దపు మొదటి భాగంవరకు, యూరపియన్ వ్యాపారస్తులు, నావికులు చేసిన గొప్ప ఆవిష్కరణలు ఇక్కడ ప్రస్తావించబడ్డాయి. వీనిలో అతిముఖ్యమైనవి అమెరికా, ఆస్ట్రేలియాల ఆవిష్కరణ, ఆఫ్రికా చుట్టూ తిరిగి భారతదేశానికి సముద్ర మార్గం కనుక్కోవడం. భౌగోళికమైన ఈ గొప్ప ఆవిష్కరణలు ఫ్యూడలిజం పతనానికి తోడ్పడి, పశ్చిమ యూరప్‌లో పెట్టుబడిదారీ సంబంధాలు త్వరితగతిన అభివృద్ధి కావటానికి తోడ్పడ్డాయి. — 91.

85 యూరపియన్ రాజ్యాలు కూటములుగా ఏర్పడి ఇండియా అమెరికాలతో వాణిజ్యంలో ఆధిపత్యంకోసమూ, వలస మార్కెట్లను వశంచేసుకునేందుకూ ఈ యుద్ధాలు సాగించాయి. మొదట్లో పోటీపడిన ప్రధాన దేశాలు హాలండూ, ఇంగ్లండూ. తరువాత నిర్ణయాత్మకమైన పోరాటం ఇంగ్లండు, ఫ్రాన్సుల మధ్య జరిగింది. ఇతర దేశాలమీద ఇంగ్లండుది పైచెయ్యి అయింది. 18వ శతాబ్ది ఆఖరికి ప్రపంచ వాణిజ్యమంతా ఇంగ్లండు చేతుల్లో కేంద్రీకరింపబడింది. — 92.

86 రాయల్ మారిటైమ్ కంపెనీ (Seehandlung — సముద్ర వర్తకం) — 1772లో ప్రష్యాలో ఏర్పడిన వర్తక, రుణ సహాయక సంస్థ. ఇది ముఖ్యమైన ప్రభుత్వ సౌకర్యాలను అనుభవించింది. ప్రష్యన్ ప్రభుత్వానికి భారీ ఎత్తున రుణాలను ఇచ్చింది. — 98.

87 "Vorwärts" ("పదండి ముందుకు") — ఇదొక జర్మన్ పత్రిక. ఇది పారిస్‌లో 1844 జనవరినుండి డిసెంబరువరకు, ద్వైవార పత్రికగా వెలువడింది. దీనికి రచనలు పంపినవారిలో మార్క్స్, ఎంగెల్సులు కూడ వున్నారు. — 109, 115.

88 ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ (మొదటి ఇంటర్నేషనల్) — శ్రామికవర్గం యొక్క తొలి అంతర్జాతీయ ప్రజా సంఘం, దీనికి మార్క్స్, ఎంగెల్సులు నాయకత్వం వహించారు (1864–76). ఇది, శాస్త్రీయ సోషలిస్టు భావాలను ప్రముఖ పెట్టుబడిదారీ దేశాల అగ్రగామి కార్మికుల అందుబాటులోకి తీసుకెళ్ళి, లెనిన్ చెప్పినట్లు "పెట్టుబడిపై విప్లవ దాడికై సన్నద్ధులు కావడానికిగాను, కార్మికుల అంతర్జాతీయ సంస్థకు పునాది వేసింది." — 110.

89 ఎంగెల్స్ "కమ్యూనిస్టు లీగు చరిత్రను గురించి" అన్న తన యీ వ్యాసాన్ని, మార్క్స్ రచించిన "కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసు బండారం" అనే చిన్న పుస్తకం జర్మన్

ముద్రణకు ఉపోద్ఘాతప్రాయంగా రచించాడు. సోషలిస్టు వ్యతిరేక చట్టం (69వ వివరణ చూడండి) అమల్లోవున్న దశలో, 1849–52 నాటి ప్రగతినిరోధక శక్తుల విజృంభణ దశకు సంబంధించిన విప్లవానుభవాన్ని గురించి జర్మన్ కార్మికవర్గం తెలుసుకోవడం అవసరమైంది. అందుకనే మార్క్స్ రచించిన యీ చిన్న పుస్తకాన్ని పునర్ముద్రించడం అవసరమని ఎంగెల్స్ భావించాడు.

అంతర్జాతీయ కార్మికోద్యమంలో, చరిత్రలో ప్రప్రథమ పర్యాయం శాస్త్రీయ కమ్యూనిజమే తన సైద్ధాంతికాయుధమని బాహాటంగా ప్రకటించిన మొట్టమొదటి అంతర్జాతీయ కార్మికవర్గ సంఘంయొక్క చారిత్రక పాత్రనూ, స్థానాన్నీ ఎంగెల్స్ తన యీ రచనలో నొక్కిచెప్పాడు. శ్రామికవర్గ పార్టీ స్థాపనకోసం జరిగిన పోరాటంలో ఒక ముఖ్య దశను సూచించే కమ్యూనిస్టు లీగు అనుభవాన్ని ఆధారంచేసుకొని, వివిధ ఒంటెత్తువాదధోరణులపై మార్క్సిజం విజయానికి, లీగు ఆవిర్భావదినం నాటినుంచీ, శ్రామికవర్గపు విప్లవ పోరాటావసరాలన్నింటినీ ప్రతిబింబించగల దాని సామర్థ్యమూ, మార్క్సిస్టు సిద్ధాంతం ఆ విప్లవ పోరాటపు అవిభాజ్య భాగం కావడమూ కారణమని ఎంగెల్స్ నిరూపించాడు. – 111.

90 బబూవిజం – 18వ శతాబ్దపు ఫ్రెంచి విప్లవవాది గ్రాఖ్ బబేఫ్, ఆయన అనుచరులూ ప్రతిపాదించిన ఊహాజనిత సమానత్వవాద కమ్యూనిజం. – 112.

91 Société des saisons ("రుతువుల సంఘం") – ఇదొక రిపబ్లికన్, సోషలిస్టు కుట్రదారీ సంఘం. ఈ సంఘం 1837నుంచి 1839వరకు, బ్లాంకీ, బర్బేన్‌ల నాయకత్వాన పనిచేసింది.

1839 మే 12నాటి పారిస్ తిరుగుబాటు – దీనిలో విప్లవకర కార్మికులు ప్రధాన పాత్ర వహించారు. ఈ తిరుగుబాటుకు "రుతువుల సంఘమే" సన్నాహం చేసింది. ప్రజానీకపు తోడ్పాటు పొందని యీ తిరుగుబాటు ప్రభుత్వ సేనలచేతా, నేషనల్ గార్డుచేతా ఓడింపబడింది. – 112.

92 జర్మన్ ప్రజాతంత్రవాదులు దేశంలోని ప్రగతినిరోధకులతో జరిపిన పోరాటానికి సంబంధించిన ఒక ఘటనకిది ప్రస్తావన. దానికి ఫ్రాంక్‌ఫుర్ట్ కుట్ర ప్రయత్నం అని పేరు వచ్చింది. రాజకీయ కుట్ర నిర్వహించి, తద్వారా జర్మన్ రిపబ్లిక్‌ను ప్రకటించే ఉద్దేశంతో, తీవ్రవాదుల బృందమొకటి 1833 ఏప్రిల్ 3న, ఫ్రాంక్‌ఫుర్ట్-ఆమ్-మెయిన్‌లో ఫెడరల్ అసెంబ్లీకి వ్యతిరేకంగా ఒక ప్రదర్శన జరిపారు.

పటిష్ఠంగా నిర్వహింపబడని యీ రాజకీయ కుట్ర జర్మన్ సేనలచేత అణచివెయ్య బడింది. – 113.

93 ఇటాలియన్ బూర్జువా ప్రజాతంత్రవాది జూసెప్పె మజ్జీనీ, 1831లో తను స్థాపించిన "తరుణ ఇటలీ"యొక్క, ఒక విప్లవవాద ప్రవాసుల బృందంయొక్క తోడ్పాటుతో, 1834 ఫిబ్రవరిలో స్విట్జర్లాండునుండి సవోయ్‌కి (అది సార్డీనియా రాజ్యానికి – ప్యేమొంట్‌కి – చెందేది) ఒక దండయాత్రను నిర్వహించాడు. ఇటాలియన్ ఐక్యతపేర ఒక ప్రజా తిరుగుబాటును ప్రారంభించడం, స్వతంత్ర బూర్జువా ఇటాలియన్ రిపబ్లిక్‌ను నెలకొల్పడమే ఆ బృందం లక్ష్యం. ఆ బృందం సవోయ్‌లో ప్రవేశించగానే, ప్యేమొంట్ సేనలు దాన్ని ఛిన్నాభిన్నం చేశాయి. – 113.

94 "డెమగోగ్‌లు" (ప్రజావక్తలు) – 19వ శతాబ్ది 20 దశకంలో ప్రతిపక్ష ఉద్యమంలో పాల్గొన్న జర్మన్ మేధావివర్గంవారు; వారు జర్మన్ రాష్ట్రాల అభివృద్ధినిరోధక వ్యవస్థను వ్యతిరేకించి, జర్మనీని ఐక్యపరచాలని డిమాండు చేశారు. వారు అభివృద్ధినిరోధక అధికారులచేత హింసింపబడ్డారు. – 113.

95 లండన్‌లోని జర్మన్ కార్మిక ఎడ్యుకేషనల్ సొసైటీకి యిది ప్రస్తావన. కార్ల్ షాప్పెర్, యోసెఫ్ మోల్, న్యాయాత్ముల లీగు యితర నాయకులూ కలిసి 1840 ఫిబ్రవరిలో దీన్ని స్థాపించారు. 1849, 1850 సంవత్సరాల్లో మార్క్స్, ఎంగెల్సులు దీని కార్యకలాపాల్లో చురుకైన పాత్ర వహించారు. ఈ సొసైటీ సభ్యుల్లో ఒక పెద్ద విభాగం విల్లిహ్ – షాప్పెర్లకు చెందిన ఒంటెత్తువాద, దుందుడుకువాద ముఠా పక్షం వహించిన కారణంగా, 1850 సెప్టెంబరు 17న మార్క్స్, ఎంగెల్సులూ, వారి అనుచరులూ యీ సొసైటీనుండి వైదొలగారు. 1864లో ఇంటర్నేషనల్ స్థాపింపబడటంతో, ఈ సొసైటీ లండన్‌లోని ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌యొక్క జర్మన్ విభాగమైంది. లండన్ ఎడ్యుకేషనల్ సొసైటీ 1918లో బ్రిటిష్ ప్రభుత్వంచేత మూసివెయ్యబడేటంతవరకు వుంది. – 115.

96 ఫ్రాన్సులో 1848 నాటి ఫిబ్రవరి విప్లవానికి ప్రస్తావన ఇది. – 119.

97 "The Northern Star" ("ధ్రువ నక్షత్రం") – 1837లో నెలకొల్పబడిన యీ ఇంగ్లీషు వారపత్రిక, చార్టిస్టులయొక్క కేంద్ర పత్రిక. 1844 నవంబరుదాకా లీడ్స్‌లోనూ, 1844 నవంబరునుండి 1852దాకా లండనులోనూ అది ప్రచురింపబడింది. 1843–1850 మధ్య ఎంగెల్స్ వ్యాసాలను యీ పత్రిక ప్రచురించింది. – 119.

98 ప్రజాతంత్ర సంఘం – బ్రస్సెల్స్‌లో 1847 ఆకురాలుకాలంలో స్థాపింపబడిన యీ సంఘం, శ్రామికవర్గ విప్లవవాదులను, ముఖ్యంగా జర్మన్ విప్లవవాద ప్రవాసులను, బూర్జువా, పెటీబూర్జువా ప్రజాతంత్రవాదులకు చెందిన ప్రగతిశీల విభాగాలను ఐక్య పరచింది. ఈ సంఘం స్థాపనలో మార్క్స్, ఎంగెల్సులు ప్రముఖ పాత్రను వహించారు. 1847 నవంబరు 15న బెల్జియన్ ప్రజాతంత్రవాది ఎల్. జొట్రాన్ దాని అధ్యకుడుగానూ, మార్క్స్ దాని ఉపాధ్యకుడుగానూ ఎన్నికయ్యారు. మార్క్స్ కృషి ఫలితంగా బ్రస్సెల్స్ ప్రజాతంత్ర సంఘం అంతర్జాతీయ ప్రజాతంత్ర ఉద్యమానికొక ముఖ్య కేంద్రమైంది. 1848 మార్చి మొదట్లో మార్క్స్ బ్రస్సెల్స్‌నుండి వెళ్లగొట్టబడిన దరిమిలా, బెల్జియన్ అధికారులు ఆ సంఘానికి చెందిన అత్యంత విప్లవవాద శక్తులను అణచివేసిన తర్వాత దాని కార్యకలాపాలు మరింత పరిమితమూ, పూర్తిగా స్థానికమూ అయిన స్వభావాన్ని సంతరించుకొని, 1849లో అది మూత పడింది. – 119.

99 "Der Volks-Tribun" ("ప్రజా వక్త") – జర్మన్ "అసలు సోషలిస్టుల"చేత ప్రారంభింపబడిన న్యూయార్కు వారపత్రిక. 1846 జనవరి 5కీ – డిసెంబరు 31కీ మధ్య యిది వెలువడింది. – 120.

100 "జర్మనీలో కమ్యూనిస్టు పార్టీ డిమాండ్లు" – పారిస్‌లో 1848 మార్చి 21–29 మధ్య, మార్క్స్ ఎంగెల్సులచేత రచింపబడిన కరపత్రం. కమ్యూనిస్టు లీగుకూ జర్మనీలో ఆరంభమైన విప్లవానికీ యిదొక రాజకీయ వేదిక. ఈ విధానపత్రం తమతమ స్వదేశాలకు తిరిగివెళ్లే లీగు సభ్యుల మధ్య పంచబడింది. ఈ విప్లవక్రమంలో మార్క్స్, ఎంగెల్సులూ, వారి అనుయాయులూ యీ పత్రంలోని అంశాలను ప్రజలమధ్య ప్రచారంచేశారు. – 124.

101 కమ్యూనిస్టు లీగు చొరవతో, 1848 మార్చి 8–9 తేదీల్లో పారిస్‌లో తెరవబడిన జర్మన్ కార్మికుల క్లబ్బుకు యిది ప్రస్తావన. ఈ క్లబ్బులో మార్క్స్ ప్రముఖ పాత్ర వహించాడు. పారిస్‌కు ప్రవాసులుగా వచ్చిన జర్మన్ కార్మికులను సంఘటితపరచడం, రాబోయే బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో శ్రామికవర్గంయొక్క ఎత్తుగడలను వారికి వివరించడమే యీ క్లబ్బు లక్ష్యం. – 126.

102 మార్క్స్ రచించిన "కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసు బండారం"యొక్క 1885 నాటి ముద్రణలో, ఎంగెల్స్‌చేత ఉపోద్ఘాతప్రాయంగా రచింపబడిన యీ వ్యాసం వుంది. 1850 మార్చి, జూన్ మాసాల్లో కమ్యూనిస్టు లీగుకు కేంద్ర కమిటీ విజ్ఞప్తులు కూడ యిందులో వున్నాయి. – 129.

103 ప్రోగ్రెసిస్టులు (ప్రగతివాదులు) – 1861 జూన్‌లో నెలకొల్పబడిన ప్రష్యన్ బూర్జువా ప్రోగ్రెసివ్ పార్టీ ప్రతినిధులు. ప్రష్యా అధినాయకత్వంలో జర్మనీ ఐక్యమొనర్చబడాలనీ, అఖిల జర్మన్ పార్లమెంటు సమావేశపరచబడాలనీ, ప్రతినిధుల సభకు బాధ్యమైన పటిష్ఠమైన లిబరల్ మంత్రివర్గమొకటి ఏర్పరచబడాలనీ ఈ పార్టీ డిమాండ్‌చేసింది. 1866లో యీ పార్టీకి చెందిన మితవాదపక్షం బిస్మార్కు ముందు దాసోహమని, పార్టీనుంచి చీలిపోయి, నేషనల్ లిబరల్ పార్టీగా ఏర్పడింది. నేషనల్ లిబరల్సు మాదిరిగా కాకుండా 1871లో జర్మనీ ఐక్యమొనర్చబడిన తర్వాత కూడా ప్రోగ్రెసిస్టుల ప్రతిపక్ష పార్టీ పాత్ర వహించారు; కాని ప్రసంగాల రంగానికి మాత్రమే వారి పాత్ర పరిమితమైంది. కార్మికవర్గమంటే తమకు గల భయంకొద్దీ, సోషలిస్టు ఉద్యమంపట్ల గల శత్రుభావంకొద్దీ, ప్రోగ్రెసివ్ పార్టీ జర్మనీలోని అర్ధ నిరంకుశ పరిస్థితుల్లో, ప్రష్యన్ బడా భూస్వాముల పాలనతో సమాధానపడింది. పార్టీ నాయకత్వపు ఊగిసలాటతో కూడిన ప్రవర్తన – అది ఎవరి తోడ్పాటుపై ఆధారపడుతుందో – ఆ వాణిజ్య బూర్జువా వర్గంయొక్క, సన్నకారు పారిశ్రామికవేత్తలయొక్క, వృత్తి నిపుణులయొక్క ఊగిసలాటను ప్రతిబింబిస్తుంది. 1884లో ప్రోగ్రెసిస్టులు నేషనల్ లిబరల్సుయొక్క వామపక్షంలో చేరి, జర్మన్ స్వేచ్ఛాయుత ఆలోచనాపరుల పార్టీని నెలకొల్పారు. – 131.

104 ప్రత్యేక లీగు (Sonderbund) – విల్లిఖ్–షాప్పెర్‌ల నాయకత్వాన గల ఒంటెత్తువాద, దుస్సాహసిక గ్రూపుకి మార్క్సు ఎంగెల్సులు పెట్టిన వ్యంగ్యనామం. వారు యీ పేరును 1840 దశకంలో స్విట్జర్లాండులో వున్న ప్రగతినిరోధక కేథలిక్ కాంటన్ల (జిల్లాల) ప్రత్యేక యూనియన్‌కి సాదృశ్యంగా గ్రహించారు. 1850 సెప్టెంబరు 15 చీలిక అనంతరం కమ్యూనిస్టు లీగునుంచి వేరుపడిన ఈ గ్రూపు సొంత కేంద్ర కమిటీని కలిగిన ఒక స్వతంత్ర సంఘంగా ఏర్పడింది. ఈ సంఘం తన కార్యకలాపాలద్వారా, జర్మనీలోని కమ్యూనిస్టు లీగుయొక్క చట్టవిరుద్ధ శాఖల ఆచూకీ తెలుసుకోడానికి ప్రష్యన్ పోలీసులకు తోడ్పడింది. 1852లో కొలోన్‌లో కమ్యూనిస్టు లీగుయొక్క ప్రముఖ నాయకులపైన జరిగిన విచారణలో, వారికి వ్యతిరేకంగా దొంగ సాక్ష్యాలను బనాయించడానికి ప్రష్యన్ పోలీసులకు యిది అవకాశం కల్పించింది. – 132.

105 "కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం" – మార్క్సిస్టు సిద్ధాంతపు మౌలిక రచనల్లో యిది ఒకటి. ఈ పుస్తకం మానవజాతి అభివృద్ధియొక్క తొలి దశలకు సంబంధించిన శాస్త్రీయ విశ్లేషణను సమకూరుస్తుంది. ఆదిమ సమిష్టి వ్యవస్థ విచ్ఛిత్తిక్రమాన్నీ, సొంత ఆస్తి ప్రాతిపదికపై వర్గసమాజం రూపొందిన క్రమాన్నీ వెల్లడిస్తుంది, ఈ సమాజపు సాధారణ లక్షణాలను రేఖామాత్రంగా చిత్రిస్తుంది,

విభిన్న సామాజిక ఆర్థిక నిర్మాణ రూపాల్లో కుటుంబ సంబంధాల విశిష్ట లక్షణాలను వివరిస్తుంది, రాజ్యావిర్భావాన్నీ, సారాంశాన్నీ వెల్లడించి, వర్గరహిత కమ్యూనిస్టు సమాజంయొక్క అంతిమ విజయంతో రాజ్యం డుల్లిపోవడానికి సంబంధించిన చారిత్రక అనివార్యతను నిరూపిస్తుంది.

ఎంగెల్స్ ఈ పుస్తకాన్ని, 1884 మార్చి నెలాఖరుకీ – మే నెలాఖరుకీ మధ్యగల రెండు నెలల కాలవ్యవధిలో రచించాడు. మార్క్స్‌యొక్క రాత్రపతులను వర్గీకరించే క్రమంలో, ల్యూయిస్ మోర్గన్ రచించిన "ప్రాచీన సమాజం"యొక్క సారసంగ్రహం – దీన్ని మార్క్స్ 1880–81లో తయారుచేసుకున్నాడు – ఎంగెల్స్‌కి దొరికింది. ఈ సారసంగ్రహంలో మార్క్స్ రాసుకున్న సవిమర్శక వివరణలు, సొంత ప్రాతిపదికలూ, వీటికితోడు యితర గ్రంథాధారాలనుంచి సేకరించిన అదనపు సమాచారం కూడా వున్నాయి. ప్రగతిశీల అమెరికన్ పండితుని గ్రంథ సంగ్రహాన్ని పరిశీలించి, మోర్గన్ గ్రంథం, చరిత్రకు సంబంధించి తనయొక్క, మార్క్స్‌యొక్క భౌతికవాద అవగాహననూ, ఆదిమ సమాజానికి సంబంధించిన తమ అభిప్రాయాలనూ రూఢిపరుస్తోందని గ్రహించినమీదట, యీ అంశంపై తానొక ప్రత్యేక గ్రంథం రాయడం అవసరమని ఎంగెల్స్ భావించాడు. మార్క్స్ వివరణలనే కాకుండా, ఆయన సూత్రీకరణలనూ, మోర్గన్ గ్రంథంనుండి వాస్తవిక సమాచారాన్ని కూడా ఎంగెల్స్ స్వీకరించాడు. తన యీ రచనను, మార్క్స్ మరణశాసనంయొక్క, తుది ఆదేశంయొక్క పాక్షిక పాలనగా ఎంగెల్స్ పరిగణించాడు. గ్రీసు, రోముల చరిత్రను గురించి, ప్రాచీన ఐర్లండును గురించి, ప్రాచీన జర్మన్లు వగైరాలను గురించి తన అధ్యయనంద్వారా విశేషంగా లభించిన అదనపు సమాచారాన్ని ఎంగెల్స్ తన యీ గ్రంథరచనలో వినియోగించుకున్నాడు.

ఆదిమ సమాజాన్ని గురించి విస్తారమైన సమాచార సేకరణానంతరం, 1890లో, తన పుస్తకంయొక్క కొత్త, నాల్గవ ముద్రణను ఎంగెల్స్ తయారుచేశాడు. తన ప్రాథమిక పరిశోధన క్రమంలో కొత్తగా వెలువడిన సాహిత్యాన్నంతటినీ, ప్రత్యేకించి రష్యన్ విజ్ఞానశాస్త్రజ్ఞుడు ఎమ్. కొవలేవ్‌స్కీ రచనలను ఆయన అధ్యయనంచేసి, తన గ్రంథ మూలపాఠంలో, ప్రత్యేకించి కుటుంబానికి సంబంధించిన ప్రకరణంలో పలు మార్పులు చేశాడు, విస్తారమైన చేర్పులు చేశాడు.

ఎంగెల్స్ గ్రంథంయొక్క సంస్కరింపబడిన, నాలుగవ ముద్రణ ష్టుట్‌గార్ట్‌లో 1891 సంవత్సరాంత్యప్రాంతంలో వెలువడింది, అటుతర్వాత దానిలో ఎటువంటి మార్పులూ చెయ్యబడలేదు. – 134.

106 "Contemporanul" ("సమకాలికుడు") – సోషలిస్టు ధోరణికి చెందిన రుమేనియన్ పత్రిక. ఇది 1881–90 మధ్య యాస్సి అనే పట్టణంలో ప్రచురింపబడింది. – 137.

107 బైబిల్ మొదటి అయిదు పుస్తకాలు. – 138.

108 1888 ఆగస్టు – సెప్టెంబరు మాసాల్లో ఎంగెల్స్ అమెరికా కెనడాలలో పర్యటించాడు. – 148.

109 మధ్యాసియాలోని అమూదర్యా, సిర్‌దర్యా నదులకు ప్రాచీనకాలంలో గ్రీక్ పేరు. దోన్, ద్నీపర్ నదులు – ఈనాటి సోవియట్ ఉక్రెయిన్‌లో ఉన్నాయి. – 156.

110 మార్క్స్ రాసిన యీ లేఖ పదిలపరచబడలేదు. – 168.

111 రీహర్డ్ వాగ్నెర్ రచించిన "నిబెలుంగ్ వలయం" అనే నాలుగు భాగాల సంగీత రూపకానికి యిది ప్రస్తావన. ఈ రూపకానికి విషయవస్తువు స్కాండినేవియన్ మహాకావ్యమైన "ఎద్ద"నుంచీ, జర్మన్ మహాకావ్యమైన "నిబెలుంగ్ల వీరగాథ"నుంచి గ్రహింపబడింది. – 168.

112 "ఎద్ద," "ఓగిస్‌ద్రెక్క" – ప్రాచీన పౌరాణిక కథల, స్కాండినేవియన్ ప్రజల వీరగాథా పదాల సంపుటం. – 168.

113 ఆసా, వానా – ఇవి స్కాండినేవియన్ పురాణాలలోని రెండు దేవతా బృందాలు. పురాతన కాలంనుండి 12వ శతాబ్దంవరకు నార్వేజియన్ రాజులను గురించి మధ్యయుగపు ఐస్‌లాండ్ కవీ, కైఫీయతుదారూ అయిన స్నోరి స్టూర్లుసాన్ రచించిన గ్రంథంలో "యూంగ్లింగ వీరగాథ" మొదటి కైఫీయతు. – 169.

114 అత్యధిక సంఖ్యాక ఆస్ట్రేలియన్ ఆదివాసి తెగలలోని ప్రత్యేకమైన గుంపులకు యిది ప్రస్తావన. ప్రతి ఒక గుంపుకు చెందిన పురుషులూ ఒక నిర్దిష్టమైన గుంపుకు చెందిన స్త్రీలను పెళ్లిచేసుకోగలుగుతారు. ప్రతి ఒక తెగలోనూ అటువంటి గుంపులు 4నుండి 8దాకా వుంటాయి. – 173.

115 శతుర్నాలియులు – విశృంఖల విలాసపూరితమైన విందులు – ప్రాచీనకాలపు రోమ్ నగరంలో డిసెంబరు మధ్యలో పంటలు చేతికివచ్చే సందర్భంగా శనిదేవత పండుగ జరుపబడేది. ఈ పండుగ సందర్భంగా జనానికి స్త్రీపురుష సంభోగ స్వేచ్ఛ వుండేది. ఇప్పుడీ శతుర్నాలియ అనే పదం విశృంఖల ఉన్మత్త విలాస క్రీడలకు పర్యాయపదమైంది. – 182.

116 L. H. Morgan, "Ancient Society," London, 1877, pp. 465-66. – 190.

117 అదే గ్రంథం, పేజి 470. – 190.

118 యారొస్లావ్ "ప్రావ్ద" ప్రాచీన రష్యాయొక్క శిక్షాస్మృతి అయిన "రష్యన్ ప్రావ్ద" పాత ప్రతిలోని మొదటి భాగం. ఆ సమాజపు సామాజికార్థిక సంబంధాలను ప్రతిబింబించిన సాంప్రదాయిక న్యాయం ప్రాతిపదికపైన యీ శిక్షాస్మృతి 11, 12 శతాబ్దాల్లో వెలువడింది.

దాల్మాటియన్ చట్టాలు – 15–17 శతాబ్దాలలో పోలిత్స్‌లో (దాల్మాటియాలో ఒక భాగం) అమల్లో వున్నాయి. వాటికి పోలిత్స్ న్యాయ సంహిత అని పేరు. – 192.

119 Calpulli (కాల్‌పుల్లీ) – మెక్సికోను స్పానిష్‌వారు ఆక్రమించుకున్ననాటికి మెక్సికన్ ఇండియన్లలో వున్న సమష్టి కుటుంబం (calpulli). ఉమ్మడి పూర్వీకులను కలిగిన ప్రతి ఒక సమష్టి కుటుంబమూ ఉమ్మడి భూఖండాన్ని కలిగివుంటుంది. ఈ భూఖండాన్ని అన్యాక్రాంతం చెయ్యడంగాని, వారసులమధ్య పంపిణీ చెయ్యడంగాని నిషిద్ధం. – 192.

120 "Das Ausland" ("విదేశాలు") – భూగోళ, మానవ జాతుల పరిశోధన శాస్త్రాలకూ, ప్రకృతి విజ్ఞానశాస్త్రానికీ సంబంధించిన జర్మన్ పత్రిక. ఇది 1828–93 మధ్య ప్రచురింపబడింది. – 192.

121 స్పార్టన్లు – ప్రాచీన స్పార్టాలో పూర్తి పౌర హక్కులు అనుభవించే పౌరులలో ఒక తరగతివారు.

ఇలాట్లు – ప్రాచీన స్పార్టా నివాసులలో హక్కుల్లేని ఒక తరగతి పౌరులు. వీరు భూమికి బంధితులు. వీరు స్పార్టన్ భూస్వాములకు కప్పం చెల్లించవలసివుండేది. – 196.

122 అరిస్టోఫనిస్ "ఫెస్మొఫోరియా ఉత్సవంలో ఆడవాళ్లు." – 196.

123 హైరోదులిలు – ప్రాచీన గ్రీసులోనూ, గ్రీకు వలసల్లోనూ దేవాలయాల్లో వుండే స్త్రీ, పురుష బానిసలు. ఆసియా మైనర్, కోరింథ్‌లతోబాటు పలు ప్రాంతాల్లో స్త్రీ బానిసలు వ్యభిచార వృత్తిలో వుండేవారు. – 199.

124 "గుద్రున్" – 13వ శతాబ్దంనాటి ఒక జర్మన్ వీరగాథ. – 210.

125 1519–21 సంవత్సరాల్లో స్పానిష్ వలసవాదులచేత మెక్సికో ఆక్రమణకు యిది ప్రస్తావన. – 223.

126 "తటస్థ జాతులు" – 17వ శతాబ్దంలో ఏర్పడిన ఇండియన్ తెగల సైనిక మైత్రీ కూటమి. ఇరాక్వాలతో సోదర సంబంధం కలిగిన ఈ తెగలు ఏరీ సరస్సు ఉత్తరతీరాన

నివసించారు. అసలు ఇరాక్వ్యూలకూ గురాన్లకూ మధ్య జరిగిన యుద్ధాల్లో ఈ మైత్రీ కూటమి తటస్థంగా ఉన్న కారణంగా ఫ్రెంచి వలసవాదులు వారికి యీ పేరును వాడారు. – 230.

127 బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా 1879–1887 సంవత్సరాల్లో జులూలు జరిపిన జాతీయ విముక్తి పోరాటానికి యిది ప్రస్తావన.

న్యూబియన్లూ, అరబ్బులూ సూడాన్‌కి చెందిన యితర జాతులవారూ పాల్గొన్న ఈ జాతీయ విముక్తి పోరాటం 1881నుండి 1884దాకా జరిగింది. మహమ్మదీయ మతబోధకుడైన మహమ్మద్ అహ్మద్ నాయకత్వంలో వారి యీ తిరుగుబాటు ఒక కేంద్ర స్వతంత్ర రాజ్య సంస్థాపనకు దారితీసింది. సూడాన్ బ్రిటిష్‌వారిచేత 1899లో మాత్రమే ఆక్రమించుకోబడింది. – 230.

128 అత్తికాలో స్థిరపడిపోయిన మెటోయికోలు (metoicos) లేక విజాతీయులకు యిది ప్రస్తావన. వారు బానిసలు కారు, అయినా ఎథీనియన్ పౌరులకున్న పూర్తి హక్కులు వాళ్లకు లేవు. వారు ప్రధానంగా చేతివృత్తులలోనూ, వ్యాపారంలోనూ నిమగ్నులైవుండే వారు. వారొక ప్రత్యేకమైన పన్నును చెల్లించవలసివుండేది. విశేషమైన హక్కులు కలిగిన పౌరులలోనుండి వారికి కొందరు "పోషకులు" ఉండేవారు. ఈ పోషకుల ద్వారా వారు అధికారులకు అర్జీలు పెట్టుకునే అవకాశం వుండేది. – 250.

129 పన్నెండు పలకల చట్టం – ఈ రోమన్ చట్టాలు, ప్రభువులకు వ్యతిరేకంగా సామాన్యులు జరిపిన పోరాట ఫలితంగా, క్రీ. పూ. 5వ శతాబ్ది మధ్యలో రూపొందించబడ్డాయి. రోమన్ సమాజం ఆస్తినిబట్టి తరతమ శ్రేణులుగా విభజితమవడం, బానిసత్వం పరిణతమవడం, బానిస యాజమాన్య రాజ్యం రూపొందడం ఈ శిక్షాస్మృతిలో ప్రతిబింబితమైంది. ఈ శిక్షాస్మృతి పన్నెండు పలకలపైన చెక్కబడింది. అందుకే దానికి యీ పేరు వచ్చింది. – 254.

130 ప్యూనిక్ యుద్ధాలు – అతి పెద్ద బానిస యాజమాన్య రాజ్యాలైన రోమ్, కార్తేజిల మధ్య పశ్చిమ మధ్యధరా సముద్రంలో ప్రాబల్యంకోసమూ, కొత్త భూభాగాలపైనా, బానిసలపైనా పెత్తనంకోసమూ జరిగిన యుద్ధాలు. రెండవ ప్యూనిక్ యుద్ధం (క్రీ. పూ. 218–201) కార్తేజి ఘోర పరాజయంతో ముగిసింది. – 255.

131 వేల్సు ఇంగ్లీషువారిచేత అంతిమంగా 1283లో జయింపబడింది. కాని అప్పటికీ అది తన స్వయంపాలనాధికారాన్ని నిలుపుకుంది. 16వ శతాబ్ది మధ్యలో అది ఇంగ్లండుకు దత్తంచెయ్యబడింది. – 265.

[132] 1869–70 సంవత్సరాల్లో ఎంగెల్స్ ఐర్లండు చరిత్రకు సంబంధించిన రచనలో నిమగ్నుడయ్యాడు, కాని దాన్ని ఆయన ముగించలేకపోయాడు. కెల్టిక్ చరిత్ర అధ్యయనంలో నిమగ్నుడై వున్నప్పుడు ఎంగెల్సు పాత వెల్ష్ చట్టాలను విశ్లేషించాడు. – 265.

[133] "Ancient Laws and Institutes of Wales" ("వేల్సుయొక్క పురాతన చట్టాలూ సంస్థలూ") అన్న పుస్తకంనుండి ఎంగెల్స్ యిక్కడ ఉల్లేఖిస్తున్నాడు. సంపుటి I, 1841, పేజి 93. – 266.

[134] 1891 సెప్టెంబరులో ఎంగెల్స్ స్కాట్లండు ఐర్లండులలో పర్యటించాడు. – 267.

[135] 1745–46 సంవత్సరాల్లో స్కాట్లండులో పర్వత సమష్టి కుటుంబాలు (clans) ఇంగ్లీషు, స్కాటిష్ భూస్వామ్య ప్రభువర్గాలయొక్క, బూర్జువావర్గంయొక్క పీడనకూ, భూమి కాజేతకూ వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాయి. ఈ గిరిజనులు సమష్టి కుటుంబాలపై ఆధారపడిన సాంప్రదాయిక సామాజిక వ్యవస్థను సమర్థించారు. ఈ తిరుగుబాటు అణచివేయబడిన తర్వాత స్కాట్లండు పర్వత ప్రాంతాల్లోని క్లాన్ వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోయింది. క్లాన్ భూస్వామ్య అవశేషాలు రూపుమాపబడ్డాయి. స్కాటిష్ రైతులు అంతకంతకు అధిక సంఖ్యలో వారి భూములనుండి తరిమివేయబడ్డారు. క్లాన్ న్యాయస్థానాలు రద్దుచెయ్యబడ్డాయి. క్లాన్ ఆచారాల్లో కొన్ని నిషేధింపబడ్డాయి. – 268.

[136] "అలమన్నియన్ చట్టాలు" – 5వ శతాబ్దంలో ఆనాటి ఆల్సేస్‌లోను, తూర్పు స్విట్జర్లాండులోను, జర్మనీ నైరుతి భాగంలోను స్థిరపడిన అలమన్నీల జర్మన్ తెగల పాత్తు యొక్క ఉమ్మడి శిక్షాస్మృతి. ఈ చట్టాలు 6వ శతాబ్దాంతానికీ, 8వ శతాబ్దానికీ మధ్యనాటివి. ఎంగెల్స్ యిక్కడ "అలమన్నియన్ చట్టాల"లోని LXXXI (LXXXIV) చట్టాలను ప్రస్తావిస్తున్నాడు. – 269.

[137] "హిల్డెబ్రాండ్ గీతం" – ఇది 8వ శతాబ్దంనాటి ప్రాచీన జర్మన్ మహాకావ్య కవితకు నమూనాప్రాయమైన ఒక వీరగేయం. దీనిలో కొద్ది భాగాలు మాత్రమే భద్రపరచబడి యీనాడు లభిస్తున్నాయి. – 270.

[138] రోమన్ పెత్తనానికి వ్యతిరేకంగా జర్మన్, గాల్ తెగల తిరుగుబాటు క్రీ. శ. 69–70 సంవత్సరాల్లో (కొన్ని ఆధారాల మేరకు 69–71 సంవత్సరాల్లో) జరిగింది. సివిలిస్ నాయకత్వాన యీ తిరుగుబాటు గాల్‌లో అధిక భాగానికీ, రోమన్ పాలనలో వున్న జర్మన్ ప్రాంతాలకీ విస్తరించింది. రోమ్ యీ ప్రాంతాలను కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

తిరుగుబాటుదారులు ఓడింపబడి, రోమ్‌తో సంధిచేసుకోక గత్యంతరంలేని పరిస్థితిలో పడ్డారు. – 273.

139 Codex Laureshamensis – లోర్ష్ క్రైస్తవ మఠానికి చెందిన సర్వస్వామ్య హక్కుపత్రాలు, ప్రత్యేకస్వామ్య పత్రాల సంకలనం. 12వ శతాబ్దంలో సంపుటీకరించ బడిన యీ పత్ర సంచయం 8–9 శతాబ్దాలనాటి రైతు, ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థకు సంబంధించిన ఒక ముఖ్య చారిత్రక పత్రం. – 276.

140 జర్మన్ జాతియొక్క పవిత్ర రోమన్ సామ్రాజ్యానికి యిది ప్రస్తావన. 962లో స్థాపింప బడిన యీ మధ్యయుగ సామ్రాజ్యం జర్మనీ భూభాగాన్నీ, ఇటలీలో కొంత భాగాన్నీ కలిగివుంది. దరిమిలా ఆ సామ్రాజ్యం కొన్ని ఫ్రెంచి భూప్రాంతాలనూ, బొహీమియా, ఆస్ట్రియా, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్‌లనూ, తదితర దేశాలనూ కూడా తనలో కలుపు కుంది. ఆ సామ్రాజ్యం కేంద్రీకృతమైన రాజ్యం కాదు. చక్రవర్తియొక్క అత్యున్న తాధికారాన్ని ఆమోదించిన ఫ్యూడల్ సామంత రాజ్యాలతోను, స్వతంత్ర నగరాలతోనూ కూడిన ఒదులొదులు యూనియన్. ఫ్రాన్సుకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో ఓటమి అనంతరం హాప్స్‌బుర్గ్‌లు పవిత్ర రోమన్ సామ్రాజ్యపు చక్రవర్తి హోదాను వదిలివేయవలసి వచ్చినప్పుడు 1806లో ఆ సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. – 284.

141 వతన్‌దారీలు – బహుమతులుగా యివ్వబడిన భూఖండాలు. 8వ శతాబ్దపు మొదటి అర్ధ భాగంలో యీమాదిరి బహూకరణలు చెయ్యడం సామాన్యమైన అలవాటుగా వుండేది. సాగుదారులతో కూడిన భూఖండాలు, వివిధ సేవలకు సామాన్యంగా సైనిక సేవకుగాను, దాన గ్రహీతలకు వారి జీవితాంత వినియోగార్థం మాన్యాలుగా బదలాయించ బడేవి. ఈ వతన్‌దారీ పద్ధతి ప్రధానంగా సన్నకారు, మధ్యతరగతి కులీనులతో కూడిన ఫ్యూడల్‌వర్గం రూపొందడానికీ రైతులు భూదాసులుగా పరివర్తన చెందడానికీ, దాస్య సంబంధాలూ, భూస్వామ్య తారతమ్యాలూ పెంపొందడానికీ దారితీసింది. దరిమిలా యీ వతన్‌దారీ భూములు ఈనాములుగానో లేక వంశపారంపరిక హక్కు కలిగిన ఎస్టేట్లు గానో మారిపోయాయి. – 286.

142 జిల్లా సామంతులు (Gaugrafen) – ఫ్రాంకోనియన్ రాజ్య మండలాల పాలనా నిర్వహణకోసం నియమింపబడిన రాజోద్యోగులు. ఈ సామంతులకు న్యాయనిర్వహణా ధికారం వుంటుంది. వీరు పన్నులు వసూలుచేస్తారు. యుద్ధ సమయాల్లో సైన్యా లను నడిపేవారు. వీరు చేసిన సేవలకు ప్రతిఫలంగా ఆయా దేశాల్లో రాజుకు లభించే ఆదాయంలో మూడోవంతు వీరికి లభించేది. వీరికి జమీలు కూడా బహూకరింపబడేవి.

ప్రత్యేకించి 877 తర్వాత, అంటే యీ సామంతుల అధికారాన్ని వంశపార్యం చెయ్యాలన్న అధికారిక నిర్ణయం తీసుకోబడిన తర్వాత యీ సామంతులు క్రమంగా శక్తివంతమైన అనువంశిక భూస్వాములు కాజొచ్చారు. – 287.

143 అంగారియా – రోమన్ సామ్రాజ్య వాసులు విధిగా చెయ్యవలసివచ్చే వెట్టి చాకిరీ. రోమన్ పౌరులు ప్రభుత్వ సంస్థలకు బళ్లనూ, గుర్రాలనూ సరఫరా చెయ్యవలసివచ్చేది. కాల క్రమేణా యీ చాకిరీలు భారీఎత్తున చెయ్యవలసిరావడంతో, ప్రజలకు యిదో పెద్ద భారమైంది. – 288.

144 న్యాసం (commendation) – ఆనాడున్న ఆచారం ప్రకారం ఒక రైతుగాని, ఒక చిన్న భూఖామందుగాని బలోపేతుడైన భూస్వామి "రక్షణకు" తనను తాను ఇల్లడ పెట్టుకొనడం (సైనిక కొలువు చెయ్యడం, సాంప్రదాయికంగా తనకు భూస్వామి యిచ్చే చిన్న కమతంపై భుక్తానికి బదులు తన భూమిని భూస్వామికి బదలాయించడం). బలవంతంగా యీ పని చెయ్యవలసిన రైతుల విషయంలో తమ వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని వారు కోల్పోవడానికీ, చిన్న భూఖామందుల విషయంలో బలోపేతులైన ఫ్యూడల్ ప్రభువులకు వారు పాలెగాంద్రు అయ్యేందుకూ యిది దారితీసింది. 8,9 శతాబ్దాలు మొదలుకొని దరిమిలా యూరప్‌లో విస్తృతంగా వ్యాపించిన యీ ఆచారం ఫ్యూడల్ సంబంధాలు సుస్థిరపడడానికి తోడ్పడింది. – 290.

145 క్రూసేడ్లు – 11–13 శతాబ్దాల మధ్య కాలంలో, పశ్చిమ యూరప్‌కి చెందిన బడా ఫ్యూడల్ ప్రభువులు, నైట్‌లు (వీరయోధులు), ఇటాలియన్ వర్తకులు జెరూసలెంలోని దేవాలయాలను, తదితర "పుణ్య క్షేత్రాలను" మహమ్మదీయులనుండి పునరాక్రమించుకొనేందుకుగాను జరిపిన సైనిక వలసవాద దండయాత్రలకు యిది ప్రస్తావన. ఈ మతయుద్ధాలు ప్రపంచ పెత్తనాన్ని కోరుకున్న కేథలిక్ చర్చిచేతా, పోప్‌చేతా ప్రోత్సహింపబడ్డాయి, సముచితమైనవిగా సమర్థింపబడ్డాయి. ఫ్యూడల్ నిగళాలనుండి విమోచనాన్ని కోరుకున్న రైతులు కూడా యీ మతయుద్ధాల్లో పాల్గొన్నారు. మతవీర యోధులు తాము ఏయే దేశాలను గడిచి వెళ్లారో వాటిలోని మహమ్మదీయ జనాభానే కాకుండా, క్రిస్టియన్ జనాభాను కూడా లూటీచేశారు, వారికి వ్యతిరేకంగా బలప్రయోగం జరిపారు. సిరియా, పాలస్తీనా, ఈజిప్టు, ట్యునీసియా దేశాలలోని మహమ్మదీయ రాజ్యాలే కాకుండా క్రిస్టియన్ మతాన్ని అనుసరించే బైజాంటైన్ సామ్రాజ్యం కూడా వారి లూటీకి గురయ్యాయి. కానైతే తూర్పు మెడిటరేనియన్ ప్రాంతంలో వారి విజయాలు ఎక్కువ కాలం నిలవలేదు, వారు ఆక్రమించుకొన్న భూభాగాలు మహమ్మదీయులచేత పునరాక్రమించుకోబడ్డాయి. – 290.

146 హేస్టింగ్స్ – నార్మండీ ప్రభువు విలియం క్రీ. శ. 1066 అక్టోబరు 14న ఆంగ్లో–శాక్సన్ రాజు హారోల్డును ఓడించిన చోటు. గణవ్యవస్థనాటి అవశేషమైన ఆంగ్లో–శాక్సన్ సైనిక వ్యవస్థ పురాతన ఆయుధాలను కలిగి బలహీనంగా వుంది. విలియం ఇంగ్లండుకు రాజు అయి, విజేత విలియంగా ప్రసిద్ధిచెందాడు. – 296.

147 దీత్మర్షెన్ – ఈనాటి ష్లేస్విగ్-హోల్‌స్టైన్‌యొక్క నైరుతిమూల గల ఒక ప్రాంతం. పురాతనకాలంలో ఆ ప్రాంతంలో శాక్సన్లు నివసించారు. 8వ శతాబ్దంలో చార్లె మాగ్నె ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాడు. దరిమిలా ఆ ప్రాంతం వివిధ పీఠాధిపతులకు, లౌకిక ప్రభువులకూ చెందింది. 12వ శతాబ్ది మధ్యకాలంలో దీత్మర్షెన్ ప్రజలు – వీరిలో అధిక సంఖ్యాకులు స్వతంత్ర రైతులు – తమ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోనారంభించారు. 13వ శతాబ్దానికీ 16వ శతాబ్ది నడిమికాలానికీ మధ్య వారు దాదాపు పూర్తి స్వాతంత్ర్యాన్ని అనుభవించారు. ఆ దశలో దీత్మర్షెన్ ప్రాచీన రైతు ఉమ్మడి కుటుంబాల (క్లాన్‌లు) ప్రాతిపదికపైన ఏర్పడిన స్వయంపాలక రైతు సమూజాల సమ్మేళనంగా వుంది. 14వ శతాబ్దందాకా స్వతంత్ర రైతులందరియొక్క సభచేత అత్యున్నతాధికారం చలాయింపబడింది. అటుతర్వాత ఆ అధికారం ఎన్నుకోబడిన మూడు పరిపాలక సమితులకు సంక్రమించింది. 1559లో, డేనిష్ రాజు రెండవ ఫ్రెడరిక్ సేనలూ, హోల్‌స్టైన్ ప్రభువులు యోహన్, అడోల్ఫుల సేనలూ దీత్మర్షెన్ ప్రజల ప్రతిఘటనను భగ్నంచేశాయి. విజేతలు ఆ ప్రాంతాన్ని పంచుకున్నారు. అయినా కూడా, 19వ శతాబ్దపు ద్వితీయార్ధభాగందాకా సమష్టి పరిపాలనా, పాక్షిక స్వయంపాలనా కొనసాగాయి. – 304.

148 హేగెల్ రచించిన "Grundlinien der Philosophie des Rechts" ("న్యాయశాస్త్ర తాత్విక మూలసూత్రాలు"), §§ 257, 360. – 304.

# పేర్ల సూచి

అగాసిస్ (Agassiz), జాన్ లూయీ రుడోల్ఫ్ (1807–1873) – స్విస్ భూగర్భ శాస్త్రజ్ఞుడు, జంతుశాస్త్రజ్ఞుడు. పలుమార్లు జలప్రళయాలు సంభవించాయనీ, అటు తర్వాత భగవంతునిచేత ప్రపంచం తిరిగి సృష్టింపబడిందన్న భావవాద సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు. – 183.

అనక్రెయోన్ (Anacreon) (క్రీ. పూ. 6వ శతాబ్దపు రెండవ అర్ధభాగం) – ప్రాచీన గ్రీకు కవి. – 209.

అనక్సగోరస్, క్లాజమెన్ వాసి (Anaxagoras of Clazomenae) (క్రీ. పూ. సుమారు 500–428) – గ్రీకు భౌతికవాద తత్వవేత్త. – 39, 62.

అనక్సాండ్రిడస్ (Anaxandridas) (క్రీ. పూ. 6వ శతాబ్దం) – స్పార్టా రాజు (క్రీ. పూ. 560నుండి); అరిస్టోన్‌తో బాటు పాలించాడు. – 196.

అప్పియసు క్లాడియసు (Appius Claudius) (క్రీ. పూ. 448లో ప్రాంతంలో మరణించాడు) – రోమన్ రాజనీతిజ్ఞుడు, పన్నెండు పలకల చట్టాన్ని ప్రకటించిన డిసెంవిర్ల కమిటీ సభ్యుల్లో (451–450) ఒకడు. – 255.

అమ్మియానుస్ మార్సెల్లినుస్ (Ammianus Marcellinus) (క్రీ. శ. సుమారు 332–400) - రోమన్ చరిత్రకారుడు. - 202, 226.

అరిస్టాటిల్ (Aristotle) (క్రీ. పూ. 384–322) - ప్రాచీనకాలపు గొప్ప చింతనాపరుడు. భౌతికవాద, భావవాదాల మధ్య ఊగిసలాడాడు. బానిస యజమానుల వర్గపు సైద్ధాంతికుడు. – 75, 241.

అరిస్టీడిస్ (Aristides) (క్రీ. పూ. 540–467) – ప్రాచీన గ్రీకు రాజనీతిజ్ఞుడు, సేనానాయకుడు. – 249.

అరిస్టోన్ (Ariston) (క్రీ. పూ. 6వ శతాబ్దం) – స్పార్టా రాజు (క్రీ. పూ. 574–520), అనక్సాండ్రిడస్‌తో బాటు పాలించాడు. – 196.

అరిస్టోఫనిస్ (Aristophanes) (క్రీ. పూ. సుమారు 446 – సుమారు 385) – ప్రాచీన గ్రీకు నాటకరచయిత, రాజకీయ సుఖాంత నాటకాల కర్త. – 196.

అర్టక్సేర్క్సెస్ (Artaxerxes) – అహమేనియన్ వంశపు ముగ్గురు ప్రాచీన పర్షియన్ రాజుల పేరు. – 261.

అలెగ్జాండర్ ది గ్రేట్, మాసిడన్ రాజు (Alexander of Macedon) (క్రీ. పూ. 356–323) – గొప్ప సేనాని, రాజనీతిజ్ఞుడు. – 192.

ఆగస్టస్ (Augustus) (క్రీ. పూ. 63 – క్రీ. శ. 14) – రోమన్ చక్రవర్తి (క్రీ. పూ. 27 – క్రీ. శ. 14). – 254, 280.

ఆర్క్‌రైట్ (Arkwright), రిచర్డ్ (1732–1792) – ఇంగ్లీషు వ్యాపారి, బ్రిటన్‌లోని పలు ఆవిష్కరణలను తనవిగా ప్రకటించుకున్నాడు. – 52.

ఆర్లియన్స్, డ్యూక్ – లూయీ ఫిలిప్ చూడండి.

ఆల్‌బ్రెఖ్ట్ (Albrecht), కార్ల్ (1788–1844) – జర్మన్ వర్తకుడు, "డెమగోగ్‌ల" ("ప్రజావక్తల") ప్రతిపక్ష ఉద్యమంలో పాల్గొన్నందుకుగాను ఆరేళ్ల కఠిన కారాగారవాస శిక్ష విధింపబడ్డాడు. 1841నుండి అతను స్విట్జర్లాండ్‌లో వైట్లింగ్ ఊహాజనిత కమ్యూనిజంకి సన్నిహితమైన భావాలను బోధించాడు. అయితే వాటికి అతను మతపరమైన నిగూఢమైన తొడుగు తొడిగాడు. – 121.

ఇర్మినాన్ (Irminon) (మరణం సుమారు 826) – సెయింట్ జెర్మేన్ డె ప్రే మఠంలో ఆబట్. – 288.

ఉల్ఫిల (Ulfila) (లేక Wulfila) (సుమారు 311–383) – పశ్చిమ గోథిక్ చర్చి నాయకుడు, గోథ్‌లను క్రిస్టియన్లుగా మతాంతరీకరించే ఉద్యమాన్ని సాగించాడు, గోథిక్ అక్షరమాలను సృష్టించాడు, బైబిల్‌ను గోథిక్ భాషలోకి అనువదించాడు. – 261.

ఎంగెల్స్ (Engels), ఫ్రెడరిక్ (1820–1895). – 12, 21–24, 35, 39–40, 60, 62, 73, 89, 91, 93, 98, 104, 112, 114, 122, 125, 129, 131, 133–35, 150, 151, 161, 162, 168, 169, 172, 179, 181, 189, 190, 195, 198, 221, 233–36, 238, 240, 241, 256, 261, 271, 280, 284, 293, 298, 302, 304, 311–14.

ఎక్కారియస్ (Eccarius), యోహన్ గెయోర్గ్ (1818-1889) – జర్మన్ దర్జీ పనివాడు, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, "న్యాయవంతుల లీగు" సభ్యుడు, అటు తరువాత "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు, మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు, దరిమిలా ఇంగ్లీషు ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో పాల్గొన్నాడు. – 121, 122.

ఎర్హార్డ్ (Ehrhard), యోహన్ లుడ్విగ్ ఆల్బర్ట్ (జననం సుమారు 1820) – జర్మన్ వాణిజ్య గుమాస్తా, "కమ్యూనిస్ట్ లీగు" సభ్యుడు, కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో నిందితుడు (1852). – 132.

ఎవెర్బెక్ (Everbeck), ఔగుస్ట్ హెర్మన్ (1816–1860) – జర్మన్ వైద్యుడు, సాహిత్యకారుడు, "న్యాయవంతుల లీగు"యొక్క పారిస్ శాఖల నాయకుడు. అటుతర్వాత "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు. లీగునుంచి అతను 1850లో తప్పుకున్నాడు. – 120, 131.

ఎషెన్బాహ్ – చూ: వాల్ఫ్రామ్ ఫన్ ఎషెన్బాహ్.

ఎస్కిలస్ (Aeschylus) (క్రీ. పూ. 525–456) – ప్రాచీన గ్రీకు ప్రముఖ నాటక రచయిత, లాక్షణిక విషాదాంత నాటకాలకర్త. – 139, 195, 238.

ఎస్పీనస్ (Espinas), ఆల్ఫ్రెడ్ విక్తోర్ (1844–1922) – ఫ్రెంచి బూర్జువా తత్వవేత్త, సామాజిక శాస్త్రవేత్త, పరిణామ సిద్ధాంత సమర్థకుడు. – 164, 165.

ఒడొవాకర్ (Odoacer) (సుమారు 434–493) – జర్మన్ ప్రత్యేక దళాల నాయకుల్లో ఒకడు. 476లో రోమన్ చక్రవర్తిని సింహాసనచ్యుతుణ్ణి చేసి, ఇటలీలోని తొలి "అనాగరిక" రాజ్యానికి రాజయ్యాడు. – 278.

ఓట్టొ (Otto), కార్ల్ వునిబాల్డ్ (జననం 1809) – జర్మన్ రసాయనశాస్త్రవేత్త,

కొలోన్ కార్మిక యూనియన్ (1848–49), "కమ్యూనిస్టు లీగు"ల సభ్యుడు, కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో (1852) నిందితుడు. – 131, 132.

ఓవెన్ (Owen), రాబర్ట్ (1771–1858) – సుప్రసిద్ధ బ్రిటిష్ ఊహాజనిత సోషలిస్టు. – 41, 63, 65, 71–74.

కాంట్ (Kant), ఇమ్మాన్యుయెల్ (1724–1804) – సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర జనకుడు, భావవాది. – 70, 79.

కాంప్‌హౌసెన్ (Camphausen), లూడొల్ఫ (1803–1890) – జర్మన్ బ్యాంకురు, రైన్ ప్రాంతపు లిబరల్ బూర్జువా నాయకుల్లో ఒకడు, 1848 మార్చినుండి జూన్ వరకు ప్రష్యా మంత్రి-అధ్యక్షుడు – 22.

కాబ్డెన్ (Cabden), రిచర్డ్ (1804–1865) – ఇంగ్లీషు పారిశ్రామికుడు, బూర్జువా రాజకీయవేత్త, ఫ్రీ ట్రేడ్ నాయకుడు, ధాన్య చట్టాల వ్యతిరేక లీగు సంస్థాపకులలో ఒకడు; పార్లమెంటు సభ్యుడు. – 52.

కార్ట్‌రైట్ (Cartwright), ఎడ్మండ్ (1743–1823) – సుప్రసిద్ధ ఇంగ్లీషు అన్వేషకుడు. – 56.

కార్లైల్ (Carlyle), థామస్ (1795–1881) – ఇంగ్లీషు రచయిత, చరిత్రకారుడు, భావవాద తత్వవేత్త, వీర యోధుల పూజను ప్రచారం చేశాడు. అభివృద్ధినిరోధక రొమాంటిసిజం దృక్పథంనుంచి ఇంగ్లీషు బూర్జువావర్గాన్ని విమర్శించాడు; టోరీ పార్టీకి సన్నిహితంగా ఉన్నాడు; 1848 తరువాత అభివృద్ధినిరోధకవాది. – 65.

కాల్విన్ (Calvin), జాన్ (1509–1564) – సంస్కరణోద్యమ నాయకుల్లో ఒకడు, ప్రొటెస్టెంటిజం-కాల్వినిజం అనే ప్రత్యేక శాఖ స్థాపకుడు. ఈ శాఖ, పెట్టుబడియొక్క ఆదిమ సంచయన దశలో బూర్జువావర్గ ప్రయోజనాలను వ్యక్తం చేసింది. – 47.

కింకెల్ (Kinkel), గోత్‌ఫ్రిడ్ (1815–1882) – జర్మన్ కవి, వ్యాసరచయిత, పెటీబూర్జువా ప్రజాస్వామ్యవాది, 1849 నాటి బాడెన్-ఫల్జ్ తిరుగుబాటులో పాల్గొన్నాడు; లండన్‌లోని పెటీబూర్జువా ప్రవాసుల నాయకుడు; మార్క్స్, ఎంగెల్స్‌లను వ్యతిరేకించాడు. – 130.

కులాంజ్ డి. – చూ: ఫుస్టేల్ డి కులాంజ్.

కూనొవ్ (Cunow), హైన్రిహ్ విల్‌హెల్మ్ కార్ల్ (1862–1936) – జర్మన్ సోషల్ డెమొక్రట్, చరిత్రకారుడు, సామాజిక శాస్త్రవేత్త, నరవర్గ విశ్లేషణ శాస్త్రవేత్త. 1880, 90 దశకాల్లో మార్క్సిజానికి సన్నిహితంగా వున్నాడు, దరిమిలా రివిజనిస్టు అయ్యాడు. – 192.

కూల్మన్ (Kuhlmann), గెయోర్గ్ – ఆస్ట్రియన్ ప్రభుత్వ కొలువులో వున్న ఏజెంట్ ప్రొవకేటరు. తనను తాను ఒక "ప్రవక్త"గా చలామణీ చేసుకున్నాడు. 1840 దశకంలో జర్మన్ వృత్తి కార్మికుల – వైట్లింగ్ సమర్థకుల – మధ్య, స్విట్జర్లాండులో మత పదజాలం మాటున "అసలు సోషలిజాన్ని" ప్రచారం చేశాడు. – 121.

కేయ్ (Kaye), జాన్ విలియం (1814–1876) – ఇంగ్లీషు వలస అధికారి, భారతదేశ చరిత్ర, నరవర్గ విశ్లేషణ శాస్త్రంపైనా, ఆఫ్ఘనిస్తాన్, భారతదేశాలలో వలసయుద్ధాల చరిత్రపైనా కొన్ని రచనలు చేశాడు. – 173.

కొలంబస్ (Columbus), క్రిస్టఫర్ (1451–1506) – గొప్ప సముద్ర యాత్రికుడు, అమెరికాను కనుగొన్నాడు. – 19.

కొవలేవ్‌స్కీ (Kovalevsky), మక్సీమ్ (1851–1916) – రష్యన్ విజ్ఞానశాస్త్రవేత్త, రాజకీయవేత్త, బూర్జువా లిబరల్, ఆదిమ సమాజ చరిత్రపై కొన్ని రచనలు చేశాడు. – 37, 189, 191 – 93, 265, 274.

కోలిన్స్ (Collins), ఆంథొనీ (1676–1729) – ఆంగ్ల భౌతికవాద తత్వవేత్త. – 40.

కోషుత్ (Kossuth), లాయొష్ (లుడ్విగ్) (1802–1894) – హంగేరియన్ జాతీయ విముక్తి ఉద్యమ నాయకుడు, 1848–49 విప్లవంలో బూర్జువా ప్రజాస్వామిక శక్తులకు నాయకత్వం వహించాడు, హంగేరియన్ విప్లవ ప్రభుత్వ అధినేతగా వున్నాడు. విప్లవం విఫలమైన తర్వాత విదేశాలకు ప్రవాసం వెళ్లాడు. – 130.

కొవర్డ్ (Coward), విలియం (సుమారు 1656–1725) – ఇంగ్లీషు వైద్యుడు, భౌతికవాద తత్వవేత్త. – 40.

క్రీగె (Kriege), హెర్మన్ (1820–1850) – జర్మన్ పత్రికా రచయిత, "అసలైన సోషలిజం" ప్రతినిధి, 1840 దశకపు చివరి సంవత్సరాల్లో న్యూయార్కులో "అసలైన సోషలిస్టుల" జర్మన్ బృందానికి నాయకుడు. – 120, 121.

క్లీస్థెనెస్ (Cleisthenes) – ఎథీనియన్ రాజకీయవేత్త, క్రీ. పూ. 510–507లలో గణవ్యవస్థ అవశేషాలను రద్దుచేసే సంస్కరణలను అమలుజరిపాడు. – 250.

క్లేయిన్ (Klein), యోహన్ జాకొబ్ (జననం సుమారు 1818) – కొలోన్‌లోని వైద్యుడు, "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు, కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో నింది తుడు. – 131, 132.

క్లాడియా (Claudia) – రోమన్ ప్యాట్రీషియన్ గణం. – 254.

క్వింక్టిలియా (Quintilia) – రోమన్ ప్యాట్రీషియన్ గణం. – 254.

గయస్ (Gaius) (క్రీ. శ. 2వ శతాబ్దం) – రోమన్ న్యాయశాస్త్రవేత్త, రోమన్ న్యాయ శాస్త్రంపై ఒక గ్రంథ సంకలనకర్త. – 190.

గిజో (Guizot), ఫ్రాన్సువా ప్యేర్ గియోమ్ (1787–1874) – ఫ్రెంచి బూర్జువా చరిత్రకారుడు, రాజనీతిజ్ఞుడు, 1840 – 48 దశలో ఫ్రెంచి దేశాంగ, విదేశాంగ విధానాన్ని వాస్తవానికి నిర్దేశించినవాడు. – 23.

గ్లాడ్‌స్టన్ (Gladstone), విలియం ఎవర్ట్ (1809–1898) – ఆంగ్ల రాజ నీతిజ్ఞుడు, 19వ శతాబ్దపు రెండవ అర్ధభాగంలో లిబరల్ పార్టీ నాయకులలో ఒకడు, ఆర్థికశాఖా మంత్రి (1852–55, 1859–66), ప్రధానమంత్రి (1868–74, 1880–85, 1886, 1892–94). – 238, 239.

గ్యోగ్ (Gögg), అమాండుస్ (1820–1897) – జర్మన్ పత్రికా రచయిత, పెటీ బూర్జువా ప్రజాస్వామ్యవాది; 1849లో బాడెన్ తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు; విప్లవ పరాజయం తరువాత జర్మనీనుంచి వలసవెళ్లిపోయాడు; 1870 దశకంలో జర్మన్ సోషల్-డెమోక్రటిక్ పార్టీలో చేరాడు. – 130.

గ్యోతె (Goethe), యోహన్ వోల్ఫ్‌గాంగ్ (1749–1832) – జర్మన్ మహా రచయిత, చింతనాపరుడు. – 43, 84, 169.

గ్రిగోరీ, తూర్స్ నగరవాసి (Gregory of Tours) (గ్రిగోరీ ఫ్లోరెంటియస్) (సుమారు 540 – సుమారు 594) – క్రిస్టియన్ పృథక్కలవాది, మతశాస్త్రవేత్త, చరిత్రకారుడు, 573నుండి తూర్స్ బిషప్, "ఫ్రాంక్‌ల చరిత్ర," "అద్భుతాలపై ఏడు పుస్తకాలు" రచయిత. – 273.

గ్రిమ్ (Grimm), జాకొబ్ (1785–1863) – ప్రముఖ జర్మన్ భాషాశాస్త్రవేత్త, చరిత్ర

కారుడు, జర్మన్ భాషా, న్యాయశాస్త్ర, పురాణ, సాహిత్యాల చరిత్రపై గ్రంథాలు రచించాడు. – 270.

గ్రోట్ (Grote), జార్జ్ (1794–1871) – ఆంగ్ల బూర్జువా చరిత్రకారుడు, "గ్రీసు చరిత్ర" అనే బృహత్ గ్రంథ రచయిత. – 232 – 236.

జిఫెన్ (Giffen), రాబర్ట్ (1837–1910) – ఆంగ్ల బూర్జువా ఆర్థికశాస్త్రవేత్త, గణాంకశాస్త్రవేత్త, ద్రవ్య విషయాల్లో నిపుణుడు, వర్తక మంత్రిత్వశాఖలో గణాంక విభాగాధిపతి. – 104.

జిరో-త్యూలోన్ (Giraud-Teulon), అలెక్సీస్ (జననం 1839) – జినీవాలోని చరిత్ర ప్రొఫెసరు, ఆదిమ సమాజంపై కొన్ని రచనలు చేశాడు. – 147, 149, 163, 165, 194.

జూరిటా (Zurita), అలోన్సో – 16వ శతాబ్ది మధ్యలో మధ్య అమెరికాలో నివసించిన స్పానిష్ అధికారి. – 192.

జూలియన్ గణం - రోమన్ ప్యాట్రీషియన్లు. – 269.

చార్లెమాగ్నె (Charles the Great) (సుమారు 742–814) – ఫ్రాంక్‌ల రాజు (768–800), చక్రవర్తి (800–814). – 287–89.

చార్లెస్ మొదటి (Charles I) (1600–1649) – ఇంగ్లండు రాజు (1625–49). ఇంగ్లండులో 17వ శతాబ్దంలో బూర్జువా విప్లవకాలంలో ఉరితియ్యబడ్డాడు. – 48.

టార్క్వినియస్, గర్విష్ఠ (Tarquinius Superbus) (క్రీ. పూ. సుమారు 534–సుమారు 509) – జనశ్రుత ప్రసిద్ధుడైన ప్రాచీన రోమ్ రాజు. ప్రజాసామాన్యం చేసిన తిరుగుబాటు ఫలితంగా యితడు రోమ్‌నుండి వెళ్లగొట్టబడ్డాడనీ, అటుతర్వాత అక్కడ రిపబ్లికన్ వ్యవస్థ నెలకొల్పబడిందనీ జనశ్రుతి. – 261, 264.

టాసిటస్ (Tacitus), పూబ్లియస్ కార్నీలియస్ (సుమారు 55 – సుమారు 120) – గొప్ప రోమన్ చరిత్రకారుడు, "జర్మనీ," "చరిత్ర," "అన్నాల్స్" గ్రంథాల రచయిత. – 136, 146, 157, 158, 201, 225, 270–279.

టిబెరియస్ (Tiberius) (క్రీ. పూ. 42 – క్రీ. శ. 37) – రోమన్ చక్రవర్తి (14–37). – 261.

టైలర్ (Taylor), ఎడ్వర్డ్ బర్నెట్ (1832–1917) – ప్రముఖ ఆంగ్ల నరవర్గ విశ్లేషణ శాస్త్రజ్ఞుడు, సంస్కృతీ, నరవర్గ విశ్లేషణ శాస్త్రాల చరిత్రల్లో పరిణామ వాద శాఖ స్థాపకుడు. – 138.

ట్రీర్ (Trier), గెర్సొన్ (జననం 1851) – డేనిష్ సోషల్-డెమోక్రట్; సోషల్-డెమోక్రటిక్ పార్టీయొక్క విప్లవాత్మక మైనారిటీ నాయకుల్లో ఒకడు; పార్టీలోని అవకాశవాద పక్షానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాడు; ఎంగెల్స్ రచనలను డేనిష్ భాషలోకి అనువదించాడు. – 137.

డాంటె (Dante), అలిగ్యేరి (1265–1321) – ఇటాలియన్ మహాకవి. – 22.

డానియెల్స్ (Daniels), రోలన్డ్ (1819–1855) – జర్మన్ వైద్యుడు, "కమ్యూనిస్ట్ లీగు" సభ్యుడు, కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో ముద్దాయి (1852); ప్రకృతి విజ్ఞానశాస్త్రానికి గతితార్కిక భౌతికవాదాన్ని అన్వయించేందుకు ప్రయత్నించిన ప్రథముల్లో ఒకడు; మార్క్స్ ఎంగెల్స్‌ల మిత్రుడు. – 131, 132.

డార్విన్ (Darwin), చార్లెస్ రాబర్ట్ (1809–1882) – గొప్ప ఆంగ్ల ప్రకృతి అధ్యయనవేత్త, శాస్త్రీయ పరిణామవాద జీవశాస్త్ర జనకుడు. – 7, 9, 15, 36, 79, 92, 108, 147.

డికెయార్కస్ (Dicaearchus) (క్రీ. పూ. 4వ శతాబ్దం) – గ్రీకు పండితుడు, అరిస్టాటిల్ శిష్యుడు; చరిత్ర, రాజకీయాలు, తత్వశాస్త్రం, భూగోళశాస్త్రం మొదలైన వాటిపై పలు రచనలు చేశాడు. – 233.

డిజ్రాయెలీ (Disraeli), బెంజమిన్, లార్డ్ బీకన్స్‌ఫీల్డ్ (1804–1881) – ఆంగ్ల రాజనీతిజ్ఞుడు, రచయిత; టోరీ, కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు, ప్రధాన మంత్రి (1868–70, 1874–80). – 57.

డిద్రో (Diderot), డెనీ (1713–1784) – గొప్ప ఫ్రెంచి నిరీశ్వరవాద తత్వవేత్త, యాంత్రిక భౌతికవాది, ఫ్రెంచి విప్లవ బూర్జువా సైద్ధాంతికుల్లో ఒకడు, విజ్ఞాన సర్వస్వవాదుల నాయకుడు. – 76.

డిట్స్ (Dietz), జోహన్ హైన్రిహ్ విల్‌హెల్మ్ (1843–1922) – జర్మన్ సోషల్-డెమోక్రట్, ఒక సోషల్-డెమోక్రటిక్ ప్రచురణాలయాన్ని స్థాపించాడు; 1881నుండి జర్మనీ పార్లమెంటు రైహ్‌స్టాగ్‌లో సభ్యుడు. – 137.

డియోనీసియస్, హెలికర్నసస్ వాసి (Dionysius of Halicarnassus) (క్రీ. పూ. ఒకటవ శతాబ్దం – క్రీ. శ. ఒకటవ శతాబ్దం) – ప్రాచీన గ్రీకు చరిత్రకారుడు, అలంకార శాస్త్రజ్ఞుడు, "రోమన్ ప్రాచీన చరిత్ర" రచయిత. – 237.

డియోడోరస్, సిసిలీ వాసి (Diodorus of Sicily) (క్రీ. పూ. సుమారు 80–29) – ప్రాచీన గ్రీకు చరిత్రకారుడు, చరిత్రపై రచనలు చేశాడు. – 271.

డుంకెర్ (Duncker), ఫ్రాంజ్ (1822–1888) – జర్మన్ బూర్జువా రాజకీయవేత్త, ప్రచురణకర్త. – 27.

డున్స్ (Duns), స్కోటస్ జొహాన్నస్ (సుమారు 1265 – 1308) – ఆంగ్ల పండిత తత్వవేత్త, మధ్యయుగాల్లో భౌతికవాద తొట్టతొలి రూపమైన నామినలిజం ప్రతినిధి, "ఆక్స్‌ఫర్డ్ రచన" రచయిత. – 38.

డెకార్ట్ (Descartes), రెనే (1596–1650) – సుప్రసిద్ధ ఫ్రెంచి ద్వంద్వవాద తత్వవేత్త (dualist), గణితశాస్త్రవేత్త, ప్రకృతి అధ్యయనవేత్త. – 76.

డెమొక్రిటస్ (Democritus) (క్రీ. పూ. సుమారు 460 – సుమారు 370) – ప్రాచీన గ్రీకు భౌతికవాద తత్వవేత్త, పరమాణు సిద్ధాంత జనకుల్లో ఒకడు. – 39.

డెమొస్థనీస్ (Demosthenes) (క్రీ. పూ. 384–322) – ప్రసిద్ధ ప్రాచీన గ్రీకు వక్త, రాజకీయవేత్త. – 232.

డొలెషాల్ (Dolleschall), లొరెంజ్ (జననం 1790) – కొలోన్‌లో పోలీసు అధికారి (1819–47); "Rheinische Zeitung" సెన్సారు అధికారి. – 22.

డోడ్వెల్ (Dodwell), హెన్రీ (మరణం 1784) – ఆంగ్ల భౌతికవాద శాస్త్రవేత్త. – 40.

డ్యురో డి ల మాల్ (Dureau de la Malle), అడోల్ఫ్ (1777–1857) – ఫ్రెంచి కవి, చరిత్రకారుడు. – 263.

డ్యూరింగ్ (Dühring), ఒయ్‌గెన్ (1833–1921) – జర్మన్ పృథక్కలవాద తత్వవేత్త, అపభ్రంశ అర్థశాస్త్రవేత్త, అభివృద్ధినిరోధక పెటీబూర్జువా సోషలిజంయొక్క ప్రతినిధి. ఈయన తన తత్వశాస్త్రంలో భావవాదాన్నీ, అపభ్రంశ భౌతికవాదాన్నీ, పాజిటివిజాన్నీ మేళవించాడు; అధిభౌతికవాది; బెర్లిన్ విశ్వవిద్యాలయంలో రీడర్ (1863–77). – 35, 36.

థామ్సన్ (Thomson), విలియం (1892నుండి లార్డ్ కెల్విన్) (1824–1907) – ప్రముఖ ఆంగ్ల భౌతికశాస్త్రవేత్త, థెర్మో డైనమిక్స్, ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, గణిత భౌతికశాస్త్ర రంగాల్లో కృషిచేశాడు; 1852లో "విశ్వంయొక్క ఉష్ణమరణం" అనే భౌతికవాద ప్రతిపాదనను ముందుకు తెచ్చాడు. – 12.

థియొడోరిహ్ (Theodorich) – పశ్చిమ గోథ్‌ల రాజులు యిద్దరి పేరు: మొదటి థియొడోరిహ్ (సుమారు 418–51 ప్రాంతంలో పాలించాడు), రెండవ థియొడోరిహ్ (453–66 ప్రాంతంలో పాలించాడు), తూర్పు గోథ్‌ల రాజు (474–526 సంవత్సరాల్లో పాలించాడు). – 261.

థియొాక్రిటస్ (Theocritus) – క్రీ. పూ. 3వ శతాబ్దానికి చెందిన ప్రాచీన గ్రీకు కవి. – 209.

థుసిడిడెస్ (Thucydides) (క్రీ. పూ. సుమారు 460–395) – ప్రసిద్ధ ప్రాచీన గ్రీకు చరిత్రకారుడు, "పెలొపొనేషియన్ యుద్ధ చరిత్ర" రచయిత. – 240.

థోర్‌వాల్డ్సెన్ (Thorwaldsen), బెర్టెల్ (1768–1844) – ప్రసిద్ధ డేనిష్ శిల్పి. – 9.

ద్రెపే (Deprez), మర్సెల్ (1843–1918) – ఫ్రెంచి భౌతికశాస్త్రవేత్త, ఎలెక్ట్రికల్ ఇంజనీరు, సుదీర్ఘ దూరాలకు విద్యుచ్ఛక్తిని ప్రసరింపజేసే సమస్యపై కృషిచేశాడు. – 109.

నదెజ్డె (Nadejde), జోన్ (1854–1928) – రుమేనియన్ పత్రికా రచయిత, దుబాసీ, సోషల్-డెమోక్రట్; 1890 దశకంలో అవకాశవాదిగా మారాడు. – 137.

నిబుర్ (Niebuhr), బర్తోల్డ్ గెయొర్గ్ (1776–1831) – జర్మన్ బూర్జువా చరిత్రకారుడు, పురా చరిత్రపై పలు గ్రంథాలు రచించాడు. – 234, 236, 260, 304.

నియార్ఖస్ (Nearchus) (క్రీ. పూ. సుమారు 360 – సుమారు 312) – మాసెడోనియా నౌకాదళాధిపతి, ఇండియానుండి మెసొపొటేమియాకు మాసెడోనియన్ నౌకాదళ ప్రయాణాన్ని వర్ణించాడు. – 192.

నెపోలియన్, మొదటి (Napoleon I), బోనపార్ట్ (1769–1821) – ఫ్రెంచి చక్రవర్తి (1804–1814, 1815). – 42, 64, 73, 98.

నెపోలియన్, మూడవ (Napoleon III), (లూయీ నెపోలియన్ బోనపార్ట్) (1808–1873) – మొదటి నెపోలియన్ భ్రాతీయుడు, రెండవ రిపబ్లిక్ అధ్యక్షుడు (1848–51), ఫ్రెంచి చక్రవర్తి (1852–70). – 27, 54, 67, 194, 218.

నెపోలియన్, రాజకుమారుడు – చూ: బోనపార్ట్, నెపోలియన్ జొసెఫ్ షర్ల్ పాల్.

నోత్యుంగ్ (Nothjung), పెతెర్ (1821–1866) – జర్మన్ దర్జీ పనివాడు, కొలోన్ కార్మిక యూనియన్, "కమ్యూనిస్టు లీగు"ల సభ్యుడు; కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో నిందితుడు (1852). – 131, 132.

న్యూటన్ (Newton), ఐసక్ (1642–1727) – గొప్ప ఆంగ్ల భౌతికశాస్త్రవేత్త, ఖగోళశాస్త్రవేత్త, గణితశాస్త్రవేత్త, సాంప్రదాయిక యంత్రగతిశాస్త్ర స్థాపకుడు. – 79.

పగనీని (Paganini), నికోలో (1782–1840) – గొప్ప ఇటాలియన్ వాయులీన వాద్యగాడు, వాగ్గేయకారుడు. – 9.

పామర్‌స్టన్ (Palmerston), హెన్రీ జాన్ టెంపిల్, వైకౌంట్ (1784–1865) – బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు, టోరీ; 1830నుండి విగ్ నాయకుల్లో ఒకడు; విదేశాంగ మంత్రి (1830–34, 1835–41, 1846–51), హోమ్ మంత్రి (1852–55), ప్రధానమంత్రి (1855–58, 1859–65). – 27.

పిసిస్ట్రాటస్ (Pisistratus) (క్రీ. పూ. సుమారు 600–527) – ఏథెన్స్ నియంత (విరామాలతో క్రీ. పూ. 560–527). – 253.

పెర్సియస్ (Perseus) (క్రీ. పూ. 212–166) – మాసెడోనియా రాజు (క్రీ. పూ. 179–168). – 280.

ప్రీస్ట్‌లీ (Priestley), జోసెఫ్ (1733–1804) – ప్రసిద్ధ ఆంగ్ల రసాయనశాస్త్రవేత్త, భౌతికవాద తత్వవేత్త, ప్రగతిశీల ప్రజా ప్రముఖుడు. – 40.

ప్రూడన్ (Proudhon), ప్యేర్ జోసెఫ్ (1809–1865) – ఫ్రెంచి పత్రికా రచయిత, అర్థశాస్త్రవేత్త, సామాజిక శాస్త్రవేత్త, పెటీబూర్జువావర్గ సిద్ధాంతకారుడు, అరాజకవాద సిద్ధాంత స్థాపకులలో ఒకడు. – 24, 74, 127.

ప్రొకోపియస్, సీజరియా వాసి (Procopius of Caesarea) (5వ శతాబ్ది చివర –

సుమారు 562) – బైజాంటైన్ చరిత్రకారుడు, "పర్షియన్లతోను, వాండల్సుతోను, గోథ్‌లతోనూ జస్టీనియన్ యుద్ధాల చరిత్ర" గ్రంథకర్త. – 202.

ప్లినీ (Pliny) (గాయస్ ప్లినియస్ సెకండస్) (23–79) – రోమన్ విజ్ఞానశాస్త్రజ్ఞుడు, 37 సంపుటాల "ప్రాకృతిక చరిత్ర" గ్రంథకర్త. – 276, 280.

ప్లూటార్క్ (Plutarch) (సుమారు 46–125) – ప్రాచీన గ్రీకు రచయిత, భావవాద తత్వవేత్త. – 196.

ఫుస్టేల్ డి కులాంజ్ (Fustel de Coulanges), నుమా డెనీ (1830–1889) – ఫ్రెంచి బూర్జువా చరిత్రకారుడు, "ప్రాచీన పౌర సమాజం" అనే గ్రంథ రచయిత. – 237.

ఫెర్డినాండ్, ఐదవ, కేథలిక్ (Ferdinand V) (1452–1516) – కాస్టైల్ రాజు (1474–1504), గవర్నరు (1507–16), రెండవ ఫెర్డినాండ్ పేర ఆరగాన్ రాజు (1479–1516). – 184.

ఫేండెర్ (Pfänder), కార్ల్ (1818–1876) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమ నాయకుల్లో ఒకడు; చిత్రకారుడు; లండన్లో ప్రవాసి (1845నుండి); లండనులోని "జర్మన్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ," "కమ్యూనిస్టు లీగు" కేంద్ర కమిటీ, మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ (1864–67, 1870–72)లలో సభ్యుడు. మార్క్స్ ఎంగెల్సుల సహచరుడు. – 121, 122.

ఫేబియన్ గణం (Fabian) – రోమన్ కులీన గణం. – 260.

ఫైసొన్ (Fison), లారిమెర్ (1832–1907) – బ్రిటిష్ నరవర్గ విశ్లేషణ శాస్త్రజ్ఞుడు, ఆస్ట్రేలియాపై నిపుణుడు, మిషనరీ. ఆస్ట్రేలియన్, ఫిజియన్ తెగలపై పలు రచనలు చేశాడు. – 175, 177.

ఫోగ్ట్ (Vogt), కార్ల్ (1817–1895) – జర్మన్ ప్రకృతి అధ్యయనవేత్త, అపభ్రంశ భౌతికవాది, పెటీబూర్జువా ప్రజాస్వామ్యవాది; 1848–49 నాటి జర్మనీలో జరిగిన విప్లవంలో పాల్గొన్నాడు; 50–60 దశకాలలో ప్రవాసంలో ఉన్న రోజుల్లో లూయీ బోనపార్ట్ కిరాయి ఏజంటు. – 27.

ఫోర్‌స్టర్ (Forster), విలియం ఎడ్వర్డ్ (1818–1886) – బ్రిటిష్ కార్ఖానాదారు,

రాజకీయవేత్త; లిబరల్; పార్లమెంటు సభ్యుడు; ఐర్లండుకు సెక్రటరీ ఆఫ్ స్టేట్ (1880–82); జాతీయ విముక్తి పోరాటాన్ని తీవ్రంగా అణచివేసే విధానాన్ని అనుసరించాడు. – 55, 56.

ఫోరియర్ (Fourier), చార్ల్స (1772–1837) – గొప్ప ఫ్రెంచి ఊహాజనిత సోషలిస్టు. – 63, 65, 69, 70, 92, 95, 96, 149, 204, 291, 312.

ఫ్రీమన్ (Freeman), ఎడ్వర్డ్ అగస్టస్ (1823 – 1892) – ఆంగ్ల బూర్జువా చరిత్రకారుడు, లిబరల్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు. – 136.

ఫ్రెడెరిక్ విల్‌హెల్మ్, మూడవ (Frederick William III) (1770–1840) – ప్రష్యా రాజు (1797–1840). – 22, 98.

ఫ్రెయిలిగ్రాత్ (Freiligrath), ఫెర్డినాండ్ (1810–1876) – జర్మన్ కవి, మొదట రొమాంటిక్, తర్వాత విప్లవ కవి; 1848–49లో "Neue Rheinische Zeitung" పత్రికా సంపాదకుల్లో ఒకడు; ''కమ్యూనిస్టు లీగు'' సభ్యుడు; 1850 దశకంలో విప్లవ పోరాటంనుంచి వైదొలగాడు. – 132.

ఫ్లొకోన్ (Flocon), ఫెర్డినాండ్ (1800–1866) – ఫ్రెంచి రాజకీయవేత్త, పత్రికా రచయిత, పెటీబూర్జువా ప్రజాస్వామికవాది, "Réforme" పత్రికా సంపాదకుడు, తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు (1848). – 25, 126.

బక్‌లాండ్ (Buckland), విలియం (1784–1856) – ఆంగ్ల భూగర్భశాస్త్రవేత్త, పురోహితుడు; తన రచనల్లో భూగర్భ శాస్త్రీయ వాస్తవాలను బైబిలులోని పుక్కిటి పురాణ కథలతో సరిపుచ్చ ప్రయత్నించాడు. – 41.

బబేఫ్ (Babeuf), గ్రాఖ్ (అసలు పేరు ఫ్రాన్సువా నొయెల్) (1760–1797) – ఫ్రెంచి విప్లవవాది, ఊహాజనిత సమానతావాద కమ్యూనిజం సిద్ధాంతకర్త; ''సమానుల కుట్ర'' ఆర్గనైజరు. – 63.

బర్బేస్ (Barbès), అర్మాన్ (1809–1870) – ఫ్రెంచి విప్లవవాది, పెటీబూర్జువా ప్రజాస్వామికవాది; 1848 నాటి విప్లవంలో చురుకైన పాత్ర వహించాడు; 1848 మే 15 నాటి ఘటనలలో పాల్గొన్నందుకుగాను యావజ్జీవ కారాగార శిక్ష విధింపబడ్డాడు, కాని 1854లో క్షమింపబడ్డాడు. – 112.

బాంక్రాఫ్ట్ (Bancroft), హ్యూబర్ట్ హౌ (1832–1918) – అమెరికన్ బూర్జువా చరిత్రకారుడు, చరిత్రపైన, నరవర్గ విశ్లేషణ శాస్త్రంపైన గ్రంథాలు రచించాడు. – 167, 182, 184, 293.

బాంగ్ (Bang), ఆంటొన్ క్రిస్టియన్ (1840–1913) – నార్వీజియన్ మతతత్వవేత్త, స్కాండినేవియన్ పురాణాలపైన, నార్వేలో క్రిస్టియన్ మత చరిత్రపైన గ్రంథాలు రచించాడు. – 271.

బాహోఫెన్ (Bachofen), యోహాన్ జాకొబ్ (1815–1887) – ప్రముఖ స్విస్ చరిత్రకారుడు, లాయరు, "తల్లిహక్కు" రచయిత. – 137–41, 143, 146, 148, 162, 172, 173, 181–183, 185, 188.

బిస్మార్క్ (Bismark), ఒట్టో, ప్రిన్స్ (1815–1898) – ప్రష్యన్ రాజనీతిజ్ఞుడు, దౌత్యవ్యవహర్త; ప్రష్యన్ బడా భూస్వాముల ప్రయోజనాలను బలపరచాడు; ప్రష్యా మంత్రి-అధ్యక్షుడు (1862–1871), జర్మన్ సామ్రాజ్యపు రైహ్‌ఛాన్సెలర్ (1871–1890). – 97, 98, 132, 133, 196, 306, 307.

బుగ్గె (Bugge), సోఫుస్ (1833–1907) – నార్వీజియన్ భాషాశాస్త్రజ్ఞుడు, ప్రాచీన స్కాండినేవియన్ సాహిత్య, పురాణాలపై అధ్యయన వ్యాసాలు రచించాడు. – 271.

బెక్ (Beck), అలెగ్జాండ్ర్ – దర్జీపనివాడు, "న్యాయవంతుల లీగు" సభ్యుడు, ఈ సందర్భంగా 1846లో అరెస్టు చెయ్యబడ్డాడు; కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసు విచారణలో (1852) సాక్షిగా హాజరయ్యాడు. – 115.

బెక్కెర్ (Becker), ఔగుస్ట్ (1814–1871) – జర్మన్ పత్రికా రచయిత, వైట్లింగ్ సమర్థకుడు, స్విట్జర్లాండులో "న్యాయవంతుల లీగు" సభ్యుడు; జర్మనీలో 1848–49 నాటి విప్లవంలో పాల్గొన్నాడు; 1850వ దశకపు మొదటి సంవత్సరాల్లో అమెరికాకు ప్రవాసం వెళ్లాడు; అక్కడ అతను ప్రజాస్వామిక వార్తాపత్రికలకు రచనలు చేశాడు. – 114.

బెక్కెర్ (Becker), విల్‌హెల్మ్ అడోల్ఫ్ (1796–1846) – జర్మన్ చరిత్రకారుడు, ప్రాచీన చరిత్రపై గ్రంథాలు రాశాడు. – 233.

బెక్కెర్ (Becker), హేర్మన్ హైన్రిఖ్ (1820–1885) – జర్మన్ లాయరు, పత్రికా రచయిత, 1850నుంచి "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు; కొలోన్ కుట్రకేసులో ముద్దాయి; తరువాతి కాలంలో జాతీయ ఉదారవాది. – 131, 135.

బెడ గౌరవనీయమైన (Bede The Venerable) (సుమారు 673–735) – ఆంగ్ల సన్యాసి, పండితుడు, చరిత్రకారుడు. – 268.

బేకన్ (Bacon), ఫ్రాన్సిస్, డి వెరులమ్ (1561–1626) – గొప్ప ఆంగ్ల తత్వవేత్త, ఆంగ్ల భౌతికవాద జనకుడు. – 38–41, 77.

బొన్యే (Bonnier), షార్ల్ (జననం 1863) – ఫ్రెంచి సోషలిస్టు, పత్రికా రచయిత. – 168.

బోనపార్ట్ – చూ: నెపోలియన్, మూడవ.

బోనపార్ట్ (Bonaparte), నెపోలియన్ జొసెఫ్ షార్ల్ పాల్ (1822–1891) – జెరోమ్ బోనపార్ట్ కొడుకు, లూయీ బోనపార్ట్ భ్రాతృపుత్రుడు, రెండవ రిపబ్లిక్ కాలంలో, రాజ్యాంగనిర్ణయ, శాసన సభలకు డెప్యూటీ. – 27.

బోమె (Böhme), జాకొబ్ (1575–1624) – జర్మన్ చేతివృత్తిపనివాడు, నిగూఢవాద తత్వవేత్త. – 39.

బోర్న్ (Born), స్టెఫాన్ (అసలు పేరు బటర్‌మిల్ష్) (1824–1898) – జర్మన్ కార్మికుడు, "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు; జర్మనీలో 1848–49 నాటి విప్లవ కాలంలో జర్మన్ కార్మికోద్యమంలో సంస్కరణవాద ప్రతినిధుల్లో ఒకడు. – 127.

బోర్న్‌స్టెడ్ (Bornsted), అడల్‌బెర్ట్ (1808–1851) – జర్మన్ పెటీబూర్జువా ప్రజాస్వామ్యవాది; 1847–48లో "Deutsche-Brüsseler Zeitung" పత్రికను స్థాపించి, దానికి సంపాదకత్వం వహించాడు; 1848 మార్చిదాకా "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు, 1848 మార్చిలో లీగునుంచి బహిష్కరింపబడ్డాడు. పారిస్‌లోని జర్మన్ ప్రవాసుల వలంటీరు దళం ఆర్గనైజర్లలో ఒకడు, ఈ దళం 1848 ఏప్రిల్ నాటి బాడెన్ తిరుగుబాటులో పాల్గొంది. – 125.

బోర్న్‌స్టైన్ (Börnstein), అర్నోల్డ్ బేర్న్‌హర్డ్ కార్ల్ (1808–1849) – జర్మన్ పెటీబూర్జువా ప్రజాస్వామ్యవాది, పారిస్‌లోని జర్మన్ ప్రవాసుల వలంటీరు దళానికి నాయకుడు. ఈ దళం 1848 ఏప్రిల్ నాటి బాడెన్ తిరుగుబాటులో పాల్గొంది. – 125.

బోలింగ్‌బ్రోక్ (Bolingbroke), హెన్రీ (1678–1751) – ఇంగ్లీషు ద్వైతవాద తత్వవేత్త, రాజకీయవేత్త, టోరీ నాయకుడు. – 50.

బౌవర్ (Bauer), బ్రూనో (1809–1882) – జర్మన్ భావవాద తత్వవేత్త, ప్రముఖ యువ హేగెలియన్, బూర్జువా రాడికల్; 1866 దరిమిలా జాతీయ ఉదారవాది. – 23.

బౌవర్ (Bauer), హైన్రిఖ్ – జర్మన్ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి; "న్యాయవంతుల లీగు" నాయకులలో ఒకడు, "కమ్యూనిస్టు లీగు" కేంద్ర కమిటీ సభ్యుడు; 1851లో ఆస్ట్రేలియాకు వలసపోయాడు. – 23, 112, 113, 125, 129, 131.

బ్యూర్గెర్స్ (Bürgers), హైన్రిహ్ (1820–1878) – జర్మన్ రాడికల్ పత్రికా రచయిత. 1842–43 సంవత్సరాల్లో "Rheinische Zeitung" పత్రికకు వ్యాసాలు రాశాడు. "Neue Rheinische Zeitung" పత్రికకు ఒక సంపాదకుడుగా పనిచేశాడు; 1850నుండి "కమ్యూనిస్టు లీగు" కేంద్ర కమిటీ సభ్యుల్లో ఒకడు; 1852లో కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో ముద్దాయి; దరిమిలా ప్రోగ్రెసిస్టు. – 132.

బ్యూహ్నర్ (Büchner), గెయోర్గ్ (1813–1837) – జర్మన్ రచయిత, విప్లవ ప్రజాస్వామ్యవాది; 1834లో హెస్సెన్‌లోని మానవ "హక్కుల మహా సంఘ" ఆర్గనైజర్లలో ఒకడు. "గుడిసెలకు శాంతి, రాజభవనాలపై యుద్ధం" అన్న శీర్షికతో రాయబడిన హెస్సెన్ రైతులకు విజ్ఞప్తి కర్త. – 113.

బ్రెంటనో (Brentano), లుయో (1844–1931) – జర్మన్ అపభ్రంశ బూర్జువా ఆర్థికశాస్త్రవేత్త, కెథీడర్ సోషలిజం ప్రతినిధుల్లో ఒకడు. – 59.

బ్రైట్ (Bright), జాన్ (1811–1889) – ఇంగ్లీషు ఫ్యాక్టరీ యజమాని, ఫ్రీట్రేడర్; ధాన్యచట్టాల వ్యతిరేక లీగు సంస్థాపకులలో ఒకడు; 1860 దశకం చివరి సంవత్సరాలనుంచి లిబరల్ పార్టీకి నాయకుడు; పలు లిబరల్ ప్రభుత్వాలలో మంత్రి పదవులు నిర్వహించాడు. – 56.

బ్లాంక్ (Blanc), లూయీ (1811–1882) – ఫ్రెంచి పెటీబూర్జువా సోషలిస్టు, చరిత్రకారుడు; 1848లో తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు; లక్సెంబుర్గ్ కమిషన్ అధ్యక్షుడు; 1848 ఆగస్టునుండి లండన్‌లోని పెటీబూర్జువా ప్రవాసుల నాయకుల్లో ఒకడు. – 127, 130.

బ్లాంకీ (Blanqui), లూయీ ఒగూస్ట్ (1805–1881) – ఫ్రెంచి విప్లవవాది, ఊహాజనిత కమ్యూనిస్టు; 1848 విప్లవకాలంలో ఫ్రాన్సులో ప్రజాతంత్ర, శ్రామికవర్గ ఉద్యమంయొక్క మిక్కిలి తీవ్రవాద విభాగంతో కలిసివున్నాడు; పలుమార్లు జైలు శిక్షలు అనుభవించాడు. – 112.

బ్లైహ్రోడెర్ (Bleichröder), గేర్సాన్ (1822–1893) – జర్మన్ బ్యాంకరు, బిస్మార్కు డబ్బు వ్యవహారాల నిర్వాహకుడు, ఆర్థిక విషయాలలో అతని సలహాదారూ, చట్టా వ్యాపారాలలో మధ్యదళారీ. – 307.

మజ్జీని (Mazzini), జూసెపె (1805–1872) – ఇటాలియన్ విప్లవవాది, బూర్జువా ప్రజాస్వామ్యవాది; ఇటలీ జాతీయ విమోచనోద్యమ నాయకుల్లో ఒకడు; 1849లో రోమన్ రిపబ్లిక్ తాత్కాలిక ప్రభుత్వాధిపతి; 1850లో లండనులో యూరపియన్ డెమోక్రసీ కేంద్ర కమిటీ ఆర్గనైజర్లలో ఒకడు; మొదటి ఇంటర్నేషనల్ స్థాపనకాలంలో దాన్ని తన ప్రభావం కిందకి తెచ్చుకోవాలని యితను ప్రయత్నించాడు; ఇటలీలో స్వతంత్ర కార్మికోద్యమాభివృద్ధిని కుంటువడచేశాడు. – 113, 116, 130.

మాంటెల్ (Mantell), గిడియన్ ఆల్గెర్నాన్ (1790–1852) – ఆంగ్ల భూగర్భ శాస్త్రవేత్త, పురాజీవశాస్త్రవేత్త; తన రచనల్లో అతను శాస్త్రీయ సమాచారాన్ని బైబిల్లోని పుక్కిటి పురాణాలతో పొసిగించే ప్రయత్నం చేశాడు. – 41.

మాక్‌లెన్నాన్ (McLennan), జాన్ ఫెర్గూసన్ (1827–1881) – స్కాటిష్ బూర్జువా లాయరు, చరిత్రకారుడు. వివాహ, కుటుంబాల చరిత్రపై పలు రచనలు చేశాడు. – 141, 142–47, 149, 160, 179, 194, 218, 264.

మాబ్లీ (Mably), గేబ్రియెల్ (1709–1785) – ప్రముఖ ఫ్రెంచి సామాజికశాస్త్రవేత్త, ఊహాజనిత సమానతావాద కమ్యూనిజం ప్రతినిధి. – 63.

మార్క్స్ (Marx), కార్ల్ (1818–1883). – 22, 31, 34–37, 40, 41, 51, 84–86, 93, 94, 108, 109, 112, 115, 118, 119, 121, 122, 124–25, 128–29, 131, 133–35, 147, 149, 151, 161, 168, 172, 179, 181, 189–90, 195, 198, 221, 233–36, 238, 240, 256, 291, 313.

మార్క్స్ (Marx), జెన్నీ (వివాహ పూర్వ నామం ఫన్ వెస్ట్‌ఫాలెన్) (1814–1881) – కార్ల్ మార్క్స్ భార్య, స్నేహితురాలు, సహచరి. – 23, 120.

మార్టిన్యేట్టి (Martignetti), పాస్కువలె – ఇటాలియన్ సోషలిస్టు, మార్క్స్, ఎంగెల్సుల రచనలను ఇటాలియన్ భాషలోకి అనువదించాడు. – 137.

మూంత్సెర్ (Münzer), థామస్ (సుమారు 1490–1525) – గొప్ప జర్మన్

విప్లవవాది, సంస్కరణోద్యమ కాలంలోనూ, 1525 నాటి రైతుయుద్ధ కాలంలోనూ పేదరైతుల నాయకుడు, సైద్ధాంతికుడు; ఊహాజనిత సమానతావాద కమ్యూనిజం భావాలను ప్రచారం చేశాడు. – 63.

మూడి (Moody), డ్వైట్ లైమన్ (1837–1899) – అమెరికన్ ప్రొటెస్టెంట్ పూజారి, మతబోధకుడు. – 54.

మెంటెల్ (Mentel), క్రిస్టియన్ ఫ్రీడ్రిహ్ (జననం 1812) – జర్మన్ దర్జీపనివాడు, "న్యాయాత్ముల లీగు" సభ్యుడు, 1846–47లో లీగు కేసులో జైలు శిక్షకు గురయ్యాడు. – 115.

మెటర్నిఖ్ (Metternich), క్లెమెన్స్, ప్రిన్స్ (1773–1859) – అభివృద్ధినిరోధక ఆస్ట్రియన్ రాజనీతిజ్ఞుడు, విదేశాంగ మంత్రి (1809–21), ఛాన్సెలర్ (1821–48), హోలీ అలయన్స్ ఏర్పాటుదార్లలో ఒకడు. – 98.

మెయిన్ (Maine), హెన్రీ జేమ్స్ సామ్నెర్ (1822–1888) – ఆంగ్ల లాయరు, రచయిత. – 212.

మేనర్స్ (Manners), జాన్ జేమ్స్ రాబర్ట్ (1818–1906) – బ్రిటిష్ రాజకీయవేత్త, టోరీ. కన్సర్వేటివ్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడు, కన్సర్వేటివ్ ప్రభుత్వాల్లో పదేపదే మంత్రి పదవి వహించాడు. – 57.

మొల్యేర్ (Molière), జాన్ బాటిస్ట్ (అసలు పేరు పొక్లేన్) (1622–1673) – గొప్ప ఫ్రెంచి నాటకరచయిత. – 301.

మోమ్సెన్ (Mommsen), థియొడోర్ (1817–1903) – జర్మన్ బూర్జువా చరిత్రకారుడు, ప్రాచీన రోము చరిత్రపై పలు గ్రంథాలు రచించాడు. – 234, 256–258, 260, 261.

మోరెల్లీ (Morelly) (18వ శతాబ్దం) – ఫ్రాన్సులో ఊహాజనిత సమానతావాద కమ్యూనిజం ప్రతినిధి. – 63.

మోర్గన్ (Morgan), ల్యూయిస్ హెన్రీ (1818–1881) – ప్రసిద్ధ అమెరికన్ విజ్ఞానశాస్త్రవేత్త, ఆదిమ సమాజ చరిత్రకారుడు, సద్యోజనిత భౌతికవాది. – 134–37, 143, 146–151, 153, 158, 160, 162, 168, 170-71, 174,

179, 199, 215–18, 221, 228, 234, 235, 238, 241–42, 250, 260, 268, 274, 291, 312, 313.

మోల్ (Moll), యోసెఫ్ (1813–1849) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖుడు; "న్యాయవంతుల లీగు" నాయకుల్లో ఒకడు; "కమ్యూనిస్టు లీగు" కేంద్ర కమిటీ సభ్యుడు, 1849 నాటి బాడెన్ తిరుగుబాటులో పాల్గొన్నాడు; మూర్గ్ నది వద్ద జరిగిన యుద్ధంలో నేలకొరిగాడు. – 113, 122, 125, 128.

మోస్కస్ (Moschus) – క్రీ. పూ. 2వ శతాబ్ది మధ్య కాలపు ప్రాచీన గ్రీకు కవి. – 209.

మౌరెర్ (Maurer), గెయోర్గ్ లుడ్విగ్ (1790–1872) – ప్రముఖ జర్మన్ బూర్జువా చరిత్రకారుడు; ప్రాచీన, మధ్యయుగాలనాటి జర్మనీ సామాజిక వ్యవస్థపై పరిశోధన చేశాడు. – 228, 272, 274.

యాకోబి (Jacoby), అబ్రహాం (1830–1919) – జర్మన్ వైద్యుడు, "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు, కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో నిందితుడు (1852). 1853లో ఇంగ్లండుకీ, తర్వాత అమెరికాకీ ప్రవాసం వెళ్ళాడు, అక్కడ పత్రికల్లో అతను మార్క్సిస్టు భావాలను ప్రచారం చేశాడు. అమెరికన్ అంతర్యుద్ధాల్లో ఉత్తరాది రాష్ట్రాల పక్షాన పాల్గొన్నాడు. పలు వైద్య సంస్థలలో ఆచార్యుడు, అధ్యక్షుడు; వైద్యశాస్త్రంపై పలు రచనలు చేశాడు. – 131–132.

యారొస్లావ్, వివేకి (Yaroslav the Wise) (978–1054) – కీయెవ్ గ్రాండ్ ప్రిన్స్ (1019–54). – 192.

యూరిపిడీస్ (Euripides) (క్రీ. పూ. సుమారు 480 – సుమారు 406) – ప్రాచీన గ్రీక్ నాటకరచయిత, ప్రామాణిక విషాదాంత నాటకాల రచయిత. – 197.

యోహన్ (ఫిలాలెత్స్) (Johann Philalethes) (1801–1873) – సాక్సనీ రాజు (1854–73), డాంటె రచనలు అనువదించాడు. – 22.

రఫాయేల్ (Rafael), సాంటీ (1483–1520) – పునర్వికాస దశకు చెందిన గొప్ప ఇటాలియన్ చిత్రకారుడు. – 9.

రవే (Ravé), అన్రీ – ఫ్రెంచి పత్రికా రచయిత; ఎంగెల్స్ రచనలను ఫ్రెంచి భాషలోకి అనువదించాడు. – 137.

రూగె (Ruge), ఆర్నాల్డ్ (1802–1880) – జర్మన్ పత్రికా రచయిత, యువ హేగెలియన్, బూర్జువా అతివాది. ఫ్రాంక్‌ఫర్ట్ జాతీయ అసెంబ్లీ సభ్యుడు (1848), దానిలో అతను వామపక్షంతో వున్నాడు. 1850 దశకంలో ఇంగ్లండులోని జర్మన్ పెటీబూర్జువా ప్రవాసుల నాయకుల్లో ఒకడు. 1866 తర్వాత నేషనల్ లిబరల్. – 23, 130.

రూసో (Rousseau), జాన్ జాక్ (1712–1778) – ప్రముఖ ఫ్రెంచి వైతాళికుడు, ప్రజాస్వామ్యవాది, పెటీబూర్జువావర్గ సైద్ధాంతికుడు, ద్వైత తత్వవేత్త. – 62, 64.

రెనాన్ (Renan), ఎర్నెస్ట్ (1823–1892) – ఫ్రెంచి భాషాశాస్త్రవేత్త, క్రిస్టియన్ మత చరిత్రకారుడు, భావవాద తత్వవేత్త. – 128.

రేయిఫ్ (Reiff), విల్‌హెల్మ్ యోసెఫ్ (జననం 1824) – కొలోన్‌లోని "కార్మిక సంఘం," "కమ్యూనిస్టు లీగు"ల్లో సభ్యుడు; లీగునుంచి 1850లో అతను తొలగింపబడ్డాడు. కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో ముద్దాయి (1852). – 131–32.

రైట్ (Wright), ఆషెర్ ఆర్థర్ (1803–1875) – 1831–75 మధ్య రెడ్ ఇండియన్ల మధ్య నివసించిన అమెరికన్ మిషనరీ; వాళ్ల భాషకు నిఘంటువును సంకలనం చేశాడు. – 180.

ర్యోజర్ (Röser), పెతెర్ గేర్హార్డ్ (1814–1865) – జర్మన్ కార్మికోద్యమంలో పాల్గొన్నాడు. కొలోన్‌లోని "కార్మిక సంఘం" ఉపాధ్యక్షుడు (1848–49), "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు; కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో ముద్దాయి (1852). దరిమిలా లాసాలియన్లలో చేరాడు. – 131–32.

లమర్టీన్ (Lamartine), అల్‌ఫోన్స్ (1790–1869) – ఫ్రెంచి కవి, చరిత్రకారుడు, రాజకీయవేత్త. 1848లో విదేశాంగ మంత్రి, వాస్తవంలో తాత్కాలిక ప్రభుత్వాధిపతి. – 125–26.

లాంగె (Lange), క్రిస్టియన్ కోన్రడ్ లుడ్విగ్ (1825–1885) – జర్మన్ భాషా సాహిత్య శాస్త్రవేత్త, ప్రాచీన రోము చరిత్రపై కొన్ని రచనలు చేశాడు. – 259.

లాథాం (Latham), రాబర్ట్ గొర్డొన్ (1812–1888) – ఆంగ్ల భాషా సాహిత్య శాస్త్రవేత్త, నరవర్గ విశ్లేషణ శాస్త్రవేత్త. – 143.

లాఫార్గ్ (Lafargue), పాల్ (1842–1911) – అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ నాయకుడు, మార్క్సిజం ప్రచారకుడు. ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు, స్పెయిన్‌కి ఉత్తరప్రత్యుత్తరాలు జరిపే కార్యదర్శి (1866–69). ఇంటర్నేషనల్ శాఖల ఏర్పాటులో ఫ్రాన్సు (1869–70)లోనూ, స్పెయిన్, పోర్చుగల్‌ల (1871–72)లోనూ పాల్గొన్నాడు, హేగ్ మహాసభకు ప్రతినిధి (1872). ఫ్రాన్సులో కార్మిక పార్టీ స్థాపకుల్లో ఒకడు. మార్క్స్ ఎంగెల్సుల సహచరుడు. – 36.

లాప్లాస్ (Laplace), ప్యేర్ సైమన్ (1794–1827) – గొప్ప ఫ్రెంచి ఖగోళశాస్త్రజ్ఞుడు, గణితశాస్త్రవేత్త, భౌతికశాస్త్రవేత్త. కాంట్‌తో ప్రసక్తి లేకుండా స్వతంత్రంగా, సౌరమండలం వాయునీహారికలనుండి ఉత్పన్నమైందన్న అభ్యూహను అభివృద్ధిచేసి, గణితశాస్త్రపరంగా దాన్ని రూఢిచేశాడు. – 42, 80.

లాసాల్ (Lassalle), ఫెర్డినాండ్ (1825–1864) – జర్మన్ పెటీబూర్జువా పబ్లిసిస్టు, న్యాయవాది. 1848–1849లో రేనిష్ రాష్ట్రంలో ప్రజాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నాడు. 1860 దశకం ఆరంభంలో జర్మన్ కార్మికోద్యమంలో చేరాడు. "అఖిల జర్మన్ కార్మిక యూనియన్" సంస్థాపకుల్లో ఒకడు (1863). ప్రష్యా అధినాయకత్వంలో "పైనుండి" జర్మనీ ఏకీకరణను బలపరచాడు. జర్మన్ కార్మికోద్యమంలో అవకాశవాద ధోరణికి పునాది వేశాడు. – 311.

లిన్నేయుసు (Linnaeus-Linné), కార్ల్ (1707–1778) – సుప్రసిద్ధ స్వీడిష్ ప్రకృతి అధ్యయనవేత్త; వృక్ష, జంతుకోటుల వర్గీకరణ సిద్ధాంత వ్యవస్థాపకుడు. - 81.

లివీ (టైటస్ లివియస్) (Livy – Titus Livius) (క్రీ. పూ. 59–క్రీ. శ. 17) – రోమన్ చరిత్రకారుడు, "దాని సంస్థాపన కాలం నాటినుంచి రోమ్ చరిత్ర" గ్రంథ రచయిత. – 257, 259.

లుకియన్ (Lucian) (సుమారు 120–180) – ప్రాచీన గ్రీకు రచయిత, నాస్తికవాది. – 169.

లుబ్బోక్ (Lubbock), జాన్ (1834–1913) – బ్రిటిష్ జీవశాస్త్రజ్ఞుడు, డార్విన్ అనుచరుడు; నరవర్గ విశ్లేషణ శాస్త్రవేత్త, పురాతత్వశాస్త్రవేత్త; ఆదిమ సమాజంపై పలు రచనలు చేశాడు. – 146–47.

లూథర్ (Luther), మార్టిన్ (1483–1546) – రిఫర్మేషన్ (మతసంస్కరణ) దశకు చెందిన ప్రముఖ వ్యక్తి. జర్మనీలో ప్రొటెస్టెంటిజం (లూతరానిజం) స్థాపకుడు. జర్మన్ బర్గర్ల (పట్టణవాసుల) సిద్ధాంతకారుడు. – 47.

లూయీ నెపోలియన్ (Louis Napoleon) – చూ: నెపోలియన్, మూడవ.

లూయీ ఫిలిప్ (Louis Philippe) (1773–1850) – డ్యూక్ ఆఫ్ ఆర్లియన్స్, ఫ్రాన్సు రాజు (1830-48). – 48, 54, 112.

లూయీ బోనపార్ట్ – చూ: నెపోలియన్, మూడవ.

లెద్ర్యూ-రోలిన్ (Ledru-Rollin), అలెగ్జాండర్ ఒగూస్ట్ (1807-1874) - ఫ్రెంచి పబ్లిసిస్టు, పెటీబూర్జువా ప్రజాస్వామ్యవాదుల నాయకుల్లో ఒకడు. “Réforme” పత్రికా సంపాదకుడు. రాజ్యాంగనిర్ణయ, శాసన సభల సభ్యుడు; మహీధరం పార్టీ నాయకుడు; తదుపరి ప్రవాసానికి వెళ్ళాడు. – 130.

లెతూర్నో (Letourneau), షార్ల్ జాన్ మరీ (1831–1902) – ఫ్రెంచి బూర్జువా సామాజికశాస్త్రవేత్త, నరవర్గ విశ్లేషణ శాస్త్రజ్ఞుడు. – 163, 167.

లెస్నెర్ (Lessner), ఫ్రీడ్రిఖ్ (1825–1910) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి. ''కమ్యూనిస్టు లీగు'' సభ్యుడు, 1848–49 విప్లవంలో పాల్గొన్నాడు; కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో నిందితుడు (1852). 1856లో లండనుకు ప్రవాసం వెళ్ళాడు. లండనులోని జర్మన్ కార్మిక ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యుడు, మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు, బ్రిటిష్ ఇండిపెండెంట్ లేబర్ పార్టీ స్థాపకుల్లో ఒకడు. మార్క్స్ ఎంగెల్స్‌ల సహచరుడు. – 122, 132.

లోంగస్ (Longus) (2వ శతాబ్ది చివర – 3వ శతాబ్ది మొదట) – ప్రాచీన గ్రీకు రచయిత. – 209.

లోక్ (Locke), జాన్ (1632–1704) – సుప్రసిద్ధ ద్వైత తత్వవేత్త, ఇంద్రియానుభూతివాది. – 41, 77.

లోహ్నెర్ (Lochner), గెయోర్గ్ (జననం సుమారు 1824) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, వృత్తిరీత్యా వడ్రంగి; ''కమ్యూనిస్టు లీగు''

సభ్యుడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు; మార్క్సు ఎంగెల్సుల సహచరుడు. – 122.

ల్యూత్ప్రాండ్ (Liutprand) (సుమారు 922 – సుమారు 972) – మధ్యయుగపు చరిత్రకారుడు, బిషప్, "ప్రతిఫలం" అనే గ్రంథ రచయిత. – 284.

వాక్స్ముత్ (Wachsmuth), విల్హెల్మ్ (1784-1866) – జర్మన్ బూర్జువా చరిత్రకారుడు, ప్రాచీనాచార సంప్రదాయాలపైనా, యూరపియన్ చరిత్రపైనా పలు రచనలు చేశాడు. – 197.

వాగ్నెర్ (Wagner), రిహర్డ్ (1813–1883) – గొప్ప జర్మన్ సంగీతకారుడు. – 168, 169.

వాట్ (Watt), జేమ్స్ (1736–1819) – గొప్ప ఇంగ్లీషు అన్వేషకుడు, ఆవిరి యంత్రం సృష్టించాడు. – 52.

వాట్సన్ (Watson), జాన్ ఫార్బ్స్ (1827–1892) – ఆంగ్ల వైద్యుడు, వలసలోని అధికారి; 1858–1879లలో లండన్లోని ఇండియా మ్యూజియం డైరెక్టరు, ఇండియాపై పలు రచనలు చేశాడు. – 173.

వారుస్ (Varus), పబ్లియస్ క్వింటిలియస్ (క్రీ. పూ. 53 – క్రి. శ. 9) – రోమన్ రాజకీయ ప్రముఖుడు, సేనాని, జర్మనీలో గవర్నరు (క్రీ. శ. 7–9). ట్యుటోబర్గర్ అడవిలో తిరుగుబాటుదారీ జర్మన్ తెగలతో జరిగిన పోరాటంలో మరణించాడు. – 254.

విక్టోరియా (Victoria) (1819–1901) – గ్రేట్ బ్రిటన్ రాణి (1837–1901). – 73.

విల్లిహ్ (Willich), ఔగుస్ట్ (1810–1878) – ప్రష్యన్ ఆఫీసరు, "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు, 1849లో బాడెన్-ఫల్జ్ తిరుగుబాటులో పాల్గొన్నాడు. 1850లో "కమ్యూనిస్టు లీగు"నుంచి విడిపోయిన దుస్సాహసిక ఒంటెత్తువాద బృంద నాయకుల్లో ఒకడు. 1853లో అమెరికాకు ప్రవాసం వెళ్లాడు, అక్కడ అతను అంతర్యుద్ధంలో ఉత్తరాది రాష్ట్రాల తరఫున పోరాడాడు. – 128, 130–32.

వెలెడా (Veleda) (ఒకటవ శతాబ్ది) – బ్రక్టర్లనే జర్మన్ తెగకు చెందిన మతబోధకురాలు, దైవజ్ఞురాలు, రోమన్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటులో చురుకుగా పాల్గొంది. – 272.

వెనెదే (Veneday), జాకొబ్ (1805–1871) – జర్మన్ అతివాద పత్రికా రచయిత. 1848–49 సంవత్సరాల్లో ఫ్రాంక్‌ఫుర్ట్ జాతీయ అసెంబ్లీ సభ్యుడు, దానిలో వామపక్షంతో కలిసివున్నాడు. దరిమిలా లిబరల్. – 112.

వెస్ట్‌ఫాలెన్ (Westphalen), ఫెర్డినాండ్ ఫన్ (1799–1876) – ప్రష్యన్ అభివృద్ధి నిరోధక రాజనీతిజ్ఞుడు, ఆంతరంగిక శాఖ మంత్రి (1850–58), జెన్నీ మార్క్స్ సవతి సోదరుడు. – 23.

వెస్టెర్మార్క్ (Westermarck), ఎడ్వర్డ్ అలెగ్జాండర్ (1862–1939) – ఫిన్నిష్ బూర్జువా నరవర్గ విశ్లేషణ శాస్త్రవేత్త, సామాజిక శాస్త్రవేత్త. – 163, 165, 167, 182.

వైత్స్ (Waitz), గెయొర్గ్ (1813–1886) – జర్మన్ బూర్జువా చరిత్రకారుడు, జర్మనీ మధ్యయుగ చరిత్రపై పలు రచనలు చేశాడు. – 274.

వైట్లింగ్ (Weitling), విల్‌హెల్మ్ (1808–1871) – జర్మన్ కార్మికోద్యమపు తొలి దశలో ప్రముఖ వ్యక్తి, ఊహాజనిత సమానతావాద కమ్యూనిజం సిద్ధాంతకర్త. – 75, 114–15, 117–18, 120–21, 128, 131.

వేర్ముత్ (Wermuth) – హనోవర్‌లో పోలీసుశాఖ డైరెక్టరు. కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసు విచారణలో సాక్షి (1852). ష్టీబెర్‌తో కలిసి "19వ శతాబ్దపు కమ్యూనిస్టు కుట్రలు" అన్న పుస్తకం రచించాడు. – 111, 123.

వొల్‌ఫ్రామ్ (Wolfram), ఫన్ ఎషెన్‌బాహ్ (జననం: సుమారు 1170 – మరణం: సుమారు 1220) – జర్మన్ మధ్యయుగపు కవి. – 203.

వోల్ఫ్ (Wolf), విల్‌హెల్మ్ (1809–1864) – జర్మన్ శ్రామికవర్గ విప్లవవాది, 1848 మార్చినుండి "కమ్యూనిస్టు లీగు" కేంద్ర కమిటీ సభ్యుడు. 1848–49లో "Neue Rheinische Zeitung" సంపాదకుడు. ఫ్రాంక్‌ఫుర్ట్ జాతీయ అసెంబ్లీ సభ్యుడు. తర్వాత ఇంగ్లండుకి ప్రవాసం వెళ్లాడు. మార్క్స్ ఎంగెల్స్‌ల సహచరుడు, మిత్రుడు. – 122, 125, 127.

షాప్పెర్ (Schapper), కార్ల్ (1812–1870) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, "న్యాయవంతుల లీగు" నాయకుల్లో ఒకడు, "కమ్యూ

నిస్టు లీగు" కేంద్ర కమిటీ సభ్యుడు, జర్మనీలో 1848–49 విప్లవంలో పాల్గొన్నాడు. 1850లో "కమ్యూనిస్టు లీగు"లో చీలిక వచ్చినప్పుడు ఒంటెత్తువాద-దుందుడుకువాద గ్రూపు నాయకుల్లో ఒకడు. 1856లో తిరిగి మార్క్సుతో చేరాడు. మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు. – 112–13, 120, 128, 130–32.

షాఫ్ట్స్‌బరీ (Shaftesbury), ఆంటనీ, కౌంట్ (1671–1713) – ఆంగ్ల తత్వవేత్త, నీతిశాస్త్రవేత్త, దేవవాది; రాజకీయవేత్త, విగ్ పార్టీ సభ్యుడు. – 50.

షూర్జ్ (Schurz), కార్ల్ (1829–1906) – జర్మన్ పెటీబూర్జువా డెమొక్రట్; 1849 నాటి బాడెన్ తిరుగుబాటులో పాల్గొన్నాడు; స్విట్జర్లాండులో ప్రవాసి; దరిమిలా అమెరికన్ రాజనీతిజ్ఞుడు. – 129.

స్టీబెర్ (Steiber), విల్‌హెల్మ్ (1818–1882) – ప్రష్యన్ రాజకీయ పోలీసుశాఖ డైరెక్టరు (1850–1860), కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసు విచారణ నిర్వాహకుడు, దానిలో ప్రధాన సాక్షి. – 111, 123.

ష్యోమన్ (Schömann), గెయోర్గ్ ఫ్రీడ్రిఖ్ (1793–1879) – జర్మన్ భాషా, సాహిత్య శాస్త్రవేత్త, చరిత్రకారుడు, ప్రాచీన గ్రీసు చరిత్రపై పలు గ్రంథాలు రచించాడు. – 196, 238.

సంకే (Sankey), ఐరా డేవిడ్ (1840–1908) – అమెరికన్ ప్రొటెస్టెంట్ మతబోధకుడు. – 54.

సాల్వియాన్ (Salvianus) (సుమారు 390–484) – మార్సేల్స్‌లో క్రిస్టియన్ మతబోధకుడు, రచయిత, "దైవిక పరిపాలన" అనే గ్రంథరచయిత. – 285.

సిక్కింగెన్ (Sickingen), ఫ్రాంత్స్ ఫన్ (1481–1523) – రిఫర్మేషన్ ఉద్యమంలో చేరిన జర్మన్ వీరయోధుడు (knight); 1522–23లో సైనికయోధుల తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. – 47.

సివిలిస్ (Civilis), జూలియస్ (క్రీ. శ. మొదటి శతాబ్దం) – బటేవియన్లు అనే జర్మన్ జాతి నాయకుడు, రోమన్ పాలనకు వ్యతిరేకంగా జర్మన్, గాలిక్ తెగల తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. – 273.

సీజర్ (Ceasar), గాయస్ జూలియస్ (సుమారు క్రీ. పూ. 100–44) – సుప్ర

సిద్ధ రోమన్ సేనాధిపతి, రాజనీతిజ్ఞుడు. – 158, 172, 223, 266, 269, 274, 275, 279.

సూగెన్‌హైమ్ (Sugenheim), సామ్యుయెల్ (1811–1877) – జర్మన్ బూర్జువా చరిత్రకారుడు. – 185.

సెంట్-సైమన్ (Saint-Simon), ఆన్రీ (1760–1825) – గొప్ప ఫ్రెంచి ఊహాజనిత సోషలిస్టు. – 63, 65, 67–69, 80.

సెర్వియస్ టులియస్ (Seivius Jullius) (క్రీ. పూ. 578–534) – జనశ్రుత ప్రసిద్ధుడైన ప్రాచీన రోమ్ రాజు. – 263.

సొలోన్ (Solon) (క్రీ. పూ. సుమారు 638–558) – ప్రసిద్ధ ఎథీనియన్ శాసనకర్త. ప్రజానీకపు ఒత్తిడి కారణంగా ప్రభువర్గానికి వ్యతిరేకమైన పలు సంస్కరణలను అమలుజరిపాడు. – 234, 248, 249, 263.

సొస్సూర్ (Saussure), ఆన్రీ డి (1829-1905) – స్విస్ జంతుశాస్త్రవేత్త. –163.

స్కాట్ (Scott), వాల్టర్ (1771–1832) – ప్రసిద్ధ బ్రిటిష్ నవలా రచయిత. – 268.

స్టూవర్టులు (Stuarts) – స్కాట్లండులో 1371నుండీ, ఇంగ్లండులో 1603–49, 1660–1714 సంవత్సరాల్లోనూ పరిపాలించిన రాజవంశం. – 50.

స్పినోజా (Spinoza), బారుఖ్ (1632–1677) – సుప్రసిద్ధ డచ్ భౌతికవాద తత్వవేత్త, నాస్తికవాది. – 76.

హాన్సెమన్ (Hansemann), డేవిడ్ (1790–1864) – బడా జర్మన్ పెట్టుబడిదారు, రేనిష్ లిబరల్ బూర్జువావర్గ నాయకుల్లో ఒకడు. 1848 మార్చి – సెప్టెంబరు మాసాల్లో ప్రష్యన్ ఆర్థిక మంత్రి. – 22.

హాబ్స్ (Hobbes), థామస్ (1588–1679) – ప్రముఖ ఆంగ్ల తత్వవేత్త, యాంత్రిక భౌతికవాద ప్రతినిధి. – 39, 40, 41, 50.

హారింగ్ (Harring), హారో (1798–1870) – జర్మన్ రచయిత, పెటీబూర్జువా రాడికల్; 1828నుండి (మధ్య మధ్య విరామాలతో) వివిధ దేశాల్లో ప్రవాస జీవితం గడిపాడు. – 120.

హార్ట్లీ (Hartley), డేవిడ్ (1705–1757) – ఆంగ్ల వైద్యుడు, భౌతికవాద తత్వశాస్త్రవేత్త. – 40.

హార్నీ (Harney), జార్జ్ జూలియన్ (1817–1897) – కార్మికోద్యమంలోని ప్రముఖుడు, చార్టిస్టు ఉద్యమపు వామపక్ష నాయకుడు, పలు చార్టిస్ట్ పత్రికల సంపాదకుడు, మార్క్స్ ఎంగెల్స్‌లతో సంబంధాలు కలిగినవాడు. – 119.

హుంబోల్ట్ (Humboldt), అలెగ్జాండ్ర్ ఫన్ (1769–1859) – గొప్ప జర్మన్ ప్రకృతి అధ్యయనవేత్త, యాత్రికుడు. – 23.

హుష్కే (Huschke), గెయోర్గ్ ఫిలిప్ ఎడ్వర్డ్ (1801–1886) – జర్మన్ బూర్జువా లాయరు, రోమన్ చట్టంపై పలు రచనలు **చేశాడు.** – 259.

హెన్రీ, ఏడవ (Henry VII) (1457–1509) - ఇంగ్లండు రాజు (1485-1509). – 49.

హెన్రీ, ఎనిమిదవ (Henry VIII) (1491–1547) - ఇంగ్లండు రాజు (1509-47). – 49.

హెరాక్లిటస్ (Heraclitus) (క్రీ. పూ. సుమారు 540 – 480) – ప్రాచీన గ్రీకు తత్వవేత్త, గతితర్క స్థాపకుల్లో ఒకడు, సద్యోజనిత భౌతికవాది. – 76.

హెరొడోటస్ (Herodotus) (క్రీ. పూ. సుమారు 484 – 425) – ప్రాచీన గ్రీకు చరిత్రకారుడు. – 173, 196.

హెరోద్ (Herod) (క్రీ. పూ. 73–4) – జూడియా రాజు (క్రీ. పూ. 40–4). – 261.

హెర్వెగ్ (Herwegh), గెవోర్గ్ (1817–1875) – సుప్రసిద్ధ జర్మన్ కవి, పెటీబూర్జువా ప్రజాస్వామ్యవాది. - 125, 261.

హేయ్‌స్లెర్ (Heusler), అంద్రేయస్ (1834–1921) – స్విస్ బూర్జువా లాయరు, స్విస్, జర్మన్ చట్టంపై పలు రచనలు చేశాడు. – 192.

హేగెల్ (Hegel), గియోర్గ్ విల్‌హెల్మ్ ఫ్రీడ్రిఖ్ (1770–1831) – గొప్ప జర్మన్ సాంప్రదాయిక తత్వవేత్త, వస్తుపర భావవాది. – 43, 61, 62, 70, 75, 80, 81, 83, 304, 311.

హోమర్ (Homer) – అర్ధ పౌరాణిక ప్రాచీన గ్రీకు మహాకావ్య కర్త, "ఇలియడ్," "ఒడిస్సే"ల రచయిత. – 157, 158, 195, 236–40.

హౌప్ట్ (Haupt), హెర్మన్ విల్‌హెల్మ్ (జననం సుమారు 1831) – జర్మన్ వర్తకోద్యోగి, "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు. కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసులో నిందితుడైన యితను ద్రోహపూరితమైన సాక్ష్యం యిచ్చాడు. కేసు విచారణ ముగిసే దాకా విడుదల చెయ్యబడి, బ్రెజీలుకు పారిపోయాడు. – 131.

హౌవిట్ (Howitt), ఆల్ఫ్రెడ్ విలియం (1830–1908) – బ్రిటిష్ నరవర్గ విశ్లేషణ శాస్త్రజ్ఞుడు, ఆస్ట్రేలియాపై నిపుణుడు, ఆస్ట్రేలియాలో వలస అధికారి (1862–1901), ఆస్ట్రేలియన్ తెగలపై పలు రచనలు చేశాడు. – 177.

# సాహిత్య, పౌరాణిక పేర్లసూచి


అఖిల్లెస్ (Achilles) (గ్రీకు పౌరాణికం)—ట్రోయ్ నగరాన్ని ముట్టడించిన వీరుల్లో మిక్కిలి సాహసికుడు. హోమర్ "ఇలియడ్"లోని పాత్ర. అఖిల్లెస్ తన కుడి అరికాలులో—అతని శరీరంలో అదొక్కటే హానికి ఆస్పదమైన తావు—తగిలిన బాణపు గాయంతో మృతిచెందాడు.—195, 240.

అగమేమ్నన్ (Agamemnon) (గ్రీకు పౌరాణికం)—అర్గోలీస్ రాజు, హోమర్ "ఇలియడ్" లోని ఒక వీరుడు, ట్రోజన్ యుద్ధ కాలంలో గ్రీకుల నాయకుడు. అదే పేర ఎస్కిలస్ రచించిన విషాదాంత నాటకంలో నాయకుడు.—195, 236, 239, 240.

అనాయిటిస్ (Anaitis)—ప్రాచీన ఇరానియన్ పురాణాలలో జల దేవతా, పంటల దేవతా అయిన అనహితయొక్క గ్రీకు పేరు. ఈ దేవత ఆరాధన ఆర్మీనియాలో విస్తృత వ్యాప్తిలో వుంది. అక్కడ యీ దేవతా మూర్తి ఆసియా మైనరుకు చెందిన పంటల దేవతలతో ఏకీభావం పొందింది.—183, 199.

అపోలో (Apollo) (గ్రీకు పౌరాణికం)—సూర్య, కాంతి, కళాధుల దేవత.—139.

అబ్రహామ్ (Abraham) (బైబిల్)—యూదు ప్రభువు.—186.

అర్గోనాట్లు (Argonauts) (గ్రీకు పౌరాణికం)—నిర్నిద్ర రాక్షసి కాపలాలో వున్న బంగారు ఉన్నికోసం కోల్ఖిస్‌కి "అర్గో" నౌకలో పయనించిన ప్రసిద్ధ వీరులు.—271.

అల్తేయా (Althaea) (గ్రీకు పౌరాణికం)—థెస్టియస్ రాజు కూతురు, మెలియాగెర్ తల్లి.—271.

అఫ్రోదిత (Aphrodite) (గ్రీకు పౌరాణికం)—ప్రేమ సౌందర్యాల అధిదేవత.—199.

ఊటె, నార్వేదేశపు (Ute the Norwegian) – ప్రాచీన జర్మన్ జానపద మహాకావ్యంలోను, 13వ శతాబ్దపు జర్మన్ మధ్యయుగ వీరగాథ "గుద్రున్"లోను కథానాయిక. – 210.

ఎటెయోక్లస్ (Eteocles) (గ్రీకు పౌరాణికం) – ఎడిపస్ (థేబ్స్ రాజు) కొడుకుల్లో ఒకడు. అధికారంకోసం జరిగిన పోరాటంలో యితను తన సోదరుడైన పాలినీసెస్‌ను చంపాడు, అదే పోరాటంలో తనూ మృతిచెందాడు. ఈ కథకు మూలం ఎస్కిలస్ రాసిన "థేబ్స్‌కు వ్యతిరేకంగా ఏడుగురు" అన్న విషాదాంత నాటకం. – 237.

ఎరీనిలు (Erinyes) (గ్రీకు పౌరాణికం) – ప్రతీకార దేవతలు, ఎస్కిలస్ విషాదాంత నాటకాలు "హోయెఫోరి," "ఎవ్మెనీడెస్" ("ఒరెస్టైయా" నాటకత్రయంలో రెండవ, మూడవ భాగాలు) కథానాయికలు. – 140.

ఎవ్మేయస్ (Eumeaus) – హోమర్ "ఒడిస్సే" కథానాయకుడు, ఇథాకా రాజు, ఒడిస్సస్ యొక్క పందులకాపరి, అంతులేని తన యాత్రలన్నింటిలోనూ యితను తన యజమానికి విశ్వాసపాత్రుడై వున్నాడు. – 240.

ఏగిస్టస్ (Aegisthus) (గ్రీకు పౌరాణికం) – క్లిటెమ్నెస్ట్రా ప్రియుడు, అగమేమ్నన్ హత్యలో పాల్గొన్నాడు. ఎస్కిలస్ విషాదాంత నాటకాలు "అగమేమ్నన్," "హోయెఫోరి"లలో ("ఒరెస్టైయా" నాటకత్రయంలో ఒకటవ, రెండవ భాగాలు) నాయకుడు. – 139.

ఏత్సెల్ (Etzel) – "నిబెలుంగ్ గేయం" అనే ప్రాచీన జర్మన్ జాతీయ మహాకావ్యం యొక్క, మధ్యయుగపు జర్మన్ వీరగాథయొక్క కథానాయకుడు, హూణుల రాజు. – 210.

ఏథెన్ పల్లస్ (Athene Pallas) (గ్రీకు పౌరాణికం) – ప్రధాన దేవత, యుద్ధ, వివేక దేవత. ఏథెనియన్ రాజ్య కులదేవతగా భావింపబడింది. – 140.

ఒడిస్సస్ (Odysseus) – హోమర్ మహాకావ్యాలైన "ఇలియడ్," "ఒడిస్సే"ల కథానాయకుడు, కాల్పనిక దీవి ఇథాకా రాజు, ట్రోజన్ యుద్ధంలో గ్రీకు సేనానాయకుల్లో ఒకడు. సాహసానికీ, జిత్తులమారితనానికీ, వక్తృత్వానికీ యితను ప్రసిద్ధుడు. – 239, 240.

ఒరెస్టెస్ (Orestes) (గ్రీకు పౌరాణికం) – తన తండ్రిని హత్యచేసిన తన తల్లిపైనా, ఏగిస్టస్‌పైనా ప్రతీకారం తీర్చుకున్న క్లిటెమ్నెస్ట్రా, అగమేమ్నన్‌ల కొడుకు. ఎస్కిలస్ "ఒరెస్టైయా"లోని రెండవ, మూడవ భాగాలైన "హోయెఫోరి" "ఎవ్మెనీడెస్"లలో కథానాయకుడు. – 139–40.

కస్సాండ్రా (Cassandra) (గ్రీకు పౌరాణికం) – ప్రియామ్ (ట్రోయ్ రాజు) కూతురు, జోస్యురాలు. ట్రాయ్‌ని జయించిన అనంతరం అగమేమ్నన్‌చేత బానిసగా తీసుకుపోబడింది. ఎస్కిలస్ విషాదాంత నాటకం "అగమేమ్నన్"లోని పాత్రల్లో ఒకటి. – 195.

క్రీమ్‌హిల్డ్ (Kriemhild) – ప్రాచీన జర్మన్ జాతీయ మహాకావ్యంలోనూ, మధ్య యుగపు జర్మన్ గేయం "నిబెలుంగ్ గేయం"లోనూ కథానాయిక, బుర్గుండియన్ రాజు గుంతెర్ సోదరి. సీగ్‌ఫ్రిడ్‌కి వధువూ, దరిమిలా భార్య. సీగ్‌ఫ్రిడ్ మరణానంతరం హూణుల రాజు ఏత్సెల్ భార్య. – 210.

క్లిటెమ్నెస్ట్రా (Clytemnestra) (గ్రీకు పౌరాణికం) – ట్రోజన్ యుద్ధంనుంచి తిరిగివచ్చిన తన భర్తను హత్యచేసిన అగమేమ్నన్ భార్య. ఈమె ఎస్కిలస్ రాసిన "ఒరెస్టెయా" అనే విషాదాంత నాటకపు కథానాయిక. – 139–40.

క్లియోపాత్రా (Cleopatra) (గ్రీకు పౌరాణికం) – ఉత్తర వాయుదేవుడైన బొరియాస్ కూతురు. – 271.

క్లోయా (Chloë) – లోంగస్ (2వ, 3వ శతాబ్దాలు) రచించిన "దాఫ్నిస్, క్లోయా" అనే ప్రాచీన గ్రీకు నవల నాయిక, ప్రేమలో పడిన గొర్రెలకాపరి. – 209.

గనిమెడ్ (Ganymede) (గ్రీకు పౌరాణికం) – ఈ అందమైన యువకుణ్ణి దేవతలు అపహరించి ఒలింపస్‌కి తీసుకుపోయారు. అక్కడ అతను జియస్ ప్రేమికుడూ, విందుల్లో పానపాత్ర నింపేవాడూ అయాడు. – 197.

గుంతెర్ (Gunther) – ప్రాచీన జర్మన్ జాతీయ మహాకావ్యమూ, మధ్యయుగపు జర్మన్ గేయమూ అయిన "నిబెలుంగ్ గేయం" కథానాయకుడు, బుర్గుండియన్ రాజు. – 210.

గుద్రున్ (కుద్రున్) (Gudrun) – ప్రాచీన జర్మన్ జానపద మహాకావ్యంలోనూ, 13వ శతాబ్దపు జర్మన్ గేయమైన "గుద్రున్"లోనూ కథానాయిక. హెటెల్ (హెగెలింజెన్ రాజు), ఐరిష్ హిల్డెల కూతురు. హెర్విగ్ (సీలాండ్ రాజు)కి నిశ్చిత వధువు. హార్ట్‌ముట్ (నార్మండీ రాజు కొడుకు) యీమెను ఎత్తుకుపోయి, తనను పెళ్లిచేసుకొన నిరాకరించినందుకుగాను, పదమూడేళ్లపాటు చెరసాలలో వుంచాడు. అటుతర్వాత హెర్విగ్ చేత విడుదల చెయ్యబడిన గుద్రున్, అతని భార్య అయింది. – 210.

జార్జ్ దండేన్ (Georges Dandin) – మొల్యేర్ రచించిన "జార్జ్ దండేన్ లేక మోసగింపబడిన భర్త" అనే నాటకంలో ప్రధాన పాత్ర. ఇతను ధనవంతుడైన రైతు,

అమాయకుడు, దివాళాతీసిన కులీనురాలిని పెళ్లిచేసుకున్నాడు, ఆమెచేత మోసగింపబడ్డాడు. – 301.

జియస్ (Zeus) (గ్రీకు పౌరాణికం) – దేవతల పెద్ద. – 240.

టెలెమాకస్ (Telemachus) – హోమర్ "ఒడిస్సే"లోని వీరుడు, ఒడిస్సస్ కొడుకు (ఇథాకా రాజు). – 195.

డెమొడోకస్ (Demodocus) – హోమర్ "ఒడిస్సే"లో కథానాయకుడు. ఇతను ఆల్సినస్ (ఫీషియన్ల కల్పిత రాజు) ఆస్థానంలో అంధగాయకుడు. – 240.

తెలమోన్ (Telamon) (గ్రీకు పౌరాణికం) – ట్రోయ్‌కి వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో పాల్గొన్న వీరుడు. – 195.

తేయుక్రోస్ (Teukros) – హోమర్ "ఇలియడ్"లోని వీరుడు, ఇతను ట్రోయ్‌లో పోరాడాడు. –195.

థెసియస్ (Theseus) (గ్రీకు పౌరాణికం) – ప్రధాన వీరుల్లో ఒకడు, ఏథెన్సు సంస్థాపకుడని చెప్పబడే జనశ్రుత ప్రసిద్ధుడైన ఏథెన్స్ రాజు. – 243.

థెస్టియస్ (Thestius) (గ్రీకు పౌరాణికం) – ఎథోలియాలోని ప్ల్యూరాన్‌యొక్క జనశ్రుత ప్రసిద్ధుడైన రాజు. – 271.

దాఫ్నిస్ (Daphnis) – లోంగస్ రాసిన ప్రాచీన గ్రీకు నవల (2వ – 3వ శతాబ్దం) "దాఫ్నిస్, క్లోయా" కథానాయకుడు. ఇతను ప్రేమికుడైన గొర్రెలకాపరికి ప్రతిరూపం. – 209.

నెస్టార్ (Nestor) (గ్రీకు పౌరాణికం) – ట్రోజన్ యుద్ధంలో పాల్గొన్న గ్రీకు వీరుల్లోకెల్ల పెద్దవాడు, అత్యంత వివేకవంతుడు. – 236.

న్యోర్డ్ (Njord) (స్కాండినేవియన్ పౌరాణికం) – పంటల దేవుడు, ప్రాచీన స్కాండినేవియన్ జాతీయ మహాకావ్యమైన "పెద్ద ఎద్ద" కథానాయకుడు. – 169.

పొలినీకెస్ (Polyneices) (గ్రీకు పౌరాణికం) – ఎడిపస్ (థేబ్స్ రాజు) కొడుకుల్లో ఒకడు. అధికారంకోసం జరిగిన పోరాటంలో తన సోదరుడు ఎటెయోక్లస్‌ను చంపి, అదే పోరాటంలో తనూ చనిపోయాడు. ఈ పుక్కిటి కథ ఎస్కిలస్ విషాదాంత నాటకమైన "థేబ్స్‌కు వ్యతిరేకంగా ఏడుగురు"కి ప్రాతిపదిక అయింది. – 238.

ప్రొమెథెయస్ (Prometheus) (గ్రీకు పౌరాణికం) – భూదేవి పుత్రుల్లో ఒకడు. ఇతను అగ్నిని దేవతలనుంచి దొంగిలించి, మనుషులకు యిచ్చాడు. అందుకుగాను రోజూ యితని కాలేయాన్ని గద్దలు తినేందుకు వీలుగా యితన్ని ఒక బండకు బంధించే శిక్ష విధింప బడింది. – 93.

ఫినెయస్ (Phineus) – ప్రాచీన గ్రీకు పురాణంలో అంధ ప్రవక్త; తన రెండవ భార్యచే ప్రోత్సహించబడి, మొదటి భార్య బిడ్డలను హింసించాడు, అలా చేసినందుకు దేవుళ్లు అతన్ని శిక్షించారు. – 271.

ఫ్రెయా (Freya) (స్కాండినేవియన్ పౌరాణికం) – పంట, ప్రేమల దేవత, ప్రాచీన స్కాండినేవియన్ జానపద మహాకావ్యమైన "పెద్ద ఎడ్డ"లో కథానాయిక. తన సోదరుడైన ప్రేయ్ర్ దేవుని భార్య. – 169.

బొరియాడ్స్ (Boreades) (గ్రీకు పౌరాణికం) – ఉత్తర వాయు దేవుడి కుమారుడైన బొరియాస్, ఏథెన్స్ రాణి ఒరేయిథియాల బిడ్డలు. – 271.

బ్రున్‌హిల్డ్ (Brunhild) – ప్రాచీన జర్మన్ జాతీయ మహాకావ్యంయొక్క, జర్మన్ మధ్యయుగపు గేయమైన "నిబెలుంగ్ గేయం"యొక్క కథానాయిక. ఐస్‌లాండ్ రాణి, దరిమిలా బుర్గుండియన్ రాజు గుంతెర్ భార్య. – 210.

మిలిట్టా (Mylitta) – బాబిలోనియన్ పురాణాల్లో ప్రేమ, పంటల దేవత అయిన ఇష్టార్ దేవతకు గ్రీకు పేరు. – 182.

ములియోస్ (Mulios) – హోమర్ గీతం "ఒడిస్సే"లో ఒక పాత్ర. – 240.

మెఫిస్టోఫెలెస్ (Mephistopheles) – గ్యోతె విషాదాంత నాటకం "ఫౌస్ట్"లో ప్రధాన పాత్ర. – 169.

మెలియాగర్ (Meleager) (గ్రీకు పౌరాణికం) – జనశ్రుత ప్రసిద్ధుడైన కాలిడన్ రాజు ఎనెయస్, తన తల్లి సోదరులను చంపివేసిన అల్తేయాల కొడుకు. – 271.

మోసెస్ (Moses) (బైబిలు) – ప్రవక్త, శాసనకర్త. యూదులను ఈజిప్షియన్ దాస్యం నుండి విముక్తులను చేసి, వారికి చట్టాలను సమకూర్చాడు. – 138, 186.

రోములస్ (Romulus) – రోమ్ నగరపు, జనశ్రుత ప్రసిద్ధుడైన స్థాపకుడు, మొదటి రాజు. – 260.

లోకి (Loki) (స్కాండినేవియన్ పౌరాణికం) – సైతాను, అగ్నిదేవుడు, ప్రాచీన స్కాండినేవియన్ మహాకావ్యమైన "పెద్ద ఎద్ద" కథానాయకుడు. – 169.

వుల్కాన్ (హెఫేస్టస్) (Vulcan) (గ్రీకు పౌరాణికం) – అగ్నిదేవుడు, కమ్మర్ల ఇలవేల్పు. – 94.

సిండరెల్లా (Cinderella) – అనేక జాతుల ప్రజల్లో వ్యాప్తిలో వున్న పిట్టకథలో కథానాయిక, నమ్రశీలం, శ్రమించే స్వభావం కలిగిన బాలికకు ప్రతిమూర్తి. – 115.

సిఫ్ (Sif) (స్కాండినేవియన్ పౌరాణికం) – ఉరుము దేవుడైన థోర్ భార్య, ప్రాచీన స్కాండినేవియన్ మహాకావ్యం "పెద్ద ఎద్ద"లోని కథానాయిక. – 270.

సీగ్‌ఫ్రిడ్ (Siegfried) – ప్రాచీన జర్మన్ జానపద మహాకావ్యంలోను, మధ్యయుగ జర్మన్ గేయమైన "నిబెలుంగ్ గేయం"లోను కథానాయకుడు. – 210.

సీగ్‌ఫ్రిడ్ (మొర్‌లాండ్ దేశపు) (Siegfried of Morland) – ప్రాచీన జర్మన్ జానపద మహాకావ్యంలోనూ, మధ్యయుగ జర్మన్ వీరగాథ "గుద్రున్"లోనూ కథానాయకుడు. గుద్రున్‌చేత తిరస్కరింపబడిన నిశ్చిత వరుల్లో ఒకడు. – 210.

సీగెబంట్ (ఐర్లండ్‌కి చెందిన) (Sigebant of Ireland) – ప్రాచీన జర్మన్ మహాకావ్యంలోను, మధ్యయుగ జర్మన్ వీరగాథ "గుద్రున్"లోను, ఐర్లండు రాజు. – 210.

హడుబ్రాండ్ (Hadubrand) – ప్రాచీన జర్మన్ వీర మహాకావ్యమైన "హిల్డెబ్రాండ్ గేయం"లో పాత్ర, హిల్డెబ్రాండ్ కొడుకు. – 270.

హార్ట్‌ముట్ (Hartmut) – ప్రాచీన జర్మన్ జాతీయ మహాకావ్యంలోను, 13వ శతాబ్దపు జర్మన్ వీరగాథ "గుద్రున్"లోను కథానాయకుడు, నార్మండీ రాజు కొడుకు. గుద్రున్‌చేత తిరస్కరింపబడిన వరుల్లో ఒకడు. – 210.

హిల్డె (Hilde) – ప్రాచీన జర్మన్ జాతీయ మహాకావ్యంలోనూ, 13వ శతాబ్దపు జర్మన్ వీరగాథ "గుద్రున్"లోనూ కథానాయిక, ఐరిష్ రాజు కూతురు, హెగెలింజెన్ రాజు హెటెల్ భార్య. – 210.

హిల్డెబ్రాండ్ (Hildebrand) – ప్రాచీన జర్మన్ వీర మహాకావ్యం "హిల్డెబ్రాండ్ గేయం" కథానాయకుడు. – 270, 296.

హెకటె (Hecate) (గ్రీకు పౌరాణికం) – మూడు శిరస్సులూ, మూడు శరీరాలూ కలిగిన వెన్నెల దేవత. పాతాళలోకంలోని రాక్షసులకూ, భూతాలకూ ఉంపుడుగత్తె, హాని కలిగించడానికీ, మూర్ఛిల జెయ్యడానికీ దోహదకర్త. – 236.

హెటెల్ (Hettel) – ప్రాచీన జర్మన్ జాతీయ మహాకావ్యంలోనూ, 13వ శతాబ్దపు జర్మన్ వీరగథ "గుద్రున్"లోనూ కథానాయకుడు, హెగెలింజెన్ రాజు. – 210.

హెరాక్లిస్ (హెర్క్యులెస్) (Heracles) (గ్రీకు పౌరాణికం) – తన పురుషోచిత శక్తికీ, మానవాతీత కార్యాలకీ ప్రసిద్ధుడైన జనరంజక నాయకుడు. – 271.

హెర్విగ్ (Herwig) – ప్రాచీన జర్మన్ జాతీయ మహాకావ్యమూ, 13వ శతాబ్దపు జర్మన్ వీరగాథ అయిన "గుద్రున్" కథానాయకుడు, సీలాండ్ రాజు, "గుద్రున్"కి నిశ్చితవరుడు, తర్వాత భర్త. – 210.

పాఠకులకు మనవి

ఈ పుస్తకం అనువాదాన్ని గురించీ, కూర్పును గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:

Progress Publishers
17, Zubovsky Boulevard,
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ — 520004

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ — 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజారు
హైదరాబాదు — 500001



విశాలాంధ్ర బుక్ హౌస్
కాలేజి రోడ్డు
అనంతపురం — 515004

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1–37 గాంధీ రోడ్డు
తిరుపతి — 517001

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం — 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
హనుమకొండ
వరంగల్ – 506011

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు – 522002

# మార్క్స
# ఎంగెల్స్
## సంకలిత రచనలు

# మార్క్స
# ఎంగెల్స్
## సంకలిత రచనలు

సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!

T. Syam Narayana.

# కార్ల్ మార్క్స్
# ఫ్రెడరిక్ ఎంగెల్స్

## సంకలిత రచనలు

### భాగం III

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో 1982

అనువాదం: నిడమర్తి ఉమారాజేశ్వరరావు
కంభంపాటి సత్యనారాయణ
మహీధర రామమోహనరావు

**К. Маркс, Ф. Энгельс**
ИЗБРАННЫЕ ПРОИЗВЕДЕНИЯ
Часть III
*На языке телугу*

**K. Marx, F. Engels**
SELECTED WORKS
**part III**
*in Telugu*

వెల: రు. ౮-౦౦

© తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1982

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

$МЭ\frac{10101\text{-}940}{014(01)\text{-}82}$ 732-81     0101010000

## విషయసూచిక


ఫ్రెడరిక్ ఎంగెల్స్. వానరుడు మానవుడుగా మారే క్రమంలో శ్రమ నిర్వహించిన పాత్ర (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) . . . . . . . . 7

ఫ్రెడరిక్ ఎంగెల్స్. కార్ల్ మార్క్స్ (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) 22

ఫ్రెడరిక్ ఎంగెల్స్. సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం (అను: కంభంపాటి సత్యనారాయణ) . . . . . . . . . . . . . . . . 35

1892 నాటి ఇంగ్లీషు కూర్పుకు ఉపోద్ఘాతం . . . . . . . 35

సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం . . . . . . . . . . . 61

I. . . . . . . . . . . . . . . . . . 61

II. . . . . . . . . . . . . . . . . . 75

III. . . . . . . . . . . . . . . . . . 84

ఫ్రెడరిక్ ఎంగెల్స్. కార్ల్ మార్క్స్ సమాధివద్ద ప్రసంగం (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) . . . . . . . . . . . . . . . 108

ఫ్రెడరిక్ ఎంగెల్స్. కమ్యూనిస్టు లీగు చరిత్రను గురించి (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) . . . . . . . . . . . . . . . 111

ఫ్రెడరిక్ ఎంగెల్స్. కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం (అను: మహీధర రామమోహనరావు) . . . . . . . . . . . . . 134

1884 నాటి మొదటి ముద్రణకు ఉపోద్ఘాతం . . . . . . . 134

1891 నాటి నాలుగో ముద్రణకు ఉపోద్ఘాతం . . . . . . . 137

కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం . . . . . . . . 151

I. సంస్కృతియొక్క చరిత్రపూర్వ దశలు . . . . . . . . 151

1. ఆటవిక యుగం . . . . . . . . . . . . . . 152